శ్రీరామచంద్ర.

ప్రకృతిప్రబంధకర్త.

దేవదేవ! మహాత్మ! త్వదీయదివ్య
భావబోధకవిశ్వప్రబంధమందు
నెచట శ్రీరామచుట్టితి? నెచటఁ జిత్త
గింపవలె నని వ్రాసి ముగించినావు?
మొదలు తుది లేని నీగ్రంథమును సతంబు
నెంతచదివిన, నెంతయూహించుకొన్న
నెవ్వ రీకావ్యమును రచియించు మనిరొ
యెవరి కీకృతి నొసఁగితో యెఱుఁగరాదు.
సుమధురమనోజ్ఞమృదుపదార్థములతోడఁ
బ్రస్ఫుటప్రౌఢరుచిరభావములతోడ
సలలితస్నిగ్ధసౌలభ్యశైలితోడ
నీప్రబంధంబు సర్వంబు నిండి యుండె
నీప్రబంధంబె సర్వమై నెగడుచుండె
ఇట్టిసత్కావ్యమును రచియించునూహ
మనఘ! యెప్పుడు కలిగిన దయ్య నీకు?
ఆకసంబున నోంకార మైనయపుడొ?
విపులగతి రేఁగి వాయువుల్ వీచినపుడొ?
కీలి కీలాకలాపుఁడై కెరలినపుడొ?
ఉదకము రసోత్తరంగమై యొదవి నపుడొ?
భూతపంచకమై భూమి పుట్టినపుడొ?
మింటఁ జుక్కలు మిలమిల మెఱసినపుడొ?
ధరణి జీవులు కన్నులఁ దెఱచినపుడొ?
యెపుడు మొదలిడితో తెల్పుమీ మహాత్మ.
సర్వరక్షక మంగళాశాసనముగ

నీవు తొలుదొల్త వ్రాసిన నిరుపమాన
దివ్యగీతంబు నీదయాదృష్టిఁ జేసి
యేసుకృతి ముందు గానంబు చేసినాఁడొ
యాతఁడేగద ధన్యాత్ముఁ డైనవాఁడు !
సదయ ! సచరాచరప్రపంచమున జీవ
హృదయభావప్రబోధార్థ మెల్లయెడల
నెన్ని యెన్ని రీతుల బాస లున్న యవియె
యన్ని బాసల నలరారు నఖిలమునకు
నఖిలమును నిండియున్న నీయాదికావ్య
మహాగతిఁ బఠనీయమై యలరుచుండె.
అనఘ ! నీవచియించిన యదియె వేద;
మరయ నీవ్రాఁతలకు నెందుఁ దిరుగు లేదు;
దివ్యలేఖిని నీకు స్వాధీన మయ్యె;
గ్రంథకర్తలకును గ్రంథకర్త వీవు.
అమలతర మైన నీప్రబంధమునఁ దక్కఁ
దనుసుఖావహముగఁ జల్లఁ దనముఁ గూర్చు
మలయమారుత మెచ్చోట మలయుచుండు ?
నేత్రపర్వంబుగాఁగ వెన్నెలలఁ గాయు
చందురుం డెందువాహ్యాళి సలుపుచుండు ?
శ్రుతివిమోహనముగ దివ్యరుతులఁ బేల్చు
విహగసంతాన మేయెడ వెలయుచుండు ?
జిహ్వ కింపగు రుచులచేఁ జెలఁగుచుండు
సరసవాహిను లెచ్చోట జరగుచుండు ?
ఘ్రాణతర్పణముగను సుగంధ మొసఁగు
కుసుమవిసరంబు లేకడ నెసఁగుచుండు ?
కవులు ని న్ననుసంధించు కాంక్షఁ జేసి
కావ్యములు వ్రాయుచుండు టొక్కటియె గాని
యూహకొలఁది వర్ణించుట యొకటె కాని
ప్రకృతిమర్మంబు గ్రహియించు పాటివారె ?

ప్రకృతిమాయల కెందు లోఁబడనివారె!
ప్రకృతికెల్ల నతీతుఁడౌ ప్రభుని నిన్నుఁ
బ్రకృతిఁ జేబంతిగాఁ బట్టు ప్రభుని నిన్ను
బ్రకృతిశాసన మొనరించు ప్రభుని నిన్నుఁ
బ్రకృతియందెల్ల నిండిన ప్రభుని నిన్ను
నూహ సేయుటకేని వా రోపఁ గలరె?
వారు కవిజాతిలోఁ జేరువారె కాని
ని న్ననుసరించి వ్రాయఁగా నేర్తు మనుట
సాహసముగాదె కవిరాజచక్రవర్తి!
అనుపమం బైననీదుకావ్యంబు నిట్టు
లెట్టియోజనతో వెలయించినావొ
యెంత యోజించుకొన్న నావంత యైన
హృదయనయనంబులకు గోచరింపకుండె.
నేను దరియించుతెరు వను నియతిఁ గాని
యాత్మశక్తిని బ్రకటించు నాసఁ గాని
లోకములు మెచ్చ ననెడులోలుపతఁ గాని
నాకు యశమబ్బ ననుచింతనమునఁ గాని
యర్థసంగ్రహణాపేక్ష నంది గాని
యీమహాకావ్యమును రచియించినావె!
జగములఁ దరింపఁజేయంగఁ జాలు నీకు
నఖిలశక్తులకును మూల మైన నీకు
సకలముఁ బ్రశంస సేయంగఁ జాలు నీకు
లోక మంతట నిండి వెలుంగు నీకు
నందఁగారాని పరమార్థ మైన నీకు
నుల్లమునఁ గోరఁదగిన దే మున్న దయ్య!
మేము నీకృతిఁ జూచుచున్నాము గాని
మేముఁ దన్మయులీల నున్నాము గాని
తెలిసినట్లుండి యేమియుఁ దెలియకుండెఁ
దెలియకుండియు నంతయుఁ దెలిసినట్లు

నటనమును జేయుచుంటి మనాథనాథ!
యెవరు నీకృతిమర్మంబు లెఱుఁగఁగలరు!
దేవ! యాద్యంతరహితమై దివ్యగతిని
భవ్యమై యొప్పునీమహాకావ్యమునకు
నీవె వ్యాఖ్యాతవై ప్రౌఢి నెఱపకున్న
నెవఁడు వ్యాఖ్యానమును రచియింపఁగలఁడు?
నీమహాకావ్యమహిమం బదేమొ కాని
పూర్వసందర్భముల పొంతఁ బోవకున్నఁ
జదువ మొదలిడ నెచటి కచ్చటికె పుట్టి
పొదలి రసభావములు పొంగి పొరలుచుండు;
నిట్టిమృదుశైలి నీకెట్లు పట్టువడెను
దేవ! యెవ్వరికేని బోధింపరాదె!
తాము వ్రాసిన దొక్కపద్యంబు నైన
నూరుఁ డోకండ్రైనఁ బఠియించు చున్న యపుడు
కవుల కెంతయానందమో కలుగునంట
విశ్వమయ! విశ్వమందు నీవిపులకావ్య
మఖిలజీవులు గూడ నిరంతరంబు
నెంతొ సంతోషమునఁ బఠియించుచుండఁ
గాంచు నీకెంతయానందగరిమ కలదొ
కొలఁదిపెట్టి వర్ణింపఁగాఁ గలమటయ్య!
రమ్యగుణసాంద్ర! యోకవి రాజచంద్ర!
ఎన్నిజన్మాంతరంబులో యెత్తియెత్తి
యెచట దొరకిన నచ్చటనేగ్రహించి
యిమ్మహాకావ్యములు పఠియించుచుంటి
మఱార! యెప్పటి కప్పుడే యభినవముగ,
నతిమనోహరముగ, సురసాశ్రయముగ,
సత్యముగ, సార్థకమ్ముగ, సమధికముగ,
సర్వజనసమ్మతమ్ముగా, సలలితముగ
ననుభవంబునకుం దోఁచు నంతెకాని

విను గోకింతయుఁ గలుగ దీవింత యేమొ!
కొక్కొఁ-రోయని తొలికోడి కూసినపుడు
తొలుదెసఁ బ్రభాతకాంతులు దోఁచినపుడు
కులుకుజెల్గునఁ బక్షులు పలికినపుడు
తరులతాదులఁ బూవులు విరిసినపుడు
తరుణభృంగాళి మొఱయుచు నరుగునపుడు
వెడలి ప్రత్యూషపవనంబు వీచినపుడు
పూర్వరాగంబు కుంకుమఁ బూసినపుడు
చివురు లాకాంతి నైక్యంబుఁ జెందినపుడు
కూసి కోకిల కన్నెఱ్ఱ చేసినపుడు
పొడుపుఁగొండపై నెఱప్రొద్దు పొడిచినపుడు
తరణికిరణంబు లవనికిఁ దిరిగినపుడు
మెచ్చి తామర మొగ్గలు విచ్చినపుడు
బాలభానుండు మింటిపైఁ బ్రాఁకునపుడు
జరగినకొలంది నీడలు దరియునపుడు
తలకు సూటిగ దినమణి నిలిచినపుడు
తరలి పడమటిదెసఁ బ్రొద్దు తిరిగినపుడు
నాస విడి చాయ పెడమొగ మైనయపుడు
నపరగిరి ధాతురాగంబు లలమినపుడు
నపరవారిధి మిలమిల లాడునపుడు
కనకకాంతుల నీరెండఁ గాయునపుడు
నిట్టె పవ లంతయును దుదముట్టినపుడు
మిన్ను తనభాగ్యమణి దాఁచుకొన్నయపుడు
వెలుఁగుఁ జీకటియును గాక వెలయునపుడు
నఖిలజగతిఁ దమోలత లలమినపుడు
పొలుపుగా మింటఁ బూవులు పూచినపుడు
నాశ లన్నియు నేకంబు లైనయపుడు
మిణుగురుంబుర్వు లెగయుచు మెఱసినపుడు
నించుమించుగ నెల యుదయించునపుడు

వెలఁదివెన్నెలకుప్పలు విరిసినపుడు
నలుదెసలు చూచి కలకల నవ్వినపుడు
కలువపూవులనెత్తావు లొలసినపుడు
దేవ! యొక్కప్పుడా? దినదినమునందు
గాఢనిద్రను బొందిన గడియయేమొ
కాని నిక్కంబుగాఁ గలలోనఁగూడ
నవరసాశ్రయ మగునీయనంతకావ్య
గతులు సూచుచు నానందగరిమఁ గాంచి
చదువుకొనుచుందు మొకవింత చవులుదేర.
చదివినకొలఁది మాకు నో సదయహృదయ
దినము నీమీఁది భక్తి వర్ధిల్లుచుండు.
ప్రబలగౌరవమో యనిర్వాచ్యమైన
ప్రేమయో మాహృదయవీథిఁ బెరుఁగుచుండు
నేమహాకావ్యమును బఠియించునప్పు
డామహాకావ్యకర్తపై ననుపమాన
భక్తిగౌరవప్రేమముల్ ప్రబలుచుండు;
నదిగదాయుత్తమోత్తమ మైనసుకృతి!
అట్టిమహిమంబు నీకావ్య మందె కలదు.
అట్టి రచనాప్రశస్తి నీ యందె కలదు,
కానఁ ద్రికరణశుద్ధిగా గౌరవించి
దేవ! నీమీఁదిప్రేమ వర్ధిల్లుకొఱకుఁ
బ్రవిమలజ్ఞానసంపత్తిఁ బడయుకొఱకు
నవ్యయానందపరిపూర్తి నందుకొఱకు
నెపుడు నీకావ్యమే పఠియింతు మయ్య!
పఠన మిటు సేయఁజేయ నెప్పటికి మేము
దీని ముగియింపఁగల మయ్య! దేవదేవ!
ఇమ్మహాకావ్యజలధిలో నెంతకాల
మీఁది యవ్వలియొడ్డున కేగఁగలము?
ఈవలావలి యొడ్డులం దెచటికేనిఁ

గష్టపడి యెట్టులో చేరఁ గలమయేనిఁ
దీరమునఁ గూరుచుండి నీ దివ్యకావ్య
మహిమ యెంతటిదో యొక్క మాటలోనె
యింతలో నంతయును గ్రహియింపఁగలము.
కాని తొలిగాథ తెలియంగ రానిమాకు
నవల నేమున్నదో చూచు నంతకంటె
నాదిఁగాంచుటకే యాస యధికమయ్యె.
సర్వభూతదయాపర! సాధుహృదయ!
మాయభిమతంబుఁ దీర్పవే మాననీయ?
తావకీనమహాప్రబంధంబునందు
నాదిసింహాసనంబుపై నధిగమించి
సర్వశక్తిస్వరూపప్రసన్న మగుచు
ననుపమానాతిలోకరహస్య మగుచు
మూలకారణతత్త్వప్రబోధ మగుచు
నిర్మలానందవిజ్ఞాననిలయ మగుచు
నాదులకు నాదియైన నీ యాదిగీత
మెప్పు డుపదేశ మొనరింప నెంచినావు?
ఎపుడు గానంబుసేయింప నెంచినావు?
ఎపుడు మాకభిముఖముగా నెంచినావు?
ఎపుడు పిలిచిన నోయన నెంచినావు?
అపుడు నీవేమి బోధింతు వయ్య మాకు?
అపుడు కోరుట కేముండు నయ్య మాకు?
అపుడు నీవలె రచియింపఁ నగును గాదె!
అపుడు నీవంటియానంద మగును గాదె!
సచ్చిదానందమూర్తి! విశాలకీర్తి!

వేంకటపార్వతీశ్వరకవులు.

విస్మృతి.

మఱప! నీశక్తిఁ దెలియక మనుజు లెపుడుఁ
దిట్టుచుందురు; నిన్నొకదేవతగను
నెఱుఁగ లేకున్నవారు. నీవే యుపేక్ష
భావమున నుండువేని ప్రపంచనటన
నడువనేర్చునె నిముస మైనను? జగాన
నాప్తజనములు మృతినొందునవసరమున
వచ్చి నీ వాదుకొననిచో, వారి కేది
శరణా? మనుగడ్డునకు నాప్తసల్లపనము
చేష్టితంబులు స్మృతిలోనఁ జెలఁగుచుండి,
కన్నులకుఁ గట్టినటు లుంటఁ గదలఁగలరె?
అట్టిస్మృతి కంతరాయమై యమరుచుండి,
ధాత సృజనకు లోపంబు దగలకుండ,
సాయ మొనరింపఁగల మహాశక్తి వీవ.
విస్మృతియోజక మగుశక్తి నిర్మితికిని
గడఁగునే లోకకర్త జగన్నియంత?
వెఱ్ఱులముగాక యాతని వెడఁ గనంగ!
నెన్ని యుపయోగములు గల వెన్న నిన్ను:
సజ్జనులు నీదుసాంగత్యసరణిని గద
యీషణాత్రయముల నెల్ల నేమఱుదురు;
చూడరానిపదార్థముల్ చూచినపుడు
ఘోరకృత్యంబులను గనుఁగొన్నయపుడు
నీదుదయ లేకయుండిన నిలుచు నెట్లు?
ప్రతినిమేషంబుఁ దలఁపునఁ బాఱి యవియె
బ్రతుకు కనిన రోఁతగాఁ జేసి ప్రబలకున్నె?
ఐంద్రజాలికు పింఛ మల్లాడఁగానె
దృశ్యమగువస్తు వట్టె యదృశ్యమగును;

గొన్నిఁటికి శీఘ్రవిస్మృతిఁ గూర్తు వటుల;
గొన్నిఁటికి వైపరీత్యముల్ గూర్చి మదికి
నెడఁగలుగఁజేతు; కొన్నింటి నేమఱంగఁ
గాలచక్రంబుఁ ద్రిప్పుచుఁ గడపికడపి
దూరమున కీడ్తు; క్రమముగాఁ ద్రోతు వవల;
నెంతయో యత్నమునఁ గాని యించుకంత
జ్ఞప్తి యొదవదు నీదునాజ్ఞప్తికతన.
బహుళ మగుయోజనలు మది బలసియున్నఁ
దీఁగ కమ్మచ్చునను బట్టి లాగినట్లు
నీప్రసాదముననుగాదె నిర్మలాత్మ
నొక్కటొక్కటిగనె వచ్చుచుండు వెలికిఁ ?
గలిమి గలనాఁడు నీవెట్టికళల నున్న
నాపదలవేళ దయచేయు మమ్మ! నీవు;
ఆపదలు కాఁపురముసేయ వనవరతము;
నాపదల కడ్డుపడువారె యాప్తు లమ్మ!
కోరి సేవలు సేయించుకొనినఁ గాని
కరుణఁ గొందఱు గనరు సాక్షాత్కరింప
రట్టిదానవె; కొలువ ని న్నదియె పనిగ
వికృతఫల మిత్తు విది నీకు విహితగుణము;
కోరి నీదాయ స్మృతిని లోఁగొనఁగవచ్చు;
నీకు దయరావలెనె గాని ని న్నొకండు
వశ్య మొనరించుకొనఁగలవాఁడు గలఁడె ?
ఆశ్రితుం డనాశ్రితుఁ డనునట్టిభేద
మింతయును లేదు నీకడ నెల్లరకును
నార్తిగలవేళలఁ బ్రసన్న మగుదు వీవు.
కోరఁబోమమ్మ యెపుడు మాకూడ నుండఁ
గలిమి గలవేళ నెందఱేఁ గనఁబడుదురు;
వారిఁ జూడక నీసేవ వఱలుచున్న
నిందసేతురు నన్నును నిన్నుఁ గూడ;

నినుమునుగుఱించి గాదె వహ్నికినిగూడఁ
గలుగు సమ్మెట్రవేటు లకారణముగ.
చదువు సంధ్యలవేళ నాసరణి రాక,
కలిమి గలవేళ నావంకఁ గనఁగఁబోక,
యున్నవారల నేఁ జూడ నెల్ల ననుచు,
నలుక వహియింపకమ్మ! యోయమ్మ! నీవు,
కొడుకు చేసినతప్పెన్న కొనునె తల్లి?
యదను గనిపెట్టి బిడ్డల నరయుఁగాని;
తప్పుఁ గనఁబోరు సజ్జను లొప్పుగాని
వలదనిననాఁడె వారు కావలెనె నీకు!
నిన్ను సేవించి వాంఛించుచున్ననాఁడె
తేర్పర మ్మాపదలఁ గడతేర్చి పొమ్ము
స్వస్తి యగు నమ్మ! నీకు సౌభాగ్య మమ్మ!

తల్లాప్రగడ సూర్యనారాయణరావు.

శ్రీ

రాయవాచకము.

(ఈగ్రంథము తాటియాకుప్రతులు రెండు పుదుకోటలో దొరకినవి. అందొకటి సంపూర్ణముగను మఱియొకటి యసంపూర్ణముగను నున్నవి. రెంటి నిబరిశీలించి పాఠమును నిర్ణయించుటయైనది. భాష తఱచుగా లక్షణవిరుద్ధమయి నను జరిత్రాంశములే ప్రధానముచేసియు దక్షిణదేశమందానాఁడు వ్యాపించి యున్న వ్యావహారికాంధ్రభాషాస్వరూపము లోకమునకుఁ దెలియుట మంచి దనియు వాక్యరచన మున్నది యున్నట్లే ప్రకటించుచున్నారము. శీఘ్రముగనే యీగ్రంథము టిప్పణముతోఁ బుస్తకరూపముగఁ బ్రకటింపఁ దలఁచినారము.)

అవతారిక.

క. విజయనగరవృత్తాంతము
సుజనులచే విన్నయట్టి సూనృతవాక్కుల్
ప్రజలకుఁ దేటపడంగా
సృజియించితిఁ గృష్ణరాయశేఖరుచరితల్. ౧

క. విజయనగరజనపాలుఁడు
విజయాపురి గోలకొండ వీరులతోడన్
గజపతిని నాజిగెలిచిన
విజయుండౌ కృష్ణరాయవీరునిచరితల్. ౨

క. రాయలకు రాజనీతులు
నాయుఁడు నప్పాజి చెప్పినవి యన్నియుఁదాఁ
బాయక మనసున నునిచిన
రాయసములు వ్రాయఁ జదువ రసికత గలుగున్. 3

క. బాలురు చదివిన బుద్ధివి
శాలురు గావలయు శాస్త్రజాలంబులలో
లోలురు నరివధచింతా
శీలురు గావలయు భక్తిశీలత నెపుడున్. ౪

కథాప్రారంభము.

శ్రీవంతు సకలగుణసంపన్నులయిన మహామేరుసమానధీరులైన అఖండితలక్ష్మీప్రసన్నులయిన శ్రీమన్మహామండలేశ్వర రాజమాన్య మహారాజరాజశ్రీ కాశీవిశ్వనాథనాయనయ్యవారి దివ్యశ్రీపాదపద్మములకు దేవరవారి స్థానాధిపతి భక్తపరాధీనుండు సద్వినయ భయభక్తులనున్ను శాయంగల విన్నపం.

కర్ణాటరాజుల దినచర్య.

విద్యానగరమందు వీరనృసింహ్మరాయలవారు బ్రాంహ్మీముహూర్తాన లేచి ఆరాధ్యులు నామావళులున్ను అధ్యాత్మసంకీర్తనములున్ను పాండవగీతలు భ్రమరగీతలు గజేంద్రమోక్షు భారతసావిత్రిదధివామనస్తోత్రము గంగావతరణము నదీప్రార్థనమున్ను భారత భాగవత రామాయణాం ముచికుంద్దస్తుతి అక్రూరస్తుతి భీష్మస్తుతి సంజ్జయునీతి విదురనీతి చాణూరనీతిపద్యనీతి ఇవి మొదలైనవిన్ని నీతివైరాగ్యశతకం పురాణశ్రవణమున్ను రాజనీతులన్నియు విని దర్పణావలోకనాంతరంకన్యకామణులు కపిలకామధేనువను స్పర్శనంబుచేసి విప్రవరుల దర్శనంబుచేసిన పింమ్మట దంతధావన ముఖమజ్జన నామతీర్థమై విభూతి ధరియించి పేరోలగంబైకూర్చుండగా నూటయెనిమిది తిరుపతులనుంచిన్ని తీర్థప్రసాదములున్ను రాగాయెదురుకొని ప్రత్యుద్ధానముచేశి అంజలిచేనందుకొని శిరసావహించి స్థలాంతరాలనుంచ్చిన్నివచ్చిన అయ్యంగార్లనున్ను ఆరాధ్యులవారలనున్ను వుచితాసనములయందు కూర్చుండనియమించి అష్ట స్వయం వ్యక్తంశ్రీరంగంశ్రీముష్ణం వెంకటాచలంసాలగ్రామంతోతాద్రి నైమిశారణ్యాం పుష్కరక్షేత్రం ఇవి మొదలయినస్థలాలకు సురక్షితము గలవా అని అడిగినందులకు దేవరవారి ప్రతాపాతిశయమువల్ల ఆయాస్థలాంతరములనున్న ముద్రకర్త నైఖటికొకటి కొదువలేకుండ నడుపుతూ వున్నారు నూటయెనిమిది తిరుపతులున్ను నిత్యోత్సవములుగా నడుస్తావున్నవి అని అయ్యంగార్లున్ను పలకగా, పృథివ్యాప స్తేజోవాయు రాకాశకాత్మకమైన యేకామ్రనాథ జంబునాథ అరుణాచలేశ్వర కాళహస్తీశ్వర చిదంబరం మొదలైన డెబ్బైరెండు దేవస్థలాలున్ను పదునెనిమిది శక్తులకున్ను నిండు పడితరములుగలిగి నిత్యోత్సవములు గలిగియున్నదనేటట్టుగా ఆరాధ్యులు దెలుపంగా, విన్నవాడై చాలసంతోషపడి వార్లకు పట్టెములమర్చి ధర్మాసనం ధర్మయ్యాను పిలువనంపంగా ఆయన వచ్చి నిలచి దేవరవారు ఆనతిచ్చినప్రకారం ద్రావిడ

రాజ్యములోగల అగ్రహారములున్ను ఆంధ్రదేశం హాయనదేశం మొరసునాడు మొల్కానాడు కర్నాటకం ఘుట్టశీను చేర చోళ పాంఢ్య మగధ మళయాళ ఆదిగాగల అగ్రహారములకున్ను అవధి ఆటంకములులేక నిత్యకర్మానుష్ఠానపరులై ఋగ్యజుస్సామాథర్వణపారీణులయి షట్ఛాస్త్రపారీణులయి పంచయజ్ఞపరాయణులై అతిథి సంతర్పణలు చేసుకొని నిర్విచారులై సుఖవసతిగావున్నారని విన్నపంశాయగా, రాయలవారు వినవధరించి దళనాయకుల పిలువనంపగా, వారు వచ్చి పొడగని నిలిచి వినయముతోడట్టు సింహాసనరాజ్యములోగల గిరిదుర్గ వనదుర్గ జలదుర్గ స్థలదుర్గములయందు కావలికట్లు ప్రహారిబడగరములున్ను బీగముద్రలు స్వామివారిప్రతాపమువల్ల జతనమై యున్నవి, సామంతరాచకార్యములు విశేషముగా లేదు అని విన్నపంశాయంగా; ఆవెంబడిగా తలారి జంగమయ్య వచ్చి రాయలవారి సముఖానకు అడ్డబడి చేతులుకట్టుకొని నిలిచి దళనాయకులతోను విద్యానగరపట్టణములోనున్న వెలిపాళ్యములయందున్న యాదిహెచ్చరికలు గలిగి రాత్రిపగల్లు తలార్లు జతనమై జాగ్రతగా కాస్తావున్నారు; గనక పట్టణములోగల అష్టాదశవర్ణాల వారును అత్యంత సంతోషపరులై అతివైభవములతోడట్టు నిత్యకల్యాణములున్ను పచ్చతోరణములున్ను గల్గియున్నారని విన్నపంశాయంగా, దళనాయకులువిని రాయలవారికి విన్నపంజేశినారు. ఆపిమ్మట విఠలవిరూపాక్షస్వామి ధ్వజారోహణమైవున్నది రథోత్సవానకు విజయం శాయవలెను అనివిన్నపంశాయంగ దగ్గరవున్న దళనాయకులు ఆతీరున్నె రాయలవారు విచ్చేస్తావున్నారు స్వామి రథారూఢులైన తోడులోనెవచ్చి విన్నపం శాయమని అంప్పించి రాయలనగరికి తొమ్మిది సంప్రతులనున్ను బిలువనంపగా కరణాలువచ్చి పదునెనిమిది శేవ్రుల లెక్కలున్ను వినుపించిన తర్వాత రాయలవారు దిక్కులనుంచి వచ్చిన కమ్మకాకితములు యేకాంతముగా వినుపించ్చగా విని ప్రధానులను దళవాయిని రప్పించ్చుక కొంతతడవు యేకాంతముగా ఆలోచించి ఆపిమ్మట నిండు కొలువునకు వచ్చినవారై సకలసామాజికులను రప్పించమక నగరీఅళ్లుళ్ళుకొమాళ్ళు దొరమన్నీలు ప్రభువులు పాళెగార్లు అమరనాయకులు పురోహితులు ఆచార్యపురుషులు జియ్యంగార్లు యతీశ్వరులు దైవజ్ఞులు నాటకాలంకారులు విద్వాంసులు వీణాధరులు చేరువగార్లు రాజులు వందివైతాళికులు పాటకులు పఠాణీకులు శాస్త్రిలు ఇవి మొదలుగాఁగల జెబ్బెరెండు వినియోగాలవారలున్ను వచ్చి

కొలువుండగా దైవజ్ఞులు లక్షణీకులు దళనాయకులతోను ఆగతానాగత భూత భవిష్యద్వర్తమానంబులు ప్రసంగన శాయగా ఆవెంబడిని విద్యానగరపట్టణం గ్గాంవిచ్చేటందుకు మునుపు విద్యారణ్య శ్రీపాదులు యెందుండిరి వారు ఇచ్చటికి రాకారణంయేమి వారువచ్చి పట్టణం గావించినది యెట్లు అని అడిగినందులకు ముల్లంద్రడిండిమపుంభావసరస్వతి విద్యారణ్యుల వచనాలున్ను

విద్యారణ్య ప్రశంస.

విజ్ఞానేశ్వరమున వచనాలున్ను ఆయనకు తెలిశివుండును. పుంభావసరస్వతి విన్నపంజేశినవివరం; మూకాంబికయందుజ్ఞానేంద్రసరస్వతులు విద్యారణ్యులకుఆశ్రమస్వీకారమిచ్చిజ్ఞానోపదేశంజేశి సన్యాసాశ్రమమునకు సమకాష్ఠలోష్ఠుండై కామ క్రోధములు కట్టిబెట్టి మదమాత్సర్యములు విడిచిశత్రువులమిత్రువులుగాజూచి తిట్టినవారల దీవించినవారలుగాయెంచి భూమియే పల్యంకముగా శయనించి భిక్షాన్నమే అమృతాన్నమని తృప్తుండై కాషాయవస్త్రిములుగట్టి నియతబ్రహ్మధ్యాననిపుణతను ఏకాంగుండై మౌనముతోడట్టుగా గ్రామైకరాత్రముగా చరింపమని ఉపదేశించిన ప్రకారానకు చలించక సంచరింపంగా పురాతన పుణ్యాంవల్ల యేవూర యేయింటికి పోయినా మృష్టాన్న భిక్షము బెట్టుదురు. ఆయన్నము దెచ్చి గురువులయిన జ్ఞానేంద్రసరస్వతులవారి సన్నిధానమున వుంచగాను వారుచూచి సన్యాసులకు భిక్షాన్నము అర్హమింతే గాని మృష్టాన్నముయోగ్యముగాదు అట్టిపట్ల రాజయోగమైన అన్నము దే వచ్చునా అని కోపగించుకోంగా విద్యారణ్యులు యీశరీరానకు కావలెనని యిచ్చచేతను అడిగినవాడనుగాను యేవూరయేయింటికి పోయినా యీరీతిని భిక్ష పెట్టుతూవున్నారు యీప్రారబ్ధానకు ఏమిశేతును అనివిన్నపంశాయంగా, జ్ఞానేంద్రులవారు విద్యారణ్యుల పరిశోధింపవలశి తమశిష్యులను వెంబడి పంపగా, వారు విద్యారణ్యుల వెంబడినిపోయి అక్కడక్కడ పంచభక్ష్యపరమాన్నములతోడట్టు భిక్షంబెట్టుటను గని వచ్చి గురువులయిన జ్ఞానేంద్రులవారితో యీవివరం పలకరించగా వారు యితని పురాతన పుణ్యఫలము తప్పింపరాదు ప్రారబ్ధం అనుభవించక తీరదు అని మనస్సున యెంచి యయినా భాగీరథీయాత్ర జేశి అందువాసముగావుండి జీవన్ముక్తుండవగుమని ఆనతిచ్చి అంపంగా అనుజ్ఞాతుండై విద్యారణ్యులు భూప్రదక్షిణముగా విరాట్పురందాటి వరాసదేశానకు పోంగా ఆదిపర్వతం సమీప వరహానదీతీరాన అశ్వద్ధవృక్షమందు ఋగ్యజుస్సామాథర్వణ పారీణతజేసుక బ్రాహ్మణుండు ఏకదేశాన వానప్రస్థుండై వుండ

గాను ఆయనను చేరబోయి విద్యారణ్యులవారు ఆ బ్రాహ్మని పూర్వోత్తరము లున్ను గోత్రనామములున్ను అడుగగా ఆబ్రాహ్మణుండు సత్యవచనుండు గనక తనపేరు శింగ్గిరిభట్లంద్దురు రఘునాయకులు రాజ్యపరిపాలనం జేశేదినాలు దశాశ్వమేధ షోడశ దానములున్ను శాయంగా తులాపురుషదానమునకు యెవ్వరున్ను పూనేవారులేరు గనక అందువల్ల యాగఫలితం శేయమని రఘు నాయకులు మాతో పలకరించగా ఆయనకొరకై తులాపురుషదానానకు ఆచార్యత్వముగా నన్ను నియమించిరి గనక వారిచేత ప్రతిగ్రహాలబ్ధుండైన దారభ్యం యీఅశ్వద్ధవనమందువాసము వుండును తనకు ఆగత అనాగత భూత భవిష్యద్వర్తమానంబులు అన్నియు తెలుసును అదెట్లంటేను మీరు జ్ఞానేంద్రులవారిశిష్యులు మీనామధేయం విద్యారణ్యులు మిమ్ము భాగీరథీ స్నానముచేశి అందువాసమువుండి అచ్చట జీవన్ముక్తుండవగుమని నియమించి అంప్పించినారు గనక మీరు ఆదిక్కునఉండతగ్గది లేదు కాశిలో వేదవ్యాసుల దర్శనమున్ను అన్నపూర్ణ విశాలాక్షి విశ్వేశ్వరుల దర్శనమున్ను కలిగి వారి అనుగ్రహామువల్ల తిరుగా పంపానదీ తీరానకువచ్చి హెంపుగా ఒఖపట్ణం గావించి హరిహరులపేరిట వార్లను పట్టముగట్టి ఇష్టసంపదలతోడట్టు మోదంబునవుండేటందుకు శింగ్గిరిభట్లు ఆగతం జెప్పినందులకు, విద్యారణ్యులు శింగ్గిరిభట్లను బ్రహ్మరక్షస్సుగాయెంచి భీతిలేక ప్రత్యుత్తరమియ్యగాదలచి వ్యాసులు మనుష్యులకుగోచరము కానేరగే వారిదరిశనం యేరీతున గలిగీని అని అడిగినందులకు వ్యాసులు మీదృష్టి పదమయ్యేటట్టు చేశేను నేచెప్పి నట్టునడిస్తిరాయనా యభీష్టకార్యములున్ను నెరవేర్చుదును, మీకన్ని కార్య సాధనములుకలిగీని అని పలుకరించె. గనక ఆతీరునె మీయభీష్టకార్యములు నెర వేర్చేము అని పలుకరించినందులకు సింగ్గిరిభట్లు పలికే ప్రకారం అయితె మీకు కరతలామలకముగ దెలిపేను అని పలుకరించగా విద్యారణ్యులు చాలాసంతో షపడి వేదవ్యాసులదర్శనానకు హేతువు పలకరించమనగా శింగ్గిరిభట్లు పలికే ప్రకారం మేము పలకరించేము వార్తలువిని కాశికిబోయి మావద్దికివస్తేను అన్ని కార్యములున్ను చెప్పేను మీరు కాశికిబోయిన సమయాన వేదవ్యాసులు కావడికుండలతో మధువున్ను భుజానవుంచుకొని తోలుకుళ్లాయీని బిల్లచెప్పు లున్ను నీలిధట్టిన్ని వుభయపార్శ్వముల చతుర్వేదసమానములైన నాలుగుశున కములుగూడి రాగా నికృష్టమయిన రూపము తోడట్టు మధ్యాహ్నకాలమందు

గంగాతీరానకువచ్చి కావడి గట్టునందించ్చి మణికర్ణికలోనస్నానముజేసి గట్టుకు వచ్చి గోదోహనమాత్రం వెలపటవచ్చి నిలిచివుండురుగనక ఆసమయానమీారు సంకోచపడక అచ్చటికి బోయి వారి పాదముల ఘట్టిగా పట్టుకొని వందనం చేస్తేను నావంటిహీనుల మీావంటియతీశ్వరులు యీారీతున వందనములు శేతురా అని హీనకులాచారపుమాటలు యెన్నివిధములుగ పలకరించగా పాదములు విడువక పట్టుకుంటే అప్పుడు వారికి దయవచ్చి అనుగ్రహించేరు అనిచెప్పంగా విద్యారణ్యులువిని అందుండి కాశికిపోయి మణికర్ణికా ఘట్టమున కాచియుండగా ఆలాగె మధ్యాహ్నకాలమందు శింగ్గిరిభట్లు తెలిపినప్రకారం వేషము వేసుకొని వచ్చే వేదవ్యాసులగనుగొని సాష్టాంగనమస్కారముజేసి రెండు పాదములును కన్నులనొత్తుక భక్తియై నిలిచిన సన్యాసినిజూచి యీాతండు మాస్వరూపం తెలిశినది యెట్లు అని జ్ఞానదృష్టినిజూచి విద్యారణ్యులతోను మీాదు శింగిరిభట్లుదెలుపగా గదా మాస్వరూపం యెరిగితిరి అయితె మంచిదాయెను శింగిరిభట్లు బహుకాలము మాకుస్నేహమైవుండును ఆయనకునిద్రాహారము లేక అశ్వద్ధవనమందు చాలా అవధపడుచు వుండును నిన్నుంచి కర్నాటకాన వఖ నగరం కావలసియున్నది అందు మున్నూట అరవై యేండ్లు లక్ష్మీకటాక్షం గలిగివుండును ఆపట్ణం వున్నన్నాళ్లకు ఆ సింహాసనస్థునితో దెలిపి శింగిరిభట్లుకు ప్రీతిగా నిత్యకృత్యమున్ను పంచభక్షపరమాన్నముతోడట్టు మృష్టాన్నం సహస్ర బ్రాంహ్మణభోజనం చేయించవలెను అని ఆనరపతితో బలికి ఆనగరమందు ముప్పైన్నృపతులు కీర్తి ఖ్యాతులుగల్గి నడవకారణమున్ను అని పలకరించి కొన్ని మంత్రరహస్యములున్ను విద్యారణ్యుల కనుగ్రహించి వేదవ్యాసులు అదృశ్యులయిపోగాను; విద్యారణ్యుండానందభరితుండై భాగీరథిలో స్నానముచేశి కాశీ విశ్వనాథులనున్ను విశాలాక్షినిన్ని దర్శించి గయా ప్రయాగములనున్ను దర్శనస్నానములజేసి ప్రయాణగతుండై శింగిరిభట్లు వున్నతావునకువచ్చి తాము కాశికి పోయినపూర్వోత్తరములున్ను వేదవ్యాసులు ఆనతిచ్చిన వృత్తాంతములున్ను శింగిరిభట్లకు దెలుపంగ శింగిరిభట్లు సంతోషపడి విద్యారణ్యులతోను లక్ష్మీకటాక్షమువల్ల వఖ పురంగావించి అందున రాజుల ప్రతిష్ఠ చేస్తేను ఆపురానకు ఆయన వచ్చి ఆయవనీపతులకు మేలొనగూర్చి కీడుపరిహారించుకొంచున్నువుండెను.

విద్యానగర నిర్మాణము.

అచ్చట తనకు ప్రీతిగా నిరంతరమున్ను ఆనగరమందు అవ్వారిగ సత్రములున్ను దివ్యతిరుపతులున్ను పంచభూతాత్మక

మైన శివస్థలాలయందున్ను గంగా, యమునా, సరస్వతీ, గోదావరీ,సింధు నర్మదా కావేరి తామ్రపర్ణి మొదలయిన మహానదీతీరాలనున్ను నిరంతరం అవ్వారిగ శేయిపగలు అన్నదానములు జేశేటట్టు కట్టడశాయమని మనవిజేశుక విద్యారణ్యులును శింగిరిభట్లుంతో తాము విద్యానగరానకువచ్చి అందుండి రాయలవారికి అహర్నిశమున్ను తాము ఆశీర్వాదము చేసుకఉండవలెను అని పలికి అంపించుకొని విద్యారణ్యులు ఉత్తరదేశాన కాశ్మీరఖండమందు మండలమిశ్రులవద్దను సకలశాస్త్రములున్ను నేర్చి చింతామణి మంత్రోపదేశముచేత లక్ష్మీదేవిని ప్రార్థన శేయగా, ఆయిందిరాదేవి ప్రత్యక్షమై నీకు కావలయు వరములడుగుమని ఆనతియియ్యగా, విద్యారణ్యులు తన పేర వొక పట్టణంగావించవలసి వున్నది మీరు అక్కడ యెన్నాళ్లు వాసముగా వుందురో అన్నాళ్లు ఆపట్టణములోగలప్రజలు అందరున్ను సుఖస్థితివుండవలెను, అందు నుంచిన్ని తనపేరు కీర్తి శాశ్వతముగా నిలుచును; భూలోకమందు ఎవనిపేరయిన యెన్నాళ్ళు వెలయుతావున్నదో అన్నాళ్ళున్ను ప్రజలకు స్వర్గాది భోగములున్ను ఐశ్వర్యప్రదమున్ను పుత్రపౌత్రాభివృద్ధిగలిగివుండును గనక తాము గావించేపట్టణమందు మీరు శాశ్వతముగ వుండేటట్టు ఆనతీయవలెను అని ప్రార్థనశాయంగా, ఆమహాదేవి మీమనస్సుప్రకారం వచ్చి వుండేమని అనుగ్రహించి, నీవు మమ్ము తిరిగి జూడక పొమ్ము నీ వెంబడిగా వస్తావున్నారమని ఆనతిచ్చి పంపగా, కాశ్మీరదేశాననుండి పుజ్జయనికివచ్చి కొల్లాపురమందుండి కిష్కింధకురాగా, విద్యారణ్యులు తుంగభద్రలో స్నానముచేసి పంపానదీతీరానకువచ్చి పంపావిరూపాక్షుని సేవించి మతంగపర్వతమెక్కి పట్ణం గావించేటందుకు చతురశ్రమమైన భూమిని నాలుగుదిక్కులు చూడగా, ఆ సమీపాన గోవులమందలో నున్న శునకాన్ని పర్వతగుహలోనున్న కుందేలు తరుమగా విద్యారణ్యులు చూచి ఆశ్చర్యపడి, లోకములో శునకం కుందేటికి తరిమేదిగాని కుందేలు శునకాన్ని తరిమేది యెక్కడా చూడము యీస్థలమహిమ యేమోయని ఆదిక్కులనున్న పిన్నపెద్దల పిలువనంపించి అడుగగా వారుచెప్పునది; యీయొక్క స్థలమహాత్మ్యము యెంతబలవంతులుగావున్నాను మతంగమహామునులవారి శాపమువల్ల దుర్బలుల హింసించ కూడదు అనిచెప్పి వున్నారు. పూర్వమందు కిష్కింధలో వాలిసుగ్రీవులుందురు. వారుతమలోతాము కలహించుకొని యుద్ధముజేశి ఆయొక్క యుద్ధంబు శేయుసమయాన మహాబలుండు వాలి గనక సుగ్రీవుడు వాలితో యెదిరించి

యుద్ధము సేయలేక పారివచ్చి యీ మతంగ పర్వతముమీదవుండును. వాలి వెంటాడి రాగా పూర్వమందువాలిని యీకొండ యెక్కకుండ మతంగమహాముని శాపమిచ్చినారుగనక ఆదారభ్యం బలవంతులైన జంతువులైన మనుష్యులయిన ఆదిక్కు బలవంతవుపని శేయబడదు. అని చెప్పినారు ఆలాగున అది మొదలుగా సుగ్రీవుడు వాలితోయుద్ధము శేయకూడక యీమతంగ పర్వతానకు వచ్చును. కాబట్టి యీస్థలానకు ఎంతబలవంతుడువచ్చినా నిర్వాహకశక్తి లేక పారిపోవునుగాని యెదిరించి నిలువలేడు అని యేమో యీస్థలానవుండే జంతువులయినగాని మనుష్యులైనగాని అరిజనులకు అసాధ్యమనిచెప్పగా, విద్యారణ్యులు ఆశ్చర్యపడి, ఇది మునీశ్వరులమహిమగలతావని చాలాయెంచి యీదిక్కున పట్టణముగావించవలెను అని నిశ్చయించి అశ్వపతి గజపతి నరపతులలో నరపతియే ఘనము గనక నరపతిరాజ్యానకు పరోపకారముగ పురం గావించవలెనని యెన్నటికిన్ని చెలనంలేకుండ వుండేటట్టు మంచిముహూర్తాన శంకుస్థాపనంజేశి వాస్తుపురుషునికి నిలిపి నగరికి స్థలం యేర్పఱచి నగరు దేవళమున్ను కోటకొత్తళములున్ను నవద్వారములున్ను ఏర్పఱచి వాస్తువులుదీర్చి వీథులుయేర్పాటు చేయవలెనని తమతోకూడావిద్యాభ్యాసముచేసిన చతుర్వేద శంకరాబ్ధికుండైన

శంకుస్థాపనము హూర్తము.

శిష్యుని వెంబడిగాకూర్చుకొని నిశ్చయించి, యప్పుడు శాలివాహన శకాబ్దంబులు లెక్క ౧౧౨౫ యేండ్ల వెయ్యిం నూటయిరువై యైదేండ్లమీద చెల్లే ప్రభవనామసంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి స్థిరవారము శుభయోగ శుభకరణములుగూడిన శుభముహూర్తముల యందు ముహూర్తంజేశి, కృష్ణపక్షం అమావాస్యనాటిరాత్రి నిశిసమయమందు శంఖుస్థాపన జేశేటందుకు శాస్త్రజ్ఞులనున్ను మంత్రాధికులనున్ను దైవజ్ఞులనున్ను గూర్చుక ఉత్తరదక్షిణాలు యేర్పాటుకు త్రిశంకు ధ్రువులనున్ను, చూచి త్రిపురుషించి శంఖుస్థాపనముజేశి, తూర్పుపడమరలకున్ను త్రిపురుషించి శంకువులు స్థాపించి వాస్తుపురుషుని షోడశమణువులు బంగారునచేయించి చేవకంభమున ప్రతిష్టించి, ఆ స్తంభము శిరస్సు స్థానానకు జలాంతరముగాత్రవ్వి, సుముహూర్తమందు మేము శంఖనాదముచేసినారము ఆసమయమందు స్థాపించమనేటట్టుగా శిష్యులతో పలకరించి, అంపించి లగ్నము తప్పకుండ నిరీక్షించికొని వుండగా, అసమయమందు వొక్కజంగమువాడు భిక్షాటనమునకువచ్చి శంఖనాధముచేయంగావిని గురువులవారు శంఖంపూరించినారనేటట్టుగా యెంచి వాస్తు

పురుషుని నిక్షేపించిరి గనక వెంబడినె ఆగురువులవారున్ను శంఖనాదముచేశినది విని రెండో తేప శంఖం పూరించినది యేమోయని సిద్ధేశగురువులవారి వద్దికి వచ్చి శిష్యులు అడిగినందులకు, లగ్నంతప్పిస్థాపిస్తిరో అని జ్ఞానదృష్టిజూచి జంగమువాడు శంఖనాదముచేసేటట్టుగాఁదెలిసి చలనము వచ్చెనని విద్యారణ్యులు జూచి చాలాకష్టిబడి, యిప్పుడుజేసినదోషమువల్ల మూఁడువేలున్ను అర్నూరేండ్లకు ఖ్యాతిగలిగి వుండవలెనని యత్నముజేశినందులకు మున్నూటఅరవైయేండ్లుగానిలిచెను వ్యాసులవాక్యం తప్పక నిలిచెను అనియెంచి వాస్తుపురుషుని స్థాపించినారుగనక ఆదారభ్యం యీవరకు యిరవైతొమ్మిది నృపతులకుము న్నూరు యేండ్లాయెను. ఇంక అరువైయేండ్లు పట్టణమున్ను సింహాసనమున్ను నిలిచియుండును.

అనివిన్నపంజేశి యీరాష్ట్రపట్టం కృష్ణరాయలవారికి కట్టవలెను అని దళనాయకులతో పలుకరించి, కృష్ణరాయల వారు తాము పెద్దలమైతిమి తమ మర్యాదాగా రాజ్యపరిపాలనం జేశేటందులకు పట్టాభిషేకం అధిష్ఠానకర్తలు చేయమని మంచివేళజూచి ముద్దుటుంగరమిచ్చినారు గనక దళనాయకులు అయ్యమరసు కొండమరుసు బాచరసు యల్లమరసు వీరమరసు అప్పాజి లక్షణధణియక యెల్లన్నదళనాయకులు అప్పరపిళ్లె మన్నారుపిళ్లె రాయసంరాముచందయ్య బొక్కసంభాస్కరయ్య అవసరంవెంకటయ్య త్రియంబకయ్య లక్ష్మీపతి ప్రధాని తిప్పరుసు దళవాయి లింగరసు ఆర్వీటిబుక్కరాజు సాళువమేకరాజు శ్రీపతివారు బూదహల్లీవారు నంద్యాలవారు అవుకువారు తొరగెంటివారు రాచూరితిమ్మరాజు సంగరాజు వెలుగోటివారు పెద్దసానిఅక్కప్పనాయుడు కరకమ్మదొరలు తుళువదొరలు మొదలయిన వారలందరున్ను, నగరివిద్వాంసులు చతుర్వేది రామాదీక్షితులు అష్టభాషాకవిత కృష్ణావధానులు శాబ్దికంపాండిత్యం వెంకటరామశాస్త్రుల్లు సహస్రావధాని ప్రభాకరశాస్త్రుల్లు జోస్యులు కవీశ్వరులు మరిన్ని గలిగిన పిన్న పెద్దలు అందరున్ను శాస్త్రోక్తముగ శుభముహూర్తమందలి కృష్ణరాయలవారికి మంగళస్నానం చేయించి, కళ్యాణవేదికయందుబంగారుపీఠమున కూర్చుండనియమించి, దళదానములు షోడశమహాదానములున్ను చేయించి స్వర్ణతుల రజితతుల రత్నతుల మౌక్తికతుల మెరవులు కోటిగోదానాలు సహస్రకుటుంబప్రతిష్ఠలు మొదలైన దానధర్మములు చేయించి, చతుస్సముద్రములనుంచిన్ని బంగారుకలశములతో వుదకములు తీసుకొనిరాగా, గంగా యమునా సరస్వతీగోదావరి నర్మదాసింధు

కృష్ణరాయలపట్టాభిషేకము.

కావేరితామ్రపర్ణి మొదలయినమహానదుల వుదకములున్ను అష్టాదశ వాద్య ఘోషములున్ను మ్రోయగా, సుముహూర్తమందు బ్రాంహ్మలచేత మంత్రోక్తముగ అభిషేకముచేయించి, ఆపిమ్మట కనకాభిషేకం నవరత్నాభిషేకం చలువల తల్లొత్తి, పీతాంబరం ధరియించి, చందన అగరు కస్తూరి గంధాదులధరియించి, వారలనందరినిన్ని విడిదిలకంపించి, ఆపిమ్మట అల్లుండ్లు కుమాళ్లు బంధుపరిజనులున్ను స్నేహితులను పంక్తిని బెట్టుక ప్రసాపడి, సుగంధజలముల హస్తప్రక్షాళనముచేసి, ఆచమనీయ్యంజేసి, గిలుకుపావాలుమెట్టి, సంక్షేపరామాయణము చదువుతాను, శతపదాలు నడిచి, రత్నకంబలిమీద కూర్చుండుకొని, అప్పాజి మొదలైనవార్లనున్ను దళనాయకులనున్ను ప్రధానులనున్ను పిలువనంపించి, వారలతోను కృష్ణరాయలవారు ఆనతిచ్చినది:—

వీరనరసింహరాయులవారు సింహాసన పరభారకం వహించి నడిపించిన దారభ్యం యీవరకు అచ్యుతరాయలు చంద్రమౌళిన్ని మేమున్ను కూర్చుండక వుంటిమి, యిప్పుడు మమ్మున రాజ్యపరభారకం వహించుమన్నారు గనక సింహాసనస్థులు నడిచేదేరీతు, శత్రువులజయించేదేరీతు, మిత్రులపోషించెదేరీతు, ఆప్తజనులపాలించేదేరీతు, కొలిచిన వారినిఆదరించేదేరీతు, ఆత్మసంరక్షణమున కర్తలయినవారెవ్వరు, అర్థచింతవుపాయం అర్థవ్యయం సకలమున్ను తెలిశే దేరీతు, శాశ్వతమైనకీర్తిఖ్యాతులు గలిగేదేరీతు. ఇవి మొదలైన రాజనీతులన్నియు తాముదెలిశినవారుగదా మాకులెస్సగా తెలియ జెప్పవలె నని ఆనతిచ్చినందులకు, అప్పాజి అమ్మయరసు కొండమరసు వాచరసు మొదలైనవారు నలుగురున్ను స్వామివారు ఆనతిచ్చినది నీతికార్యమెసరి, సకలనీతులున్ను విచక్షణములున్ను కార్యనిర్వాహములున్ను సామర్థ్యమున్ను మద్యోది సామాజికులతో ఆలోచనంజేశి సకలరాజ్యసారములున్ను రాయలదేవునితో రాజనీతులు విన్నపంజేశినది.

కృష్ణరాయనికి మంత్రులు రాజనీతియు పదేశించుట.

సింహాసనాధిపతి అనంగా విష్ణుఅంశగాని యితరం గాదు. అది యేలాగంటేను "నరాణాంచ నరాధిప" మని భగవద్వాక్యం ఉన్నది.

అందుకునీతిపద్యం కం. తరుణుండై నవరత్నా
భరణుండై గంధపుష్పపరిమళయుతుండై
నరనాయకపరివృతుండై
పరఁగినవాఁడమరు నిటసభాపతియనఁగన్॥

క. శ్రీరమ్యుఁడు విజయుఁడును
ధీరోదాత్తుఁడు సుగుణతేజోనిధియై
యీరాయ సింహాసనమున
నారూఢుం డగుట యొప్పు నానభనదుమర్క॥

ఇట్లు సింహాసనస్థుండు స్వామ్యమాత్య సుహృత్కోశ రాష్ట్ర దుర్గ బలంబులను రాజసప్తాంగంబుల దెలిసి ఆందోలికా అంబర ఆభరణ వాహన రాజసన్మాన కర్పూర తాంబూలంబులను ఉచిత సప్తాంగంబులను రాశి యెరుగవలయు. సామ భేద దాన దండమాయోపాయ ఉపేక్షను హేంద్రజాలంబులు సప్తోపాయంబులు తెలియవలయు. రాజులకు సప్తవ్యసనంబులు గలవు. అందులకు నీతిపద్యము.

గీ. వెలఁది, జూదంబు, పానంబు, వేఁట, పలుకు
ప్రల్లదంబును, దండంబుఁ బరుసఁదనము,
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేఁత
యనెడు సప్తవ్యసనములఁ జనదు తగుల.

అవియవి యెట్లంటేను:— వెలది స్త్రీవ్యసనము, జూదము జూదమాడుట, పానము సురాపానముచేయుట. వేటపోవుట. పలుకుల ప్రల్లదముతిట్టుట. అకారణం దండించుట. అనుచితం వెచ్చపెట్టుట. యీయేడు వ్యసనములున్ను వర్జించవలెను. ఇదిగాక, సుత నిధి దేవగేహ వనతటాక కృతి బ్రహ్మప్రతిష్ఠ మొదలైనవి సప్తసంతానంబులు పడయుచు, కవివిద్వాంస పౌరాణిక ఇతిహాస భట్ట పరిహాసక గాయకులను సభాసప్తాంగ పరివేష్టితుండై అసృక్ మాంస మేదో ధాతు అస్థి మజ్జ శుక్లంబులను సప్తధాతువుల పరిజ్ఞాతుండై, లవణ యిక్షు సురా సర్పి దధిక్షీర శుద్ధోదకంబులను సప్తసాగర పరివేష్టితంబైన క్షోణీచక్రము నిర్వక్రంబుగా భుజాపీఠంబున ఆదరింపుచు, జంబు ప్లక్షు కుశ క్రౌంచ శాక శాల్మలి పుష్కరద్వీపంబులయందు నిజేచ్ఛ కీర్తిప్రభలు వెలుగొందజేయుచు, హిమవంత మాల్యవంత నిషధ వింధ్య పారియాత్రక గంధమాదన హేమకూటంబులను సప్తకులగిరి ప్రభావంబులు దెలియుచు కశ్యప అత్రి భరద్వాజ విశ్వామిత్ర గౌతమ జమదగ్ని వసిష్ఠులను సప్త మహాఋషీశ్వరుల తపస్సామర్థ్యంబుల కనిపింపుచు, శిరోవేష్టన కర్ణభూషణ గ్రైవేయక అంబర వాహన గంధ తాంబూలంబులను సప్తత్యాగంబుల నెరింగి, మరియు నాస్తిక్యంబు అనృతంబు అప్రసాదంబు అనర్థకంబు క్రోధంబు దీర్ఘచింత దీర్ఘసూత్రతయు మెఱుకగలవారలమెరుంగమియు అర్థంబులయందు

అనాసక్తియు అనర్థకచింత నిశ్చింతకార్యంబులు శౌయమియు మంత్రంబుల రక్షింపమియు శుభంబుల ప్రయోగింపమియు విషయంబుల నవం బరగిన రాజదోషంబులు గోకులంబుల నందనవనంబుల జలస్థల పదస్థల వణిక్క్రియ మార్గరక్షణంబుల అర్థంబు లార్జింపుచు, పంగు అంధక మూక బధిర వికలాంగులు మొదలుగాగల పాంథుల దయతో నరసి రక్షింపుచు, భయాతురుడైన శత్రువు శరణన్నఁ గాంచి రక్షింపుచు, ఆన్వీక్షిక దండనీతి అనియెడు తర్కవిద్యార్థ శాస్త్రంబుల రహస్యంబుల నెఱింగి, రథారోహణ అశ్వారోహణ గజారోహణ పదలాఘవవిచక్షణుండై, దానధర్మ పరోపకారంబులగు ధర్మత్రయంబుల నెఱింగి, ప్రభు మంత్ర ఉదాసీనులను త్రివిధంబులవారి నెఱింగి, ఉత్పత్తి స్థితి లయంబులను త్రివిధంబుల నెఱింగి, ప్రాతర్మధ్యాహ్న సాయంకాలంబు లను త్రిసంధ్యానియమస్థుండై, ఆహవనీయ గార్హపత్య దక్షిణాగ్నులను త్రేతాగ్నిహోత్రంబుల నలుపుచు, శైత్య మాంద్య సౌరభ్యంబులను వాయుమార్గత్రయంబుల నెఱింగి, యేలాగరు క్రముక ధవళపత్ర ముక్తాఫల చూర్ణంబు లను త్రిగుణాత్మక రూపంబైన తాంబూలంబులనుభవింపుచు, సత్వరజస్తమోగుణంబులను త్రిగుణంబుల, నెఱింగి ఉత్తమమధ్యమాధమములను త్రివిధనాయకాలక్షణంబుల నెఱింగి, ధర్మార్థ కామ్య మోక్ష చతుర్విధ పురుషార్థపరుండై, వేద శాస్త్ర పురాణ ఇతిహాసంబులను చతుష్టయంబులపరీక్షింపుచు, ఋగ్యజుస్సామాథర్వణంబులను చతురాగమంబుల పరీక్షింపుచు, బ్రహ్మచారి గృహస్థ వానప్రస్థ భిక్షుకులను చతురాశ్రమంబుల వారిని దెలిసి రక్షింపుచు, రథగజతురగపదాతులను చతురంగబలస్తోముండై, మనో బుద్ధ్యహంకార చిత్తంబులను చతుర్విధంబులఁ దెలిసి, క్షౌరాభ్యంగన దంతధావన నిర్మలవస్త్రంబులను చతుర్విధగరగరికలగలిగి, వస్త్రాభరణ గంధపుష్పంబు లను చతుర్విధ శృంగారవంతుండై, ఉన్మదన మదనమోహన వశీకరణ సంతాపంబు లను చతుర్విధమదనమార్గముల నెఱింగి, భద్రదంత కూచిమార పాంచాల విట విదూషక పీఠమర్దన నాగరీకులపగిదిని హస్తిని చిత్తిని శంఖిని పద్మిని యనుచతుర్విధజాతిస్త్రీలక్షణంబుల నెఱింగి, బాల్య యౌవన కౌమార లోలు లను చతుర్విధవయఃపరిపాకంబుల నెఱింగి జార చతురిక సంసారిక దూతిక లక్షణంబుల నెఱింగి, శబ్ద స్పర్శ రూప రస గంధంబులను పంచమహాభూతంబుల నెఱింగి, శ్రోత్ర త్వక్ చక్షు నాసికా జిహ్వలను పంచేంద్రియంబుల పదిలస్థుండై, మిత్రభేద సుహృల్లాభ సంధివిగ్రహ లబ్ధనాశ అసంప్రేక్ష్యకార్యత్వంబుల నెఱింగి,

ప్రారంభోపాయ పురుషద్రవ్య సంపత్తి దేశకాలవిభాగ వార్తా ప్రతికార్యసంధి యను పంచాంగంబుల నెరింగి నుడువుచు, పృథివ్యాపస్తేజో వాయురాకాశంబులను పంచభూతాత్మకములను ప్రాణాపానవ్యానోదాన సమానంబుల పంచప్రాణస్థానజ్ఞుండై, అరవిందం అశోకం చూతం మల్లికా నీలోత్పలంబులను పంచబాణములకు లోనుగాక, ఊనుట మీటుట వ్రేయుట రచ్చుపైకం ఆలాపంబులను పంచమహావాద్యంబుల నెరింగి, భక్ష్యభోజ్య లేహ్య చోష్యపానీయంబులను పంచవిధ ఆహారంబుల నెఱింగి,కటు తిక్తలవణ ఆమ్ల మధు కషాయంబులను షడ్రసక్షుణంబుల నడుపుచు, సంధి విగ్రహ యాన ఆసనద్వైధీభావసమాశ్రయంబులను రాజషాడ్గుణ్యంబుల నెఱింగి, హరిశ్చంద్ర పురుకుత్స పురూరవ సగర కార్తవీర్య లను అర్ధరుచక్రవర్తులచరిత్రంబులు వినుచు, గయ, అంబరీష శశిబిందు అనంగ్గు పృథు నృగు మరుత్త భరత రామ దిలీప శిబి రంతిదేవ యయాతి మాంధాత భగీరథులను పదార్గురురాజులకథాశ్రవణ......జైనకాపాలిక బౌద్ధ చార్వాకంబులను షడ్దర్శనంబులను యెరింగి, వేదాంత, వైశేషిక, భాట్ట, ప్రభాకర, పూర్వోత్తర మీమాంసంబులనియెడు షట్ఛాస్త్రంబుల పరీక్షింపుచు, ధనధాన్యవస్తువాహన బంధుజన దాసీదాసాదిజనులను గలిగి. భోజనవస్త్రగంధపుష్పతాంబూలంబుల ప్రియకామినీ సంగగోష్ఠియు పాన్పులను అష్టభోగంబులనుభవింపుచు,కులము రూపము విద్యయు ధనము చలము బలము యవ్వనము రాజ్యంబులను అష్టమదంబులను అహంకరించి,కస్తూరి కర్పూరం చాంది జవ్వాజి అగరు పన్నీరుతట్టుపునుగు శ్రీగంధంబులను అష్టసుగంధంబుల పరిమళలేపనుండై, వాగెయు బహుమానంబు కేశయు శస్త్రసాధనంబు వీరాస్త్రంబులరాకయు అను అష్టావధానంబుల నెరింగి, శృంగార వీర కరుణ అద్భుత హాస్య భయానక బీభత్స రౌద్రావేశుండై, ముక్తామాణిక్య వజ్రవైడూర్య గోమేధిక పుష్యరాగ నీలప్రవాళ మరకతంబులను నవరత్నపరిక్షితుండై, పద్మం మహాపద్మం శంఖ మకర కచ్ఛప ముకుంద కుంద నీల వరయను నిధానంబులనుగల్గి,సనయమభరతజలనుఅష్టగణలక్షణంబుల నెఱింగి,స్వరవడి ప్లుతవడి ఉభయవడి హృద్యను స్వరవికల్ప ప్రాగ్భవ సంశయప్రభువిభాగంబుల కాకు ఆవేశ నిత్య ఆర్య అఖండవర్గ తక్కటి యెక్కటి సరస లాట వళులను ఇరనైవళ్లభేదముల నెఱింగి, ఋతునాయక అభ్యుదయ వనగిరి రతికేళి జలప్రమాణ రత మధుపాన క్షితిపతి పుర సుత మంత్రదూత పరిణయాదు లనంబరగిన అష్టాదశవర్ణనములు దెలిశి, సంస్కృతప్రాకృత శూరసేనమాగధ పైశాచిక చూళిక అపభ్రంశ

తెనుగులను అష్టభాషాప్రవీణుఁడయి, యతిభంగ ఛందోభంగ పునరుక్తి సంశయ ప్రక్రమ వృథాలావర్త విరూపిత శబ్దవిరోధంబు గ్రామ్యంబులను దశవిధ అపశబ్దంబుల జొరనీయ్యక, నవరసాలంకారుండై ఛందోబద్ధమై, మృదువర్ణనవాక్యంబులు గలిగి, వాక్యం దశ పీఠాభావమై భవంబుల నెరింగి, లక్షణ లక్ష్యంబుల కావ్య నాటకాలంకారంబుల జెప్పనేర్చిన సుకవుల నరసి రక్షింపుచు, చూచుట చింతించుట వగచుట ఉస్సురనుట కొనియాడుట సిగ్గునెరుంగకయుండుట అన్నం బరోచకమగుటజ్వరమువచ్చుట నాలుకతొట్రుపడుట జీవంతొలగజూచుట అనియెడుదశావస్థల మర్మములనెఱింగి, వణకుట నొప్పివచ్చుట గరిగరిక విడుచుట కలహియగుట చింతనొందుట దైన్యమునొందుట దుఃఖియగుటపొర్పులుపొగలుట వున్నచోట కెలసుట ఆత్మమరుచుట నిరాహారియగుట క్రాగుట మౌనంబుదాల్చుట అరజీవంతొలగుట పంచత్వమనంబరగిన షోడశావస్థలభేదంబులెరింగి, అంగుష్ఠం అరకాలు మడిమెమోకాలు జిహ్వా ఉరం నాభి కుక్షి కుచ వక్ష గళ అధర కపోల నేత్ర ఫాల మస్తకంబు లను షోడశకలాస్థానమర్మంబులదెలిసి, వెలిదంమి కలువ విరిశము మామిడి జాజి పొన్న పొగడ అశోకము విరువాజి మల్లె మొల్ల గేదంగి వావి కలువ సురపొన్న కదళికాపుష్పంబులను షోడశబాణంబులనెరింగి, చిగురువిల్లు చెరుకువిల్లు తీగెవిల్లు పూవిల్లు నాల్గువిధంబుల విండ్లనుదెలిశి, తేటినారి కురువేరునారిచిగురునారి తీగెనారి యనంబరగిన నాలుగువిధంబులనారులును నాలుగువిండ్లను ఎక్కుబెట్టి షోడశబాణములున్ను షోడశకళాస్థానంబుల గురిజేసి యేయుమరునకు లోనుగాక, చాపష్టివిద్యాప్రవీణుల అరశి రక్షింపుచు,దుష్టజననిగ్రహంబును శిష్టజనపరిపాలనంబును జేయవలయు. ఇంకా రాజనీతులు అనేకములు గలవు. అందుల కించిత్తువిన్నపంజేశితిమి.అని అప్పాజి అయ్యమరసు కొండమరసు బాచరసు మొదలయినవారు విన్నపంజేశినందులకు,కృష్ణరాయలవారు వార్లనుజూచి మీకు భూతభవిష్యద్వర్తమానములున్ను దూరదృష్టికార్యములున్ను ఆగత అనాగతములున్ను తెలిసినవారలుగనుక రాజనీతులన్నిన్ని కరతలామలకముగా పలికితిరి. భ్రమరము వాయువుచేత పువ్వులవాసన యెరింగినట్లు భ్రమరకీట న్యాయముగానున్ను నగరికి ఆదాయమున్ను అయ్యేటందులకు యేరీతునని అడిగినందులకు సామాజకులు ధర్మంతప్పక నడిస్తే నెలమూడువానలున్ను గురుసును. భూమిన్ని బహువుగా ఫలించును. నగరివారు నాయముతప్పక కలిగినఅప్పనం తీస్తేను నగరివారికి అధిక శ్రేయస్సున్ను గలుగును. అందునుంచి బొక్కసభండారములకు రొక్కరూపాయీలు బహువుగా వచ్చును అని రాజనీతి చెప్పినందులకు—

పద్యం క. న్యాయము ప్రజపెక్కువకు ను
పాయము ప్రజకలిమి సిరికుపాయం బగుటన్
న్యాయమె భండారము నర
నాయకులకు నంద్రదు కీర్తి నారాయణుఁడా॥

అని నీతిచదివి వినిపించి సాధువులైన వార్లకున్ను, సాధుజంతువులకున్ను, బాధ చేశేవారిని శిక్షింపక పరాకు జేస్తేను రాజధర్మత్వమున్ను, ఐశ్వర్యమున్ను, చేశినపుణ్యమున్ను, క్షీణమైపోవునని సిద్ధాంతం. ఇదిగాక ద్వాపరయుగమందు కలియుగాదిని పరీక్షిత్తుమహారాజు రాజ్యాభిషిక్తుడై మీావలెనే ధర్మశాస్త్రములున్ను, కృతయుగమందు నాలుగుపాదములున్ను, త్రేతాయుగమందు మూడుపాదములున్ను, ద్వాపరయుగమందు రెండుపాదములున్ను, కలియుగమందు ఒకపాదముగనక ధర్మదేవత ధేన్వాకారమై ధర్మరాజు ధర్మపరిపాలనము శేయంగ యిన్నాళ్లు సుఖానవుంటిమి; యిప్పుడు కలిప్రవేశమాయెను. మూడుపాదాలు అధర్మమున్ను, ఒకపాదం ధర్మము గనక కాలునిలుపరాదని ఒకపాదం నేలమోపలేక దుఃఖాక్రాంతమైవుండగా, పరీక్షిత్తుమహారాజు నగరుశోధనకు ఏకదేశాన బయలుదేరి రాగా ధేనువును గని కాలు నిలువలేక కన్నీరుతోడట్టు చింతింపుతా వుండగా జూచి, సాధువులైనవార్లను యెవరుబాధ జేశిరో అని రాజు కామధేనువును అడిగినందులకు—నీవు నన్నడుగ కారణమేమి? నన్నుండి అన్యోప్రయోజనము లేమివున్నది? అనిమందలించినందులకు మీానిమిత్యముగా అడిగినా నింతేగాని వూరకే అడిగినవాడనుగాను అని పలుకరించగా, మన్మునుంచి నీకు అన్యోప్రయోజనమున్ను శ్రేయస్సున్ను పరామర్శింపక వున్నట్టయితే హాని కద్దాయని అడుగగాను, అప్పుడు పరీక్షిత్తు చెప్పిన పద్యం.

క. సాధువు లగుజంతువులకు
బాధలు కల్పించుఖలుల భంజింపని రా
జాధము నాయుస్స్వర్గ
శ్రీధనములు విడిచిపోవు సిద్ధము తల్లీ॥

అని నీతి చదివి తాను అర్జునపౌత్రుండు, అభిమన్యు పుత్రుండు, పరీక్షిత్తుడను వాడని అభిధానం చెప్పగా అప్పుడు కామధేనువు తాను ధర్మదేవతను అని తననిజస్వరూపము కనిపించి నీయాజ్ఞలో సకలమైనవారున్ను నడుచుకోవలెను. కలి దోషంబు తన్ను బారయకుండా నీవు రాజ్యముచేసే దినాలున్ను నాలుగుపాద

ములతోడట్టు సంచరించేటందుకు ధర్మం పరిపాలనం శేయవలెను. అని ఆశీర్వాద ముచేసి అంతర్ధానంబు నొందె. గనక ఆపరీక్షిత్తు కలిదోషమునకు వుండతగిన స్థలములున్ను వుండేటందుకు నియమము జేశి రామరాజ్యమువలెను ప్రజలకు మృత్యువువలన తస్కరులవలన అనావృష్టిదోషమునకు భయములేకుండా ధనధాన్యములపరిమితముగా కట్టడ శేయించి సమర్థులై శతాయువు పరిపూర్ణులయి సుఖాన వుండిరి. గనక ఆరీతివలెను స్వామివారున్ను ధర్మపరిపాలనం జేసుక రాజ్యం యేలవలెనని తెలిపినారు, గనక ఆనీతులంతా అప్పాజి మొదలయినవారలచేత లెస్సగావిని రాయలవారు యీావరకున్ను యీశ్వరనాయడున్ను, నరసింహ్మనాయడున్ను, వీరనృసింహ్మరాయలవారు రాజ్యపరిపాలనం గావించినారు. గనక యిప్పుడు ఆరాజ్యములున్ను, దుర్గములున్ను, దేశములున్ను, కోటకొత్తళములున్ను, విష్ణుస్థలములున్ను, పుణ్యభూములున్ను, సామంత సరదురాజ్యములున్ను, జూచిరావలెనని పలకరించినందులకు స్వామివారు ఆనతిచ్చినకార్యం—ఉచితమే సరి, పెద్దలు ఏలినరాజ్యములు తొక్కిచూడవలెను. ఉన్నతావున్నె యున్నట్టయితె యేకార్యమున్ను తెలియదు. అటుగనక రాజ్యములోగలప్రజలున్ను స్వామివారిని పొడగనవలెను. శత్రుజనులకున్ను, సామంతరాజులకున్ను, పరభీకరమగునట్టుగాను చతురంగబలములతోడట్టు అష్టదిక్కులను త్రొక్కిచూచి కీర్తివెలయజేశిరావలెను. అనివిన్నపం జేసినారు గనక కృష్ణరాయలవారు ఆనందముబొంది భూవిస్తారమున్ను రాజ్యములున్ను జూడవలెను అని నిశ్చయించి మునకలుగా చారులవలన ఆయాదేశములున్ను, ఆయాదిక్కులనుండే దొరలు, మన్నెరికముల నడతలున్ను,

లోకవార్తలు తెచ్చుటకు వేగర్ల నియమించుట.

వారివారి కలిమిబలములున్ను, గ్రామాదులున్ను, పల్లెలు, పట్టణములున్ను, పండితపామరజనులు ఆడుకొనేవార్తలున్ను, కోటకొత్తళములయందలి నడవడికెలు దెలిశి నానాటి ప్రవర్తకములున్ను గోప్యముగావచ్చి పలకరించేటట్టుగా, కాలువేగంగలిగి బుద్ధివిచక్షణులై బహుభాషాంతరములు దెలిసి బహురూపములుగానున్ను సంచరించి అంతరంగవార్తలరశి వచ్చేటట్టుగా విజయాపురం, అహముదానగరం, బెడదకోట, రాజమహేంద్రం, ఆరంగం, చెన్నపట్టణాం, శ్రీరంగపట్ణం, చదరంగపట్టణాం, శ్రీరంగం, మధుర, రామేశ్వరం, పుష్పత్తూరు, శివసముద్రం, పెనుకొండ, గోలకొండ, గుర్రంకొండ, పల్నాడు, మొరసునాడు, ఘట్టం శీమ, అరవరాజ్యం, మళయాళం, కొచ్చి, కొంకణ, కేరళం, విరాటపురం, వరాటదేశం, మగ

ధదేశం, మత్స్యదేశం, విదర్భదేశం, కాంభోజనగరం, కాశ్మీరఖండం, ఢిల్లీనగరం, ఇవి మొదలయినతావులకున్ను, తులువ, హైమ మొదలైనదక్షిణరాజ్యములకున్ను, చంద్రగిరి, గండికోట, కడప, నంద్యాల, బెల్లంకొండ, రాచూరు, ముదుగల్లు, నిడికల్లు, మైసూరు, మొదలయిన స్థలములకున్ను, వేగుర్లున్ను నియమించి అంపించిపట్టణములసంచరింపగా అహంకరించినారనిన్ని పరులత్రోవపోయినారని వినినా నన్ను వారిని ఆజ్ఞశేయమని కట్టడచేసినారమని మీరందరున్ను నగరి ఆజ్ఞమీరక నడుచుకొమ్మని ఆనతిచ్చినారు. గనక అవి మొదలు సమమైనవార్లున్ను భయస్థులై పట్టణములోనున్ను,వీథులయందున్ను,మార్గములయందున్ను,యెవరు యెదరుతాకిన యేమనితలంచేవారులేక సుఖముగ సంచారం చేశేరీతికి నడిపించి రాయలవారు నిత్యకృత్యమున్ను రాత్రి కొలువు తీరినతర్వాత నగరుశోధనకు

కృష్ణరాయని నిత్యకృత్యా వివరణము.

విచ్చేశి సకలకార్యములున్ను తెలుసుక, అరుణోదయానికి నగరికి వచ్చి కొంతతడవు పవ్వళించి యుదయాననే లేచి దంతధావన, ముఖమజ్జన,నామతీర్థపు కొలువుజేసుకొని పెద్దకొలువునకువచ్చి తాము రాత్రి నగరుశోధనకు బయలమెరశిన వేళ గనుకొన్నకార్యములు విన్నకార్యములన్నియు మనస్సుకు దెచ్చుకొని, తలారిజంగమయ్యను జూచి రాత్రి పట్ణములోని ప్రవర్తమానములేమి అని అడుగగా సకలకార్యములున్ను విన్నపంజేసును గనక తాముజూచినందులకును సమరసముగా వున్నట్టాయనా విని వూరకెవుందురు. నడిచిన కార్యములలో బలదుర్బలములు తెలుపకపోతే యీపాళ్యాన యిటువంటివీథిని యీయాశ్రేణిలో ఇంన్నోయింటివద్దరాత్రినడచిన న్యాయములు తెలిసినవాడవుగావు నిన్నన నేరములేమి నీవుతలారికం జేశేదిన్ని మేము రాజ్యపరిపాలనం జేశేదిన్ని లెస్సాయెనని ఆగ్రహపడగా తలారి భీతిజెంద తాను రాత్రిపగలు నిద్రాహారములేక వీథులను మనుష్యులనుంచుక క్షణేక్షణే నడుచు వార్తలు పరామర్శించి రమ్మని భద్రపరచి రాయలవారికి యెవ్వరు మరుగుపడ విన్నవించినారో అని పరామరిశించగా రాయలవారు నగరుశోధనక్కు వెళ్లి పరామరిశించగా కన్నకార్య మింతేగాని విన్నకార్యముగాదు అని యెంచి ఆదారభ్యం పట్టణములో కావలికట్లవారితోను జతనముగాగాచి నడుచుకార్యముల వచ్చి తెలుపుమని దిట్టపరచి రాయలదేవునివారు రాత్రి నగరుశోధనకు వెళ్లుదునని యెవ్వరిని అడుగక వీథులలో దుడుకులు రానియ్యక హెచ్చరికతో నుండుమని పలికి తానున్ను తనకు ఆప్తులయినవాళ్లున్ను తన్నుకొలి

చిన వార్లతోడట్టు రాయలదేవునివారు కొలువు దీరి నగరిలోపలికి పోయిన క్షణమే హజారమువద్ద కాచివుండి నగరుబీగముద్రలు అయిన రెండుఘడియలకు రాయలవారు లీలావతారముగా బయలుదేరే జాడ జూచి కనుపించుకోగ, అంతటంతట హెచ్చరికగా రాగా రాయలదేవుని వారుజూచి తలారిజంగమయ్యాను పిలిచి మేము నిత్యకృత్యమున్ను నగరుశోధనకు బయలు వెరశి వత్తుము నీవున్ను నీతిగలవారున్ను దూరాన కనుపట్టకరమ్మని ఆనతిచ్చినారు గనక తలారి జంగమయ్య ఆదారభ్యం భయముగలిగి రాయలవారు నగరు శోధన జేశి తిరుగా నగరుప్రవేశం అయ్యేవరకున్ను వీధివీధుల వెంబడినే తిరిగి మరిగి తన విడిది కొంపకు పోవును. యీవర్తమానములు అప్పాజిగారు మొదలైన సామాజికులు విన్నవార్లై వారు వారు ఆలోచనపరులై తమతమ యిండ్లలోను రాత్రి పగళ్లు మాటపలుకు లాడుకొనేటప్పుడు యీాదిహెచ్చరికలు గలిగి ఆప్తాలోచనలు నడుపుతావుందురు. యీరీతిని వుండగా కృష్ణరాయలవారు నిత్యకృత్యమున్ను ప్రాతఃకాలమందు పద్యనీతి చదువుమని వింట్టువుంద్దురు. గనక వఖనాడు పద్యనీతి చంద్రయ్య తనకు రాకూడక తనకుమారుని నగరికి అంపగా ఆయన వచ్చి సంజయనీతి, విదురనీతి, చాణుక్యనీతి, భర్తృహారి శతకము, ఇవి మొదలయిన నీతి చదివినాడు గనక వఖపద్యమైనా తప్పక చదువగా రాయలవారు సావధానచిత్తులై వినేయెడల పద్యనీతిశతకమున వఖనీతిపద్యము.

క. బలవర్గము సామంతుల
బలమున కగ్గలముగల నృపాలుర కొప్పున్
బలిమి పెఱనృపతి కాజ్ఞా
బలసంపద కెంతదవ్వు బద్దైనరేంద్రా॥

అని నీతిపద్యము చదువగా రాయలవారు ఆపద్యము ఇనుమారు ముమ్మార్లు చదువుమని మనస్సునకు తెచ్చుక వఖనాడు కొలువులోపలను కరణీకుల పిలువనంపి వారలతోను కర్నాటక సింహాసనానకు యెన్ని లక్షలరాజ్యములు? ఆరాజ్యములో గిరిదుర్గ, స్థలదుర్గ, వనదుర్గ, జలదుర్గములు యెన్ని? కోటలు యెన్ని? నగరములు గ్రామభూములు యెన్ని? యేయేదుర్గాలకుయెంత నగరిబొక్కసాన వుండె? రొక్కరూపాయలకున్ను, నవరత్న భూషణములకున్ను, స్థాపించివుంచిన నిక్షేపములకున్ను, శీమమణియగార్లమీాద చెల్లునిలువకున్ను, నగరి కైజీతం, యేనుగ, గుర్రం, పరిజనాలకున్ను, వివరముగా లెఖ్ఖవ్రాసి

తెచ్చి చదువమని తొంమ్మిది సంప్రతులనున్ను పిలిపించి ఆనతిచ్చిరి. గనక చిన్నభండారం అల్లాలనాథుండు విన్నపం జేశినది. యీవరకున్ను వీరనృసింహరాయుల వారు లెఖ్ఖ పఖ్ఖలు అడిగి పరామరిశించినవారు కారు. ఇప్పుడు స్వామివారు

కోశాది వివరణము.

లెఖ్ఖలు పరామరిక జేస్తున్నారు గనక యేయేలెక్కలు విన్నపం శాయమన్నారో ఆయాలెక్కలు శేఖరించి వ్రాసి నేటమర్నాటను అన్నియు విన్నపం జేశేమని లెక్కపక్కలు జాగ్రతగా రేయిపగలు వ్రాసి శేఖరించి ఆమరుచునాడు లెక్కలు విన్నపంజేశినది. విద్యారణ్యస్వాముల వారు యీపట్టణం గావించేటప్పుడు సింహాసనస్థునికి నిక్షేపించినది తొంబై తొంమ్మిదికోట్లు యాభైయారులక్షల ద్రవ్యంగాక భూషణములు నాలుగుకోట్లున్ను, నవరత్నములు ఆరుకోట్లున్ను, వున్నవి. అవిగాక యీవరకున్ను సింహాసనస్థులు సింహాసనమున్ను నడుపుకొని శెలవు శిద్దాయాలుపోగా బొక్కసాన వుంచినది పందొమ్మిదికోట్లయాభైయారులక్షల ద్రవ్యం. ఇదిగాక కర్ణాటకరాజ్యం పదికోట్లుయెనభై నాలుగులక్షలున్ను, దేవాదాయం, బ్రంహ్మాదాయం, సర్వమాన్యం, మతపరములకు అరవై లక్షలుపోగా నిలిచినది పదికోట్లున్ను, ఇరవై నాలుగులక్షలరాజ్యా సజీరాసంజ్ఞోక గుఱ్ఱములకు, రోజు గుర్రం వొఖ్ఖంటికి నూరేశి ఘట్లు లెక్క గుర్రములవెయ్యింటికి లక్ష ఘట్లవంతున గుర్రాలు యిరవై నాలుగు వేలింటికి, యిరవై నాలుగులక్షలున్ను, యేనుగు వఖ్ఖంటికి రోజువెయ్యేశి ఘట్ల లెక్క. యేనుగులు నూటయిరవై యింటికి పంద్రెండులక్షలకున్ను యేనుగులు వెయ్యిన్నేనూరు. బంటు వొఖ్ఖంటికి నెలకు ఘట్టి రెండేశి వరాలలెక్క. బంట్లు వెయ్యింటికి రెండువేల వంతున రెండులక్షల బంట్లకు రోజు నాలుగు లక్షలున్ను, యీ లెఖ్ఖప్రకారాన అమరనాయకం, గుర్రాలు, యేనుగులున్ను, పంద్రెండువేలున్ను, కాల్బలములు రెండులక్షలున్ను, ఇందుకు రోజులకున్ను ఆయకం, ఆదవని, చెయ్యేటి దుర్గం, గుత్తి, గండికోట, చంద్రగిరి, గుర్రంకొండ, మద్దూరు, సోమగిరి, త్రిశిరపురం, కున్నత్తూరు, పెనుకొండ, ముస్తీబులయిన దుర్గములున్ను, నంద్యాల, శ్రీరంగపట్టణం, వుమ్మత్తూరు, దళనాయకుల కోట, వల్లంకోట, మధుర, పాళ్యంకోట, దిండికల్లు మొదలైన సత్యవేడు, కొట్టికల్లు, డంగినీకోట, నారణవనం మొదలైన వనదుర్గములు దేశములు గలరాజ్యమున్ను యేలుకొని కొలుస్తావున్నారు. లెఖ్ఖ క్రమానికి శీమలుకొని యేనుగు, గుర్రములు, బంటు, బయదలు, ఆపద్ధతికి కొలువక వున్నారు. గనక

చిత్తానకు తేనవధరించేటట్టు శాయవలెను. అనివిన్నపం శాయంగా రాయలవారు కరణాలతోను అమరనాయకానకు నగరికవిలె కావలిప్రకారానకు యేనుగు, గుఱ్ఱం, బంటు, బయదలకు వివరముగా లెక్క వ్రాసి తెమ్మని ఆనతిచ్చిన తర్వాత నగరికై జీతం, యేనుగు, గుఱ్ఱం, రాణువకు లెక్క యేమిన్ని చదువలేదని మనస్సునయెంచి అప్పాజి అయ్యమరుసు మొదలైనవారిని జూచి ముందరనడిపించతగ్గ కార్యములకు ఆలోచన యేమని అడిగినందులకు, అందరున్ను వూరకే వుండగా సాళువతిమ్మరసుగారు ఆలోచనపరులై యేమిన్ని పలుకరించక స్వామివారు చిత్తానకు సరిపోయినట్టు నడిపింతామని సంబుద్ధిగా విన్నపంజేశినారు గనక రాయలవారు తమచిత్తాన సింహాసనపరభారమునకు కర్తలజేసినమాత్రం యింతేగాని సకలప్రపంచమున్ను సామాజికులు ముఖాంతరముగానే నడుస్తావున్నది; తమమాట పలుకులు యెవ్వరు వినేరు. అధికారతరుణమందు స్వాతంత్ర్యముగానడిపిస్తే మంత్రభిన్నమై కార్యములు కొనసాగవు. కాబట్టి వాకిటి పిన్నపెద్దలు తమరయ్యే తెలుసుకొని వక కార్యం నడిపిస్తే అప్పుడు తమకు స్వాతంత్రముగానడుచును. అనుచు, మనస్సున దూరయోచన యెంచి వక నాటిరాత్రి నగరు శోధనకు బయలుదేరినట్టు నగరువెడలి పట్టణానకు రెండామడదూరాన

కృష్ణరాయలు పట్టణశోధనకుం బోవుట

ఉత్తరపుదిక్కున వొకదేవళము వుండగా అక్కడికిపోయి నిలిచి సంబివాణ్ణి నీళ్లుతెమ్మని దంతధావన ముఖమజ్జననామతీర్థమై స్వామి నివేదనమైన ప్రసాదపణ్యారములు తెప్పించుక ఆరగించి కూర్చుండగా అంతట పట్ణంలో యెప్పటివలెనే సాళ్వతిమ్మరసుగారు నగరికివచ్చి రాయలవారు పుష్పోదయమైనారో అని పరామర్శించగా అచ్చట కాచియుండే దాదులు హెగ్గడికత్తెలు బోనకత్తెలు అన్నగర్లు నిన్నరాత్రి రాయలువారు నగరశోధనకు పోయినట్టే యింకారాలేదని పలికినారు. గనక వారలతోను యికను యెవరువచ్చి అడిగినగాని రాయలవారు శిరోభారమై ఇంకా పుష్పోదయం శాయలేదని చెప్పేటట్టు నియమించి హజారముఖానకువచ్చి కూర్చుండి గూఢచారులను అష్టదిక్కుల మార్గములున్ను పరిశోధించి యేకాంతముగవచ్చి పలుకరించమని అంపగా, ఆచారులు ఎనిమిది దిక్కులకుబోయి విచారించిరి. గనుక వారిలో పరిశోధకుండైన గూఢచారుఁడు వచ్చి సాళువతిమ్మరసుగారితో పట్ణానకు రెండామడ దూరానకు ఉత్తరముగాను పల్లికొండరంగనాథస్వామి సన్నిధికి ఏకాంతముగా విచ్చేశి కూచుండుక పట్టణముదిక్కు ముఖము చూస్తావున్నారని రహస్యముగా పిలువగా అప్పాజి

దొరమన్నీలకు, అమరనాయకుల కందఱికిన్ని రాయలవారు వేటబోవుతాపు
న్నారు. మీ స్తోమములతోడట్టు శీఘ్రగతిగా రమ్మని అందరికి చీట్లువ్రాయించి
అంపించి తాము మునుకలుగా తరలిపోయినారు. గనక పట్టణములోఁగల రాతు
లు, మావుత్తులు, బంట్లు, పరివారములున్ను, దొరలు, మన్నెరికములున్ను
అందరున్ను ఆక్షణమే కదిలి పోయినారు. అందుకు మునకలుగా తిమ్మర
సయ్యగారు కూడాను విల్లుబెట్టుమేరకు అందలముడిగ్గి బంటు బయదలనున్న
యేనుగు గుఱ్ఱములనున్ను, బారుదీరివుండేటట్టు కట్టడజేశి మితజనముతోడట్టు
కొంతదూరముబోయి అచ్చట అందరినిన్ని నిలువమని యేకదేశాన తాము
వక్కరే కోటవెలపట వంటిగా పోగా రాయలవారు తిమ్మరసు వచ్చేదిగని పచ్చ
డము నిండారుగ గప్పుకొని నిద్రపొయ్యేరీతిగా వుండగా అప్పాజి రాయలవారివద్ద
చేతులు కట్టుకొని నిలుచుండి వుండగా కొంతసేపునకు కనుపించుకోక ఆత
ర్వాత రాయలవారు నిదురమేలుకాంచిన రీతిగా లేచి అప్పాజిని జూచిన వారై
మీరు యిచ్చటికి యేలవస్తిరి అని అడుగగా తిమ్మరసయ్య అడ్డబడి విన్నపం
జేశినది—స్వామివారు నిన్నరాత్రి నగరుశోధనకు బయలు మెరసినట్టే

తిమ్మరుసు రాయలవారిని మందలించుట

యిచ్చటికి విచ్చేశినమార్గము తెలియక యధావత్తు
గానే నగరికి పోయి వుష్పోదయమైనారో అని అడుగగ
హెగ్గడికత్తెలున్ను అన్నకళులున్ను రాయలవారు నగరు
శోధనకు బోయినట్టే వచ్చినవారుగారని చెప్పగా మనస్సుకు చాలావిచా
రమై ఆయాదిక్కులకు చారుల నంపగా అచ్చట విచ్చేశివున్నారని చెప్పగా విని
యీవార్త ప్రకటించరాదు అని మనస్సునయెంచి రాయలవారు వేటమార్గముగా
సాగిపోయినారు గనక దొరమన్నీల అందరినిన్ని తమతమ స్తోమములతోడట్టు
క్షిప్రగతిగా సాగిరమ్మని చీట్లు అంపించి వద్దనున్నవారితోను రాయలవారు
వేటమార్గముగా సాగిపొయ్యేటప్పుడు రమ్మని ఆనతిచ్చి అంపినారు గనక పో
వలశివున్నది అని వార్లతో మందలించి కదలి వస్తిని. స్వామివారు యీరీతిని
రావచ్చునా? యీవార్తలు లోకులకు తెలిసితేను పట్టణమున్ను కోలుపోవును.
మనేదారులు విన్నాన్ను అపకీర్తి, గనక యింతటికార్యముచేశేది అనుచితము.
స్వామివారి చిత్తాన యింతకార్యమెంచి రావచ్చునా అని నీతిమార్గముగా
నున్ను భయోత్పాతములుగానున్ను తెలిపినందులకు రాయలవారు సింహాసన
పరభారకం వహించే మీవంటిపెద్దలువుండగా అట్టికార్యములు యేలవచ్చీని

మీారుతృణాన్ని బట్టితే మేరువు శాయగలరు. ఆమేరువునే తృణముగా నడిపించ గలరు. అఘటనఘటనా సామర్థ్యములు మీాకే గలవు. అని వ్యంగ్యోక్తులుగా ఆనతిచ్చినందులకు సాళువ తిమ్మరుసయ్యా పలికినది—ఆరీతే అవును. అవి యేమియం టేను స్వామివారు సకలకార్యభాగములు మామీాద పూనికజేశి నడిపించంగా ఆరీతున నడుస్తావున్నది. చిత్తానకు రాకుంటే మేమనగా తృణమాత్రము. తృణ గ్రాహి యయిన యింద్రనీలము ఖ్యాతిబొందును. తృణమని యెంచి గ్రహించక వున్నట్టాయెనా జాతినీలముగాదని వెలతరుగును. అటుగనక యేలినస్వామివారి ప్రతాపమువల్లనేగదా కొలిచినవారు ఘనమాట. కొలిచినవార్లను ఘనముగా నడపగా నే యేలినవారికి కీర్తిఖ్యాతులు గలుగుట. అని ద్వంద్వార్థముగా విన్న పముచేశి పట్ణానకు విచ్చేయుడా అని తెలిపినందులకు రాయలవారు తనదొర తనమేమి అనంగా యేది తమ అంక్కవంక్కలకు యెవరు వచ్చేరు రానివారిని మేము యేమిచెప్పేము. దండించనర్హులముగాము. దండనాయకత్వము లేనివారికి ధరణియేలేదెట్లు, ధర్మపరిపాలనం జేసేదేరీతు, దుష్టనిగ్రహం శిష్టపరిపాలనం శా యలేనని చెప్పి తిరుగా అందుకు ప్రతిచింత కట్టివచ్చేము లేనప్పటికి రాకూడదని నాలుగారుఘడియలు ఆలోచనజేయగా, సాళువతిమ్మరసయ్యా స్వామివారు ఆన తిచ్చిన యంతమట్టున్ను యథార్థమున్ను కార్యసరవిన్ని అవును. అందులకు యిది బుద్ధియని ఆనతిచ్చినట్టయితే స్వామివారిప్రతాపమువల్ల అన్ని కార్యములు న్ను అమరికలు అయ్యీని. అని తెలిపినందులకు రాయలదేవునివారు తంమును స్వతంత్రులు తెచ్చిరిగా ఆరీతున్నే నడపించుడా అని ఆనతిచ్చి యిన్నాళ్లున్ను నీతి పద్యము వినుము వఖనాటి యంద్దున విశేషమైనబుద్ధిమార్గములుగా వఖనీతిపద్య ము వింటిమి గనక అదిమొదలుగా ఆరీతున నడిపించుకోవలెనని బుద్ధిబొడమి సా మంతబలములకన్నా అధికమైనబలాల సంతరించి తురకలమట్టుబెట్టవలెనని యెంచి నారము. యిందుకు యేమంటే కైజీతము లేక యేకార్యములున్ను కొనసాగదు. గనక యిప్పుడు కైజీతము, యేనుగు, గుఱ్ఱము, బంటు, బయదలు సహితముగా గట్టి ఆము స్తీదుతోడట్టు పట్ణప్రవేశం గావలెనని ఆనతిచ్చినారు, గనక సాళువతిమ్మరసయ్యా యీాకార్యమునకు స్వామివారు యీారీతున రావచ్చునా? యీాక్షణాన్నే దేవరవారి చిత్తానకు వచ్చేటట్టు యేనుగుగుఱ్ఱాలు బంట్లునందరిని సంతరించెదను. మరివెన కను చతురంగబలములతోడట్టు పట్ణానకువిజయం శేయుండా అనివిన్నపంజేశినందు లకు యీాక్షణాన్నే నగరి యేనుగ గుఱ్ఱము బంటుసహితముగా అమరికజేసెను, అని

విన్నపము జేశి తోడుతోనే దొరమన్నె వార్లను అమరనాయకంవార్లను రప్రతు రాణువును డెబ్బై రెండువినియోగాలవారున్ను కొలువునకు రమ్మని కులాచారం కరణీలపిలిపించి వారితోను సింహాసనాన అమరనాయకం యేనుగులెన్ని, గుర్రాలెన్ని, కాల్బలం ఎంత అని అడిగినందులకు గణికులు పలుకరించ్చినవివరం.

రాయలసేన వివరణము.

గుర్రాలు యిరువైనాలుగువేలు, యేనుగఘట్టాలునూటయిరువై, కాల్బలము రెండులక్షలు. ఇందులకుస్థితి నెలవక్కంటికి నలభైలక్షలువంతున సంవత్సరానికి నాలుగుకోట్లు యెనభైలక్షలకు అమరనాయకానకు శీమలు ఏలుచున్నారు, అని గణికులు విన్నపం చేశినందులకు వారలతోను రాయలవారు అమరం యేనుగు గుర్రాలకున్ను, బంట్లకున్ను, నేడు నాలుగారు ఘడియలలోగా గణుతిపెట్టిగణుతికిలేని యేనుగు, గుర్రాలు, కాల్బలమునకు, వీరనరసింహరాయలవారు యేలుకొన్న దారభ్యం యీవరకున్ను పదిసంవత్సరాలాయెను గనక వారివారిమీది రొక్కనిలువలు లెఖ్కజూచి తోడుతోనె నిలువ రూకలు అరువుశాయుమని నిరుత్తరుప్రగా ఆనతిచ్చిరి గనక అదేరీతికి కరణీలు వెలపటికివచ్చి గుర్రం, రాణువ, గణుతి పెట్టంగ వఖటికిసగమున్ను నాలుగింటికి వఖపాలున్ను గణుతికి తక్కువబడెగనక అమరగార్లమీదినిలువ రొఖ్కమునకు అక్షణముందే వొప్పజెప్ప మనగా వార్లు బహుదినాల నుంచిన్ని ప్రఖ్యాతిగా తిన్నవారు కాబట్టి తమమీది నేరం తప్పిపోతే చాలునని తమమీది మోపాదిఅయిన రొక్కానకు యియ్య వెరవు లేదు గనక శీమల మొప్పటివలెను నడిపితేను యిప్పుడు వుండే యేనుగు గుర్రాలను నగరికి వెలకట్టి యిచ్చి ఆపిమట తాము సంతరించుకొనేము, అని విన్నపం శాయంగా మంచిదే యని అమరగార్లమీది నిలువలకు యేనుగు గుర్రాలను వెలకట్టుకోగా యేనుగులున్ను పండ్రెండువేలగుర్రాలున్ను లక్షబంట్లు యేలేదొరలనున్ను నగరి శరబడి ఆయనుగనక ఆయేనుగు, గుర్రాలు, కాల్బలము, రాయలవారిసముఖానకు తెచ్చి విడిచి చిత్తం వచ్చినవారికి వెచ్చబెట్టండా యని విన్నపం శేయంగ, రాయలవారు ఆశ్చర్యపడి అప్పాజిగారితో అఘటనఘటనాసామర్థ్యము మీకె కలదు అని ఉచితసప్తాంగము, కుళ్లాయి, కబాయి, తాళి, చౌకట్లు, పీతాంబరం, గంధ కస్తూరి తాంబూలాదిగాయిచ్చికై జీతం యేనుగలకు తుళువ మావటీలున్ను, కై జీతం గుర్రాలకు కబ్బిలిరాతులున్ను, మొరసరాతులునున్ను, తుళువరాతులునున్ను, యేలిక బంట్లును వ్రాయించి ఆపిమ్మటను రాయలవారు బంగారుచౌడోలు ముస్తీ

పులయిన మాస్తిమదహస్తియనే యేనుగనుయెక్కికొని సాళువతిమ్మరసయ్యను తమవెనకను కూర్చుండమనిచతురంగబలముతోడట్టు విద్యానగరపట్టణప్రవేశమై తర్వాత అప్పాజి తిమ్మరసు మొదలయినవార్లను యిండ్లకు పంపించి తమ ఆప్తలతోను అప్పాజి సాళువ తిమ్మరసయ్యాలవలె నియ్యోగులు కద్దా అటువంటి నియ్యోగులు వుండగా వఖనాటనే కైజీతం కట్టవలెననిన్ని, లేకుంటె పట్ణానకు రామనిన్ని దుష్కరవచనంగా పలకరించినందుకు తాలిమి గలిగి ఆతీరునె అమరిక జేసెను, అని యేనూరు యేనుగులున్ను, పంద్రెండువేల గుర్రాలున్ను, లక్షమనిషిబంట్లనున్ను, నిమిషమాత్రాన సముఖానకు రప్పించి చిత్తంవచ్చిన వారికి సెలవుశాయమనగా, చూచి అశ్చర్యపడి ముందర తురకాణ్యాంమీద కార్యంశేశేవారమై కర్నాటకరవుతుల మావుతుల సంచరింపవలెనని దృష్టిచేత కబ్బలిరాతులకున్ను, తుళువరాతులకున్ను, మొరసరాతులకున్ను, పంద్రెండువేల గుర్రాలకున్ను, యేలికబంట్లుగా వ్రాయిస్తిమిఅని మాటిమాటికి కొనియాడుతా పలకరించి మరివెనుక గుర్రాలు పంద్రెండువేలున్ను, యేనుగులు యేనూరు మావటీలు వెచ్చబెట్టి ఆయాగుర్రాల రాతులకు మావటీలకున్ను సంబళం సారికెలు కట్టడజేశి ఆయాలాయం గుర్రాలకు కవళములు పరామర్శించేటట్లు నలుగురుపారుబత్యగార్లను ఆరుగురుకరణాలనున్ను పదారుగురు అంగజాడులనున్ను ఆరుగురుముషుపుగొల్లలనున్ను కట్టడచేసి, నానాటి చెల్లువెచ్చానకు బొక్కసాన యిమ్మనేటట్టుగా నిరుత్తరవుచేశి నల్లప్రజలు లక్షకున్ను నెలనెలకు తప్పక సంబళం దిద్దుమని వాఖకర్ణీకం యేర్పాటుచేశి మరి వెనుక నేడుగదా దొరతనమున్ను ప్రభుత్వమున్ను యేర్పాటు ఆయను అని సంతసించి, మరిన్ని అమరగార్లకు యేనూరు యేనుగులు, పంద్రెండువేలుగుర్రాలు క్రయంగట్టియిచ్చేటప్పుడు వఖరైనా అన్యాయ మనకుండా వారువార్ల సమ్మతిమీదనే క్రయంగట్టియిచ్చిరి గనక ఆయేనుగులక్రయం విన్నప్పటికిన్ని సగటున యేనుగ వక్కంటికి ఆరేశివేలలెఖ్ఖ యేనుగలు యిరువైయింటికిన్ని లక్షయిరువై వేలవంతున యేనుగు ఘట్టము యాభైయింటికి ముప్పైఫ లక్షలున్ను, గుర్రాల క్రయం గుర్రం వకంటికి యేనూరు వరాలవంతున గుర్రాలు వెయ్యింటికి రెండు లక్షలలెఖ్ఖను గుర్రాలుపంద్రెండువేలకు యిరువైనాలుగులక్షలున్ను, నిమిష మాత్రములోగ యేనుగుల గుర్రాలవల్ల నగరికి ఆయాభైనాలుగులక్షలకు ఆదాయంజేసెను.

సాళువ తిమ్మరసు ప్రశంస.

"అపూర్వమైన మనుష్యులు దొరికితేను సకలమున్ను సంతరించ్చ వచ్చును" అని రాయలదేవుండు పలకరించగా అయ్యామరసుగారు విన్నపంజేశినది. "సింహాసనస్థునకు స్త్రీలున్ను రత్నములున్ను కలిగినది అయితే అంతకన్నా అధికం మహీపతులకనగా నీతి పద్యం.

పత్ని ధరిత్రియుఁ బురుషులె
రత్నము లెప్పుడుఁ బురంధ్రిరత్నములు శిలా
రత్నము లవనీపతులకు
పత్నులె రత్నములె తలఁప బద్దెనరేంద్రా.

అని అన్నారుగనక రాజులైనవారలు అనువైన పురుషరత్నాన్ని సంతరిస్తె ఆయన నవరత్నములున్నూ చతురంగబలములనున్ను సంతరించ్చ గలడు. అటుగనక అప్పాజి సాధారణ నియ్యోగిగా నెంచవద్దు. ఆయన అసాధారణ నియ్యోగి. అఘటనఘటనాసామర్థ్యం ఆయనకెగలదు. అది యేలాగంటేను— అందరున్ను మనుష్యులు. అందరికిన్ని అవయవాలు సరి. యిందులో ఉత్తములు మధ్యములు అధములు అనియెరిగి యేర్పరచవలెను. అదియేలాగంటేను—గుణాధిక్యము వల్లను యెక్కువ. మరిన్ని పంచలోహములున్ను అన్నియుసరి. అందున బంగారు హెచ్చింది యేది అంటేవ్వరియకకురాంగా వన్నె హెచ్చించినట్లు గుణాధిక్యమువల్ల మనుష్యులలోనున్ను అప్పాజిని అధికుడని యెరుగవలెను. అది యేలాగంటేను

శ్లో. శతేషుజాయతే శూరః సహస్రేషుచ పండితః,
వక్తా శతసహస్రేషు దాతాభవతివానవా.

అనేనీతిప్రకారానకు నూటికివకబంటును వెయ్యింటికి వఖపండితుండున్ను లక్షకు వఖడు వక్తుండై సభాస్థలిని మాటపలుకులాడును. శీమలో వఖడు దాత అనేదికలండో లేడో అన్నట్టు వఖరుగాక అందరికిన్ని ఆగుణములు యీల వచ్చీని. అని అయ్యమరసు విన్నపంజేసి ఆస్తాలోచనగా వార్తలాడుతా వుండగా విజయాపురానసుండి వేగర్లు వచ్చినారని మారీచిరామయ్య వచ్చి కృష్ణరాయలవారితోను విన్నపంజేసిన వివరం.

విజయాపుర వృత్తాంతము

విజయాపురానకుబోయి పట్టణం వెళిపాళ్యములు, కోటకొత్తళములు, రవుతులు, మావుత్తులు, యేనుగు గుర్రాలు, కాల్బలం, అమరనాయకవార్లను నందరినిన్ని జూచి నగరివాకిటికి పోయి, దాడి

మహాలు ముంపుగా ముందరదివాణంలో ముందర యాయావజీర్లు దొరలు దొండో పండితులు మొదలైనవారు నియ్యోగులు వారివద్ద కుతపనములక వారి హేజీబులు ముకుందపండితులు మొదలైనవారు కూర్చుండి ఆలోచనజేసినది:—కర్నాటక సింహాసనానకు నడవంగా కృష్ణరాయలవారిని అధిష్టాన కర్తలజేసిన దారభ్యం తురకలమీద కార్యంశాయవలెనని అలోచనజేశి అందులకై యత్నములు చేస్తా వున్నారు. అన్ని వివరాలకు విజయనగరానినుండిన్ని కాకితములు వ్రాసివచ్చెను.

అశ్వపతి గజపతి నరపతులతారతమ్యము.

అశ్వపతి గజపతి నరపతులలో నరపతిసింహాసనమే అధికము. కడమ రెండు సింహాసనములున్ను వారివెనుకను అని పిన్న పెద్దలు ఆలోచనగా చెప్పినందులకు గోలకొండవారి ముద్దాపండితులు "సింహాసనాలంటె మూడున్నసరి. యిందులో సింహాసనాధిక్యములు కలవా" అని ఆగ్రహపడగా నిజాంరవుతులు మావృత్తులు లశికిరీతనాన సరిగదా ద్రవ్యసామగ్రియందు దుర్గములయందు కొదవ; అట్టిపట్ల అధికమని చెప్పవలసిన కారణమెద్ది? అన్నందులకు గోలకొండవారి ముద్దాపండితులు వ్యంగ్యోక్తముగా కాకయేమి మరేమి యిందులలో న్యూనాధిక్యములు యెంచ అవకాశమేమివున్నది? వొకరికొకరు ఏకవాక్యముగా ఆడుకొన్నందులకు బాహుబలేంద్రుని బ్రహ్మయ్యపంతులువారలతోను యీమూడుసింహాసనములనగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అంశలుగావుండును. అందునకు తారతమ్యములు యేరీతో ఆరీతువలెనే అశ్వపతి గుర్రాలకున్ను, గజపతియేనుగలకున్ను, నరపతి కర్నాటకసింహాసనమునకున్ను గనక నరపతియే హెచ్చు. అదియేలాగంటేను—భగవద్వాక్యం 'నరాణాంచ నరాధిపం' అనేవచనమువల్లనున్ను ఆరాజ్యములోను దేవాదాయం బ్రహ్మదాయం పుణ్యతీర్థములు నదులు పుష్కరిణులు గలిగివున్నది. యిదిగాక విష్ణువు ప్రత్యక్షమై వెంకటాచలాన వున్నారు. ఆరాజ్యములోవుండే స్వామికి కడమరాజ్యములలో పెద్దలు బుద్ధిశాలులు బ్రాంహ్మణులు యతీశ్వరులు మఠాధిపతులు రాజులు మొదలైనవారలందరున్ను కానుక కప్పములు కొంచుబోయి స్వామికి సమర్పించి వస్తావున్నారు. గనక కర్నాటకం సింహాసనాధిపతులు పుణ్యశ్లోకులు. ఆపిమ్మట గజపతి సింహాసనమందు జగన్నాయకులు వేంచేశివున్నారు. గనక రెండోపర్యాయము. అశ్వపతివారున్ను గంగాతీరాన విశ్వనాథులరాజ్యములోవున్నారు. వారితెగలవారి మొఘలషాహు, కుతుపనమలక, నిజాంశాహు, యీమూడు తెగలవారున్ను కర్నాటక సరదునవున్నారు. మీారుకర్నాటకాధిపతులతో సరియనవగునె. అని

మధ్యస్థభావముగా అన్నందులకు దొండ్డోపండితులు, ముద్దోపండితులు, దాదోపండితులు ముగ్గురున్ను దొడ్డనియ్యోగులుగనక తెలుసుకొని తమదొరలు మద్యపానులు దేవబ్రాంహ్మణవిశ్వాసము లేదు. మ్లేచ్ఛులు, గోహింసకులు. వారిని గొలిచినవారము గనక దూరదృష్టి విచారించుకొన అవకాశ మంతలేక అహంకారగుణమువల్ల అనవలశిన దంటిమి. బ్రాహ్మోపంతులవారు పలకరించినది యథార్థమని మెచ్చినవారై ఆతర్వాత మంత్రాలోచనగా వార్తలాడినవి. కర్నాటకంవారు సరదుబలపించ్చివచ్చే గజపతి వారికిన్ని మనకున్ను మున్నెరికగా వుండగా వుండును. ఆరీతుగాకుండ అందునకైన యత్నంగని సరదు దుర్గాలను రస్తుసామగ్రీలు వేయించి బలవంతముగా యేనుగు గుర్రాలు కాల్బలములు వుంచవలెను.'' అని ఆలోచనచేశినవారై యెదులశాహు వారితోను యీపర్యాయములు యెరుకశాయగా ఆగ్రహపడి "కర్నాటకంవారు తుంగభద్రదాటి వచ్చిరా యీవరకున్ను యీశ్వరనాయకుడున్ను నరసనాయకుండున్ను వీరనరసింహరాయలవారున్ను యేలినందుకంన్నా కృష్ణరాయలవారు యేలేది యేమున్నది" అని అన్నందులకు దొండోపండితులు మొదలైనవారు "రాజనీతి అని మొనకురాదు. గనక వుండేయత్నములు వుండగా దైవసహాయం యేతీరో తెలియదు గనక నిజాంశాహువారున్ను, కుతుపనములకవారున్ను విజయనగరాననుండి కాకితములువ్రాసి వచ్చినది విని ఆలోచనపరులై యిక్కడికి కాకితములు అంప్పి తమతమ సరుదు స్థలములు పదిలపరుచుకొని యాది హెచ్చరికలతో వున్నారు. బాహుబలేంద్రునివారి బ్రాహ్మోపంతులు వారి వారి సరదు గిరిదుర్గములయందు రస్తుసామగ్రీలు వేయించి బలవంతముగా వుండేటట్టుగా యేనుగు గుర్రాలున్ను రవుతులున్ను అంపించేవారై వున్నారు. మనమున్ను ఇక్కేరి బసవాపట్ణంశంకరనాయడు ఆదికొమాళ్ల బోయిరామప్పగారి సరదుస్థలాలకున్ను రస్తుసామగ్రీలున్ను మూకస్తోమాదులున్ను అంపించవలె" ననగా ఆతీరునె అంప్పించమని విజయాపురంకోటకొత్తళములున్ను లెస్సగాతీర్చి రస్తుసామగ్రీలు వేయించమని మందలించగా, వాకిటి పారుబత్యగార్లు యెనిమిది దినాలనుండిన్ని ఫిరంగి, జవురుజంగులు, గుంట్టుకోవ్రులు, దంతెనరాళ్లు, యెత్తురాళ్లు, గశికలు, పులితలలు, కోట వెలపట గుర్రాలు జొచ్చిరాకుండా గుర్రపునిలువురాళ్లు, వేయించేదిన్ని, దిక్కులకు వేగుర్లను అంప్పి నానాటి సమాచారములు తోడుతోనే వచ్చి తమతో దెలువుమని అరసైవేగుర్లను విద్యానగరపట్ణమునకంపిం

చినారు. విజయాపురిదేశములోగల ప్రజలందరున్ను ఆలోచనపరులైవున్నారు. సరదులవుండేవార్లు యీవార్తవిని చీటిపాటిచిక్కు-చిల్వానములు విజయాపురానకు అంపుతావున్నారు, అనిన్ని ఆపట్టణములో వారువారు ఆడుకొనే వార్తలున్ను కన్నవిన్నదియంతాను విన్నపం శేయగా, రాయలవారు అప్పాజి అయ్యమరసు కొండమరుసు గారు విని, విజయాపురం అహమదానగరం గోలకొండ వారికి యిక్కడవుండేవారి స్థానాపతులు నడిచిన ప్రవర్తమానములు వ్రాశి అంప్పిన కార్యానికి యాదిహెచ్చరికలు కలిగి, యింత ఆలోచనచేశి యదుకులశాహున్ను తెలిపి ఆయనాను సరుదుస్థలాలకు రస్తుసామగ్రీలు అంప్పించినారు గనక వారి యాది హెచ్చరికెలున్ను కలిమిబలుములకున్ను సరివున్నదా అని వేగులవారికి వుడుగరల యిచ్చి విజయాపురానె వుండి నానాటివర్తమానములున్ను లెస్సగా తెలుసుకొని అంపి, వద్దనున్న వూడిగవార్లను కడకుపొమ్మని అప్పాజిమొదలైన సామాజికులున్ను రాయలవారున్ను ఆలోచనగా మాటలాడుకొన్న వివరం. రాయలవారు అప్పాజి మొదలైనవారితోను "మేము ఏకదేశాన ఏకవదంతిగా తురకాణ్యంమీద కార్యం చేయవలెనని యెంచిన ఆలోచనకు యిప్పుడె నడిపిస్తా వున్నారు. యీకార్యం ధైర్యంమీదనడిపేదో భీతిచేత హెచ్చరికపడేదో" అని అడిగినందులకు అప్పాజి ప్రభృతులైనవారు దిక్కులవార్తల విందురు. విన్నవేళకు ఆప్రసంగములు తలపక నాలుగార్లుదినములు వెనక సరుదు స్థలాలుచూచే నిమిత్యముగా ఆశీమాధిపతి వస్తున్నాడని వదంతిపుట్టించి ఆయాస్థలముల వుండే వారికి కోట కొత్తళములున్ను రస్తుసామగ్రీలున్ను వైచి యాది హెచ్చరికలతో వుండవలెనని సముదళంవారు సంతిరించేటట్టు నడిపించే గంహారమున్ను ధైర్యమున్నుగాక యీరీతి నడిపించేదెల్లా బుద్ధిచంచలత్వాన నడిపించే ప్రయోజన మని అన్నందులకు, అయ్యమరసు కొండమరుసుగారు "తురకలనగా మద్య

తురుష్కుల పానులు, మందుతినేవారు, లాలారిపురుషులు గనక వార్లకుచాలా

శీలము. భీతిగలిగి యుండును. పానముజేసినంతపొద్దున్ను తమదేహములు

తా మెరుగరు. గనక ఆసమయమందు స్మరణయెరుగరు. అప్పుడు యెవ్వరు అడ్డమైన నరుకుదురు. కలియుగ రాక్షసులతీరై వుందురు. స్మరణతెలిశిన తర్వాత తమజాతి స్వభావం యిటువలెగదా అని విచారపడుదురు. బ్రాంహ్మణులు వుప్పు పులుసుతో అన్నం ప్రసాపడుదురు గనక వారలకు మద మాత్సర్యములు లేవు. అని యెంచి వాకిటి పారుబత్యమంతా వారినె శేయమని తమ ఆజ్ఞలోనడుచుక వారిమాట

మీద నామజాములు అంపుతా వారు తీశిరమ్మంటె తీసివచ్చేటట్టు యేర్పాటుచేసి తాామున్ను వారిబుద్ధిమతులలో నడుచుక వత్తురు. అటుగనక నియ్యోగులు యేరీతున నడిపిస్తే ఆరీతున నడుచును. నియ్యోగులతో ద్వివిధమైతే దొరనుండి తమ ప్రాణాలకు హానియై దొరతనమునకున్ను చలనం వచ్చును. అటుగనక యేకగ్రీవమై ఆమూడు తెగల నియ్యోగులున్ను ఆలోచన శేసుక నడిపించే కార్య మని తెలిపి "వారు స్వాయత్తులు గారు, పరాయత్తులు గాని స్వామివారు ఉభయాయత్తులు కాబట్టి దేవరవారి ఆలోచనకు సరిలేదు. తురకలు మూడు తెగలవారున్ను యేకాలోచన పరులై కార్యముఖానకు నడిపిస్తే లక్ష యాభై వేలగుర్రాలున్ను వెయింన్నే నూరుమదహస్తులున్ను మూడులక్షలపాయుదళములున్ను. వార్లను జయించేటందుకు అంతకన్నా ద్విగుణమైనబలముచేత జయించవలెను. కర్నాటకాన అన్నిగుర్రములున్ను సంతరించేమా కాదు. చతురంగబలాలున్ను వుండవలెననేటందులకు కైజీతం గుర్రాలు పంద్రెండువేలున్ను, అమరనాయకం గుర్రాలు యిరువైనాలుగువేలున్ను, కైజీతం యేనుగులు యాభైఘట్టాలును, అమరపు యేనుగులు నూటయిరువైఘట్టాలు, కైజీతం రాణువ నూతనంసహాగా మూడులక్షలున్ను, అమరం వగను అయిదులక్షలున్ను, బలం బంట్లున్ను యీమట్టుబలముతోనున్ను వివరంమీద సమరమిస్తేను తురకల కార్యమనగా యెంత" అని విన్నపం శేయగా రాయలవారు సామాజికులలోను ధైర్యమువల్లనున్ను లక్ష్మీ కటాక్షమువల్లనున్ను దైవసహాయమువల్లనున్ను జయంగలుగును, అందుకు

శ్లో॥ యతో ధైర్య స్తతో లక్ష్మీః యతో లక్ష్మీ స్తతో హరిః
యతో హరి స్తతో ధర్మః యతో ధర్మ స్తతో జయః॥

అని పెద్దలు చెప్పుదురు గనక అన్నిటికిన్ని ధైర్యాను ముఖ్యముగనక మీరు ధైర్యశాలులు మీరు పూసినకార్యములన్నిన్ని చేకూడును. యేనుగులున్ను గుర్రాలున్ను కాల్బలమున్ను కారణం గాదు. దైవసహాయమువల్లనే రాజ్యములు దీవులు పరిపాలించవలెను. తొల్లి ఆరుగురు చక్రవర్తులు తామువున్న తావుననెవుండి గదా ఆజ్ఞాచక్రముచేత సప్తద్వీపములున్ను యేలిరి. ఆపిమ్మట పదార్గురు రాజులున్ను భూమి పరిపాలించిరి. ఆరీతినే స్వామివారికి వెంకటేశ్వరుల సహాయం గలదు" అని తెలుపగా విన్నవారై "ముందరికార్యాలోచనకు అనుసారిగా నడిపించుడా" అని అప్పాజి మొదలైనవారితో ఆనతిచ్చి ఆయాదిక్కులనుండి వేగర్లు కమ్మ కాకి

తములు తెచ్చినారా అని పరామర్శించగా అహాముదానగరాన నుండ్డిన్ని వేగుల రామున్ను గోలకొండనుండిన్ని వేగుల గోపాజిన్ని వచ్చినారని తెలుపగా, వద్దనున్న వార్లను కడకు నంపించి వేగర్లను రప్పించుక అచ్చటి సమాచారములు అడుగగా వారు విజయనగరమున నుండిన్ని తరలిన దారభ్యం అహాముదా

అహామ్మదాబాదు గోలకొండల వృత్తాంతము పరదేశులశోధనము.

నగరం గోలకొండ ప్రవేశమయ్యేపర్యంత్యం నిత్యపయగతుల ప్రాళ్లున్ను పట్టణములున్ను దాటి ఆయాసరుదులున్ను పరస్థలం శీమవారినిన్ని పరదేసులనున్ను మరిన్ని మార్గస్థులుగావచ్చేవారినిన్ని శోధించేదిన్ని కమ్మకాగితములు లేనివార్లను యెక్కడినుండి వస్తునావు, యెవరి తెగలవారు అని బెదరించి అడిగేదిన్ని, ఆతర్వాత పొమ్మనేదిన్ని, ఆపట్టణములోనికి బోయి వెలిపాళ్యములు జూచి కోటలోనికి పొయ్యేటప్పుడు యెరుకగలవారు వచ్చి వీరు తమవారనిన్ని వీరినుండి వకకార్యము వస్తే మేము నేరస్తులమనిన్ని భరవసముగా చెప్పిన తర్వాత శిఖామీద శిఖా వేసి కోటలోపలికి అంపుదురు. కడమ జనులవారికి ఆశిఖా జూపితేను కోటలోనికి విడుతురు. కొత్తవాలు అనేతలారికి ఆముద్రజూపి పట్టణములో సంచరించవలెను. కోటలో వుండేదినాళ్లెల్ల తిరిగి తమశీమకు వచ్చేటప్పుడు మొదటి పారుబత్యగానితో యెరుకజేసి పారుబత్యగాని శిఖా చేతికిచ్చి శిఖావేయించుకొని కొత్తవాలు అనేతలారికి జూపికోట వాకిళ్లకువచ్చి వాకిటివార్లకున్ను ఆముద్ర జూపినతర్వాత అంపుదురు. అటువంటి దుర్ఘటనములనన్నిన్ని నేర్పున గడచి దివాణం ముందర దిన మొక్కుం

తురుష్కరాజ్యములో దండనవిధము.

టికి ఆజ్ఞలుచేశేదిన్ని, నడిమికి తెగవేశేదిన్ని, రంపాన మనుష్యుల గోసేదిన్ని, గోనెలో మనుష్యుల వేసిగట్టి యినుప గుదియల గొట్టేదిన్ని, చాలకు శింగ్గాణికొనల నారుల తగిలించేదిన్ని, రెండు తులాలబరువుగల రాళ్లు కాళ్లకుగట్టి పాడుగోడలకు యిరుగడల దిగవేశేదిన్ని, మూటకట్లుగాకట్టి యెండ్డలో దొర్లించేదిన్ని, కాలు చేయి కర్ణ నాశిక ఛేదనం జేశేదిన్ని, ఇదిగాక శీమ మణియగార్లను అనేకవిధముగా బాధలు బెట్టేదిన్ని, యేనుగ కాలగట్టి దొర్లించేదిన్ని, యీరీతిగా అనేకవిధములుగా చూడ భీకరమైన బాధలకు వెరచి నగరికి పైకం యిస్తే ప్రాణాలతో విడుతురు. యిచ్చేటందుకు అవకాశం లేకుంట్టే హింసచేతనే నడివీధిలోనే చంపుదురు. యీరీతి యాసబెట్టి బాధలుచూస్తావుండి వెంబడినే ఆయాధిపత్యము నగరి మహాలుకు ముందర మొదు

ఆంధ్ర సాహిత్య పరిషత్తు.

(TELUGU ACADEMY.)

ప్రమాదీచనామసంవత్సరకార్యనివేదనము.

సభ్యులు.

ఈసంవత్సరమందు శ్రీ భద్రాచల సంస్థానాధిపతులగు శ్రీ రాజా పార్థసారథి అప్పారావు బహద్దరుగారు పరిషత్పోషకులైరని విన్నవింపఁ గలిగినందు కెంతయు సంతసించుచున్నారము. యావజ్జీవసభ్యులలో నొకరు కాలధర్మము నొందిరి. అయిదుగురు క్రొత్తగాఁ జేరిరి. నేఁటి యావజ్జీవసభ్యులసంఖ్య 29.

సంవత్సరమధ్యమున నూతనముగ 97 గురు సాధారణ సభ్యులుచేరిరి. ప్రాఁతసభ్యులలో 40 మంది చందాలనీయక పోవుటచే వారిపేరులు తొలఁగించుట యైనది. కావున వర్షాంతమందున్న సభ్యులసంఖ్య 174. ముగ్గురుసభ్యులఁ గ్రొత్తగాఁ జేర్చినందున నిప్పటి గౌరవార్థసభ్యులసంఖ్య 29 యై యున్నది.

ప్రథమ ద్వితీయ తృతీయ సంవత్సరాంతములందుండిన సభ్యులసంఖ్య నీ క్రిందఁ జూడవలయును.

	ప్రథమసంవత్సరాంతమున	ద్వితీయసంవత్సరాంతమున	తృతీయసంవత్సరాంతమున
ప్రతిష్ఠాపకులు	2	2	2
పోషకులు	5	5	6
యావజ్జీవసభ్యులు	25	* 25	29
సాధారణసభ్యులు	58	117	174
గౌరవార్థసభ్యులు	,,	26	29
	90	175	240

కార్యనిర్వాహకసభ.

గతవార్షికసభలో వేమవరపు రామదాసుపంతులుగారు, తాడూరి లక్ష్మీనరసింహారావుపంతులుగారు—వీరిద్దఱిని సభ్యులుగాఁ జేర్చుట యైనది. మఱియు వేదము వేంకటరాయశాస్త్రిగారు తమ కార్యదర్శిత్వమును వదలుకొన్నందున వారికిబదులు నెమలి పట్టాభిరామారావుపంతులుగారిని కార్యదర్శిగాను, శ్రీవేంకటగిరి మహారాజావారిని సభాపతిగను ఆసభయందే యేర్పాటు చేయుటయైనది.

ఆ య వ్య య ము లు.

ఆయము.

గతసంవత్సరమందు రు 25055-2-2 వసూలైనవి. ప్రతిష్ఠాపకులియ్యవలసిన ధనమంతయు నిచ్చివేసినారు. పోషకులవలన రు 2800 లు, యావజ్జీవసభ్యులవలన రు 1715 లు, సాధారణసభ్యులవలన రు 324 లు, అనఁగా మొత్తము రు. 4839 రావలసియున్నది. ఇందులో రు 130 లు పిదప వసూలయినవి. కావున నేఁటివఱకు రు 4709 లు రావలసియున్నది.

వ్యయము.

సంవత్సరారంభమున మన మనుకొన్నదానికంటె వ్యయము తగ్గినది. ముఖ్యముగా నిఘంటువునుగుఱించిన వ్యయము తక్కువయైనది. అంతకంటె నధికధనము వ్యయపఱచుట కవకాశము లేకుండెను. పుస్తకము లచ్చు వేయించుపని యీ సంవత్సరమునం దగును.

---

* పరీధావికార్యనివేదనములో 26 అనివేయుట పొరపాటు.

అయవ్యయముల వివరణ మీఁ క్రిందఁ జూడనగును.

ఆయము.

పిఠాపురము రాజుగారు నిఘంటు నిర్మాణమునకొసఁగిన విరాళము.		2000-0-0
ప్రతిష్ఠాపకుల చందాలు		19000-0-0
పోషకుల చందాలు		2000-0-0
యావజ్జీవ సభ్యుల చందాలు		285-0-0
సాధారణ సభ్యుల చందాలు		843-4-0
విరాళము		12-0-0
పత్రిక చందాలు		333-0-0
పత్రికల క్రయము		75-0-0
వి. పి. కర్చుల జమ		56-15-0
చిల్లర ఆదాయములు		0-8-0
బాడుగల వలన జమ		33-8-11
అడ్వాన్సు ముజరా		75-0-0
గవర్నమెంటు పత్రములమీఁద వడ్డి		340-14-3
జమ మొత్తము		25,055-2-2
సంవత్సరాదిని నిలువ:—		
మదరాసు బాంకులో	660-4-0	
ఆఫీసులో	210-15-0	871-3-0
మొత్తము		25,926-5-2

వ్యయము.

జీతములు		887-15-11
చిల్లర అచ్చుకూలి		136-7-0
పుస్తకభాండాగారము (అచ్చు పుస్తకములు)		233-14-0
వ్రాఁతపుస్తకముల సంపాదించిన యిద్దఱి జీతములు బత్తెములు		356-8-2
ప్రయాణపు ఖర్చు బత్తా		141-11-9
అడ్వాన్సు		25-0-0
రిజిస్ట్రేషను, ఆడిటరు ఫీసు		100-0-0
ఆఫీసు బాడుగ		275-0-0
పోస్టేజి		78-3-6
కాగితములు కలములు వగైరా		44-7-11
చిల్లర కర్చులు		121-3-7
కుర్చీలు వగైరా సామానులు		93-14-0
హెచ్చు వసూలు వాపసు		4-12-0
పత్రిక కాగితములు	270-14-0	
డిటో అచ్చుకూలి	375-7-0	
డిటో చిత్తరువులు	66-12-0	
పత్రిక పోస్టేజి	158-11-3	871-12-3
నిఘంటుజీతములు పండితులకు	686-3-9	
డిటో అచ్చుకూలి	26-8-0	
డిటో చిల్లర కర్చు	5-2-0	717-13-9
మొత్తము		4,088-11-10
నిలువ-గవర్నమెంటు పత్రములు 3½%	10000-0-0	
ఫిక్సెడ్డు డిపాజిట్టు	7500-0-0	
మరాసు బాంకులో	4238-8-6	
ఆఫీసులో	99-0-10	21,837-9-4
మొత్తము.		25,926-5-2

గుళ్లపల్లి నరసింహాము.

ఆడిటరు.

నెమలి పట్టాభిరామరావు.

పురాణము నాగభూషణము.

ఆచంట లక్ష్మీపతి.

జాయంటు సెక్రెటరీలు.

పరిషత్సర్వాదాయము.

నేటివఱకుఁ బరిషత్తునకు రు. 47,267-10-5 లు విలువగల యాస్తి యున్నది. ఇందులో రు. 21,837-9-4 లు రొక్కము. తాటియాకుపుస్తకముల వెల రు. 18000 లు అచ్చుపుస్తకములు కలసి పుస్తకభాండాగారము వెల రు. 18,677-13-0 లు, మిగిలినది కుర్చీలు, బల్లలు, బీరువాలు, నిలువయున్న కాగితములు మొదలగువాని విలువ.

ఇందులవివరణ మీక్రిందిపట్టికవలనఁ దెలియును.

I. పరిషత్తు జనరల్ ఫండు.	**I. పరిషత్తు జనరల్ ఫండు.**		
చిల్లరబాకీలు—335-13-5	3½% గవర్నమెంటు పత్రములు	10000-0-0	
ఫండు నిల్వ—44931-13-0	మద్రాసు బ్యాంకులో ఫిక్సెడు డిపాసిట్టు	7500-0-0	
	మద్రాసుబ్యాంకిలో నిల్వ	3026-6-3	
	ఆఫీసులో నిల్వ	99-0-10	
	ఆఫీసులో స్టాంపులు	0-9-0	
			20626-0-1
	వసూలు కావలసిన చందాలు	4839-0-0	
	వసూలు కావలసిన వీపీలు	24-14-0	
	కుర్చీలు వగైరాసామానులు (3½% మినహాయించఁగా)	247-14-0	
	కాగితములు	87-0-0	
	పత్రికలు (25% మినహాయించగ)	672-0-0	
	పుస్తకభాండాగారము (10% మినహాయించగా)	677-13-0	
	తాటాకు పుస్తకములు (వ్రాత ప్రతులు సుమారు విలువ	18000 0-0	
			24548-10-0
	రివిన్యూగోష్వారా దాఖలానష్టము		93-1-4
45267-10-5	మొత్తం		45267-10-5
II. పరిషత్తు నిఘంటుఫండు 2000-0-0	**II. పరిషత్తు నిఘంటు ఫండు.**		
	నిఘంటు లెక్క దాఖలా 787-13-9		
	మద్రాసు బాంకిలో నిల్వ 1212-2-3		
			2000-0-0
47267-10-5	మొత్తం		47267-10-5

గుళ్లపల్లి నరసింహాము.
ఆడిటరు.

నెమలి పట్టాభిరామరావు.
పురాణము నాగభూషణము.
ఆచంట లక్ష్మీపతి.
జాయింటు సెక్రెటరీలు.

పరిషత్పత్రికాప్రకటనము.

గతసంవత్సరము మూఁడుమాసముల కొకసంచిక చొప్పున నాలుగుసంచికలు వెలువడినవి. ముద్రణశాలలో జరిగిన యాలస్యమునుబట్టి కొన్నిసంచికలు సకాలమున వెలువడఁజాలనందులకుఁ జింతిల్లుచున్నాము. స్వీయమగు ముద్రణయంత్రము లేనపుడు కాలవిలంబమును దప్పించుకొనుట కష్టసాధ్యముగాఁ గనుపట్టుచున్నది. నేఁటివఱకు వెలువడిన యాఱుసంచికలయందుఁ బ్రకటింపఁబడిన వ్యాసములశీర్షికలును, వ్యాసకర్తలపేళ్లును 3 వ యనుబంధమునఁ గనవచ్చును. తొలుత నిర్ణయించుకొనినదానికంటె నధికముగ సంచికకు నూఱుపుటలకుఁ దక్కువకాకుండ విలువగల కాగితములపై నచ్చువేయించుచున్నారము. పరిషత్సభ్యులు గాక పత్రికకు చందాదారులు సంవత్సరారంభమున 41 మందిమాత్రమే యుండిరి. ఇప్పుడు 124 గురు గలరు.

ఈపత్రికలోఁ బ్రకటించుటకై తామ్రశాసనములు దుగ్గిరాల సూర్యప్రకాశరావుగారు, మొక్కపాటి సుబ్బారాయఁడుగారు, ఉకుమళ్ల అచ్యుతరావుగారు, ఆచంట వేంకటసుబ్బరాయఁడుగారు నిచ్చియున్నారు. వారికి వందనము లొనర్చుచున్నారము.

ఏలూరునకుసమీపమందున్న నాయుడుగూడెములో ప్రాఁతడబ్బులు కొన్ని దొరకినవి. వానిని బరీక్షించి యవి చాళుక్యరాజులనాఁటి నాణెములనియు, నేడవ క్రైస్తవశతాబ్దమునఁ బుట్టి యుండవచ్చుననియు మదరాసు మ్యూజియం అధికారిగారు వ్రాసినారు. ఇట్టిశాసనములు నాణెములు నెవరికైన లభించినయెడలఁ బరిషత్తునకుఁ బంపవలయునని వేఁడుచున్నారము.

పుస్తకభాండాగారము.

గతసంవత్సరము 153 ముద్రితపుస్తకములును, 1318 లిఖితపుస్తకములును సంపాదితములైనవి. వీనితోఁ గలసి యిప్పుడు 358 అచ్చుపుస్తకములును, 1697 వ్రాఁతపుస్తకములును గలవు. అచ్చుపుస్తకములలో నిప్పుడు సాధారణముగ వెలకు దొరకనట్టియు దేశచారిత్రభాషావిషయ పరిశోధన కధికోపయోగకరము లగునట్టియు నపూర్వగ్రంథములు పెక్కులుగలవు. వర్తమాన గ్రంథకర్తలు తమగ్రంథముల నొక్కొక్కప్రతిచొప్పునఁ బరిషత్తున కిచ్చెదరేని గృతజ్ఞతాపూర్వకముగ నందికొందుమని యిందుమూలముగా విన్నవించుచున్నారము. వ్రాఁతపుస్తకములలో భారతసంపుటములు 447 ఉన్నవి.

వ్రాఁతపుస్తకములు.

వ్రాఁతపుస్తకములను సంపాదించుటకు దేవగుప్తాపు భరద్వాజముగారిని, యన్. రంగనాథరావుగారిని నియమించుటయైనది. భరద్వాజముగారు గోదావరీకృష్ణాజిల్లాలయందును, కొంచె

ముకాలము కమ్మంమెట్టు, ఓరంగల్లు పట్టణములందును సంచరించి యనేకగ్రంథములేగాక పలువురుసభ్యులను, బత్రికకుఁ జందాదారులను సంపాదించిరి. రంగనాథరావుగారును శ్రద్ధతోఁబనిచేసి కడప, చిత్తూరుమండలములలో ననేకపుస్తకములను సంపాదించిరి. ఈగ్రంథముల నన్నిటి నిప్పుడు కాగితముమీఁద వ్రాయింపవలయుననిన రు 18000 లకుఁ బైఁగాఁబట్టును. తాటియాకుపై వ్రాయఁగలవారున్నచో వారెంత యడుగుదురో తెలియదు. ఈగ్రంథములన్నియు ద్రవ్యము తీసికొనకయే పరిషత్తునకొసఁగిన భాషాభిమానుల కివే యనేక కృతజ్ఞతాపూర్వకవందనము లాచరించుచున్నారము. అధికపుస్తకముల నిచ్చినవారలపేరులు 4 వ యనుబంధమునఁ గనవలయును.

కొసడుమువచ్చిన 447 సంపుటములకుఁ దప్ప తక్కిన సంపుటములకు—అనఁగా 1250 సంపుటములకుఁ బట్టిక సిద్ధముగానున్నది. ఈ పుస్తకములఁ బరిశోధించి వానికి సవిస్తరమగు పట్టిక (Descriptive Catalogue) ముందుఁ బ్రకటింపవలసియున్నది. శిథిలముగానున్న ప్రతులలోని గ్రంథము కాగితముమీఁద వ్రాయింపవలసియున్నది.

దేశచరిత్ర సంబంధవిషయములఁగూర్చి దొరతనమువారేఁటేఁటఁ బ్రకటించు నుత్తరువులు (Reports of the Archæological Department), దక్షిణహిందూదేశశాసనములు (South Indian Inscriptions) అను గ్రంథములను వెలనీయ నక్కఱలేకయే యింతటినుండి మనపరిషత్తున కిచ్చునట్లాజ్ఞనొసంగి యిప్పుడు సిద్ధముగానున్న యుత్తరువులను బుస్తకములను దయచేసియున్నారు.

పుస్తకములుగాని వార్తాపత్రికలుగాని యిష్టమున్నవారు వచ్చి చదువుకొనుట కవకాశము కల్పింపఁబడియున్నది.

నిఘంటు నిర్మాణము.

పరిభాషాపదసంపాదనము.

నిఘంటు నిర్మాణపద్ధతి నిర్ణయించుట కొక యుపసంఘ మేర్పడెనని పూర్వసంవత్సర కార్యనివేదనమువలన మీకుఁ దెలిసియే యున్నది. ఆసంఘసభ్యులు గతసంవత్సరమధ్యమున సమావేశమై జయంతి రామయ్యగారివ్యాసములో నుపపాదితమైన పద్ధతిప్రకారమే నిఘంటు రచింపవలయుననియుఁ దదంగముగా భారతప్రయోగానుక్రమణిక (Verbal Concordance of the Bharata) నొకదానిని గూర్చుటయు, నాంధ్రదేశమం దాయామండలములందు వివిధములగు వృత్తులయందు వాడుకలోనున్న పరిభాషాపదములను సంపాదించుటయు నను నీరెండుపనులు ప్రథమమున జరగవలసినవనియుఁ దీర్మానించిరి. ఆతీర్మానముప్రకారము పరిభాషా

పదములు వ్రాసితెచ్చుట కాంధ్రాంగ్లేయ భాషాపరిజ్ఞానముగల హోతా వెంకటకృష్ణయ్యగారిని నియమింపఁగా నాయన శ్రీకాకుళమందారంభించి యిప్పటికి నెల్లూరువఱకునుగల ముఖ్యపట్టణములకుఁ జని యందు వాడుకలోనున్న శబ్దముల నెత్తి వ్రాసియున్నారు. ఇతరప్రదేశముల కీసంవత్సరము పోవలసియున్నది. పరిశీలింపఁగా నిప్పుడు వ్యవహారములో 66 వృత్తు లున్నట్లేర్పడినది. ఈవృత్తులపేళ్లును, వానికి సంబంధించినపదముల నెత్తి వ్రాయుటలో గమనింపవలసిన నియమములును 1-వ యనుబంధములోఁ జూడనగును.

భారతప్రయోగాను క్రమణిక.

భారతమం దేశబ్ద మేపర్వమున నేయాశ్వాసములో నెన్నవపద్యమందుఁ బ్రయోగింపఁబడినదో తెలుపుటయే భారతప్రయోగాను క్రమణిక ప్రయోజనము. ఇట్టిగ్రంథము లాంగ్లేయాదిభాషలలో నున్నవికాని మనదేశభాషలం దింతవఱకు నెక్కడ నున్నటులఁ దోచదు. ఈ యనుక్రమణిక నిఘంటువులో నుదాహరింపవలసిన భారతప్రయోగవాక్యముల సుకరముగ వెదకుట కుపకరించుటయేగాక, భారతప్రయోగదర్పణముగఁ బండితుల కత్యంతోపయోగకరముగాఁగూడ నుండును.

1. బ్రహ్మశ్రీ ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రులుగారు,
2. ,, మల్లాది సూర్యనారాయణశాస్త్రులుగారు,
3. ,, దండిగుంట సూర్యనారాయణశాస్త్రులుగారు,
4. ,, శ్రీపాద నరసింహశాస్త్రులుగారు,
5. ,, పురాణము సూర్యనారాయణతీర్థులుగారు,

అను నీయైదుగురుపండితులు నీపనిఁ జేయుచున్నారు. నేఁటివఱకు, ఆది, భీష్మ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీపర్వములు, ఆరణ్య, విరాటపర్వములలోఁ గొంత భాగమును నైనవి. వర్తమానసంవత్సరమందుఁ దక్కినపర్వములఁ బూర్తిచేయుటయేగాక వ్రాసినదంతయు నేకముఖముగావించి గ్రంథరూపముగా సమకూర్పవలసియున్నది. ఇందుకుఁ దగినయేర్పాటులు చేయఁబడును. అనుక్రమణికా సంఘటనము విషయమైన నియమములు 2-వ యనుబంధమునఁ జూడనగును.

వర్తమాన వర్షమందుఁ బూర్వోక్తకార్యముల రెంటిని నెఱవేర్చుటయే గాక, యాంధ్రగ్రంథములఁ జదివి యేశబ్ద మేసందర్భమున నేయర్థమందుఁ బ్రయోగింపఁబడినదో సోదాహరణముగ వ్రాయుటకును, బదముల వ్యుత్పత్తుల నరయుటకును దగిన విద్వాంసుల నియమింపవలసియున్నది. ఈపనులన్నియు నేకకాలమందే జరగుటకుఁ దగిన యేర్పాటులు చేయఁబడును.

ఈనిఘంటు నిర్మాణమునకై మదరాసుదొరతనము వారు పరిషత్తున కీసంవత్సర మిరువదివేలరూపాయల నీయ నిశ్చయించినారు. ఈ యౌదార్యము దొరతనమువారికి దేశభాషలయందుఁ గలవాత్సల్యమును మనపరిషత్తునందుఁ గల విశ్వాసమును జాటుచున్నది.

గ్రంథప్రకటనము.

భీమనఛందస్సను నామాంతరముగల "కవిజనాశ్రయ" మను నముద్రితచ్ఛందోగ్రంథమును బ్రకటించుటకై పరిషత్పుస్తకభాండాగారమునందును, రాజకీయ లిఖితపుస్తక భాండాగారమందును గలతాటియాకుప్రతులఁ బరిశోధించి పాఠభేదములతో శుద్ధప్రతియొక్కటి వ్రాయఁబడినది. గ్రంథము శీఘ్రముగా ముద్రింపఁబడును. ఈగ్రంథము వాదీంద్రచూడామణి యను జైనాచార్యుని శిష్యుఁడును, శ్రావకాభరణ, కవిజనాశ్రయబిరుదాంకితుఁడును, మల్లయకుమారుఁడును నగు రేచన రచియించినట్లు భీమకవి రచించె నని యున్నది. కర్ణాటకద్రావిడభాషలయందు జైనులచే రచియింపఁబడినగ్రంథము లనేకము లున్నవి. తెనుఁగునందు జైనసంబంధము గలగ్రంథ మింతవఱకు నిది యొక్కటియే కన్పట్టుచున్నది. కృష్ణరాయని రాజ్యకాలమందుఁ గర్ణాటరాజ్యస్థితిగతులను దెలియఁజేయు రాయవాచక మనువచనగ్రంథ మొకటి దక్షిణదేశమున దొరకినది. దేశచారిత్ర విమర్శనమునకుపకరించునది యగుటచే నందలి చరిత్రాంశములు స్పష్టముగాఁ దెలియునటుల టిప్పణముతోఁగూడఁ బ్రకటింపఁ దలఁచినారము. మూలమచ్చగుచున్నది. శ్రీనాథకృత మనివ్యవహరింపఁబడుచున్న పల్నాటి వీరచరిత్ర మనుద్విపదప్రబంధములో స్వల్పభాగము అక్కిరాజు ఉమాకాంతముగా రిదివఱలో నచ్చువేయించి యున్నారు. అచ్చుకావలసినగ్రంథము చాలనున్నది. దీనిప్రతి యొకటి సంపాదితమైనది. ఇదియు పాల్కురికి సోమనాథకృతగ్రంథ మొకటియు నీసంవత్సరము ప్రకటింపఁబడును. పల్నాటివీరచరిత్రప్రకటనమునకుఁ గావలసినధన మంతయు శ్రీ పిఠాపురమురాజుగారీయ నిశ్చయించినారని చెప్పుట కెంతయు సంతోషించుచున్నారము.

గద్యగ్రంథరచన.

భారత భాగవత రామాయణగ్రంథముల సారము సర్వసామాన్యముగ నందఱకుఁ దెలియునట్లు సలక్షణముగ సులభశైలిని వ్రాయించి ప్రకటింపవలయు నని కార్యనిర్వాహకసంఘమువారుచేసిన నిర్ణయముప్రకారము రామాయణసారము వావిలికొలను సుబ్బరావుగారును, భాగవతసారము కేతవరపు వేంకటశాస్త్రులుగారును వ్రాయఁబూని వ్రాయుచున్నారు. ఈ రెండుగ్రంథములుకూడ నీసంవ

త్సరమున నచ్చుగును. భారతసారరచనకుఁ దగిన యేర్పాటులుకూడ శీఘ్రముగాఁ జేయఁబడును.

గ్రామ్యవాదము.

పాఠశాలాంత్య పరీక్ష (School Final Examination) కుఁ బోవువిద్యార్థులాంధ్రవచనరచన సలక్షణభాషనైనను గ్రామ్యభాషనైనను యథేచ్ఛముగా వ్రాయవచ్చునని తత్పరీక్షావిధి నిర్ణాయకసంఘము (School Leaving Certificate Board) వారు చేసిన యేర్పాటును రద్దుచేయింపవలయు ననునుద్దేశముతో మదరాసు దొరతనమువారికి మనవిపత్రము పంపఁబడి యుండెనని పరీధావి సంవత్సర పరిషత్కార్య నివేదనమునందుఁ జెప్పియుంటిమికదా! దానిపర్యవసానమింతవఱకుఁ దేలలేదని నుడువుటకుఁ జింతించుచున్నారము. గతసంవత్సరమునందీవిషయమై వార్తాపత్రికాముఖమున చర్చ యధికముగా జరుగుటయే గాక రావు సాహేబు గిడుగు రామమూర్తిగారు గ్రామ్యవాదమును బురస్కరించుకొని నవీ

వాదప్రతివాదములు.

నాంధ్రము (Modern Telugu) అను శీర్షికతో నొక వ్యాసమాంగ్లేయభాషలో వ్రాసి ప్రకటించిరి. దీనికిఁ బ్రత్యుత్తరముగ జయంతి రామయ్యపంతులుగారు గ్రాంధికాంధ్రభాషాసమర్థనము (A defence of Literary Telugu) అను శీర్షికతో నొక వ్యాసము రచించి ప్రకటించిరి. ఈవాదమిట్లు జరుగుచుండఁగాఁ బాఠశాలాంత్యపరీక్షా విషయకమయిన పూర్వోదాహృత నిబంధనమును నిషేధించి రద్దుచేయవలయునని

విద్యాధికారిగారికి మనవి.

సహేతుకముగఁ గోరుచుఁ బరిషత్కార్యనిర్వాహక సభవారు విద్యాధికారిగారికి 1913 సంవత్సరము సెప్టెంబరు నెలలో నొకవిజ్ఞాపనపత్రము నంపఁగాఁ బరిషదభిప్రాయముల నంగీకరించుట కెంతమాత్రము నవకాశము లేదని యాయనగారు ప్రత్యుత్తర మొసఁగిరి. మఱికొన్ని దినములకు, మఱియేభాషలోను లేని యీప్రాచీన నవీనభాషావిభాగ మొక్కయాంధ్రభాషయందుమాత్రము చేయుట భాషాసంప్ర

శాసన నిర్మాణ సభా వృత్తాంతము.

దాయమునకును, శాస్త్రమునకును, లోకమునకును విరుద్ధము గాన నాభేదమును గల్పించిననిబంధనమును రద్దుచేయునట్లు విద్యాధికారిగారి కుత్తరువు లీయవలయుననియు నీయర్థమును వివరించి యనువదించుట కవకాశము కావలయుననియుఁ బరిషత్కార్య నిర్వాహకసభ్యులలో నొక్కరగు గౌరవనీయ బయ్యా నరసింహేశ్వర శర్మగారు దొరతనమువారిని వేఁడిరి. ఈవిషయమై 1913 సంవత్సరము నవంబరునెలలో సమావేశమైన శాసననిర్మాణసభలో సవిస్తరముగఁ జర్చజరగినది. ఆసమయమున గౌరవనీయులగు 1. మోచెర్ల రామచంద్రరావుగారు 2. ఏ.

యస్. కృష్ణారావుగారు 3. పి. కేశవపిళ్లగారు 4. నరసింహరాజుగారు 5. టి. వి. శేషగిరిఅయ్యరుగారు 6. వి. యస్. శ్రీనివాసశాస్త్రులుగారు వీరలందఱు నరసింహేశ్వర శర్మగారు ప్రతిపాదించిన యర్థమునే యేకగ్రీవముగ దృఢపఱిచిరి. వీరిలో శ్రీనివాసశాస్త్రులుగారు నిషిద్ధనిబంధనము పుట్టిన సమయమందుఁ దన్నిబంధనకర్తలలో నొకరుగానుండిరి. గ్రాంథికభాషవలెనే గ్రామ్యభాషకూడఁ బాఠశాలలలో బాలురకు నేర్పుచున్నారని యెవరో చెప్పఁగా నది నమ్మి (School Leaving Certificate) సంఘమువారా నిబంధనము చేయుట తటస్థించినదనియు, నిటీవల విచారింపఁగా గ్రామ్యభాషను బాఠశాలలలోఁ జెప్పుటలేదని తమకు నిశ్చయముగఁ దెలిసినది గావున ఆనిబంధన మవశ్యము నిషేధనీయమనియు వారు ప్రతిపాదించిరి. ఆసభలో వీరివాదమును ఖండించి గ్రామ్యవాదమును సమర్థించినవా రెవ్వరును లేకపోయిరి. అప్పుడు విద్యాధికారిపదము నధిష్ఠించి యున్న (Sir Alfred Bourne) గారు నరసింహేశ్వరశర్మగారు కోరినప్రకార మొనర్పుట కెంతమాత్ర మవకాశము లేదని తొలుత వాదించిరిగాని, చిట్టచివర కాయభిప్రాయమును మార్చుకొని మధ్యమపరీక్షాంధ్రవచనరచనాపద్ధతి నిర్ణయించుటకు విశ్వవిద్యాలయమువారిచే నియమింపఁబడిన సంఘము (University Intermediate Examination Telugu Composition Committee) వారు ఆవిషయమును గురించి చర్చించుచున్నారనియు, శీఘ్రకాలమునందే వారియభిప్రాయము తేలఁగలదనియు, నది తేలినపిమ్మట నాపద్ధతియే పాఠశాలాంత్యపరీక్షకుఁ గూడ వర్తించున ట్లుత్తరువు చేసెదమనియుఁ జెప్పుటచే నాచర్చ యంతటితో నంతరించెను.

మధ్యమ పరీక్షాంధ్ర వచనరచన నిర్ణాయక సంఘము.

గతవర్షమున రాజమహేంద్రవరములో సమావేశమైనపరిషత్సభలో మధ్యమపరీక్షాంధ్రవచనరచన సంఘమునుగూర్చి చర్చించి యాసభలోని సభ్యుల నియామకము బాగుగ నుండలేదనియు, భాషాభిజ్ఞుల మఱికొందఱఁ జేర్పవలెననియు విశ్వవిద్యాలయమువారిని గోరవలసినట్లు తీర్మానమై యాప్రకారము వారిపేర వ్రాయుట జరిగినది; గాని యందువలన ఫలమేమియుఁ గలుగలేదు. పిదపఁ గొన్నినాళ్లకాంధ్రలోకమున కంతకు నత్యంతము సంబంధించిన యిట్టి భాషావిషయమును విమర్శించుసభలోఁ దమదేశమువారి యభిప్రాయముఁ దెల్పుటకుఁ దమ దేశస్థులఁ గొందఱ సభ్యులఁగా నియమింపవలయు నని దత్తమండల (Ceded Districts Union) సమాజము వేఁడినమీఁదట విశ్వవిద్యాలయకార్యనిర్వాహక సంఘము (The Syndicate) వా రామనవి నంగీకరించి మఱి నలుగురు సభ్యులం జేర్చిరి. వీరితోఁ గలసి పదునలుగురు సభ్యులయిరి. వా రెవ్వరనఁగా—

1. గుమ్మిడూరు వెంకటరంగారావుగారు, ఎం.ఏ.,
2. కొమర్రాజు లక్ష్మణరావుగారు, ఎం.ఏ.,
3. వేదము వెంకటరాయశాస్త్రులుగారు.
4. జయంతిరామయ్యగారు, బి.ఏ., బి.ఎల్.,
5. కోలాచలము శ్రీనివాసరావుగారు.
6. టి, శంకరలింగంపిళ్లగారు, బి.ఏ., బి.ఎల్.,
7. నాగపూడి కుప్పుస్వామయ్యగారు, బి.ఏ.,
8. కె. సుబ్బారెడ్డిగారు బ్యారిష్టరు, బి.ఏ.,
9. పి. టి. శ్రీనివాసయ్యంగారు ఎం.ఏ.,
10. గురుజాడ అప్పారావుగారు, బి.ఏ.,
11. రావుసాహెబు గిడుగు రామమూర్తిగారు, బి.ఏ.,
12. బుఱ్ఱా శేషగిరిరావుగారు, ఎం. ఏ.,
13. రావుబహద్దరు మాలూరు రంగాచార్యులుగారు, ఎం.ఏ.,
14. R. W. రాసుగారు.

ఈ సభ్యులందఱుం జేరి కొన్ని తీర్మానములఁ జేసి వానిని విశ్వవిద్యాలయ కార్యసంఘము వారియొద్దకుఁ బంపియున్నారు. ఆసంఘమువా రావిషయమును బరిశీలించి యింకను దీర్పు చెప్పియుండలేదు. ఈ తీర్మానములలోఁ గొన్నిటికి సభ్యులందఱు నంగీకరించినట్లును మఱికొన్నిటి కల్పసంఖ్యాకు లగు కొందఱాక్షేపించినట్లును దెలియుచున్నది. విద్యాలయసభవారి తీర్మానమింకను బ్రకటింపఁబడి యుండనందున నీవిషయ మిచ్చటవిస్తరించి చర్చించుట కవకాశము లేదు.

దేశభాషా సేవ.

మధ్యమోత్తమ పరీక్షలకు (Intermediate and B. A. Examinations) దేశభాషాగ్రంథపఠన మైచ్ఛికముగాని యవశ్యముగాదని యూనివర్సిటీ సభవారు చేసిననిర్ణయము దేశభాషాభివృద్ధికి హానికరము గావున దానిని మార్పించుటకుఁ బ్రయత్నములు జరగుచున్నవని పూర్వసంవత్సర కార్యనివేదనము నందుఁ దెలియఁజేసియుంటిమి. ఈప్రయత్నములు కొంతవఱకు ఫలించినవని చెప్పఁగలిగితిమని సంతోషించుచున్నారము. గతించిన మార్చినెల 21 తేదియందు సమావేశమైన యూనివర్సిటీసభలో నీవిషయ మిట్లు తీర్మాన మయినది.

అదియెట్లనఁగా:—మధ్యమపరీక్షకు (Intermediate Examination) వచనరచనకు సహాయముగాఁ గొన్ని దేశభాషాగ్రంథములు చదువవలసినదనియు నుత్తమపరీక్ష (B. A. Examination) కభ్యసింపవలసిన విషయ విభాగములలో 4 వ విభాగము

యూనివర్సిటీవారి తీర్మానము.

లోఁ దర్కశాస్త్రమునకు బదులుగాను, 5 వ విభాగములో విశేషచరిత్రగ్రంథములకు బదులుగాను, 6 వ విభాగములో మఱియొక విషయముతోఁ జేర్చియు దేశభాషాగ్రంథములు విద్యార్థులకిష్టమైనచోఁ జదువవచ్చుననియుఁ దీర్మానించిరి. దేశభాషాభివృద్ధి కింతమాత్రము చాలునని తోఁచదు. మధ్యమపరీక్షకు నియమింపఁబడు గ్రంథములలో వేఱె పరీక్షయుండదు గావున నాగ్రంథములు విద్యార్థులు సవిమర్శముగాఁ జదువ నవసరముండదు. ఆధునిక గద్యగ్రంథములుమాత్రమే వచనరచన నుపచరించునని యెంచినచో, భాషాజ్ఞానమున కత్యంతావశ్యకము లగుపూర్వకవికృతగ్రంథములు చదువ నక్కఱలేకయేపోవును. ఉత్తమపరీక్షలో దేశభాషాగ్రంథములు చదువుటయుఁ జదువ కుండుటయు విద్యార్థుల యిచ్ఛాధీనమైయున్నది. క్రిందితరగతులలోనైన మాతృభాష చక్కఁగ నభ్యసింపకున్న నింతమాత్రపు మార్పులవలన లాభమంతగా నుండదు. కాని యిప్పటి కింతటితోఁ దృప్తి నొంది యుండవలసినదే.

పాఠశాలలలోఁ గావలసినమార్పులు.

పాఠశాలాంత్యపరీక్షకుఁ బోవువిద్యార్థులు కూడఁబ్రస్తుతము దేశభాషాగ్రంథములు చదువనక్కఱయే లేదు. కాని యింతటినుండి యవశ్యముగాఁ జదువవలసిన ట్లీసడుమ తీర్మానమయినట్లు వినుచున్నారము. ఇది శుభవార్త. పాఠశాలాశ్రేణు లన్నిటిలోను దేశభాషాగ్రంథపఠన మవశ్యకర్తవ్యము చేయుటయేగాక యంత్యపరీక్షలో నుత్తీర్ణుఁ డగునప్పటికి విద్యార్థి కనర్గళమయిన మాతృభాషాజ్ఞాన మేర్పడున ట్లాయాతరగతులకు నియామకమైన మాతృభాషాజ్ఞానపరిమితి హెచ్చింపవలయును. అట్లు చేసినఁగాని బాలురకు మాతృభాషాజ్ఞానము చక్కఁగాఁ గుదురదు. అట్లొనర్చినచో మీఁదితరగతులందు దేశభాషాసేవ నైచ్ఛికము చేసినను లోటుండదు. పూర్వపుఁ బల్లెటూరు బడులలో బాలురకు భారతాదిగ్రంథములు వినువారి కర్థమగునట్లు రాగయుక్తముగఁ జదువుట నేర్పెడువారు. ఇప్పుడున్ననో డిప్టీకలెక్టరుపదవికి యత్నించువారుకూడ వేమనశతకములోఁ బరీక్షయిచ్చి యందుమూలమునఁ దమ మాతృభాషాజ్ఞానమును స్థాపించుకొనవలసినవారైనారు! హస్తలిఖితపత్రములం జదివెడియభ్యాస మింగ్లీషు నభ్యసించువారిలో లేదనియే చెప్పవచ్చును. ఇది మిక్కిలి విషాదకరము.

దేశభాషాభివృద్ధికి మార్గములు.

దేశభాషాభివృద్ధి చేయుటయవశ్యమా? అయినచో దానికి మార్గమేది? యనువిచారము మనకుమాత్రమేగాక కొందఱాంగ్లేయులకును గలిగినది. ఈ నడుమ నీవిషయమై కొందఱు విద్యాధికు లగునాంగ్లేయు లీదేశమునందును ఇంగ్లాండునందును గూడ నుపన్యాసమూలమునను వార్తాపత్రికాముఖమునను జర్చించియున్నారు.

మనదేశమం దాంగ్లేయవిద్యాభ్యాసమారంభము కాకమునుపు దేశీయవిద్యలః ముఖ్యమా లేక యాంగ్లేయవిద్యముఖ్యమా యనునంశ మప్పటి రాజకీయోద్యోగులు చర్చించి మెకాలే దొర (Lord Mecaulay) గారి యభిప్రాయానుసారముగ నాంగ్లేయభాషయు దానిమూలమున నితరవిద్యలును రాజకీయపాఠశాలలలో నేర్పవలసినట్లు నిర్ణయించిరి. ఆపద్ధతి నేఁటివఱకుఁ బ్రచారములోనున్నది. సంస్కృతభాషయందును, దేశభాషలందును గల గ్రంథములు పుక్కిటి పురాణములనియు, వానిలో విశ్వసనీయములగు నంశములేమియు లేవనియు, గావున నాగ్రంథములు చదువుటవలన వృథాకాలక్షేపమేగాని లాభములేదనియు మెకాలేదొరగారభిప్రాయపడిరి. ఈయభిప్రాయము పొరపాటునఁ గలిగినదేగాని న్యాయముగాదనియుఁ, బ్రాచీనవిద్యలు సంస్కృతభాషయం దిమిడియుండుటచే నాభాష యత్యంతోపయోగకరమనియు, నాంగ్లేయభాషావ్యాప్తి యధికమగుటచే దేశీయవిద్యలు చాలమట్టు కడుగంటెనవనియు నిటీవల నీభరతఖండమునందేగాక ఖండాంతరమందుఁగూడఁ బలువు రెంచుచున్నారు. అన్నివిద్యలు దేశభాషల మూలముననె నేర్పుట మేలనియు నందుకుఁ దగిన దేశీయవిశ్వవిద్యాలయముల నచ్చటచ్చట నిర్మింపవలసినదనియుఁ గొందఱమతము. ఇప్పుడున్న యేర్పాటులలో మార్పులేమియుఁ గాఁగూడదని మఱికొందఱ యభిప్రాయము. సమబుద్ధితో నీ రెండుమతములఁ బరిశీలించిచూడ దేశభాషలను దేశీయవిద్యలను వృద్ధిచేయుట యావశ్యకమనియు, నాంగ్లేయభాషాభ్యాసము గూడ నావశ్యకమే యనియుఁ జెప్పక తప్పదు. విద్యలలోఁ గొన్ని ప్రాచీనములనియు మఱికొన్ని నవీనములనియు విభాగింపవచ్చును. ప్రాచీన విద్యలకు సంబంధించిన గ్రంథములన్నియు నీదేశమందు సంస్కృతభాషయందేపుట్టి వానిలోఁ గొన్ని దేశభాషలలోనికిఁ బరివర్తనము గాఁబడియున్నవి. ఈ విద్య లన్నియు నీకాలమున కనుపయోగములని చెప్పుటకవకాశములేదు. కావున స్వదేశ సాంప్రదాయములఁ దెలిసికొనుటకా గ్రంథము లవశ్యపఠనీయములు. ఇటీవల నూతనవిద్యలనేకములు పాశ్చాత్యదేశములందుఁ బుట్టియున్నవి. నానాఁటికిఁ బుట్టుచున్నవి. ఈ విద్యలనభ్యసించుటకు ముఖ్యసూత్ర మాంగ్లేయభాష. ఈకారణమునను రాజభాషయగుటనుగూడ నీభాష మనకభ్యసనీయము. ఈ భాషలోని గ్రంథములను దేశభాషలలోనికిఁ బరివర్తనము చేసి క్రమక్రమముగ నాభాషల వృద్ధిచేసినయెడల నవివృద్ధిపొందును. అందుకుఁ దగినప్రయత్నమే మనమిక నిప్పటినుండియుఁ జేయుచుండవలయును. ప్రస్తుత స్థితినిబట్టి చూడఁగాఁ బాఠశాలాంత్యశ్రేణివఱకును గల క్రిందితరగతులలో నాంగ్లేయభాషకుఁ బ్రస్తుతముగల గౌరవము కొంచెము తగ్గించి, దేశభాషాపరిశ్రమము హెచ్చగునట్లేర్పాటు చేయవలయును. పై పరీక్షల కాంగ్లేయభాషాపరిశ్రమమే ముఖ్యముగా నుండవచ్చును.

ఆంధ్రభాషాభిమానము.

ఆంధ్రదేశమునం దిటీవల నుత్సాహక్రియాశక్తు లుద్భవిల్లి నానాఁటికి వృద్ధినొందుచున్నవి. ఈ శక్తులు మితిదప్పి నిరంకుశములై పోక యుక్తముగా వినియోగింపఁబడినచో దేశమునకు శుభప్రదము లగుననుటకు సందేహము లేదు. దేశాభిమాన మనేకముఖములుగాఁ బ్రసరించును. వానిలో భాషాముఖ మగ్రగణ్యము. దేశభాషాభిమానము లేక దేశాభిమానము గలుగదు. కలిగినను నిలువదు. కావున భాషావిషయమై కూడ మనదేశమం దనేకయత్నములు జరుగుచుండుట సంతోషకరము. ఆంధ్రవార్తాపత్రిక లధిక మగుచున్నవి. ఇదివఱలో వారమున కొకసారి వెలువడుచున్నయాంధ్రపత్రిక యిప్పుడు దినదినము వెడలుచున్నది. ఇది యధిక వ్యయప్రయాసములచేఁ గాని సాధ్య మగుపని కాదు. ఆంధ్రవిజ్ఞానసర్వస్వముగూడ నట్టిదే. ఇదిగాక, యనేక నూతనగ్రంథము లచ్చటచ్చట బయలుదేఱుచున్నవి. పెద్దలకుమాత్రమే గాక పిన్నలకుఁగూడఁ దగినపుస్తకములు బయలుదేఱుచున్నవి. ఇది యెంతయుఁ బ్రశంసనీయము. తెలుగుపుస్తకములు చిన్నయక్షరములతోఁ బలుచని కాగితములమీఁదఁ దప్పుల తడికలుగా ముద్రించునభ్యాస మిప్పటికిని బొత్తిగా నిలిచిపోలేదు. పెద్దయక్షరములతో దళసరికాగితములమీఁద నిర్దుష్టముగా ముద్రించినంగాని, గ్రంథములు పాఠశాలలలోఁ బఠనార్హములు కావు. ఇంతియకాక దేశమం దనేకప్రదేశముల నానాఁటికి బయలుదేఱుచున్నపుస్తకభాండాగారములు వర్ధమాన విద్యాసక్తిని బ్రకటించుచున్నవి. అచ్చటచ్చట 58 పుస్తకభాండాగారము లున్నట్లు తెలియవచ్చుచున్నది. ఏతద్విషయమై ముందుఁ జేయఁదగిన కార్యముల నిర్ణయించుటకీనడుమ బెజవాడలో నొక్క మహాసభకూడ జరగియున్నది. చెన్నపట్టనమందలి యాయుర్వేద మహాపాఠశాలయందు సంస్కృతమురాని యాంధ్రవిద్యార్థులకుఁ దెలుఁగుననే వైద్యవిద్య నేర్పుటకేర్పాటీనడుమఁ జేయఁబడినది. గౌరవనీయులగు శ్రీపానుగంటి రామారాయనింగారు తెలుఁగున నాధునికశాస్త్రసంబంధగ్రంథముల రచింపించుటకై పదివేలరూపాయలు యూనివర్సిటీవారిమూలమున నిచ్చియున్నారు. ఇదివఱలోఁ దెలుఁగులో మాటలాడుటకును వ్రాయుటకును జంకువారిప్పుడు నిరాతంకముగ నుపన్యసించుచున్నారు. గ్రంథములు వ్రాయుచున్నారు. ఇంతవఱకు నేదో యొక ప్రతిబంధకముచే నడఁగియున్న శక్తి యాయడ్డము తీరఁగనే వెలువడినట్లు తోఁచుచున్నది. ఇట్లు బహుముఖములుగ నుద్భూతమైయున్న యీభాషాభిమానప్రవాహము సద్వినియోగమై శుభసస్యములఁ గూర్చుఁ గాత!

జయంతిరామయ్య,
కార్యనిర్వాహకసభాధ్యక్షుఁడు.

నెమలి పట్టాభిరామరావు.
పురాణము నాగభూషణము.
ఆచంట లక్ష్మీపతి.

అనుబంధములు.

1-వ యనుబంధము.

వృత్తులు.

1. (a) వ్యవసాయము=(కృషి.)	Agriculture.
(b) తోఁటలు, వనములు పెంచుట.	Gardening.
2. కట్టెలుకొట్టుట, బొగ్గులు కాల్చుట.	Wood cutting and charcoal making.
3. పశువులను పెంచుట.	Cattle breeding.
4. కోళ్లు నెమిళ్లు మొదలైనవానిని పెంచుట.	Poultry breeding.
5. గ్రుడ్లను పొదుగుట.	Hatching eggs.
6. పందులను పెంచుట.	Pig breeding.
7. గొల్లవృత్తి.	Sheep and goat breeding.
8. (a) జాలరి లేక పల్లివృత్తి.	The occupation of fishermen.
(b) పడవలు నడుపుట.	Boat playing.
9. (a) మృగములవేఁట.	Hunting wild beasts.
(b) పక్షులను బట్టుట.	Catching birds.
10. జూదము.	Gambling.
11. ప్రత్తిపట్టుట, దూదేకుట.	Cotton ginning and cleaning.
12. (a) ఉన్ని యేకుట, వడకుట.	Wool carding, spinning and weaving.
(b) కంబళ్లు, తివాచులు నేయుట.	Manufacture of blankets and carpets.
13. త్రాళ్లు, మోకులు, పగ్గములు పేయుట.	Rope making, &c.
14. మాదిగవృత్తి, తోళ్లసరకులుచేయుట.	Manufacture of leather and leather. articles.
15. వడ్రము, పెట్టెలు మొదలైనవి చేయుట, ఇండ్లుకట్టుట యిత్యాదులు.	Carpentry.
16. మేదరపని.	Basket making.
17. కమ్మరము.	Occupation of blacksmith, making articles of iron.
18. కంచరము.	Making articles of brass, copper and bell metal.
19. కమసాలిపని.	Occupation of gold and silversmith.
20. కుమ్మరిపని (కుమ్మరాటకము)	Pottery.
21. తెలుకులపని.	Oil manufacture.
22. బియ్యముదంచుట, పిండివిసరుట.	Rice pounding and rice grinding.
23. పంచదార, బెల్లమువండుట.	Sugar manufacture.
24. సారాయికాచుట.	Arrack manufacture and distilling.
25. కల్లుగీయుట, (ఈడిగవృత్తి.)	Drawing toddy.
26. పాగాలుచుట్టుట.	Making turbans.

27. కుట్టుపని.	Tailoring.
28. బుటేదారీపని.	Embroidery.
29. గొడుగులు బెత్తములు చేయుట.	Making umbrellas and canes.
30. చాకలిపని.	The occupation of a washerman, laundry.
31. అద్దకము లేక వర్ణములు వేయుట.	Dyeing.
32. మంగలిపని.	The profession of a barber.
33. సైరంధ్రీవృత్తి.	Toilet business.
34. పచ్చబొడుచుట.	Tattoeing.
35. ఒడ్డె లేక ఉప్పరవృత్తి (మట్టిపని)	Excavation and well-sinking.
36. రాయి మలచుట (కాసెపని).	Sculpture.
37. తాపీపని.	Brick laying and doing chunam and cement work.
38. ఇండ్లనేత.	House roofing.
39. చిత్రలేఖనము-ముచ్చుపని.	Painting and drawing pictures.
40. రత్నములతోఁ బనిచేయుట.	Working in precious stones.
41. మలామాపని.	Guilding.
42. గాజులుచేయుట.	Making bangles.
43. విగ్రహములుచేయుట.	Making idols.
44. రోడ్డువేయుట వంతెనలుకట్టుట.	Laying roads and constructing bridges.
45. బండితోలుట.	Cart driving.
46. గోడలుమొదలైనవి పెట్టుట.	Building walls, &c.
47. వడ్డివ్యాపారముచేయుట.	Money lending.
48. కలపవర్తకము.	Trade in wood and timber.
49. మందులవ్యాపారము.	Preparation and selling drugs and medicines.
50. బాణసంచా.	Manufacture of fire works.
51. పూటకూళ్లవృత్తి.	Inn (Hotel) keeping.
52. చిల్లరయంగడి పెట్టుట.	Purveying and selling sundry articles and victuals.
53. మితాయిపని.	Sweetmeat manufacture.
54. నల్లమందు గంజాయి వీనివ్యాపారము.	Trade in opium and ganja.
55. కుంకుమ పసుపు దువ్వెనలు మొదలగునవి యమ్ము దాసరివృత్తి. (బుక్కా).	Dealing in ready made articles of toilet such as saffron, turmeric, combs, &c.
56. బొమ్మలు చేయుట.	Manufacture of toys and dolls.
57. తలారివృత్తి.	Village watchman's profession.
58. పౌరోహిత్యము.	Priesthood.
59. పూజారివృత్తి.	Temple service.
60. వైద్యవృత్తి.	Medical profession.

61. పల్లుకట్టుపని.	Dentists art.
62. ముద్రణవ్యాపారము.	Printing.
63. బడిపంతులు పని.	Teaching Profession.
64. నాట్యము అభినయము.	Dancing and acting.
65. వండుట నీళ్లు మోయుట.	Cooking and water Carrying.
66. గారడి వృత్తి.	Jugglery.

ప్రతివృత్తికిని నాలుగువిధముల పారిభాషికపదములు సంపాదింపవలసియుండును. అవి యేవి యనిన:—

1. ఆయావృత్తులలో నుపయోగపడు పదార్థముల (Raw materials) పేరులు.
2. ఆపదార్థములతోఁ జేయుక్రియావిశేషముల (Processes of Manufacture) పేరులు.
3. ఆయాక్రియలు చేయుట కుపకరించెడు సాధనముల లేక పనిముట్ల (Instruments) పేరులు.
4. పైనుదహరింపఁబడిన సాధనసామగ్రిచేఁ జేయఁబడిన సరకుల (Finished articles) పేరులు.

ఇందుకుదాహరణముగా మొదటఁ గృషియనువృత్తిని బుచ్చుకొందము.

దీనికిఁ గావలసిన పదార్థములెవ్వియనన, భూమి, విత్తనములు, ఎరువులు, మొదలగునవి. వీనిని వివరించునపుడు రేగడ గరప మొదలగు భూవిశేషములను, వివిధములగు నెరువుల పేళ్లను, విత్తనముల పేళ్లను ఇత్యాదులు వ్రాయవలసియుండును. క్రియావిశేషముల క్రింద-దున్నుట, విత్తుట, వెదచల్లుట, గొర్తినివేయుట, నాటుట, కలుపుదీయుట యీ మొదలగు పనుల పేరులు వ్రాయవలయును. పనిముట్ల క్రింద-అరక, మేడి, కఱ్ఱు, గొఱ్ఱు, జడ్డిగపిడత యిత్యాది సాధనముల పేళ్లు వ్రాయవలయును. ఫలితవస్తువులు లేక సరకుల క్రిందఁ గృషివలనఫలించు ధాన్యాదుల పేరులు వ్రాయవలెను. ధాన్యముల పేళ్లును విత్తనముల పేళ్లును సమము గనుక ధాన్యముల క్రిందనే వ్రాయవలయును.

ఈప్రకారమే కమసాలివృత్తినిగుఱించి వ్రాయునపుడు, అందు కుపకరించెడు పదార్థముల క్రింద—వెండి, బంగారు, టంకము, వెలిగారము మొదలగు వస్తువుల పేళ్లు వ్రాయవలయును. క్రియావిశేషముల క్రింద- కరఁగుట, సాఁగఁగొట్టుట, కమ్మెచ్చునఁదీయుట యిత్యాది క్రియల పేరులు వ్రాయవలయును. పనిముట్ల క్రింద- దాగలి, సుత్తి, కమ్మెచ్చు, కుంపటి, గొట్టము మొదలగు వస్తువుల పేళ్లు వ్రాయవలయును. తయారైన లేక చేయఁబడిన వస్తువుల క్రింద నగల పేళ్లు వ్రాయవలయును.

ఈప్రకారమే యన్నివృత్తులకు వ్రాయవలయును.

1. ఈ నాలుగువిధములకంటె నధికవిధములశబ్దము లున్నయెడల నవికూడ వ్రాయవలెను.
2. ఆయావృత్తులకు సంబంధించిన శబ్దముల నన్నింటిని సమగ్రముగఁ దెలిసికొనవలయును.
3. ఏవృత్తికి సంబంధించిన యేవిధములోఁ జేరినశబ్దములు పట్టికయందు వ్రాయఁబడునో, ఆవృత్తిపేరును, ఆవిధముపేరును పట్టికమీఁదిభాగమున వ్రాసికొనవలయును.
4. వస్తువివరణ మనుగడిలో, ఆయావస్తువులయొక్క స్వరూపమును దెలుపునట్టి సంగ్రహవాక్యము (brief description) వ్రాయవలయును.

5. వస్తువుపేరు అనుదానిక్రిందనుండు గళ్లలో నాయాగ్రామములలో నాయావస్తువులకుఁ గలపేళ్లు వరుసగ వ్రాయవలెను. ఆయాగ్రామముల పేరులు పైగళ్లలో వ్రాయవలయును.

6. ఒకవస్తువున కనేకభేదములున్నప్పుడు, భిన్నపదార్థముల పేళ్లన్నియు వ్రాయవలయును.
ఉదా:—కత్తియనునది సామాన్యవాచకము. ఇందు, మంగలికత్తి, కలముచెక్కుకత్తి, కోడికత్తి, తరవారుకత్తి, యిత్యాదిభేదము లనేకములున్నవి. ఈభిన్నపదార్థముల వివరణము మొదటిగడిలో వ్రాసి పేళ్లు తరువాతిగళ్లలో వ్రాయవలెను.

7. అక్షరములు విడివిడిగాను, స్పష్టముగాను, స్ఫుటముగాను మంచిసిరాతో వ్రాయవలయును.

8. ఒక్కొక్క వృత్తికి సంబంధించినమాటలు వ్రాయునపుడు ఆవృత్తియందుఁ దెలివిగాఁ బనిచేయుచున్న యిద్దఱు ముగ్గురు మనుష్యులను దెలిసికొని వ్రాయవలయును. ఒకరికిఁ దెలియనిమాటలు మఱియొకరివల్లఁ దెలిసికొనవచ్చును. ఒకరియుచ్చారణము స్పష్టముగా నుండనియపు, డితరుల యుచ్చారణమును బట్టి శబ్దస్వరూపమును దెలిసికొనవచ్చును. కావున నొక్కనివలననేగాక యిద్దఱుముగ్గురివలన శబ్దములను దెలిసికొనుట మంచిది.

9. సాధారణముగాఁ బామరులు మనకుఁ గావలసినపదములన్నియు నొక్కసారి జ్ఞప్తికిఁ దెచ్చుకొని చెప్పఁజాలరు. వారిని గ్రుచ్చిగ్రుచ్చి యడిగి కావలసిన పదములను సంపాదింపవలెను.

10. పామరుల యుచ్చారణము సాధారణముగ స్పష్టముగానుండదు. అపు డొక్కమాటనే రెండుమూఁడుసారులు పలికించి సరియైన యుచ్చారణమును దెలిసికొనవలయును. వారు చెప్పిన మాటలను జెప్పినటులనే వ్రాయవలయును గాని తప్పుగానున్నవని దిద్దవలదు.

11. ఒకప్పు డొకశబ్దమునకే వివిధస్థలములలో వివిధరూపములుండును.
ఉదా:—బాడిద, బాడిదె, బాడిది, బాడిస, బాడిసె, బాడిసి.

ఇందులో నేగ్రామములో నేరూపము వాడుకలో నున్నదో యాగ్రామముక్రింద నారూపము నే వ్రాయవలయును.

"బాడిద" అనుపదములో 'ద' యందుండు "అ"కారమును గొందఱు "అ"కాక "ఎ"కాక యీరెంటికి నడుమ నుండునట్లుగా, అనఁగా "*at*" అను నింగ్లీషుపదములోని "*a*" వలె నుచ్చరింతురు. అట్టి యుచ్చారణమును వ్రాయవలసివచ్చినపుడు "బాడిద" అని వ్రాసి దాని ప్రక్కనుగాని క్రిందఁగాని (అ=a in *at*) అని వ్రాసి దానికిఁ గుండలీకరణము చేయవలయును.

12. ఒకవస్తువునకే యొక్కస్థలమందే నామభేదము లున్నపక్షమునను, ఒక్కపదమునకే యొక్కస్థలమందే రూపభేదము లున్నపక్షమునను, ఆయానామముల రూపముల నన్నింటిని వ్రాయవలయును.

2-వ యనుబంధము.

శ్రీమదాంధ్రభారత ప్రయోగానుక్రమణిక గూర్పవలసిన పద్ధతుల వివరణము.

ఈయనుక్రమణిక 1909-వ సంవత్సరమం దానందముద్రాక్షరశాలయందు వెలువడిన ప్రతి ననుసరించి కూర్పవలయును.

2. పద్యములకును వచనములకును పదవిభాగముచేసి యందున్నపదముల నన్నిటిని గళ్లుగీచిన కాగితముపై నొక్కొక్కగడిలో నొక్కొక్కపదము చొప్పున నొకదానిక్రింద నొకటి యథాక్రమముగా స్పష్టముగాఁ దెలియునటుల విడియక్షరములతో నల్లసిరాతో వ్రాయవలెను. ఆయాపదములక్రింద నేపద మేపర్వమునం దేయాశ్వాసములో నేపద్యమునం దున్నదో తెలియునటుల పొడియక్షరములతోను, అంకెలతోడను నీక్రిందఁ గనపఱచిన రీతిని గుర్తులు వేయవలెను.

1. ఉ. | చఱచి. / ఆ. 2.67. |

2. ఉ. | అడరఁగ / స. 1.31. |

ఇందు మొదటియుదాహరణములో గుఱుతునకు ఆదిపర్వమునందు రెండవయాశ్వాసములో నరువదియేడవ పద్య మని యర్థము. ఆప్రకారమే రెండవ యుదాహరణములోని గుఱుతునకు సభాపర్వము మొదటియాశ్వాసమునందు ముప్పదియొకటవ పద్యమని యర్థము. ఈప్రకారముగా నన్నిస్థలములందు వ్రాయవలెను.

ఆయాపర్వముల పేళ్లకు బదులుగా పొడియక్షరము లీక్రిందవివరించిన ప్రకారము వ్రాయవలెను.

ఆదిపర్వము	...	ఆ.	సౌప్తికపర్వము	...	సౌ.
సభాపర్వము	...	స.	స్త్రీపర్వము	...	స్త్రీ.
అరణ్యపర్వము	...	అర.	శాంతిపర్వము	...	శా.
విరాటపర్వము	...	వి.	అనుశాసనికపర్వము	...	అను.
ఉద్యోగపర్వము	...	ఉ.	అశ్వమేధపర్వము	...	అశ్వ.
భీష్మపర్వము	...	భీ.	ఆశ్రమవాసపర్వము	...	ఆ. వా.
ద్రోణపర్వము	...	ద్రో.	మౌసలపర్వము	...	మౌ.
కర్ణపర్వము	...	క.	మహాప్రస్థానికపర్వము	...	మ.
శల్యపర్వము	...	శ.	స్వర్గారోహణపర్వము	...	స్వ.

3. ఒక్కొక్కపద మొక్కొక్కగదిలో వ్రాయవలెను. అట్లిముడనియెడల రెండుమూఁడు గదులలోఁగూడ వ్రాయవచ్చునుగాని యొకగదిలో రెండుమూఁడు పదములుమాత్ర ముండఁగూడదు.

4. ప్రత్యయాంతములగుపదములు ప్రత్యయాంతములుగానే వ్రాయవలెను. ఉ. ఒడంబడితి, వచ్చుటంజేసి ఇత్యాదులు.

5. సమాసము లేకపదములుగా గ్రహింపవలయును.

6. ఒడంబడితి అనునది ఒడంబడితిని అనిగాని ఒడంబడితివి అనిగాని కావచ్చును. మధ్యమపురుషముగా నున్నప్పుడు పదాంతమున కుండలీకరణము (brackets) చేసి దాని మధ్యమున (వి) యనియు, ఉత్తమ పురుషమైనప్పుడు (ని) యనియు వ్రాయవలెను.

ఉ. ఒడంబడితి (వి).

ఒడంబడితి (ని).

ఈప్రకారమే యితర పదములకును.

7. చేసి, పొంటె, కొఱకై, పై, మెయి మొదలగు ప్రాచీన విభక్తిప్రత్యయములు, ఉన్ మొదలగు సముచ్చయార్థకములు, కాన్, కన్, కాఁగన్ అను క్రియావిశేషణములు, ఇత్యాదులతోఁ గూడినపదములు వచ్చినప్పుడు ప్రత్యయసహితములగు పదములనే వ్రాసి యాపదములపై యాయాప్రత్యయముల శీర్షికలుగా వ్రాయవలెను.

ఉ. $\frac{\text{కన్}}{\text{మనఁగన్}}$, $\frac{\text{ఉన్}}{\text{అంతయుఁ}}$

8. దానికి నీవొడంబడితి. ఇత్యాదిస్థలములందు ఛందోభంగము కానియెడల దానికిన్ + ఈవు అని యీవిధముగా పదవిభాగము చేయవలెను.

9. భగ్నులుగాన్. ఇత్యాది స్థలములం దర్థవంతములయిన కాన్, కన్ అనునవి ప్రత్యేక పదములుగా గ్రహింపఁబడవలసినది.

మనఁగన్ అనుచోట కన్ అనునది అనుప్రయుక్తము గాన ప్రత్యేకపదముగా వ్రాయఁగూడదు.

10. అవధారణార్థమందువచ్చు అ, ఎ, ఇత్యాదులును, సందేహార్థమందువచ్చు ఒ, ఒకో, ఇత్యాదులును, ఆశీరాద్యర్థములందువచ్చు కాత, త, ఎడు మొదలగునవియు, వికల్పార్థమందు వచ్చు ఏని, ఏన్, మొదలగునవియు, ప్రశ్నార్థమందువచ్చు ఏ, ఆలును ఆయాశబ్దములపై శీర్షికలుగా వ్రాయఁబడవలెను.

11. ఆచ్ఛికశబ్దముల కర్థభేదమున్నప్పుడు విశేషార్థములఁ బ్రకరణానుసారముగ పదము కుడిభాగమున = అను గుర్తువ్రాసి ప్రతిపదార్థమును వ్రాయవలెను.

12. వినరయ్యా, రావమ్మ, తక్కొఱుఁడు, వచ్చుచుండుదురు, లేదయ్యెడు, కాఁడయ్యె ఇత్యాదు లేకపదములని యెంచవలయును.

13. 'మాతలి పాణిగ్రహణం
బాతనిఁజేయించి.'

ఇత్యాదిప్రయోగవిశేషములను, ఛందోవిశేషములను వేఱుగా నొకకాగితముపై యెత్తి వ్రాయవలెను.

14. ఆశ్వాసము ముగిసినప్పుడు పదపట్టియాశ్వాసము వేఱుకాగితముమీఁద నారంభింపవలెను.

15. ప్రకృతి సరళవర్ణములు స్థిరవర్ణములు పరమగునప్పుడును, వాక్యాంతమందును ద్రుతము లోపించును. అట్టియెడలఁ బదచ్ఛేదములలో దానినిగనఁబఱుపనక్కఱలేదు.

ఇతరస్థలములందు, అనఁగా స్వత్వసంశ్లేషానుస్వారరూపములుగా మాఱినప్పుడు పదచ్ఛేదములలో ద్రుతమును జూపవలయును.

ఉదాహరణము.

వచ్చెగంగాధరుఁడు = వచ్చె + గంగాధరుఁడు

వచ్చెభూసురుఁడు = వచ్చె + భూసురుఁడు.

వాఁడువచ్చె = వాఁడు + వచ్చె.

ఈస్థలములందు ద్రుతమును జూపనక్కఱలేదు.

వచ్చెఁ గమలాక్షుఁడు
వచ్చెంగమలాక్షుఁడు
వచ్చెన్గమలాక్షుఁడు } = వచ్చెన్ + కమలాక్షుఁడు.

వచ్చెను గమలాక్షుఁడు = వచ్చెను + కమలాక్షుఁడు.

16. విదురుండై పుట్టి, పరాజితులై ఇత్యాదిస్థలములందు 'ఐ' యనునది ప్రత్యేకపదముగ గ్రహింపఁబడవలయును.

17. జూదంబాడు, పోరాడు, మాటాడు, ఏపారు, పాలుపారు, మేలుకొను, కూరుచుండు, తనరఁజేయుచున్, ఒడంబడవలయున్, ఆనతిచ్చి యిత్యాదు లేకపదములు.

18. నివర్తింపఁబడు, ఇత్యాదులలో పడు

రాఁగల, ఇత్యాదులలో కల

చేసికొను, ఇత్యాదులలో కొను

ఈ మొదలగు ననుబంధముల పదముల పై శీర్షికలుగాఁ జూపవలెను.

19. ఆచ్ఛిక మిశ్ర సాధ్య సమాసములను దొలుత నేకపదములుగాఁ జూపి యావెంబడినే భిన్నపదములుగఁ గూడఁ గనఁబఱుపవలయును. పదచ్ఛేదము చేయునప్పు డున్నరూప మున్నట్లు చూపవలయును. సాధ్య మిశ్ర సమాసములలోఁ జేరియుండు సిద్ధసమాసభాగముల నేకపదములఁగనే చూపవలయును.

ఉదాహరణము.

ఆచ్ఛికసమాసము - చెఱువునీరు {
1. చెఱువునీరు.
2. చెఱువు.
3. నీరు.

సాధ్యసమాసము - తటాకంబుజలము {
1. తటాకంబుజలము.
2. తటాకంబు.
3. జలము.

మిశ్రసమాసములు - ఈయనిభూమిపతులు {
1. ఈయనిభూమిపతులు.
2. ఈయని.
3. భూమిపతులు.

అక్కఁథకుండు	{	1. అక్కఁథకుండు.
		2. అ.
		3. కథకుండు.
నీతనయుఁడు	{	1. నీతనయుఁడు.
		2. నీ.
		3. తనయుఁడు.

ఈప్రకారము వ్రాయవలయును "ఈయనిభూమిపతులు" అన్నచో, భూమి + పతులు అని విభజింపనక్కఱలేదు.

20. "మహినొప్పు సర్వలోకాశ్రయుఁడు" ఇచ్చట 'ఒప్పు' అనునది సమాపకక్రియగాని విశేషణముకాదని తెలుపుటకు 'ఒప్పు' (ౕ) అని నకారము కుండలీకృతము చేయవలెను.

3-వ యనుబంధము.

పరిషత్పత్త్రికలోఁ బ్రకటింపఁబడిన వ్యాసములు, తత్కర్తలు.

1. ఆంధ్రసాహిత్యపరిషత్ప్రయోజనము.-చెన్నాప్రగడ భానుమూర్తిగారు, బి.ఏ.,
2. ఆంధ్రమహాకవిప్రశంస.-శతావధానులు, తిరుపతి వేంకటేశ్వరకవులు.
3. ఆంధ్రభాష.-మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు.
4. దేశచరిత్రస్వరూపప్రయోజనములు.-జయంతి రామయ్యగారు, బి ఏ., బి.ఎల్.,
5. చాళుక్యరాజరాజు నందంపూడి శాసనము.-జయంతి రామయ్యగారు, బి.ఏ., బి.ఎల్.,
6. ప్రకృతిశాస్త్రములు, వానియభివృద్ధి.-ఏచూరి నరసింహముపంతులుగారు, ఎం.ఏ.,
7. ఆంధ్రగద్యపద్యకావ్యములు.-నాగపూడి కుప్పుసామయ్యగారు, బి.ఏ.,
8. ప్రాచీనాంధ్రవచనకావ్యములు.-వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.
9. కవిగీతము.-వేంకటపార్వతీశ్వరకవులు.
10. ప్రకృతిశాస్త్రములు.-ఏచూరి నరసింహముగారు, ఎం.ఏ.,
11. రంజనకిరణములు.-వేమూరి విశ్వనాథశర్మగారు, ఎం.ఏ.,
12. గుణగవిజయాదిత్యుని, ఉరుటూరుశాసనము.-జయంతి రామయ్యగారు, బి.ఏ., బి.ఎల్.,
13. గ్రామ్యాదేశనిరసనసభ.-వేమూరి విశ్వనాథశర్మగారు, ఎం.ఏ.,
14. నవీనసంవత్సరము.-మంగిపూడి వేంకటశర్మగారు.
15. శుక్రనీతిసారము.-పురాణపండా మల్లయ్యశాస్త్రులుగారు.
16. శ్రీమహాభారతాంధ్రీకరణ విమర్శనము.- శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులుగారు.
17. కావ్యగీతము.-వేంకటపార్వతీశ్వరకవులు.
18. ద్రావిడభాషాపంచకనిరూపణము.-(౧వ భాగము) మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు.
19. అరవదేశమునందలి యాంధ్రవాఙ్మయము.-అక్కిరాజు ఉమాకాంతముగారు.
20. అనితల్లి కలువచేరుశాసనము.-జయంతి రామయ్యగారు, బి.ఎ., బి.ఎల్.,

21. మాతృభాషాసేవ-జయంతి రామయ్యగారు, బి.ఏ., బి.ఎల్.,
22. సంధివివేకము-వఝల చిన్నసీతారామశాస్త్రులుగారు.
23. కౌరవగౌరవము-రామకృష్ణకవులు.
24. ద్రావిడభాషాపంచకనిరూపణము-మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు.
25. ఆయుర్వేదాంగశల్యతంత్రము-వైద్యరత్న పండిత, డి. గోపాలాచార్యులు గారు.
26. దేశభాషలలో శాస్త్రపఠనము-కే. వి. లక్ష్మణరావుగారు, ఎం.ఏ.,
27. హిందువుల ప్రాచీనలోహపరిశ్రమము-వేమూరు విశ్వనాథశర్మగారు, ఎం.ఎ.,
28. ఆంధ్రభాషావిలాసము-ముమ్మంగి లక్ష్మీనరసింహశర్మగారు.
29. శాస్త్రపరిభాష-జయంతి రామయ్య, బి.ఏ., బి.ఎల్.,గారు.
కపిస్థళం కృష్ణమాచార్యులు, బి.ఏ., గారు.
30. సర్వలోకాశ్రయుని శాసనము. } జయంతి రామయ్యగారు, బి.ఎ., బి.ఎల్.,
31. మధురనాయకుల దానపత్రములు. }
32. శ్లేషకవిత్వము.-కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిలుగారు.
33. ప్రాఁదెనుఁగుఁగమ్మ-రావుసాహెబు గిడుగు వేంకట రామమూర్తిగారు, బి.ఏ.,
34. ఆంధ్రభాషాసంస్కరణము-మహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రిగారు.
35. గ్రామ్యవాదులభాషాపవాదము-పానుగంటి లక్ష్మీనరసింహరావుగారు.
36. కిరోసీనునూనె- తల్లాప్రగడ పానకాలరావుగారు, బి.ఏ.,
37. తొండమాన్ వంశావళి_నుదురుపాటి వేంకనార్యుఁడు.
38. హిందువులబీజగణితము-కపిస్థళము కృష్ణమాచార్యులుగారు, బి.ఏ.,
39. శృంగారరసవిమర్శనము-మల్లాది సూర్యనారాయణశాస్త్రిలుగారు.
40. ఆంధ్రనాటకములు-తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు.
41. ఆంధ్రభాష-వఝల చినసీతారామస్వామిశాస్త్రిలుగారు.
42. శాస్త్రపరిభాష-వ. ల. నరసింహస్వామిగారు.
43. శక్తివర్మపభుబజ్జుశాసనము-జయంతి రామయ్యగారు బి.ఎ., బి.ఎల్.,

4.వ యనుబంధము.

ఆంధ్రసాహిత్యపరిషత్తునకు ప్రాఁతప్రతుల నెక్కువగా నిచ్చినవారిపేరులు.

1. చంద్రాభట్ల జోగయ్యశాస్త్రిగారు.
2. ఓలేటి దక్షిణామూర్తిశాస్త్రిగారు.
3. బొగ్గవరపు బుచ్చయ్యశాస్త్రిగారు.
4. వెల్లాల వేంకటేశముగారు, కిచ్చమాంబాపురము.
5. సాదు అయ్యవారుగారు, మదనగోపాలపురము.
6. చెన్నరాయశాస్త్రిలుగారు, కంబాలగుంట.
7. చెంగమనాయఁడుగారు, చిన్నంపల్లి.
8. చెంచురామయ్యగారు, నగరిపాడు.
9. కామిసెట్టి నాగయ్యగారు, బిల్వపల్లి.
10. చెలమయ్యగారు, చక్రపనాయనిపేట.
11. చెంచురెడ్డిగారు, రంగుపల్లి.
12. నైషధం వెంకటరాయశాస్త్రిగారు, టంగుటూరు.
13. సుబ్బణ్ణాచార్యులుగారు, కుంపిణీపురము.

14. వెంకటసుబ్బయ్యగారు, పాచికాల్వఅగ్రహారము.
15. సూత్రం సుబ్బయ్యగారు, మందపల్లె.
16. మంత్రిప్రెగడ కొట్లయ్యగారు, అమలాపురము.
17. వక్కలంక రామబ్రహ్మంగారు, ముమ్మిడివరము.
18. మాచిరాజు అమ్మిరాజుగారికుమారుడు కామరాజుగారు, ముమ్మిడివరము.
19. నడింపల్లి లక్ష్మీపతిరాజుగారు, అల్లవరము.
20. దెందులూరి రామమూర్తిగారు, కస్తూరివారిపాలెము.
21. మాచిరాజు బాపిరాజుగారు, దేవగుప్తము.
22. పోచినపెద్ది వెంకటేశ్వరులుగారు, దేవగుప్తము.
23. పప్పు సుబ్బారాయశాస్త్రిగారు, పేరమ్మఅగ్రహారము.
24. గంటి కాశీపతి విశ్వనాథశాస్త్రిగారు, పేరమ్మఅగ్రహారము.
25. కస్తూరి శివశంకరకవిగారు, విశ్వేశరాయపురము.
26. సర్వా కృష్ణమూర్తిగారు, నర్సాపురము.
27. ఘొన్నపల్లి రామయ్యగారు, నర్సాపురము.
28. పెద్దింటి వెంకటప్పలాచార్యులుగారు, నర్సాపురము.
29. కొప్పర్తి రామచంద్రరావుగారు, సీతారామపురము.
30. మొగల్తూరురాజులు.
31. కందుకూరి తిరుపతిశాస్త్రిగారు, తాళ్లపూడి.
32. ఏలూరిపాటి రామభద్రచయనులుగారు, తాళ్లపూడి.
33. మలకపల్లి జోగిరాజుగారు, కొరుప్రోలు.
34. వొబిలినేని బుచ్చి వెంకటాద్రియుడుగారు, దంగేరు.
35. కాశీభట్ట కామేశ్వరిగారు, కస్తూరివారిసావరము.
36. నందివాడ వెంకటసుబ్బారాయడుగారు, పెదపాడు.
37. నోరి సీతారామశాస్త్రిగారు, ఏలూరు.
38. ప్రతివాదిభయంకరము రఘునాథాచార్యులుగారు, ఏలూరు.
39. మల్లంపల్లి కోటీశ్వరశాస్త్రిగారు, ఏలూరు.
40. మాడభూషి వెంకటరంగాచార్యులుగారు, బెజవాడ.
41. నెమలి పట్టాభిరామరావు పంతులుగారు, చెన్నపట్టనము.
42. జ్ఞానవిద్యుత్ప్రవాహినీ ఆంధ్రభాషానిలయము, కంభంమెట్టు.
43. కొడిమెల బసవయ్యగారు, వోరంగల్.
44. హరినేతూ రామయ్యగారు, వలవనూరు.
45. బెజ్జాగాముల తిప్పాభట్లుగారు, పెద్దతిప్పసముద్రము.
46. తాళంకి వెంకటపతిగారు, పెద్దతిప్పసముద్రము.
47. రమణాచార్యులుగారు, పెద్దతిప్పసముద్రము.
48. నీలకంఠావధానులుగారు, పెద్దతిప్పసముద్రము.
49. సంజీవయ్యగారు, పెద్దతిప్పసముద్రము.
50. లింగప్పగారు, పెద్దతిప్పసముద్రము.
51. మునిపల్లె సీతారామయ్యగారు, పెద్దతిప్పసముద్రము.
52. గంగవరం సీతారామయ్యగారు. ,,
53. ఆదిరామయ్యగారు. ,,
54. ప్రమథాటి సూరప్పగారు. ,,

విజ్ఞానచంద్రికా గ్రంథమాల.

ఆంధ్రులపౌరుషము! ఆంధ్రులమహోన్నత్యము!! ఆంధ్రులబుద్ధివైభవము!!!

ఆంధ్రులచరిత్రము.

రెండవభాగము.

ఇందు క్రీ.శ.1100నుండి 1350 వఱకుఁగల ఆంధ్రదేశచరిత్ర వర్ణింపఁబడినది.

పురాణములు, కావ్యములు, శాసనములు, విదేశీయుల వ్రాఁతలు, మొదలగువాని, నన్నింటిని శోధించి తెలుఁగుచోడులు, నాగవంశోద్భవులైన మహారాజులు కాకతీయచక్రవర్తులు, పల్నాటివీరులు, కమ్మవారు, రెడ్లు, వెలమలు మొదలగువారి చరిత్రలు, ఈ యుద్గ్రంథమునందు క్రోడీకరింపఁబడినవి.

రామానుజుఁడు, బసవేశ్వరుఁడు, నన్నెచోడ కవిశిఖామణి, ఖడ్గతిక్కన, కవితిక్కన, గణపతిదేవచక్రవర్తి, ప్రతాపరుద్రమహారాజు, మహారాణి రుద్రమదేవి, మొదలగువారల పవిత్రజీవితములు శ్రద్ధతో వ్రాయఁబడినవి.

ఆయాకాలమందలి సాంఘిక, రాజకీయస్థితులు చక్కఁగ వివరింపఁబడినవి. ప్రదేశములయొక్కయు, కట్టడములయొక్కయు, పటములు కలవు.

పౌరుషమునందును, పాండిత్యాతిశయంబునందును రాష్ట్రపాలనయందును ఆంధ్రులు హిందూదేశములోని యితరదేశములవారికి తీసిపోవువారు కారని యీగ్రంథము సప్రమాణముగా సిద్ధాంతీకరించుచున్నది.

ఇట్టిగ్రంథము తెలుఁగులోఁగాని మఱియే యన్యభాషలోఁగాని యెవ్వరును రచించియుండలేదు.

విఖ్యాతలేఖకు లగు శ్రీయుత చిలుకూరి వీరభద్రరావు పంతులుగారిచే నిది రచింపఁబడినది. 400 పేజీలు గలిగి మంచికాగితములమీఁద చిన్నయక్షరములతో ముద్రింపఁబడి చక్కనిక్యాలికోబైండుచేయఁబడిన యీయమూల్యగ్రంథము మాచందాదారులకు పోస్టేజితో రు 1-0-0 కును, చందాదారులు కానివారలకు పోస్టేజిగాక రు 1-8-0 లకును ఇయ్యఁబడును.

☞ విజ్ఞానచంద్రికా బుక్కుడిపో యందు సంస్కృతాంధ్రగ్రంథము లనేకములు దొరకును. వలయువారికి క్యాటలాగులు పంపఁబడును.

చిరునామా:—

ఆ. లక్ష్మీపతి, బి. ఏ., ఎం. బి. సి. ఎం.

మేనేజరు.—విజ్ఞానచంద్రిక,

చింతాద్రిపేట.—మదరాసు.

ప్రకటన

ఆంధ్రసాహిత్య పరిషత్తు, చెన్నపురి.

ప్రతిష్ఠాపకులు:—

శ్రీపిఠాపురము రాజాగారగు శ్రీరాజారావు వేంకటకుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు.

శ్రీవేంకటగిరిరాజాగారగు మహారాజా సర్ - వెలుగోటి శ్రీరాజగోపాల కృష్ణయాచేంద్రబహద్దరుగారు, కె. సి. ఐ. ఇ., పంచహజారీమన్సబ్దార్.

అగ్రాసనాధిపతి:—

శ్రీపిఠాపురమురాజాగారు.

కార్యనిర్వాహక సభాధ్యక్షుఁడు.

మ-రా-రా-శ్రీ జయంతి రామయ్యపంతులుగారు. బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

మ-రా-రా-శ్రీ పురాణం నాగభూషణంపంతులుగారు, ఎం. ఏ., బి. ఎల్.

,, ఆచంట లక్ష్మీపతిగారు, బి. ఏ., ఎం. బి., సి. ఎమ్.,

,, నెమలి పట్టాభిరామారావు పంతులుగారు బి. ఏ.,

కోశాధ్యక్షులు (ట్రస్టీలు)

దివాన్ బహదూర్ కంచి కృష్ణస్వామిరావుగారు, సి. ఐ. ఇ.,

రావు బహదూర్ పిట్టి త్యాగరాయసెట్టిగారు, బి. ఏ.

కార్యస్థానము.

2/7 హారిస్ రోడ్డు, పుదుపేట.

చందానిర్ణయము.

పరిషదుద్దేశము:—ఆంధ్రశబ్దములకు సలక్ష్యవ్యుత్పత్తికముగ విపులనిఘంటువు రచించుట, తెలుఁగుభాష కితరభాషలతోఁగల సంబంధమును దెలుపుచు భాషాతత్త్వమును నిరూపించులక్షణశాస్త్రమును రచించుట, ఆంధ్రదేశపూర్వవృత్తాంతమును బ్రమాణపూర్వకముగా నిరూపించుట, శాస్త్రపారిభాషికపదముల నిర్ణయించుట, నూతనగ్రంథరచనకు సాహాయ్య మొనర్చుట, భాషావిషయములఁజర్చించుటకుఁ బత్త్రికనొకదానిని బ్రకటించుట, సమగ్రమగు పుస్తకభాండాగారము నేర్పఱచుట, ఇత్యాదివిధముల నాంధ్రభాషావాఙ్మయాభివృద్ధికై యత్నించుట, పరిషత్తుయొక్క యుద్దేశము.

1. ఉద్ధారకులకు	రు.	5000.
2. పోషకులకు	,,	1000.
3. యావజ్జీవసభ్యులకు	,,	100.
4. సాధారణసభ్యులకు సంవత్సరమునకు	,,	6.

పరిషత్సభ్యులు పత్త్రికకు వేఱుగాఁ జందా నియ్యనక్కఱలేదు.

సభ్యులు కాఁగోరువారు కార్యదర్శులపేర వ్రాసి పరిషన్నిబంధనలఁ దెప్పించుకొనవచ్చును.

సంపుటము 3 | ఆనందనామ సంవత్సరము వైశాఖమాసము. | సంచిక 2

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

ప్రతిమాసమునఁ గడచిననెలలోఁ బ్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

ప్రధానవ్యాసములు.

1. స్వకీయము.
2. విమర్శనాన్వేషణము-దానిలాభము. — కే. సాంబశివరావు.
3. రాయవాచకము — విశ్వనాథరాయనిస్థానాపతి
4. ఆంధ్రసాహిత్యపరిషత్తృతీయవార్షికసభావృత్తాంతము.
5. హిందువులక్షేత్రగణితములోఁ గొన్ని యంశములు. — కే. కృష్ణమాచార్యులు.

చెన్నపురి.

విషయసూచిక.

1. స్వవిషయము.

2. విమర్శనాస్వభావము, దానిలాభములు. 41-48

కే. సాంబశివరావుగారు. బి. ఏ.

3. రాయవాచకము. 49-58

విశ్వనాథరాయని స్థానాపతి.

4. ఆంధ్రసాహిత్యపరిషత్తృతీయవార్షికసభావృత్తాంతము. 59-80

5. హిందువుల క్షేత్రగణితములోఁ గొన్నియంశములు. 81-88

కపిస్థలం - కృష్ణమాచార్యులుగారు. బి. ఏ.

స్వ వి ష య ము.

ఆర్యవర్యులారా!

ఇది యానందసంవత్సర ద్వితీయసంచిక. ఈపత్రిక యానందసంవత్సర ప్రారంభమునుండి మాసపత్రికగా మాఱినది. కాని చందాలో, సర్వసాధారణముగ సులభసాధ్యము కావలయు నని మార్పు చేయలేదు. ప్రమాదీచనామ సంవత్సరమునఁ జేరిన పాఠకవర్యుల కానందసంవత్సరమునఁ బత్రిక కావలయునా వలదా యని మే మడిగినవారలకుఁ గొందఱు ప్రత్యుత్తర మీయలేదు. అట్టి వారు చందాధనమునుగాని వి. పి. కట్టుమని యాజ్ఞనుగాని బంపఁ గోరుచున్నారము. భాషాభిమానులు తమ స్నేహితులను గూడఁ బ్రోత్సాహపఱచి పరిషత్పత్రికాపాఠకులనుగా నొనర్పఁ గోరెదము. భాషావిషయకములుగాని, దేశచారిత్రములు మొదలగునవిగాని సులక్షణభాషలో వ్యాసములుగ వ్రాసి పంపినచో వానిని మాపత్రికయందుఁ బ్రకటించెదము. సాధ్యమైనంతవఱకు వ్రాయునట్టి వ్యాసములు వివిధశాస్త్రములై దేశమునకుపకారములుగ నుండవల యును.

శే. శేఖర.

ప్ర క ట న

ఆంధ్రసాహిత్య పరిషత్తు, చెన్నపురి.

ప్రతిష్ఠాపకులు:—

శ్రీపిఠాపురము రాజాగారగు శ్రీరాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు.

శ్రీవేంకటగిరిరాజాగారగు మహారాజా సర్ - వెలుగోటి శ్రీరాజగోపాల కృష్ణయాచేంద్రబహద్దరుగారు, కె. సి. ఐ. ఇ., పంచహజారీమనసబ్దార్.

అగ్రాసనాధిపతి:—

శ్రీపిఠాపురమురాజాగారు.

కార్యనిర్వాహక సభాధ్యక్షుఁడు.

మ-రా-రా-శ్రీ జయంతి రామయ్యపంతులుగారు. బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

మ-రా-రా-శ్రీ పురాణాం నాగభూషణంపంతులుగారు, ఎం. ఏ., బి. ఎల్.

,, ఆచంట లక్ష్మీపతిగారు, బి. ఏ., ఎం. బి., సి. ఎమ్.,

,, నెమలి పట్టాభిరామారావు పంతులుగారు బి. ఏ.,

కోశాధ్యక్షులు (ట్రస్టీలు)

దివాన్ బహదూర్ కంచి కృష్ణస్వామిరావుగారు, సి. ఐ. ఇ.,

రావు బహదూర్ పిట్టి త్యాగరాయసెట్టిగారు, బి. ఏ.,

కార్యస్థానము.

2/7 హారిస్ రోడ్డు, పుదుపేట.

చందానిర్ణయము.

పరిషదుద్దేశము:—ఆంధ్రశబ్దములకు సలక్ష్యవ్యుత్పత్తికముగ విపులనిఘంటువు రచించుట, తెలుఁగుభాష కితరభాషలతోఁగల సంబంధమును దెలుపుచు భాషాశాస్త్రమును నిరూపించులక్షణశాస్త్రమును రచించుట, ఆంధ్రదేశపూర్వవృత్తాంతమును బ్రమాణపూర్వకముగా నిరూపించుట, శాస్త్రపారిభాషికపదముల నిర్ణయించుట, నూతనగ్రంథరచనకు సాహాయ్య మొనర్చుట, భాషావిషయములఁజర్చించుటకుఁ బత్త్రికనొకదానిని బ్రకటించుట, సమగ్రమగు పుస్తకభాండాగారము నేర్పఱచుట, ఇత్యాదివిధముల నాంధ్రభాషావాఙ్మయాభివృద్ధికై యత్నించుట, పరిషత్తుయొక్క యుద్దేశము.

1. ఉద్ధారకులకు	రు.	5000.
2. పోషకులకు	,,	1000.
3. యావజ్జీవసభ్యులకు	,,	100.
4. సాధారణసభ్యులకు సంవత్సరమునకు	,,	6.

పరిషత్సభ్యులు పత్త్రికకు వేఱుగాఁ జందా నియ్యనక్కఱలేదు.

సభ్యులు కాఁగోరువారు కార్యదర్శులపేర వ్రాసి పరిషన్నిబంధనలఁ దెప్పించుకొనవచ్చును.

విమర్శనాస్వభావము, దానిలాభములు.

(కాకినాడ సభలోఁ జదువఁబడినది.)

అగ్రాసనాధిపా! ఆంధ్రసాహితీవరిష్ఠులారా! సభాస్తారులారా! నేను నుడువఁ బోవు విషయ మందఱికిఁ దెలిసియు గమనింపకున్నది యై యున్నది. ఈవిషయ మాంధ్రవాఙ్మయదేహమునకు ముఖ్యాంగ మై యున్నది. అట్టి యంగము లేకున్నఁ గాని వంకరగ నున్నఁ గాని వాఙ్మయదేహ మవకరముగ నుండునే కదా! దాని కొఱఁత యనివార్య మైన దని నే నింకముందుఁ జెప్పఁ బోవు దానివలన మీకుఁ దోఁపక మానదు. అట్టి దాంగ్లేయాది భాషలయందు సమగ్రముగ నున్నది. ఆంధ్రభాషయందు బొత్తిగ నలక్ష్యము చేయఁబడినది. నేను జెప్పఁబోవు విషయము "విమర్శనాస్వభావము, దాని లాభములు." ఏభాషయందును వాఙ్మయముతోడనే విమర్శనము పుట్టియుండ లేదు. ఆంగ్లేయ వాఙ్మయ మభివృద్ధి చెందినకొలందిని అందలి విశేషములను ప్రజలకు సుస్పష్టముగఁ దెల్పుడుచేయు నావశ్యకత్వము పొడమి విమర్శనా ప్రారంభమున కవకాశము కల్గినది. ఆంగ్లేయభాషయందు మొట్టమొదట విమర్శన మీర్ష్యాపురస్కృతమై యుండినది గాని రానురా నిప్పటి కది ప్రాశస్త్యస్థితి నంది యున్నది. ఏకారణమువలననో గాని యాంధ్రభాషయందు విమర్శనము పుట్టి యుండ లేదు.

వాఙ్మయము తక్కువగ నున్నదా యని ప్రశ్నించుకొనినచో మనభాషయం దది విశేషముగఁ గల దనియే చెప్పవలసియున్నది. ఆంధ్రగ్రంథరాజములం దున్నగుణములు లోకులకు సుస్పష్టములు గాక సముద్రమునం దున్న రత్నములవలెఁ గప్పువడియున్నవి. చక్కని విమర్శనమే ప్రబలి యున్నచో నందలి విశేషము పలువురకు గోచర మై భాషయం దెక్కుడాదరభావము హెచ్చి యుండును. మణియందలి ప్రాశస్త్యము తెలియనప్పుడు గులకరాయికంటె దాని కెక్కుడు విలువ యుండదు గదా! నన్నయభట్టునకుఁ బూర్వమే కొందఱు కవీశ్వరు లాంధ్రభాషయందు గ్రంథములు వ్రాసినట్లు కనఁబడుచున్నది. అప్పటినుండి నేఁటివఱకు నాంధ్రభాషలో గ్రంథములు వ్రాయఁబడుచునే యున్నవి. జనసామాన్యసుబోధకములు గాక ప్రశస్త మైనవని మాత్రము పండితులచే నంగీకరింపఁబడిన గ్రంథరాజము లసంఖ్యాకములుగ నున్నవి.

అం దిమిడియున్న విశేషములు లోకమునకు వెల్లడి చేయుట కెవ్వరును బూనుకొనఁ జాలరైరి. అట్టి యావశ్యకత్వము లే దని యప్పటివా రూహించిరేమో తెలియదు. వాఙ్మయ మభివృద్ధి చెందినకొలంది నైన నిట్టి యావశ్యకత్వము వారికిఁ బొడకట్టి యుండ లేదు.

అప్పకవియంతటివాఁడు సహితము తనవిమర్శనములో

“బమ్మెరపోతరాజకృత భాగవతంబు సలక్షణంబు గా
కిమ్మహి నేమిటం గొదవ యెంతయు నారసి చూడఁగాను రే
ఫమ్ములు ఱాలునుం గలసి ప్రాసము లైనకతంబునం గదా
యిమ్మహి నాదిలాక్షణికు లెల్లరు మాని రుదాహరింపఁగన్.”

అని భాగవతమువంటి మహోత్కృష్టగ్రంథమునే నిరసించియున్నాఁడు. లక్షణము లన్నియుఁ దూచాతప్పకుండ గ్రంథమందు గమనింపఁబడినవా యని, ఆంగ్లేయభాషయందు పోపు, డ్రైడన్ కాలమునందువలె, నిప్పటిలాక్షణికులు పరీక్షచేయువాడుకయుండియుండు నని దీనివలనఁ దెలియుచున్నది. సర్వలక్షణసమగ్రమై నిర్దోషమై, సంపూర్ణయోగ్యత కలగ్రంథము విమర్శనాతీతము (Above criticism) గాను, లక్షణన్యూనత గలవానిని విమర్శనాయోగ్యములు (Below criticism) గాను రెండుతెఱంగులుగ విభజించి విమర్శనమునకుఁ జోటీయకుండి రని యనుకొనవచ్చును. కొంద ఱానాఁటికవిశిఖామణులు తా మాశ్రయించియున్న భూపతులపట్టు చూచుకొని, వారి మన్ననలచే గర్వించి యహంభావభూయిష్ఠులై తమగ్రంథములందుఁ దప్పులే లే వనియు, నున్న వనువారిని చెంపకాయలు కొట్టుదు మనియు భయపెట్టుటచే విమర్శనము చేయుటకు భయపడి మానిన ట్లూహింపవచ్చును. అందున కుదాహరణముగ రామలింగకవి.—

చ. ఒకనికవిత్వమం దెనయు నొప్పులుఁ దప్పులు నాకవిత్వమం
దొకనికిఁ దప్పుపట్టఁ బని యుండదు కా దని తప్పు పట్టినన్
మొక మటు క్రిందుగాఁ దిగిచి ముక్కలు వోయినయున్నకత్తితో
సిక మొదలంటఁ గోఁతు మఱి చెప్పునఁ గొట్టుదుఁ గాలఁ దన్నుదున్ ॥

అని వ్రాసియున్నాఁడు.

అత్తకోడండ్రతగవులో సరస్వతి బలవత్తరమై లక్ష్మిని బారఁద్రోల నామెవిగో ఘురాలగు నామె యక్కకు సరస్వతి చెంత యిరవు గలుగఁ గవిసార్వభౌము

లుదరపోషణార్థమై భూపతుల నాశ్రయించి వారియాస్థానములం దుండి వారి యభీష్టానుసారముగా గ్రంథముల రచియించుచు, నయభయంబులచేఁ గానుకీన ముల సేకరించుకొని కాలక్షేపము సేయుచుండిన కాలమున వారు రచించిన గ్రంథములను విమర్శనము చేసినచో నాభూపతుల కెట్టియలుక పుట్టునో యను భీతితో మానుకొని రనియు నూహించిన నూహింపవచ్చును. ఏ మైన నేమి? పర్యవసానము విమర్శన మారంభము కాలేదు. ఒకవేళఁ బ్రారంభమైయుండి న నీర్ష్యాస్పదమై, స్వోత్కృష్టప్రభూయిష్ఠమై, పరనిందాకరమై యుండు నేమో, అట్లుండినను మేలే! దోషములు చేసినంగాని దిద్దుకొనుటకుఁ బ్రాశస్త్యము నుగాంచుటకును మార్గము వేరొండు లేదు గదా. గొప్పవా రందఱు మొదటఁ దప్పు చేసి దిద్దుకొనినవారే. ఆంగ్లేయభాషయందును మొదట విమ ర్శన మీర్ష్యాపురస్సరంబుగనే యారంభ మైనది. అది యుక్తము గాదని తెలిసి మంచిమార్గ మవలంబించి విమర్శనమును వాఙ్మయమునకు ముఖ్యాంగముగఁ జేసియున్నారు.

విమర్శన మన నెట్టిదో దానిస్వభావమునుగుఱించి యోజింతము. గుణ దోషనిర్ధారణము విమర్శనము. గ్రంథముయొక్క గుణములను విలువను నిర్ధార ణము చేయఁగల ప్రావీణ్యమునకు విమర్శన మని పేరు. దేనియందుఁగాని గుణ ములను నిర్ధారణము చేసి చెప్పుటయు, నందుఁ బ్రశస్త మని లోకులు తెలిసి కొనఁ దగినదాని ననుకొనఁ దగిన దానిని నేర్చుకొనుటయుఁ బ్రచురము చేసి జనులకు నేర్పుటకై ప్రయత్నించుటయు, విమర్శనము యొక్క ముఖ్యోద్దేశ ములు. గ్రంథముయొక్క గుణదోషములను వేర్వేరుగ వ్రాసి ప్రకటనమునకై సిద్ధముచేయఁబడిన పట్టిక యని కొందఱుమతము. రంధ్రాన్వేషణమే విమర్శన మని సామాన్యముగఁ గొంద ఱనుకొనుచున్నారు. కాని యది కేవల మప్రశస్త ము, నగ్రాహ్యము.

తప్పులు వెదకుట గాని నిందించుట గాని విమర్శనాలక్షణము కాదు. విమర్శనాశబ్దమునకు గుణదోషనిర్ధారణ మని యర్థము గాని రంధ్రాన్వేషణ మని యర్థ మెందును లేదు. న్యాయదృష్టితోఁ జూచిన సలక్షణమై నిర్దోషమై నిరాక్షేపణపాత్రము లగు భారతాద్యుద్గ్రంథము లెంత విమర్శనమునకు యో గ్యములో యాక్షేపణభూయిష్ఠము లగు గ్రంథములు నంతయోగ్యము లైనవే. లక్షణవిరుద్ధము లై దోషభూయిష్ఠము లగుగ్రంథములు విమర్శనమున కయో

గ్యము లని చెప్పినం జెప్పవచ్చును. కాని నిర్దుష్టములై సలక్షణము లగు గ్రంథరాజములను విమర్శనాతీతము (above criticism) లని వదలివేయరాదు. విమర్శనమునందుఁ బ్రావీణ్యము కలవాఁ డట్టిగ్రంథములయందలి గుణములను బ్రాశస్త్యమును వెల్లడిచేయక యుండఁగలఁడా? అట్టివానిచేతనేగద మనకు బుద్ధి వికసన మగుచున్నది? వానియందలి యందమును వెల్లడిచేయ కూరకొనలేఁడు. మొదటఁ దా నానందించి వెనుక నొరుల నానందింపఁజేయుట కదా సువిమర్శకుని లక్షణము. గుణములను బ్రచురముచేసి గ్రంథకర్తయొక్క యనల్పకల్పనాశక్తి, రచనానైపుణ్యము, కావ్యయోగ్యత, శాశ్వతము చేయుట కదా వానిపని. నిజముగ యోజింప సువిమర్శకునివంటి యాత్మబాంధవుండు గ్రంథకర్తకు వేఱొకఁ డుండునా? తా రచించిన గ్రంథమువిలువ, రచనాచమత్కారము గ్రంథకర్తకు సహజము లగుటచే, నంత గొప్పవిగఁ గన్పింపవుకాని విమర్శకునకుఁ దెలియవా? తెలిసి వాఁ డూరకుండనేర్చునా? దానియం దున్న సర్వసుగుణములను దాను గ్రహించి యానందించి ప్రపంచమునకుఁ దెల్లముచేసి లోకులు గ్రహించునట్లును, నానందించునట్లును జేసి, యాగ్రంథమునం దభిరుచిని బుట్టించి, గ్రంథమును శాశ్వతము చేయుటయే గాక, గ్రంథకర్తకు ఖ్యాతిఁ దెచ్చి, తానును బ్రఖ్యాతిని బొందుచున్నాఁడు. అందుల కుదాహరణములు పెక్కులు తెలుఁగునందు లేవు గాని యింగ్లీషునం దనేకములు గలవు. 'జాన్సన్ జీవితము' వ్రాసి బోస్వెల్ ప్రఖ్యాతిఁ గాంచి యుండలేదా! హూణకాళిదా సని ప్రఖ్యాతిఁ గాంచిన షేక్స్పియర్ గ్రంథములను విమర్శనము చేసి యెంద ఱింగ్లీషు పండితులు యశము వడసి యుండలేదు? ఆవిమర్శనాగ్రంథములను లెక్కింపఁ గలమా? అట్టి విమర్శనము, నట్టి విమర్శనముచే, గ్రంథ గ్రంథకర్తలు విఖ్యాతిఁ గాంచుట, విమర్శకుఁడు వన్నె కెక్కుట, యట్టి విమర్శన మాంధ్రవాఙ్మయమునందుఁ జేరి భాష నభివృద్ధిపఱచుట, యాంధ్రభాష కింకను నబ్బకుండుట విచారకర మగువిషయమే.

షేక్స్పియరు మొదలగు హూణకవీశ్వరులు వ్రాసిన కావ్యములకంటె వానిపై వ్రాసిన విమర్శనాగ్రంథములే లెక్క కెక్కుడై యాంగ్లేయవాఙ్మయమును వృద్ధిచేసిన విషయ మాంగ్లేయభాష నభ్యసించిన సభ్యవరుల కవగతమే. చేమకూర విజయవిలాస మెంత పాకమునఁ బడినది! పద్యమును జవి

చూచిన రుచి మఱతురా! మనుచరిత్ర మెంత హృద్య మైనది! ఏతాదృశగ్రంథములయందలి యందమును బండితు లందఱు సానుభవముగ గ్రహించి రేకాని విమర్శనముచేసి తాము గ్రహించిన విశేషమును దాము గనిపెట్టిన గుణమును లోకమునకు వెల్లడించిరా! లోకమున కాగ్రంథములయం దభిరుచిఁ బుట్టింపఁ గల్గిరా? సాహితీసరసాగ్రేసరు లఁట! భాషాసరసు లఁట! ఉన్న యాంధ్రవనిత సౌందర్యమును గన్నెత్తి చూడ సామర్థ్యము లేదు. ఇంకను సృష్టింపవలె నఁట! క్రొత్తవి కావలె నఁట! ఉన్నగ్రంథములకుఁ జక్కనివిమర్శనము వ్రాసి యాంధ్రభాష నభివృద్ధి చేయరాదా! ఇదియు నొకమార్గము కాదా? ఉత్కృష్టగ్రంథము లనేకము లున్నవి. చక్కనివిమర్శనము వ్రాయించి యాంధ్రకావ్యములయం దాదరము హెచ్చింపఁజేసి, విమర్శన మన నేమియో ప్రపంచకమునకుఁ దెల్పుడుచేసి, యట్టివిమర్శనమునందుఁ బండితులకుఁ బ్రోత్సాహము కలుగఁజేసి, ఆంధ్రవాఙ్మయము నభివృద్ధిచేయుట యావశ్యకము. ఉన్నవాని యం దనాదరము చూపి పెక్కుగ్రంథములను బేరునకు మాత్రము ప్రకటింపఁజేసి ప్రఖ్యాతి వడయఁజూచుటకంటె నిటువంటి యొక్కవిమర్శన గ్రంథము వలన నెక్కుడు ప్రఖ్యాతిఁ జెందవచ్చును. భోజరాజువంటి రాజు లున్నచోఁ గాళిదాసువంటికవులు లేకపోరు. రసము తెలిసి యాదరించు ప్రభువులున్నచోఁ గవీశ్వరు లెప్పుడును గలరు. కవీశ్వరులకు సహజ మగుదారిద్ర్యదోషముచే నిట్టి యుద్యమములకుఁ బూనుకొనక యధమ మగుసేవకావృత్తి నంగీకరించి పొట్ట పోసికొనుచున్నారు. ఆంధ్రభాషాభిమాను లంద ఱీదెసఁ గృషిచేసి వానికిఁ బ్రోత్సాహముఁ గలిగించుప్రయత్నమునకుఁ బూనుకొందురుగాక.

గ్రంథములందుఁ దప్పులు వెదకుట చులుకన యగుపనియే.

“ తప్పులెన్నువారు తండోపతండంబు
లుర్విజనుల కెల్ల నుండుఁ దప్పు
తప్పు లెన్నువారు తమతప్పు లెఱుఁగరు
విశ్వదాభిరామ వినుర వేమ—”

యన్నట్లు తప్పు లేనివా రెవరు? భారతకవీశ్వరులకుఁ దప్పులు పట్టలేమా? తప్పు లేని సర్వజ్ఞమూర్తి భగవంతుఁ డొక్కఁడే. గొప్పకవుల కావ్యములయందుఁ గొన్ని నెరసు లున్నను వానిని దప్పు లనరాదు. ‘ప్రమాదో ధీమతా మపి’ యన్నట్లు ప్రమాదవశమునఁ గొన్నిదోషములు దొరలును.

తప్పుచేయుట మానవస్వభావము; వానిని పాటిసేయక యుదారస్వభావముతో మన్నించుట దేవభావము.

" దిద్దవలెఁ దప్పు కల్గిన
ముద్దుగ నైఘంటికంబు మూలముఁ గని తా
గెద్దియుఁ జూడక రోసెడు
గద్దరికుమతులను లెక్కగాంచరుసుమతుల్. "

అని యొకకవీశ్వరుఁడు వ్రాసియున్నాఁడు.

" ఊరు మెచ్చఁ బెండ్లి నెగిఁజేయఁగాలేరు, ఓపినంత సేయకుండలేరు "

అన్నట్లందఱు మెచ్చుకొనులాగున గ్రంథము వ్రాయవలె నన్నఁ "గాపువాఁడు, కొడుకు, గాడిద" కథ సామ్యమువచ్చును. తప్పులు వెదకు స్వభావము గల విమర్శకుల విషయమై నిరసనభావము చూపుచు నొక కవీశ్వరుఁడు—

గీ॥ గంధచందనములు మేనఁ గల్గియున్న
నగరు పన్నీరు నెంతయు నలమికొన్న
వ్రణము కల్గినతావునే పరఁగ మక్షి
కంబు వెదకును గాదె యాంకాంక్ష సేసి."

యని వ్రాసియున్నాఁడు. కావ్యరచనమందుఁ గవీశ్వరుఁడు పడుపాట్లు దైవమున కెఱుక; విద్వాంసుని కెఱుక.

" విద్వా నేవ విజానాతి విద్వజ్జనపరిశ్రమమ్।
నహి వంధ్యా విజానాతి గుర్వీమ్ ప్రసవవేదనామ్"

అన్నట్లు తక్కువారల కెట్లు బోధపడును? ఇంతకష్టపడి వ్రాసిన గ్రంథమును గువిమర్శకుఁ డొకఁడు తప్పులను వెదకి గ్రంథమును నిరసించి దూషించినచో నాకవీశ్వరుని డెందంబెంత యాందోళనంబు చెందునో యూహింపుఁడు. అసూయాపరతచే గాక యిట్టిపనికిఁ గారణ ముండునా? దీనివలన నెట్టిలాభము లభించును? కేవలము దీనివలననే పేరుప్రఖ్యాతి వచ్చునా?

నిజ మగువిమర్శన మెట్లుండవలెను? నిష్పక్షపాతముగ నుండవలెను. లేనిపోని స్తోత్రపాఠములు గాని నింద గాని యుండరాదు. ఈవలసిన పొగడ్త నీయవలెను చూపవలసినంత యాదరమును జూపవలెను. ఎక్కువ నీయరాదు,

తక్కువసేయరాదు. గ్రంథకర్తను బాగడవలె నని కాని నిందింపవలెనని కాని యుద్దేశముతో విమర్శన మారంభింపరాదు.

విమర్శనమందు విమర్శకునకుఁ బ్రవీణత కలిగియుండవలెను. చదువ నేర్చిన ప్రతిమనుజుఁడిందునకుఁ దగఁడు; పూనుకొనరాదు. గ్రంథమునందుఁగల గుణదోషములను జక్కఁగఁ వేఱుచేయుశక్తిగలవాఁడై యుండవలెను. న్యాయమును దీర్పుచేయు న్యాయాధిపతివంటివాఁడు విమర్శకుఁడు. లంచగొండి గాని న్యాయాధిపతికిఁ "ఫిర్యాదీ" యందుఁ గాని "ముద్దాయి" యందుఁ గాని పక్షపాతము లేదు. వాదియందుఁ గాని ప్రతివాదియందుఁ గాని మనసు పోనిచ్చి విచారణను దొరకొనఁడు "ఫిర్యాదు" "దావా" ల యందలి నిజానిజముల నుభయకక్షుల సాక్ష్యవాదములను నిష్పక్షపాతబుద్ధితో విని యెటు న్యాయపుములు గౌరవము చూపునో యట్లు తీర్మానించును. అట్టివాఁడు విమర్శకుఁడు. అంతకంటె నెక్కువవాఁ డనియుఁ జెప్పవచ్చును. గుణము కల్గినచోట గుణమును, దోష మున్నచోట దోషమును జూపును. ఎప్పుడు తప్పులను వెదకు స్వభావము కలవారివిషయమై చెప్పుచు "The critics are men who have failed in literature and art", "వాఙ్మయమందును కల్పనాకౌశలమందును సమర్థత లేనివారే విమర్శకులుగా మారుచున్నారు" అని బెంజమెన్ డిస్రాయిలి యను నాంగ్లేయకవి వ్రాసియున్నాఁడు. అసూయాపరతచే నిందించుచు విమర్శనము వ్రాసిన నది నిలువఁజాలదు. గ్రంథముయొక్క యోగ్యత యెప్పటికైనను బయలుపడక మానదు. అప్పుడు వీరివ్రాఁతలు నిరర్థకములు కాక మానవు. కువిమర్శనముచే అరిస్టాటిల్, డాంటి, రైనాల్డుస్, సెంటుబివో, మాత్యూ ఆర్నాల్డు, మొదలగువారిపేర్లు రూపు మాసినవా? అసూయాపరతచే నిందించినను గుణము బయటఁబడక మానినదా? గుణగ్రహణము సర్వోత్కృష్టమగుపని. క్షీరనీరముల వేఱుచేసి క్షీరములనె గ్రహించు రాజహంసంబువలె సద్విమర్శకుఁడు దోషములను వదలి గుణములను జూపి గ్రంథప్రాశస్త్యమును వెల్లడిచేయును.

విమర్శకుఁడు లక్షణవేత్త యై యుండవలెను. లక్షణమునుబట్టి విమర్శనము చేయవలెను. కావ్యముల కన్నిలక్షణములు పట్టినవా యని చూడరాదు. ఒకకాలపువిధుల వేఱొకకాలమున కుపయోగింపరాదు. లక్షణము లన్నియుఁ

బట్టకున్నను ఏయుద్దేశముతో నట్టిగ్రంథము వ్రాయఁబడినదో యాయుద్దేశము నెఱవేఱినదా లేదా యని యోజించి నెఱవేఱియున్నచో గ్రంథమునందు గుణమున్న దనియే తీర్పు చేయవలసి యున్నది.

కవీశ్వరుని యభిప్రాయమును సాధ్య మైనంతవఱకు గ్రహింపవలెను. గ్రహింపక నిందింపరాదు. విద్య యొకనిసొమ్ము గాదు. పాండితికి మేర లేదు. తన పాండిత్యమునే మేరగాఁ గొని యెదుటివారి నపండితు లనుట పండితంమన్యుని లక్షణము గాని పండితవాచ్యుల లక్షణము కాదు.

లక్షణగ్రంథములనుబట్టి విమర్శనమునకుఁ దొడంగితిమా యొక కావ్యము విధ్యుక్తముగ నుండదు. చాలవఱకు ననుగుణముగ నున్నదా లేదా యని మాత్రము చూడవలసియున్నది. తప్పులు పట్టుటయే పనిగఁ బ్రారంభింపరాదు. తప్పులు లేనిగ్రంథమే లేదు. కొలఁదినెరసులు ప్రమాదవశమున దొరలినంత మాత్రమున నసంఖ్యాకము లగుగుణము లన్నియు మన్ననఁ గలియవలసిన దేనా? వెనుక శశిలేఖపత్త్రికాముఖమున "భారతధర్మసందేహము" లను శీర్షికతో నాదిపంచకమందుఁ దీసి వివిధము లగు శతసందేహములను బ్రకటించి యున్నాఁడను. ఎవరైన సమాధానములను వ్రాసినచో సందేహనివృత్తి చేసికొని తెలివి నభివృద్ధి చేసికోవలె నను నుద్దేశముతో వ్రాసితినిగాని కవిత్రయమువారి యందు దోష మెంచవలె నని నాయుద్దేశము గాదు. పండితు లెవరును వానిని సమర్థింపలేరైరి. అంతమాత్రముచే భారతమును నిరసింపవలసినదేనా? అందలి గుణజాలము వర్ణనాతీతముగదా? ఱ ర లకుఁ బ్రాస ముంచినంతమాత్రమున, ద్రుతద్విత్వ మున్నంతమాత్రమున భాగవతపుణ్యగ్రంథరాజమును లక్షణగ్రంథము కాదనవలసినదా! పోతరాజు సహజపాండితీప్రకర్ష కలవాఁడు. అతనిపద లాలిత్యము నంత్యనియమము రచనాకౌశలము మృదుమధురశైలి యెవరికిఁ దెలియదు? ఆమధురిమచే నెంతమంది యెన్నిస్కంధముల నెన్నిఘట్టములను వల్లించినారు కారు? భాగవతమును నేను వర్ణింపఁగలనా?

వ్రాయువారికే తప్పులు. వ్రాయనివారికిఁ దప్పులే లేవు. తప్పులకు జడిసి వ్రాయుటమానుదుమా? మానము గాని కువిమర్శకులకు జడిసి కొందఱు వ్రాయుట మానినారు. నిజ మగువిమర్శన మాంధ్రభాషయందుఁ బ్రబలకుండు టయే యీదోషమునకు మూలము. నిజ మగువిమర్శన మన నెటులుండవలెనో

వ్రాసి దారి చూపినచోఁ గువిమర్శకులు తప్పుత్రోవ మార్చుకొని గుణగ్రహణపారీణు లగుదు రని నానమ్మకము. ఈర్ష్యాళువులు కానిచో వారు గొప్పవిమర్శకు లని ఖ్యాతినొందకమానరు. ఆంగ్లేయభాషయందును మొదట నీర్ష్యాభావము మెండుగ నుండియే విలియమ్ బ్లేక్, కీట్సు, మిల్టన్, మొదలగువారిని గువిమర్శకులు మొదట నిందించి యున్నారు. గ్రంథములయం దసంఖ్యాకము లగు దోషముల నెన్నియున్నారు. కాలక్రమమున నిజ మగువిమర్శనము ప్రబలి యా కవీశ్వరుల కావ్యప్రాశస్త్యము లోకమునకు వెల్లడి యైనది. వారికిఁ జిరకీర్తి కల్గినది. పాప మాకవీశ్వరుల జీవితకాలములయందు మాత్ర మాఖ్యాతి లభించి యుండలేదు. వోల్టేర్ (Voltaire) కవీశ్వరుఁడు చెప్పినచొప్పునఁ గువిమర్శకుల విమర్శనము రోదోంతరాళమందు నిర్మింపఁబడిన కాచభవనమట్లు పాండిత్యప్రకర్షావిమర్శనముచేఁ బగిలి పటాపంచలై గచ్చువిచ్చై పోవును.

విమర్శనమందు సూత్రములు కొన్ని ముఖ్యములే కాని గ్రంథము సూత్రానుగుణముగ నున్నదా లేదా యని గట్టిగా పరీక్ష చేయరాదు. అభిప్రాయమున కొదిఁగి యుండవలసిన సూత్రమే నిరంకుశప్రభువవలె వర్తించినచో విమర్శనోద్దేశమే చెడిపోవును.

విమర్శకునకుఁ గావలసిన యితరలక్షణములలో ముఖ్యము లగునవి.

1. పాండిత్యము, (Knowledge) 2. పరేంగితజ్ఞానము, (Sense) 3. అభిరుచి, (Taste) 4. గుణగ్రహణశక్తి, (Appreciative faculty). 5 అనసూయాభావము, (Unenviousness) 6. ఉదారస్వభావము, (Liberal Spirit) 7. సమత. (Sympathy) 8 స్పష్టత (Clearness)

పాండిత్యము లేనిచో విమర్శనమునకుఁ బూనుకొనుటయే వెఱ్ఱితనము. కవిహృదయము గుర్తెఱుఁగఁ గోరినవాఁడు కవీశ్వరునివలె నెక్కుడు పాండిత్యము కలవాఁడై యుండవలెను. తప్పులు వెదకుట విమర్శనలక్షణము కాదు. గుణము నిర్ధారణము చేయుట ముఖ్యోద్దేశము. గ్రంథమును విమర్శించునప్పుడు విమర్శకుఁడు 'ఇది యొప్పు' 'ఇది తప్పు' అని చెప్పినంతమాత్రమునఁ జాలదు. ఒప్పు లనుటకుఁ దప్పు లనుటకుఁ గారణములను సహేతుకముగఁ జెప్పవలెను.

పరేంగితజ్ఞానము ముఖ్య మైనది. కవిహృదయము తెలిసినఁ గదా గ్రంథమునం దెక్కుడు రుచి చదువరులకుఁ బుట్టును.

"ఇంతలు కన్నులుండఁ దెరు వెవ్వరి వేఁడెదు భూసురేంద్ర యే
కాంతమునందు నున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించులా
గింతియ కాక నీ వెఱుఁగవే మును వచ్చినత్రోవచొప్పు నీ
కింతభయంబు లేకడుగ నెల్లిద మైతిమె మాటలేటికిన్." మనుచ.

"ఇంతలు" మొదలగు సాభిప్రాయపదములం దెంతయంద మిమిడియున్నది! కవిహృదయమును విమర్శకుఁడు వెల్లడి చేసినచో మనుచరిత్ర నెవఁడు చదువక మానును?

"మున్ను సైఁపదు సంతోషమున భుజింప
వెనుక సైఁపదు చింతచేతను భుజింప
భామకడ నున్నతఱి యెడఁబాయుతఱియు
నెక్కలాగయ్యెఁ బాండువంశోత్తమునకు" విజయవిలాసము.

ముద్దులొలుకు తేటపదములను రత్నములపేరువలె గుదిగూర్చి యెంత భావము నిమిడ్చి యున్నాఁడు! ఎంత యనుభవసిద్ధముగను స్వాభావికముగను జెప్పియున్నాఁడు! తానే యర్జునుఁడైనచోఁ దా నిట్లుచేసియుండు నని వేంకటకవి యనుకొనియుండఁడా? వ్యాసవిస్తరభీతిచే స్థాలీపులాకన్యాయము ననుసరించితిని గాని మఱికొన్ని యుదాహరణములను జూపింపవలె ననియే యున్నది.

అభిరుచి—వాఙ్మయమునం దభిరుచి పుట్టి విమర్శనమునకుఁ గడంగవలెను గాని పరుని దూషింపవలె నని కాని వంచింపవలె నని కాని ప్రారంభము చేయ రాదు. కావ్యములయందలి గుణములఁ బరిశీలించి ముందుఁ దా నానందించినఁ గదా యొరుల నానందింపఁజేయ శక్తుఁ డగును?

గుణగ్రహణశక్తి మిగుల ముఖ్యమైనది. ఎచ్చట గుణము గలదో దాని నేర్పాటుగ నిర్ధారణ చేయుశక్తి శ్లాఘనీయమైనదే. వంగతోఁటలోని గ్రుడ్డివాని వలెఁ బలువురు నవ్విరి గాన నేనును నవ్వుదు ననుట యుక్తము కాదు. అట్లు చేసినచో గ్రంథము చదువుట కాసక్తి మెండగును.

అనసూయాభావము—కవీశ్వరునకుఁ గీర్తి కలుగుట కిష్టము లేనివారై గ్రంథమును నిందింపవలె నను నుద్దేశముతో విమర్శనమున కారంభించుట యుక్తము కాదు. తా నభినందింపకున్నను నిజముగ గుణమున్నచో మఱియొకరు భూషింపక మానరు. నిష్పక్షపాతబుద్ధితో వ్రాసినవిమర్శనము వన్నెకెక్కును. అసూయాపరతచే వ్రాసినవ్రాఁత గౌరవము వడయదు. అట్టివారివ్రాఁతలు నిర

ర్థకములై పైపెచ్చు వారికే యపఖ్యాతి నాపాదించును. గుణదోషములను విమర్శించునపుడు మృదుమధురశైలి నుపయోగింపవలెను. కర్ణకఠోరము లగుశబ్దజాలమును బ్రయోగింపరాదు. అట్లు చేసినచో నసూయాపరతచే వ్రాసియున్నాఁడని లోకు లనుకొందురు. లోకోపకారార్థము విమర్శనము కాని కేవలము గ్రంథకర్త కుపకార ముద్దేశించి కా దని జ్ఞాపక ముంచుకొనవలెను.

ఉదారస్వభావము—గ్రంథరచనాశక్తి మిగుల దుష్కరమైనది. వెక్కిరించుటసులువు. దీనివిషయమై పైని ముచ్చటించియే యున్నాఁడను. తప్పులను లెక్కసేయక గుణమును శ్లాఘించుస్వభావము కలవిమర్శకుఁడు కడు విరాజిల్లును.

సమతాస్వభావము—అన్నిటికంటె నెక్కుడైనది. ఆస్థితిలోనే తా నున్నచో నంతకంటె నెక్కుడు ప్రశస్తముగ వ్రాయఁగల్గునా యని తనకుఁ దాను ప్రశ్నించుకొనుచు నంతవఱకుఁ గష్టపడి సాధ్య మగునంతలక్షణయుక్తముగను నిర్దుష్టముగను వ్రాసినందులకు సంతసించుచుఁ బ్రమాదవశతకు జాలినొందుచు దోషము లెచ్చుట నైనఁ బొడకట్టినచోఁ బ్రమాదవశ మని యోజించుచు గుణమును భూషించుచు విమర్శించువాఁ డుత్తముఁడు. దోషమును ఖండించునపుడు నిష్పక్షపాతబుద్ధితో బహిరంగముగ నుండవలెను గాని పాము చావకుండఁగను బడితె విఱుగకుండఁగను ద్వ్యర్థిపదముల నుపయోగించి చెప్పీచెప్పనట్లు చెప్పరాదు. కవీశ్వరుని విరోధిగ నెంచి విమర్శకుఁ గడంగరాదు. తన ప్రియమిత్రుని వలె నెంచి వాఁ డెదురుగ నున్నచో నెట్టి "సలహా" నిచ్చునో యట్లె 'సలహా' నీయవలెను.

విమర్శనము స్పష్టముగనుండవలెను. తోఁచినదానిని స్పష్టముగఁ జెప్పవలెను. ఆ యభిప్రాయ మొకవేళ విరుద్ధముగ నున్నచో మఱియొక విమర్శకుఁడు దానిని ఖండించి నిశ్చితాభిప్రాయము వెల్లడిచేయ సమర్థుఁ డగును. నిజమెప్పటికైన బయటఁబడును. గూఢార్థద్వ్యర్థిపదజాలము నుపయోగించి తనప్రయోగము పదిమందికిఁ దగులు నట్లు వ్రాయరాదు. ఒకరిని బట్టి యందఱిట్టివారే యని తెగను దూషింపరాదు. విశేషమును బట్టి సామాన్యమును సాధింపఁ బ్రయత్నించుట విమర్శకునిలక్షణము గాదు. తనబుద్ధిహీనతను దీర్ఘసమాసములతోను గంభీరము లగుకఠినపదజాలముతోనుగప్పిపుచ్చరాదు. పండితంమన్యులు సర్వజ్ఞత్వ మారోపించుకొని దురభిమానభూయిష్ఠులై తమంతవారు

లే రనిపించుకొనుటకై యిట్టినిరర్థకశబ్దజాలమును దడదడ కొండమీఁదినుండి క్రిందఁబడు సెలయేటివలె శబ్దింపఁజేయుచుఁ బెడత్రోవలు త్రొక్కుచుండుట మన కనుభవైకవేద్యమేకదా! అట్టిబడబడలయం దర్థ మాకాశపుష్పముగదా! తెలివిలేని "ప్లీడర్లు" నిరర్థకవాగాడంబరమును బల్లగ్రుద్దుటలనుజూచి పల్లెటూరి 'పార్టీలు' "గబికీగబికీ మాపీడరుమూడుమాట్లుబల్లగుద్దిండు" అనిసంతసించుచుఁ జెప్పుకొనులాగున విద్యాగంధ మెఱుంగని శ్రోతలు 'గాబరా'పడి నివ్వెఱగంది చూచుటచే నాత్మగౌరవమున కాధిక్యత కలుగు ననుదురభిప్రాయముచేతనే గాక యీనిరర్థకవాగాడంబరమునకు వేఱుకారణ మున్నదా? దానిలాభము తన తెలివిహీనతను గప్పిపుచ్చుకొనుటయే. కాని విద్యావంతు లగువారి కాదొంగ తనము బయటపడక మానదు. అది గౌరవహానికి మార్గమే కాని వృద్ధికిఁ గారణము కానేరదు.

ప్రతివాక్యముఁ జక్కఁగఁ బరిశీలించి గ్రంథకర్త యుద్దేశమును గ్రహింపవలెను. కవి యేకాలపుఁజరిత్ర వ్రాసినాఁడో యాకాలము, నాస్థలము, నాభాష, యాకవీశ్వరుని కెట్టిమార్పును గలిగించినవో గ్రహించి యందున కనుగుణముగ విమర్శనము వ్రాయవలెను. ఉదారసమతాస్వభావము లేనిచో నెంతపాండిత్యమున్నను, ఎంత విద్యాభిరుచి యున్నను నిష్ప్రయోజక మని నొక్కి వక్కాణింపఁగలను.

ఈరీతిని విమర్శనము వ్రాయఁబడినచో గ్రంథములు వ్రాయుట కెందఱో యారంభింతురు. పండితులయం దొకరియెడల నొకరి కీర్ష్యాభావము మాసిపోవును. మంచి విమర్శనము ప్రబలి విమర్శనాగ్రంథము లెక్కుడు కాఁగా గ్రంథరాజములయం దిమిడియున్నగుణము, దోషము లోకమునకు వెల్లడియగును. అనేకుల కాగ్రంథములు చదువుటయం దభిరుచి పుట్టును. గ్రంథములకుఁ బ్రాచుర్య మధిక మగును. గ్రంథకర్తలకు విమర్శకులకుఁ గీర్తికలుగును భాషయం దభిరుచి హెచ్చును. ఆంధ్రవాఙ్మయ మభివృద్ధిఁ జెందును. 'ఆంధ్రభాషలో విమర్శనాగ్రంథములు లేవు. భాష యంగవైకల్యతను జెందియున్నద' ను కొఱఁత పోయి యన్నిభాషలతోపాటు తులతూఁగుచుండును.

విద్వద్వరిష్ఠులారా! భోజరాజకృష్ణదేవరాయాది విద్వత్సార్వభౌములగు మహామండలాధిపతు లేలిన యీభరతఖండమందుఁ; గాళిదాసు, భవభూతి, తిక్కన, సోమన, పెద్దన, మొదలుగాఁగల యనేకమహాకవీశ్వరులకు

జన్మస్థానమై యాచంద్రతారార్కముగఁ గోటిసూర్యప్రభతో వెలుంగు పరమో
త్కృష్టకావ్యముల రచించి దేశమునకు వన్నె తెచ్చి తెలుఁగుభాషకుఁ "దూర్పు
ఇటాలియా" భాషయను ప్రఖ్యాతిని దెచ్చి మృతులయ్యును ఇప్పటికిని గీర్తి
కాయులై యున్న యీ భరతఖండమందు, దురాచారఖండనంబుఁ బొనర్చి సదా
చారసంపత్తి సంస్థాపనార్థమై యవతరించి వర్ణాశ్రమధర్మములను శాశించి
శాశ్వతప్రతిష్ఠఁగాంచిన శంకరభగవానులు మొదలగు మతోద్ధారకులు ప్రబలిన
యీభరతఖండమందు, శ్రీకృష్ణభగవానులు భారతీయుల జన్మసాఫల్యార్థమై
మహోత్కృష్టమును నైహికాముష్మిక సాధనంబును, జ్ఞానదాయకంబును,
బౌనఃపున్య జన్మరాహిత్యకారణంబును నగు భగవద్గీతను, లోకానుగ్రహకాం
క్షను బరంపరవ్యాప్తిచే లోకోద్ధారణకారణ మగుటకు నర్జునున కుపదేశించిన
యీభరతఖండమందు, మోక్షమూలరు మొదలగు హూణపండితులు సహిత
మీదేశవాసుల వేదములను భాష్యములను, వేదాంతమును, జూచి యపరిమితా
నంద పారవశ్యతను బొంది చదివి సారమును గ్రహించి లోకమందలి దేశస్థు
లందఱికంటె హిందూదేశస్థుల వాఙ్మయ ముత్కృష్టమైనదనియు, వారి వేదాం
తమునకు సరిపడున దేచోటను బ్రపంచకమునందు లేదనియుఁ దెలిసికొని లోక
మునకుఁ జాటి, హిందువుల సంస్కృతవాఙ్మయమునందలి ప్రీతి గౌరవను పట్టఁ
జాలక 'మాక్సుముల్లర్' అను తనహూణనామమును 'మోక్షమూలరుభట్టు'
గా మార్చుకొని యుండెనో యట్టి యీ భరతఖండమందు, మనసౌఖ్యమునకే
యిండియాను స్వీకరించి మనక్షేమమే వారిక్షేమ మని పలుమాఱు చాటించి
చెప్పుచు మనకు లాభకారిగ నాంగ్లేయులు పరిపాలించుచున్న యీ భరతఖండ
మందు, పాండితీప్రకర్ష కలిగి స్వార్థపరత యింతైన లేక లోకోపకారార్థము,
భాషోపకారార్థము వ్యయప్రయాసముల కోర్చి సర్వదా పాటుపడుచున్న యింత
మంది మీవంటిపండితపుంగవులచే విరాజిల్లు నీభరతఖండమందు, నిప్పుడైన
నేమియుఁ గొఱంత రాదు. విద్యాగంధ మెఱుంగని భూపతులకుఁ గృతు లిచ్చి
వారిని వేఁడిన లాభము లేదుగదా! కవితాసార మెఱుంగలేని భూధవునకుఁ
గృతి నిచ్చి బహుమానము లందుటకంటె రసజ్ఞుఁ డగు నరపాలునకుఁ గృతినిచ్చి
యవమానముఁ బొందుటయైన శ్రేష్ఠ మని యొక కవి వ్రాసియున్నాఁడు. ఇప్పు
డు నుదారస్వభావు లగు భూధవులు లేకపోలేదు. స్వార్థపరత్వశూన్య మగు
సౌదార్యాభిమానము లీకాలమున నరుదె. నిజపరిజ్ఞానశూన్యతచే వారిమహి

మను నేతిబీఱకాయ సామ్యమైనది, కారణ మెట్టిదైనను గార్య ముపకారియే గదా! వారి సహాయమున నెట్టికఠినకార్యము నైనను సాధింపవచ్చును. ద్రవ్యవంతు లగు భూపతు లనేకులున్నారు. వారు పూనుకొన్న సాధింపరాని దేది ? అందులకై తగువారు ప్రయత్నించినఁ జాలును.

కొల్లకూరి సాంబశివరావు.

(గతమాసశేషము.)

రుగానె కట్టివుందురు. గనుక అంద్దుండ్డి *ఆయాచావిళ్ల వారు సలాములు శేయంగ్గా మొదటిదొర మితపరిజనములతో సుహాలుమీద కొలువైయుండ్డి కొలువుదీరి నగరికి పొయ్యేటప్పుడు వున్నతమైనమార్గములుగానె కట్టివుండ్డును. గనక ఆ వున్నతస్థానమందు నిలిచి వెలిచావళ్లలో వుండ్డేవాళ్లను జూచి వారి వాళ్లకు నిత్యకట్టడ బహుమానము సన్మానంబ్బులు నడిపించ్చే క్రమానికి నడిపించ్చ మని ఉత్తరవు ఇయ్యగానే ఆయా పనులవారు రొక్కవుడుగరలు దట్టి కబాయి తలపాగ పట్టీలు యివి అన్నిన్ని ఆయా చావిళ్లలోనే వుండ్డును గనక తోడుతోనె తెచ్చి మొదటిదొర ముంద్దుగానె దివాణానకు ఇయ్యగా సకలమైన వాళ్లున్ను కొలువుజేసి వుంద్దురు గనక యెంద్దరు వచ్చిన వాళ్లకు గ్రాసం కట్టడజేశి వుండ్డును గనక వారలకు గ్రాసంయిప్పించ్చి మరి వెనక నగళ్లోనికి పోదురు నియ్యోగులు దిక్కులనుండ్డి వచ్చిన కమ్మకాగితములు చదివించ్చుక విని యేనుగలున్ను కొత్తపాయదళమున్ను నామజాదులు ఆలోచనశేయగా విన్నవివరం విజయాపురం అహముదానగరం గోలకొండ్డమీద కార్యం శేయమని మూడులక్షలగుర్రాలున్ను వెయ్యియేనుగలున్ను కొంత్త పాయదళమున్ను నామజాదుల జేశినారు వారువచ్చి దిగితే వారలతో పోరాడేది దుర్ఘటమై వుండ్డును ఉత్తరాన అఘుపురంవారున్ను దక్షిణాన కన్నాటకం వారున్ను తూర్పున గజపతివారున్ను కనుపించుకొనేటట్టు వున్నది. అశ్వపతి గజపతి నరపతులలో యీ మూడుసింహాసనాల వారినిన్ని విరుద్ధమైనవారి యెవ్వరినిన్ని కనమని కొలిచేవారము కాము. మూడు సింహాసనములకున్ను గురిలేక వుండ్డగాను మూడుతెగలరాజ్యములోను యేలుబడి అయ్యేస్థలాలు ఆక్రమించ్చుకొని మెడబలిమిని దినాలుక్రమిస్తూ వుంట్టిమి వారితోవారు అన్యోన్యమై కార్యం శేయమని తమతమసరదులవుండ్డె వాళ్లను కనుపించ్చుకొమ్మని నామజాదులు అంప్పితే వారితో పోరాడేది శక్యముగాదు తాము జేసిన అదృష్టమువల్లనున్ను తమదొరలపాలిట కర్తారువల్లనున్ను అంత్తరమున్నిలమై అరువై యేండ్లుబట్టిన్ని, అవనికి అధిపతులు లేకుండ్డగ యెదులశాహు కుతుపనమలక నిజాంశాహు అనేపేరు గలిగి వున్నది సింధుదేశమునుండి గోదావరీపర్యంతమున్ను అఘువురంవారున్ను కేరళంముదలు కృష్ణవేణి పర్యంతము కన్నాటకం వారున్ను జగన్నాథమునుండి బెడదకోటపర్యంత్తం గజపతివారున్ను యేలుదురు. యీ

మూఁడు దక్షిణహిందూ రాజ్యములు.

---

* అనుస్వారమునకుఁ బిమ్మట వచ్చు ప్రత్యక్షరమునకు ద్విత్వము రెండవప్రతిలో లేదు.

మూడు సింహాసనాలవారికి అంగ్దుబడి గాక అసాధ్యమైన దుర్గాలున్ను చేపట్టి త్రిపురాలవలె వున్నది గనక భయములేదని తమలోతాము ఆలోచన జేసుక వుండ్డగా తాత్కాళికమతి అనే ఆయన వారితోను వీరుజేశిన ఆలోచన యథార్థమానుత్రిపురాలలోనున్న రాక్షసులు మహాబలవంత్తులు యీశ్వరవరప్రసాదము వల్ల కామగమనం గలిగి సురులు అసురులు మొదలైనవారలచేత వృఖ్క్యగిచేతనయిన లయంలేకుండ్డా వరమడుక్కొని పండ్రెండ్డు యేండ్లకు వొఖసారి మూడుం ముక్కాలుఘడియ త్రిపురులు ముగ్గురున్ను కూడివుండ్డి ఆలోచనజేసుకొని యెప్పటివలెనె యథాయథలై సంచరింపుదురు. అటువంటి త్రిపురాధిపతులకు కాలంకూడేటప్పుడు భూదేవి బ్రహ్మాదేవునితోను విష్ణుదేవునితోనున్ను పరమేశ్వరునితోనున్ను అధర్మపతులైన త్రిపురులను మోయలేనని మొరబెట్టగా బ్రహ్మాదేవుడు త్రిపురాలవారిని వఖరిచేత నిగ్రహించ శక్యముగాదు. నీవురథమై వేదములు గుర్రాలై మేరుపర్వతము విల్లై, ఆదిశేషుడు నారియై క్షీరాబ్ధిశాయి నారాయణాస్త్రమై ఫాలలోచనుండ్డు రధికుండై త్రిపురాలను నేలగూలిస్తే అప్పుడు ఆదానవులు నాశమై పోవుదురు అని అనుగ్రహించిరి. ఆరీతిగాను విజయాపురం అహముదానగరం గోలకొండ్డ అనే త్రిపురాలకు మూడుసింహాసనాలవారున్ను యెప్పుడు కనుపించ్చుకొంటా వున్నారో అప్పుడు అపాయం వచ్చేది నిశ్చయమని తాత్కాలికమతి తెలుపగా ఆనియ్యోగులు అందరున్ను "ఆరీతు అవును అయినా వున్నదినాలకు రాజలక్షణములున్ను మంత్రాలోచనలున్ను నడపవలె గనకవూరకే వుండరాదు యిప్పుడు కర్న్నాటక * సింహాసనానకు కృష్ణరాయలవారిని అధిష్టానకర్తల జేశినదారభ్యం తురకలమీద కార్యంజేశే ఆలోచన అక్కడవుండే ముఖాములు కాకితములు అంపినారు. అదినిమిత్యం ఆలోచనపరులై హానివృద్ధులకు లోనై యెనులసాహువారికి వ్రాయించ్చి అంపించ్చినారు గనక వారున్ను తమతమ కాకితములు సరదు స్థలాలకు రస్తుసామగ్రీలు అంపించ్చి గడిస్థలాలను బలవంతముగా వుండేటట్టు ఠాణ్యాములకు నామజాదులు అంపించి మొదటిస్థలానికిన్ని యాది హెచ్చరికలతో వున్నారని వ్రాశివచ్చెను. మన రెండుతెగలవారున్ను శీమసరుదులు వున్నదుర్గ్గములు కోటస్థలములకు అంపతగినవార్ల్లను † అంపించ్చి కర్న్నాటకం వారు దళము కూర్చుకొని స్థళము

---

* రెండవప్రతిలో సర్వత్ర కర్నాటయని కలదు.

† రెండవప్రతిలో వార్లు, వేగుర్ల యిట్టిచోటుల ద్విత్వములేదు.

సరుదులకు వచ్చేవారై వక్కప్రదేశానదిగినారని కమ్మకాగితములు వస్తే అప్పుడు అంద్దుకు తగిన ఆలోచనజేసి నడిపించ్చుకొంద్దాము ఇప్పుడునానాటప్రవర్తకములు తెలిశివచ్చి చెప్పమని నూటయిరువై వేగుల్లఱను పయనంశేశి అహమదానగరం వారున్ను గోలకొండ్డ వారున్ను అంప్పగా విద్యానగరానకు బహు వేషభాషల బహురూపాలుగావచ్చి వారు వేగుల్లఱను అంప్పించ్చి [1] మరించ్చి ఆలోచనశేశేవివరం కృష్ణరాయలవారు తురకాణ్యంమీద దళమెత్తివచ్చి అని మొనలకార్యంపూని నడిపించ్చే యడల జయాపజయములు యెవరికని దైవజ్ఞులయినబాఱింహ్మల [2] నున్ను ముల్లాశాస్త్రప్రవీణులయిన పక్కీరులనున్ను భూత భవిష్యద్వర్తమానములు తెలిశిన శకునజ్ఞులనున్ను పిలుపించ్చి అడుగగా వాల్లఱ కన్నాఱటకమున విష్ణు అంశగా నృపతి ఉద్భవించి యీ రాజ్యమున్ను అశ్వపతిరాజ్యమున్ను గజపతి రాజ్యమున్ను అంత్తా జయించి జయస్తంభము వేయించ్చి మగుడి పొయ్యేటప్పుడు కల్యాణ వేంకటేశ్వరుల దశిఱంచ్చి నూటయెనిమిది దివ్యతిరుపతులనున్ను డెబ్బైరెండ్డు దేవస్థానములున్ను పదునెనిమిది శక్తులనున్ను సేవించ్చి సేతువుకు బోయి రామనాథుల దశిఱంచ్చి ధనుష్కోటిలో ఖడ్గము కడిగి కన్నాఱటకం సింహాసనాన అరువైనాలుగు యేండ్లు యెదురులేక యేకచక్రముగాను రాజ్యమేలేటట్టు వున్నది [3] అనిచెప్పినారు గనక పిన్నపెద్దలు ఆతీరే అవుగాబోలు మ్లేఛులు అధర్మానకున్ను నిర్దయత్వమునకున్ను రాక్షసకృత్యమునకున్ను వెరవరు గనక భూదేవి తాళునా త్రిపురాలకు వచ్చినట్టు వచ్చునేమో తెలియదు అని అంద్దరున్ను ఆలోచనశేశుక తమతమ ఇండ్లకుపోగా వారితో కూడావుండ్డి నగరు వెడలి పక్కీరులతోకూడా పట్ణమువెల్లివచ్చి భాగీరథినుండ్డిన్ని రామధనుష్కోటికి వచ్చి వచ్చేవారివెంబ్బడినీళ్ళుదాటి కన్నాఱటకమునకు వచ్చి యెప్పటివేషముదాల్చి పట్ణమునకు వస్తిమి అహముదానగరం గోలకొండ్డలో కన్నవిన్న వాతఱలు వేగుల అరవరాముడున్ను పక్కీరిగోపాడి [4] యిద్దరు తెలియవిన్నపంశేయగా రాయలవారితోను అప్పాజి అయ్యమరసు [5] కొండమరసుగారున్ను తురకాణ్యమనగా యెమునిరాజ్యమువంట్టిది ఆపట్ణముఅటువంట్టిది ఆవూరిలోవుండ్డేవారు యమదూతలు అనేటంద్దులకు సంద్దేహంలేదు అటువంట్టి దిక్కులకుబోయి సకలవాతఱలున్ను

---

1 రెండవప్రతిలో "మరిన్ని" 2 బ్రాహ్మణుల. 3 ఉన్నది. 4 గోపాజి. 5 కొండమరసుపేరు రెండవదానిలో లేదు.

పరామరిక శేసుక స్వామివారి ప్రతాపమువల్ల మ్లేఛు లయినవారి నగళ్లున్ను రాజ్యములున్ను నూరుభాషలభూములున్ను మహారాష్ట్ర గుజ్జెరి గగ్ణోజి యిటు వాట్టిగాయకులతో కలహాస్థులైకష్టబడక సంచ్చరించ్చి పట్ణానకు వచ్చినారం త్తే గాని అరపేదకాలుశేదమనుష్యులయినవారికి పోనురానుశక్యమా అని నగరువేగు లఱను కొనియాడగా రాయలవారు చాలా సంతోషబడి తలా [1] యోనూరేశి ఘట్లుంన్ను ఉడగరులుయిచ్చి యెప్పటివలెనే ఆయాపట్ణముల సంచ్చరించ్చి నానా టిసమాచారములువచ్చి విన్నపంశాయమని అంప్పించ్చి వద్దనున్న వాలఱను కడకు పొంమ్మని రాయలవారు సామాజికులతో విజయాపురం వర్ఱమానా లున్ను అహముదానగరం గోలకొండ్డవార్ఱలున్ను వింట్టిరేగా ఆరెండ్డుఇండ్ల వారికింన్ని చాలా ఆలోచనపుట్టి యింత్తేశివార్త్తలను హేతువు యెంద్ది అని అడుగగా సామాజికులు యీవరకున్ను తురకాణ్యముమీద కార్యంశేయవలె నని వదంత్తి పుట్టింద్దిలేదు గనక యీసింహ్మాసనస్థులనుండి విచారం లేక వుండ్డగా వూరకె వుండ్డిరి యిప్పుడుస్వామివారు సింహ్మాసనానకు కర్త్తలై దానపాత్రము లుకనుపించ్చువార్త్తలుగా ఆనతిస్తిరిగనకఅరిజనులైనవాల్లఱకు ఆలోచనపుట్ట కవుండ్డునా మీరుదినమున్ను ఆమూడు తెగవారి ముఖాములతోను వినయమైన వార్త్తలు ఆనతిస్తేను వారుబుద్ధిశాలులు గనక తమయేలినవారిని స్వామివారి నింన్ని అట్టెపట్ణగతాన సింహ్మాసనస్థులైన వారు శేసినసంబ్బళం సారికెలు యిప్పించ్చి దిక్కుల స్థానాపతులతోడట్టు కొలువుకువస్తే కమ్మకాగితములు గలిగితేను మాట పలుకులునడిపించ్చినట్టయితె ఇప్పుడున్ను నడుచుకవచ్చే మర్యాదవక్కా లాకులు యిచ్చి అంప్పుదురు. ఆరీతిగ స్వామివారు పట్టాభిషిక్తులైన దారభ్యం నిలిచిన వారికేమి రాతురాణువకేమి బొక్కసానసే రొక్కరూపాయలు ఇమ్మని కట్టడజేశి కైజీతం నిలిపి గతం అమరవు దొరతనములవారి శీమ సంబంధాలున్ను నడిపి నగరి నియ్యోగులకు పరస్థళం నియ్యోగులకు బహుమాన సంమ్మానము లున్ను ఉచితముగా రొఖ్కరూపాయిలున్ను యిచ్చి మూడుతెగలవారి పట్ల లియ్యమైనమాటలున్ను ఆడుతాడున్నారు గాబట్టి ఆమూడుతెగల నియ్యోగులు న్నుకన్నాఱటకాంన్నె బహుదినాలుగావుంన్నారు యిదిగాక వాల్లుఱ నీతిప్రబం ధములుచదివివుంద్దురు కాబట్టి ఆలోచనపరులై ప్రాశిఅంప్పించ్చినారు అనినంద్దు లకురాయలవారు మేము ఆగ్రహాబడి ఆరీతిని యీరీతిని ఆనతిచ్చినవారముగాము

1 యేనూరు అని 2 వ ప్రతిలో.

వారికి వారి యేలినవారి మర్యాదగా బహుమాన సన్మానములుగా వినయమైన సరససల్లాపములుగా అంద్దుము అనినంద్దులకు అయ్యమరసు స్వామివారు వినయపూర్వకముగా యెప్పుడు ఆనతిచ్చినారో అదే విపరీత మని యెంచ్చ వచ్చును అదెట్లంట్టిరా అంద్దుకు నీతిపద్యం

క. ఘనుఁడా వినయం బాడిన
వినయంబా మీఁద నదియు విపరీత మగున్
కొననుండి విల్లు వంగుట
వినయంబా యెదుటివాని వేగమె త్రుంచుఁ

అనే అర్థముగనక కన్న కార్యములున్ను విన్నవార్తఁలున్ను హృదయాలోచన అనుమానముగానున్ను నియ్యోగులు వ్రాసేదిచాణుక్యనీతి గనక ఆకీతిని వ్రాతురు అక్కఁడివారు ఆకాకితములు జూచుక ఆవార్త ఆలోచన నడపతగినదే ఆవార్తఁలుపరిశోధించ్చి చెప్పినారని సామాజికులువింన్నపం శేశినారు గనక మన ముంద్దర నడిపించ్చే కార్యములకు హేతువుతోస్తుంన్నది అని పలుకరించ్చిఅప్పాజిమొదలయినవాల్లఁ అంప్పించ్చుకో వచ్చినతర్వాత అయ్యనములక అంకుశఖానుండ్డు రాణాజగదేవు గణుతి తిమ్మప్పనాయడు రావూరి రామినాయడు పెమ్మసానిరామలింగమనాయడు హండ్డే మల్లారావు బోయిరామప్ప హరివాణంకొమాళ్లయిన పదునెనిమిదికప్పణాలవారున్ను దళనాయకులు అప్పరపిళ్ళ కుప్పరపిళ్ళ సాళువనాయడు కొమార తిప్పమ్మ [1] సంగ్గరాజు చెర్వప్రధాని తిప్పరసు అయ్యప్పనాయడు కోటికంవిశ్వనాథనాయడుచెవ్వప్పనాయడుఅక్కఁప్పనాయడు కృష్ణప్పనాయడు వెలిగోటియాచమనాయడు కన్నడ బసవప్పనాయడుసాళువమేకరాజు మట్లఅనంతరాజు తిమ్మరాజు వీరమరాజు మొదలైనవారుంన్ను బొంమ్మిరెడ్డి నాగారెడ్డి బసువారెడ్డి మొదలయిన రెడ్డికొమాళ్ళుంన్నుకమ్మనాయకులు విఠలప్ప నాయడు అల్లుండ్లుకొమాళ్లు రాచరికం మొదలైన అమరనాయకంవాల్లుఁన్ను రప్పించ్చి వారివారి యోగక్షేమాదులు అడిగి మీవద్ద యేనుగ గుర్రాలు బంట్లు పరిజనాలు యెంత్తవుంన్నదని అడిగినంమలకు విఠలప్ప నాయని స్థానాపతులున్ను పరశురామనాయడి తెగాను అమరగాల్లఁ స్థానాపతులలోవీరభద్రయ్యఅనే ఆయనాను దళపతిరాయఁసున్ను రాయులవారితోను స్వామివారు

1 తిమ్మప్ప.

కై జీతం కట్టిన వెనక అమరపుశీమలకు నగరిలెఖ్ఖలప్రకారానకుకుంద్దకం లేకుండా వారువాళ్లున్ను యేనుగగుఱ్ఱాలురావుత్తులుమావుత్తులు బంట్లు పరిజనములున్ను సంత్తరించ్చినారు యిన్నాళ్లవలె కాదు స్వామివారు యేవ్యాళ రాచకార్యానకు ఉద్యుక్తులైకదులుదురు అనిన్ని చిత్తంవచ్చినప్పుడు గణితి బెట్ట కరణీకులకు ఉత్తరవు యిచ్చి వారువచ్చిగణితి పెట్టినప్పటికిన్ని నగరిలెఖ్ఖకన్నా పదేశియేనుగులున్ను నూరేశిగుఱ్ఱాలున్ను వెయ్యిమనిషిబంట్లున్ను అధికముగా వుండ్డవలెనని సంత్తసించ్చినారు స్వామివారి సొమ్ము ఇన్నాళ్లు ప్రసాబడ్డంద్దుకు నగరి అవసరకార్యాలకు చిత్తం రా నడిచేవారై యున్నారు అని విన్నపం శేశినంద్దులకు రాయలవారు చాలా సంతోషపరులై అమరగార్లతోను నిండ్డుకొలువై వుండ్డగా అయ్యానమలక అంకుశరావుతోను మీరు విజయాపురాన బహుదినాలు వుంట్టిరి గనక యెదులసాహువారి దొరతనముకన్నా మీ దొరతనం పూర్వమైనది అని విండ్డుము వారిపూర్వోత్తరములున్ను నిజాంశాహు కుతుపనమలకవారి వర్త్తమానములున్ను మీరు దెలిశివుండ్దురు గనక వీరలకు దొరతనం వచ్చేదేరీతు అనిఅడిగినంద్దులకు అయ్యానమలక రాయలదేవునితోను విన్నపం శేసిన వివరం అశ్వపతిగజపతినరపతి యీమూడుసింహ్మాసనాలకు గలరాజ్యములో ఢిల్లిసురథాణికిన్ని వోరగంటి ప్రతాపరుద్రునికిన్ని గాక పదిహేను సంవ్వత్సరములు పోరాడెను అంతట దుర్గాలలోనున్న కోటలోనున్న రస్తుసామగ్రీలుసరిపోయి గనక ప్రతాపరుద్రుండ్డు ప్రజలను వూరకే చంప్పేది ధర్మంకాదని వెలుబడి సమరం శేయగా దైవగతిని ఢిల్లి

ఢిల్లిలోనున్న ప్రతాపరుద్రుని వృత్తాంతము.

సురథాణిచాతను ప్రతాపరుద్రుండ్డు తగిలెను గనక జయభేరి వేయించ్చి ఢిల్లికి కొంచ్చుపాయనని ఆ సమాచారము విని సురథాణితల్లిగారు ప్రతాపరుద్రుణ్ణి చూడవలెనని కొడుకును అడుగగాఆయనవొఖనాడు నిద్రపొయ్యేటప్పుడు చూడమని చెప్పినాడుగనక ఆతీరున్నె ఆయమ్మరాత్రివేళ నిద్రపొయ్యేసమయానవోరగంట్టి ప్రతాపరుద్రుండ్డు మనుష్యశక్తిగాదు రుద్రాంశ త్రిశూల డుమరులతోడట్టు వున్నాడు అటువంట్టి రాజునునీవుపట్టుక రావచ్చునా అని అన్నంద్దులకు సురథాణినవ్వి ప్రతాపరుద్రుండ్డునిద్రబోగా చూస్తేమీకు యీశ్వరాంశమై కనుపట్టెగదా నేను నిద్రపొయ్యేటప్పుడు చూడుమూ అని చెప్పి అంప్పె గనక ఆ తెరంగ్గుననె సురథాణి నిద్రపొయ్యేటప్పుడు చూడండా శేషశాయిగా శంఖచక్ర గదాయుధములతో లక్ష్మీసమేతుడై శ్రీవత్స కౌస్తుభముతోడట్టు విష్ణుస్వరూపమై కనుపట్టెగాబట్టి

ఆయమ్మజూచి ఆశ్చర్యబడి యింత్తటి వాడవుగావుంట్టే ప్రతాపరుద్రుంణ్ణి తోడుక వచ్చునా అనిమనస్సున యెంచి మన్నాఁడు ఢిల్లిసురధాణి తోను మీామహిమలు మీాకె తెలుసును ప్రతాపరుద్రుంణ్ణి పంత్తిబెట్టుక ప్రసాబడి బహుమాన సన్మానములు శేశి పొరిగింట్టికి అంప్పితె నీకీర్తిఁ శాశ్వతముగావుండ్డును అని తల్లిగారు చెప్పగా ఆతీరుగానె మంజ్జన భోజనాదులప్రతాపరుద్రుంణ్ణి తృప్తిశేయించిబహుమాన సన్మానములు శేశి వొరగంటికి అంప్పిరి గనక ఆవార్త్తలు విని వుండ్డురే గదా. బెడదకోట బరీదు అనే ఆయన కొత్తరాజ్యమున్ను

అహమ్మదానగర, విజాపురగోలకొండ రాజ్యవృత్తాంతము.

కొత్త దుర్గ్గాలున్ను ఆక్రమించ్చుక బలవంతుడై రాజ్యం శేస్తా వుండ్డును ఆయనవద్ద గిండ్డిబెట్టుకవుండ్డగా అతగానికి యెదుల శాహు అనే పేరు వచ్చెను డేగలపట్టుక వుండ్డగా నిజాం శాహు అనేపేరు వచ్చెను కుక్కఁలకాపాడేటందులకు చేర్వగాడై యుండ్డగా కుతుపనమలక అనేపేరు వచ్చెను యీాముగ్గిరిలో యెదులశాహు అనే ఆయన విజయాపురమున్ను నిజాంశాహు అనే ఆయన అహముదానగరమున్ను కుతుపనమలక అనే ఆయన గోలకొండ్డానున్ను యీామూాడు సంస్థానాలున్ను యేలుతావుండ్డురు బెడదకోట బరీదువారు వీరలదొరతనము లనంగా నూాకేండ్లదనింన్ని వారిలో నిజాంశాహు పెద్దలు ఆతర్వాత యెదులశాహు ఆపిమ్మట కుతుపనమలక యీా క్రమాన సింహ్మాసనాలను ఉడుగర బహుమానం పక్కఁలాకులు నడుపుచు యీామూాడు యిండ్లనున్ను మంచ్చిగుర్రాలుగా లక్షగుర్రాలున్ను నూారు యేనుగ ఘట్టాలున్ను కాల్బలంయెలే రాజ్యముగాదు కొలిచేతురకలు లేరు కన్నాఁటకాన చతురంగ్గబలమున్ను కలదు గనక యిక్కఁడి జగడాల నేపుఁ ఆదేశమువారు యెరుగరు అటుగనక కన్నాఁటకం వారి ముండ్దర కడ మదొరతనాల వారు నిలువలేరు అని కన్నకార్యములు తెలిపినండ్డులకు అంక్కుఁశేరావు జగదేవరావు పలకరించ్చినది సరె అనిమలకరావు జెప్పినది అని మొనలను తారశిల్లినప్పుడు తురకలు యెదురు బలమున్ను తనబలమున్ను జూచుక జగడం శేశేది లేదు ముప్కుఁరముగానడవగా యెదటివారు పిరిగినట్టాయనా యెండ్డుబోయినా విడువక నరుకుదురు యెదటివారు హమ్మత్తుగా నిల్చినట్టాయనా వెనకబతిమాలుదురు ఆవర్త్తమానములు యెరిగి వాటికి పిన్నపెద్దలు సియ్యోగులు జగడం శేశేది కార్యంగాదు తీశిరమ్మంట్టే ఆక్షణమె తీశివచ్చే దింత్తేగాని అనిమొనలకువచ్చి వెనకతీశివచ్చినట్టు అయితే ప్రభుత్వానకు

కొదవగా అనేఅభిమానం యెంచ్చి నిలిచేదిలేదు అటుగనక కన్నాటకంవారు విచక్షణులై కార్యాకార్యములు తెలిశి జగడమిచ్చి పోరాని కార్యమైతే యెదు రెక్కినడచి ఉత్తరింత్తురు, కాబట్టి ప్రభుశక్తిగలదు కాబట్టి బంట్లుబయిదళాలున్ను అంద్దరున్ను పనికివత్తురు అని దెలుపగా వద్దనున్న అమరనాయకంవారలు అంద్ద రున్ను ఆతీరున్నె అవునని విన్నపం శేశినారు గనక రాయలవారు ముంద్దువెన కలు జగడాలు జంక్కేలు శేశి జయాపజయములలో వుండ్డినమీారు తెస్సా యగా తెలుసును గనక తురకలమీాది కార్యం శేయవలసివుంన్నది అంద్దరున్ను తలలుకడుక్కోని పయనములై వుండ్డుడా అని అంద్దరికింన్ని ప్రత్యేకం ప్రత్యేకంగ్గా ఉడుగర వక్కలాకులు యిచ్చి పంప్పినవారై అప్పాజిమొదలయిన ఆప్తులతో మాటలాడుతావుండ్డగా గజపతులరాజ్యంబు శ్రీపురుషోత్తమాన నుండ్డింద్ది వేగులవాయువేగి హనుమత్తయ్యాను మనోవేగి పురుషా మృగమయ్యాను వచ్చినిలిచి రాయలదేవునితో వింన్నపంశేశినారు గనక రాయలవారనిన వివరం విద్యానగరమంద్దునుండ్డి పయనగతుల తర్లి గజపతి రాజ్యంబ్బు శీమభూము లున్ను చూస్తూ రాజమహేంద్రంవారు కటకము మొదలైనవి వీక్షించ్చి ముకుంద్ద బాహుబలేంద్రులు జగన్నాథానుండ్డగా పురుషోత్తమానకుపోతిమి శ్రీకృష్ణదేవుని పట్ణం శృంగారమునకు, పద్యం

సీ. ఏవంకఁజూచిన హేమకుంభప్రభా మండితోజ్జ్వలసభామంటపములు।
నేవీధిఁజూచిన నిత్యురంభాస్తంభ దర్పణాంచితగృహద్వారభూమి।
యేచాయఁజూచిన నిభతురంగానేకరాహుత్త సుభటవిరాజితంబు।
నేదిక్కుచూచిన నేణనేత్రానుచ ఘనసారమృగమదగంధలహరి।
యెచటఁగనుఁగొన్న నవరత్నఖచితరచిత। హాటకోన్నతవివిధశృంగారవనము
గలిగి చూపట్టు దేదీప్యకలితమగుచు। శుభకరంబుగఁ బట్టనశోభితంబు.

యిట్టిశృంగారశేఖరమైన పట్టమంద్దు జగన్నాయకులు మహాయాత్సవము నకు దిగ్దేశములనుండ్డి వచ్చి గృహస్తులు యతీశ్వరులు వానప్రస్థులు బ్రంహ్మచా రులు బ్రాంహ్మణోత్తములు పుణ్యాంగనలుంన్ను క్షత్రియులు వైశ్యులు శూద్రులు తక్కిన పదునెనిమిదిజాతులవారున్ను వచ్చి స్వామినిదర్శించ్చి స్వామియొక్క ప్రసాదం మీారువారనక స్వామిదేవళములో స్పృష్టిదోషం దృష్టిదోషం వర్ణా శ్రమ ధర్మానీత శుచి అశుచి కలియుగవైకుంఠమై వొప్పుతావుండ్డే ఆయొక్క శ్రీతారకబ్రంహ్మమైన జగన్నాథుల మహిమాను ఆస్తలం వర్తమానములున్ను

ప్రసాదప్రభావములున్ను వర్ణింప వెయ్యి శిరస్సులున్ను రెండ్డువేల జింహ్వాలును గల ఆదిశేషునకైన లెక్కింపనలవిగాదు అన్నట్టు తోచును ముకుంద్ద గజపతి వారు బ్రాంహ్మీముహూర్తాన నిదుర మేల్కొంచిన వారై విప్రవర్యద్వయదర్శనం శేశి షోడశపాత్రులున్ను తామున్ను నిత్యాసారిగా రెండ్డామడ మూడామడ దూరం పోయి తిరుగావచ్చి ముఖమజ్జన నామతీర్థమై గ్రహారాధన శేశి జగన్నాధులకు పూజావిధాన ప్రకారాన షోడశోపచారపూజలుంన్ను సహస్ర నామార్చన నైవేద్యాదులు శేశి దీపారాధన పుష్పాంజలి శేశి ప్రదక్షిణ నమస్కారములు శేశి పురము గృహం వెలువడి వచ్చేసమయాన పరదునేదార్లు స్థానాపతులయిన అఘుపురంవారి అనంత్తోజిపంత్తులున్ను మానశింగ్గువారి మాధవయ్యాను చాంచువారి చెంన్నగిరయ్యాను కటకంవారి కరుణాకరయ్యాను వోరగంట్టివారి వోబళయ్యాను ఢిల్లి సురతాణివారి ఫాకోజిపంత్తులున్ను బెడదకోటవారి బేకోజిపంత్తులున్ను గోలకొండ్డవారి గోపోజీపంత్తులున్ను అహామదానగరంపయ్యపరాజున్ను విజయాపురం వీరమరాజున్ను పురాణపురం పురంద్దరయ్యాను బాగానగరం బాబోజీపంత్తులున్ను మొదలుగాగల ముఖాములైన స్థానాపతులు అంద్దరున్ను ప్రాతఃకాలమంద్దు స్నానసంధ్యావందనాదులు ఆచరించ్చి తెల్లనిపట్టుధోవతులు కట్టుకొని చలువలు భయిరవాసలుగా వేసుకొని శుచిరుచి తోడట్టు దేవతార్చన సమయానకు వచ్చినవారై దేవపూజాగృహాంముద్దర లక్ష్మీచావడిలో కూర్చుండ్డగాను గజపతివారునచ్చి నవరత్నఖచితమైన బంగ్గారుపీటమీద కూచుండి వారివారి పురాణీకులునున్ను పిలుపించ్చుక పురాణశ్రవణమైనతర్వాత ఆశ్రుతులైన విద్వజ్జనులుంన్ను ఆశీర్వచన పూర్వకముగా యిచ్చిన విభూతిగంధాక్షత నారికేళ లకు చఫలాదులు గజపతి వారు రెండ్డు చేతులా అంద్దుకొని శిరసావహించి వారలకున్ను స్థానాపతులకుంన్ను జగన్నాయకప్రసాద పణ్యారములు నక్కులాకులుంన్ను యిప్పించ్చి వాలణాను విడిదీలకు పంపినవారై వేరొఖ్ఖబ్రాంహ్మని బిలిచి పాదప్రక్షాళనం శేశి గంధాక్షిత పుష్పములచేత లెస్సగా పాదపూజశేశి నూరు ఘొట్లుంన్ను వక్కలాకులుంన్ను యిప్పించ్చి ఆపాద తీర్థమున్ను పుచ్చుకొని ఆపాద రేణువు శిరసావహించి తర్వాత తాము పాదప్రక్షాళనం చేసుకొని ఆచమనం శేశినవారై బంధుజనులతోడట్టు బంగ్గారు పళ్లెరములు వుంచ్చుమని ప్రసాపాటుకు కూర్చుం

న్నతావున వఖపదార్థమున్ను కొదవబడకుండ్డా సకలమున్ను వడ్డించ్చమని
ఆసం_త్తిని వొఖతావున తెరగట్టి ఆ తెరలో నవరత్నస్థాపితమైన పీఠమున సుఖా
సీనులై కూచుండ్డగా పదివన్నె బంగ్గారున నూరుశేరుల శేయించ్చిన పళ్లెర
మున్ను ఆపళ్లెరంమధ్య వెలహెచ్చు గోమేధికముంచ్చి పళ్లెరములో వడ్డించ్చి
ప్రసాపడేపట్ల వఖతేప కలుపుకొన్న కూర మరివొఖతేప కలుపుకోకుండ్డా భక్ష్యా
లలో వొఖసారి భక్షించ్చినది రెండ్డోతేప భక్షించ్చకుండ్డా శానిశెలు హెచ్చ
రికలుగా చూస్తూవుండ్డి పరాకున ముట్టినప్పటికిన్ని బెత్తపుకోలచేత హస్తము
మీాద స్పరిశించ్చి ముట్టవలదు గనక ఆరీతె తిరుగా అంట్టక ఆరోహణం శేశి
యీారీతున సకలవస్తువులున్ను భుజియించ్చి లేచినపిమ్మట చేతులు గట్టుకొని
శతపదాలు నడుస్తూన్ను సంక్షేపరామాయణం పారాయణం అయిన తర్వాత
వస్త్రాభరణాలంకారులై పేరోలగంబై సకలమైన వారున్ను నగరివాకిట కూర్చుండ్డి
వుండ్డగా గజపతివారు వఖఅంతస్తు చావల్లోనికి వచ్చి కూర్చుండి రెండ్డువిని
యోగముల వారున్ను పిలుపించ్చి వారువారు వుండతగిన వునుకులు కూర్చుం
డ్డనియమించ్చి ప్రస్తావోచితముగా షోడశపాత్రులతోనున్ను పరస్థలపునియో
గులతోనున్ను సంభాషణ శేయుగా నిజాంశాహువారి నీలాద్రిపంత్తులువారున్
న్ను మెదులశాహు కుతుపనమలక వారి స్థానాపతులున్ను అంప్పించ్చిన కాకి
తములున్ను కన్నాటకాధీశ్వరులు కార్యముఖానకు నడిచేవారై చతురంగ
బలమున్ను జతశేసుక భైలుమెరసి సరుదులకువచ్చి కనుపించ్చుకునేవారై
వున్నారు యీావరకు ఉత్త్రరం దక్షిణం దొరలకార్యాలకు హానివృద్ధులకు సహా
యం సంపత్తి నడుపుదురు. ప్రబలమైన కార్యాలఇతే అంద్దరున్ను ఎకగ్రీవమై
ఉత్తరగ అఘుపురంవారి కార్యాలకున్ను నిర్వహింత్తురుగా యిప్పుడు అంతేశి
కార్యాలు యేమి వున్నవి సరుదున వుండ్డేవారు గనక యితరం గాదుగదా మె
దులశాహున్ను నిజాంశాహున్ను కుతుపనమలకవారున్ను సరదుస్థలాలు స్థోమ
శుద్ధిగా యోచనశాయగా పనిలేదు అంద్దుకు మించ్చిన కార్యాలయితే అహ
ముదు నగరం పర్యంత్తం వత్తురు అని ఘునంగ్గాప్రాశి అంప్పినారు మనుష్యయత్న
మున అపజయమని యెంచ్చరాదు కన్నాటకవారికి జయుం నిశ్చయం అఇన
ప్పటికిన్ని సరదుల మూాడు తెగలవారున్ను విరిగినట్టైతె మీా శీమలన్నిన్ని
కోలుబోయి మీాకున్ను అవధివచ్చును కాబట్టి దీర్ఘయోచన విచారించ్చుకొని
యాదిహెచ్చరికలు గలిగి నడిపించ్చుకోవలెను అని మంత్రాలోచనగా అన్నం

(సశేషము.)

శ్రీ ర స్తు.

ఆంధ్రసాహిత్యపరిషత్తృతీయవార్షిక సభావృత్తాంతము.

ఆంధ్రభసాహిత్యపరిషత్తృతీయవార్షికసభ కాకినాడలో ఆ 1914 సంవత్సరము ఏప్రిల్ ది 18-19 తేదులను బహువైభవముగ జరగినది. ది 18 తేది మధ్యాహ్నము రెండుగంటలకుఁ దత్పురపారిశుధ్య సంఘమువారి నూతనవిశాల భవనమునఁ బ్రారంభింపఁబడినది. ఆంధ్రలోకమునం దన్నివైపులనుండి (గోలకొండరాష్ట్రమునుండికూడ) భాషాభిమానులు సభాభవనము క్రిక్కిఱియునట్లు విచ్చేసియుండిరి. అప్పుడు విచ్చేసినవారి సంఖ్య 1500 కుఁ దగ్గియుండదు. కొందఱు స్త్రీలుగూడ వచ్చియుండిరి. సభ నలంకరించిన ప్రముఖులలోఁ గొందఱ పేళ్లిక్రింద నుదాహరింపఁబడుచున్నవి.

మ-రా-రా-శ్రీ రాజారావువేంకటకుమారమహీపతిసూర్యారావుబహద్దూర్‌గారు పిఠాపురము రాజాగారు.

,, మొక్కపాటి సుబ్బారాయఁడుగారు. బి. ఎ. దివాన్, పిఠాపురము.

,, గౌరవనీయ, శ్రీ. కె. ఆర్. వి. కృష్ణరావుబహద్దూర్‌గారు బి. ఎ. కాకినాడ.

,, నెమలి పట్టాభిరామరావుపంతులుగారు బి. ఎ. చెన్నపట్టనము.

,, దివాన్‌బహద్దూర్. ముట్నూరి ఆదినారాయణయ్యగారు, చెన్నపట్టనము.

,, చెదలవాడ సుందరరామశాస్త్రిగారు, చెన్నపట్టనము.

,, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు, కాకినాడ.

,, రావుసాహెబు. జి. వి. రామమూర్తిపంతులుగారు, బి. ఎ. విజయనగరము.

,, జి. వి. అప్పరావుపంతులుగారు, బి. ఏ. విజయనగరము.

,, టి. శంకరలింగంపిళ్లైగారు, బి. ఏ. బి. ఎల్. బళ్లారి.

,, నాభిరామమూర్తిపంతులుగారు. బి. ఏ. బరహంపురము.

,, ఆయుర్వేదమార్తాండభిషఙ్మణి పండిత, డి. గోపాలాచార్యులుగారు చెన్నపట్టనము.

మ-రా-రా-శ్రీ వావిలికొలను సుబ్బరావుగారు, చెన్నపట్టనము.
,, మేడేపల్లి, వేంకటరమణాచార్యులుగారు, విజయనగరము.
,, కే. వి. లక్ష్మణరావుగారు, ఎం. ఏ. నడిగూడెము.
,, డాక్టరు. ఆచంట, లక్ష్మీపతిగారు. బి. ఎ. ఎం. బి. అండ్. సి. ఎం. చెన్నపట్టనము.
,, పురాణమునాగభూషణంగారు ఎం. ఎ., బి. ఎల్, చెన్నపట్టనము.
,, తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు, కొవ్వూరు.
,, డి. వి. రమణరావుపంతులుగారు, తణుకు.
,, జి. యేనాదిరెడ్డిగారు. కోవూరు.
,, రావుబహద్దూర్, కె. సూర్యనారాయణమూర్తినాయుఁడుగారు, కాకినాడ.
,, డి. వి. యెస్. ప్రకాశరావుగారు, బి. ఏ. కాకినాడ.
,, రావుబహద్దూర్. కె. రామానుజాచార్యులుగారు ఏం. ఎ., బి. ఏల్. విజయనగరము.
,, వేలమూరి వేంకటసుబ్బరావుగారు. బి. ఏ., బి. ఎల్. పెద్దాపురము.
,, కూచినరసింహముగారు, బి. ఏ. పిఠాపురము.
,, జయంతి రామయ్యపంతులుగారు. బి, ఎ, బి. యెల్. చెన్నపట్టనము.
,, దినవహి హనుమంతరావుగారు. బెజవాడ.
,, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు, రాజమహేంద్రవరము.
,, పాడి వేంకటస్వామిగారు, కాకినాడ.
,, శొంఠి భద్రాద్రిరామశాస్త్రిగారు, ఉర్లాము.
,, పురాణపండ మల్లయ్యశాస్త్రిగారు, పిఠాపురము.
,, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు. రాజమహేంద్రవరము.
,, } శ్రీరామకృష్ణకవులు, పిఠాపురము.
,, }
,, దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు, కాకినాడ.
,, దివాన్‌బహద్దూర్, డి. శేషగిరిరావుపంతులుగారు. బి. ఎ., బి. ఏల్. కాకినాడ.
,, న్యాపతి సుబ్బారావుపంతులుగారు. బి. ఏ., బి. ఎల్. రాజమహేంద్రవరము.
,, ఎఱ్ఱమిల్లి, మంగయ్యగారు బి. ఏ., బి. ఎల్. కొవ్వూరు.

మ-రా-రా-శ్రీ శ్రీమునగాలరాజాగారు.

,, గంటిలక్ష్మన్నగారు. బి. ఎ., బి. ఎల్. రాజమహేంద్రవరము.

,, రావుబహద్దూర్, ఆనరబిల్. యం. రామచంద్రరావుపంతులుగారు బి. ఏ, బి. ఎల్. ఏలూరు.

,, శివపురపు వీరభద్రపాకయాజిగారు, హైదరాబాదు.

,, తాడూరి లక్ష్మీనరసింహారావుగారు, పిఠాపురము.

,, పెద్దిభట్ల వీరయ్యగారు. బెజవాడ.

,, వి. విశ్వనాథశర్మగారు. ఏం. ఎ. రాజమండ్రి.

,, శ్రీరాజావిక్రమదేవవర్మ బహద్దరుగారు. విశాఖపట్టనము.

,, కే. వి. శ్రీనివాసాచార్యులుగారు బి. ఏ. పెద్దాపురము.

,, వావిలాల వేంకటశివావధానిగారు. బి. ఎ. విశాఖపట్టనము.

,, నోరిరామశాస్త్రిగారు. బెజవాడ.

,, చల్లా వేంకటవీరయ్యశాస్త్రిగారు బి. ఎ. కాకినాడ.

,, జయంతి శ్రీరామమూర్తిగారు. విశాఖపట్టనము,

,, పి. వీరరాఘవులుగారు. తెనాలి.

,, కొండూరి సుబ్బారావుగారు. తిరుపతి.

,, కె. సాంబశివరావుగారు బి. ఎ. కాకినాడ.

,, మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిలుగారు. విజయనగరము. (మొదలైనవారు.)

కార్యారంభమునకు ముందు శ్లోకరూపముగ మ॥ రా॥ నాభిరామమూర్తిపంతులు బి. ఏ. గారు దైవప్రార్థనముం జేసిరి. పిదప గౌరవనీయులు, పోలవరాధిపతులు, నాహ్వానసంఘాధ్యక్షులు నగు శ్రీరాజాకొచ్చెర్లకోట రామచంద్రవేంకటకృష్ణరావు బహదరు బి. ఏ. గారు తమ మృదుమధురవాక్యములతో సభ్యులకు స్వాగతమొసంగిరి. అనంతరము విజయనగరము సర్వకలాశాలా ముఖ్యోపాధ్యాయులగు రావుబహాదరు కిలాంబి రామానుజాచార్యులు ఎం. ఏ., బి. ఎల్ గా రగ్రాసనాధిపత్యమును వహించిరి. పిమ్మటఁ దామ సభకు రాఁజాలకపోయితిమనియు జయప్రదముగ సభ జరుగుఁగాక యనియు శ్రీవేంకటగిరి మహారాజావారును గౌరవనీయులగు శ్రీపానుగంటి రామారాయనింగారు ఎం. ఏ., రావుబహాదరు కందుకూరి వీరేశలింగముపంతులుగారును బంపిన తంత్రీ

వార్తలు చదువఁబడినవి. పిమ్మట నాచార్యులవారు భాషావిషయకోపన్యాసముం జదివిరి. పరిషత్కార్యనిర్వాహక సభాధ్యక్షులగు జయంతిరామయ్యపంతులు బి. ఏ., బి. ఎల్ గారు తృతీయసంవత్సర కార్యనివేదనముం జదివిరి. వావిలికొలను సుబ్బరావుగారు "దాశరథిభరతగుణవర్ణనమును" గుఱించియు, కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిలుగారు "మహాపురుషుల చరిత్రములం జదువుట యందలి యావశ్యకతం" గూర్చియు, కాళ్లకూరి సాంబశివరావు బి. ఏ. గారు "విమర్శనాస్వభావము, దాని లాభముం" గూర్చియు వ్యాసములం జదివిరి. సభాధ్యక్షులకు వందనములతో నాఁటిసభ ముగిసెను.

మఱునాఁడు (19-4-14) ఉదయమున నేడునరగంటలకుఁ బరిషత్కార్యనిర్వాహకసభ జరగినది. శ్రీ పిఠాపురము రాజాగారగ్రాసనాధిపతిగ నుండిరి. ఈ సభలోఁ బెక్కురు క్రొత్తసభ్యులు చేర్చుకొనఁబడిరి. కాకినాడపురవాసులును రావుసాహెబు బిరుదాంకితులును నగు మ. రా. పైడా వేంకటచలపతిగారు పరిషత్తునకుఁ బోషకులుగా నుండి రు 1000 లిచ్చుటకు వాగ్దాన మొసంగిరి. ఇటీవలఁ గొంతకాలమునుండి యాంధ్రుల మనస్సుల నావరించియున్న గ్రామ్యగ్రాంధికాంధ్రతారతమ్యమును గూర్చిన చర్చ జరగినది. ఈ విషయమునుగూర్చి యాలోచనచేసి తమ యభిప్రాయమును దెలుపవలసినదిగా నొక యుపసంఘము కొంతకాలముక్రిందట నియమింపఁబడి యున్నదనియు నా సంఘములోని సభ్యులు తమ యభిప్రాయమును దెలిపియుండలేదు గనుక వారి యభిప్రాయము తెలియువఱకు నీ చర్చ నిలుపవలయుననియు రావుసాహెబు గిడుగు రామమూర్తిపంతులుగారు, గురుజాడ అప్పారావుపంతులుగారును వాదించిరిగాని సభవా రందునకంగీకరింపక 1912 సం. మే నెలలోఁ జెన్నపట్టణమునందు జరగిన పండితగోష్ఠి యొక్క యభిప్రాయమే యీ పరిషదభిప్రాయముగ గ్రహింపవలసిన దనియుఁ దీర్మానించి యీ తీర్మానము విశ్వవిద్యాలయాధికారులకును, విద్యాధికారిగారికిని, దొరతనమువారికిని దెలుపవలయు నని నిర్ణయించిరి. పూర్వోక్త పండితగోష్ఠిలో జరగిన తీర్మానములు పరిషత్పత్త్రిక ప్రథమసంపుటము ప్రథమసంచికలోఁ బ్రకటింపఁ బడినవి. పాఠకసౌకర్యార్థ మీక్రిందఁ నుదహరింపఁబడినది.

తీర్మానములు.

"1. గ్రామ్యభాషా ప్రయోగము.

గ్రంథరచనయందుఁ బూర్వలాక్షణిక మతానుసార మగు భాషను బ్రయోగింపవలయునుగాని లక్షణవిరుద్ధమగు భాషను బ్రయోగింపఁగూడదు.

గ్రంథములను మృదుమధురశైలిని రచింపవలయుననుట సర్వజనసమ్మతము. అట్లొనరించుటకు లక్షణభంగ మవశ్యముకాదు. లక్షణభంగము కాకుండ భాషా వైచిత్ర్య మెంతయైనం గనుపఱుపవచ్చును. అందువలన శైలిభేదము లేర్పడును

2,3, అర్ధానుస్వారము, శకటరేఫము:

అర్ధానుస్వారశకటరేఫములు శబ్దస్వరూపావయవములగుటను శబ్దవ్యుత్పత్తుల నిరూపించుటకు సాధనము లగుటను త్యాజ్యములు కావు.

4. సంధి:—

గద్యరచనయం దచ్చటచ్చట నర్థావబోధనార్థమును, బఠనసౌకర్యార్థము నవశ్యమని తోఁచినపట్టులందు సంధిచేయకున్నను దోషము కాదు, కాని సంధి యెప్పుడును జేయనక్కఱలేదని వాదించువారి వాద మంగీకార్యము గాదు. సంధిచేయుటయుఁ జేయకుంటయుఁ, గొంతవఱకుఁ బాఠకాధికారము ననుసరించియుండును. పసిపిల్లలనిమిత్త ముద్దేశింపఁబడిన పుస్తకములందు శాస్త్రవిరుద్ధము గాకుండ సంధిని తగ్గించుట మంచి దనియే చెప్పవచ్చును. పద్యరచనయందు సర్వథా విసంధి దుష్టమే.

5. అన్యదేశ్య పదప్రయోగము:—

పూర్వకవిమతానుసారముగా రసపోషణమునకై యచ్చటచ్చట యథోచితముగా నన్యదేశ్యపదములం బ్రయోగింపవచ్చును. కాని యథేష్టముగాఁ బ్రయోగింపఁగూడదు. అన్యభాషలలో నుండు భౌతికశాస్త్రాది గ్రంథములఁ దెలుఁగులోఁ బరివర్తనము చేయునపుడు తత్తచ్ఛాస్త్రోచితపారిభాషిక పదంబులు తెనుఁగునఁ గాని సంస్కృతమునఁ గాని నిర్ణయించి వానినే యుపయోగింపవలయును. ఏకపదములు దొరకనిచో నాతిదీర్ఘసమాసపదంబుల నిర్మింపవచ్చును, అట్లొనర్చుటకు సాధ్యముకానిచో నన్యదేశ్యమూలపదంబుల నాంధ్రభాషా సంప్రదాయానుగుణముగా సంస్కరించి గ్రహింపవచ్చును. పారిభాషికపదములు సంస్కృతమున నుండినచో భరతఖండములోని యన్నిభాషలకును సమానములుగా నుండును గాన నట్టిపదములు బహుశః సంస్కృతములోనే యుండుట మేలు. ఆంధ్రసాహిత్యపరిషత్తువా రట్టిపదముల నిర్ణయించి ప్రకటించిన బాగుండును."

ఇరువదిమందికంటె నెక్కుడు గల యీసభలో నలుగురుమాత్రము భిన్నాభిప్రాయు లుండిరి. వారిలో ముగ్గురు విజయనగరమునుండి వచ్చినవారే.

ఆనందసంవత్సరమున శ్రీపిఠాపురము రాజావారు సభాపతిగ నుండునట్లు తీర్మానింపఁబడినది.

ఆనాఁ డుదయమున నడచిన కార్యవిచారశేషము సాయంకాలమునఁ గూడ నడపఁబడినది. అందు మున్నిటివలెనే యిప్పుడుఁగూడ జయంతిరామయ్యపంతులు బి. ఏ., బి. ఎల్ గారు పరిషత్కార్యనిర్వాహకసభాధ్యక్షులుగను, నెమలిపట్టాభిరామరావు బి. ఏ. గారును, పురాణము నాగభూషణము, ఎం. ఎ., బి. ఎల్ గారును, ఆచంట లక్ష్మీపతి, బి. ఏ. ఎం. బి. సి. యమ్‌గారును గార్యదర్శులుగను, దివాన్ బహాదరు కంచికృష్ణస్వామిరావు సి. ఐ. ఇ. గారు, రావుబహాదరు, గౌరవనీయ, పిట్టి త్యాగరాయసెట్టి బి. ఏ. గారు, కోశాధ్యక్షులుగను నెన్నుకొనఁబడిరి.

ఆనందసంవత్సరాయవ్యయనిర్ణయము చేయఁబడినది. గతసంవత్సరమునందువలెనే పుస్తకసంపాదనమును, నిఘంటు నిర్మాణము జరగునట్లును, లోకములో నచ్చటచ్చట వ్రాఁతరూపముగ వ్యాపించియున్న పాటలు, పదములు మొదలగువానిని వ్రాయించునట్లును, ఇంతటినుండి పరిషత్పత్త్రిక మాసమున కొకసారి వెలువడునట్లు నేర్పాటు చేయఁబడినది.

ఈనాఁటి భాషావిషయకసభ మధ్యాహ్నోత్తరము గం. 2-30 మొదలు 5 గంటలవఱకు జరగినది. శ్రీపీఠికాపుర నృపాలుఁడు సభాపతిగ నుండెను. అందు పురాణపండా మల్లయ్యశాస్త్రిలుగారు గ్రాంథికవ్యావహారికభాషాపరస్పరసంబంధముం గూర్చియు, ఆయుర్వేదమార్తాండ భిషఙ్మణి వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులుగా రాయుర్వేదీయ యంత్రశస్త్రములం గుఱించియు, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిలుగారు గ్రహణములం గూర్చి జ్యోతిశ్శాస్త్రమునందును బురాణములయందును జెప్పఁబడినదాని సమన్వయమును గూర్చియు, మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు కాశ్మీరరాజచరిత్రముం గుఱించియు వ్యాసములం జదివిరి. వ్యవధి చాలనందున యుద్ధమల్లుని బెజవాడ శాసనముంగూర్చిన యుపన్యాసమును జయంతి రామయ్యపంతులుగారు చదువలేదు. ముట్నూరి కృష్ణారావుగారు సభకు రాఁజాలని కారణమున దేశీయవాఙ్మయప్రపంచవ్యాసము చదువఁబడలేదు. అనేకకవులు పరిషత్తుపైఁ బద్యములం జదివిరి. వాని నీ వ్యాసావళియందుఁ జూడఁగలరు. ఈసభ రెండుదినములలోఁ జదువఁబడిన వ్యాసములును గొన్ని యీ పత్త్రికయందే క్రమక్రమముగఁ బ్రకటింపఁ బడును.

ఆనాఁటి సభ ముగియునపుడు బల్లారిలోని యున్నతన్యాయవాది శిఖామణియు, వేదార్థచంద్రికాపత్రికాధిపతియు నగు టి. శంకరలింగం పిళ్లై. బి. ఏ. బి. ఎల్ గారు మనోహర మృదువచనరచనతో నాంధ్రభాషాపోషకుఁ డైన కృష్ణదేవరాయల రాజధానియగు హంపికిసమీపమందున్న తమబల్లారిపురమందుఁ బరిషచ్చతుర్థవార్షికసభ కూడవలయు నని కోరిరి. పరిషత్పక్షమునఁ దదాహ్వానము నంగీకరించుచు వారికిని ఘనాదరముం జూపిన కాకినాడ పురవాసులకును జయంతి రామయ్యపంతులుగారు వందనముల నర్పించిరి. సభాధ్యక్షులకు, సభ్యులకుఁ, దమకార్యాలయము నీసభకై యొసంగిన పురపారిశుధ్య సంఘాధ్యక్షులకును వందనములతో నాఁటిసభ ముగిసినది.

ఈసభ రెండుదినములు మిగుల నుత్సాహముతో జరపఁబడినది. వాద ప్రతివాదములు, వ్యాసపఠనము మున్నగునవియెల్లఁ దెనుఁగుభాషలోఁ గావింపఁబడియెను.

కాకినాడ పౌరవర్యులు, నాహ్వానసంఘమువారు, సభకై వచ్చినవారి నత్యంత భక్తిశ్రద్ధలతో నాదరించిన విషయము శ్లాఘాపాత్రమైనది. ఈసభను గాకినాడ కాహ్వానించి యాదరించి, చక్కని యేర్పాటులతో సభజరపించిన రావుబహాదరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తినాయుఁడుగారును, నాళము పద్మనాభము బి.ఏ. గారును మిగుల నభినందనీయులు.

కాకినాడపరిషత్సభలోఁ గవీశ్వరులు చదివినపద్యములు.

---

1. (చివుకుల వేంకటాచలశాస్త్రిగారు- సికింద్రాబాదు.)

ఆంధ్రబ్రాహ్మీస్థితి.

చ. చలువలతేనెఁబోని మేయిచాయము, గిల్కుగిలుక్కుచప్పుడుం
బలుకుహారంగుమట్టెలును, బల్కులపుల్గు, పసిండివీణెయుం
దలఁపుఁగొలంకుపక్కి నెఱతత్తడి, పొత్తము, తమ్మిగద్దెనో
పలుకులతేమ! మాదు తలవాకిట గొండిలిసల్పుమమ్మరో!

ఉ. శ్రేష్ఠుఁ డశేషసద్గుణగరిష్ఠుఁడుఁ బ్రేష్ఠుఁడు నైన యాసుర
జ్యేష్ఠునిచి తమందు జనియించి నిరంతరవేదపాఠబ్బం

దిష్టముతో తదీయముఖ నీరజపాళుల సంచరించుచున్
స్పష్టసుఖంబు నీవనుభవించితి వాదిని భారతీసతీ! 2

శా. శాంతంబైన వనాంతరాళమున వాసంబుం దగం జెంది య
త్యంతం బాత్మమహత్త్వబోధ జనితాహ్లాదంబుతో నుండు సు
స్వాంతుల్పూజ్యులు వామలూరుతనయ వ్యాసాదివాచంయముల్
సంతోషమ్మును నీకుఁగూర్చిరి భూషల్వెట్టి యోభారతీ! 3

సీ. కమలకేళీలోలకలహంసశాకలీకలకలవ్యాకులజలసరములుఁ
దరుణారుణాక్షీణ కిరణశోణకిసాలగిళనసుస్వానకోకిలకులములు
మందానిలాందోళితేందీవరస్పందదిందిందిరామందబృందములును
గుంజపుంజప్రసక్తమంజరీసంజాతమంజులశయ్యాక్షమాతలములు
గలుగునుపవన మొసఁగుసౌఖ్యంబునేని, యత్కవిత్వపఠితలు దామతకరింతు
రట్టిభాసకకాళిదాసాదికవుల, యాదరమ్మును బడసితివమ్మవాణి! 4

ఉ. అంతఁ దెలుంగుదేశమున కల్లన డిగ్గి త్రిలింగవాణివై
యెంతయు నన్నయాదికవు లిద్ధమతిం గయిసేయ సుంతయుం
జింతయెఱుంగ కాంధ్రధరణీజనులం బ్రమదోర్మిమాలికా
దంతురితాంతరంగసముదగ్రులఁ జేసితి వోసరస్వతీ! 5

మ. తరువాతం గవిచాతకంబులకు నూత్నాసారమై మూరురా
యరగండన్ బిరుదంపుఁ బెండరము జంఘాగ్రంబునందాల్చి బం
ధురకీర్తింగను కృష్ణరాడ్వరుఁడు నిన్నున్ సింగపుంగద్దె న
బ్బురమేపారఁగ నుండఁజేసి దయతోఁ బోషించె భాషాసతీ! 6

ఉ. ఆవెనుక న్నినుంగను మహాశయు లెందువసింపకుంటచే
జీవితమందె సంశయముచెంది యొకానొకమూలనీవు చిం
తావికృతాకృతిన్వఱలఁ దత్సమయంబున నాంగ్లరాజు లు
చ్చావచయత్నము ల్మిగులఁ జల్పిరి నీయభివృద్ధికమ్మరో! 7

చ. నకనకలాడుబాసయెలనాఁగకు నీ కిల హూణపాదృతిన్
గకవిక యీఁగికొండొక సుకంబుతలన్ వెలిపుచ్చుపట్టునం
గొకిబికికై సరుల్వెడలి గొగ్గికవిత్వముఁ జెప్ప నాల్కనం
జికమక సెందఁగావలసెఁ జీటికి మాటికి నిప్డు సత్కవుల్. 8

సీ. వారిమొంకన దోస్తిదారుడా యిందంక యేమదో గాల్లొల్లిమెరక జెయుర
వరె యీరవానీకు మరియేంగదా అంటె యినిపిస్తిగదిసాలె మినురబాష
పోదుగాలమాగొల్లపొల్ల బల్లదిపెర్గు పోస్తదిలేదాంతో నాస్తజేశి
దుకునంకుబెద్దోల్లతోల్కపోయ్ తామాశథాండ్లన్ని జూయించిఅండ్లవొకటి
కొంటబోయ్ కుడితిసిల్గుట్టిస్తె దగ్జోడు గుడ్డగొట్టెశిండు కొంతదాంళ
అడెపాయె పోసీయుమంటరు మావ్రొళ్లు చైసుంద్రీమీకేమిశాతగాదు
అనినేను సాల్లిగాడునుబోయి అడిగితేఅంటమగద దగ్జిపెంటుగాడు
నాయంటివ్రొల్లకు నూరతొంబయ్యారు మందికిగుట్టనామాటఅనరు
బడెబుద్దిమంతుడౌ పదు దున్య లెక్కడింతోడు లేజేహెయినిం కూకె వుంసు
అనివాడు పెంటుగా డన్నంకకన్గొడ్తి లాతిచ్కొమంట సాల్లికునునేను
అజ్జూశిసాల్లిగాడప్డ కొడ్ఘాబోల్కె కర్చుకిచ్చిందు నాగ్గైదు లాస్గ
నాల్గుధప్పాల నానంగ యీనంగ నేరోకాయ్ చిరోకాయ్ చిరుంజికొట్టి
వానిరోగమప్డ బడెబాగతింపితి, గప్పుడంతబట్ట వొప్పజెప్పె
గిల్లగిల్లమాకు కొట్లాటయియ్యాల, పెద్దదైంది యింశపొద్దుమాకె. 9

ఉ. ఇట్టి నికృష్టగ్రామ్యముల నేర్తెఱఁగూర్చి సమస్తగ్రంథముల్
నెట్టనవ్రాయనౌ ననుమనీషులు కొందఱుఁ, బ్రాసముల్ యతుల్
గిట్టవటంచు వాకొనెడు కృష్టులుకొందఱు, సంధు లూడఁగాఁ
గొట్టుట మంచికార్యమనుకోవిదులు న్మఱికొంద ఱమ్మరో! 10

సీ. రీతులన్నను వంకమూతివెట్టెడువారు వృత్తు లన్నను మోవి విఱుచువారుఁ
బాకద్వయం బన్న నోకిలించెడివారు ధ్వనులన్న దుడ్డుచే కొనెడివారు
శయ్య యన్నను జాలుచాలు లెమ్మనువారు సౌచిత్యమన నవ్వనట్టివారు
లసదలంకృతులన్నఁ బసలే దనెడివారు సమసనం బనఁ గేలిసలుపువారు
సంస్కృతంబన్న నింకొకసారి యటులఁ, బలుకఁబోకుఁడటంచును దెలుపువారు
బయలుదేఱిరి కొందఱు ప్రకృతమందు, భారతీనీవు కళవళపాటుఁజెంద. 11

క. నెఱిఁగూరుచు సింగారం, బఱసున్నలు బండిఱాలు నఱిముఱిసీర్కుఱ
జెఱుపని వచియింతురుకొం, దఱు తమకుం దోఁచినట్లు తల్లీ! వాణీ! 12

ఉ. ఒప్పులకుప్పనై తొలుత నుబ్బిననేనిపు డక్కటక్కటా!
తప్పుల కుప్పనైతినిగదా యని డెందము నందు నెంతయుం

డెప్పరమైనవిమ్మట ఘటింపకుమమ్మ! మనీషు లెందు ని
న్నెప్పరికించి యొక్క త్రుటియు న్వసియింపరు నమ్మ మమ్మరో! 13

చ. అలికులముల్ సరోజమునయందునఁ బర్వఁగ నీయకమ్మ! క్రొ
న్నలనలినంబునందు శయనింపఁగఁ జేయకుమమ్మ! గట్టులం
గలువలనుండి ముత్తెములఁ గారఁగ నీయకుమమ్మ! యింక ని
చ్చలుఁజెలువారు నాంధ్రపరిషత్తు నినుం గనుమమ్మ! భారతీ! 14

శా. నీసేమం బరయంగ నాంధ్రపరిషన్నిర్మాణముం జేసి మ
ద్రాసన్ పట్టణమందు రాజులును విద్వాంసు ల్కవీంద్రు ల్మహా
ల్లాసప్రక్రియఁ జూచుచుండ నిఁక నేలా? చింతిల న్నీవు, సం
త్రాసంబున్విడి నిర్విచారముగ నుండం జెల్లదే? తల్లిరో! 15

క. సురతరుపుష్పరసంబునఁ, గరము రసాలఫలరసము గలిసిననుభవ
త్సురుచిరవాగమృతపుమా, ధురిఁ బెరయదిఁ కిట్టి నిన్నుఁ ద్రోతు రెవిబుధుల్

ఉ. ఒక్కొకపట్టనంబునన యుంటివి మున్నతివృద్ధితోడ ని
ప్పెక్కుడఁగాంచిన న్మిగుల వృద్ధిని జెందుచు నుంటివైననుం
జక్కఁగఁ బూర్వ సూరులకుఁ జాలరు నేఁటి మనీషు లింక నీ
యొక్క కొఱంత యే, యదియు నొయ్యనఁ దీఱకపోదు భారతీ! 17

చ. కవివరు లెల్లఁ బూర్వమునఁ గావ్యపురాణముల్ రచించుచున్
బ్రవిమలమైన భూషణపరంపరఁ దాల్చిరి నేఁటిసత్కవుల్
నవలలు నాటకంబులును నాణె మెలర్పఁగఁ గూర్పనీవిఁకన్
నవనవభూషణంబుల ఘనంబుగఁ దాల్చుచుఁ గుంద నేఁటికిన్. 18

మ. "అతుల ప్రాభవులౌ నృపు ల్మను సముద్యద్రీతిమైఁ గొల్వ ను
న్నతిగా వారిసభాంగణంబులను సన్మానంబునుం గాంచు నా
స్థితి నేఁ డీగతినయ్యె" నంచుమదిఁ జింతింపంగఁ బోకమ్మ! యు
ద్ధతులౌ రాజులు నేఁటికిం గలరు నీ దైన్యంబుఁ దప్పింపఁగన్. 19

శా. తల్లీ నీయభివృద్ధికోసమయి ముద్రాయంత్రము ల్వార్తలు
ద్యల్లీలంబ్రకటించు పత్రికలు గ్రంథాగారముల్ గ్రంథముల్
ప్రోల్లాసంబున వృద్ధిసేయుచు సదాంధ్రుల్ గాంచుచుండంగనీ
యుల్లంబందడలంగ నేల? యిఁకనోహావాణి మోదిల్లుమా! 20

(2) శ్రీరామకృష్ణకవులు—శతావధానులు—పిఠాపురము.

ఉ. స్వస్తి సమస్తనాగరకసమ్మతపండితదేవరాడుప
న్యస్తమహావిశేషవిషయప్రతిబోధితసర్వలోకసా
ధుస్తుతనన్నయాదికవిధూర్వహసంకలితాంధ్రసాహితీ
విస్తరకార్యదర్శులకు విశ్వజనీనులకున్ భృశమ్ముగన్. 1

సీ. మరలసేఁడాదికి మనసమావేశమ్ము దయయుంచుఁడీ యన్నదమ్ములార!
సాహిత్యసభలోని సంగతుల్మొదలంటమఱచిపోకుఁడి కార్యమహితులార!
ఆంధ్రభాషాపోషకత్వాహితముఁ బాపి యుద్ధరింపుఁడి సూక్ష్మబుద్ధులార!
తాళపత్రగ్రంథతతిఁ బుర్వు దినకుండఁ బాలింపుఁడీ దేశభక్తులార!
నన్నయకుఁ దణ్కులోనఁ దిక్కన్నయజ్వ,కల్లగుంటూరిలోనఁ బోతన్నకొంటి
మెట్టజ్ఞాపకచిహ్నముల్గట్టవేగఁ, దలఁపుఁడీయాంధ్రనాయకాధ్యక్షులార! 2

సీ. పీఠికాపురరాజు పెట్టినభిక్షమక్షయమాంధ్రసాహిత్యసభకునయ్యె
సూర్యరాయవిభుండు చూపిననిజదీప్తి తెలుఁగువారికి రత్నదీపమయ్యె
మంగమాంబాపుత్రిమణిత్యాగమహిమంబుపలునృపాలురకొజ్జబంతియయ్యె
రావువంశాంభోధిరాకేందువేత్తృత్వమాంధ్రభాషాపోషకమృతమయ్యె
భయము లేదింక నాంధ్రప్రపంచమునకు,మాతృభాషకుదినములుమంచివయ్యెఁ
దెలుఁగుబాసకువిజయంబుదిటుకొనియె,నాంధ్రసాహిత్యపరిషదమరమయ్యె.

(3) గాదెశ్రీజగన్నాథస్వామిగారు-కాకినాడ.

ఆం ధ్ర భా షా ప్ర శం స.

(ఆంధ్రసాహిత్యపరిషత్కూటసమర్పితము.)

నవరత్నమాల.

మ. తొలుతన్ రాజమహేంద్రుకాలమునఁ బ్రాదుర్భావమున్ జెంది యా
వల నెల్లూరినృపాలముఖ్యులకృపన్ వర్ధిల్లి యామీఁద రా
యలసన్మానమునన్ సమస్తదిశలన్ వ్యాపించి పెంపొందు మా
తెలుఁగున్ బోలెడి సౌమ్యభాష గలదే? దేశీయభాషావళిన్. 1

మ. పరుసన్ ద్రావిడసంభవం బనుచు గీర్వాణోద్భవం బంచు ని
ట్లరయన్ గొందఱు కొంద ఱెంతు ర దసత్యంబౌఁ బునస్సంస్క్రియా
గరిమన్ దైవతభాష యాంధ్రసమభిఖ్యన్ మించెఁ గావున్నచో
సురభాషన్ దలమీఱునే మృదురసస్ఫూర్తిన్ విజృంభించుచున్. 2

తే. గీ. అల్లద్రవిడభాషలలోనిదయ్యుఁ దెల్గు
సంస్కృతపుమేళనమ్మున సంస్కృతమయి
భ్రమరకీటకన్యాయంబు పట్టెననఁగ
ప్రదిమ మాధుర్యగుణముల మహిమవఱలు. 3

తే. గీ. అలమహేంద్ర వేంకటాద్రి కిష్కింధలన్
ద్రినగములకు నడుమఁ దేజరిల్లు
దేశమునకుఁ దెనుఁగు దేశంబుగా సంద్రు
దీనిబాస తేటతెనుఁగుబాస. 4

సీ. త్రైలింగకాలింగరాష్ట్రీయులకు మాతృభాషగాఁ దొలినుండిపరిఢవిల్లి
యాంధ్రభృత్యులపాల నారంభముననుండియాంధ్రభాషాభిఖ్య నతిశయిల్లి
కృష్ణరాయలవారి కేలూఁత గైకొని విహరించి కర్ణాటవిషయమందు
ద్రవిడభాషలకెల్లఁ దలమానికం బని పాశ్చాత్యబుధులచేఁ బ్రస్తుతిగని
ప్రళయకావేరి చిలుకసరస్సులకును, మధ్యజనపదముల నెందుమలయుచుండు
తెనుఁగుభాషకు సరియైన దేశభాష, క్షితిని వేఱొండు లేదని చెప్పనేల?
సరసమతులార! విద్యాప్రచారులార! 5

మ. నవలల్ నాటకముల్ ప్రబంధములు విన్నాణంబుగా వ్రాయుచున్
నవవిజ్ఞానసుబోధకంబు లగునానాశాస్త్రముల్ దెల్గులోఁ
గవులౌ వారలు వ్రాయకుంటకతనన్ గా! యాంధ్రభాషామత
ల్లి విచారస్థితిఁ జెంది యాదలను వాల్చెన్ సాటిభాషాళిలోన్. 6

మ. యతియున్ బ్రాసముఁ ద్రోసిపుచ్చి నియమం బావంతయున్ లేని దు
ష్కృతులన్ బన్నెడివారి పోకలను వారింపంగ నుద్యుక్తులై
క్షితి నీరీతి మహాసదస్సుల నొగిన్ జేయించుమీబోటి వి
శ్రుతపాండిత్యులు కార్యశూరుల కిదే! జోడింతుహస్తంబులన్. 7

శా. విద్యాభోజులు దానకర్ణులగుచున్ జెక్కంద్రు హిందూప్రభుల్
హృద్యప్రక్రియఁ గ్రాలుచుండినఁగదా! యెత్తిల్లు దేశంబు మీ
యుద్యత్సంపద, కీర్తిదాయకము లో కోత్కృష్టమైనట్టి మా
యుద్యోగంబులపట్లఁ బాల్పడుటయే యుక్తంబు మువ్వొంటికిన్. 8

ఉ. కొందఱు సత్ప్రబంధములఁ గొందఱు సన్నుతపత్త్రికాళిచేఁ
గొందఱు గ్రంథమాలలను గొందఱు గ్రంథనికేతనంబులన్

బొందుగ నాంధ్రవాఙ్గననిఁ బూజలొనర్పఁ గడంగి రింకపై
సందియ మింత లేదు బహుసంపదలన్ మనవారు వర్ధిలన్. 9

(4) కార్యముపూడి రాజమన్నారుకవి—పేరాల.

సీ. పరికృతాపరికృతపద్మాననముఁ బోలు గ్రాంధికగ్రామ్యవాగ్గతులఁ దలఁపఁ
బుష్పితాపుష్పితభూరుహంబునుఁబోలు, గ్రాంధికగ్రామ్యవాగ్గతులఁ దలఁపఁ
బార్థివాపార్థివప్రాభవంబునుఁబోలు గ్రాంధికగ్రామ్యవాగ్గతులఁ దలఁప
స్వరయుతాస్వరయుత సంగీతమునుబోలు గాంధికగ్రామ్యవాగ్గతులఁ దలఁప
గీ. మఱియు సానఁదీరినమణినిఁ దీర, కుండుమణిఁబోలునందురు, కొందఱాధర
నెవ్వరేమన్న నవి యుండి యెప్పటికిని, నొప్పులప్పు లసంబషు నోలిఁజూడ
నాంధ్రసాహిత్య పరిష న్మహాత్ములార. 1

సీ. షోడశకళలలోఁ జూడనొక్కటి మలినంబైన శశికి దోషంబు గలద
ఘనహావిర్యుతకుండమున ధూమముండిన యాగవహ్నికిఁ బాప మాసఁగలద
తాంబూలరసమంట ధవళేక్షణాధరచుంబనంబునకు నశుద్ధిగలద
ఖరముఖభ్రమరయోగముగల్గ సారసపరిమళంబునకు లోపంబుగలద (ము
గీ. యట్లుగ్రామ్యముగ్రాంధికమందొకింత,గలిసిమునుగ్రాహ్యమయ్యెనుగ్రామజల
గంగలోఁజేరియోగ్యమౌకరణినిఁకను, గలియనీకుఁడునియమముల్ గలుగఁజేసి
యాంధ్రసాహిత్యపరిష న్మహాత్ములార. 2

సీ. రాజన్యులెందఱో రహిఁగ్రాంధికాంధ్రభాషనువృద్ధిఁజేయుచు సరణిఁజనుచుఁ
బండితులెందఱో బహువిధంబులుగవ్యాకరణముల్గావించుగతిఁ బడయుచుఁ
గవివర్యులెందఱో గద్యపద్యంబులఁగావ్యముల్ గూర్చుసత్కథలవినుచు
విద్వాంసులెందఱో విశ్రుతంబుగనాటకములఁదెన్గించుప్రక్రమమరయుచుఁ
గీ. గటకటాప్రాజ్ఞులగువారెగ్రామ్యమునకుఁ, బరువుగలిగింపఁగా నేఁడు పట్టుఁబట్టు
టరయనవనాగరికపుపెంపార్పుటెగద, యాంధ్రసాహిత్యపరిష న్మహాత్ములార.

గీ. ఆటవికజానపదులాడు మాటలందె గ్రామ్యముండఁగనింపు నాగరులసభలఁ
గవులకృతులను లేఖుల నవనవాంధ్ర, పత్రికలగ్రాంధికము తొంటి పగిదినిల్పుఁ
డాంధ్రసాహిత్యపరిష న్మహాత్ములార. 4

గీ. ఆంధ్రసాహిత్యపరిషత్తు నతులగతుల,నిలను వెలయించునధికారు లలఘుకీర్తి
మంతులయ్యెదరంచుసముచితముగ, రాజమన్నారు కవివర్యు రసికులలర. 5

(5) పిసుపాటి చిదంబరశాస్త్రిగారు—శతావధాని.

సామాజికులారా !

నే నాంధ్రసాహిత్యపరిషదవలోకనకుతూహలసమాకలిత మానసుం డనైనను నిప్పటి సింహపురీసభాప్రయత్నాంతరాయమున నివృత్తాగమనుండ నగుటం జేసి యీపద్యములఁ బారితోషికముగ నంపుచుఁ బరిషత్సమావేశసమయంబున సభ్యులకు విన్నవించుట కర్థించుచున్నాఁడను.

మ. సరసగ్రాంథికభాషనిల్పుటయు దేశక్షేమసంధానచా
తురిమై గ్రామ్యమడంగఁ ద్రొక్కుటయు నందున్ బెక్కుగ్రంథంబులన్
బరమప్రౌఢిమెయిన్ రచించుటయు వహ్వాయాంధ్రసాహిత్య స
త్పరిషత్కార్యము లన్నియున్ జగతి విద్వచ్ఛ్లాఘ్యముల్ గావుకో. 1

శా. జ్ఞానంబున్ మెరిపించు మించిన యుపన్యాసంబులన్ సస్మత
స్థానంబున్ గలిపించుశాస్త్రహిత విద్యావృద్ధి యత్నంబులన్
మానంబున్ గలిగించు గ్రామ్యజనసంతానానన శ్రేణికిన్
గానన్ జ్ఞానముగల్గి చూడఁబరిషత్కార్యంబు లల్పంబులే. 2

సీ. బహువిధంబులనపభ్రంశభాషలునిన్ను బాధించుననుచింత వలదు తల్లి
నీపుత్రులైజనుల్ నీసమాచారంబుతలఁపలేదనువంత వలదు తల్లి
పలుచోట్లనీకు నిచ్చలు నిరంకుశవృద్ధి గలుఁగలేదనుభీతి వలదు తల్లి
సన్నయాదులఁబోలు నన్నయొక్కండైన నిలువ లేదనుబుద్ధి వలదుతల్లి
గీ. ఆంధ్రసాహిత్యపరిషన్మహాదరమ్ము, వలననీ పరితాపముల్ తొలఁగిపోయె
నోపఁగల వింకనీకేమి లోపమమ్మ, భూమగుణవల్లి యాంధ్రభాషామతల్లి. 3

చ. ఎవనికొ ధాత్రి నొక్కరున కేర్పడనింపుజనింపకున్న చో
నవనిని సత్ప్రయత్నముల కన్నిటి కెన్నటి కైనఁగానిలా
ఘవముదయించునే దివినఖండముగా రవి వెల్గుచుండ ఘూ
కవి కొకదాని కింపుమదిఁ గల్గనిమాత్రన లోపమున్నదే. 4

సీ. అనుపమానప్రథాధనశాలు లైనవిద్వత్కవీంద్రులనుతుల్ వడసినావు
దేశభాషాభివృద్ధివిధాన మొనరింపఁ గంకణంబుం గేలఁ గట్టినావు
ఓజమైవెలలేని రాజాధిరాజసన్మానంబులెచ్చుగాఁ బూనినావు
సజ్జనుల్ కొనియాడ ముజ్జగంబులలోన నంచితంబగుఖ్యాతిఁ గాంచినావు

గీ. ఇంకమఱికొన్నివిద్యాభివృద్ధిహేతు,వులగుశాస్త్రీయకార్యముల్ సలుపుచుండి
ధారుణీస్థలినాచంద్ర తారకముగ, వృద్ధినొందుము తల్లి సాహిత్యవల్లి!

శతావధాని—దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు.

గీ. చెన్నపురమునఁ గాఁపుర మున్నయట్టి, యాంధ్రపరిషత్తునకు శుభప్రాప్తిరస్తు
ఆంధ్రభాషకువాదంబులాడుచున్న, యుభయపక్షంబులకు నైక్యముండుఁగాక.

సీ. ఆంగ్లేయభాషాంగనానుకూల్యంబున సరిలేని సాహిత్య గరిమవడసి
దేవభాషాంగనాసేవనాబలమునఁ దులలేనిసౌభాగ్య కలనఁగాంచి
నన్నయాదులు కవినాథు లేర్పఱచిన యెనలేనిమార్గంబు ననుసరించి
ప్రతివేశినులనన్యపరిషత్కులస్త్రీల ప్రతిలేని యాచారపటిమఁ గాంచి
ముద్దుబిడ్డలు మాటాడుసుద్దులెల్లఁ, జక్కపఱచుచు నభివృద్ధి కెక్కుఁగాక
నాంధ్రసాహిత్యపరిషదబ్జాయతాక్షి, సద్యశోఢక్కదిక్కులఁ జాటుకొనుచు.

సీ. దాతృత్వమందు రాధాతనూజాతున కనలనేడాకు లెక్కవపఱించె
నపరిమితాదృష్టమందు సుదర్శనధరణీజానిని దలదన్నిమించె
బాల్యంబునంద సౌశీల్యాదిగుణముల ధర్మరాజును దలదాఁటి మించెఁ
జిన్నతనంబునం దన్నిదిగంతంబులును తనకీర్తికామినికిఁ జూపె
నాంధ్రభాషనుబోషించె నట్టిఘనుఁడు,రావుకులమణిశ్రీసూర్యరాయనృపతి
నేఁటియగ్రాసనాధిపుండౌటచూడ, నాంధ్రపరిషత్తు చేయుపుణ్యంబు గాదె.

సీ. ఇంగ్లీషుభాషలో ఎం. ఏ. బి. ఎల్. దాఁక ప్యాసుచేసినమహాపండితుండు
సంస్కృతాంధ్రంబుల శతఘంటకవనంబు పచరించినట్టి విద్వత్ప్రభుండు
ఆనందదంతీశ్వరాఖ్యరాజాఖండలున కెంతయును బ్రీతి మనినమేటి
విజయపురీహూణవిద్యామహాశాల ప్రిన్సిపల్ పదవి గాంచినఘనుండు
ధరకిడంబ్యాన్వవాయసుధామరీచి, యనఁగ నొప్పారు రామానుజార్యమౌళి
నేఁటియగ్రాసనాధిపుండౌట చూడ, నాంధ్రపరిషత్తుసేయు భాగ్యంబుగాదె.

విజ్ఞానచంద్రికాగ్రంథమాల.

ఆంధ్రులపౌరుషము! ఆంధ్రులయౌన్నత్యము!! ఆంధ్రులబుద్ధివైభవము!!!

ఆంధ్రులచరిత్రము.

రెండవభాగము.

ఇందు క్రీ.శ. 1100 నుండి 1350 వఱకుఁగల ఆంధ్రదేశచరిత్ర వర్ణింపఁబడినది.

పురాణములు, కావ్యములు, శాసనములు, విదేశీయుల వ్రాఁతలు, మొదలగువాని, నన్నింటిని శోధించి తెలుఁగుచోడులు, నాగవంశోద్భవులైన మహారాజులు కాకతీయచక్రవర్తులు, పల్నాటివీరులు, కమ్మవారు, రెడ్లు, వెలమలు మొదలగువారి చరిత్రలు, ఈ యుద్గ్రంథమునందు క్రోడీకరింపఁబడినవి.

రామానుజుఁడు, బసవేశ్వరుఁడు, నన్నెచోడ కవిశిఖామణి, ఖడ్గతిక్కన, కవితిక్కన, గణపతిదేవచక్రవర్తి, ప్రతాపరుద్రమహారాజు, మహారాణి రుద్రమదేవి, మొదలగువారల పవిత్రజీవితములు శ్రద్ధతో వ్రాయఁబడినవి.

ఆయా కాలమందలి సాంఘిక, రాజకీయస్థితులు చక్కఁగ వివరింపఁబడినవి. ప్రదేశములయొక్కయు, కట్టడములయొక్కయు, పటములు కలవు.

పౌరుషమునందును, పాండిత్యాతిశయంబునందును రాష్ట్రపాలనయందును ఆంధ్రులు హిందూదేశములోని యితరదేశములవారికి తీసిపోవువారు కారని యీగ్రంథము సప్రమాణముగా సిద్ధాంతీకరించుచున్నది.

ఇట్టిగ్రంథము తెలుఁగులోఁగాని మఱియే యన్యభాషలోఁగాని యెవ్వరును రచించియుండలేదు.

విఖ్యాతలేఖకులగు శ్రీయుత చిలుకూరి వీరభద్రరావు పంతులుగారిచే నిది రచింపఁబడినది. 400 పేజీలు గలిగి మంచికాగితములమీఁద చిన్నయక్షరములతో ముద్రింపఁబడి చక్కనిక్యాలికోబైండు చేయఁబడిన యీయమూల్యగ్రంథము మాచందాదారులకు పోస్టేజితో రు 1-0-0 కును, చందాదారులు కానివారలకు పోస్టేజిగాక రు 1-8-0 లకును ఇయ్యఁబడును.

☞ విజ్ఞానచంద్రికా బుక్కుడిపో యందు సంస్కృతాంధ్రగ్రంథము లనేకములు దొరకును. వలయువారికి క్యాటలాగులు పంపఁబడును.

చిరునామా:—

ఆ. లక్ష్మీపతి, బి. ఏ., ఎం. బి. సి. ఎం.

మేనేజరు.—విజ్ఞానచంద్రిక,

చింతాద్రిపేట.—మద్రాసు.

శ్రీ

హిందువుల క్షేత్రగణితములోఁ

గొన్నియంశములు.

మనయార్యుల గణితశాస్త్రములగుఱించి సామాన్యముగ విచారించుచు మన మిదివఱకే వారు బీజగణితమునవలె క్షేత్రగణితమున నంతప్రసిద్ధిఁ జెందలేదనియుఁ గొన్నియంశములమాత్రముప్రశంసార్హమగునట్లు వృద్ధిపఱచిరనియుఁ గనుఁగొంటిమి. ప్రకృతమున నావిషయముల విమర్శించి చూచెదము. అందు నాదిని త్రికోణక్షేత్రవిషయమై కొంతవిచారించెదము.

శ్లో॥ లంబగుణం భూమ్యర్ధం
స్పష్టం త్రిభుజే ఫలం భవతి॥

(The area of a triangle = $\frac{1}{2}$ base × altitude).

అను సూత్రముచేఁ ద్రికోణభూఫలవిధానము మనవారలకుఁ దెలియునని మన మిదివఱకే యెఱుఁగుదుము. ఇచ్చటఁ ద్రికోణభుజములమితి తెలిసినఁగాని లంబము (altitude) తెలియదు. త్రికోణభుజములనుండి లంబమును గనుఁగొనువిధ మీ క్రింది సూత్రముచే విశద మగును.

సూ॥ త్రిభుజే భుజయోర్యోగ స్తదంతరగుణో భువాహృతోలబ్ధ్యా।
ద్విస్థానభూరూనయుతా దళితాఽఽబాధే తయోస్స్యాతాం।
స్వాఽఽబాధా భుజకృత్యో రంతరమూలం ప్రజాయతే లంబః॥

త్రిభుజక్షేత్రమున రెండుభుజముల యోగమును వానియంతరముచే గుణించి యా మొత్తమును భూమిచే (by the base) భాగించిన లబ్ధమును భూమితోఁజేర్చి యొకచోటను, భూమినుండి తీసి మఱి యొకచోట నుంచవలయును. ఇటుల నుంచినవానిని ద్వేధీకరించిన నాబాధలు (the intercepts of the base made by the altitude) లభించును. భుజవర్గముననుండి తత్సన్నికృష్టాబాధవర్గమును దీసిన లంబవర్గ మగును.

అనఁగా నాధునికసంకేతమున

$$\frac{1}{2}\left\{a \pm \frac{(c+b)(c-b)}{a}\right\} = BD \text{ or } CD$$

అనియు

$AB^2 - BD^2 = AD^2$.

అనియు నర్థము.



ఈ సూత్రార్థము నీ క్రిందివిధముగ నిరూపింపవచ్చును :—

$$(c+b)(c-b) = c^2 - b^2 = (BD^2 + AD^2) - (CD^2 + AD^2) = BD^2 - CD^2.$$

$$\therefore \frac{(c+b)(c-b)}{a} = \frac{BD^2 - CD^2}{BD + CD} = BD - CD.$$

$$\therefore \frac{1}{2}\left\{a \pm \frac{(c+b)(c-b)}{a}\right\} = \frac{1}{2}\left\{(BD + CD) \pm (BD - CD)\right\} = BD \text{ or } CD$$

and $AB^2 - BD^2 = AD^2$.

ఈ విధమున లంబము తెలియును.

త్రికోణక్షేత్ర భూఫలవిషయమై మఱియొకసూత్రము కూడఁ జెప్పఁబడి యున్నది.

సూ॥ సర్వదో ర్యుతిదళం చతుష్స్థితం
బాహుభి ర్విరహితంచ తద్వధాత్ ।
మూల మస్ఫుటఫలం చతుర్భుజే
స్పష్ట మేవ ముదితం త్రిబాహుకే ॥

భుజముల నన్నియుఁ జేర్చి ద్వేధీకరించిన సంఖ్యను నాలుగుచోటుల నునిచి వానినుండి వరుసగా భుజములఁ దీసి యవశిష్టములను గుణించి మూలమును గనుఁగొనిన నది త్రిభుజక్షేత్రమున స్ఫుటమైన భూఫల మగును. చతుర్భుజమున నిది స్థూలఫలము (approximate area).

అనఁగా

Area of a triangle $= \sqrt{s(s-a)(s-b)(s-c)}$, where $2s = a + b + c$.

అని యర్థము. చతుర్భుజవిషయమున నిది కొంత దుష్టము. త్రిభుజమునఁ బ్రథమసూత్రమునునుండియు ఫలితాంశ మిదియే. ఈ సూత్రములనే యాధునిక శాస్త్రజ్ఞులుకూడ నుపయోగించుచున్నారు.

చతుర్భుజమున భుజములు మాత్రము తెలిసిన భూఫలము లభింపవచ్చునని బ్రహ్మగుప్తాదులు భ్రమించి యీ క్రిందివిధమున ఫలాహరణముఁ జేయుచు వచ్చిరి.

సూ॥ కర్ణాశ్రితభుజఘాతైక్య ముభయథాఽన్యోన్యభాజితంగుణయేత్
యోగేన భుజప్రతిభుజహత్యోః కర్ణౌపదేవిషమే॥

కర్ణములకు (diagonals) ఇరుప్రక్కలను సమీపమున నున్నభుజముల గుణించి వానిమొత్తములను బరస్పర మొకటితో నొకటిని భాగించిన లబ్ధమును భుజప్రతిభుజహననయోగముచే (the sum of the products of the opposite sides) గుణింపవలయును. ఇట్లు లభించినమొత్తములు కర్ణముల వర్గము లగును, కర్ణము తెలిసినపిదప త్రికోణసూత్రముచేఁ జతుర్భుజఫలము కను గొనఁబడును.

అనఁగా

$$BD^2 = \frac{ab+cd}{ad+bc} \times (ac+bd)$$

అనియు

$$AC^2 = \frac{ad+bc}{ab+cd} \times (ac+bd)$$

అనియు నర్థము.



ఈ సూత్రార్థము వృత్తక్షేత్రములోని చతుర్భుజవిషయక మని యాధునికగణితముచే నిర్ధరింపఁబడియున్నది. చతుర్భుజమున భుజములుమాత్రము తెలిసిన, కర్ణస్వరూపము లనంత మగు ననియు, వానిని నిర్ధరించుట దుష్కర మనియు భాస్కరాచార్యుఁ డీసూత్రముల నిరసించెనుగాని, దీనికిఁ బ్రతిగా నతను నిర్ధరించిన సూత్రముమాత్ర మంత శ్లాఘనీయముకాదు.

<u>వృత్తక్షేత్రమున</u> "పరిధిగుణితం వ్యాసపాదం ఫలం" [area = $\frac{1}{4}$ (circumference) (diameter)] అని మనము చూచి యుంటిమి గదా. ఈభాస్కరాచార్యుని సూత్రమును గణేశుఁడను వ్యాఖ్యాత యిట్లు నిరూపించుచున్నాఁడని "కోల్బ్రుక్" మహాశయుఁడు వ్రాయుచున్నాఁడు:—వృత్తమును రెండు సమభాగములుగ విభజించి, ప్రతిభాగపు కేంద్రమున ననేక సమకోణములు నిర్మింపవలయు. (ఇట్లు నిర్మించి విడదీసిన నొక్కొక్కభాగమును క్రకచాకృతిగ నుండును.) పిదప నొకటితో నొకటిఁ గలియఁజేసినయెడల విషమచతురస్రమగును (a rectangle). దీని ఫలమే వృత్తక్షేత్రఫలము.



పటము 1.



పటము 2.



పటము 3.

ప్రకృతము పాఠశాలలలో వృత్తక్షేత్రభూఫలవిషయమై బాలురకు బోధింపఁబడు స్థూలపద్ధతులలోనిది యొకటి.

వృత్తక్షేత్రమున నిర్మింపఁబడు త్ర్యస్రాదినవాస్రాంతక్షేత్రముల (regular inscribed polygons from three to nine sides) భుజములఁ గనుఁగొనుట క్రింది సూత్రము లున్నవి.

సూ॥ త్రిద్వ్యంకాగ్నినభశ్చంద్రైః, త్రిబాణాష్టయుగాష్టభిః।
వేదాగ్నిబాణఖాశ్వైశ్చ। ఖఖాభ్రాభ్రరసైః క్రమాత్ ।
బాణేషునఖబాణైశ్చ, ద్విద్వినందేషుసాగరైః।
కురామదశవేదైశ్చ వృత్తవ్యాసేసమాహతే।
ఖఖఖాభ్రార్కసంభక్తే లభ్యన్తే క్రమశోభుజాః।
వృత్తాన్తస్త్ర్యస్రపూర్వాణాం నవాస్రాంతం పృథక్ పృథక్ ॥

అనఁగా వృత్తక్షేత్రమున వ్యాసమును ఈ క్రింది సంఖ్యలతో గుణించి, 12,0000 తో (ఖ-ఖ-ఖ-అభ్ర-అర్క) భాగించిన, క్రమముగ త్ర్యస్రాదినవాస్రాంతక్షేత్రభుజములు లభించునని తాత్పర్యము.

సంఖ్యలవివరణము.

త్ర్యస్రమునకు, 103923 (త్రి-ద్వి-అంక-అగ్ని-నభః - చంద్ర).

చతురస్రమునకు, 84853 (త్రి-బాణ-అష్ట-యుగ-అష్ట).

పంచాస్రమునకు, 70534 (వేద-అగ్ని-బాణ-ఖ-అశ్వైః).
షడస్రమునకు, 60000 (ఖ-ఖ-అభ్ర-అభ్ర-రస).
సప్తాస్రమునకు, 52055 (బాణ-ఇషు-నఖ-బాణ).
అష్టాస్రమునకు, 45922 (ద్వి-ద్వి-నంద-ఇషు-సాగర).
నవాస్రమునకు, 41031 (కు-రామ-దశ-వేద).

ఇచ్చట 120000 పరిమితవ్యాసము గల వృత్తమున నిర్మింపఁబడు త్ర్యస్రాది నవాస్రాంతముల భుజపరిమాణము లివియే. ఈ సూత్రవ్యాఖ్యానమున గణేశుఁడు త్ర్యస్ర, చతురస్ర, షడస్ర, అష్టాస్రములకు నీక్రిందరీతిగ భుజములఁ గనుఁగొనుపద్ధతిని నిరూపించియున్నాఁడు.

త్ర్యస్రషడస్రభుజమానములు (ఆధునిక సంకేతాక్షరములతో).

$AB =$ త్ర్యస్రభుజము

$BC =$ షడస్రభుజము $=$ వ్యాసార్థము

ఇచ్చట $AC^2 = AB^2 + BC^2$

అనగా $4r^2 = AB^2 + r^2$

$\therefore \quad AB = \sqrt{3}\cdot r$

$2r = 120000$ అయిన,

$AB = \sqrt{3}\cdot 6000 = 103923.$



చతురస్రాష్టాస్రభుజమానములు.

$AB =$ చతురస్రభుజము

$AC =$ అష్టాస్రభుజము

ఇచ్చట $AB^2 = AE^2 + EB^2 = 2r^2$

$\therefore \quad AB = \sqrt{2}\cdot r$

$2r = 120000$ అయిన,

$AB = 84853$

మఱియును



$$AC^2 = AD^2 + CD^2 = \left(\frac{AB}{2}\right)^2 — (r — ED)^2$$

$$= \left(\frac{\sqrt{2}\cdot r}{2}\right)^2 + \left(r - \frac{\sqrt{2}\cdot r}{2}\right)^2$$

$$= \frac{r^2}{2} + r^2 + \frac{r^2}{2} - \frac{\sqrt{2}\cdot r^2}{2} = (2 - \sqrt{2})r^2$$

$AC = \sqrt{2 - \sqrt{2}}\cdot r$

$2r = 120000$ అయిన,

$AC = 45922$

పంచ, సప్త, నవాస్రములకుమాత్రము ఈవిధముగ నిర్ణయించుట దుష్కరమని చెప్పియున్నాఁడు. ఆధునిక గణితమున నివి యన్నియుఁ త్రికోణమితి సాహాయ్యముచే సులభముగఁ గనుఁగొనఁబడుచున్నవి. (The side of a regular polygon of n sides inscribed in a circle of radius r is $= 2r \sin\frac{\pi}{n}$) పంచాస్రమున కీ క్రిందివిధమున భుజముఁ గనుఁగొనవచ్చును.



BD = పంచాస్రభుజము

BC = దశాస్రభుజము

ఇచ్చట $BC = \frac{r}{2}(\sqrt{5} - 1)$

{ School Geometry: Hall and Stevens; Ex. 4 page 243 }

మఱియు

$$AB^2 - AE^2 = BC^2 - CE^2 = \frac{r^2}{4}(\sqrt{5} - 1)^2 - (r - AE)^2$$

$$\therefore \quad AE = \frac{r(\sqrt{5} + 1)}{4}$$

మఱియును

$$BE^2 = AB^2 - AE^2 = r^2 - \frac{r^2}{16}(\sqrt{5} + 1)^2 = \frac{r^2}{16}(10 - 2\sqrt{5})$$

$$\therefore \quad 2BE = \frac{r}{2}\sqrt{10 - 2\sqrt{5}}$$

అని పంచాస్రభుజముఁ గనుఁగొననగును

పంచ, సప్త, నవాస్రవిషయమై భాస్కరాచార్యునిచే నిర్ధరింపఁబడిన భుజమానములకును, ఆధునిక గణితములచే నిర్ధరింపఁబడిన భుజమానములకును స్వల్పవ్యత్యాసము లున్నవి.

వృత్తమున (in the circle ధనుస్సును (the arc) వ్యాసమును దెలిసిన జీవమును (the chord) కనుఁగొనుట కీ సూత్రమున్నది.

సూ॥ చాపోన నిఘ్న పరిధిః ప్రథమాహ్వయః స్యాత్
పంచాహతః పరిధివర్గ చతుర్థభాగః।
ఆద్యోనితేనఖలు తేనభజేచ్చతుర్ఘ్న
వ్యాసాహతం ప్రథమమాప్త మిహజ్యకాస్యాత్॥

పరిధినుండి ధనుస్సునుదీసి యవశిష్టమును ధనుస్సుతో గుణించి యొక చోట నుంచవలయును. ఈ సంఖ్యను అయిదింతల పరిధివర్గచతుర్థభాగము

నుండి తీసి మఱియొకచోట నుంచవలయును. మొదటి మొత్తమును నాలుగింతల వ్యాసముచే గుణించి రెండవమొత్తముచే భాగించిన యెడల జీవము లభించును.

అనఁగా

$$\text{Chord AB} = \frac{\text{Arc ACB} \times \text{arc AB} \times 8r}{\frac{5}{4}(\text{circumference})^2 - \text{Arc ACB} \times \text{arc AB}}$$

అనియర్థము.



ఈ సూత్రమును హరణ చంద్ర బనర్జిగారు తమచేఁ బ్రచురింపఁబడిన "లీలావతి"లో నీవిధమున నిర్ధరించుచున్నారు.

BC = వ్యాసము $= 2r$; c = circumference ; $\theta = AOC$.

$$\frac{\text{Arc ACB} \times \text{arc AB} \times 8r}{\frac{5}{4}c^2 - \text{Arc ACB} \times \text{arc AB}} = \frac{8r\left\{(\frac{1}{2}c)^2 - (\text{arc AC})^2\right\}}{\frac{5}{4}c^2 - (\frac{1}{2}c)^2 + (\text{arc AC})^2}$$

$$= \frac{8r\{\pi^2 - \theta^2\}}{c^2 + \theta^2} = \frac{2r(4\pi^2 - 4\theta^2)}{4\pi^2 + \theta^2} = 2r.\ \frac{1 - \left(\frac{\theta}{\pi}\right)^2}{1 + \left(\frac{\theta}{2\pi}\right)^2}$$

$$= 2r\left\{1 - \left(\frac{\theta}{\pi}\right)^2\right\}\left\{1 + \left(\frac{\theta}{2\pi}\right)^2\right\} = 2r.\left(1 - \frac{5\theta^2}{4\pi^2}\right) \text{ సుమారు.}$$

ఇక్కడ $\pi = \frac{22}{7}$ అయిన

$$2r.\left(1 - \frac{5\theta^2}{4\pi^2}\right) = 2r.\left[1 - \frac{5 \times 49}{4 \times 22 \times 22}.\theta^2\right]$$

$$= 2r\left\{1 - (\tfrac{1}{8} + \text{something})\,\theta^2\right\}$$

$$= 2r\left[1 - \frac{\theta^2}{8} + \ldots\ldots\right] = 2r\cos.\frac{\theta}{2} \text{ సుమారుగా,} \quad = \text{chord AB.}$$

(ఈ పటములోని D ని θ గాను, E ని O గాను జదువవలయును).

<u>ఛాయాప్రకరణమున</u> శంకుప్రమాణమును (the length of the pole) శంకుదీపతలాంతరమును (the distance between the foot of the pole and that of the lamp) తెలిసిన, ఛాయాప్రమాణ మీక్రిందిసూత్రముచేఁ గనుఁగొనఁ నగును.

సూ॥ శంకుః ప్రదీపతల శంకుతలాంతరఘ్నః
ఛాయాభవేత్ వినరదీప శిఖౌచ్చ్యభక్తః॥

(ఇచ్చట శంకుస్థానమున మనుష్యుఁడే నిలిచియున్నట్లు గణింపఁబడియున్నది.)

దీపౌన్నత్యమునుండి శంకుప్రమాణమును దీసి యవశిష్టముచే శంకు, శంకుదీపతలాంతరహననమును (the product of the pole and the distance between the foot of the pole and that of the lamp) విభజించిన, ఛాయాప్రమాణము లభించును.



ఇచ్చట

AB = శంకువు

D = దీపము

E = దీపతలము.

B = శంకుతలము

EB = శంకుదీపతలాంతరము

BC = ఛాయయు నయిన,

ప్రకృతసూత్రముచే

$$BC = \frac{AB \times EB}{DE - AB} = \frac{AB \times EB}{DE - DF}$$

అనియర్థము.

ఇది యూక్లీడు 6-వ పుస్తకములోని 4-వ తత్వముచే నిట్లు నిరూపిం నగును.

FEB, ABC త్రికోణములలో

$$\frac{FE}{EB} = \frac{AB}{BC}$$

$$\therefore \quad BC = \frac{AB \times EB}{FE} = \frac{AB \times EB}{DE - DF} = \frac{AB \times EB}{DE - AB}$$

ఇటు లనేకవిషయములు బహుచమత్కారముతో నిర్ణయింపఁబడి యున్నవి. మొత్తమున క్షేత్రగణితములోఁ గొన్నిచోటుల మనయార్యుల యుద్యమము లంత విశ్వసనీయముగ లేక యుండినను, మఱి కొన్నిచోటుల మాత్రము మిక్కిలి ప్రశంసనీయములుగనే యున్నవి. అవిచ్ఛిన్నముగ నీగణిత శాస్త్రములు పాశ్చాత్యదేశమునవలె మనదేశమునఁగూడ వృద్ధి పఱుపఁబడి యుండెనేని యనేకవిషయములు మనకు ననన్యసహాయమై తెలిసియుండును. ఇప్పుడైన మనశాస్త్రములను లుప్తముగాకుండఁ జూచుచు సాధ్యమైనంత వఱకు వానిపారిభాషిక సంజ్ఞలనైనఁ బ్రచారముచేయుట మన ప్రథమ కర్తవ్యము.

తిరుపతి. } కపిస్థలం - కృష్ణమాచార్యులు.

సంపుటము 3 | ఆనందినామ సంవత్సరము జ్యేష్ఠమాసము. | సంచిక 3

ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రిక.

ప్రతిమాసమునఁ గడపటివారములోఁ బ్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

ప్రధానవ్యాసములు.

1. ప్రాఁదెనుఁగుఁగమ్మపై నంపగమి. — మం. పార్వతీశ్వరశాస్త్రి.
2. పురాణపఠనావశ్యకత. — కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి.
3. సంశయము. — వేంకటపార్వతీశ్వరకవులు.
4. రాయవాచకము. — విశ్వనాథరాయనిస్థానాపతి.

చెన్నపురి.

విషయసూచిక.

1. ప్రాఁదెనుఁగుఁగమ్మపైనంపగమి. 89-106

మం.। పార్వతీశ్వరశాస్త్రిగారు.

2. పురాణపఠనావశ్యకత. 107-118

కాశీభట్టసుబ్బయ్యశాస్త్రిగారు.

3. సంశయము. 119-124

వేంకటపార్వతీశ్వరకవులు.

4. రాయవాచకము. 125-136

విశ్వనాథరాయని స్థానాపతి.

ప్రాఁదెనుఁగుఁగమ్మపై నంపగమి.

"ఏల బొంకులువల్కి నిక్కి నీల్గుటలు;
ఏల రిత్తలుసెప్పి విఱ్ఱవీఁగుటలు?"

ప్రాఁదెనుఁగుఁగమ్మ.

శబరవాగనుశాసను లగు రావుసాహేబ్ గిడుగు రామమూర్తిపంతులు గారిని గాని, యాంధ్రవాగనుశాసనమునకు వారు చేయుచుండు ప్రయత్నములను గాని, నేఁ డాంధ్రలోకమున నెఱుంగనివా రెవ్వరు నుండరు. సలక్షణాంధ్రభాష దుర్గ్రాహ్య మనియు, గ్రామ్యభాషయే సుగ్రాహ్య మనియుఁ, గావున గ్రామ్యభాషయే గ్రాంథికభాష కావలయు ననియు, ఋజువుచేయుచు, వారిచేఁ బ్రచురింపఁబడిన "ప్రాఁదెనుఁగుఁగమ్మ" యాంధ్రులలోఁ గొందఱకు భ్రమను గల్గించినది. కావున నాభ్రమను దొలఁగించుటకై యావ్యాసమును విమర్శింపవలసియున్నది.

ఈవ్యాసము భాషాసంస్కరణముం గూర్చి కావునఁ దొలుదొల్త "సంస్కరణము" వలని ప్రయోజనములను మనము తెలిసికొనవలయును.

లోకమున మానవులు సంఘములు గా నేర్పడుటకుఁ బూర్వము వివాహాదినియమము లేర్పడి యుండలేదు. సంఘ మభివృద్ధి నొందుటకై యాయా నియమము లేర్పడినవి. ఎట్లన దుర్బలసంతానములు లేకుండుట, స్త్రీలను గూర్చి పురుషు లొండొరులతోఁ గయ్య మాడుకొనకుండుట, మొదలగు నెన్నియోలాభములఁ బరికించి, వివాహనియమము లేర్పఱుపఁ బడినవి. వివాహవిధుల - ననుసరించి ప్రవర్తించుట జనసామాన్యమునకుఁ గష్ట మనుమాట నిజము కాని, సంఘ మల్లకల్లోలము కాకుండ నుండ నెంచినచో నానియమముల ననుసరించియే తీరవలెను. లోకములో నెందఱెందఱో వివాహనియమములను మీఱుచున్నారు కావున నా నియమములను దీసివైచినచో లెస్సగా నుండు నని యెవ్వరైన వాదించినచో నది యవివేకమును సూచించును.

వివాహాదిసంస్కరణము లెట్లో భాషాసంస్కరణము కూడ నట్లే సంఘాభివృద్ధికై యే పుట్టినది. కాలము గతించిన కొలఁదియును, నియమములు లేని

యంశములలో మనుష్యుల యభిప్రాయము లెట్లు మాఱుచుండునో, నియమరహిత మగుభాషయు నట్లే మాఱుచుండును. దానంజేసి పూర్వుల యభిప్రాయములను మనము తెలిసికొనుటకును మనయభిప్రాయములను మన తరువాతివారు తెలిసికొనుటకును గష్ట మగుచుండును. ఈ యంశములు పాశ్చాత్య దేశములలో స్పష్టముగాఁ గన్పట్టుచున్నవి. పదుమూఁడు పదునాల్గవ శతాబ్దములలో రచింపఁబడిన యాంగ్లేయభాషాగ్రంథములు నేఁడు పఠించువారు గాని, పఠించినదానిని దెలిసికొనఁగల్గువారుఁ గాని, మిక్కిలి యరుదు. మనదేశములో నాకాలమునందలి గ్రంథముల నించుమించుగాఁ జదువునేర్చినవా రందఱును దెలిసికొనఁగలరు. దానికిఁ గారణ మాంగ్లేయదేశమున భాషాసంస్కరణము తొంటినుండియు లేక, మొన్నమొన్ననే యారంభ మగుటయు, మనదేశమున భాషాసంస్కరణము పెక్కుశతాబ్దములకు ముందే యారంభ మగుటయు నై యున్నది. భాషాసంస్కరణమున నిన్నగాక మొన్ననే కనుదెఱచిన యర్వాచీనుల భాషలతో బహుశతాబ్దములకు ముందే సంస్కరింపఁబడిన ప్రాచీనభాషలను దులదూఁచుట వెడఁగుఁదనము.

ఆంధ్రభాషాసంస్కరణము.

ఆంధ్రభాష తమిళ కర్ణాటభాషలకన్న నధునాతన మనియు, నాంధ్రభాషాసంస్కరణము వేయియేండ్లకు ముందుమాత్రమే జరిగినదనియు ననేకులయభిప్రాయము. కాని, యది వాస్తవమునకు దూరము. తమిళ కర్ణాటభాష లెంత పురాతనములో యాంధ్రభాషయు నంత పురాతన మైనదే. తమిళకర్ణాటభాషలు సంస్కరింపఁబడిన కాలముననే యదియును సంస్కరింపఁబడినది. త్రైలింగ్యభాషను తొలుదొల్త సంస్కరించినవారు కణ్వబృహస్పతులు. కణ్వుని సంస్కరణగ్రంథమునకు "కాణ్వవ్యాకరణ" మనియు, బృహస్పతి సంస్కరణగ్రంథమునకు "బార్హస్పత్యసూత్రము" లనియుఁ బేరు. ఈగ్రంథము లిప్పుడు నామావశిష్టము లై యున్న వని యనేకుల యుద్దేశము కాని, యది వాస్తవము కాదు. బార్హస్పత్య సూత్రములే యిప్పు డాంధ్రశబ్దచింతామణి (నన్నయభట్టీయము) అను పేరునఁ బరఁగుచున్నది. ఇఁకఁ గణ్వవ్యాకరణ మథర్వణకారికావళియే గాని వేఱుగాదు. ఆంధ్రశబ్దచింతామణి నన్నయకృతముగాని బాలసరస్వతికృతము గాని కాదనియు, నన్నయకాలమునకు వేయియేండ్లకుముందే యది వాడుకలో నుండెననియు, నాచేరచింపఁబడుచున్న త్రైలింగ్యసారస్వతమను గ్రంథమున

సహేతుకముగా ఋజువు చేయఁబడును. అథర్వణకారికలుగూడ నట్లే యథర్వణకృతములు గాని యహోబలపతికృతములు గాని కావనియు నథర్వణునకు వేయియేండ్లకు ముందే వ్రాయఁబడియున్న వనియుఁ బైగ్రంథమున ఋజువు చేయఁబడుచున్నది. ఏది యె ట్లున్నను, ఆంధ్రభాషాప్రథమసంస్కరణము క్రీస్తుశకారంభములోనే జరిగినదనియు, దానికిఁ గారకులు కణ్వబృహస్పతులే యనియు స్పష్టమే.

ఈ ప్రథమ సంస్కరణ మాదిగా వేయియేండ్లు భాష నిరాఘాటముగా వృద్ధినొందినది. ఈకాలమునఁ గవిత్వము కూడ నెంతయో వృద్ధినొందినది. కాని, యాకవిత్వ మిప్పటి కావ్యఫక్కికాక ద్విపద, రగడ, సీసము, గీతము, అక్కఱ, కళిక, ఉత్కళిక మొదలగు దేశీయవృత్తములు, సూర్యగణములు, ఇంద్రగణములు, చంద్రగణములు మొదలగుగణములతో వ్రాయఁబడినదిగా నుండెను. వేయియేండ్లుగా నీరీతి నభివృద్ధి నొందుచున్న భాషకు మరల సంస్కరణ మావశ్యక మయ్యెను. ఈద్వితీయసంస్కరణ మొనర్చినవారు నన్నయయును దిక్కనయును. వీరు ప్రథమసంస్కరణకర్తలవలె లక్షణములను వ్రాసి భాషా సంస్కరణమును జేసినవారు కారు గాని, లక్ష్యములను వ్రాసి చేసినవారు. నన్నయకాలమున గీర్వాణ, తమిళ, కర్ణాటభాషలు ప్రముఖములై యుండెను. వివిధము లగు వృత్తములతోఁ గావ్యకన్యక సహృదయుల హృదయముల నాకర్షించుచుండెను. దానిం జూచి నన్నయ యాయాభాషలలోని వృత్తముల ఫక్కిని దెనుఁగులోఁ జొన్పి, తనకు ముందున్న ద్విపద, (తరువోజ) రగడ, అక్కఱాదులను విడువక, కణ్వబృహస్పతుల నియమముల ననుసరించుచు మనోహరముగ నూతనకావ్యనిర్మాణ మొనర్చెను. దానియందలి మాధుర్యమును జూచి, యాతని కాలములోనివారును, తర్వాతికాలమువారును గూడ నామార్గమునే యవలంబించి యాతనినే ప్రథమకవిగా నెన్నసాగిరి. రంగనాథాదులు కొందఱు నూతనమార్గము ననుసరింపక, తొంటిమార్గమునే యవలంబించినను, జనసామాన్యమునకును విపశ్చిద్వర్యులకును గూడ నానూతనమార్గమే రుచించుటచే నదియే యభివృద్ధి కాఁజొచ్చినది.

తిక్కన సంస్కరణము నన్నయసంస్కరణము కన్న మిన్నయైనది. నన్నయ వ్రాసినది యాంధ్రభాషయే యయ్యును నది నియమములందు మాత్రమే

యాంధ్రభాషయై పదబాహుళ్యమున గీర్వాణభాషయైయేయుండెను. కావున, జనసామాన్యమునకు దుర్గ్రాహ్యమై యుండెను. కావ్యము జనసామాన్యమునకు సుగ్రాహ్యము చేయుటకు నితరమార్గము లావశ్యకము లయ్యెను. అమార్గములను దిక్కన కనిపెట్టి తనకావ్యరచనయందు వాని ననుసరించెను. తిక్కనచేసిన సంస్కారములలో నీక్రిందివి ముఖ్యమైనవి.

(1) ప్రాఁతమాటలను విడచుట.

లోక మభివృద్ధి నొందినకొలఁదియును బదములయర్థములు మాఱుచుండును. కావునఁ దనకాలమున నేపద మేయర్థమున జనులచే నుపయోగింపఁబడునో, యాపద మాయర్థముననే యుపయోగింపవలయును.

(2) నూతనపదములను జేర్చుట.

లోకమున వివిధవృత్తులు గల వివిధజాతులలో వారివారి వృత్తులతో సంబంధించిన వ్యావహారికపదము లుండును. అట్టివానిని దెలిసికొని, యాయా శబ్దముల నాయాసందర్భములలోఁ బ్రయోగించుట కవినైపుణ్యమును దెలియఁజేయును.

(3) నానుడులు.

సామాన్యజనులసంభాషణములో నానుడు లెన్నియో యుండును. అయ్యవి యేకాలమున నేకారణమున వాడుకలోనికి వచ్చినను, జనసామాన్యముచే మిక్కిలి యాదరింపఁబడుచుండును. కవి యాయాసామెతలను జాగ్రత్తతోఁ దెలిసికొని తనకావ్యమున నుపయోగింపవలయును.

తిక్కన తనకు ముందున్న యాంధ్రకవిత్వమునఁ గల యిట్టిలోపముల నన్నిటిని గ్రహించి,తనకావ్యములను సకలజనాదరణీయములుగా రచించెను.కాని తాను నూతనాంశముల నెన్నిటిని జేర్చినను, గణ్వబృహస్పతుల నియమములను గాని, నన్నయభట్టారకుని మార్గమునుగాని, విడువక వాని ననుసరించియే పోయెను. తిక్కన యొనర్చిన యీసంస్కరణముం గాంచి యధునాతనసంస్కర్తలు భ్రమించి, సామాన్యజనుల సంభాషణలోఁ గలభాషతోనే తనభారతమును వ్రాసె ననుచున్నారు. అదియసత్యము. సామాన్యజనులపదజాలమును లోకోక్తులను గ్రహించి, కణ్వబృహస్పతుల నియమములచే వానిని బరిశుద్ధిచేసి, యట్టిపరిశుద్ధి చేయఁబడిన బంగారముననే తిక్కన తనకావ్యభూషణమును నిర్మిం

చెను గాని, గనిలోనుండి తీయఁబడిన యపరిశుభ్ర మగుబంగారముతోఁ జేయ లేదు. ఇఁకఁ దృతీయసంస్కరణము నేఁడారంభ మైనది. ఈసంస్కరణము పైఁ జెప్పఁబడిన రెండుసంస్కరణములకన్నఁ జిత్రతమమైనది. లక్షణ మెఱుంగనియొకా నొక కన్యకను దెచ్చి పెంచి, లక్షణముల దిద్ది, కణ్వబృహస్పతులు కలభాషి ణిగా నొనర్చిరి. కలభాషిణి యగునాబాలికకు సరసకావ్యపాఠన మొనర్చి, నన్నయతిక్కనలు దానిని విదుషిగఁ జేసిరి. ఇప్పటివారన్ననో, కలభాషిణీసాంగ త్యము తమకవసరములే దని చెప్పి, యవలక్షణ యగు నొకసామాన్యను దెచ్చి దానినే యుంపటిను వరింపవలయు నని సిద్ధాంతీకరించుచున్నారు. ఇట్టి సంస్కర్తలలోఁ బ్రముఖులు మ-రా-రా. గురుజాడ అప్పారావు పంతులు గారును, రావుసాహేబ్ గిడుగు రామమూర్తి పంతులుగారును.

ఈ తృతీయసంస్కరణమును గూర్చి వ్రాయఁబడిన వ్యాసములలో విమ ర్శనమున నున్న ప్రాఁదెనుఁగుఁగమ్మ ప్రధానమైనదిగా నున్నది. ఇది సలక్షణ భాష యని పంతులుగారు భ్రమించుచున్న యొకానొకభాషలో వ్రాయఁబడి నది. ఈ వ్యాసమును విమర్శించుటకుఁ బూర్వము దాని యాముఖమున వ్రాయఁ బడిన రెండంశములు విచారింపవలసియున్నది.

(1) "పద్దెంబు లివి యని పేర్కొన్న నేను,
పద్దెంబు లని పల్కఁ బ్రాఁబడి పరికించి,
కీడని దూరఁగఁ దగదేరి కేని."

(2) "గద్దెకూర్పునకు నై కట్టడి లేద.
గద్దెయకా దీని గడియింపనురదె ?"

ఈవాక్యద్వయమున మొదటివాక్యమును విమర్శింతము. ఇందుఁ "బ్రాఁబ డి" యనుశబ్దమునకు నర్థమేమి ? సందర్భమును బట్టి "యతి" యనికదా యర్థ ము కావలసియున్నది. అది యే నిజమైనచో, "ప్రావడి" అనునది సరియైనశబ్ద ము కాని, "ప్రాఁబడి" అను నది కాదు. ప్రాఁబడి" యనుశబ్దమునకు "యతి" యనునర్థమునఁ బ్రయోగము లేవైనఁ బంతులుగారు చూపఁగలరేమో ? కాక, ఆశబ్దమునకు సందర్భానుసారముగా మఱియొకయర్థ మైనచో నాయర్థమునై న వివరింతురుగాక. ఇఁక వాక్యమునందలి యాశయమును జూడుఁడు. తాను వ్రాసినది పద్యముకాదు. కావున నందు యతిదోషములను వెదకవలదని దాని తాత్పర్యము. ఇది చూడ "దొంగవాఁడా, చేయిమాత్రము కదలవకుమా" అను

లోకోక్తి జ్ఞప్తికి వచ్చుచున్నది. తాను వ్రాసినది పద్యమని పాఠకు లను కొనుటకుఁ దగినకారణము లున్నప్పుడే కదా ఈవాక్యము సార్థకమగును. అట్టి కారణము లేయున్నచోఁ బద్యము కాదని తా నెంత చెప్పినను, లోకము వినదు కదా. కావున నట్టికారణము కలదో లేదో చూతము. గణనియమమున వ్రాయఁబడిన వాక్యసముదాయమే పద్య మని యందఱకును దెలియును. ఈకమ్మయంతయును గణనియమము తోనే వ్రాయఁబడినది. చూడుఁడు.

(1) "సిరిఁదాల్చు జేఁడొగిఁ జిన్నిచూడ్కులఁ జూచు
తెనుఁగుఁజదువుల రచ్చతీర్పరులార.

(2) "తెనుఁగునాఁటను గలరు తొల్లింటి పెద్దలు
నేలదయ్యాలు నానాపాఱువారు.

ఇందు గణనియమము లేదని పంతులుగా రనఁగలరా? ఇఁక నివి పద్యములే యనుటకు నేమి సందేహము. ఒకవేళ నివి శార్దూలాదివృత్తములలో వేనిలోను జేరవు కావునఁ బద్యములు కావందు రేమో. అట్టివృత్తములలో వేనిలోను జేరకున్నను, ఇది పద్యమగుటకు ననుమానము లేదు. ఏలయన శార్దూలాది వృత్తములు నన్నయకాలముననే వచ్చినవి గాని నన్నయకుఁ బూర్వ మిట్టి పద్యములే వాడుకలో నుండెడివి. చూడుఁడు.

(1) హరిహరీనారాయ ణాదినారాయణా
కరుణించురా మమ్ముఁ గమలలోచనుఁడ.

(2) బళిబళి మీతాత బల్లెంబు చేపట్టి
పులిమోకు తూటుగాఁ బొడిచేసినాఁడు.

ఈవాక్యములయందలి గణనియమమునకును, ప్రాఁదెనుఁగుఁగమ్మలోని పైవాక్యద్వయమున గల నియమమునకును భేద మేమైనఁ గలదా? లేదు. కావునఁ బ్రాఁదెనుఁగుఁగమ్మ యంతయును బద్యమే యని యనక తప్పదు. పంతులుగా రీపద్యముతోనే కమ్మయంతయును వ్రాయుటకుఁ గారణము లేకపోలేదు. తాము వ్రాయుచున్నది ప్రాఁదెనుఁగు గావునను, ప్రాఁదెనుఁగున శార్దూలాది వృత్తములు లేవు కావునను, అప్పటికి వాడుకలోనుండె ననుకొనుచున్న యీ తెందనపద్యముననే కమ్మయంతయు వ్రాయఁబడినది. వారి మొదటియుద్దేశ మిదియే యయ్యును, ఏకారణముననో తాము వ్రాసినది పద్యమే కాదని పంతులవా

రనసాహసించిరి. "సత్యవాణీసరస్వతీ" యనునట్లు, "తాను పద్యమునే" యని కమ్మమాత్రమే సహస్రముఖముల నుద్ఘోషించుచునేయున్నది.

ఇఁక రెండవవాక్యమునకుఁ బోవుదము. గద్యకు నియమ మవసరము లేదనియుఁ గావున దీనిని గద్యగా నెన్నవలయు ననియు దీనియర్థము. ఇందు, "కట్టడి" యన నేరిభావ మేమి? ఛందోనియమమా లేక వ్యాకరణనియమమా? గద్యకు ఛందోనియమ మవసరములే దనుట నిజమే కాని వ్యాకరణాది నియమ మవసరములే దనుట యసత్యము కదా. అయినను, పంతులుగా రిట్లు వ్రాయుటకుఁ గారణ మొకటిగా నూహింపవలసియున్నది. ఏది యన; నన్నయాదులు గద్యరచనలో నవలంబించిన కర్తృకర్మాదినియమములు రామమూర్తి పంతులుగా రీకమ్మలో నెన్నియోచోట్ల మీఱిరి. తాము వానిని దెలిసియో తెలియకయో మీఱిరి కావున, గద్యకు నియమమే యక్కఱలే దని లోకము కూడ భ్రమింప వలె నని యుద్దేశించి యిట్లు వ్రాసియుందురు. ఇఁక నీయంశమును విడచి ముందు కథకుఁ బోవుదము.

ఈవ్యాసమునకుఁ బ్రాఁదెనుఁగుఁగమ్మ యనిపే రిడఁబడినది. దీనికిఁ గారణము, "తొలితెనుఁగునుడులను" దీనిని వ్రాయుటయే. పంతులుగా రీవ్యాసమును దొలితెనుఁగున వ్రాసితి మని చెప్పుచున్నారు కావునఁ "దొలితెనుఁ" గన నేమియో తొలుదొల్త తెలుపవలసిన భారము వారిపైఁ గలదు కదా. తొలితెనుఁగన నేకాలమునాఁటి తెనుఁగు? ఆంధ్రభాషలో గీర్వాణ శబ్దములు కలియకమున్ను దేశమునఁ గలతెనుఁగా? లేక కలసినతరువాతి తెనుఁగా? సంస్కృతము కలియకమున్నున్న తెనుఁగే యైనచోఁ దద్భవము లేల చేర్పఁబడినవి? సంస్కృతము కలియకమున్ను దానివికార మగు "వికృతు" లు కూడఁ జేరియుండవు కదా. ఇఁక, సంస్కృతము కలిసినతరువాతి భాషయే యైనచోఁ దత్సమము లేలవిడువఁబడినవి? తత్సమము లాంధ్రభాషలోనివి కావా? శుద్ధాంధ్రగ్రంథకారులు తత్సమములను విడచి తద్భవములను మాత్రమే గ్రహించిరన భాషాతత్త్వము వారికిఁ దెలియకపోవుటచేతను, ఆంధ్రము సంస్కృతప్రాకృతముల వికృతి యని వారుదురభిప్రాయపడి యుండుటచేతను, వా రట్లు చేసిరి కాని భాషాతత్త్వము పూర్తిగా నెఱుంగుదు మని యనుకొనుచున్న పంతులుగారు నట్లు వ్రాయవచ్చునా? కానిండు, ఏదియో యొకభాషలో వ్రాసిరి.

దాని నిప్పుడు మార్పలేరుకావున నున్నదానికి గతివిచారింపవలయును. దీనికిఁ "గ్రాంధికముఁ"గని యేలపేరిడిరి? ఈభాష యేయేయాధారములనుండి కైకొనఁబడినది? ఇది యేకాలమునాఁటిది? ౧౧వ శతాబ్దముదా? ౧౩వ శతాబ్దముదా? ౧౬వ శతాబ్దముదా? "తిక్కఁడు పెద్దన లొక్కఁబాసాడిరె, పాఱుచుఁ జదివిన వాసియగపడున; కలయుగఁ జూచినఁ నన్నయ తిక్కనల నుడులను నెక్కొంత గాననగున" అని తామే వ్రాయుచున్నారుకదా. భాష వెవ్వేఱుకాలములలో వెవ్వేఱుగా నున్నప్పుడును, తాను ప్రాచీనభాషను వ్రాయుచున్నప్పుడును, ఏకాలమునందలి భాషను దాను వ్రాయుచున్నాఁడో, ఆకాలమును నాభాషను గ్రహించుటకుఁ గల కావ్యశాసనాదికము లగు నాధారములనుగూడఁ దెలియఁ జేయవలసిన పని లేఖకునిది గదా. అట్లు చేయక, "ఇది గ్రాంధికముఁగు" అనునంతమాత్రమునఁ బామరులు భ్రమించునట్లు పండితులును భ్రమింతురా? పంతులువారిది యేకాలమునాఁటి భాషయో తెలుపకపోయినను, గొండొక యాధారము మాత్రము లేఖయందుఁ గన్పట్టుచున్నది.

"ఈ కమ్మలో నున్న వెన్నియో మాటలు నన్నయనుడులేని, తెలియంగఁబడునె యిప్పుడీ రాజేంద్రవరమున వారు."

(ఇందలి యనర్థము మున్ముందు వివరింపఁబడును.)

ఈలేఖలోని మాట లెన్నియో నన్నయనుడులే యైనను రాజమహేంద్రవరమున నున్న యిప్పటివారి కవియర్థము కావని దీని తాత్పర్యము. దీనిని బట్టి ఈవ్యాసమునందలి పదము లనేకములు నన్నయనాఁటి వని తేలుచున్నది. ఇదియే నిజమైనచో, నేయేపదములు నన్నయనాఁటివి? ఎయ్యేపదములు తరువాతివి? ఈయంశ మొకటి తెలియవలయును గదా. ఇది తెలిసిననే కదా, యిందలి సందర్భాసందర్భములు మనము విమర్శింపనగును. అట్టి యాధారము లేవియు విమర్శకుల కొసంగక, తమ యిచ్చకు వచ్చినట్లు వ్రాయుట యన్యాయము కదా. కావననే కాఁబోలు "ఈకమ్మనుడులను నా యిచ్చమై నేను గూర్చితి" నని పంతులుగారు మొదటనే ప్రతిజ్ఞ చేసికొనియున్నారు. ఈవ్యాసమునందలి భాష యేకాలమునాఁటిదో పంతులువారు చెప్పకపోవుటచేతను, ఇందలి పదము లనేకములు నన్నయనాఁటి వని యనుటచేతను, పంతులు గారు భారతమునఁ గల యాంధ్రభాషాస్వరూపమును దెలిసికొనుటకై బహుకాలము

నుండి శ్రమపడుచుండుట వాస్తవ మగుటచేతను, ఇది కవిత్రయమువారిభాషను వ్రాయఁబడిన దని మొత్తమున మన మనుకొనవచ్చును. అదియే నిజమైనచో, నాంధ్రభాషాస్వరూపము వీరికి బాగుగాఁ బట్టువడలేదని, యీవ్యాసమే చాటుచున్నది. నన్నయ తిక్కనల నియమములను మీఱి పలుతావుల నడుచుటచేఁ బ్రాచీనాంధ్రభాషాస్వరూపమును దెలియఁజేయుట కీవ్యాస మెంతమాత్రమును జాలదు. ఇందున కుదాహరణముగ శతాధికము లగు ప్రయోగముల నీవ్యాసమునుండి యెత్తిచూపవచ్చును గాని, గ్రంథవిస్తరభీతిచేఁ గొన్నిమాత్రమే చూపెదను.

(1) "మీ మెచ్చుతెనుఁగది కను గరిడిబిద్దె" (*a*) ఇందు గరిడియను శబ్దము సందర్భానుసారముగ "వీటి వాండ్రు" అనునర్థమునఁ బ్రయోగింపఁబడినది. గరిడి, గరిడీ శబ్దములు తొలుదొల్త "చోటు" అను సామాన్యార్థమునఁ బ్రయోగింపఁబడుచుండెను. తరువాత నవి "సాముచేసెడి చోటు" అనునర్థమునఁ బ్రయోగింపఁబడినవి. ఆపిమ్మట, "సాము" అనునర్థముననే ప్రయోగింపఁబడినవి. కాని, వీటివాండ్రనునర్థమున నెవ్వరును బ్రయోగించి యుండ లేదు. భారతమునఁ బ్రయోగము లేమైనఁ గలవా?

(*b*) బిద్దె ఇది విద్యాశబ్దమునకు వికృతిగా గ్రహింపఁబడినది. "విద్దె" యనురూపము కలదు గాని, "బిద్దె" యను రూపము కన్పట్టదు. ప్రయోగములు కలవా?

(2) "మొదలేని తుదయేని మొగపడ దరయ" ఇందు, మొగపడు అనునది "అగపడు" అనునర్థమునఁ బ్రయోగింపఁబడినది. కాని, యాశబ్దమునకు "చూచు" అనునర్థమున సకర్మకక్రియగా మాత్రమే పూర్వకావ్యములలోఁ బ్రయోగములు కలవు. "అగపడు" అనునర్థమునకు బూర్వకావ్య ప్రయోగములు చూపఁగలరా?

(3) "ఉచ్చమల్లిని నందొటు గొల్వ"

ఇందు, "ఉచ్చమల్లి" యనుశబ్దమేయర్థమునఁ బ్రయోగింపఁబడినది? ఈ శబ్దమునకు నగ్న (వస్త్రహీన) అనియర్థము. ఈయర్థ మీవాక్యమున ననర్థకము.

(4) "కయితమ్ము గారడి బిద్దె గా దిద్ది"

ఇందు గారడి యనునది పైఁజెప్పఁబడిన "గరిడి" యనుపద మేయర్థమునఁ బ్రయోగింపఁబడినదో యాయర్థముననే ప్రయోగింపఁబడినది. ఈశబ్దము

కూడఁ బూర్వకావ్యములలో నాయర్థమున నుపయోగింపఁబడక పాములవాఁడనునర్థమునఁ బ్రయోగింపఁ బడుచుండెను.

(5) కనువిచ్చి <u>చుండు</u>.

ఇందు, <u>చుండు</u> అనునది, "చూడుఁడు" అనుదానికి మాఱురూపముగాఁ గన్పట్టుచున్నది. "చేయును జుండు" "కొట్టును జుండు" అనునిట్టి తావులను మాత్రమే "చూడుఁడు" అనునర్థమున "చుండు" అని యుపయోగింపఁబడుచున్నది కాని, ప్రత్యేకక్రియగాఁ బ్రయోగింపఁబడుట యిందనుక నెందును జూడలేదు.

(6) "<u>కండ్లు</u> తప్పనఁగఁ గన్నులు బాసకు"

ఇందుఁ "గండ్లు అనునది కన్ను లనునర్థమునఁ బ్రయోగింపఁబడినది. ఇది యపరూపము.

(7) (a) వేనవేల్ విల్లలచేత

(b) మీరలు వ్రాఁబొత్తముల

ఇత్యాదిస్థలములలోఁ బరుషాక్షర మగుపకారము వకారముగా మార్చుటకుఁ గలయాధారమేమి? ప్రథమమీఁది పరుషములు గసడదవలుగా మాఱుట బహుళముగా నగుచుండును గావున, శ్రుతిహితము కానిచోట్ల నవి మార్ప వీలులేదు. ఇట్లు మార్చుటకు మహాకవిప్రయోగములు కలవా?

(8) (a) కఱవుచేఁ <u>బసి</u>గొని చానున్నవారు

(b) దాన నతఁగుల <u>పసి</u> యాఱునయ్య

ఇందుఁ <u>బసి</u> యనుశబ్ద మాఁకలి యనునర్థమునఁ బ్రయోగింపఁబడినట్లు తోఁచుచున్నది. కాని, <u>పసి</u> యనునది కుక్కలు మొదలగునవి గ్రహించుచుఁడు పశ్వాదులమీఁది యొకానొకగాలి (వాసన) అనునర్థమున మాత్రమే యుపయోగింపఁబడుచుండుట యెఱుంగుదుము. "ఆఁకలి" యను నర్థమునకుఁ బ్రయోగములు కలవా?

(9) "<u>బోడులు</u> దక్కఁగ నేరట్టి రుంద్రా"

ఇందు <u>బోడులు</u> అనునది సన్యాసులు అనునర్థమునఁ బ్రయోగింపఁబడినట్లుకన్పట్టుచున్నది. అదియే నిజమైనచో, <u>బోడులు</u> అనునది యపరూపము. <u>బోడలు</u> అను రూపము సాధువు. వితంతువు లని యర్థమైనచో నదియనర్థకము.

(10) (a) పాటించ్వరైరి. (b) చాలించకునికి

ఇందు, ఇంచుక్చుకారమునకుఁ బకార మేల రాలేదు? ఇందునకు భారతమునఁ బ్రయోగములు కలవా?

(11) (a) వారుచెప్పంగా నాలించితయ్య

(b) నాసెప్పఁగలయది చెప్పితయ్య

ఆలించితిఁ + అయ్య=ఆలించితయ్య

చెప్పితిఁ + అయ్య=చెప్పితయ్య

ఈ సంధి వ్యాకరణవిరుద్ధము. పూర్వకావ్యములలోఁ బ్రయోగములు లేవు. పంతులుగారు భారతమునఁ బ్రయోగమును గన్పెట్టిరా?

(12) వాని నేమి సేతుము

"చేయుదుము" అనుదానికిఁ జేతుము అనునది గ్రామ్యరూపము. భారతమున నిట్టి ప్రయోగములు కలవా?

(13) బారతకత సదివి.

భారతకథ యను సంస్కృతరూపమునకు నిది వికృతియని యిందనుక సెఱుఁగము. భారతమునకత యనునది వైయాకరణరూపము. కొందఱు పండితులు బారతపుఁగతె యనునది సురూపమని యెంచుచున్నారు. బారతకత యనురూపమునకుఁ బ్రయోగములు కలవా?

(14) నీ నారె పెఱవారు.

ఇందు, నారె అనునది అనరె అనుదానికి రూపాంతరమఁట! అనుధాతువున జనించురూపములలో, అనన్=నాన్; అనక=నాక. ఇత్యాద్యసమాపక క్రియారూపములలోఁ బ్రథమాక్షర మగు అకారము ద్వితీయాక్షర మగు నకారముతోఁ గలియును గాని, సమాపకక్రియలలోఁ గలిసినట్లు కన్పట్టదు. భారతమున నిట్టిప్రయోగము లున్నవేమో!

(15) మీకు వలచిన యట్లు.

ఇది యసాధువు. వలచిన యనుక్రియ సకర్మక మగుటచే, మీవలచిన అనిగాని మీరువలచిన అనిగాని యుండవలయును.

(16) ఈ కమ్మలో నున్న వెన్నియో మాటలు, నన్నయ నుడులేని,
తెలియఁగఁబడునె యిప్పు డీరాజేంద్రవరమునవారు.

ఈవాక్యమునఁగల సంపూర్ణ క్రియాపద మగు తెలియఁగఁబడునె యనునది మాటలు అను కర్తృవాచకముతో నన్వయించుచున్నది. ఇఁక “రాజేంద్ర వరమునవారు” అనునది దేనితో నన్వయించును? అదియును, పైక్రియతోనే యన్వయింపవలసినచో, వారికి అనుషష్ఠీవిభక్తిరూపము గదా యుండవల యును. ఇట్టి యసందర్భపు టన్వయములకుఁ గూడఁ బంతులువారికి భారతమునఁ బ్రయోగములు కన్పడెను గాఁబోలు.

రామమూర్తిపంతులుగారికి నాంధ్రభాషాస్వరూపము చక్కఁగాఁ దెలి యనేలేదని ఋజువుచేయుట కీప్రయోగములు చాలును. కవిత్రయకృతగ్రంథ ములలోనుండి ప్రయోగములను జూపుచుఁ దమ ప్రయోగములను సమర్థించు కొని నప్పుడే, వారు తమభాషాజ్ఞానమును సమర్థించుకొనఁగలుగుదురు. కాకున్న నది యసాధ్యము.

పైయంశములను బట్టి విచారించినచో, సలక్షణాంధ్రభాషాస్వరూపము యథార్థముగాఁ దెలియఁజేయుటకు నీవ్యాసము చాలదనియు, సలక్షణాంధ్ర భాష దుర్గ్రాహ్య మెన్నఁడును గాదనియు, నీవ్యాసము సామాన్యజనులకు దుర్గ్రాహ్యమే యయ్యెను, దానికిఁ గారణము దానిసలక్షణత్వము కాక, వేఱొకఁ డేదైన నుండియుండు ననియు స్పష్ట మగుచున్నది. ఇఁక నీవ్యాసమున సందర్భానుసారముగాఁ దెలియఁ జేయఁబడిన యంశములం గొన్నిటిని బరీ క్షింతము.

(*a*) నన్నయఁ దిక్కనఁ గేతనం దొట్టి తొలికైతకాం డ్రెల్ల రానాఁటఁగోలె దారును దమవార లొండొరులతోడ నిచ్చ లెయ్యోయినుడులు నొడివెడు వార లానుడులఁ గైతంబు గూర్చుచు నదియుఁ గమ్మగాఁ దనరెను గావలయుఁ జూరె.” అనునొకవాక్యరాజ మీవ్యాసమునఁ గన్పట్టుచున్నది. నన్నయతిక్కన కేతనల గ్రంథములలో జనసామాన్యముల భాష యున్నదియున్నట్టుగానే వ్రాసి రని పంతులుగా రేయేయాధారములనుబట్టి సిద్ధాంతము చేయఁగలరు? వా రెన్నఁడు నట్లు వ్రాసియుండలే దని వారికైలియే వేనోళ్లఁ జాటుచున్నది. వారి గ్రంథములఁ గలభాషలోఁ “గాఁపులమాటచొప్పు” కన్పడుచుండ లేదాయన,

లేదని మన మనలేము ; కాని, గనిలోనుండి యెత్తి తీయఁబడిన బంగారమును బరిశుద్ధిచేసి యాభరణములను జేయురీతి, కాఁపులశబ్దములును, నానుడులును, కణ్వాబృహస్పతుల నియమముల చొప్పునఁ బరిశుద్ధిచేసి, వారు తమకబ్బములఁ జొన్పిరి కాని, యవి యున్నవి యున్నట్టు గానే చొన్పలేదు.

(b) "వారిపిదపటివార లంతకంతకును, గైతంబు గారడిబిద్దెగా దిద్ది, కైతంబు బాసను గకవికలుసేసి, సింగారమునకునై సిగ్గుడిగ ద్రావి, రోఁతయించుక లేక, పాడిగడిమివిలి, బూతులు రంకులు వొందించి చొన్ని, లంజెలమైజిగి మెఱమెచ్చి యాడి, రాజుల రెడ్డను బెల్లించి వుచ్చి, కూర్మియు నెయ్యమ్ము గల రట్లు తోతేర, వేనవేల్ బొంకులు బొల్లిపాడియును, నిచ్చకమ్ములు సెప్పి, తమకరువుఁ గూడుఁగొనుటకునుండెను, గాసుకు నొండెఁ దమకయితకన్నుల వారికిఁ దార్చి, బాసవెలందిని వెలయాలిఁజేసి, వెలయాలి మటుమాయయాకెకు మరపి, మిఱుమిట్లు గొల్పఁగా గద్దెనెక్కించి, నేలకు సానిగా దానినెలకొల్ప అంకులాడి యె మేటి నాడెమగు మిన్నయని, యుచ్చమల్లిని నందొలు గొల్పఁ దొంటిబాస వెలంది కటకటా క్రుళ్లి తెవులుగదిరిన చివ్రుకులంజె యయ్యెత్రెళ్లె."

పండితులారా, ఈవాక్యముం జిత్తగింపుఁడు. ఆంధ్రకవిత్వమునఁ బంతులుగారికిఁ గల యసహ్యమంతయు నీవాక్యమున వెల్వరింపఁబడినది. కటకటా! పదునాఱవశతాబ్దము నందలి యాంధ్రకవిత్వమునకు నెట్టిపాట్లువచ్చినవి! ఈవాక్యమునందలి ప్రతిశబ్దమును విమర్శించుచు, భారతమంతగ్రంథ మొకటి వ్రాయవచ్చును గాని, యట్లు వ్రాయుటయు, వ్రాసినది చదువుటయుఁ గూడ వ్యర్థప్రయాసము లే యని మానివేసితిని. ఆంధ్రకవిత్వ మనుకల్పవృక్షమునకుఁ బదునొకండవశతాబ్దమునందలి కవిత్వము చిగురువంటిది. 12వ శతాబ్దమునందలి కవిత్వము మొగ్గవంటిది. 13వ శతాబ్దమునందలి కవిత్వము పూవువంటిది. 14వ శతాబ్దమునందలి కవిత్వము పిందెవంటిది. 15వ శతాబ్దమునందలి కవిత్వము కాయవంటిది. 16వ శతాబ్దమునందలి కవిత్వము పండువంటిది. కావున, నాంధ్రకవిత్వమంతలోఁ బదునాఱవశతాబ్దముకవిత్వమే శ్రేష్ఠతమ మైనది. అట్టియుత్తమ కవిత్వమును బంతులుగా రీరీతిగా నేవగించుటకుఁ గారణ మగపడదు. తమయుద్దేశముల నన్నిటిని విపులముగాఁ జర్చించుచుఁ బంతులుగారు ప్రత్యేకగ్రంథ మొకటి వ్రాసినచోఁ బండితు లంగీకరింతురుకాని, లోకమును భ్రమింపఁజేయు నుద్దేశమున సోదాహరణములు కాని యిట్టివాక్యములు వ్రాసినలాభము లేదు.

పంతులుగారు ముస్సుం దాపనిఁ జేయుదురుగాక. (c] "పెద్దలీ-హొప్పున లంజెను నాడెంపురాణిగా నెన్నుచు, మగనాలిఁ దెగడి, యెబ్బెరాసిది యని యేవగింప, నట్టిపెద్దల నడయ మేల్పాడిగాఁ దలఁచి, పజ లదె కొనియాడ నమ్మ్యోఁగా వలయు."

ఈవాక్యముం దిలకింపుఁడు, ఇందలి "లంజె" గ్రాంధిక భాష, "మగనాలు" గ్రామ్యభాష. మన లెస్స బాసయ కాదె మగనాలు" అనువాక్యము దీనిని బలపఱచుచున్నది. కావునఁ, బంతులుగారియుద్దేశమున లంజె యన నేమియో, మగనాలన నేమియో, మనము తెలిసికొనవలసి యున్నది. లంజె, మగనాలు, అను రెండుశబ్దములకు నిర్వచనములను బంతులుగారీవ్యాసముననే యిచ్చియున్నారు. చూఁడుఁడు, "ఇచ్ఛమై దిరిగిన, నిలువాడు మగనాలు సాంజవు మేరలు మీఱదెన్నఁడును. బొల్లిమఱియాదల నెడ్డెల నేమర్చి, లంజియ కదె దాటుమేర లెల్ల," ఈనిర్వచనమున నసత్య మెంతమాత్రమును లేదు కాని, యది భాషావిషయమున వారి యుద్దేశమున కెట్లుసరిపడునో పరీక్షింపవలయును. మూఢు లగు భర్తల నేమర్చి, మేరలు (నియమములు) దాఁట నది లంజె. ఇందు రెండుసంగతులుగలవు.

(1) భర్తలు మూఢు లగుట,

(2) మగని నేమఱచి, నియమరహితముగఁ బ్రవర్తించుట.

ఈరెండును గ్రామ్యవిషయమై యథార్థములో గ్రాంథిక విషయమున యథార్థములో తెలిసికొనుఁడు. ఇఁక, సాజంపు మేరలు (నియమములు) మీఱనిది మగనాలు. అనఁగాఁ, దా నేనియమముల ననుసరింప వలసియున్నదో యవి యనుసరించియే ప్రవర్తించునది. ఈనిర్వచనము నియమరహిత యగు గ్రామ్యభాషకుఁ జెందునో, నియమ సహిత యగు గ్రాంథిక భాషకుఁ జెందునో, పంతులుగారే యాలోచింతురుగాక. రామమూర్తిపంతులుగారు గ్రాంథిక భాష లంజెగాను, గ్రామ్యభాష మగనాలుగాను, కన్పట్టునట్టు చేయవలెనని యెంతయో శ్రమపడినారు. కాని, వారిశ్రమయంతయును వారినిర్వచనములవలననే వ్యర్థము చేయఁబడినది. ధర్మమునకే యెప్పుడును జయము కలుగుచుండును గదా. పంతులుగారు తమయుక్తిలో నీలోపమును గనిపెట్టియే కాఁబోలు, "మొఱటు మొఱటని దాని(గ్రామ్యమును) దెగడుటయె కాని, యేరుదిద్దిరి మెఱుఁగులు దానికయ్యా." అనుకొండొకవాక్యము నతికి యున్నారు. ఈవాక్యమును బట్టి వీరియుద్దేశము,

నియమరహిత మగుటచేతనే గ్రామ్యభాష మొఱటుగానున్నదనియు, దానిని నియమసహితముగాఁ జేసినచో, దాని మొఱటుఁదనము వీడుననియుఁ, దేలుచున్నడి. నియమసహితమై, యభివృద్ధిలో నున్న యొకానొక భాషను విడచి, నియమరహితమైన మఱియొక భాషను జేపట్టి, నియమముల నేర్చి, నూతనముగ నభివృద్ధిలోనికిఁ దెచ్చుటకు శ్రమపడినచో, నేమిప్రయోజనమో తెలియకున్నది. ఈశ్రమమంతయును, రామమూర్తిపంతులుగారివంటి సంస్కర్తలకు వాగనుశాసనాభిధానము నొసంగుటకుఁ బనికివచ్చునేమోగాని, వేఱుప్రయోజనము మాకు గోచరింపలేదు. లక్షణవతియై, గుణవతియై, విదుషియై తన్నునమ్మియున్న యొక భార్యను విడచి, లక్షణమెఱుంగక, విద్యాగంధములేక, సుగుణసంపత్తిలేక, యొక్కొక్కని యొద్ద నొక్కొక్కరీతిగా మెలంగుచున్న యొకానొక సామాన్యను వివేకముగలవాఁ డెవ్వఁడైనఁ జేపట్టునా? ఇంతశ్రమపడి, గ్రామ్యభాషకు నియమముల నేర్పఱచినచో లాభమేమి? ఈకాలమున గ్రామ్యగ్రాంథికభాష లొక్కరీతిగా నుండుటకు సరిపోవును గాని, మున్ముందట్టిప్రయోజనము కన్పట్టదు కదా. నియమసహిత మగుభాష మాఱకుండుటయు, నియమరహిత మగు భాష మాఱిపోవుచుండుటయు, ననుభవైకవేద్యము కదా. కావున, ఇప్పుడు నియమము లేర్పఱచి, గ్రాంథికముగాఁ జేయఁబడిన గ్రామ్యభాష మఱియిన్నూఱేండ్లకుఁ దరువాతఁ గూడనిట్లే యుండును గదా. ఇఁక నప్పటిగ్రామ్యభాష యిట్లేయుండక, యెంతయో మాఱిపోవునుగదా. అప్పుడు మరల గ్రామ్యగ్రాంథికభాషలకు భేదము కన్పడి క్రొత్తచిక్కును గల్గించునే! అప్పు డేమిచేయవలయును? అప్పుడు మరల భాషకుఁ గ్రొత్తనియమముల నేర్పఱుపవలెనా? అట్లయిన, నిన్నూఱేండ్ల కొక్కొక్కతూరి భాషకు నూతననియమముల నేర్పఱచుచు వచ్చినచో నిఁక భాషగతి యేమి కావలయునో! కావున, గ్రామ్యభాషకు నూతననియమముల నేర్పఱచుట వ్యర్థప్రయాసము. (d) "తొంటిపెద్దల బాస సొంజపుబాస, సొంపుమై నింపుమైఁ జదువ నొనఁగూడు." అని పంతులుగారు చెప్పుచున్నారు. ఇది కా దని మేమెంతమాత్ర మనము. కాని, తరువాతివారు కవిత్వమును భాషను బాడుచేసి రని చెప్పుచు వారు, "సంధులాదేశాలు, నాగమ్ములను ఆలును, నెఱసున్న లఱసున్నలునిచి, యన్నియు నేర్పుమైఁ గలియంగ దంచి" రని పంతులుగారు చెప్పుచున్నారు. దీనిఁబట్టి, తొంటికవులు, నన్నయ తిక్కనాదులు, సంధినియమములును, శకటరేఫనియమములును, నను

స్వారనియమములును, పాటింపక కవిత్వము చెప్పుటచే వారిగ్రంథములు సుగ్రాహ్యము లైనట్లును, దరువాతివా రానియమములను బాటించుటచే వారిగ్రంథములు దుర్గ్రాహ్యములైనట్లును, స్పష్టమగుచున్నది కదా. భాషావిషయమున నెంతయో పరిశ్రమచేయుచు, భాషాచరిత్రమును బూర్తిగాఁ దెలిసికొనఁజాలి రని మనమనుకొనుచున్న రామమూర్తిపంతులుగారే యిట్టివాక్యమును వ్రాయుట కన్న మఱియొకవింత కలదా? నన్నయ తిక్కనకవిత్వములో సంధులును, శకటరేఫార్ధానుస్వారనియమములును లేవా? వాస్తవమున వారికవిత్వముననే గదా యివియెక్కువశ్రద్ధతోఁ బాటింపఁబడినవి! ఇఁకఁ దరువాతివారు నన్నయాదుల సంధినియమములను బాటించినను. శకటరేఫార్ధానుస్వారనియమములనంతగాఁ బాటింపనే లేదుగదా. నియమముల నెంతయో శ్రద్ధతో నవలంబించిన నన్నయాదుల కవిత్వమే సుగ్రాహ్య మగునప్పు డానియమములలోఁ గొన్నిటిని విడచినవారి కవిత్వము దుర్గ్రాహ్య మని చెప్పుట కేమి కారణము? కావున నీవాక్యము పెద్దనాదులకవిత్వము దుర్గ్రాహ్య మని చెప్పుటకుఁ జాలదు కాని, 16వ శతాబ్దమునందలి కవిత్వమునఁ బంతులుగారికిఁ గల యసహ్యమును మాత్రము బలపఱచుటకుఁ జాలియున్నది.

(e) "బాపలుమున్నుగా మాటలు పుట్టించి కమ్మపై గిమ్మఁగా దెలుఁగయ్యె నయ్యా? బాపలకంటెను ముందరఁ గాఁపులు వల్కరె ప్రాఁతలు దెనుఁగులు నుడులు తొంటిపెద్దల కట్టియరమరలున్న? తొంటికాఁపుల పలుకె కొనియాడ్రైరె? ఏనాటిపెద్దల నుడుల నానాఁడు మేలుగ నెన్నుటయు పాడి మెల్లెడల?" ఇందలి యర్థవిశేషముం జిత్తగింపుఁడు. "బ్రాహ్మణులు తొలుదొల్త ఆంధ్రభాషను సృష్టిచేయలేదు. తమకాలమునందలి కాఁపులమాటలను గ్రహించి వానిని మేలుగనెన్నిరి. ఏనాటిపెద్దలనుడులను నాఁడు మేలుగా నెన్నుట పాడిగదా." అని గదా పంతులుగారి యుద్దేశము. ఇందు రెండంశములున్నవి.

(1) పూర్వబ్రాహ్మణులు తమకాలమునందలి కాఁపుల మాటలను మేలుగ నెన్నిరి.

(ఇదివిశేషాంశము.)

(2) ఏనాఁటి పెద్దలనుడుల నానాఁడు మేలుగ నెన్నుట పాడి.

(ఇదిసామాన్యాంశము.)

ఈసామాన్యవిశేషాంశములను రెంటిని సమన్వయించినచోఁ, బూర్వకాలమునందలి బ్రాహ్మణులకన్న నాకాలమునందలి కాఁపులు పెద్ద లని ఫలితార్థము తేలుచున్నదిగదా? ఇది యే వాస్తవ మైనచోఁ బూర్వకాలమునందలి కాఁపుల భాషను శాసించిన బ్రాహ్మణులకన్న నాభాషను మాటలాడినకాఁపులే పెద్దలని కదా చెప్పవలయును? అట్లు చెప్పినచో నీకాలమునందలి శబరభాషను శాసించిన రామమూర్తిపంతులుగారికన్న నాశబరభాషను మాటలాడుచున్న పార్వతీయులే పెద్దవారని చెప్పవలసివచ్చును గదా? కటకటా ఈమాటను గలలోనైన మన మనఁగలమా!

రామమూర్తిపంతులుగారి వ్యాసమును దఱచిన కొలఁదియు నిట్టిసొగసులు బయలుదేఱుచునే యుండును. ఒక్కొక్కయంశమును గూర్చి యొక్కొక్కగ్రంథము వ్రాయుటకు వీలగును గావున నిది యింక విడచివేయుదము.

గ్రామ్యభాషయే గ్రాంథికభాష కావలయు నని ఋజువుచేయుటకుఁ బంతులుగారిచే నీవ్యాసమునఁ గొన్నియుక్తులు చూపఁబడినవి. అవి సాధారణముగా నాపక్షమువా రందఱును సభలలో నుపన్యాసరూపముగఁ జెప్పుచున్నవియును, బత్రికలలో వ్యాసరూపమున వ్రాయుచున్నవియునే గాని క్రొత్తవి కావు. ఇవికాక, వేఱుయుక్తులు వారికి లేవని కూడఁ జెప్పవచ్చును. ఈయుక్తులన్నియును మ-రా-రా-శ్రీ, జయంతి రామయ్యపంతులుగారు, వావిలికొలను సుబ్బారావుపంతులుగారు, మున్నగు మహనీయులచే నిదివఱకే ఖండింపఁబడినవి. వారి విమర్శనములకు సమాధానములను జెప్పుచుఁ, దమయుక్తులను బ్రతిపక్షులు నిలిపికొనినప్పుడే మరల వ్రాయుట యవసరముకాని, లేకున్న నది చర్వితచర్వణమే కావున నాయుక్తులను మరల నిందు విమర్శింప లేము.

ఉపసంహారము.

ప్రకృతమున నాంధ్రభాషకు సంస్కరణ మావశ్యక మని అప్పారావు పంతులుగారును, దత్పక్షమువారును, నెట్లు తలంచుచున్నారో, మేము నట్లే తలంచుచున్నాము. కాని, వారును మేమును ద్రొక్కుచున్న త్రోవలు మాత్రము భిన్నములైనవి. ప్రాచీనాంధ్రసంస్కర్తలలో మనకు మార్గదర్శి కానున్నవాఁడు కవిబ్రహ్మ. అతని సంస్కరణవిధమును దొలుదొల్త నే వివరించితిని. ఇప్పుడు మనము చేయవలసినసంస్కార మిట్టిదియే కాని, కాలానుసరణముగా

మాత్ర ముండవలయును. విజ్ఞానచంద్రికయును, విజ్ఞానసర్వస్వమును, శాస్త్రములవిషయమున నీమార్గము ననుసరించి పనిచేయుచున్నవి. సాహిత్యపరిషత్తు మిగిలిన యంశములలోఁ బనిచేయవలసియున్నది. వారు కొంతవఱకుఁ జేయుచునున్నారు. అప్పారావుపంతులుగారును, రామమూర్తి పంతులుగారును, శేషగిరిరావు పంతులుగారును, అవలక్షణవతిని లక్షణవతిగాఁ జేయుటయందుఁ దమప్రతిభావిశేషమును వ్యర్థముసేయక, పైవారికిఁ దోడ్పడినచో, భాష యెంతయో వృద్ధినొందును. అట్లుకాక, తమనూతనమార్గమును దాము విడువ మని పట్టుపట్టినచో, వారు ముఖ్యముగాఁ జేయవలసినపని యొకటి కలదు. ప్రస్తుతమున గ్రామ్యవాదులు తమయభిప్రాయములలో నొండొరులతో నేకీభవింపక యున్నారు కావున, వారందఱు నేకీభవించి, తొలుదొల్త నొకమార్గ మేర్పాటుచేసికొనవలయును. తరువాత నామార్గమును బండితులకుఁ జూపిన, నందలి మంచిచెడ్డలను వారు పరీక్షించి, యదియంగీకరింపఁ దగునో తగదో నిర్ధారణ చేయుదురు. అట్లుకాక, యెవ్వరికిఁ దోఁచినరీతిని వారు వ్యాసములను వ్రాయుచున్నంతమాత్రమునఁ గాని, యట్లువ్రాసినవ్యాసములు పాశ్చాత్యులచే నభినందింపఁబడినంతమాత్రమునఁగాని, యాంధ్రభాషాసంస్కరణము తామనుకొనినట్లు జరుగనేరదు.

మం. పార్వతీశ్వరశాస్త్రి.

శ్రీకృష్ణాయనమః.

పురాణపఠనావశ్యకత.

చేతనసృష్టిలో నెల్లనరులు సర్వాధికు లగుటకుఁ గారణము జ్ఞానైకసాధన మగుమానవదేహమును దాల్చి యుండుటంబట్టియే. జ్ఞాన మైహికము నాముష్మికము, నని రెండువిధములు. ఐహిక మన నిహమున మనుజుఁడు తన జీవితకాలమును గౌరవానందములతోఁ గడపుటకుఁ దగిన తెలివి. ఆముష్మిక మన జీవుఁడు పరమున శాశ్వతానందమును బడయుటకుఁ దగు తెలివి.

ఇందు మొదటితెలివి నభివృద్ధిచేయుటకుఁ జతుష్షష్టికళలు, వ్యాకరణాదిశాస్త్రములు, లోనగునవి ప్రధానములు. రెండవతెలివి నభివృద్ధిచేయుటకుపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీతలు లోనగునవి ముఖ్యములు. పూర్వజ్ఞానమునకంటె నుత్తరజ్ఞాన ముత్కృష్టమైనది. కాని యుత్తరజ్ఞానసౌధారోహణమునకుఁ బూర్వజ్ఞానము సోపానపరంపరవంటిది.

ఈలౌకికాలౌకికజ్ఞానములు రెండును నొకదానితో నొకటి సమ్మిళితమై యంగాంగీభావమును బొందినపుడే మానవునకుఁ బరిపూర్ణలాభమును గలిగించుచున్నయవి. అందువలననే మనపూర్వు లీరెంటిని గలిపియే బోధింపఁదొడఁగిరి. కావుననే సనాతనధర్మము లన్నియు నిహపరముల రెంటిని సంపాదింపఁదగినవిగ నున్నవి కాని వేఱుపడి యుండలేదు.

కాని మానవు లీజ్ఞానద్వయమును సంపాదించుటలోఁ జాలశ్రమపడవలసి యున్నది. జ్ఞానసాధకము లగునసంఖ్యేయగ్రంథముల జదువుటకుఁ బరిమితకాలజీవు లగుమర్త్యులు శక్తులు కాఁజాలరు. చదువుటలో నొకకొందఱు కృతార్థులైనను, వానియందలి గంభీరభావము, నాత్మానుభవమునకుఁ దెచ్చికొని యుత్తీర్ణుఁ డగువాఁడు వేయింటి కొకఁడుండునో యుండఁడో తెలియదు.

కావుననే దయామయు లగుమహర్షులు కేవలశాస్త్రములచే విషయమును బోధించి స్త్రీపురుషాది సకలమానవసంఘము నుభయజ్ఞానానుభవసంపన్న మగుదానినిగాఁ జేయుట యత్యంతదుష్కర మని తెలిసికొని, యొకగ్రంథము చదువుటచేతనే జ్ఞానద్వయమును ననుభవములోనికిఁ దెచ్చి, యాచరణోప

యుక్త మగునట్లు చేయుటకు శాస్త్రీయవిషయములఁ జక్కనికథలతోఁ జేర్చి బోధించిన సుబోధ మగు నని తలఁచి యసంఖ్యేయాము మూలోపాఖ్యానములచే నొప్పుచున్న పురాణముల శ్రోతృజనచిత్తరంజక మగునటుల విరచించి యున్నారు.

ఈపురాణనాయకపావనజీవచరితలు చదువరుల కత్యంతానందసంధాయకము లగుటయే కాక, కామాదిదుర్గుణదూషితములైన మానవహృదయములఁ జక్కఁబఱచి, శీలసంపన్న మగునటుల చేయుచున్నవి. కావుననే మహర్షులకుఁ బిమ్మటఁ గాళిదాసాదికవివరు లెల్లరును సామాన్యముగాఁ బురాణపురుషులనే నాయకులనుగాఁ దీసికొని, రసభరితము లగునుత్తమకావ్యముల విరచించి యున్నారు. పరమపావనచరితు లగుపుణ్యపురుషుల జీవితములఁ జదువుటచేఁ గలుగులాభము నకు మేర లేదు. "జాతీయ వీరచరితములఁ దెల్పు గ్రంథసముదాయము, సమస్తకాలమునందును, సమస్తదేశములందును, నిక్కమైన విద్యకును, సౌశీల్యమునకును, మూలాధారము" అని కుమారస్వామి పండితుఁడు, జాతీయవిద్యావ్యాసమున వ్రాసియున్నాఁడు.

పురాణవర్ణితము లగుగజేంద్రాదితిర్యగ్జంతువులయు, ధ్రువప్రహ్లాదాది బాలభాగవతోత్తములయు, నభిమన్యుప్రభృతియౌవనవీరులయుఁ, గర్ణార్జునాది ప్రౌఢవీరులయు, శిబిదధీచ్యాది దానవీరులయు, హరిశ్చంద్రాదిసత్యవీరులయు, శ్రీరామాది పితృవాక్యపరిపాలకులయు, నలప్రభృత్యేకపత్నీవ్రతశోభితులయు, విదురాదినీతిధౌరేయులు, భీష్మాదిస్వార్థత్యాగగరిష్ఠులు, శ్రీశుకాదిపరమవైరాగ్యసంపన్నులు, జనకాదిజ్ఞానిసార్వభౌములు,వసిష్ఠాదిబ్రహ్మర్షులు మున్నగువారివియు, లోకపావనచరిత లగు సావిత్రి, సీత, దమయన్తి, చంద్రమతి, ద్రౌపది లోనగు సాధ్వీలలామలయొక్కయుఁ బవిత్రనామములు విన్నమాత్రముననే శరీరములు పులకరించుచుండ, నిఁక వీరిపావనదివ్యజీవచారిత్రములఁ జదువునపు డేయార్యుని చిత్తము ద్రవింపకుండును? ఏభారతీయుని నేత్రములనుండి యానందాశ్రువు లొలుకకుండును? ఏహైందవునిదేహము పరవశము కాకుండును?

ఈపావనచరితములఁ జదువునపుడు, కేవలస్వలాభములకొఱకుఁ బేరాసతోఁ బరుగిడువారుకూడ నిశ్చేష్టితులై స్థాణువులవలె నిలుచుటయే కాక,

తాముచేయుచున్న కుత్సితకృత్యముల స్మరించి, లజ్జితులై దేహత్యాగమునకైనను, లేదా తమనడతను జక్క-చేసికొనుటకైనను ద్వరపడుచుందురు.

ఈతీవ్రపావనపురాణవైరాగ్యమే యాచరణకాలమువఱకును మానవహృదయముల నిలిచియున్నచో నీలోకమున నింద్యము లగునీర్ష్యాసూయాదిదుర్గుణము లెచట నిలువఁగలవు? దుఃఖమునకుఁ దా వెయ్యది? పురాణపఠనోదితజ్ఞానచంద్రచంద్రికలు హృదాకాశమునఁ బ్రకాశించుచున్నపుడు, నరుఁడు కామాదిదుర్గుణాంధకారవిముక్తుఁడై కేవలప్రేమామృతసిక్తమానసుఁడై సమబుద్ధితో సోదరజాతినాదరింపఁ గోరుచుండును.

కావున మానవమనస్సీమను సదా యీజ్ఞానకళలు ప్రసరించుటకుఁ దఱచు పురాణపుణ్యకథలు చదువుచుండవలయును. కొందఱు పురాణముల యందు విరుద్ధకార్యములతో నిండియున్న పిచ్చికథలు కల వని యుఁ, గావున నట్టియసంభవవిషయములఁ జదువుటవలన జనులకు మూఢవిశ్వాసములు హెచ్చుచున్న వనియు, నొకవిరోధమును జూపుచున్నారు. కాని యిది యొకవిరోధాభాసము. ఇది పురాణసాంప్రదాయ మెఱుఁగనివారి కుదయించుచుండును.

పురాణవర్ణితము లగువిషయములు యథావృత్తము లనియు నర్థవాదము లనియు, రెండువిధములు. యథావృత్తము లన, నిజముగా జరగినవిషయములు. పురాణముల వర్ణింపఁబడిన యథావృత్తము లగువిమానవిహారాదులును, శాపానుగ్రహములును, కాలత్రయపరిజ్ఞానములును, మొదలగునద్భుతవిషయములు నేఁటికి బహుపురాతనము లగుటచే నప్పటి తపోమహిమలును, అప్పటి యాధ్యాత్మికజ్ఞానసంపదలును, అప్పటియింద్రియనిగ్రహములును, అప్పటిభౌతికశాస్త్రజ్ఞానములును, లోనగుశక్తిసామర్థ్యములు లేనియిక్కాలపునవనాగరకుల కవి విరుద్ధములుగాఁ దోఁపవచ్చును గాని యంతమాత్రమున నవి యసంభవములు కాఁజాలవు. శాస్త్రజ్ఞుల కట్టివి విపరీతములుగఁ దోఁపవు.

దినమునకు మూఁడుసారులు భోజనమును బదిసారులు ఫలాహారము నుండినఁగాని నిలువలేని దుర్బలమానవునకు, నేకాదశియుపవాస మన్న నసంభవకార్య మనితోఁపవచ్చును. అంతమాత్రమున నేకాదశీవ్రతగరిష్ఠుల కది యసంభవకార్య మగునా? నాగరకాగ్రేసరులును భౌతికశాస్త్రనిపుణులు నగుపాశ్చాత్యపండితులు మనపూర్వులు పురాణముల వర్ణించిన యద్భుతవిషయముల నిష్ప

డు శాస్త్రప్రమాణములచే స్థిరపఱచుచున్నవారు. వీని నన్నిటి నిటఁ జర్చించిన వ్యాసము విపుల మగు నని విడచితిని.

అర్థవాద మన నొకప్రధానవిషయమును బోధింపఁదలఁచి, దాని నొకకల్పితకథతోఁ జేర్చి బోధించుట. ఎట్లన నెంతటిసహజశత్రువులైనను వైరమును వీడి యేకీభావమును బొంది, పట్టుదలతోఁ బనిచేసినపక్షమున మృత్యువునుగూడ సాధింపనగు నుపాయముల సంపాదింపవచ్చు ననియు, నట్టిపూనిక కల కార్యశూరులకు భగవంతుఁడు కూడఁ దోడ్పడు ననియు, గాని కామాంధత ఫలసిద్ధికి భంగకారి యదియు నీలోనగునీతిని బోధింపఁదలఁచి, యీవిషయమే క్షీరసాగరమథన మని యొకకథగా వర్ణింపఁబడినది.

ఇటఁ గథ యథార్థమా? అయథార్థమా? అనువిషయము ముఖ్యము కాదు. మఱేమన సంఘీభావము సకలకార్యసాధక మనెడి యిందలి నీతియే ముఖ్యము. ఇట్టి యర్థవాదము లనేకములు పురాణములయందుఁ గలవు. ఈరీతిగా నర్థవాదములద్వారా విషయముల బోధించుట వేదములనాఁటినుండియు వ్యవహారములో నున్నది. కావునఁ బురాణములు బోధించు విరుద్ధవిషయము లెవ్వియును లేవు. కొందఱాధునికులు పురాణములు బహుపురాతనము లగుటచే నాధునికనాగరకులు గ్రహింపఁదగిన జ్ఞానము కలవిగా నుండ లే దని, పలుకుచున్నారు. కాని యిది యొకతప్పటూహ. ప్రాఁతదైనంతమాత్రమున నెగ్గ్రాహ్యము కాకపోదు. అట్లు కాదందురా బహుపురాతనము లగురత్నకాంచనాదు లెల్లఁ ద్యాజ్యములు కావలసివచ్చును. గ్రాహ్యతాగ్రాహ్యతలు, గుణాగుణముల నాధారముచేసికొని యున్నవికాని నూతనానూతనముల నాధారముచేసికొని యుండ లేదు.

ఇట్లనుటచే మనోహరార్థసంపాదకము లగునూతనగ్రంథములు గ్రాహ్యములు కావని నాతంపు కాదు. మఱేమనఁ బ్రాఁతవన్నమాత్రమున బురాణముల నవమానించి క్రొత్తవన్నమాత్రమున నూతనగ్రంథములే ముక్తిహేతువు లని తలఁపరాదు. నూతనముగాఁ దనపాణిగ్రహణ మొనర్చినమోహనాంగిఁ జూచినమాత్రమున సర్వమునకును నామెయే గతి యని తలఁచి, సదా తన శ్రేయస్సును గోరుమాతృదేవతను వృద్ధాంగన యని పూజింపకుండుట నీతికి దూరము కదా?

మనోహరము లగు ప్రియయొక్క ప్రియోక్తుల నాదరింపవలయును, శ్రేయస్కరము లగుమాతృదేవతయొక్క హితబోధలను మన్నింపవలయును.

అదిగాక భూతమునకును వర్తమానమునకును సంబంధము విడిపోరాదు. అట్టికలయిక పురాణపఠనమునం గాని నిలువదు. జపానుదేశముయొక్క ప్రస్తుతపుఘనత యంతయు దానిపురాతనచారిత్రమునందు, గౌరవముంచుటచేతనే కలిగిన దని చరిత్రాభిజ్ఞులు తెలుపుచున్నారు. అంతగాఁ బ్రాచీనముగాని జపానుదేశచరిత్రమే యిట్లుండ బహుపురాతన మగుమనదేశచారిత్రమును గూర్చి తెలుపవలసిన దేమున్నది. హిందూదేశమునందలి ప్రస్తుత విద్యాభ్యాసపద్ధతికంటె జపానుదేశమందలి స్వదేశచరిత్రబోధతోఁ గూడిన మార్గము చాల బాగుగా నున్న దని, ఫ్రెడరిక్ హారిసన్ దొరవారు తెల్పియున్నారు.

శాఖాహారమునకు నలవాటుపడిన జీర్ణాశయమునకు శాఖాహార మిచ్చినపుడే యది దానిని సుఖముగ జీర్ణముచేసి, దేహపోషకము లగుసప్తధాతువులను బుట్టించును గాని, అనభ్యస్త మగుమాంసాహారము నిచ్చిన దానిని సుకరముగ జీర్ణముచేయఁజాలకపోవుటయే కాక దుర్బల మైనవ్యాధిని గూడఁబుట్టించునటులఁ జిరకాలమునుండి భారతభాగవతాది పావనపురాణవిషయముల విని యానందించి బాగుపడుటకు నలవాటుపడియున్న భారతీయుల కంతగా నితరపురాణవిషయములు సుగ్రాహ్యములు కాఁజాలవు కావుననే—

"గృహోపకరణము లొకయింటినుండి మఱియొకయింటికి మార్చినట్లుగా, జాతీయపరమావధు లొకజాతినుండి వేఱొకజాతికి మార్పఁదగినవి కా" వని కుమారస్వామిపండితుఁడు తెలిపియున్నాఁడు.

ఇట్లు ప్రాజ్ఞు లగువా రనేకులు తలఁచియున్నారు. కావున ముందు మన దేశీయులకు స్వపురాణవిషయముల బోధించి, పిమ్మట దేశాన్తరపురాణచరితములఁ దెల్పినఁ దెల్పుదుముగాక. కొందఱకు గోక్షీరములయ్యును జక్కెర చేర్చినఁగాని రుచింపనట్లు కేవలపురాణశైలి రుచింపకున్నచో, నట్టివారికి సుబోధ మగునటుల లక్షణానుసారముగ గ్రంథముల వ్రాయుట యవసర మనియే నాతలంపు.

ప్రస్తుతము మనయాంధ్రకవిసోదరులు కొందఱు వ్రాయుచున్న నవలలు పాఠకుల కంతగా నుపయుక్తము లగుచున్నటుల నాకుఁదోఁపదు. మనపూర్వ

లు గ్రంథముల రచించుటలో నధికారి, సంబంధ, విషయప్రయోజనముల ముఖ్యముగ నేర్పఱచి గ్రంథసమాప్తిం జేయువారు. ప్రస్తుతమో ప్రయోజన శూన్య మగువిషయమును (కేవలకథను) ప్రధానముచేసికొని గ్రంథసమాప్తిని జేయుచున్నవారు. ప్రయోజనము నంతగాఁ బాటించుట లేదు.

కావుననే యీనవీననవలలు కాలము గడుపుటకుఁ దగుకథను గలిగియున్నవి కాని, కథ ముగిసినకడపటఁ బాఠకులు గ్రహింపఁ దగిన ప్రయోజనమును (నీతిని) గలిగి యుండలేదు. ప్రాజ్ఞు లగుపాఠకులు కేవలకథామాత్రపాఠములచే నమూల్య మగుకాలమును వృథాచేయక, నీతిదాయకము లగుగ్రంథరాజములఁ జదివి తమజీవితముల సార్థకము చేసికొనవలయును.

ఆర్యులపురాతనౌన్నత్యమును మనము తెలియఁ గోరుదుమేని తప్పక యీపురాణరాజములఁ జదివి తీరవలెను. వీనియందు వర్ణింపఁబడిన పట్టణముల యొక్కయు, నుద్యానవనములు, కోటలు, సౌధవీథులు, వాహనాదులు, నితరసంపదలయొక్కయు వైభవములఁ, జదువునపుడు భారతీయపురాతనౌన్నత్యము స్మృతికివచ్చి వెంటనే పాఠకునినేత్రములు మూఁతవడి, చేతనస్మృతి దక్కి చేతనున్న పుస్తకము క్రిందికి జాఱునంతటి దేహపారవశ్యత సంభవ మగును.

పురాణనాయకుల యసమానఘనభావములు తెలియుటకు నిట నొకటి రెండువిషయములఁ దెల్పెదను. సంస్కృతవాఙ్మయమున నాదికావ్య మని పేరు వడసిన శ్రీమద్రామాయణమునకుఁ గథానాయకు లైనసీతారాముల పావనగంభీర భాషణముల నాలింపుఁడు. మీ రపుడు విస్మయానందభరితమానసు లై పురాణ సంపదలఁ దెలిసికొనఁగలరు.

శ్రీరామచంద్రుఁడు రావణసంహారముకొఱకుఁ గపిసేనలతో నేగి సముద్రముకడ దిగియుండ, రావణానుజుఁ డగువిభీషణుఁడు మంత్రులతో వచ్చి యాకసమునుండి శ్రీరాముని శరణువేఁడెను. వీరాగ్రేసరుఁ డగుశ్రీరాముఁడును మాఱుమాటాడక వెంటనే వానికభయ మిచ్చెను. అపు డచట రాజనీతికోవిదు లగువానరవీరు లెల్లరును, నీతిశాస్త్రప్రమాణములచేతను యుక్తివాదములచేతను విభీషణుఁడు క్రూరరాక్షసుఁ డనియును, దేవరకుఁ బ్రబలశత్రు వగురావణున కనుజుఁ డనియుఁ గావున వీనిఁ జేరఁదీయరా దనియు బహువిధముల బోధించిరి. వారికి రాముఁడు తెలిపినదేమన:—

శ్లో. సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదా మ్యేత ద్వ్రతం మమ
మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయం కథంచన
దోషో యద్యపి తస్యస్యా త్సతామేత దగర్హితమ్.

అనఁగా "నొక్కసారి నాకుఁ బ్రపన్నుఁడై నీవాఁడ ననిన వెంటనేవాని సర్వభూతములనుండియుఁ గాపాడెదను. ఇట్లుచేయుటనాకు వ్రతము, పైకి మిత్రభావమును వెల్లడించుచు నాయొద్దకుఁ జేరినవాని నెట్టియిక్కటులు వచ్చినను సరకుసేయక కాపాడువాఁడ నే కాని విడచువాఁడను గాను. ఒకచో వాఁడు లోఁ గపటియైన నాదోషము వానిదే. దాన సత్పురుషుల కెంతమాత్రము లోపము లేదు"

ఇట్టి స్వసుఖనిరభిలాషులును, బరసుఖఘటనాపటిష్ఠులు నగుపురాణపుణ్యపురుషుల చరితములఁ జదివిన గుణసంపద కలుగకున్న మఱేమార్గమునఁ గలుగఁ గలదు ?

ఇఁక నీవీరనాయకుని యిల్లా లగు సీతయొక్క పావనగంభీరభావమును వినుఁడు. రావణసంహారానంతరము రామునియాజ్ఞానుసారము హనుమంతుఁడు సీతకడ కేగి శ్రీరాముని విజయవార్తను దెలిపి, యచటఁ గావలియున్న రాక్షసాంగనలఁ గడతేర్చుటకు సెలవొసంగు మని కోరెను. అప్పు డాసాధ్వి యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

శ్లో. రాజసంశ్రయవశ్యానాం కుర్వతీనాం పరాజ్ఞయా
విధేయానాంచ దాసీనాం కఃకుప్యేద్వానరోత్తమ
ప్రాప్తవ్యంతు దశాయోగా న్మయైత దితి నిశ్చితం
దాసీనాం రావణస్యాహం మర్షయామీహ దుర్బలా.

అనఁగా "వానరోత్తముఁడా! ఒకరాజు నాశ్రయించి యతనియాజ్ఞానుసారము కార్యములఁజేయుచుఁ దమయేలికకడ వినయముగ సంచరించుచుఁ బరాధీనులై యున్న దాసీజనులపైఁ గోపమేల ? నాదుర్దశయే నన్నిటు బాధించినది కాని వీరుకారు, వీరు తమతేనియాజ్ఞానుసారము నన్ను బెట్టినబాధల సహింతునే గాని వీరిబాధించుటకు నిష్టపడునంతటి కఠినాత్మురాలను గాను" అని.

అయ్యలారా! యింతకంటె నుదారాశయములు కలవా? ఈమెకంటెను బావనచరితలు కలరా? ఈ క్రూరరాక్షసాంగనలు క్షణమైనను దనసౌభాగ్యదైవత మగుప్రాణేశ్వరుని స్మరించుటకైన నవకాశమీయక, తుచ్ఛబోధలచేతను, క్రూరకృత్యములచేతను, అహర్నిశ మొక్కరీతిని బాధించిరే? యట్టి కఠినాత్ముల సీతయేకాక మఱెవరైనను ముక్కలక్రిందఁ గోయింపక విడతురా?

ఇట్టి యద్భుతచరితము కలసాధ్వీమతల్లు లెందఱో మనపురాణములయందుఁ గలరు. మానవులఁ జైతన్యకళాపూర్ణులనుగాఁ జేయుట కీవీరమాతలచరితములకంటె వేఱేమి కావలయును? లోకముల నన్నిటి నానందపరవశములుగను, శీలవంతములుగను, జేయుట కీవాల్మీకిరామాయణ మొక్కటి చాలదా? సంస్కృతవాఙ్మయమున నున్న యిట్టిఘనవిషయముల సర్వజనగ్రాహ్య మగునటులు మృదుశైలిని పుస్తకముల వ్రాయుటకంటెను, వ్రాయించుటకంటెను, మన మాంధ్రభాషకుఁ జేయుశాశ్వతోపకార మెయ్యది?

ఆర్షకులప్రసూతు లగుభారతీయులు స్వగ్రంథముల నోర్పుతోఁ జదువక, యలసులై చెప్పుడుమాటలను విని, యమూల్యార్థసంపన్నము లగుపురాణములయెడ నీరసభావమును జూపుట కడుశోచనీయము. ఘనహృదయులారా! మన మీయార్యావర్తము నందలి సోదరీసోదరుల నెల్ల క్షేమంకర మగు నేకగమ్యస్థానమునకు నడుపఁదలఁచినచోఁ బురాణపుణ్యకథల బోధించినఁగాని, మనమనోరథ మీడేఱ నేరదు.

మఱియు నీపురాణములు, దేశచారిత్రముల దర్పణములకరణిఁ బ్రతిఫలింపఁ జేయుచున్నయవి. మానవు లెంతవఱకు స్వదేశచరిత్రను దెలియకుందురో యంతవఱకుఁ దమయుద్యమముల ధైర్యోత్సాహములతో నుపయుక్తమార్గముల నడుపఁజాలరు. మఱియు నట్టివారు స్వదేశీయు లనిపిలుచుటకుఁ గూడ నర్హులు కారు. కావున స్వదేశచరిత్రాభిమాను లెల్లరును బురాణముల నామూలాగ్రము పఠింపవలయును.

కొందఱు మనమిపు డిరువదియవశతాబ్దమున నున్నవార మనియు నందుమూలముగ మనపూర్వు లిట్టినాగరకతలేక మృగప్రాయులుగా నున్నపుడు వ్రాసినపురాణములఁ జదువుట తెలివితక్కువ యని వ్రాఁతలయందును బ్రసంగములయందును గూడ నిర్లజ్జముగాఁ దెలుపుచున్నవారు.

కాని యిది యొకవిచ్చిత్రలంపు. ఏలయనఁ బూర్వమెవరిపూర్వులు జ్ఞానశూన్యులై మృగములవలె మెలఁగుచుండెడివారో, అట్టిసంతతివా రొకశతాబ్దమునకంటె వేఱొక శతాబ్దమునందుఁ గ్రమాభివృద్ధి నందుచున్నపుడు, అట్లు తలఁచుట యుక్తమే కాని భారతీయుల స్థితి యట్టిది కాదు. ప్రస్తుతఖండాన్తరవాసుల పూర్వులు గృహవస్త్రాదినిర్మాణముల నెఱుఁగనపుడే యెవరిపూర్వులు గృహాదినిర్మాణములఁ బ్రావీణ్యమును గాంచియుండిరో, ఇతరదేశీయుల పూర్వులు, అక్షరములఁ గూడ నెఱుంగనియపుడు, ఎవరిపూర్వులు రసభరితము లగుగంభీరకావ్యరచనలయందె వన్నెకెక్కిరో, పెక్కేల దేశాన్తరములెల్ల నవిద్యాముద్రితములై యుండ, నెవరిదేశమున సకలకలాపూర్ణుఁ డగుప్రబోధపూర్ణచంద్రుఁడు ప్రకాశించుచుండెనో, అట్టియార్షకులప్రసూతు లగుభారతీయులు పైయట్లుతలఁచుట యెట్లుపొసఁగును? వీరిపుడు ఖండాన్తరవాసు లగుశాస్త్రవేత్తలు, ఆర్షపురాణములఁ జదివి యందలియమూల్యవిషయముల శ్లాఘించుచుండుటను గని, విన్నఁబోయి మిన్ను చూచుచున్నవారు.

కొందఱు నవమేధావులు తాముకోరు లౌకికానందము లేవియొ కొన్ని పురాణములయందు లేవని పావనచరితములగు పురాణములఁ ద్యజించుచున్నవారు. వీరియవస్థఁ జూడ నీ క్రిందిశ్లోకము స్మరణకు వచ్చుచున్నది.

శ్లో. కేఽమీ లోహితలోచనాస్యచరణా హంసాః కుతో మానసాత్
కింతత్రాస్తి సువర్ణపంకజదళాన్యంభ స్సుధాసన్నిభం
తత్తీరం కిము రత్నఖండరచితం కల్పద్రుమావేష్టితం శంబూకాః
కిముసన్తి నేతిచ బకై రాకర్ణ్య హీహీకృతమ్.

మఱికొందఱు మేమీపురాణములు సంఘోపయోగము లగునేమొ యని పరిశీలించితిమి కాని యట్టి యుపయోగ మేదియుఁ గానరాదు సరియే కదా, యివి యింద్రియానందములు తుచ్ఛము లనియు, సంసారము దుఃఖభాజన మనియు, నిస్సంగమే ముక్తిహేతు వనియు,నిట్లువిచ్చివైరాగ్యములబోధించి మానవుల సంఘమునుండి తొలఁగింపఁ జూచుచున్నవి. కాని సాంఘికాభివృద్ధికి ననువగుత్రోవ లిందుఁ గానరావని పలుకుచున్నవారు. కాని నేర్పుతోఁ బరిశీలించిన నివియే తమమనోరథము లీడేఱుటకు వలయుమార్గములఁ గలిగియున్నవని తెలియఁ జాలకున్నవారు. ఇదిచూడ నీ శ్లోకము జ్ఞప్తికివచ్చుచున్నది.

శ్లో. హరినఖరవిముక్తా రక్తసిక్తాహి ముక్తాః
పరిణతబదరాణీ త్యాదరే ణోపగృహ్య
సపది సరసి ధౌతాః ప్రత్యభిజ్ఞాయ ముక్తాః
పరికిరతి కిరాతీ హన్త కాన్తార ఏవ.

నిష్కామరయి వైరాగ్యసంపన్నులై స్వార్థములఁ ద్యజించినవారే సంఘమునకు మేలుచేయఁగలరు కాని, ఈషణాత్రయబద్ధు లగుసాంసారు లంతగా సాంఘికసంపదలకు సహకారులు కాఁజాలరు; పురాణాన్తర్గతము లగుభగవద్గీతాది వేదాన్తబోధలు మానవులు స్వధర్మముల నెఱవేర్పవలయు ననియు, స్వధర్మములఁ ద్యజించువాఁడు సంఘబాహ్యుఁ డగుననియు, బోధించుచున్నవి. కాని, సంఘాభివృద్ధిని నిరసించి దుర్బలము చేయుమని బోధించుటలేదు.

అధికారితారతమ్యమునుబట్టి వైరాగ్యమును బోధించుచున్నను విరాగులు కూడ లోకసంగ్రహార్థము జాతీయధర్మముల నెఱవేర్పవలయు ననియే ఘోషించుచున్నవి. పరమవైరాగ్యసంపన్ను లగుజనకాది సార్వభౌములచరితము లీవిషయమునే ఋజువుచేయుచున్నవి.

మనయార్యసిద్ధాన్తములు లౌకికసుఖము లే ముఖ్యములు కావనియు, నాముష్మికభంగకరములు కాకుండునట్లాగున నియమానుసార మనుభవింపవలయు ననియు, బోధించుచున్నమాట యథార్థమే. కాని యీబోధను గాదనుప్రాజ్ఞు లుండ రనియే నాతలంపు. పురాణపఠనమువలన మనుజుల కెట్టిలాభము కలదో మనపూర్వులే తెలిపియున్నవారు.

శ్లో. పఠనా చ్ఛ్రవణా ద్యేషాం నృణాం పాపక్షయో భవేత్
ధర్మాధర్మపరిజ్ఞానం సదాచారప్రవర్తనం,
గతిశ్చపరమా తద్వత్ భక్తిర్భగవతి ప్రభో" అని.

ఇటుల మనవారేకాక పాశ్చాత్యవిద్వాంసు లనేకులు పురాణములఁ బ్రశంసించి యున్నవారు. ఇఁక వీనింజదివి కృతార్థులైన వారెవరైనఁ గలరా యనిన వేనవేలు కలరు. పూర్వము వర్ణధర్మములు సంకీర్ణములు కాక యెంత వేఱుపడి యున్నను, అప్పటిభారతీయులు పురాణచరితములఁ దమకు బ్రమాణములుగా నిడికొని మసలుటచేతనే తలలు వేఱయ్యును దలఁపులుమాత్రము వేఱుపడక సోదరభావముతో నన్యోన్యసహకారులై భారతీయసంఘము నత్యున్న

త్యమునకుఁ దేఁగలిగియుండిరి. ఇందుల కనేకప్రమాణములు కలవు. గ్రంథవిస్తరభీతిచే విడచితిని.

పురాణకథలఁ జిరకాలమునుండి మనము వినుచుండుటచేఁ జర్వితచర్వణము కాదా యందురేని యట్లనుట తగదు. మనోహరపదార్థము లెన్నిసార్లెంతకాలమునుండి యనుభవించుచున్నను విసుగు పుట్టను సరియేకదా యందలి సారస్యము తెలిసినకొలఁది వానినే యాస్వాదింపఁ గోరిక లుద్భవించుచుండును. కావుననే రసజ్ఞు లిట్లు తెలిపియున్నవారు.

శ్లో. ఆదిత్యస్యోదయస్తాత సౌవర్ణం భారతీ కథా
ఇష్టా భార్యా సుమిత్రం చాపూర్వాణ్యేవ దినేదినే.

ఇట "భారతీకథా" అనునది సర్వపురాణోపలక్షణము కావున నాంధ్రకవిపుంగవు లెల్లరును బురాణేక్షుకాండములనుండి సువిమర్శయంత్రములచే రసమునుదీసి, సువర్ణకాంస్యపాత్రల నింపి యాంధ్రజాతికి సుఖాస్వాద్య మగునట్లు చేయుదురుగాక.

ఇట్లు చేయక సన్మార్గబోధకము లగుపురాణముల నిరసింతురేని, ప్రస్తుతము కావలసినసోదరభావమును సౌశీల్యమును కేవల ముపన్యాసపీఠములయందే స్థావరమై యుండునుగాని పరస్పరవైషమ్యదూషితము లగుమానవహృదయముల నాటుకొని కార్యాచరణమునకుఁ దోడ్పడఁజాలదు.

ప్రస్తుత మాంధ్రవాఙ్మయము నెక్కుపెట్టునఁ దలక్రిందుఁ జేయఁగోరువారును, అట్లు చేయరాదు సనాతననియమములనే నిలుపవలయు ననువారును గూడ భాష యెటు లుండవలయునా యనివిమర్శించుచున్నవారే కాని విషయ మెటు లుండవలయునా యనివిమర్శించుచున్నట్లు గానరాదు.

ముందు నిర్ధారణ చేయఁదగినది విషయము కాని భాష కాదు. విషయము ఘనమైన దగుచో నేభాషలో వ్రాసిన నేమి. మధురాహారమును బర్ణములలోఁ బెట్టిననేమి, వెండిగిన్నెలలోఁ బెట్టిననేమి. దానిఘనత యెప్పుడునొక్క రీతినే యుండును గాని, వ్యత్యస్తము కాఁజాలదు. కటుపదార్థము కాంచనపాత్రలలోఁ బెట్టినను దానికి మాధుర్యము కలుగఁజాలదు.

మఱియు సద్రత్నములు సువర్ణఘటితము లైనపుడే యమూల్యాలంకారములై సంపన్నులచే నాదరింపఁబడునట్లు ఘనవిషయములు సలక్షణ

సువాక్యఘటితములై నపుడే యార్యులచే నభినుతింపఁబడును. సత్తగుళ్లలును, గులకరాళ్లును సీసముతోఁ బొదిగిననేమి” సీనారేకుతోఁ గట్టిననేమి? అశ్లీ నీరసవిషయముల గ్రామ్యభాషలో వ్రాసినను వ్రాయవచ్చును గాని యిపుడు నే నీభాషాశైలింగూర్చి ముచ్చటింపఁ దలఁచికొనలేదు.

ఓయాంధ్రమహాశయులారా! మీరు నిజముగా నిష్కళంక మగు పితృభక్తిని, దైవభక్తిని, గురుభక్తిని, దేశభక్తిని, రాజభక్తిని గోరువా రగుచో నట్టి భక్తిపంచకము పురాణపఠనమునఁగాని వేఱుమార్గమున మనకు లభింపఁజాల దని నిశ్చయముగ గ్రహింపుఁడు. మానవహృదయముల నట్టిపావనభక్తినదీప్రవాహములఁ బ్రవహింపఁజేయు ఘనోపాఖ్యానములు వేనవేలు పురాణముల యందు విరాజిల్లుచున్న వని తెలిసికొనుఁడు.

ఆర్యులారా! మరల మీకు నేఁజేయు నీవినయపూర్వక విజ్ఞప్తిని సావధానులరై విన వేఁడుచున్నవాఁడను.

శ్రేయస్కాము లగునోయాంధ్రమహాజనులారా! కేవలస్వలాభపూరణపరాగపటలముచే నాచ్ఛాదిత మగుచున్నట్టియు, జాతిద్వేషదావానలముచే దగ్ధమగుచున్నట్టియు, నిరంతరతామ్రప్రచండగ్రీష్మముచే నీరస మగుచున్నట్టియు నీపుణ్యభూమిని, ఈభారతమాతను, జీవకళాసనాథ మగునటుల చేయఁగోరుదు రేని శ్రీరామాద్యుత్తమనాయకుల నెడిగంభీరగర్జనముల తోడను, పాతివ్రత్యకళావిరాజిత లగుసీతాద్యుత్తమనాయిక లనెడితటిల్లతికలతోడను, తేజరిల్లుచున్న పురాణకథాజీవనభరితము లగునవీనాంధ్ర కావ్యనీరదములు తిరుగ నీయార్యావర్తనభోవీధిని గ్రమ్మి, సుబోధామృతవర్షధారలఁ గురియునటుల భగవంతునిఁ బ్రార్థింపుఁడు. దీనిని మించిన దేశోపయోగకార్యము వేఱొండు లేదనియు, దీని మించిన పావనకృత్యము వేఱొకటి లేదనియుఁ దెలిసికొనుఁడు.

కావున మనయాంధ్రభాషయందు వ్రాయఁబడు నవలలును, నాటకములును, మున్నగునవి ప్రాయికముగా మనపురాణములనుండి తీయఁబడిన యుత్తమనాయక జీవచరిత్రలు కలవిగా నుండవలయును.

ఓకరుణాకరా! పరమేశ్వరా! మాయాంధ్రహృదయపుండరీకములు వికసించి శ్రీమంతము లగునటుల నీతూర్పుదేశమునఁ బురాణజ్ఞానసూర్యోదయ మగునటుల బ్రసాదింపుము.

ఓమ్ తత్సత్

కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి.

శ్రీరామచంద్ర.

సంశయము.

ఎవనిగతిభేదమునఁ జేసి • యీజగంబు
వివిధపరిణామములతోడ • వెలయుచుండు
నట్టికాలాత్మకునకు ని • రంతరునకు
ననితరాధీనగతికి వం • దనశతంబు.

నిత్యమై యద్వయంబయి • నెగడుదాని
నాకృతిగుణాహ్వయాభావ • మైనదాని
నాదిమధ్యాంతరహితమై • యలరుదాని
నఖిలకర్మంబులకు సాక్షి • యైనదాని
నఖిలశక్తులకును మూల • మైనదాని
నఖిలపరిణామకారణ • మైనదాని
నఖిలమును జూచి చూడని • యట్టిదాని
నఖిలమును జేసి చేయని • యట్టిదాని
నఖిలమునునంటి యంటని • యట్టిదాని
నఖిల మగుదాని నవ్యయ • మైనదాని
విమలవిజ్ఞానధను లైన • విబుధు లెల్ల
నైకకంఠ్యంబుగాఁ బర • మాత్మ యనిరి;—
కాని యామూర్తి నేరీతిఁ • గాంచ నగును
తెలిపి చూపఁగ లేక య • దృష్టమనిరి;
పలికి బోధింపలే కని • ర్వాచ్య మనిరి
అతితరానుభవంబున • నామహాత్ము
లేది పరమాత్మ యని నిశ్చ • యించినారొ
యావిశేషంబు లెల్ల నీ • యందుఁ గూడ
నగపడుచునుండె నిది యేమి • యద్భుతంబొ

కాలమా! శాశ్వతత్వంబు • గలదె నీకు?—
దైవమునకును నీకు భే • దంబు గలదొ,
నీవె దైవంబొ తెలియంగ • నేరకుంటి
నుగము గ్రుంగుచునుండె నే • మున్న దింక?
నాత్మనిర్వృతి కెవ్వారి • నాశ్రయింతు?
నెవరి నడుగుదు సంశయం • బెట్లుతీఱుఁ
గాలమా! యించు కాగుము • కరుణతోడ
నాదుసంశయమును దీర్చి • పోదుగాని—
అధికలోకానుభవయుక్తు • లైనవారు
అనుభవంబున విజ్ఞాను • లైనవారు
తెలిసికొన్నంత యడిగినఁ • దెలుపువారు
ప్రకృతిలో ముందు నీకంటెఁ • బడినవారు
పేరుగలవారు, నాకంటెఁ • బెద్దవారు
పుడమి విడనాడి యెచటికో • పోయినారు;
ఉన్నవారెల్ల నాకంటెఁ • జిన్నవారె
యెవరి నడుగుదు? సంశయం • బెట్లుతీఱుఁ?
గాలమా! యించుకాగుము • కరుణతోడ
నాదుసంశయమును దీర్చి • పోదుగాని:—
తల నరసియుండె; మేనిర • క్తము హారించె;
చూపులు నశించె; బలుగమి • శూన్య మయ్యె;
నడుము లేవదు; కాళ్లకు • నడక లేదు;
శల్యములు సంధులను బాయు • సమయ మయ్యె.
నేను నీతోడఁ బరువెత్త • లేను గాన
నేను గన్నార నినుఁ గాన • లేను గాన
నాదువిన్నప మొక్కటు • న్నయది గానఁ
గరుణ నీదీనమానవు • మొఱ వినంగఁ
గాలమా! నీవొకించుక • కాలమాఁగు!
నాదుసంశయమును దీర్చి • పోదుగాని:—

తల్లియొడిలోనఁ జేరి తా ♦ తాయటంచుఁ
గాలుసేతులు గదవుచుఁ ♦ బాలు ద్రావి
చిన్నిచిఱునవ్వు వెన్నెలల్ ♦ చిందువారఁ
గన్ను లరమోడ్చి నిద్దురఁ ♦ గనుటె కాని
నీవు తారుట యేఁ జూడ ♦ నేరనైతి
నాఁటియవ్యక్తఘోలికాం ♦ తరమునుండి
నేఁటివఱకును మేలుకో ♦ నేరనైతి
నిపుడు నీవొండు గాక నా ♦ కేమి కలదు?
కాలమా! యించుకాగుము ♦ కరుణతోడ
నాదుసంశయమును దీర్చి ♦ పోదుగాని;——
వనవిహారంబులను జేయు ♦ వాంఛతోడఁ
గుసుమసౌరభములఁ గాంచు ♦ కులుకుతోడ
మలయమారుతముల మెచ్చు ♦ మమతతోడఁ
గోకిలాలాపముల విను ♦ కోర్కెతోడఁ
దమిఁ బ్రియాన్వేషణము చేయు ♦ తలఁపుతోనె
తెలిసి తెలియనిరీతిని ♦ దిరిగితిరిగి
నావసంతంబు కడచని ♦ పోవుచుండఁ
జోద్యముగ నంతయును జూచి ♦ చూడనైతిఁ
గాలమా! యించుకాగుము ♦ కరుణతోడ
నాదుసంశయమును దీర్చి ♦ పోదుగాని:——
మోహమృగతృష్ణ యొకవంక ♦ ముసరుచుండ,
విరహపరితాప మొకవంకఁ ♦ గెరలుచుండ,
వేఁడినిట్టూర్పు లొకవంక ♦ వెడలుచుండ,
నుష్ణసంకల్పరుచిరారు ♦ ణోదయములు,
నప్రసన్ననిదాఘసా ♦ యంతనములు,
జాగరీకృతయామినీ ♦ సముదయములు
జరగ నెన్నియొ నాగ్రీష్మ ♦ సమయమందుఁ,
గాని నాకప్పు డీయూహ ♦ కలుగలేదు

కాలమా! యించుకాఁగుము • కరుణతోడ
నాదుసంశయమును దీర్చి • పోదుగాని:—
కైరవశ్యామసుందరాం • గంబుతోడఁ
జారువిద్యుద్విలాసహా • సంబుతోడ
మేలిచూపుల నర్ధాంగి • లీల వచ్చి
సమధికానందబాష్పవ • ర్షంబు గురిసి
చల్లగా మేను మఱపించి • సాగిపోయె
నతిచమత్కృతి నాదువ • ర్షావసరము.
పోవువేళను దుఃఖాశ్రు • పూరమయ్యె
నింక నితరంబు నామది • కెట్లు తోఁచు?
తోఁచి యిప్పుడు ప్రశ్నింపఁ • జూచుచుంటిఁ
గాలమా! యించుకాఁగుము • కరుణతోడ
నాదుసంశయమును • దీర్చిపోదుగాని:—
జీవనకళంకమంతయుఁ • బోవఁజేసి
మానసాకాశవీథి ని • ర్మలముచేసి
కలుషపంకంబు నెల్లనిం • కంగఁజేసి
హృదయకమలంబు నలరించి • పొదలఁజేసి
నాశరద్వాసరంబులు • నడచునాఁడు
వివృతవేణిక యగునదీ • విలసనంబు
వెలువడుచునున్న యిసుకతి • న్నెలతెఱంగు
కలసియాడెడురాయంచ • కవ బెడంగు
తనివిదీఱక నిరతంబుఁ • గనుటకొఱకె
మరగి నీమాటఁ దలపోయు • నెఱుఁగనైతిఁ
గాలమా! యించుకాఁగుము • కరుణతోడ
నాదుసంశయమును దీర్చి • పోదుగాని:—
నలుఁగడల మంచుకావిరు • లోలయువేళ
హంససంస్ఫూర్తి యత్యల్ప • మైనవేళ
దడదడంగూర్చి కంపంబు • దాడరువేళ

ననలసాన్నిధ్యమును గోరు • నట్టివేళఁ
దమివిశేషించి యసుఖంబుఁ • దార్చువేళ
మదిఁ గలంగించు నాదుహే • మంతవేళ
ముడుచుకొని కన్నులను మూసి • గడపినాఁడఁ
గాని యేవేళ నాముందు • గతిని గూర్చి
క్షణమునేనైన నూహింపఁ • జాలనైతి;
నుగము గ్రుంగుచునుండె; నే•మున్న దింకఁ?
గాలమా! యించుకాగుము • కరుణతోడ
నాదు సంశయమును దీర్చి • పోదుగాని:—
నామనోరథగతికి భి • న్నత ఘటిల్ల
శైశిరము వచ్చెఁ, బ్రకృతి య • సారమయ్యె;
జీవితలతాలవాలంబు • జీర్ణమయ్యెఁ;
పాటవము తగ్గె నాకుల • పాటు దోఁచె;
నాశ కింకను చిగిరించు • నాశ కలిగెఁ;—
బతనశీలంబు లగుజీర్ణ • పత్త్రివితతు
లెల్లఁ దలపోయ మున్న చి • గుళ్లెకావె?
ముందుఁ దలసూపఁబోవు నా • మోసు లెల్లఁ
బండుటాకులు గాకుండ • నుండఁగలవె?
యెండువడి రాలి పడకుండ • నుండఁగలవె?
ఇట్టిచర్విత చర్వణ • మెందుకొఱకు?
ఇంతమాత్రాన కాసించు • టెందుకొఱకు?
అట్టె తలసూపుచుండెడు • నాచిగుళ్ళు
పండి రాలెడు నీజీర్ణ • పత్త్రిములును
యెచటివో? యెటకేగునో! • యెఱుఁగరాదు
గాన నామార్గ మంతయుఁ • గట్టిపెట్టి
పుట్టుటయుఁ గిట్టుటయు లేని • పట్టుకొఱకు
సుఖము దుఃఖంబు నెఱుఁగని • చోటుకొఱకు
బంధమును మోక్షమును లేని • పదముకొఱకు

వెదకుకొనుచుంటి; దానికై ♦ వెడలనుంటి
నుగము గ్రుంగుచునుండె; నే ♦ మున్నదింక !
నాత్మనిర్వృతి కెవ్వారి ♦ నాశ్రయింతు ?
నెవరి నడుగుదు; సంశయం బెట్లుతీఱు ?
గాలమా ! యించుకాగుము ♦ కరుణతోడ
నాదుసంశయమును దీర్చి ♦ పోదుగాని.

వేంకటపార్వతీశ్వరకవులు.

రాయవాచకము.

(గతమాసశేషము)

ద్దులకు గజపతివారు అన్నిటికిన్ని మనపాలిట జగన్నాయకులు వున్నారు అని
మండ్దలించ్చినండ్దులకు మూడు తెగలవారి నియ్యోగులున్ను మీకు జగన్నాయ
కులున్ను తమదొరలకు కర్తరున్ను వున్నారు కాకన్నాటకంవారు యేరుదాటి
రాకుండా తమమూడుతెగల కలిమిబలుములున్ను కృష్ణదాటిరాకుండా పాళ్యం
దిగి వుండ్డేటట్టు అంపుతున్నారు. మీతెగ నామజాదులున్ను సరదు స్థలాలబల
వంత్తులై యుండేటట్టు కట్టడశేయండా అని తెలుపగా గజపతివారున్ను అకీతి
అమరిక శేశేమని కొండ్డవీడు, ఉదయగిరి, బెల్లంకొండ్డ, నాగార్జునకొండ్డ, కం
దూరు మొదలైన స్థలాములకు యాది హెచ్చరికలు కలిగివుండ్డ తగ్గదనేటట్టుగా
నామజాదులు పంపినవారై షోడశపాత్రులతోనున్ను వారిదుర్గాలున్ను శీమభూ
ములయండ్దున్ను యాది హెచ్చరికలు గలిగి వుండ్డమని మండ్దలించ్చగా వారు
వాల్లు సరదులకున్ను దుర్గాలకున్ను రస్తుసామగ్రీలు అంప్పినారు. యిదిగాక
ముకుండ్దగజపతివారు షోడశపాత్రలున్ను తామున్ను దినప్రతిన్ని గోదావరీ
స్నానానకుపోయి నదీస్నానంజేశి జగన్నాయకులకు పూజానమస్కారములు
శేశి బైలు వెరశి పట్ణానకువచ్చేటందుకు రెండుఝాములు చెల్లును గనక తాముది
గిన స్థాన ఘట్టానకు చుట్టున్ను ఘడియ త్రోవకు మనిషిసంచారము లేకుండ్డా
శేశి శబ్దమున్ను వినరాకుండ్డా శేయుడా అని షోడశపాత్రులతో చెప్పి దిట్టపరచి
వుండ్దురుగనక కాపుకడలు ఆయాప్రాంత్యాదులున్ను సద్దు శేయక వున్న తావుల
నె వుండ్దురు. గోదావరీనదికి వుత్తరపుభాగానకు యెనిమిది గుఱ్ఱాలవారున్ను గొం
డ్డారణ్యాం సమీపం గనక ఆదికులనుండి మొగలాయిగుఱ్ఱాలువచ్చి వీరువారని
యెరుగరు గనక వఖకార్యంవస్తే మోసంవచ్చునని యెంచి అనిమొనలు నాలుగు
గుఱ్ఱాలవారున్ను చుట్టురెండ్డుఘడియల మేరకు మనిషి సంచారములేక తిరుగా
డుతా వుండేటండ్దులకు రెండ్డుగుఱ్ఱాలవారున్ను గజపతివారి సమీపాన యేటిగ
ట్టున రెండుగుఱ్ఱాలవారున్ను యీరీతున పదహారు గుఱ్ఱాలవారున్ను జాగ్రత
గా కాచుకవుండ్దురు గనక గజపతివారి స్థానసంధ్యావంద్దనాది కృత్యములున్ను

జగన్నాయకుల పూజానమస్కారములున్ను అయిన తోడుతోనె వూరికి వత్తురు యీరీతిని వుండగా వకనాడు గజపతివారు స్థానానకువచ్చి షోడశపాత్రులను యెప్పటిక్రమం చుట్టుపట్ల జాగ్రతగా కాచివుండమని పలుకరించి తాము స్నానము శేశి తమకృత్యముతోవుండ్డిరి. యీపదహారు గుఱ్ఱాలవారున్ను నాటిదినం యెప్పటివలనె స్నానఘట్టానకు రెండు గుఱ్ఱాలవారున్ను గొండ్డారణ్యం చాయల నాలుగు గుఱ్ఱాలవారున్ను యీరీతున తిరుగుతావుండ్డగా అట్టిపట్ల కొండ్డలో వున్న దొరలు గజపతివారు గుఱ్ఱాలతోడట్టు గోదావరీస్నానానకు వచ్చినాడని వేగంగ్గాయీసమయమంద్దలితురకలు నాలుగువేల గుఱ్ఱాలవారున్ను చుట్టుకొంద్దామని యోచనచేశి నాలుగు దొరతనాలవారున్ను డాలుడమామి టోకించ్చిగా తప్పుమార్గములుగాను గుఱ్ఱాలున్ను యేనుగులున్ను రవుతులున్ను మావుతులున్ను వచ్చేరభసంవిని షోడశపాత్రలలో ఆదిక్కున తిరుగుతావుండ్డే నాలుగు గుఱ్ఱాలవారున్ను యెదురుగావోయి సమరమిచ్చినారు గనక నాలుగు తెగలవారున్ను నాలుగువేల గుఱ్ఱాలవారున్ను యీనాలుగు గుఱ్ఱాలవారికిన్ని చుట్టుకొని వుండ్డగా ఆనలుగురున్ను తమతమగుఱ్ఱాలతోడట్టు నాలుగువేల గుఱ్ఱాలతోడట్టున్ను తారశిల్లి నాలుగుతోవలా తరుమగా రెండ్డుతులా నరుకుతాపోగా వేటారుతునకలుగా గుఱ్ఱాలున్ను రవుతులున్ను వీధికి నన్నూరు యేనూరు లెఖ్కపడ సారి యీరీతి నాలుగు వీధులను వేయిగుఱ్ఱాలున్ను అన్నిరౌతులున్ను చాపకట్టుగా బడగా యథాయథలుగా చెడి విరిగి పారిపోయి వకతట్టు నిలిచి వుండ్డగా నాలుగు గుఱ్ఱాలవారున్ను అలశి నిలిచిరి గనక యీలోగా సరాళము పోయినయెనిమిది గుఱ్ఱాలవారున్ను తిరుగా వచ్చేవేళ తురకలు గుఱ్ఱాలనుగని సమరమియ్యగా నిలువలేక పటాపంచ్చలై పారిపోయినవారున్ను రణమంద్దు మడిశిపోయిన వారున్ను యీరీతున బహుగుఱ్ఱాలవారు మడిశిపారిపోయిరి. అని అలశి నిలిచి నాలుగు గుఱ్ఱాలవారున్ను సరాళంపోయివచ్చి యెనిమిదిగుఱ్ఱాలవారున్ను అంత్తు పంద్రెండ్డు గుఱ్ఱాలవారున్ను గూడి గజపతివారివద్దికి రాగా తురకలు తిరుగా శేఖరించ్చుకొని వెంట్టాడిరి గనక చుట్టు సరాళముపోయిన రెండ్డు గుఱ్ఱాలున్ను తూపు-దిక్కున వుండ్డి వచ్చెను. అంత్తలో ఆమొగలాయిగుఱ్ఱాలు ఆమట్టున నిలువక వెంబడించ్చక రాంగా గజపతివారు జూచి గుఱ్ఱాలు మించివచ్చెను యిఖను

ఇక్కడవుంట్టే మోసంవచ్చును అని యెంచి గుఱ్ఱాలమీఁది దృష్టిచేత జగన్నాయకులను మరచి బహువేగాన గుఱ్ఱాంన్ని యెక్కుకొని షోడశపాత్రులతోడట్టు యేరుదాటి కొంత్తతడవువచ్చి జగన్నాయకులనుమరచి యెత్తకవస్తిమి గదా అని తలంచుకొని తిరిగి జూచే యడల గుఱ్ఱాలవారు ఉత్తరవుగట్టుకు వచ్చి సమరమంద్దు అలశినగుఱ్ఱాలు గనక నీళ్లుజూవుతావుండ్డగా వారల జూచి దేవపూజ పెట్ట్యెంత్తలో స్వామిని వేంచ్చేపు శేయమరచి వుత్తపెట్ట్యె యెత్తుక వచ్చినారము అని అచ్చట నిల్వబడి గజపతివారు చాలావిచారబడగా షోడశపాత్రులలో వొకడు చూచి యింత్తమాత్రానకు దేవరవారు విచారపడ పనిలేదు తానుపోయి యెత్తుకో వచ్చేనని చెప్పి అంప్పించుకొని వచ్చి నదిలో దేవతాచ్చనశేశినదిక్కున చూడంగా అచ్చట జగంన్నాయకులు వేంచ్చేశివుండ్డగా జూచి యెప్పటివలెనే దేవపూజపెట్ట్యెలో వేంచ్చేపు చేసుకొని రాగా గుఱ్ఱాల రాతుగని వెంట్టాడిరాంగా వాళ్లనుతెగవేశి యేరుదాంటి గజపతి వారి వద్దికి తెచ్చి యియ్యగా గజపతివారు చాలాసంతోషబడి నేడునిదురలేచిన వ్యాళ యెటువంట్టిదో వృధాకలహ మాయను అనింన్ని జగడము శేశినవారు తమతో యెరుక శేయక నయ్యేకయ్యమునుంచి బహుగుఱ్ఱాలున్ను రాతులనున్ను నొప్పిస్తిమి అని సమర మిచ్చిన పంన్రెండ్డుగుఱ్ఱాల వారికింన్ని జగన్నాయకులు వేంచ్చేపు శేసుక వచ్చినరవుతులకున్ను ఉమగర వక్కలాకులు యిచ్చినారు గనక తక్కినముగ్గురుంన్ను తమకు జగడం యెత్తుకపాయనని విచారమున వస్తావుండ్డగా అంద్దులోనొఖపాత్రుడు గజపతివారి ముంద్దర రాంగా వఖవనప్రదేశమున వచ్చేటప్పుడు వృకమానికొంమ్మ గుఱ్ఱంమీఁద వుండ్డే రాతుకు అడ్డబడివుండ్డె గనక ఆమానికొమ్మను తనచేతి మర్త్యాఖండాన తెగవేశెఁ గనక గజపతివారు జూచి సంతోషబడి ఆపాత్రునికింన్ని వుడుగరలుయిచ్చెను. కడమ రెండ్డుగుఱ్ఱాలవారుంన్ను తమకుయేమిన్ని లేకపాయనని రాంగామార్గంమధ్యేనాలుగుమనుష్యుల నిలువుగ వృఖచింత్తమానికొంమ్మ అడ్డముగావుండ్డగా తనగుఱ్ఱాంన్ని కాలాడించ్చి గుఱ్ఱమున్ను తానున్ను హరిణపుటంగ్గా యెగశి చింత్తమానుకొమ్మ రెండ్డుచేతులా పట్టుకొని నిండ్డుసంజ్ఞోకం గుఱ్ఱాని తొడలనిదుకొని గుఱ్ఱమున్ను తానున్ను అంత్తరిక్షమున వ్రేలాడుతావుండ్డగా ఆవర్త్తమానం గజపతివారుజూచి చాలాసంతోషబడి ఆసమయాన కత్తికట్టలాలు యిరువై ముఫై తెప్పించి వేశి గుఱ్ఱమున్ను రాతు

న్ను దించ్చి వారికిన్ని ఉడుగరలు యిచ్చిరి. వఖగుఱ్ఱం పాత్రునికి బహుమానం
లేకవుండ్డగా గోదావరిగట్టున వఖకాలువ రెండ్డుమనిషి.నిలువున అరువైనాలుగు
అడుగుల వెడల్పున అడ్డమైవుండ్డగా తనగుఱ్ఱాంన్ని చబుకునవేశి కాలువదాటిం
చ్చగా గజపతివారు జూచి ఆరౌతునకున్ను వుడుగరలు యిచ్చి అందరికిన్ని యేక
ముగా సంతోషపడశేశి మరివేడుకగా పట్ణానకుపోయిరి గనక యివి యెల్లా
మేమున్ను జూచినవారమై పట్ణములోనికివచ్చి గజపతివారిసగల్లున్ను షోడశపా
త్రుయిండ్లున్ను వాల్లఁగరిడిన్ని ఆగరిడిలో సాధనశేశేవాల్లఁనున్ను చూస్తిమి
వారుశేశే సాధన మెరవళ్లు దేవదానవులుసహా శేయలేరు. శీమాంత్తరం జగ
జెట్లు జేసేసాధన మెరవళ్లు చూచివుండ్దురు. ఆతీరుగాదు. బారలెయెత్తవలెను
అటువంట్టి సంగ్గడాలు యెత్తేదిగాక అడ్డముగా యెత్తుతునారు తొంమ్మిదిపడ్డెల
గోతాం మానిసి చెయ్యెత్తుపొడుగు వాడిని యెత్తేదిన్ని పైబడ తోసుకొనేదిన్ని
గాక గోతాం తొడల నిడుము యెత్తుకొని అడ్డదూలాసను వేలాడుతావున్నారు
అదియేలాగంట్టేను జగడములో రౌతురౌతున చంక్కనిడుకొని అమాంత్యము
గా కొంచ్చుపోదురు. అదిగాక గుఱ్ఱాలు విడువక పోరాడితె శక్యముగా దని
విడిచిపోదురు. జీరాసంజ్జోకం గుఱ్ఱాలవారికి పోటువాటు తాకిన అంద్దుకు వెర
వరు. అటువంట్టిరవుతును చంక్క వేసుకబొయ్యేమని మాతురు. ఆసమయానకు
తెలివిగలిగి కడకతోడ బలిమిగలిగి వుండ్డేటంద్దుకు యీరీతు సాధనలు శేతురు.
రుమ్మిమత్తైఖండం వఖమనిషి తలమోపుకద్దు. ఆమర్ర్యాఖండం తీసుక నూరుగ
జాలు గోడలు యేమిన్ని లేకుండా నరకుతావున్నారు. చింత్తచేవకంబాలు ఆఖ
డ్గంచేత అరిటిబొంద్దె నరికినట్టు నరకుతావున్నారు. గెడ్డపారలు రెండొకటికానాటి
తెగపోనరకుతావున్నారు. వారలు లాలావుబిల్లలు గెంప్పనిండ్డా. తెచ్చిపెట్టుక
నాలుగు అయిదు తాళాలు వఖటిగా మెలిపెట్టి వేస్తె కరమల వాండ్లు వాటిని
విడిపించ్చలేక సమ్మెటలోగట్టి విడిపించ్చి చక్కగా కొట్టి మరుచునాటికి తెచ్చి
యిస్తావున్నారు. మరిన్ని యినుపగుదియలు గురిపెట్టి విరువమన్న దిక్కుంన్నె
విరుస్తావున్నారు. యీశీమజెట్లు ఆడకువచ్చిజూచి సాధనమెరవళ్లు తమకు అసా
ధ్యమని వత్తురు. అచ్చట కలిమి బలములున్ను యెక్కడా జూచిందిలేదు. అదిగాక
గజపతివారి యెవ్వరికి త్యాగమిచ్చినా యేనుగ,గుఱ్ఱం, తాళిచాకట్లు, దట్టి, కుల్లాయి,
కబాయి, వక్కలాకులు యిచ్చేదింతేగాని యీదేశంవలె వుడుగరులువక్కలాకులు

మాత్రంయిచ్చిఅంప్పేదిలేదు అనిన్ని మరిన్ని కన్నవిన్న వార్తలుఆలోచనలు మొదలుగా విన్నపంశాయగా రాయలవారితోను అప్పాజిగారు పలుకరించ్చిన వివరం. గజపతి వారనంగ్గా పుణ్యశ్లోకుండ్డు తురకలవలెగాదు దేవబ్రాంహ్మణ విశ్వాసం కద్దు. అదెట్లంట్టేను ముకుంద్దబాహుబలేంద్రగజపతివారలకు శత్రువులైనవారు జగన్నాయకులను పూజించ్చె అర్చకులకు వెయ్యాదులు లంచ్చ

గజపతివారికి విరోధులు విష ప్రయోగము చేయించుట.

మిచ్చి వొద్దికశేసుక నిత్యకృత్యమున్ను జగన్నాయకులను శేవించ్చి తీర్థప్రసాదములున్ను పుచ్చుకొనిగాని ప్రసాబడేది లేదు గనక వఖనాటికి తీర్థములో వత్సనాభము కలిపి యిమ్మని నియమించ్చగా ఆఅర్చకులు ఆద్రోహానకులోనై ఆతీరునె తీర్థములో వత్సనాభము కలిపి స్వామి సన్నిధిని గజపతివారికి తీర్థప్రసాదించ్చేవ్వేళ నంబివానికి చేతులు వణకసాగెను. అప్పుడు గజపతివారుచూచి చెయ్యివణక నిమిత్త్య మేమి అని అడుగగా భయస్థుడై చెప్ప వెరచి వుండ్డె గనక గజపతివారు జూచి యేలవెరచేరు కలిగిన అర్థం నిలువరముగా చెప్పమనంగా అరినృపాలులు శేయించ్చిన కార్యాం సవిస్తరముగా చెప్పెను. గనక ఆవిషోదకము తెమ్మని చేతతీసుకొని అప్పుడు చెప్పిన శ్లోకం—

అరి ర్మిత్రం విషం పథ్యం అధర్మో ధర్మతాంవ్రజేత్
అనుకూలే జగన్నాథే విపరీతే విపర్యయాత్.

అనే శ్లోకం చదివి తీర్థం పుచ్చుకోగా ఆవిషం జీర్ణానకువచ్చెను. ఆవార్త లోకప్రసిద్ధమాయెను. వారు అటువంట్టి దైవజ్ఞులని గజపతివారి గుణాతిశయములు యెంచ్చినవారై వేగురులకు వుసుగర వక్కలాకులున్ను వెయ్యేళి ఘట్లున్ను యిచ్చి యింకా ఆయాదేశములకు బోయి నానాటివార్తలు దెలిసి వచ్చి చెప్పుమని వాయువేగి హనుమంతయ్యను మనోవేగి పురుషామృగయ్యానున్ను అంప్పించ్చి రాయలవారున్ను అప్పాజివారున్ను ఆప్తాలోచనగా దిక్కులవార్తలు విన్నారెకా ముండ్దర తురకలమీఁదికి కదలి పొయ్యెకార్యములకు ఆలోచన యెంచ్చి అని అడుగగా అప్పుడు అమరపుదొరలనున్ను ఆయిత్తపాటుతోవున్నారు. దండ్డుయాత్రలకు లగ్నంవుంచ్చేటండ్దుకు జోస్యులను పిలుపిం

రాయలుతురకలమీఁదికి యుద్ధమునకు వెడలుట.

చ్చి ముహూర్తం వుంచ్చుమని ఆనతియ్యాగా ఆతీరుననె అప్పాజిగారు జోస్యుల రప్పించ్చి సుదినం సుముహూర్తం సులగ్నం కూడినవేళ వెలిగుడారము వేశేటట్టుగానున్ను పాళ్యాం కదలి పొయ్యేటండ్దులకున్ను ప్రవేశానకున్ను లగ్నం నిశ్చయించ్చుక

రాయలవారికి యెరుక శేయగా ఆతీరునను వెలిగుడారం వేయించ్చుమని ఆనతిచ్చినారు. గనక అదేరీతికి అప్పాజి రాయలవారితోను తురకాణ్యాం మీద దళమెత్తేటప్పుడు బోయదొరలంద్దరినిన్ని రప్పించ్చి పదునెనిమిది కప్పణాలవారినిన్ని నగరవిందు బెట్టించ్చి హరిశ్చాణం కొమాళ్లతోను కార్యముఖానకు తురకాణ్యాం శీమలోను మునకలుగా బోయి దిగి మూడేశి ఆమడదూరం సారిసరాళం పోయి మనుష్యుల, పసలం, ప్రాయలు, గొర్రెలు, మేకల, గుర్రాల వుండ్డకుండ్డా కొళ్ళబెట్టమనింన్ని యెదిరితోడట్టు సకలసన్నాహములతోడట్టు బయలుమెరశి వెలిగుడారమునకు వచ్చి నిలిచి దొరమన్నీలనున్ను, రవుతుల, మావత్తులనున్ను, వినియోగం పైకంవాల్లనున్ను, మునుపటివారు వెనకటివారు, యెడవంక్కంవారలనున్ను అందరినింన్ని రప్పించుక వారివాల్లతో మాట పలుకులు ఆడి మీమీస్తోమములతో ఆయత్తపాటుతో రమ్మని బలవంక్కం అమరనాయకం వాల్లతోనున్ను నగరికైజీతంవారితోనున్ను నగరితొంమ్మిదిసంప్రతులవారితోనున్ను నగరిలెఖ్కప్రకారానకు యేనుగ, గుర్రాలు, రాతురాణువ, బంట్లుపైదళం వారినింన్ని గణితి తీసుకొని కన్నాటటకానగల స్వతంత్రస్వామ్యం కావలికట్లు గుంపులవారినింన్ని పాళ్యగాల్లనుంన్ను నగరిలెక్కప్రకారానకు అంద్దరినిన్ని రప్పించ్చి పయనం తర్లడా అని కరణీకులతోనుంన్ను, రాయసం, కటికం, దినసరి, అవసరం, వినియోగపైకం వాల్లతోనున్ను ఆనతిచ్చికొంత్తగుర్రం రాణువనున్ను విజయనగర పట్టణమునకు రక్షణియ్యముగా సాళువ తిమ్మరసయ్యగారినింన్ని పట్ణమంద్దువుంచ్చి దండ్డుయాత్రకు జయధ్వనిగా దిక్కులు పిక్కటిల్లెటంద్దుకు భేరితాడనము శేశి డమామిటోకించమని ఉత్తరవు శేశి రాతులకు మావుత్తులకు అమరనాయకంవార్లను, అఘ్లుండ్లు, కొమాళ్ళకు, రాజులకు, జట్లకు, కంమ్మనాయకులకు అందరినిన్ని పయనం జెప్పి రంమ్మని కటికాలవారికి వుత్తరవుయిచ్చి తాముంన్ను భోజనంజేసుకొని మూడో నగరా టోకించ్చమని ఆనతిచ్చి గుర్రం యెక్కుకొని పయనంగతుల కదలి వుమ్మత్తూరు శివనసముద్రానకు వచ్చి గంగారావు వూడెముమీంద కార్యముశేశి వుదరదోలి ఆస్థలాలు పక్కనాటనె సాధించ్చి అక్కడ వూడిగాలవాల్లను వుంచ్చి అంద్దునుండ్డి శ్రీరంగపట్నం కోటకై చీని కోటకొత్తళములు జూచి మీద ఆదిరంగనాయకులశేవించ్చి యిక్కిరి ఆరంగ్గానకువచ్చి సుక్కులనాయడికి నాయడిమూకలను జూచి విజయాపురం సరుదుల నడుమనంగ్గా సరుదు

స్థలాలవుండ్డీ గురిమనుష్యులనున్ను దుర్గాలవుండ్డే రాణువనున్ను నిర్వాహించ్చలేక విడిచి పారిపోసాగిరి. గనక అంద్దుడ్డి రాచూచి ముదికల్లు,అద్దంకి, ఆదవని ఇవి మొదలైన స్థలాదులకు తాణ్యాములు వుంచ్చి దినమొక్కటిగా సారినడవగా స్థలముల వుండ్డేవారు మునకలుగానె వచ్చేదళాన్నిజూచి పారిపోయిరి గనక సాధించ్చినస్థలములకు తాణ్యామువుంచ్చి గోలకొండ్డవారి పరదుస్థలాలకై నడవంగా అక్కడ మూడు తెగల రౌతులున్ను యెహదించ్చి యేరుదాటి వచ్చి మోర్చా వేశిపాళ్యముదిగినారు గనక ఆవర్తమానం తెలిశిన వేగర్లువచ్చి రాయలదేవునితోను తురకలు లక్షగుఱ్ఱాలుతోడట్టున్ను వెయ్యియేనుగులతోడట్టున్ను కృష్ణదాటివచ్చి పాళ్యందిగినారని వారికలిమి బలములున్ను వారిపృథుతలున్ను పలుకరించ్చి వారిశీమలో మనతెగలవార్లు జొచ్చి మూడుమడకు మూడామడ వుండ్డే గ్రామాదులు కొల్లబెట్టేదిన్ని పాతరలు శోధించి ధాన్యదవసములు యెత్తేదిన్ని గ్రహస్థుల ఇండ్లలోజొచ్చిపోయి ముంద్దువెనక దాంచియుంచ్చిన చంద్దాన నిక్షేపములు యెత్తేదిన్ని వూళ్లు పల్లెలు కాల్చేదిన్ని పసలం, ప్రాయలు, మేకలు, గొఱ్ఱెలు, గుఱ్ఱాలున్ను పట్టుకవచ్చి కాసుకు వకటిగా అమ్మేదిన్ని యీరీతిగా నిర్నామం శేశేదిన్ని దుర్గములలోవుండ్డే వాళ్లెల్లా జతనమైవున్నారనిన్ని విన్నపం శేయంగా రాయలవారు విని తురకలు కృష్ణవేణిదాంటి వచ్చి డేరిజావేశి దిగేట్టా అని ఆగ్రహించుకొని అమరనాయకం వారలలో పెంమ్మసాని రామలింగ్గమనాయణ్ణి బిలిచి తురకలు కృష్ణవేణి దాంటి వచ్చి డేరిజావేశి పాళ్యందిగినారట యిందులకు యేరీతున నడవవలెనో అని అడిగినంద్దులకు తురకల కార్యమనంగా యెంత్తమాత్రం దేవరవారిప్రతాపమువల్ల డేరిజాతాళ్లు తెగకోశను. అప్పుడు భేరితాడనంశేశి నడిస్తేను తురకలు మూడుతెగలవారున్ను పటాపంచ్చలై విరిగి యథాయథలై తమతమస్థలాదులుకు పొయ్యేటట్టు శేశెను. యిదిగాక యీగ్రీష్మకాలాన దగదప్పులకు తాళి వాండ్లు నిలువలేరు. అని విన్నపంశాయగా తనకు శెలవులకు యిమ్మనగా రాయలవారు చాలా సంత్తోషబడి రామలింగ్గమనాయనికి పట్టేలు ఇచ్చి అంప్పగా రామలింగ్గమనాయడు వెలువడిని వచ్చి తనతెగకమ్మదొరతనాలవారి నంద్దరినిన్ని రప్పించుక వారలకున్ను చెయ్యెత్తిమ్రొక్కి యిన్నాళ్లును రాయలవారిసంబ్బళములు ప్రసాబడి బ్రతికితిమి. యేలినవారికి యిప్పుడు కార్య సరవికలిగి అనిమొనకువచ్చి మొదటివారిమీదికి నడువమని బహుమానం వక్కలాకులు ఇచ్చి పంప్పగా

వస్తిమి. యీబహుమానం మీది గనక మిమ్ముననుండ్డి మానుషములున్ను ముంద్దరికి కంమ్మకులంవారికి బ్రతుకలున్ను ప్రతిష్టలున్ను కీర్త్తిమాటవాసులు కలుగశేశే టంద్దులకున్ను స్వర్గ్గాదిభోగములు అనుభవించ్చేటంద్దులకున్ను తన తోకూడా నడచేవారెల్లా నడువండ్డా తక్కినవారెల్లా వారులో నిలువుడా అని తొక్కినడువగా ఆయన సంత్తరించ్చిన యెనబై వేల చివ్వలవారున్ను రణపెండ్లి కొడుకులై యిక్కడే ఆశపాశలు విడిచి కయ్యామంద్దేదే వియ్యామంద్దేదిగా యెంచ్చి అనిమిాదిదృష్టిచేత రామలింగ్గమనాయని వెంబ్బడిని నడువంగా తురకలు యీవార్త్తలువిని డేరిజావద్ద జీరాసంజ్ఞోగంత్తో విత్తునకత్తుల రాతులు అరవై వేలున్ను వారిని చుట్టుక నిండుసంజ్ఞోకం గుఱ్రాలుపదివేలకున్ను వాల్ల ను అనుభవించ్చుక యుండ్డె మదహత్తులు వెయ్యింటికిన్ని యీరీతిని డేరిజావద్ద వుంచ్చి మూడుతెగల తురకలున్ను తమతమపాళ్యములో ఆయత్తపాటుతో జాగ్రతగలిగి యుండ్డగా రామలింగ్గమనాయుడు తురకలపాళ్యంవారి సమీపానకు పోగానే గుఱ్రాన్ని కత్తి కేడం తీసుకొని యేనుగలబారుమీద శైలతటమునకు లంఘించ్చు సింహ్వాపుపిల్లలచందాన తొక్కినడిచి మదహత్తీల తొండముల ఖండములుగా నరికి మావటీలను యీటెలచేత గుమ్మి తోయగా యేనుగలవారిమీందికి నడవగలవారు గుఱ్రాల పక్కెరలెత్తి కురచ యీటెలతోనున్ను పిడియీటలతోనున్ను పంద్దిబల్లెములతోనున్ను గుచ్చి తోశేదిన్ని దోసకాయలచంద్దాన వేటారుతునకలుగా నరికేదిన్ని యీరీతు నొప్పించగా గుఱ్రాలవారు వెనుకముండై పారసాగెను. అప్పుడు నాలుగువేల గుఱ్రాలు చాపకట్టుగా బడగా అటువెనక విచ్చుకత్తుల రవుతులమీద నడిచి జగడమియ్యాగా సరిచావులుగా ఆరువేలకు నాలుగువేలరవుతులు పడిరి. అంత్తట రామలింగమనాయుడు జీరీజుతాళ్లు తెగకోయించ్చగా డేరిజానేల కూలినక్షణాన్నె కృష్ణరాయలవారు భేరితాడనంశేయించి మదహత్తినెక్కుకొని ఉభయచ్ఛత్రములతోనున్ను మకలటెక్కెములతో నూటయిరువై ఘట్టముల యేనుగలున్ను అరువై వేల గుఱ్రాలున్ను అయిదులక్షల పాయదళమున్ను పోట్లముగా నడిచిరి. గనక ఆక్షణాంన్నె కృష్ణవేణి వుభయ తీరాలున్ను ప్రవాహం నిండి రాసాగెను. జగడముఖానకు తురకల యేనుగల మొనచేస్తె గ్రీష్మకాలం యెండ్డచేతను డస్సిన యేనుగలు గనక దగదప్పిపుట్టె చల్లగాలిచేత కాలుజారి కృష్ణవేణిలో బోయి పడెను. గుఱ్రాల రాతులు యేరు నీళ్ళువచ్చెను యివతలనుండ్డి కార్యం కాదని

గుఱ్రాలవారు యేనుగులవెంబ్బడినె తిరిగి మొదటి దొరలు ముగ్గురున్ను దైపికంగా పెడతలపోటుగా ప్రవాహంవచ్చె గనక యిక్కడను పాళ్యందిగి జగడమిచ్చేమంట్టే రస్తుసామగ్రీలున్ను అమరదు. అని దొరలు ముగ్గురున్ను నియ్యోగులతో ఆలోచనగా వారి అన్నిటికిన్ని యేరుదాంటి ఆవలనిల్చి సరిపోయినట్టు నడిపించ్చుకొంద్దాము సీమకు తిరుగగానె యేరు నిండ్డారుగా వచ్చెను రాయలవారున్ను వెంబ్బడించ్చి నడిచి జగడం శేయగా అందరున్ను విరిగి పారిపోయిరి. కొంద్దరుయేట్లోబడిరి గనక సగం రెండ్డుపాళ్లు యేటివరదపోయిరి. వఖపాలుదక్షిణపుగట్టున నిలిచెను. ఏనుగ లన్నింన్ని నీళ్ళునిడిచి గట్టుకు రాకపాయను. గనక మావటీలు యిఖను నిలువకూడదని దిగి ప్రాణాలతోడట్టు తప్పి పారిపోయిరి. మూడుతెగలతురకలున్ను అంత్తట యేనుగులమీదనుంచ్చి వోడలమీదికి దిగి వుత్తరపుగట్టు యెక్కి ఆలోచనపరులై యీసమయాన నిలిచేది కార్యం కాదని తమతమస్థలాదులకు హతశేషు లైనవారి గూర్చుక గట్టెక్కినగుఱ్రాలతోడట్టు విజయాపురం, గోలకొండ్డ, అహముదానగరం చెరబోయినారు. గనక కృష్ణరాయలవారు కృష్ణవేణి వొడ్డుకువచ్చి మూడుతెగలతురకల యేనుగ గుఱ్రాలున్ను నగర కట్టిపెట్టుమనిన్ని గుడారాలు నిశానులు నగారా మొదలైనది మొదట జగడాన దొరికింద్ది గనక అదంత్తా నగరకట్టమని అప్పాజి మొదలయిన నియ్యోగులతోనున్ను ముక్కుతిమ్మన్న మొదలైన కవీశ్వరులదిక్కుజూచి నేటి జయం యీరీతు అని అడిగినంద్దులకు ముక్కు తిమ్మన్న చెప్పినపద్యం-

క. నరసింహకృష్ణరాయా, దురమున నీపేరుపేరఁ దురకలఁ ద్రుంచెన్
  గరిరాజవరదుఁడవనీ: కరిఘటలును నిన్నుఁజూచి గ్రక్కునఁ దిరిగెన్.

అని ముక్కు తిమ్మయ అలసాని పెద్దన్న మాడనగారి మల్లయ్య మొదలైనవారు విన్నపం శేశినంద్దులకు అప్పాజి,అయ్యమరసు, కొండమరసు,బాచరసుగారున్ను అనేక స్తుత్యములుగా విన్నపంజేసి కృష్ణవేణి యీసమయాన నిండ్డేరు వచ్చినంద్దువల్ల మ్లేచ్ఛులకు అపజయమై నిలువలేక తమతమస్థలాలకు పోయినట్లాయను. యేరునీళ్లు వడిసి కాలినడ అయినతోడుతోనే ముంద్దరకార్యముఖానకు నడవవలెను. యీఆషాఢ శ్రావణాలు రెండునెలలున్ను యేటికి దక్షిణముగానున్నె తురకలదుర్గాలున్ను కోటస్థలాలున్ను గజపతిదుర్గములున్ను స్థలములున్ను చేకూర్చక ఆతర్వాత అహముదానగరం పర్యంతమున్ను పోయిరావలెను. అని విన్నపంజేసినంద్దులకు కృష్ణరాయలవారు మీరు చెప్పినది కా

ర్యసరవి అవును. మునుకలుగా యేరుదాంటి మ్లేచ్ఛులరాజ్యానకు కదలిపొయ్యి నట్టాయనా గజపతివారిశీమలోనుంన్న ఉదయగిరి, కంద్దూరు, కొండ్డవీడు, బెల్లంకొండ్డ, నాగార్జునంకొండ్డ, వినుకొండ్డ మొదలైన దుర్గ్గాలలో వున్నవారు మనదండ్డుకు రస్తుసామగ్రీలు రానీకుండ్డా అరికట్టుదురు. ఆరీతిగాకుండ్డా మునకలుగా ఆయాస్థలాలు సాధించ్చి ఆయాదుర్గ్గాలను మన తెగ తాంణ్యాములు వుంస్తె రస్తు సామగ్రీలు నడుచును. అని ఆనతిచ్చినారు గనక వద్దనున్న పిన్నపెద్దలు కార్యముగాయెంచి ముంద్దరతరలే యత్నం గనవలె నన్నారు. కాబట్టి రాయలవారు రవుతు రాణువ దొరమన్నీలకు అంద్దరికిన్ని పయనం చెప్పించ్చి భేరీషమామి కాహాళాలవారని రప్పించ్చి నగారా కూచి శేయించ్చమని వారలా భేరిపూజ సేయించ్చి టోకించ్చిన జయధ్వనికి పద్యం——

క. ధాత్రీశుఁడంత దిగ్జయ, యాత్రాసంరంభజృంభితాటోపగతిన్
శత్రువుల గుండెలవియఁగ, జైత్రప్రస్థానభేరి సేయించుటయున్.

ఉ. భూకంపంబుజనింప రొప్పఁగ మహాంభోరాసులుప్పొంగఁగాఁ
లోకాలోకములెల్లఁ బెల్లగిల ముల్లోకంబు ఘూర్ణిల్లన
స్తోకవ్యాప్తి నజాండగోళదళనాద్భూతధ్వనిం బోలె వ
ర్షాకాలాంబుదగర్జితధ్వనిసమారంభంబులై మీఱఁగన్.

రాయలవారు ఉదయగిరి మొదలయిన దుర్గములమీఁదికి దండెత్తుట

వారలున్న పయనమని దెలిశి ఆయుత్తపాటున కాచివుండగా రాయలవారు బయలుమెరశి గుఱ్రంయెక్కి సకలసన్నాహములతోడట్టు సకల దళసమేతుడై గుత్తికండ్డికోటమార్గముగా ఉదయగిరికి వచ్చిన హుర్మత్తు అనే దుర్గ్గముపై లగ్గయెక్కఁగా దుర్గ్గములలోని వారు తమచేతనైనట్టు సమరంజేశి మంద్దుగుండ్లు శిలవై నిర్వహించ్చలేక కొలిచినారు గనక కాలున దించ్చి శత్రు జనాలు వెళ్లిపోయిన తర్వాత రాయలవారు దుర్గ్గంపై నెక్కి జూచి యింతరస్తు వుండ్డగా యేమని కొలిచ్చి వెళ్లిపోయిరి అని ఆశ్చర్యబడి కంపున్నను దుర్గ్గమంద్దు తాంణ్యంవుంచ్చి కందూర్కిపోగా డమామిధ్వని విన్నక్షణాన్నె ఆస్థలంవారు వెళ్లిపోయిరి. గనక ఆస్థలం తొక్కిచూచి అచ్చట తాంణ్యాం వుంచ్చి కొండ్డవీటికి కదలిపోగా దుర్గ్గములలోనున్న వూడెములవారు సముద్రం పొంగి వచ్చేరీతిని సేనాసముద్రం కదలివచ్చేదిగని కాలుధూళి మిన్నుముట్టి సూర్యరశ్మిగప్పిన గని స్థలములు విడిచి పొయ్యేవారున్ను కాహాళధ్వనివిని

పారేవారున్ను యీరీతున కొండ్డవీడుశీమకోటలు దుర్గాలలోనున్నవారలు సరాళభ్రష్టులై తమతమ దొరలున్న తావుకు పోసాగిరి. బోయదొరలు పదు నెనిమిది కప్పణాలవారున్ను మూడులక్షుల పాయదళమున్ను కొండ్డవీడు, కొండ్డ పల్లె, బెల్లంకొండ్డ, వినికొండ్డ, నాగార్జునంకొండ్డ మొదలైనదుర్గాలకు యేలుబడి యైన శీమలాద్యంత్తం నిపాతం శేస్తావున్నారు గనక ఆయాశీమలోగల ప్రజలంద రున్ను సకలమును కొల్లయిచ్చి మిక్కిలి అంద్దుపడి అయినదుర్గాలు జేరినారు అని వేగల్లుగా అక్కడగ్గడ నడుచు యోగక్షేమములు క్షణక్షణె వచ్చివిన్నపం శాయంగా విన్నవారై తిరుగావాల్లను అయాతావులకు అంప్పించ్చి కొండ్డ వీటికిపోయి జగడమియ్యాగా కొనమూకలవారు విరిగిన మాత్రాన్న కొండ్డవీండు కోటలోనివారు తీశిబోయినారు గనక ఆదుర్గంమీద సమరం శేయంగా దుర్గంలోవున్నవారు తమచాత అఇనమట్టు వఖటిన్నరదినం పోరాడి రాత్రి దుర్గంవిడిచి పోగా మరుచునాడు దుర్గం మెక్కి జూచి ఆదుర్గమంద్దు కొండ్డ య్యాను తాళ్యంవుంచ్చి వినికొండ్డకై నడువంగా వారు యీవార్తలు విని స్థలం నిర్వహింప్ప నేరమని యెంచ్చి మునకలుగా వెళ్ళిపోయిరి. అక్కడ భాస్కరయ్యాను వుంచ్చి బెల్లంకొండ్డకై నడవగా వారు పిరంగ్గినాదంవిని బెల్లంకొండ్డవారు పారి పోయిరి. యిచ్చట వీరభద్రయ్యాను తాణ్యాముంచ్చి నాగార్జునకొండ్డకై నడవగా వారు నానాప్రయత్నముల నాట మన్నాటట పోరాడి చేతగాక తమనాటికి పోయిరి. గనక అచ్చట అయ్యలయ్యాగారిని వుంచ్చి అహముదానగరానకు నడ వగా కొనమూకలువారు వెలిపాళ్యాలు చొరబడి చెరజోరాబట్టి చాలా కంపో లంశేయంగా కోటలోనిగుర్రాలువారు వెళ్లివచ్చి యెదుటనిలిచి జగడమియ్యాగా మూడుంనుకాలు ఘడియలలోగా రెండువేలుంన్నినమానూరుగుర్రాలున్ను అంన్నియు రాతులున్ను చాపకట్టుగా మృతంబొంద్దిరి. గనక యీసమాచారం కోటలోవున్న మొదటి దొరలఇనవారు విని ఇఖను మనం కోటలో నిలిచి వున్న ట్టఇతే చేపట్టుగా పట్టుకబోదురు. అంద్దునుంచ్చిచాలా అవమర్యాద అని యెంచ్చి యేమి బోయినా బోని అని కోటవిడిచి పారిపోయిరి. గనక రాయలవారు ఆకోట యిడియకొట్టించ్చి ఆపట్ణం యెంత్తమేరో అంత్తమేరా నున్ను వెలిపాళ్యాలుంన్ను మంన్నించ్చి ఆమిదాలు జిల్లేళ్లు వి త్తించ్చి అంద్దుండ్డి గజపతి రాజ్యానకై నడవగా అప్పాజిరాయలవారితో మూడుతెగల తురకలరాజ్య మంత్రా కపోలంశేశి వారిదుర్గాలున్ను స్థలాలున్ను కట్టుకొని అహముదా

నగరం ఆమిద్యాలు విత్తించ్చి గజపతివారి గిరిదుర్గ్గం జలదుర్గ్గం స్థలదుర్గ్గం వనదుర్గ్గం యివి అన్నియు ఆక్రమించ్చినట్టాయను ముంద్దర కదలి పొయ్యేది కార్యంకాదు. కనములు దాటిపోవలెను, కనములలోనున్న గజపతివారి తెగవారు సామగ్రిలు రానియ్యరు. అనిమంత్రాలోచనగా విన్నపంశేశినంద్దులకు ఆవిశదం రాయలవారు చిత్తానవుంచ్చుక ముందర కదిలిపోవలెననే దృష్టిని తమను యెదురులేదని యెంచ్చి అప్పాజిగారు విన్నపంశేశినంద్దులకు అవుగాములు ఉత్తర వియ్యక కదలిపోగా గజపతివారి కనముల నడుమ పొయ్యేటప్పుడు చితాప్రఖానుడనేవాడు అరవై వేల శింగ్గాణి రౌతులతోడట్టు కనుమమార్గ్గమున పొయ్యే రౌతురాణువమీద చిత్తవాన కురిశినరీతి అమ్ముల కురియించ్చగా అంమ్ములనుండ్డి తప్పించుకొనువారున్ను ఆయంమ్ములకు యెదురై నిలిచినవారున్ను ముంద్దు వెనక తెలియక నిలిచినవారున్ను ఆడాడ దిగ్భ్రమపడివున్నవారున్ను యీరీతిని వుండ్డగా చితాప్రఖానునికి యెదురులేదు గనక జగడంశేయగా ఆసమయాన కర్న్నాటకం కైజీతం రౌతులు చితాప్రఖానునికి పెడతలపోటుగా యిరు పార్శ్వాల కనముల పొడువున నెక్కి చితాప్రఖానుని వెనకదిక్కులకై వచ్చి శింగ్గాణులచేతనున్ను ఖడ్గములచేతనున్ను బరిజీలచేతనున్ను వేటారు తునకలుగా నరకగా చితాప్రఖానుని తెగలకు కనుమలో నిలువకూడక విరిగిపారగా వెంబ్బడించ్చి తరముకబోయి వారిని దుర్గ్గంచొరదోలి తిరుగావచ్చిరి. గనక అప్పుడు చితాప్రఖానుని తెగలలోయిరువైమూడువేల స్త్రోమమున్ను నాల్గువేల గుఱ్ఱమున్ను వఖతావున్నమడిసి అటుతర్వాత సమదళం ఆద్యంత్తమున్ను ముంద్దరకదలిపోయిరి. గనక ఆకనుమల్లో ముప్పైవేల స్త్రోమాన్ని తాణ్యావుంచ్చి అవతల గజపతిగారి శీమాద్యంత్తం నిపాతం శేసుకపోయి పోట్నూరి సింహాద్రివద్ద పాళ్యం దిగిరి. గనక యీవర్తమానం గజపతివారు విని యేదులసాహు, కుతుపనములక, నిజాంశాహు వారుముగ్గురున్ను నిలువలేక తిరిగి స్థలాలువచ్చిరి. గనక ముగ్గురు దునెదార్లున్ను వీగతోలిన బలవంత్తులతో తాము ఏకదేశాన పోరాడేది యేరీతు అని ఆప్తులతో ఆలోచనశేయగా వారు గజపతివారితోను మనసింహాసనానకు షోడశపాత్రులయొక్క భుజబలపరాక్రమాన యీక్షోణీ చక్రం యేలుబడికి వచ్చును. యీపరకు కర్న్నాటకంవారు మనశీమలోనికి వచ్చినవారుకాదు. పెద్దగజపతివారు వుండ్డేటప్పుడు వారు సేతుయాత్రకొరకై కచ్చి, కాళహస్తి, అరుణాచలం, చిదంబ్బరం, జంబ్బుకేశ్వరం, (సశేషము)

ప్రకటన

ఆంధ్రసాహిత్య పరిషత్తు, చెన్నపురి.

ప్రతిష్ఠాపకులు:—

శ్రీపిఠాపురము రాజాగారగు శ్రీరాజా రావు కుమార వేంకటమహీపతి సూర్యారావు బహద్దరుగారు.

శ్రీవేంకటగిరిరాజాగారగు మహారాజా సర్ - వెలుగోటి శ్రీరాజగోపాల కృష్ణయాచేంద్రబహద్దరుగారు, కె. సి. ఐ. ఇ., పంచహజారీమనసబ్దార్.

అగ్రాసనాధిపతి:—

శ్రీవేంకటగిరి మహారాజాగారు.

కార్యనిర్వాహక సభాధ్యక్షుఁడు.

మ-రా-రా-శ్రీ జయంతి రామయ్యపంతులుగారు. బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

మ-రా-రా-శ్రీ పురాణం నాగభూషణంపంతులుగారు, ఎం ఏ., బి. ఎల్.

,, ఆచంట లక్ష్మీపతిగారు, బి. ఏ., ఎం. బి., సి. ఎమ్.,

,, నెమలి పట్టాభిరామారావు పంతులుగారు బి. ఏ,

కోశాధ్యక్షులు (ట్రస్టీలు)

దివాన్ బహదూర్ కంచి కృష్ణస్వామిరావుగారు. సి. ఐ. ఇ.,

,, రావుబహదూర్ పిట్టిత్యాగరాయసెట్టిగారు, బి. ఏ.

కార్యస్థానము.

2/7 హారిస్ రోడ్డు, పుదుపేట.

చందానిర్ణయము.

పరిషదుద్దేశము:—ఆంధ్రశబ్దములకు సలక్ష్యవ్యుత్పత్తికముగ విపులనిఘంటువు రచించుట, తెలుఁగుభాష కితరభాషలతోఁగల సంబంధమును దెలుపుచు భాషాతత్త్వమును నిరూపించుటు శాస్త్రమును రచించుట, ఆంధ్రదేశపూర్వవృత్తాంతమును బ్రమాణపూర్వకముగా నిరూపించులక్షణ శాస్త్రపారిభాషికపదముల నిర్ణయించుట, నూతనగ్రంథరచనకు సాహాయ్య మొనర్చుట, భాషావిషయములఁజర్చించుటకుఁ బత్త్రికనొకదానిని బ్రకటించుట, సమగ్రమగు పుస్తకభాండాగారము నేర్పఱచుట, ఇత్యాదివిధముల నాంధ్రభాషావాఙ్మయాభివృద్ధికై యత్నించుట, పరిషత్తుయొక్క-యుద్దేశము.

1.	ఉద్ధారకులకు	రు.	5000.
2.	పోషకులకు	,,	1000.
3.	యావజ్జీవసభ్యులకు	,,	100.
4.	సాధారణసభ్యులకు సంవత్సరమునకు	,,	6.

పరిషత్సభ్యులు పత్త్రికకు వేఱుగాఁ జందా నియ్యనక్కఱలేదు.

సభ్యులు కాఁగోరువారు కార్యదర్శుల పేర వ్రాసి పరిషన్నిబంధనలఁ దెప్పించుకొనవచ్చును.

విజ్ఞానచంద్రికాగ్రంథమాల.

ఆంధ్రులపౌరుషము ! ఆంధ్రులయౌన్నత్యము ! ! ఆంధ్రులబుద్ధివైభవము ! !

ఆంధ్రులచరిత్రము.

రెండవభాగము.

ఇందు క్రీ.శ.1100 నుండి 1350 వఱకుఁగల ఆంధ్రదేశచరిత్ర వర్ణింపఁబడినది.

పురాణములు, కావ్యములు, శాసనములు, విదేశీయులవ్రాఁతలు, మొదలగువాని నన్నింటిని శోధించి తెలుఁగుచోడులు, నాగవంశోద్భవులైన మహారాజులు, కాకతీయచక్రవర్తులు, పల్నాటివీరులు, కమ్మవారు, రెడ్లు, వెలములు మొదలగువారి చరిత్రలు, ఈ యుద్గ్రంథమునందు క్రోడీకరింపఁబడినవి.

రామానుజుఁడు, బసవేశ్వరుఁడు, నన్నెచోడ కవిశిఖామణి, ఖడ్గతిక్కన, కవితిక్కన, గణపతిదేవచక్రవర్తి, ప్రతాపరుద్రమహారాజు, మహారాణి రుద్రమదేవి, మొదలగువారల పవిత్రజీవితములు శ్రద్ధతో వ్రాయఁబడినవి.

ఆయాకాలమందలి సాంఘిక, రాజకీయస్థితులు చక్కఁగ వివరింపఁబడినవి. ప్రదేశములయొక్కయు, కట్టడములయొక్కయు, పటములు కలవు.

పౌరుషమునందును పాండిత్యాతిశయంబునందును రాష్ట్రపాలనయందును ఆంధ్రులు హిందూదేశములోని యితరదేశములవారికి తీసిపోవువారు కారని యీగ్రంథము సప్రమాణముగా సిద్ధాంతీకరించుచున్నది.

ఇట్టిగ్రంథము తెలుఁగులోగాని మఱియే యన్యభాషలోఁగాని యెవ్వరును రచించియుండలేదు.

విఖ్యాత లేఖకులగు శ్రీయుత చిలుకూరి వీరభద్రరావు పంతులుగారిచే నిది రచింపఁబడినది. 400 పేజీలు గలిగి మంచికాగితములమీఁదచిన్న యక్షరములతో ముద్రింపఁబడి చక్కనిక్యాలికోబైండు చేయఁబడినయీయమూల్యగ్రంథము మాచందాదారులకు పోస్టేజితో రు. 1—0—0 కును, చందాదారులు కానివారలకు పోస్టేజిగాక రు. 1—8—0 లకును ఇయ్యఁబడును.

☞ **విజ్ఞానచంద్రికా బుక్కుడిపో యందు సంస్కృతాంధ్రగ్రంథము లనేకములు దొరకును. వలయువారికి క్యాటలాగులు పంపఁబడును.**

చిరునామా:—

ఆ. లక్ష్మీపతి, బి ఏ., ఎం. బి. సి. ఎం.

మేనేజరు.—విజ్ఞానచంద్రిక,

చింతాద్రిపేట.—మద్రాసు.

చందా సం॥ కు రూ. 3—0—0. విడిసంచిక రూ. 0—5—0.

సంపుటము 3 | ఆనందనామసంవత్సరము ఆషాఢమాసము. | సంచిక 4

ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రిక.

ప్రతిమాసమునఁ గడపటివారములోఁ బ్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

ప్రధానవ్యాసములు.

1. శ్రీకృష్ణదేవరాయలప్రతిమ. — జయంతి రామయ్య.
2. గ్రామ్యవాదవిమర్శనము. — నండూరి మూర్తిరాజు.
3. హిందువులజ్యోతిశ్శాస్త్రము. — కపిస్థళము కృష్ణమాచార్యులు.
4. గ్రామ్యమా-గ్రాంధికమా? — మల్లాది సూర్యనారాయణశాస్త్రి.
5. కృతివిమర్శనము. — ,,
6. రాయవాచకము. — విశ్వనాథరాయనిస్థానాపతి.

చెన్నపురి.

విషయసూచిక.

1. శ్రీకృష్ణదేవరాయలప్రతిమ. ... ...

జ. రామయ్యపంతులుగారు. బి. ఏ., బి. ఎల్.

2. గ్రామ్యవాదవిమర్శనము. 137-157

నండూరి మూర్తిరాజుగారు. బి. ఏ.

3. హిందువులజ్యోతిశ్శాస్త్రము. 158-166

కపిస్థళము కృష్ణమాచార్యులుగారు. బి. ఏ., ఎల్. టి.

4. గ్రామ్యమా-గ్రాంథికమా? 167-171

మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు.

5. కృతివిమర్శనము. 172-174

6. రాయవాచకము. 175-182

విశ్వనాథరాయని స్థానాపతి.

ప్రతిబింబములు.

1. శ్రీకృష్ణదేవరాయలప్రతిమ.

గ్రామ్యవాదవిమర్శనము.

మనభాషకు మంచిదినములు సంప్రాప్తమయినవి. దేశప్రముఖు లిదివఱలో వలె నాంధ్రభాషను నిరసింపక దానికిఁ బ్రాముఖ్యము నిచ్చి చర్చించుటకును, బరిశోధించుటకును, బ్రోత్సాహపఱచుటకును వృద్ధి నొందించుటకును విపులమయిన ప్రయత్నములను జేయుచుండు టెంతయు శుభోదర్కంబుగా నున్నయది. ప్రస్తుతకాలము సంస్కరణయుగమై విరాజిల్లుచున్నయది. మతసంస్కారములు, సంఘసంస్కారములు, రాజకీయసంస్కారములు మొదలగున వెక్కడఁ జూచినను మనదేశమున ననేకములు బయలుదేఱి పనిచేయుచున్నవి. వీనికన్నింటికిని బ్రధానోద్దేశము దేశాభివృద్ధి. ఈయన్ని సంస్కారములయందును గూడ మొదట సంస్కారోద్యమముల నారంభించి సంఘమును మేల్కొల్పినవారు ప్రజలకృతజ్ఞతకు మిగులఁ బాత్రులు. మతసంస్కారములు బయలుదేఱి హిందూమత మంతయు స్వార్థపరులయిన కొందఱు బ్రాహ్మణనామధారులచేఁ గల్పింపఁబడిన కొన్ని నిర్జీవకర్మముల సముదాయము మాత్రమే గాని యంతకంటె నిం దేదియు సారములే దని పురాతనమతమయిన హిందూమతమును దదాచారములను నిరసించుటయు నంతటితో నాగక దూషించుటయు మొదటపెట్టిరి. పిమ్మట విద్యార్థికు లయినవారు వెనుక తిరిగి చూచి దేశ మెన్నిమార్పులకు లోనైనను ఎన్నిదేశములవారు వచ్చి మనలను లోఁబఱచుకొని మనపై నిరంకుశాధికారములను జెల్లించినను, ఎందఱెందఱికో మనము దాసుల మయినను, రూపుమాయక సంపూర్ణప్రభావముతో నిలిచియున్న మనమత మింతటి నిస్సార మయినదియా యని యెంచి ప్రాఁతపుస్తకములను దులిపి పరిశీలింప నారంభించిరి. అం దనేకవిషయములు బయలువెడలి హిందూమతమునం దుత్తమధర్మము లెన్నియో కల వనియు, నవి నిరర్థక మయినమూఢవిశ్వాసములమూట యనుమాట బూటక మనియుఁ బ్రజలు కనిపెట్టుటయే కాక ఖండాంతరులకుఁగూడ హిందూమత ముపాస్యమై వెలయుచున్నది.

ఈయుపన్యాసము కాకినాడలో "లిటరరీ అసోసియేషను" భవనమున జరిగిన భాషావిషయకసభలలో నొకనాఁడు చదువఁబడినది.

ఇట్లే రాజకీయసంస్కారమునందును బ్రథమమునఁ గొంద అతివాదు లనియుఁ గొందఱు మితవాదు లనియు గలహములు ప్రారంభమై మొదట నొకకోలాహలము పుట్టి హాలాహలమువలెఁ గొంతవఱకు దేశశాంతికి భంగము కలిగించి నను శాంతిపరులు దూరదృష్టిగలవారలు రాజనీతివిశారదులు నగుమహనీయుల సత్ప్రయత్నములవలనఁ బ్రజలవాంఛలు దొరతనమువారును దొరతనమువారి యాదర్శములు ప్రజలును గ్రహించి ప్రజల కుచితవరప్రదానములతో శాంతి నెలకొల్పఁబడి తద్విషయమున మనదేశ మొకమె ట్టెక్కిన దైనది. అట్లే మనప్రస్తుతవక్తవ్యాంశ మగుభాషాసంస్కరణముకూడ బయలుదేఱినది. దీనియందును అతివాదులును మితవాదులును నున్నారు. ఉభయవాదులును గూడ దేశమునందలి జనసామాన్యముయొక్క సంపూర్ణకృతజ్ఞతకుఁ బాత్రు లని నిస్సంశయముగఁ జెప్పవచ్చును. ఒకవంక నాంధ్రసాహిత్యపరిషత్తువారు నిఘంటునిర్మాణము, భాషాపరిశోధనము, సత్కావ్యరచనము మున్నగుభాషోద్ధరణమునకు వలయు సత్కార్యముల నొనర్చి భాషాసేవఁ జేయుచున్నారు. వేఱొకవంక నాంధ్రసాహిత్యసంఘమువా రాంధ్రభాషయొక్క వ్యుత్పత్తి, స్వరశాస్త్రము, వ్యాకరణము మొదలగువాని పునాదులను గనిపెట్టి వానికి నితరభాషలకును గలసంబంధములను దెలిసికొని భాషకుఁ గావలసినయభివృద్ధి యెద్దియో నిర్ణయించి దానింబట్టి భాషను సంస్కరింపఁ బ్రయత్నములను జేయుచున్నవారు. అందుఁ బనిచేయు మ॥ రా॥ జయంతి రామయ్య పంతులవారును ఇందుఁ బాటుపడు శ్రీయుత గిడుగు రామమూర్తిపంతులవారును గూడ నాంధ్రభాషాశ్రేయోభిలాషు లయినవారియత్యంతకృతజ్ఞతకు సమానముగాఁ బాత్రు లయియున్నారు. మనకు వారివాదమును వీరివాదమునుగూడ సమానగ్రాహ్యములు. వారియుక్తులను వీరియుక్తులనుగూడ సమానగౌరవాదరములతో వినవలసినవారమై యున్నవారము. విని పిమ్మట విమర్శించుకొని శాంతచిత్తులమై మంచిచెడ్డలను దెలిసికొని యందుత్తమమని తెలిసినమార్గము ననుగమించుట మనకు విధి. ఇందే వాదము స్థిరపడినను రెండవవా రోడిపోయిరి యనువ్యసనమును బొంద నవసరము లేదు. ఏమంటిరేని ఉభయవాదులకును గావలసినది భాషయొక్క మేలు. దానింబట్టి దేశమునకు మేలు. మేలు దేనింబట్టి కలుగును? ధర్మమునుబట్టి కలుగును. కావున సూక్ష్మముగ విభజించుకొని మూలమునకుఁ

బోయి చూచినయెడల ధర్మజయమునకే యుభయవాదులును వాదములను జేయుచున్నవా రని యేర్పడుచున్నది. తుదకు జయించున దెప్పుడును ధర్మము గాని యధర్మము కాదు. కావున నేవాదము జయించినను జయించినదే ధర్మమగును. ఓడిపోవువారు లేరు. అట్లనుటంబట్టి వారు జయింతు రను భయము వీరికిఁగాని వీరు జయింతు రనుభయము వారికిఁగాని గలుగ నవసరము లేదు. భయమునకును భక్తికిని సమావేశము పొసఁగదు. జనులకు నిక్కమయినభక్తి భాషయం దున్నయెడల నిట్టిభయములు వారిఁ జేరఁజాలవు. ధర్మసంస్థాపనము కొఱకుఁ జర్చించుచున్నారమే కాని యిది యెవరో కొందఱు పురుషులస్వార్థమునకుఁ గాని వారిఖ్యాతికిఁ గాని పోరాడుచున్నా మను నల్పపుటూహలను దూరముగఁ ద్రోసి విశాలహృదయములతో నుభయవాదులవాదములను విమర్శించుకొనుట మన కవశ్యకర్తవ్యము. ఈవిషయమై విపులముగను గూలంకషముగను జర్చించుటకు నాకుఁ దగినపాండిత్యము గాని స్వరశబ్దవ్యాకరణాది శాస్త్రజ్ఞానము గాని వలయునంత లేకున్నను ఆంధ్రుఁడనై యాంధ్రభాషయందు భక్తి కలవాఁడ నగుటచే నీపదిదినములనుండి యీమందిరమునఁ జరగుచున్న మహోత్తరోపన్యాసములవలన నేగ్రహియింపఁగలిగిన దానింబట్టియు నాకుఁ దెలిసియున్న కొలఁదివిషయములంబట్టియు నాబుద్ధి కిప్పటికి సమంజసము లనితోఁచిన మాటలను గొన్నింటిని నివేదించుచున్నాను.

ప్రతిసంస్కరణమునకును బ్రతిశాసననిర్మాణమునకును మనకుఁ బ్రభువులగు పాశ్చాత్యుల కార్యములు మన కాదర్శములై యున్నవి. ఇపుడు మనము పూనినకార్యము భాషాసంస్కారము లేక భాషాశాసనసంస్కారము లేక తన్నిర్మాణము నైయున్నది. ఈవిషయమున నాంధ్రవిబుధులు రెండుతెగలయియున్నవారు. అనగా నీవిషయమునఁ బరిశ్రమ చేయుచున్నవారు రెండుతెగలుగ విభజింపఁబడియున్నారు. అం దొకతెగవారు గ్రాంథిక వాదులు, రెండవతెగవారు గ్రామ్యవాదులు. మనముగ్రాంథికవాదులమత మేమి? గ్రామ్యవాదులమత మేమి? ఏది యెంతవఱకు సమంజసము? అనువిషయములను విమర్శించుకొనవలసియున్నది. మొదటివారి మతము భాషయన గ్రంథములు వ్రాయుభాష ఛందోవ్యాకరణాదినియమబద్ధమయి యుండవలయు, నందుల కిప్పుడు గ్రాంథికభాషయందుఁ బ్రమాణములుగాఁ బరిగణింపఁబడుచున్న వ్యాకరణాదిశాస్త్రములే ప్రమాణములుగా నుండవలయు నని తెలుపుచుఁ గాలోచితసంస్కారములను సంధియందును,

అన్యభాషాస్వీకరణమునందును నియమబద్ధముగఁ జేసికొనవలయు ననియు గ్రాంథికభాషావాదులు తమమతమును వ్యక్తీకరించి యున్న వారని నాయాశయము. జయంతిరామయ్యపంతులవారు వ్రాసియుంచిన 'Defence of Literary Telugu' అనుగ్రంథమును జదువఁగ వారిమత మిది యని నే గ్రహింపఁగలిగితిని. సంధివిషయమున వా రంగీకరించినసంస్కారమున, "సంధియుండుటచే శ్రుతికటువుగనుండుటగాని పదముల యర్థము దుర్గ్రాహ మగుటగాని లేక యశ్లీలమగుటగాని సంధివిరామములేకుండఁ గలుపుటవలనఁ బదము లూపిరియాడలేక పోవునంతటి దీర్ఘము లగునప్పుడు గాని విసంధి నంగీకరింపవచ్చు" నని కనఁబడుచున్నది. ఇంకఁ బరభాషాపదములను స్వీకరించుటలోఁ గ్రొత్తమాటలను నిర్మాణముచేయుట యవసర మైనయప్పుడు మూఁడుమార్గములను వారు గమనించియున్నారు. (1) ఇదివఱకు భాషలో నున్నపదముల సహాయము చేతనే సమస్తపదములను సృష్టించుట (2) ఇదివఱకున్నపదములను బారిభాషికపదములుగ మార్చి కొన్ని యర్థములయందు వానినిరూఢిచేయుట (3) పరభాషాపదముల నర్థసహితముగ మనభాషామర్యాదలకు లోఁబఱచి స్వీకరించుట. ఇం దితరభాషాసహాయ మపేక్షింపక వీలయినయెడల స్వభాషయందలి పదముల మార్పుచేతనే క్రొత్తపదములను గల్పించుకొను టుత్తమ మని వారి యభిప్రాయము, కాని యన్నిభాషలకు నట్టిసృష్టిశక్తి సమానముగా నుండదు కావునఁ దెలుఁగుభాషయం దాశక్తి వలయునంత లేమిం జేసియుఁ దెలుఁగునకు సంస్కృతమునకును జిరకాలమునుండి సంపర్కము మిక్కిలిగా నుండుట నిర్వివాదాంశ మగుటచేతను బరభాషాసహాయము పదనిర్మాణమున కవసర మైనపుడు సంస్కృతభాషను బ్రథమముగాఁ బరిగణింపుఁడనియుఁ దానిసహాయము వలనఁ గూడ మనకుఁ బని సుకరముగ నెఱవేఱనిచోఁ నితరభాషలనుండి సహాయమును బొందవచ్చు ననియు నేమము నేర్పఱచి యున్నారు. స్వభాషవలనను సంస్కృతమువలనను నిర్మించుటకు వీలున్నపుడును నిరంకుశముగ నన్యభాషాపదముల ననవసరముగ గుప్పించుటను నిరసించుచున్నారు. ఇందుకుఁ దార్కాణముగ Angle, point, figure మొదలగు తెలుఁగులో వ్రాయుటకు వీలులేని పదములనుగూడ ననవసరముగఁ దెచ్చిపెట్టరా దని నిషేధించిరి. ఇవి సంధివిషయమునను బరపదస్వీకరణమునను గ్రాంథికవాదుల యభిప్రాయములు. ఇవి భాషాభివృద్ధిని గోరి వారిచే నియమింపఁబడినట్లు గాన్పించుచున్నవి. పిల్లవాండ్రను

భాషను దుర్బోధము దుర్గ్రహముచేసి వారినోళ్లను జేతులను గట్టిపెట్టి వారికి స్వభాషరాకుండఁ జేసి న్యాయవాదులకడను నుద్యోగీయులకడను వర్తకులకడను బండితులకు వృత్తిగల్పించి పండితుల పంటపండించుట కేర్పాటుచేసె నవో సవిమర్శముగాఁ బాఠకులు తమతమ యావేశమును విడిచి యోజించి చిత్తము వచ్చిన తీర్మానమునకు వచ్చెదరుగాక! ఈనియమములవలన మనభాషను మేలు కలుగు ననియు హానియేమియు లేదనియు నాసమ్మకము.

ఇఁక గ్రామ్యవాదులమతమునకుఁ బోయి విచారింతము. ఈసందర్భముల గ్రామ్యవాదు లనుశబ్దప్రయోగముంగూర్చి యించుక ముచ్చటింపవలసియున్నది. గ్రామ్యవాదు లని పిలుచుట మాకగౌరవ మనియును వ్యావహారికవాదు లని పిలువవలసియుండు ననియు వారు సెలవిచ్చియుండిరి. ఇప్పటివఱ కేర్పడియున్న శబ్దశాస్త్రనియమముల ననుసరించి లక్షణవిరుద్ధమగుభాష గ్రామ్య మని గ్రహించుచున్నాము. వస్తాడు, పోతాడు, వచ్చాడు, మొదలగు రూపములు గ్రామ్యములని యిప్పటి మనము రూఢముగా వాడుచున్నాము. దానియర్థము సుకరముగా నందఱకు గ్రాహ్యమే. గ్రామ్యవాదులనఁగనే ప్రజలు రామమూర్తి పంతులు వారు వారియనుగాములు నని గ్రహించుచున్నారు. ఈపదమున కట్టియర్థము సుప్రసిద్ధమయినది. పదమూ లలితమై శ్రమలేకుండఁ బలుకఁ దగినదై యున్నది. దీనిం బలుకుటకంటె వ్యావహారికభాషావాదులని యింతపొడుగుపేరు నుచ్చరించుట యీవాదమువారి యాశయములనుబట్టియే కష్టతరముగా నున్న దనుట వాస్తవము. అట్టివిషయమున గ్రామ్యవాదు లనుటమాని వ్యావహారికభాషావాదు లని పిలువుఁడని కోరుచున్నారు. ఎందుచేత? అది యగౌరవ మైనపదముగా వారికిఁ దోఁచినదఁట. అందఱకును దెలిసిన దైనను సులభతరోచ్చారణ గలదైనను గ్రామ్యపదమును ద్యజించి యంతసులభముగఁ దెలియరానిదియుఁ గష్టతరముగాఁ గాని యుచ్చరింప నసాధ్యమైనదియు నగు "వ్యావహారికభాషావాదు' లను పదమును వారు స్వీకరింతు రఁట. దేనినపేక్షించి? వారిగౌరవము నపేక్షించి. మనకు వారిని గౌరవించుటే కావలసినది గాన నించుక యుచ్చారణమునం దాయాసము గలిగినను వారుకోరినరీతిని వ్యావహారికభాషావాదు లనియే వాడుదముగాక! వారిగౌరమును గాపాడుకొనుటకు వారికి గౌరవమైన పదమును వా రపేక్షించినరీతినే భాషాగౌరవము కొఱకు భాషకూడ గౌరవము గలిగిన పదములనపేక్షించుచున్నది. ఆగౌరవపదప్రయోగమే గ్రాంథికవాదులు

గోరుచున్నది. ఇది యిట్లుండనిచ్చి వ్యావహారికభాషావాదులమత మేది? తద్ధర్మము లెవ్వి? యని విమర్శించుట మనకుఁ బ్రధానకర్తవ్యము. వారి మత మిది యని నిర్ణయముగ వారు వక్కాణించి యుండలేదు. ఉన్నంతవఱకు నది విస్పష్టముగను నిస్సంశయముగను నుండక సందిగ్ధముగ నున్నయది. వారువిరచించిన పొత్తములనుబట్టి వారిమతమును గ్రహింతమంటిమా యాగ్రంథముల నువ్రాసినపిమ్మట మాయూహలను మార్చుకొంటిమి కావున మేము రచించి లోకమునఁ బ్రవేశపెట్టిన మాగ్రంథములు గాని యందలిపీఠికలయందలియాశయములుగాని మామతమునకుఁ బ్రమాణములుగాఁ దీసికొని ఖండింపవల దని వారొకరితోఁ జెప్పఁగా మేము వినియున్నా మని కొందఱు న్యాయశీలురు సెలవిచ్చు చున్నారు. ఇదివఱకు రచియించినగ్రంథములను బ్రమాణముగాఁ దీసికొన వలదని పత్రికాముఖంబునఁ గాని సభాముఖంబునఁగాని వారు ప్రచురించి యుండలేదు. నిన్నగాక మొన్న సీకాకినాడలోఁ జేసిన సభలయందుఁ దద్గ్రంథకర్త లుపన్యాసము లిచ్చియు వారికి సమాధానములు నిచ్చుట కిచటిపండితు లుద్దేశించి యుండి రని యెఱిఁగియుఁ గూడ మామతమునకు మాగ్రంథములు ప్రమాణములు కా వని వారు వాక్రుచ్చి యుండలేదు. వారిమతమునకు వారిగ్రంథములే విరుద్ధములుగా నున్న వని ఖండనము ప్రారంభము కాఁగానే యాగ్రంథము రచించునాఁటి కాగ్రంథకర్తల కున్నయూహ లిటీవల మాఱినవి కావున నాగ్రంథమును వారిమతముగా నెంచి ఖండింపరా దని ప్రతివాదు లుపన్యాసమధ్యమున నడ్డము వచ్చుచున్నారు. కూలంకషముగా నీమతమువారి యాశయము లన్నియు బయల్పడలేదు. అన్నింటి వినినఁ గాని ప్రత్యుత్తర మొసంగుటకు వీలులే దని కొందఱు ప్రభువులు జనాంతికముగాఁ బల్కుచున్నారు. ఇట్టివారి మతము నాలుగైదేండ్లయి జన్మించిన దయ్యుఁ బరీక్షకులు పరీక్షలయందుఁ దెలిసియో తెలియకయో యామత ప్రకార ముత్తరపత్రములను వ్రాయవచ్చునని విద్యార్థులకు స్వేచ్ఛనిచ్చియును ఆమత మిద్ది యని చెప్పి దేశక్షేమమునకై సత్యపరిశీలనము కొఱకు విమర్శింత మనిన "నేతి, నేతి" యను పరబ్రహ్మస్వరూపనిర్వచనమువలె నేదియును గాదను స్థితిలో నున్నది. వాస్తవముగా నిప్పటికి విచారింప వారిమత మేదియో వారికిని స్ఫుటముగఁ దెలియ దని శంకింపవలసివచ్చుచున్నది. అయినను ముఖ్యముగా వారీనడుమ నిచ్చట (కాకినాడలో) నొసంగినయుపన్యాసములను

బట్టియు నిదివఱలో నొకసారి రామమూర్తిపంతులవారు శ్రీపురమునకు విచ్చేసి యొసంగిన యుపన్యాసములనుబట్టియుఁ బలికాముఖంబుల నప్పుడప్పుడీమత స్థులు వ్రాయుచున్న వ్యాసాదికములను బట్టియు నేగ్రహింపఁగలిగినంతవఱకు పైరిమతముంగూర్చి నాయభిప్రాయములను నివేదించుచున్నాఁడను. ధారాళముగా వారియూహలను దెల్పుటకు రామమూర్తి పంతులుగారికిని వారియాశయములను బ్రచురించుటకు అప్పారావుపంతులుగారికిని వారిసూత్రము బోధించుటకు శేషగిరిరావుగారికిని వారిజ్ఞానమును వ్యక్తీకరించుటకు సీతారామయ్యశాస్త్రిలవారికిని ఎట్టిస్వాతంత్ర్యము గలదో యట్టి స్వాతంత్ర్యము వారివలెనే యాంధ్రుఁడనై యాంధ్రభాషాభిమానము గలిగి యాంధ్రభాషం జదువుకొని దానియందుఁ బాండిత్య మంతగా లేకున్న నభిరుచి యెక్కుటముగాఁ గలిగి దాని మేలుకోరినవాఁడ నగుటచేత నాయభిప్రాయములను బ్రచురించుటకు నాకును సోదరభావముతో స్వాతంత్ర్యమును వా రొసంగుదు రని నమ్ముచున్నాఁడను. వారికిని నాకు నొక్కభేదము కలదు. ఏది యనిన బడిపిల్లలు వారిచేతులలోఁ జిక్కియున్నారు. అందుచే వారియభిప్రాయములు వారికిఁ దోఁచిన తక్షణము ననే యెవరితోడను జెప్పనక్కఱలేకయే కార్యరూపముగ నెలకొల్పఁగలరు. నాకది సాధ్యము కాదు. నాపిల్లలవిషయమున నైన నాయభిప్రాయముల ననుగమింపఁజేయుటకు వీలులేదు. అనఁగ నీవిషయమున వారున్నతావు వారికెక్కుడు బలిమి నిచ్చునదై యున్నది. మనది తదితరమై యున్నది. ఇందుచే నివి వ్యాప్తమగుట కష్టము. అవి విస్తరిల్లుట సుకరము. కాని యట్లని యుదాసీనభావము పురుషకారము గాదు. మనము మంచి దని నమ్మినదానికొఱకై పూనికతోఁ బాటుపడవలయును.

ప్రజాసమూహ మంతటికిని సంబంధించినవిషయములయందు మార్పును గలుగఁజేయునప్పుడు తొందరపాటు కూడదు. అట్టిచోట్ల నెంతయో దూరదృష్టి విశాలహృదయము నిశితమైన సూక్ష్మబుద్ధి పౌర్వాపర్యవిమర్శనమును గలిగి నిదానముగా శాంతముగా నావేశమునకు నుద్రేకమునకుఁ దావీక ప్రజాభిప్రాయమును గుర్తెఱింగి వారికిఁ గలుగు లాభనష్టముల వారికిఁ జక్కఁగఁ దెలియునటుల బోధించి ప్రజలు వానిపైఁ జేయుఖండనమండనములను దారతమ్యావిచక్షణచేసి చూచి పిమ్మట వీని నన్నింటిని బట్టి ప్రజాక్షేమకర మని యేది ప్రముఖులచే నిర్ధారణము చేయఁబడునో యట్టిమార్పులను గ్రమముగా నాచర

ణములోఁ బెట్టవలయును. ఆంధ్రుల కందఱకును సంబంధించిన భాషావిషయమున నీవ్యావహారిక భాషావాదులు మార్పులను బెట్టినారు. అవి దిక్ప్రదర్శనముగ మనకుఁ దెలిసినంతవఱకు నెవ్వి యనిన:-భాషవలన వ్యాకరణము పుట్టును గాని వ్యాకరణమునుండి భాష పుట్టదు కావునను, చిరకాలము క్రిందట రచియింపఁబడిన మనవ్యాకరణశాస్త్రములు నానాఁటిభాషయందుఁ గలప్రయోగములకు లక్షణములం గనిపెట్టి సూత్రముల నేర్పఱచిన వనియు, నప్పటికి నిప్పటికిని భాష యితరభాషలతోడి సంపర్కమువలనను నూతనవాంఛలు జనులహృదయక్షేత్రములయందు నాటుకొనుటవలనను నూతనాదర్శములు బయలువెడలుటచేతను బహువిధములుగ మాఱి యభివృద్ధి చెందియున్న దనియును అందుచేత వృద్ధిచెందిన యీభాషకు మన మిప్పుడు వ్యాకరణమును రచియించుకొనవలెనుగాని పూర్వపు వ్యాకరణములనుబట్టి యిప్పటి భాషను శాసించుట న్యాయము కాదనియు నూతనమతమువారియభిప్రాయ మైనట్లు తోఁచుచున్నది. నూతనవ్యాకరణసూత్రములను నిర్ణయించుకొనక ప్రాఁతవ్యాకరణములచేతనే భాషను బంధింప సమకట్టితిమేని దానియభివృద్ధికిని స్వేచ్ఛకును భంగము గలుగుననికూడ వారు చెప్పుచున్నారు. ఈవాదమును మనము ముందు విమర్శించుకొందము. భాషనుండి వ్యాకరణము కలుగుననుట సత్యమే. వెనుకటివ్యాకరణనిర్మాణమునాఁటికి నిప్పటికిని గ్రాంథికభాష యైన నేమి మాటలాడుటలో వాడఁబడుచున్న గ్రామ్యభాష యైన నేమి మాఱిన దని యే యంగీకరింతము. న్యాయశాస్త్రము (Civil law) శిక్షాస్మృతి (Criminal law) మొదలగునవి ప్రజాక్షేమమున కెట్లవసరమో యట్లే భాషాక్షేమమునకు వ్యాకరణాదిశాస్త్రము లావశ్యకములనుట నిర్వివాదాంశము. ఏదియయిన నొకకార్యము న్యాయమా యన్యాయమా లేక నేరమగునా కాదా యనినిర్ణయము చేయవలసివచ్చునప్పుడు న్యాయశాస్త్రమునో శిక్షాస్మృతినో తీసికొని దాని నియమములప్రకార మీకార్యము చేయుటకు వీనికి స్వాతంత్ర్యము కలదు. ఈకార్యము చేయుట కీతనికి స్వాతంత్ర్యము లేదు. ఇదియాచరించుటచేత నీతఁడు వంద్యుఁడు. ఇది యాచరించినందున నీతఁడు దండ్యుఁడు. అని యాయాశాస్త్రమర్యాదల ననుసరించి నిర్ణయము చేయఁబడుచున్నది. అట్లే భాషవిషయమున నీశబ్ద మీసంధి యీప్రయోగ మగునా కాదా గ్రాహ్యమా లేక గ్రామ్యమా సాధువా లేక యసాధువా యని నిర్ణయించికొనుటకుఁ బ్రమాణమయిన గ్రంథ మొకటి యవసరము. దానికి వ్యాకరణ

మని యిదివఱకున్న నామమునె యంగీకరించినను లేక గ్రామ్యకరణ మని క్రొత్తపేరు పెట్టుకొనినను నట్టి ప్రమాణగ్రంథ మొకటి యవసరము. అట్టి ప్రమాణగ్రంథము నూతనమతస్థుల కిప్పటివఱ కేర్పడి యుండలేదు. ఇఁక నేర్పాటుకావలెను. అందుల కేమిచేయవలయునో యోజించుకొందము. ఇట్టి నూతనసంస్కారముల లేక నూతనశాసనముల నేర్పఱచుకొనవలసివచ్చినప్పుడు మనకుఁ బ్రభువు లగుపాశ్చాత్యులు మార్గదర్శకులుగా నున్నా రని పైనఁ జెప్పియున్నాఁడను. నూతనశాసననిర్మాణము గావలసి వచ్చినప్పుడు వా రేమిచేయుచున్నారో యించుక మనము విమర్శించి చూచుకొందము. ఇందు కొకయుదాహరణము నిచ్చుచున్నాఁడను. జమీందారులకును నారిరైతుల కును గలసంబంధములు మొదట 1866 సం॥ రపు ఏడవశాసనముచే శాసింపఁ బడినవి. అందలి విధులకు జమీందారులును రయితులును విధేయులై ప్రవర్తింపవలసిన వా రయి యుండిరి. కాలక్రమమున నుభయులస్థితిగతులయందు ననేకమయిన మార్పులు కలిగినవి. రైతులకుఁ గొన్నిహక్కులెక్కువ కావలసి వచ్చినవి. జమీందారులకుఁ గొన్ని సౌకర్యములు గావలసి వచ్చినవి. ఇవి యన్నియుఁ బత్రికాముఖంబునను సభలయందును జక్కఁగఁ జిరకాలము విమర్శింపఁబడినవి. పిమ్మట ప్రముఖులు బహుశాస్త్రపరిజ్ఞానపారంగతులు విశాలహృదయులు నగువారిచే నదివఱకున్న శాసనము (Rent recovery Act) లోఁ గావలసినమార్పు లివ్వి యని నిర్ణయింపఁబడినది. వానిని దొరతనమువారికి నివేదించిరి. అంతట బిల్లొకటి శాసననిర్మాణసభలోఁ బ్రవేశపెట్టఁబడినది. రైతులపక్షమునను జమీందారులపక్షమునను జక్కనివాదప్రతివాదములు జరుపఁబడినవి. అవి యన్నియును జనసామాన్యమునకై ప్రచురింపఁబడినవి. క్రొత్తశాసనము నేర్పాటుచేయుటకు సభ్యు లంగీకరించిన పిదపఁ దమబిల్లును బ్రకటించి దానిపైఁ బ్రజలు చేయునాక్షేపణముల నాలోచనలోనికిఁ దీసికొని చర్చించి పిమ్మట శాసనము నేర్పఱచి 1908వ సంవత్సరము జూలై నెల 1వ తేది కొమొద లీనూతనశాసనము ప్రచారములోనికి వచ్చును. ఇది యీయాప్రదేశములందు వర్తించును. ఇంతటినుండి యిదివఱకువాడుకలోనున్న 1865వ సంవత్సరమునాఁటి శాసనమునకుఁ బ్రవర్తనముఁ దీసివేసితి మని శాసించిరి. అప్పటి నుండి జమీందారులకును రైతులకును సంబంధములను నిర్ణయించుటకు 1908 వ సంవత్సరపు మొదటిశాసనమునకుఁ బ్రవర్తనము కలిగినది. దొరతనమువా

రీతిని జేయక 1865 వ సంవత్సరపుశాసనమునందుఁ గొన్నిలోపములు చూప ట్టఁగనే యాశాసనమును దీసివేసి క్రొత్తశాసనమును నిర్మించి దానికిఁ బ్రచారము నీయక జమీందారులు విద్యావంతులు, ఘనులు, బుద్ధిమంతులు, ప్రజలఁ బరిపాలింపఁ దగినవారలు, న్యాయాన్యాయముల నెఱింగినవారు కావున రైతులువారి కీవిషయము లన్నింటియందును దీసిపోవువారై యున్నారు కావున నుభయపక్షములవారిలో నాగరికులైనజమీందారులకు న్యాయమని తోఁచిన రీతిని వ్యవహారములను బ్రస్తుతము వాడుకలో నున్నపద్ధతులనుబట్టి జనుపుకొమ్మని యుత్తరువు చేసియుండినచో నిప్పటికి జమీందారులకును రైతులకును నెట్టిచక్కనిసంబంధ ముండి యెంతకల్లోలముపుట్టి యుండునో ప్రతివారికిని దేటతెల్లముగాఁ దెలియఁదగినవిషయమై యున్నది. ముందుకాలు మోపుటకుఁ దావునుజూచుకొనక వెనుక పాదము నెత్తితిమేని గూలఁబడి కాళ్లువిఱుగఁగొట్టుకొను నవస్థ తటస్థ మగురీతిని నూతనశాసనము నేర్పఱచుకొనక ప్రచారమందున్న ప్రస్తుతశాసనమును దీసివేసినచో నశాంతి బయలువెడలి యల్లకల్లోలమై ప్రజాక్షేమమునకు భంగము కలుగును. అట్లే భాషావిషయమునను నూతనప్రమాణముల నేర్పఱచుకొనకుండఁ బ్రస్తుతప్రమాణములను ద్రోసివేసితిమేని నియమరహితమై భాష వినాశమునొందును. అందఱకు నంగీకారమైన సామాన్యప్రమాణ మొకటిలేకుండిన యెడలఁ బ్రతివానికిని స్వప్రతిభయె ప్రమాణ మగును. అట్లైయినపుడు నన్నయ కొకవ్యాకరణము తిక్కన కొకవ్యాకరణము నీరీతిగా మేము వ్రాయఁబోవుచున్నా మని నూతనమతస్థులు సెలవిచ్చి యున్నరీతిని సామాన్యప్రమాణగ్రంథములు లేకుండునెడలఁ దెలుఁగు వ్రాయఁగలవా రెందఱుందురో యందఱికి నన్నివ్యాకరణములు సాహిత్యసంఘమువారు శ్రమపడి వ్రాయవలసి వచ్చును. అట్లుచేయుట సాధ్యమగునా? కాదు. కానియెడల నిఁక గ్రంథము వ్రాయుటకు ముందు గ్రంథకారుఁడు తనవ్యాకరణమును బ్రకటింపవలసివచ్చుచుండును గావున వ్యావహారికభాషావాదులారా ! వినుండు. మీరును భాషాక్షేమమును దేశక్షేమమును గోరియే పాటుపడుచున్నా రని మేమెఱుఁగుదుము. అందులకు మీకు వందనశతంబులు. మీరు గొప్పప్రమాదపుఁబని నొకదానిఁ జేసినారు. దాన హాని కలిగినది. భాషను సంస్కరింపవలసినదే. గ్రాంథికభాషాస్థానమున వాడుకభాషను బెట్టఁగోరుచున్నారు. మీరు వాడుకభాషయన నందఱును వాడునది కా దని మరల మీరే సెలవిచ్చుచున్నారు. అందుకు మీరొనర్ప

వలసిన దేది యనిన;—ఇదివఱకున్న వ్యాకరణసూత్రములలో వేనిని దీసివేయు దురు, వేని నంగీకరించెదరు, వేనిని గ్రొత్తగాఁ జేర్చెదరు, వాడుకయందుండెడు క్రొత్తరూపములను వేనిని గ్రహించెదరు లేక యిదివఱకున్న వ్యాకరణమును బూర్ణముగాఁ ద్యజించి నూతనసృష్టి చేయఁదలఁచితిరా? లేక రామమూర్తిపం తులవారు సెలవిచ్చిన 13 జాతులరూపములను గ్రంథస్థములనుగా జేయుటతో డనే మీరు తృప్తినొందువారా? ఈవిషయములకు విస్పష్టముగా మీయభి ప్రాయముల నాడంబరము లేకుండ ప్రజలకు నివేదింపుఁడు. అంతియేగాని మేము చెప్పునది శాస్త్రసమ్మతము మేము పూర్వగ్రంథములనే ప్రమాణముగాఁ బెట్టు కొని యున్నాము. వ్యాకరణములు మేము బహుశాస్త్రసందర్భములతోఁగలిపి చదివినాము. అందుచేత మాకుఁ దెలియునన్ని విషయములు మీరెఱుంగరు. అందుచే మేముచెప్పునది మీరంగీకరించి తీరవలెను. మేమువిద్యార్థులకొఱకుఁ బాటుపడుచున్నాము. వారియెడ మా కున్న బాధ్యత మీకు లేదు. మీకుఁ జీమకుట్టుటలేదు. మాకొడలెల్లఁ గుట్టిచంపుచున్నవి యని యావేశముతోఁ బలికినలాభములేదు. లోకమునందుఁ బ్రతిమాప్పను బ్రకృతిశాస్త్రానుగుణ్యము గానే జరుగును ‘వచ్చినవాఁడ’ నను రూపము “వచ్చినాఁడను, వచ్చినా” నని శాస్త్రసిద్ధముగా నయినరీతినే తక్కినరూపములుకూడ వచ్చాను, వచ్చా, ఒచ్చా ను, ఒచ్చా యనియెడు రూపములుకూడ నుచ్చారణ సౌకర్యాపేక్షచేతను నాయావక్తల వక్తృనిర్మాణవైలక్షణ్యముచేతను వారివారిశ్రద్ధనుబట్టియు నేర్పా టయినట్లు శాస్త్రీయముగానే నిరూపింపవచ్చును. కారణము లేనికార్య మెచ్చ టను నుండదు. వెళ్లినవాఁడు వెళ్లినాఁడు అయినట్లు వెళ్లాడు యెళ్లినాడు యెళ్లా డు మొదలగునవికూడ స్వరశాస్త్రమునుండి సాధింపఁదగినవే యగును. అందుఁ గొన్నిటికి మీపరిశోధనలయందుఁ గారణములు తెలిసి యుండవచ్చును గొన్ని టికిఁ దెలియకపోవచ్చును. అంతియ భేదముగాని ప్రతిదానికిని గారణ ముండక పోదు. స్వరశాస్త్రసాధ్యమయిన వన్నియు మనకు భాషలోనికి గ్రామ్యము లగునా? కాదని మీరేచెప్పుచున్నారు. “వస్తాడు” అనునది యంగీకార్యమను చున్నారు. ‘వచ్చా’ అనురూపము పనికిరాదనుచున్నారు. కావున శబ్దసాధువము నకు శబ్దశాస్త్రము ప్రమాణము కానేఱదు. దీని కొకతార్కాణమును దీసికొ నుఁడు. రసవాదశాస్త్రము మనశరీరమున కనుకూలము లయినను గాకున్నను నన్ని రసపదార్థములను గూర్చియును బోధించును. అందు (Potassium Cynide)

అను నొకపదార్థము కలదు. అది రసవాదశాస్త్రప్రకార మేర్పడిన చక్కని సమష్టిపదార్థముగదా యని మనము లోపలికిఁ బుచ్చుకొంటిమేని ప్రాణహాని వాటిల్లుచున్నది. మనము లోపలకుఁ బుచ్చుకొనవలసి వచ్చినపుడు వైద్యశాస్త్రము ననుసరించి యిది మనకు గ్రాహ్య మగునా కాదా యను విషయమును జర్చించుకొనవలెను. అట్లే మనము మాటలాడునట్టియు హీనజాతులవారు మాటలాడునట్టియు మాటలన్నియు నుగూడ స్వరశాస్త్రములేక (Phonetics) ను బట్టి సహేతుకములె యనుచు వానిని గ్రంథస్థము చేయునప్పుడు మనకు నికషోపములగా నుపయోగింపవలసినది వ్యాకరణశాస్త్రము. ఆ శాస్త్రప్రకార మది సాధువైనచో గ్రహింపవలెను. లేకున్న గర్హింపవలయును. కనుక యేనియమముల ననుసరించి ప్రస్తుతము జనబాహుళ్యమునందు మాటలాడుభాషలో వాడుకలో నున్న పదములను గ్రహింపుమందురో ముందు విస్పష్టముగఁ జెప్పవలసియున్నది. నాగరకగ్రామ్యమును వాడుమనుట సందిగ్ధాంశముగా నున్నది. 'ఎప్పుడొచ్చావ్' 'ఏంజేశావ్' మొదలగునవి నాగరకులయినవారు సర్వసామాన్యముగా వాడుచున్నారు. మఱియును బ్రాహ్మణేతరులయిననాగరకులు పట్టపరీక్షాభద్రులైనవారు గొప్పపదవులయందున్నవారును 'అవుద్ది' 'లెగిసినాడు' మొదలగు పదములను వాడుచున్నారు. ఒకయధికారి యొకకాగితము త్వరలో వ్రాయు మని యుత్తరువుచేయఁ దలఁచి 'హే ॥ గు ॥ కొంపమునుగుద్ది' అని కాగితముపై నుత్తరువు వ్రాసినారఁట! వీరిని నాగరకులు గారందురా? అట్లనుటకువీలులేదు. నాగరకులభాష యనినారము గాని కేవలబ్రాహ్మణులభాషయని మేమనలే దని యీమతమువారు సమాధానము చెప్పుచున్నారు. దానింబట్టిచూచిన నీచిక్కు తటస్థమగుచున్నది. దీని కింకొకరీతి ననుకొందు మందురేమో! ఎవరో యొక రట్లు వాడిన నది ప్రమాణమగునా? సర్వసామాన్యముగా నందఱును వాడెడిమాటలు గ్రాహ్యము లంటిమి కాని యట్టిమోటుమాట లాడువారిని మేముగ్రహింప మందురా వ్యవస్థ నెక్కడ నేర్పఱిచెదరు? నాగరకశబ్దము మరలఁ గొందఱియందు రూఢము చేయవలసి వచ్చుచున్నది. నన్నయభట్టాదులు మఱికొందఱు కవులును 'వస్తి' 'వస్తాడు' మొదలగు పదములనెక్కడెక్కడనో వాడినారనియు నందుచేత నాపదములు గ్రాహ్యములయు నాపదప్రయోగములకొఱకు వెదకి వెదకి తపస్సు ధారవోసి పట్టికలు వ్రాయుచున్నారు కదా! అప్పుడుమాత్ర మీవాద మేమయినది?

వారు సర్వసామాన్యముగా వాడిన 'వచ్చితిని' 'వచ్చును' మొదలగు రూపములనె తీసికొనవలెను. నూఱుపదములకో వేయిపదములకో యెక్కడ నైన నొకచోట వాడిన 'వస్తి' 'వస్తాఁడు' అనురూపములను గ్రహింపుమనుట యెట్టిన్యాయము? వారు వాడినను వైయాకరణులు వానిని దోషములుగాఁ బరిగణించి దోషప్రకరణములందుఁ జేర్చియుంచినారే కాని యవి సుశబ్దము లని చెప్పియుండ రైరి. క్షంతవ్యము లని వాని విడిచిరి. క్షమింపఁదగినవని వాని నుదాసీనభావముతో విడనాడిరి. అట్లుగాక వారు వాడిరి కావున నాయపశబ్దములను మనమును వాడుదమందురేని మీనాగరకులు మాటలాడుభాష వ్రాయునపుడు పైనిజెప్పిన 'తెగిసినాడు' 'ములుగుద్ది' 'అయితిలోకి' మొదలగునవి కూడ సాధువులును ప్రయోగార్హములు నగుచున్నవి. కావున మనుజునకుఁ బరిపూర్ణత్వము లేదనుహేతువుచే మనమెన్నఁడును ధర్మలక్ష్యమును క్రిందికి దింపఁ బ్రయత్నింపరాదు. లక్ష్య (Ideal) ముత్తమ మైనదిగా నుండవలెను. దానిం బొందుటకు మనజుఁడు ప్రయత్నముచేయవలెను. దానిని బూర్ణముగాఁ గొంద అందవచ్చును లేదా దానికి సమీపముగానైనను జేరవచ్చును. అట్లుగాక లక్ష్యమును క్రిందికి దింపఁ బ్రారంభించితిమేని రానురాను ఏమనుజున కా మనుజుఁడే లక్ష్య మనుస్థితికి వచ్చును. అపుడు భాషనీతి చెడిపోవును. భాషానీతియును దక్షిణనీతులవంటిదే. అందుచేత నూతనశాసన మేర్పడువఱకును ప్రస్తుతశాసనమునందలి మర్యాదలకు బద్ధులమై యుండవలసినదే. అట్లుచేయక యున్నదానిం దీసివేసి క్రొత్తదాని నేర్పఱుపక విద్యార్థులకు స్వాతంత్ర్యమిచ్చితిమని ప్రకటించుటచే విద్యార్థులకును దద్బోధకులకును గూడఁ జిక్కులు కలిగినవి. అట్లు చేయుట క్రొత్తమతమువారితప్పయి యున్నది.

ఇఁక సంధివిషయమై యోజింతము. సంధిసూత్రములను బాటించుటవలన బాలురకుఁ బదములు తెలియుటలేదనియు వానిని విడనాడుమనియుఁ గ్రొత్తమతమువారి యుద్దేశమయి కాన్పించుచున్నది. ఈయుద్దేశము సరియయినయెడల మాటలాడుటయందు వాడుకలో నుండుభాషను గ్రాంథికము చేయుట మా యుద్దేశ మనుమూలవాదమునకే ముప్పువచ్చుచున్నది. ఏమన, సంధులు వాడుకభాషలో విశేషముగా నున్నవి కాని వాడుకభాషలో లేనిదే యిదివఱకు గ్రాంథికభాషలోఁ బ్రత్యేకముగా నిర్మింపఁబడినవి కావు. ప్రతిచోటను సంధిని విఱుచుచు వ్రాయుట యన వాడుకభాషనుండి వేఱుచేయుట యని యర్థ

మగును. మనము మాటలాడునపుడు 'నేజూశాను' 'వాడడిగాడు' 'ఏమంటావు' 'వాణ్ని గలుసుకొన్నాను' అని యీ రీతిగా మనము సంధులును గలిపి మాటలాడుచున్నాము. కాని సంధులువిడిచి మాటలాడుట లేదు. సంధులు వ్రాసినయెడలనే బాలుర కలవాటుపడినరూపములను వారికిఁ జెప్పినవారమగుదుము; కాని విడఁదీసి వ్రాసిన వారికెక్కువ లాభమును గలుగఁజేసినవారము కానేరము. ఏసంధిరూప మయినను దురవగాహము గా నుండు నని తోఁచు నెడల దానిని విడువవచ్చును. అందునను నేను పైని మనవిచేసియున్నప్రకారము గ్రాంథికభాషావాదులు వలసినంతయవకాశము నొసంగియే యున్నారు. ఆవిషయమున నుభయవాదులకు నభిప్రాయభేదమున కవసరము లేనట్లు తోఁచుచున్నయది. ఇది నిక్కమైనయెడల నావిషయమునఁ జర్చలను మానుకొందురుగాక యని యుభయపక్షములవారిని బ్రార్థించుచున్నాఁడను. ఇంకొక్కవిషయమీసందర్భమునఁ జెప్పవలసియున్నది. క్రిందితరగతులయందలి బాలురకుఁ బాఠకగ్రంథములను వ్రాయుటలోఁ బదములను సులభమయిన వానిని వాడుట వలన సుబోధత్వము గలుగును గాని కఠినపదములను గ్రీక్కుమిత్తులలోవలె వాడి సంధులు పనిఁబూని తప్పని సరిగా మానుటవలన సౌకర్య మేర్పడదు. 'చీమ అక్కడ ఉన్నది' అని బాలునకుఁ జెప్పి చదివించుటకంటె 'చీమ యక్కడ నున్నది' యని చెప్పి చదివించుట కష్టతరము కాదు కాని 'పిపీలికము ఆస్థలమున స్థితమై ఉన్నది' యని చెప్పి చదివించుట దుష్కరముగా నుండును. సులభమైన పదములతో సుకరమైన సంధులతోఁ గ్రిందితరగతిబాలురకుఁ బొత్తములు వ్రాయింపవచ్చును. కొంతజ్ఞానము కుదిరి విద్యార్థి తగినస్థితికి వచ్చినపుడు వ్యాకరణమును జెప్పి యీయీసంధిరూపము లేల కలిగినవో వాని హేతువులను బిమ్మట బోధించెదరుగాక. మొదటనే రూపము నిష్పత్తిచేసి చెప్పుమని యెవ్వరును నిర్బంధించుటలేదు! మొన్నను వారు వ్యాకరణవిషయమై ముచ్చటించుచు వర్తమానకాలమునఁ జిన్నయసూరి వ్యాకరణములో రెండు మూరల పొడవుగల నిర్వచనము నిచ్చియున్నాఁడు. అది యెంతయు నెవరికిఁ గావలెను. 'గుంటళ్లకి Present tense అని చెప్పేస్తే తెలిసిపోతుంది' అని కాలమును బోధించుట కొక యతిసులభమైనరాజమార్గమును సయుక్తికముగా నెల వొసంగియున్నవారు. మహనీయులారా! ఎంతసమంజసమయినయూహ యో చూచితిరా? వారందఱుఁ బిల్లలకు భాష సుబోధముగా నొనరించుటకై పాటు

పఱుమహానీయులుగా నున్నారు. అన్నిటను బరమపూజ్యులము, భాషారహస్యములును మర్మములును గనిపెట్టిన కుశాగ్రబుద్ధులము, మామతమును విడిచి వెఱ్ఱులయి యేలచెడిపోయెదరు. అని మేఘగంభీరవాక్యములతో ముచ్చటించి యున్నారే! ఏ లేబాలునికి వర్తమానకాల మనిన 'Present tense' అని బోధించి వర్తమానకాల మిది యని తెలుపఁగలిగిరో కదా! అట్లయిన 'నీరు' అనిన మనకుత్తరహాంద్రుఁడను దెలియనిచో Aqua అనియో 'పానీ' అనియో 'వాట' రనియో తెలిపిన సుకరముగాఁ దెలియు ననినం దప్పేమి? ఇట్టివి గదా మీరు కనిపెట్టిన నూతనసుకరమార్గములు! వీనివలనఁ గదా మనబాలు రేకసంథాగ్రాహులు గాఁగలుగుట! ఈమార్గములవలననే కాదా మన తెలుఁగుదేశమువా రందఱుఁగూడ నొక్కుమ్మడి గురుబోధఁగూడ నపేక్షింపక గ్రంథకర్తలు గాఁగలుగుట! ఇది వెఱ్ఱి గాని సహేతుకమైనవాద మగునా? ఇట నొకప్రశ్న వేయవచ్చును. 'Present tense' అని చెప్పినఁ దెలియదని హేళనము చేయుచున్నావే, చిన్నయసూరి యిచ్చిననిర్ణయమును బట్టి వర్తమానకాల మిట్టిది యని బాలురకు నీవు బోధింపఁ గలుగుదువా?" యనినఁ జిన్నయసూరివ్యాకరణమునందలి నిర్వచనము మన మక్షరములు చెప్పినప్పుడే పిల్లవానికిఁ జెప్పుట కేర్పడియుండలేదు. దానిం గ్రహింపఁ గలిగినస్థితికి వచ్చినపుడే దానిం జెప్పవలెను. అప్పుడే యందలి సారస్యము నాతఁడు గ్రహించి యానందించును. నిర్వచనము కావలసినప్పు డట్టి కష్ట మవసర మగును. అందు నది పారిభాషికపదనిర్వచనము రూపములచేతను బ్రయోగములచేతను వర్తమానకాల మన నిట్టిది యని తెలియవచ్చును గాని దాని స్వరూపమును నిర్వచింపవలసివచ్చినపుడు కష్టముతప్పక కలుగును. ఇందుకుఁ దార్కాణముగా హూణభాషనుండి యొకయుదాహరణమును దీసికొందము. 'Matter' అనుపద మొకటి మనము హూణవిద్యాభ్యాసము ప్రారంభించిన కొన్ని నాళ్లనుండియు వినుచుందుము. వ్రాయుచుందుము. మనకర్థ మగుచునే యుండును. పైతరగతు లనఁగ Matriculation తరగతిలోనికిఁ బోయినపుడు 'Matter' అనుదాని నొకవిధముగ నిర్వచించుదురు. పిమ్మట బి. యే. తరగతిలోనికిఁ బోయినపు డొక్కొక్క రొక్కొక్కరీతిని 'Matter' ను నిర్వచించియున్నారు. నానాఁటికి దానినిర్వచనము మాఱుచున్నది. చిట్టచివరకు 'Matter' అనఁగా 'చలనము' అని నిర్వచించెడు స్థితికిఁ బదార్థవిజ్ఞానశాస్త్రములు వచ్చియున్నవి. ఇన్ని పాళ్లల 'Matter' అంటే బొట్టెళ్లిట్టె గట్టెక్కుతారు. అని Scientists

శాస్త్రవేత్తల శ్రమ లన్నియుఁ ద్రుటికాలములో నిరసించి త్రోసిరా జనవచ్చును గదా! సోదరులారా! జనబాహుళ్యముతో సంబంధించినవిషయములను జర్చించునపుడు కడు మెలఁకువ గలిగి వర్తింపవలెఁ గాని వినోదకథనముగా యోజింపరాదు. ఈపదిదినములనుండియుఁ జరగినచర్చలలో ననేకవిధములయిన వాదములును బ్రతివాదములును జరగినవి. ఒకరినొకరు సమానముగా నన్నిరసములలోను నధిక్షేపించుకొనినారు. తేలినపర్యవసాన మేమనిన వ్యావహారిక భాషావాదు లిప్పటివఱకు శాంతనిద్రయం దున్న యాంధ్రభాషాభిమానులను బెద్దధ్వనులుచేసి మేలుకొల్పినారే కాని యంతకంటెఁ జేసిన దేదియును లేదు. వారిక్రొత్తమత మిదమిత్థ మని చెప్పుటకు వారిప్రమాణ మేదియో ప్రజలకు సుస్పష్టముగఁ దెలిపియుండలేదు. వాడుకభాష యనఁగఁ గొన్నిజాతులవారి వాడుకనే యంగీకరించి యితరులను విడనాడుట కేమిహేతువో నిర్ధారణము చేయలేదు. తాము పెట్టఁబోవు క్రొత్తమతమువలన భాషకుఁ గలుగు లాభములను బ్రస్ఫుటముగా వాకొని యుండలేదు. Phonetics వలనఁ గలిగినరూపమెల్ల వ్యాకరణసిద్ధమే యనుకొను ప్రమాదమునకు లోనయినారు. దానివలన రసవాదశాస్త్రమును వైద్యశాస్త్రమునుగా భ్రమించినట్టును జరిత్రమును ధర్మశాస్త్రముగా భ్రమించినట్టును హానికలుగుచున్నదని తోఁచుచున్నది. వారి కధికారసాహాయ్యముండుటచే ననాలోచితముగా వేగిరపడి బడిపిల్లలకు హానికరమైన స్వేచ్ఛ నొసంగినారు. ఇందుకు వారికిఁ గలిగిన దురభిప్రాయమున కొకకారణము గోచరించుచున్నది. ఇప్పుడు బి. యే. పరీక్ష Pass అయినవారు హూణభాషను వ్రాసినంత సుకరముగను నిర్దుష్టముగను స్వభాషయయిన తెలుఁగుభాషను వ్రాయలేరనునభిప్రాయ మని తోఁచుచున్నది. దీనికిఁ గారణ మేమనిన:—హూణభాష రాజభాషయై జీవనోపాధిని గల్పించునదై యుండుటచేత దానియందు మన మెక్కువ కృషిచేయుచున్నాము. పాఠశాలలయందు హూణభాష కెక్కువ ప్రాముఖ్యమును మాతృభాషకుఁ దక్కువప్రాముఖ్యము నీయఁబడి యున్నది. చరిత్రము, భూగోళము, క్షేత్రగణితము, బీజగణితము, పదార్థవిజ్ఞానశాస్త్రము, రసవాదశాస్త్రము, మున్నగువాని నెన్నింటినో చదువుచున్నాము. భాషాగ్రంథము లనేకములను బ్రతిభాశాలులయిన విమర్శకులు రచియించిన విమర్శనముల సహాయముతోఁ జదువుచున్నాము. ఈరీతిని గూలంకషముగా హూణభాష నభ్యసించుచున్నాము. ఇఁక మన తెలుఁగుభాష నెట్లుచ

దువుచున్నా మనిన వ్యాకరణము చెప్పుట లేదు. 4,3 పాత్రములలోఁ గొన్ని యాశ్వాసములో ప్రకరణములో పరీక్షకుఁ బఠనీయములు. వానిని మనము శ్రద్ధగానైనఁ జదువుట లేము. తెలుఁగున కేర్పడిన కాలమును విశ్రాంతికాలముగా నుపయోగించుకొనుచున్నాము. ఉపాధ్యాయులు నంతశ్రద్ధతోడనే చెప్పుచున్నారు. వారు చెప్పుచున్న దానినైనను మనము శ్రద్ధతో వినము. అట్లయినను తెలుఁగు మనస్వభాష గనుక దానియందుఁ దప్పిపోయినవా రత్యల్పసంఖ్యాకులుగాఁ గాన్పించుచున్నారు. ఏమాత్రముశ్రద్ధతో నయిన నుపాధ్యాయులు చెప్పినపాఠమును వినినవారు మొదటితరగతియందుఁ గృతార్థులగుటయు నుండును. మొదటివారుగా నుండఁగలుగుటయును మనము చూచుచున్నాము. అట్టివారు గ్రంథములను రచియించుచున్నారు. చక్కనినాటకములను వ్రాయుచున్నారు. భాషాంతరీకరణములను గావించుచున్నారు. ఒకవంక బయలుదేఱిన విజ్ఞానచంద్రికాగ్రంథమాలను, వేఱొకకడ బయలువెడలిన యాంధ్రప్రచారిణీగ్రంథమాలను, బందరుపురమున నున్న యాంధ్రభాషాభివర్ధనీగ్రంథమాలను, దూర్పున నుదయించుచున్న వేగుఁజుక్కగ్రంథమాలను వ్రాయుచున్నవా రెవ్వరు? తెలుఁగు వ్రాయలేనివారా? వేనవేలు గ్రంథము లమ్ముడుపోవుచున్నవి. కొనువారికిఁ దెలియకున్న గ్రంథము లేల యమ్ముడువడును. బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి నాటకములలోఁ గొన్ని పదునాఱువేలప్రతు లమ్మకమయినవఁట. ఇది యెంత యుత్సాహకరము! వారు గ్రాంథికశైలిలో వ్రాసిరా గ్రామ్యభాషలో వ్రాసిరా? ఇది యంతయును భాష కుత్సాహకరముగా నుండలేదా! కృష్ణదేవరాయలకాలమును స్మరణకుఁ దెచ్చుటలేదా? కృష్ణదేవరాయల కాల మనిన మననూతనమతమువారిలో నొకరైన శేషగిరిరావుపంతులు M. A. గారు సెలవిచ్చిన యొకమనోహరవాక్యము జ్ఞప్తికివచ్చినది. "ఆ కాలములో శత్రుభయ మెక్కువగా నుండి యిఁకనో యిప్పుడో శత్రువులు వచ్చి పయిఁబడ నున్నారు. జీవనము క్షణభంగురము గావున నింతలోనే సంతోషమును ఏలయినంతవఱ కనుభవింపవలె నని రసభూయిష్ఠము లయినప్రబంధము లప్పటికవులు వ్రాసినా" రని వారిశాస్త్రజన్యజ్ఞానమును జరిత్రాభిజ్ఞతయుఁ దేటపడ నొకవాక్యరాజమును సెలవిచ్చి యున్నారు. ఎంత చక్కనియుక్తియో యెంత రసవంతమైన యోజనయో చిత్తగింపుఁడు. శత్రువు వచ్చి శిరస్సు ఖండింపనున్నపు డలసానిపెద్దన్నగారు "ప్రాంచద్భూషణబాహుమూలరుచితో" నని శృంగారరసభూయిష్ఠముగాఁ బద్యములను వర్ణింపఁ బ్రారంభించినా రఁట! అహా! కవిత్వము చెప్పుట కెట్టి తరుణముండవలయునో పంతులవారు చక్కఁగాఁ గనిపెట్టఁగలిగిరి కాని యాయలసాని పెద్దనమాత్ర మట్టియాపత్సమయము కవితారచనకుఁ దగినసమయ మని చెప్పియుండలేదు. "నిరుపహతిస్థలంబు రమణీ

ప్రియదూతిక దెచ్చియిచ్చుక। ప్పురవిడె మాత్మ కింపయినభోజన ముయ్యాలమంచ మొప్పుత। ప్పరయురసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్” అనియీ రీతిని మనస్సు వికాసమునొంది మిక్కిలియుల్లాసముగా నున్నసమయము కవిత్వమునకుఁ దరుణ మని చెప్పినాఁడు కాని ప్రాణోత్క్రమణకాలమును గవితారచనకు సుముహూర్తముగా నేర్పఱచుకొని యుండలేదు. ఇఁక నిప్పుడు గ్రామ్యభాషయందు గ్రంథములు రచియించు పెద్దన్నలకుఁ గత్తి నెత్తిని బెట్టినప్పుడే కాని రస ముత్పత్తిల్లదేమో! Phonetics శాస్త్ర మీవిషయమై యిట్లు చెప్పునేమో. ఆశాస్త్రము నాకుఁ దెలియదు. కావున వారివాక్యరాజముయొక్క ప్రాశస్త్యమును నేను గ్రహింపఁజాలకుండుటయే కాక యిది వట్టి తప్పుటూహయనియు నేవో పెద్దపెద్దమాటలు చెప్పి భాషయొక్క చరిత్రమును మేము పరిశోధించుచున్నా మనియు నూతనమార్గములను గనిపెట్టుచున్నా మనియు శ్రోతలను బరిభ్రమింపఁజేయుటకుఁ జెప్పిన నిరర్థకవాక్య మని చెప్పవలసి వచ్చినందులకుఁ జింతిల్లుచున్నాను. “ప్రమాదో ధీమతామపి” యని యున్నది గదా! ఇట్టిస్వల్పవిషయములలోనే వీరిశోధన లిట్టివిపరీతఫలప్రదములుగా నున్నవే? వీరిని బ్రమాణముగాఁ బెట్టుకొని వీరియాజ్ఞకాఁగానే కోట్లకొలఁది యాంధ్రజనులక్షేమముతోడను గౌరవముతోడను సంబంధించియున్న భాషాశాసనములను జర్చింపకుండ విమర్శింపకుండ మార్చివేసికొనవలయునా? ఈరీతి దుడుకుఁజేఁతలు సేయుచు నిదివఱలో నొకవక్త తెలిపియున్నరీతిని భాషాభవనమున కనలమంటించి, పైఁగా గ్రాంథికవాదులు మమ్ముఁ జేరనిచ్చుటలేదు, మామాటలను వినుటలేదు, మావాదమును వినకుండనే మామీఁద నపనిందలు వేసినారు, అని లేనిపోని కల్లబొల్లి మాటలచేఁ బ్రజలకుద్రేకము గలిగింప యత్నించుచున్నారు. తమవాదమును గ్రాంథికవాదులు వినుటలే దనునది కల్ల. గ్రాంథికవాదుల పరిషత్పత్రికలలోనే యించుమించు ప్రతిదానియందును వ్యావహారికభాషావాదులు తమవాదమున కనుకూలమైన వ్యాసములను బ్రకటించుచున్నారు. ఒకదానియందు గిడుగు రామమూర్తిగారు ప్రాఁదెనుఁగుఁగమ్మను వ్రాసినారు. ఒకదానియందు రాయఁడుశాస్త్రులుగారు వ్యాసము వ్రాసినారు. ఇంకొకదానియందు మొన్నటియుపన్యాసకులలో నొక రగు సీతారామశాస్త్రులవారు వ్రాసియున్నారు. ఇది గ్రాంథికవాదుల యుదారబుద్ధిని నిష్పక్షపాతబుద్ధిని దెలుపుచుండఁగా మాయభిప్రాయములను వారు తెలుపుకోనిచ్చుటలే దని యసత్యవాక్యములు సభాముఖంబునఁ బల్కుట సమంజస మగునా? పరిషదుత్సవము జరిగినదినములలో గ్రామ్య గ్రాంథికచర్చ జరిగి యందు ‘వోట్లు’ తీసికొనఁబడి యొక్కపక్షమున నేఁబదికంటె నెక్కువగను రెండవపక్షమున నాలుగైదును వచ్చియుండఁగాఁ దమవాదమునకు జయము కలుగలేదని పైని జెప్పినరీతి నప

నిందలను గ్రాంథికవాదులపైఁ బ్రకటించుట యేశాస్త్రసమ్మతమో తెలియరాకున్నది. ఆస్వరము లట్లు పలికిన వని స్వరశాస్త్రమునే శరణు వొందవలయును. ఇంకొక పరిహాసపాత్రమైన వాక్యమును గూడఁ గళానాథులయిన శేషగిరిరావు పంతులవారు నిరాఘాటముగా సభాముఖమునఁ జెప్ప సాహసించి యున్నారు. అది యేదియనిన: పరీక్షాధికారులు బాలుర నెట్లయినఁ దెలుఁగులోఁ గడతేర్ప వలయు నని వారు ప్రశ్నలకు సరియయినయుత్తరములను వ్రాయఁజాలకున్నను బరీక్షయందుఁ దప్పిపోవుదురేమో యనుభీతిచే సరిగ pass అగుటకుఁ గావలసినన్ని మార్కులను మాత్రము దయదలఁచియిచ్చుచున్నా రనియు నందుచేతనే తెలుఁగునఁ దేఱినవారి కందఱకు నలుబది ప్రాంతముననే మార్కులుగాన్పించుచున్న వని యును. ఇది యెంత తప్పుమాట! అన్నివిధములచేతను బ్రమాదపూరితమైయున్నది. ఏ మనిన:— మొత్తముమార్కులలో నెన్నిమార్కులను సామాన్యవిద్యార్థి తెచ్చుకొనఁగలిగి యుండునో యాసంఖ్య కృతార్థతకుఁ గావలసిన యత్యల్పసంఖ్యగా నియమము చేయుదురు. అందుకుఁ దక్కువసంఖ్య మార్కులు వచ్చినవారలు తప్పినవారుగాను ఆసంఖ్యను సంతకంటె నధికముగను దెచ్చుకొనఁగలిగిన వారలు కృతార్థులుగాను బరిగణింపఁబడుదురు. నూటికి కఱువది డెబ్బది తెచ్చుకొనఁగలవారిని మొదటితరగతియందుఁ దేఱిన ట్లెంచెదరు. సామాన్యవిద్యార్థి కెప్పుడును Minimum number నియమింపఁబడిన యత్యల్పసంఖ్యకు సమీపించినమార్కులే వచ్చుట తెలుఁగునందే కాక యన్నివిషయములయందునుగూడనట్లే యుండును. పంతులుగారికిఁ బ్రస్తుతపుఁ దెలుఁగునందు సవతితల్లి ప్రేమగనుక యట్టి సారాంశమును దానింబట్టితీసిరి. తక్కినవిషయములందు మార్కు లెట్లు వచ్చినవో యవి కూడ నిచ్చి తారతమ్యవిచక్షణ చేసి చూపించిన నొకవిధముగ న్యాయముగా నుండునేమో. అదియు నుజేయ నొల్లరైరి. పైగాఁ బరీక్షకులయందుఁ గూడని నిందను గూడ నారోపించిరి. కొంచె మించుమించు వారికంతరాత్మ లేదనునట్లు సూచించిరి. సరియైన సమాధానములు వ్రాయకున్నను బాలురకు మార్కు లిచ్చుటకు వారియంతరాత్మ యంగీకరించునా? లేక యొక్కొక్కవిషయమును దిద్దునప్పు డొక్కొక్కరీతి యంతరాత్మ యుండు నని Phonetic conscienceస్వరాంతరాత్మవంటి క్రొత్తయంతరాత్మ యేదయిన నూతనపరిశోధనలవలన నేర్పడినదా! ఈసంశయము తీరవలసియున్నది. లేనియెడలఁ దమవంటి పరీక్షకులపై నిట్టినిందారోపణము చేయుట పంతులవారివంటి నాగరకులకుఁదగదు. వారు ప్రతివ్యాసమునందును 'నాయనుభవమును మీకు బోధించుచున్నాను. దానింజూచి బాలురారా! మీరు బాగుపడుఁడు' అని తమయనుభవలాభమును విద్యార్థులపై శ్రోతలపై వెదఁజల్లుచున్నారు. ఇట్టి యంతరాత్మల యనుభవమువలన మనబాలురకుఁ గలుగనున్న మేలు చెప్పనక్కఱ లేకయే తెలి

యుచున్నది. ఆత్మస్తవము పరనిందయు లేని మహానుభావు లనిన వీరలే కదా! నిష్పాక్షికబుద్ధియన నిట్లుండవలెనుగదా! వీరింబట్టి యాంధ్రభాష సంస్కరింపం బడవలసినదా! పాఠకులార, యోజింపుఁడు! కర్తవ్యము నాచరింపుఁడు!

ఈయంతరాత్మసందర్భముననే చిన్న నాచార్యులవారు సెలవిచ్చిన Phonetic conscience స్వరాంతరాత్మ విషయమై యొకమాట చెప్పుకొందము. 'చేత + ఉన్నది' యనునప్పుడు వక్తయొక్క Phonetic conscienceలో 'న' కార మున్న 'చేతనున్నది' యని యగు ననియు, లేకున్న యెడల 'చేతయున్నది' యని యగుననియు, నందులో నకారము యకారముగూడ లేకున్నచో 'చేతు న్నది' యని యగుననియు నూహింపవలసియున్నది. దీనింబట్టి వక్తనుబట్టి యంతరాత్మ మాఱునట్లు తోఁచుచున్నది. అందుచే వక్త కొకరీతి నాగమములు రావచ్చును. కొందఱ Conscience లో నగాగమము, కొందఱియందు వగాగమము, కొందఱియందు 'య', కొందఱియందు 'ల' యీప్రకార ముండవచ్చును. కాఁబట్టి వక్త కొకరీతి వ్యాకరణసూత్రములను వ్రాయవలయును. ఇంక నంద ఱకును దెలియుటకై యేర్పర్పఁబోవు సులభమార్గమనిన గ్రామ్యభాష క్రమముగా నెట్టిరంగులోనికిఁ దిగుచున్నదో చూడుఁడు. Phonetic conscience కల దనుట తప్పుకాదు. దానింబట్టి యాగమములును మాఱవచ్చును. అందే యాగమములను మనము గ్రహింపవలెను? నియమ మేర్పఱచుకొనని యెడల వ్యవస్థయుండునా? సామాన్యబోధకు సాధ్యమగునా? నీతితో సంబంధించిన Conscience కుఁగూడ భేద ముండును గాని లేకపోదు. అందుచేతనే నీతిశాస్త్రజ్ఞు లెవరి యంతరాత్మ వారికిఁ బ్రమాణ మనక సంఘధర్మముల కనువుపడుటకై యొక నీతిశాస్త్రము నేర్పఱచి యుంచినారు. లేనియెడల నాయంతరాత్మ యిట్లుచెప్పుచున్న దని మనుజుఁ డేమిచేసినను జేయవచ్చునే! అట్టిస్వేచ్ఛ సాంఘికశాంతికి హానికరమగునే! అట్లె యెవరి Phonetic Conscience వారి దని,ఎవరి Phonetic Conscience వారికిఁ బ్రమాణముగా నంగీకరించు నెడల భాషానీతి చెడి భాషకు ముప్పు గలుగును గాన మీరు సెలవిచ్చెడు Phonetic Conscience లన్నియు విమర్శించి గ్రాహ్యములయిన Consciences ఏవో నిర్ణయించి నేమము నేర్పఱచి చూపుఁడు. ఊరక పెద్దమాటలు చెప్పి వ్యామోహమును గలిగింపఁ బూనినఁ బ్రయోజనము లేదు. సారాంశముల నేర్పఱచుకొని విషయములను జర్చించి పూర్వపక్ష సిద్ధాంతములను జేయుఁడు. కాని మనపక్షమువారు మాటలాడునపు డెదుటి పక్షమువారు నిశ్శబ్దముగాఁ జెవియిచ్చి వినియున్నను నెదుటివారు మాట లాడుట ప్రారంభింపఁగనే వక్తలను గలవరపెట్టి మానస్తిమితము చెఱుపుటకై వానిం గలఁత జెందుటకై యావేశముతోఁ బామరులవలె వర్తించుట ధర్మము

కా దని తెలిసికొనుఁడు. ఇది నేనాచార్యులవారి నుద్దేశించి చెప్పినమాట గా భావింపవల దని వారిని వేఁడుచున్నాఁడను.

ఈరీతిగా యుక్తులపై యుక్తు లుంచుచునే యుండును. పనితోఁ బనిలేదు. శ్రేయస్కరమైన వాదమునకు జయము కలుగవలెను. అది కాని దపజయము నొందవలయును. అని యుద్దేశించియే మనము చర్చచేయవలయును గాని వారు గెల్తురా మనము గెల్తుమా యను పట్టుదల లనవసరము.

వ్యావహారికభాషావాదులు మనల నందఱను మేలుకొల్పినా రని పైని చెప్పి యుంటిని. మేల్కొని మన మేమిచేయవలయును? మరలఁ బ్రక్కలు సవరించుకొని శయ్యఁ జేరవలసినదా లేక మేల్కొనినందుల కేమయినఁ బ్రయోజన కరమైన కార్యమును జేయవలసినదా? మనముగాక తక్కిన యన్ని పట్టణములవారును భాషాసేవ చేయుచున్నారు. భాషాసేవకై సమాజము లేనిపత్తనము మనదొక్కటియే యని చెప్పుటకు సిగ్గగుచున్నది. Literary Association అని మనసమాజమునకుఁ బేరు పెట్టుకొని యున్నాము. దీనిని సార్థకముచేసికొనెదమో లేక వేఱుగాఁ నొకసమాజము నేర్పఱచుకొనియెదమో మనమును భాషాసేవకై నడుములు కట్టనియెడలఁ దోడివారిలో హాస్యాస్పదుల మగుదుము. పనిచేయఁ బ్రారంభించిన మనకు సౌకర్యము లనేకము లీపురమునఁ గలవు. విద్యలను బోషించుటకుఁ గంకణముకట్టుకొని దేశదేశంబులఁ దన యౌదార్యరసప్రవాహముచే ముంచివేయుచున్న శ్రీపీఠికాపురాధీశ్వరుఁడు మనకుఁ బ్రక్కనున్నవాఁడు. విద్యలభోజుఁ డనఁదగి చిరకాలమునుండి సరస్వతీపోషణమును మహాకవిపోషణమును జేయుచున్న శ్రీపోలవరసంస్థానాధిపతి మన నడుమ నున్నాఁడు. దిగంతవిశ్రాంతకీర్తిమంతుఁడు తిరుపతి కవీశ్వరుఁడు మన చెంగట నున్నాఁడు. పురాణవిద్యావిశారదు లయ్యును తెలుఁగుభాషయందుఁ బ్రజ్ఞానిధు లయినప్రకాశరావుగారు నాగభూషణముగారు మున్నగు మహనీయు లున్నారు. బ్రహ్మయ్యశాస్త్రులుగారు మున్నగువిమర్శకులు వక్తలు నున్నారు. ఔదార్యమునకు వన్నెకెక్కిన శేషగిరిరావుపంతులుగారు, సూర్యనారాయణమూర్తిగారు ప్రభృతిపౌరజనులు గలరు. ఇట్టి వీరందఱును స్వభాషాభివృద్ధివిషయమునఁ బనిచేయుట కొకమార్గము నేర్పఱచి కాకినాడకుఁ దోడిపట్టణములయం దున్నతస్థానము నొసంగఁ బ్రయత్నించెదరు గాక యని ప్రార్థించుచు విలువగలిగిన మీకాలము నింతవఱ కాక్రమించుకొని శ్రమకలిగించినందులకు మన్నింపవేఁడుకొనుచు నింతటితో విరమించుచున్నాను.

ఓంతత్సత్.

నండూరి మూర్తిరాజు.

హిందువుల జ్యోతిశ్శాస్త్రము.

మనయార్యులగణితశాస్త్రముల గుఱించి విచారించునపుడు వారు కర్మానుష్ఠానపరాయణు లనియుఁ, గర్మానుష్ఠానమునకు సంకల్పాదులును గాలనిర్ణయములు నావశ్యకములనియు, నందుచే వారుజ్యోతిశ్శాస్త్రమునఁ(Asteonomy) బరిశ్రమ పడుచుండి రనియు నితఃపూర్వపు వ్యాసములలోఁ జూచియుంటిమి. ప్రకృతము వారు జ్యోతిశ్శాస్త్రమున నెంతపరిశ్రమపడి రనియు, వారిపరిశ్రమ యెంతవిశ్వసనీయ మనునదియు విచారించెదము.

"ఆర్యభటీయ" మునకు మునుపే మనదేశమున నష్టాదశసిద్ధాంతగ్రంథము లుండిన వనియు, వానిలో "పారాశర్య" ము ప్రాచీనతమ మనియుఁ గొన్ని గ్రంథములచేఁ దెలియుచున్నను, వానిలో నొక్కటియు సాంగముగ నిప్పుడు దొరకకున్నది. "సూర్యసిద్ధాంత" మని యిప్పుడు ముద్రితమై యున్నగ్రంథము ప్రాచీనాష్టాదశ గ్రంథములలోని "సూర్యసిద్ధాంత" ము కా దనియుఁ, గొన్నిశ్లోకములు మాత్రమాగ్రంథమునుండి యిచటఁ జేరియున్న వనియు విమర్శకులయభిప్రాయము. ఏది యెటు లున్నను, మనయార్యులు ఋగ్వేదకాలము నుండియు జ్యోతిశ్శాస్త్రమును వృద్ధిపఱుప నారంభించి రని మాత్రము నొక్కి చెప్పవచ్చును. ప్రస్తుత మీవ్యాసమున నచ్చటచ్చట నుదహరింపఁబడు శ్లోకములు ప్రాయికముగ "సూర్యసిద్ధాంత" మునుండియుఁ "నార్యభటీయ" మునుండియుఁ గైకొనఁబడినవి.

మనము నివసించియుండు భూమిని గుఱించి విచారించియే పిదప నితరగ్రహముల గుఱించి విచారింపవలయుఁ గాన, ప్రథమమున భూవిషయకచర్చను స్వీకరించెదము. భూమి గోళాకృతిగ నున్న దని యిక్కాలమున నెల్లరకుఁ దెలిసినదియే. అయినను బ్రప్రథమమున నీయంశమును గనుఁగొనుట మిగుల శ్లాఘనీయము. "సూర్యసిద్ధాన్త" మున నీవిషయమై

అల్పకాలతయా లోకాః స్వస్థానాత్ సర్వతోముఖం।
పశ్యన్తి వృత్తామప్యేతాం చక్రాకారాం వసుంధరామ్॥

[అల్పశరీరు లగుటచే జనులు సర్వతోముఖవృత్తమైన (Spherical) భూమిని జక్రాకారముగ నుండునట్లుచూచెదరు] అనియున్నది.

భూమి యాదిశేషుని శిరస్సుపైని, దిగ్గజములభుజములమీఁద నున్న దనుపౌరాణికులవాక్యముల నిరాకరించుచు-

మధ్యే సమంతా దండస్య భూగోళో వ్యోమ్ని తిష్ఠతి ।
బిభ్రాణః పరమాంశక్తిం బ్రహ్మణో ధారణాత్మికామ్ ॥

అని వ్రాసియుండుటచే భూమి నిరాధారమయి యాకాశమున నిలుచుచున్నట్లు గ్రంథకర్త దృఢముగ నమ్మియుండె నని చెప్పవచ్చును. భూమి యచలము కాదనియుఁ దనంతట దాను భ్రమణము చేయుచున్న దనియు నార్యభటుఁడే ప్రథమమునఁ గనుఁగొనెను. ఈయంశము నీక్రింది సదృష్టాంతముగ నీతఁడు నిరూపించుచున్నాఁడు.

అనులోమగతిః నౌస్థః పశ్యత్యచలం విలోమగం యద్వత్ ।
అచలాని భాని తద్వత్ సమపశ్చిమగాని లంకాయామ్ ॥

(ఒకనావలో నెక్కిపోవువాఁడు తీరమున నుండు వృక్షాదుల నెట్లు మఱి యొకవైపునఁ బోవురీతిగఁ జూచునో, ఆవిధముననే లంకలోని జనులు స్థిరమగు నక్షత్రాదులను బశ్చిమముఖముగఁ బోవునట్లు చూచెదరు)

ఇచ్చట స్థలనిర్దేశమునకై 'లంక' యని యున్నది కాని, భూమండలము నెచ్చోటఁ జూచిన నిటులే యుండు నని భావము. ఇంతకంటె భూభ్రమణము నకు వేఱునిర్ధారణ మావశ్యకమా ?

బ్రహ్మాండమధ్యమున భూమి యుండునటులును, దానిచుట్టుఁ గ్రమముగఁ జంద్ర, బుధ, శుక్ర, సూర్య, కుజ, బృహస్పతి, శనైశ్చరులు తిరుగుచుండునటు లును, మనయార్యు లభిప్రాయపడి యుండిరి. ఆర్యభటుఁడు నీయభిప్రాయ మునే కలిగియుండెను. వానివ్యాఖ్యాతయయిన కేరళవర్మమాత్రము "అర్కా-చ్ఛమండలార్ధే భ్రమతిహి తస్మిన్ క్షితిచ్ఛాయా" అనియు "కుజగురుకోణా శ్చైవం శీఘ్రోచ్చేనాపి బుధశుక్రౌ" అనియు నాతనిశ్లోకములఁబట్టి భూమి సూర్యునిచుట్టుఁ దిరుగుచున్న దనియు, బుధశుక్రులకక్ష్యలు (Orbits) భూకక్ష్యలోపల నున్న వనియు నార్యభటునికిఁ దెలిసియుండె నని వ్యాఖ్యానముచేసి యుండునట్లు శ్రీయుత రామలింగపిళ్లెగారు కొన్ని సంవత్సరములక్రిందట "ఇండి యన్ రెవ్యూ"(Indian Review)పత్రికలోఁ బ్రచురించిరి. బాగుగఁ బరిశీలించి నచో నార్యభటుని కీయభిప్రాయములు లేవనియే తెలియుచున్నది. కేరళవర్మ

యభిప్రాయములే యార్యభటునివాక్యమునఁ బ్రతిబింబితములై వెలువడిన వని చెప్పవలసియున్నది. ఆర్యభటున కీవిషయము తెలిసియుండిన దని చెప్ప నలవి కాకున్నను, ఆర్వాచీనసిద్ధాంతులకుఁ దెలియు ననియే చెప్పవచ్చును.

భూవ్యాసమును (The diameter of the Earth) గుఱించి యార్యభటుఁడు "ఞిలాభూ వ్యాసః" అని వ్రాసియున్నాఁడు. అనఁగా భూవ్యాసము 1050 యోజనములు కల దని యభిప్రాయము.

[ఇచట "ఞిల" యనుసంకేతముచే 1050 అని తెలియఁజేయఁబడి యున్నది. ఆర్యభటుఁడు గణితశాస్త్రజ్ఞులు సాధారణముగ నుపయోగించెడు సాంకేతికాక్షరములఁ గైకొనక స్వయముగ నొకసంకేతమును నిర్మించి దానినే కైకొని యున్నాఁడు. క, చ, ట, త, పాదివర్గాక్షరము లిరువదియైదును క్రమముగ 1, 2, 3...25లను దెలియఁజేయుననియు; య, ర, ల, వాద్యష్టాక్షరములు 30, 40...100లను దెలియఁజేయు ననియు; అ, ఇ, ఉ, మొదలగునవ స్వరములలోఁ బూర్వపూర్వముకంటెఁ బరము నూరింత లధికమనియు నేర్పఱచుకొనెను. అనగా, క=1, కి=100, కు=10000..., ఖ=2, ఖి=200, ఖు=20000... అని క్రమముగనూహించునది. ప్రస్తుతము "ఞిల"=ఞి + ల=1000 + 50=1050 అని యర్థము. ఇటులే చతుర్యుగమున సంవత్సరసంఖ్యలను "ఖ్యుఘృ" అను సంకేతముచేఁ దెలియఁజేసియున్నాఁడు. "ఖ్యుఘృ"=ఖు + యు + ఘృ=200,00 + 30,00,00 + 400,00,00=432,0000 (కృతయుగము=1,728,000; త్రేతాయుగము=1,296, 000; ద్వాపరయుగము=834,000; కలియుగము=432,000; మొత్తము=432,00,00)]

భూవ్యాసము 1050 యోజనము లనఁగా 1050 + $\frac{15}{2}$ మైళ్లు అని యర్థము. ఆధునికులచే నిర్ధరింపఁబడియున్న, భూవ్యాసము 7912 మైళ్లు. దీనికి నార్యభటునిచే నిర్ధారితమయినదానికిఁ గలస్వల్పవ్యత్యాసమును దలంచినయెడల నెవ్వరికైన నాశ్చర్యము కలుగకుండునా?

భూమియొక్క యుత్తరభాగమున దేవత లుందు రనియు, దక్షిణభాగమున నసుర లుందు రనియుఁ జెప్పి, వారిపరస్పరదినమాన విషయమయి "సూర్యసిద్ధాన్త" గ్రంథకర్త యిటులు వ్రాసియున్నవాఁడు.

మేషాదౌ దేవభాగస్థో దేవానాం యాతి దర్శనమ్।
అసురాణాం తులాదౌతు సూర్య స్తద్భాగసంచరః॥

మేషాదా వుదిత స్సూర్యః త్రీన్ రాశీన్ ఉదగు_త్తరమ్ ।
సంచరన్ ప్రాగహర్మధ్యం పూరయే న్మేరువాసినామ్ ॥
కర్కాదీన్ సంచరన్ తద్వత్ అహ్నః పశ్చార్ధమేవ సః ।
తులాదీం స్త్రీన్ మృగాదీంశ్చ తద్వదేవ సురద్విషామ్ ॥

[మేషరాశిమొదలు సూర్యుఁడు విషువద్వృత్తమునకు (The equator) ను_త్తరమున సంచరించుచు దేవతలకు గోచరుఁడై యుండును. తులారాశిమొదలు దక్షిణమున సంచరించుచు నసురులకు గోచరుఁడై యుండును. దేవతలదినముయొక్క పూర్వాపరభాగములను క్రమముగ మేషాదిమూఁడురాసులలోను, కర్కటకాదిమూఁడురాసులలోను జరించుచుఁ బూర్తిచేయును. ఇటులే యసురులదినముయొక్క పూర్వాపరభాగములను తులాదిమూఁడురాసులలోను, మకరాదిమూఁడురాసులలోను జరించుచుఁ బూర్తిచేయును]

సురాసురులు భూమిలో నున్నను లేకున్నను సూర్యగతివిషయమయి యీయంశములు నిరాక్షేపణీయములు.

ఈక్రిందిశ్లోకములచే మేరుపర్వతము ప్రస్తుతము (North Pole) అనిపిలువఁబడుస్థాన మని యూహింపఁదగి యున్నది.

భూవృ_త్తపాదే పూర్వస్యాం యవకోటీతి విశ్రుతా ।
యామ్యాయాం భారతేవర్షే లంకా తద్వన్మహాపురీ ॥
పశ్చిమే కేతుమాలాఖ్యే రోమకాఖ్యా ప్రకీర్తితా ।
ఉద క్సిద్ధపురీనామ కురువర్షే ప్రకీర్తితా ॥
భూవృ_త్తపాదవివరాః తా శ్చాన్యోన్యం ప్రతిష్ఠితాః ।
తాభ్య శ్చో_త్తరగో మేరు స్తావానేవ సురాశ్రయః ॥
తాసా ముపరిగో యాతి విషువస్థో దివాకరః ।
నతాసు విషువచ్ఛాయా నాకుస్యోన్నతి రిష్యతే ॥

[భూవృ_త్తమునఁ బూర్వ, దక్షిణ, పశ్చిమో_త్తరదిశలయందు యథాక్రమముగ యవకోటి, లంక, రోమక, సిద్ధపురి యనునాలుగునగరము లున్నవి. అవి పరస్పరము భూవృ_త్తములో నాలవభాగదూరమున నున్నవి. (at a distanee of 90° from each.) వానికు_త్తరమున మేరుపర్వతము వానినన్నిటి నుండియు నదే దూరమున నున్నది. సూర్యుఁడు విషువద్వృ_త్తములో నున్నపుడు

వానిపైగాఁ బోవును. వానినుండి అక్షోన్నతియు (the elevation of the Earth's axis) దెలియదు.]

ఇచ్చట 'లంక' 'రోమక' యనుపట్టణములు ఆధునిక 'లంక' 'రోమ్' అనుపట్టణములే యని చెప్పుట విచారణీయము.

సురాలయ మనిన (North Pole) అని యెట్లు తెలియునో అటులే యసురాలయ మనిన (South Pole) అని తెలియునది.

భూమికి నాకర్షణశక్తి (the Power of attracting bodies) యున్నదని యు నందుచేతనే భూమిపైఁ బడువస్తువులు భూమిచే నాకృష్టములై యటులు పడుచున్న వనియు భాస్కరాచార్యులు "సిద్ధాంతశిరోమణి"లో వ్రాసియుండినట్లు శ్రీయుత రామలింగపిళ్లైగారు తమవ్యాసమున వెల్లడించియున్నవారు.

కాలమానవిషయమై కొంతవిచారించి మనయార్యులు దిన, మాస, ఋతు, వత్సరాదుల నెటు లేర్పఱిచిరో చూచెదము. ఋగ్వేదకాలముననే శని, గురు, కుజ, సూర్య, శుక్ర, బుధ, చంద్రాదులను గనుఁగొని యుండిరి. మఱియుఁ జంద్రునిగతిచే మాసములఁ గొలుచుచుండిరి. సూర్యచంద్రులయోగము (అమావాస్య) చాంద్రమానరీతిగ మాసాంతము. పున్నమచందురుఁ డేనక్షత్రసమీపమున నుండెనో యానక్షత్రముచే నామాసమును బిలుచుచుండిరి. ('చిత్త' నక్షత్రసమీపమునఁ బున్నమచందురుఁ డుండినమాసము 'చైత్ర' మనియు, 'విశాఖ' నక్షత్రసమీపమునఁ బున్నమచందురుఁ డుండినమాసము వైశాఖ' మనియు నీలాగున నూహించునది). వారు షడృతువులకును మధు, మాధవ, శుక్ర, శుచి, నభ, నభస్యము లని పేరులిడిరి. చాంద్రమానముమాత్రము మనయార్యులు స్వయముగ నిర్ధరించిన దనియు, సౌరమానము గ్రీక్కుదేశీయుల సంపర్కముచే వారలకుఁ దెలిసిన దనియు విమర్శకులయాశయము. మేషాదిద్వాదశనామములే దీనికి నిదర్శనము.

భాను, సోమ, మంగళేత్యాదివాసరనామములకుఁ గారణము నార్యభటుఁ డీవిధమునఁ దెలుపుచున్నాఁడు.

> సప్తైతే హోరేశాః శనైశ్చరాద్యాః యథాక్రమం శీఘ్రాః।
> శీఘ్రక్రమాత్ చతుర్థా భవన్తి సూర్యాదయో దినపాః॥

[శీఘ్రక్రమమున (In the descending order of their times of revolution) శని, గురు, కుజ, సూర్య, శుక్ర, బుధ, చంద్రులొక్కొక్కరును దినమున నొక హోరకుఁ (Hour) ప్రభువులు. శీఘ్రక్రమమున నాల్గవవారు వాసరాధిపతులు.]

ఉదాహరణమునకై శనివాసరమును గైకొందము. శీఘ్రక్రమమున శనైశ్చరాదు లొక్కొక్క హోరకు నధిపతులైనమొదల, 22, 23, 24,వ హోరలకు శని, గురు, కుజులు ప్రభువులైరి. 25 వ హోరకు (అనఁగా మఱునాఁడు ప్రథమహోరకు) సూర్యుఁడు ప్రభువు. ఏదినమున మొదటి హోరకు నేగ్రహము ప్రభువో యాదిన మాగ్రహనామముచేఁ బిలువఁబడును. కావున నిచట శనివాసరమును వెంబడించిన వాసరము సూర్యుని నామముచేఁ బిలువఁబడును. ఇటులే యన్నిదినములకుఁ బ్రభువు లేర్పడిరి. (నాఁటియాద్యులు సూర్యచంద్రులను గ్రహములలోఁ జేర్చిరి.)

ఆర్యభటుఁ డొకచోట "షష్ట్యా సూర్యాబ్దానాం ప్రపూరయన్తి గ్రహాభపరిణాహం" అని వ్రాసియున్నవాఁడు. అనఁగా అఱువదిసంవత్సరములలో గ్రహము లన్నియుఁ బూర్ణభ్రమణములు చేయుచున్నవి (All of them make a certain number of *complete* revolutions in 60 years which is the *least* possible time for such a purpose) ఈవాక్యమే మనప్రభవాది షష్టి సంవత్సరములకారణమును దెలియపఱచుచున్నట్లు తోఁచుచున్నది.

"సూర్యసిద్ధాంత" మున,

సకృదుద్గత మద్ధార్ధం పశ్యన్త్యర్కం సురాసురాః।
పితర శ్శశిగాః పక్షం స్వదినంచ నరా భువి॥

[ఒకప్పు డుదయించిన సూర్యుని సురాసురులు ఆఱునెలలవఱకుఁ జూచుచుందురు. చంద్రమండలములోనఁ బితృదేవత లొకపక్షమువఱకుఁ జూచుచుందురు. భూమిలోని మనుజులు మాత్ర మొకదినమే చూతురు]

అనియుండుటచే (North Pole, South Pole) వీనిసమీపమున సూర్యుఁడాఱునెలలు ప్రకాశించుననియు, చంద్రమండలము సుమారు రెండుపక్షములలో స్వాక్షభ్రమణము Rotation round its axis) చేయు ననియుఁ దేలుచున్నది. ఇప్పటిశాస్త్రజ్ఞుల యభిప్రాయములు నివియే.

భూమండలమున స్వదేశపరిధిజ్ఞానము (the knowledge of the longitude of ones own place) నీవిధమున సంపాదింపవచ్చు నని "సూర్యసిద్ధాంత" మునయున్నది.

అతీతోఽప్యస్మిలనా బింబోః దృక్సిద్ధం గణితాగతాత్।
యదా భవే త్తదా ప్రాచ్యాం స్వస్థానం మధ్యతో భవేత్॥
అప్రాప్యచ భవేత్పశ్చా దేవం వాపి నిమీలనాత్॥
తయోరంతరనాడీభి ర్హన్యాద్భూపరిధిం స్ఫుటం।
షష్ట్యా విభజ్య లబ్ధైస్తు యోజనైః ప్రాగథా పరైః।
స్వదేశపరిధిర్జ్ఞేయః॥

[ఒకచోట నక్షత్రశాలలో నిర్ధరింపఁబడిన చంద్రగ్రహణస్పర్శకాలమును దాఁటి యాగ్రహణము కనఁబడెనేని(If observed after the calculated time) యాచోటు నక్షత్రశాలకుఁ బూర్వదిశనుండును (the place will be to the east of the Observatory) నిర్ధరింపఁబడినకాలమునకు మునుపే కనఁబడెనేని, యాచోటు నక్షత్రశాలకుఁ బశ్చిమదిశనుండును. గణితాగతకాలమునకును దృక్సిద్ధకాలమునకునుగలయంతరమును(the difference between the calculated time and the time of observation) స్ఫుటమైన భూపరిధిచే గుణించి యఱువదితో భాగించిన నది యాదేశపుపరిధియగును.]

ఈవిషయము నీక్రిందివిధమున నిరూపింపవచ్చును.

Let x Nadikas be the difference of time.
A difference of 60 Nadikas is due to the circumference of the Earth or to 360.

$\therefore$ A dif. of x Nàkikas is due to $= \frac{360 \times x^{0}}{60}$

$\therefore$ the longitude of the place Eastro west $= \frac{360 \times x^{0}}{60}$ ans.

ఏచోటునకైన దక్షిణోత్తరరేఖను (the meridian of any place)కనుఁగొనుటకీవిధానముచెప్పఁబడి యున్నది.

శిలాతలేఽంబుసంశుద్ధే వజ్రలేపేఽపి వా సమే।
తత్ర శంక్వంగులై రిష్టైః సమం మండల మాలిఖేత్॥
తన్మధ్యే స్థాపయే చ్ఛంకుం కల్పనా ద్వాదశాంగుళం।
తచ్ఛాయాగ్రం స్పృశే ద్యత్ర వృత్తే పూర్వాపరార్ధయోః॥
తత్ర బిందూవిధాయోభౌ వృత్తే పూర్వాపరాభిధౌ।
తన్మధ్యే తిమినా రేఖా కర్తవ్యా దక్షిణోత్తరా॥

[శుద్ధమైన శిలాతలమున నొకసమమండలమును (a circle) లిఖించి, దానిమధ్యమున నొకశంకును స్థాపింపవలయును. దినము యొక్క పూర్వాపరార్ధములలో నాశంకుచ్ఛాయ యెచ్చోట నావృత్తపరిధిని(the circumference) స్పృశించుచున్నదో యారెండుచోటులలో బిందువుల నేర్పఱచవలయును. (mark the Points) ఈబిందువులమధ్య 'తిమి'* విధానముచే దక్షిణోత్తరరేఖను వ్రాయవలయును(Bisect the line joining the two points by describing two circles, and this draw the perpendicular bisector which is the meridian required)

సూర్యచంద్రగ్రహణవిషయమై "ఛాదయతి శశీ సూర్యం శశినం మహతీచ భూచ్ఛాయా" అని యార్యభటుఁడు చెప్పియున్నాఁడు. రాహుకేతువు లను నామములే లేవు. వానికి బదులు "ఆద్యపాతము" (the ascending node) "ద్వితీయపాతము" (the descending node) అనియు మాత్రమే ప్రాచీనసిద్ధాంతులు వ్యవహరించుచుండినట్లు తెలియుచున్నది. రాహుకేతువు లను గ్రహములు సూర్యచంద్రులను మ్రింగుటచే వారిగ్రహణములు కలుగుచున్న వనుట పౌరాణికుల యపవాదము. చంద్రగ్రహణము చంద్రుని పూర్వభాగమున నారంభించు ననియు, సూర్యగ్రహణము సూర్యునిపశ్చిమభాగమున నారంభించు ననియు "సూర్యసిద్ధాంత" మునఁ జెప్పఁబడియున్నది.

[ప్రాగిందోర్గ్రహణం పశ్చాన్మార్తండస్య విపర్యయాత్]

ఆర్యభటుఁడు గ్రహములు స్వయముగఁ బ్రకాశహీనము లనియు, సవి సూర్యునిప్రకాశముచేతనె వెలుఁగుచున్న వనియుఁ జెప్పియున్నాఁడు. అయినను నక్షత్రములఁగూడ నీగోష్ఠిని జేర్చి యుండుటచే నక్షత్రస్వరూపములు మనవారలకుఁ దెలియవనియే విశద మగుచున్నది.

[భూగ్రహభానాం గోళార్ధాని స్వచ్ఛాయయా వివర్ణాని ।
అర్ధాని యథాసారం సూర్యాభిముఖాని దీప్యంతే]

ఇది కాక మనయార్యులకు రశ్మివక్రతయు (the atmospheric refraction of the sun's rays) అయనచలనముఁ గూడ (the precession of the

---

*రెండువృత్తములు, the two circles పరస్పరము సంధించునట్టి తిమింగిలాకృతిగ నొకభాగ మేర్పడును. ఇటు లేర్పడునటులు చేయుటయే 'తిమి' విధాన మని పైవాక్యముతో నన్వయించునది.

equinoses) తెలిసియుండె నని కొందఱు విమర్శకులు చెప్పుచున్నారు. విషువద్వృత్తమునకును (the equator) అపక్రమమండలమునకును (the ecliptic—also called అపమండలము) మధ్య చిన్నకోణ మేర్పడుచున్న దనియు, గ్రహములకక్ష్యలు (the orbits) సమవృత్తము (the circle) కాక, ఉచ్చనీచవృత్తాకృతి (elliptical)గనున్న వనియు, గ్రహములకక్ష్యలలో నొకప్రదేశము 'ఉచ్చ' మనునదియు (aphelion) మఱియొకప్రదేశము 'నీచ' మనునదియు (perihelion) మనపూర్వికులకు బాగుగఁ దెలియును.

ఈశాస్త్రము మనదేశమున సుమారు ఋగ్వేదకాలమున జన్మించి క్రమక్రమముగ వృద్ధియగుచుఁ దుదకు, ఆర్యభట, వరాహమిహిర, బ్రహ్మగుప్త, భాస్కరాదిగణితశాస్త్రధురీయుల హస్తములఁ బ్రసిద్ధిఁ గాంచెను. ప్రకృతమీసిద్ధాంతుల గ్రంథముల నైనఁ బరిశీలించునంత జ్ఞానసంపన్ను లరుదని చెప్పుటకుఁ జింతిలుచున్నారము.

తిరుపతి. కపిస్థళం- కృష్ణమాచార్యులు.

యథాశిఖామయూరాణాం నాగానాంమణయోయథా ।
తద్వద్వేదాంగశాస్త్రాణాం గణితం మూర్ధనిస్థితమ్ ॥

గ్రామ్యమా - గ్రాంథికమా?

"పదుగు రాడుమాట పాటియై ధరఁ జెల్లు
నొక్కఁ డాడుమాట యెక్క దెందు" (వేమన)

ఇప్పటికి మూఁడుసంవత్సరములనుండి యెడతెగకుండ గ్రామ్యగ్రాంథిక వాదము బహువిధముల జరగుచుండుట లోకమంతయు నెఱింగినదే. మేము భాషాసర్వజ్ఞుల మని చెప్పికొను మనవారిని బోలువా రితరభాషల నెఱింగిన వారిలో లేకపోలేదు. కాని యీప్రచండవాద మొక్క మనభాషకే యేల రావలయునో తెలియకున్నది. కానిండు పైని జెప్పిన రెంటిలో దేనియం దెంత వఱకు జనసామాన్యమున కనురాగము గలుగుచున్నదో భాషాభిమాను లెఱుంగకపోలేదు. అయినను, ఆడినమాట తప్పరా దనునియమముచేతనో తాము చెప్పినదే మంచి దనునభిమానముచేతనో తమకంటెఁ దెలిసినవారెవ రనుసహంకారముచేతనో యేదో యొకవిధముగాఁ బ్రతిష్ఠ సంపాదింపవలయు ననుతలంపుచేతనో లేక నిజముగా భాషనుద్ధరించు నుద్దేశముచేతనో కాని యీవివాదము మాత్రము దినదినాభివృద్ధిని జెందుచునేయున్నది. కావున గ్రామ్య మన నేమి? గ్రాంథిక మన నేమి? ఇం దేది గ్రహింపఁదగినది? అనువిషయములం గూర్చి యెందఱెన్నివిధముల వ్రాసినను జర్వితచర్వణము గాదు కావునఁ గొంచెము ప్రసంగింతము. ఈసందర్భమున గ్రామ్యవాదులు తా మనునది వ్యావహారిక భాష గాని గ్రామ్యభాష గా దని మాటలచేతను వ్రాఁతలచేతను దెలియఁ జేయుటనుగూర్చి ముందుగాఁ గొంత విమర్శింతము.

వివాదమూల మైనప్రతివాదులభాషకు మొదట గ్రామ్య మని తరువాత నుత్తమజనవ్యావహారిక మని పిదప వ్యావహారిక మని యిపుడే మూఁడుపేర్లు వచ్చినవి. తుద కేదో యొకనామము పెట్టువఱకును మనము గ్రామ్యమనియే పిలిచెదము.

గ్రామ్యమే వ్యావహారికము. వ్యావహారికమే గ్రామ్యము. ఈరెంటికిని భేద మేమియు లేదు. ఎట్లనఁగా? శబ్దసంస్కారముకొఱకు నియమ మేర్పడినది అది లేనిది గ్రామ్యము. అట్టిభాష గ్రామ్యభాష. అంతియకాక మాలవాండ్రు

మొదలుగాఁగల గ్రామ్యులభాష యగుటచే దీనికీపేరు వచ్చిన దని చెప్పఁ దగదు. నియమరహితంబు లగుమాటలను మాలలే కాదు పండితులు, పామరులు, పంతులు, రావులు, సాహేబులు, బహద్దరులు మఱియెవ్వ రుచ్చరించినను నవి గ్రామ్యములే. గ్రామ్యభాష యనుపేరు వ్యాకరణవిరుద్ధ మయినదానికే కాని మఱి యొకదానికిఁ గాదు. రోఁతపుట్టించునది యగుటచే గ్రామ్యులభాష గ్రామ్యభాష యగుచున్న దనెడినిర్వచనము ప్రకృతోపయోగి కాదు. అట్టి భాష మాలలేకాదు బ్రాహ్మణు లుచ్చరించినను గ్రామ్యమే. అది వ్యాకరణసిద్ధ మయినను గ్రామ్యమే. దానికి విరుద్ధ మైనను గ్రామ్యమే. గ్రంథములలో నున్నను గ్రామ్యమే. ఆగ్రామ్య మాలంకారికులు నిర్ణయించినది. అది శబ్దార్థములు రెంటికిని సంబంధించినది. మనప్రకృతగ్రామ్యమో వ్యాకరణకర్తలు నిర్ణయించినది. ఇది శబ్దములకు మాత్రమే సంబంధించినది. ఈరెండువిధములైనగ్రామ్యమును జక్కఁగా నెఱింగి దానిని గావ్యంబులఁ జొరనీక రచింపవలయు నని కావ్యలక్షణకర్తలయభిప్రాయము. ఈసందర్భమున, "నట్లయిన వ్యాకరణము నుల్లంఘించి ప్రాచీనకావ్యములలో గ్రామ్యములు ప్రవేశించినవి కావా! అట్లే మఱికొన్ని యేలకలియరా" దని యందు రేమో? సత్యమే. ఏవో లెక్కకుఁగొన్ని గ్రామ్యములు పూర్వగ్రంథములలో లేక పోలేదు. కాని, "నంబిశబ్దో నముంచతి" యనునట్లు వానిముఖమున నింద్యగ్రామ్యమనియో, అనింద్యగ్రామమనియో యేదో యొకవిధముగా గ్రామ్యపదము కనుపడుచునే యున్నదిగాని విడిచి యుండలేదు. ఇదియే యెన్నివేలసంవత్సరము లైనను గ్రామ్యము గ్రాంథికనామమునువహింపఁజాల దనుటకుఁ బ్రబలనిదర్శనము. ఇఁక మనమేల కలుపరా దనెడి మాట యవ్యవస్థావిషయకము. అసంగతము, అప్రకృతము. ఇది యటుండనిండు. మఱియు, "చులుకఁగా గ్రామ్యజనములు వలుకునట్టి తెనుఁగుమాటలు గ్రామ్యంబు లనఁగఁబడియె," అనుదానింబట్టి గ్రామ్యులగ్రామ్యభాష యగుచున్న దందు రేమో యని యూహింతము. సరియే కాని యట్లు కాదు. ఆవచనమున కైనను నియమరహితంబు లగుమాటలు గ్రామ్యము లనఁబడుచున్న వని తెలుపుటయందే యభిప్రాయము గాని వాని నుచ్చరించువారియందుఁ గాదు. ఈయభిప్రాయమును దానివెంటనే యున్న "వర్ణలోపంబు నొందిన కావ్యములఁజొరవు" "అక్షరవిలోపమై యుండునట్టి పలుకు, గ్రామ్యమననొప్పునది యపభ్రంశకంబు" అనువాక్యములే తెలుపుచున్నవి. దానినే దానికి మూలమైన "అనియమా

ద్గ్రామ్యం హి యత్త్వపభ్రంశః" అనునార్యోక్తియే స్థిరపఱుచుచున్నది. కావునఁ గర్మధారయసమాససిద్ధం బైనయీగ్రామ్యభాషాపదమునకు షష్ఠీతత్పురుషసమాసము కల్పించుట మందహాసపదంబునకుఁ గల్పించుట వంటిదే యగును.

తొలుతఁ బలువురు పలుతెఱంగుల వ్యవహరించుచుండుటచేనిజరూపము సెడి యపభ్రంశమై కర్ణకఠోరమై తుద కర్థము గాని స్థితికి వచ్చుచున్న పదజాలమును బూర్వలాక్షణికులు సంస్కరించి వ్రాయుటకు నుచ్చరించుటకుఁ గూడ ననుకూలంబుగ నొక్కస్వరూపముతో నుండునట్లు నియమము లేర్పఱచి యిది గ్రాంథికభాష యని నిర్ణయించి దానికంటె మిగిలినది గ్రామ్యము, అపభ్రంశము నని నిరూపించిరి. ఈవిభజనము భాషామాత్ర సామాన్యముగా నున్నదే. అట్లు గ్రామ్యమని నిరూపింపఁబడిన శబ్దజాలమునే బ్రాహ్మణులాదిగా మాలలవఱకును గల నాగరకులు గ్రామ్యులుగూడ భిన్నభిన్నరూపములతో వ్యవహరించుకొనుచుండుటచే నదియే వ్యావహారిక మగుచున్నది. కావున గ్రామ్యవ్యావహారికముల కిసుమంతయు భేదము లేదు.

ఇఁక, "నెప్పుడో పుట్టిన వ్యాకరణ మిప్పటిభాషకుఁ జెంద"దని చెప్పుటను గూర్చి విమర్శింపవలసియున్నది. ఇప్పటిభాష యనఁగా గ్రామ్యమా? లేక గ్రాంథికమా? గ్రాంథిక మైనచోఁ జెందుచునే యున్నది. గ్రామ్యమే యైనచో మున్నెట్లు చెందలేదో యిప్పుడు నట్లే చెందదు. దీని కీసిద్ధాంత మేల? పవిత్రమైన భాషయొక్క స్వరూప మిదియని తెలిపి యది యెప్పుడును మాఱిపోకుండఁగ శాసించునట్టి వ్యాకరణ మెప్పుడు పుట్టిన నేమి? అది ప్రతిగ్రామము, ప్రతిపురము, ప్రతిమండలము, ప్రతిజాతి, ప్రతికాలమును వ్యవస్థ లేకుండఁగ ననేకవిధముల వ్యవహారమున మార్పునొందెడి యొకభాషాభాగ మైనగ్రామ్యమునకుఁ జెల్ల దనుట యాశ్చర్యకరముగాదు. దీనికిఁ గూడ నావ్యాకరణమే చెల్లె నేని యిది గ్రామ్యము గానేల? గ్రాంథికమే యగును. ఇఁకనో ప్రతిక్షణమును మాఱుచుండెడి యీగ్రామ్యము స్థిరపడియున్న గ్రాంథికములోఁ జేరకుండఁగఁ జేయుట యావ్యాకరణము యొక్క పని. సరియే పోనిండు. వ్యాకరణము పూర్వముపుట్టియుండ లే దనియే భావించి కొంచెము ముచ్చటింతము. వ్యావహారిక మెప్పుడును మాఱుచుండుననియే కదా ప్రతివాదులయభిప్రాయము అట్లయినచో నన్నయభట్టు మొదలుగా నిప్పటివఱకును భాష యెన్ని యోమార్పులు చెందియే యుండునుగదా? సరియే. తొల్లి

యప్పటి వ్యావహారిక భాషలో నే గ్రంథములు పుట్టినచో నప్పటినుండి యిప్పటివఱకును బలువూఱు పల్లటులు గొట్టుచు వచ్చియున్న యిప్పటివ్యావహారిక భాషలో నున్న మన కా గ్రంథములయర్థము తెలియునా? మన మాకవులహృదయములను గాంచఁగలమా ? అప్పటి దేశనాగరకత గ్రహింపఁగలమా ? చూచితిరా ? గ్రామ్యమే వ్రాయుట కుపకరించినచో వచ్చుదురవస్థ యిది యే. ఒకవేళ యప్పటి కావ్యములకుఁ గూడ నిఘంటువులు మాత్రము వెడలకుండునా? వానిని బట్టి తెలియకపోవునా యందురేమో. సరియే యెట్లయిన నేమి? ఇప్పటివ్యావహారికమునుండి యప్పటి వ్యావహారికము వేఱు కావలసినదియే కదా ? అది యిపుడు గ్రాంథిక మనఁ దగియుండును గదా ! అట్లే యిపుడు గ్రామ్యభాషలో గ్రంథములు వ్రాసినను ముందైన నీబాధ గలుగునదే కదా ? ఇట్లనినచో నెకవేళ " పూర్వగ్రంథముల నిప్పటిపండితులు కష్టపడి చదివి బోధించుచున్నట్లే యిపుడు వ్యవహారభాషలో వ్రాయు గ్రంథములను ముందు బయలుదేఱు పండితులు బోధింపఁగల " రని పండితనిందాగర్భముగాఁ బలుకుదురు కాఁబోలు ? కానిండు. అపుడు గూడఁ బండితులే మరల బోధించు దురవస్థ తమ భాషకు సంభవించుట సిద్ధము గాఁదగునేని యీమూఁడునాళ్లముచ్చట కీవృథా గ్రామ్యవాద మేల ? పండితులు నేర్పినఁగాని భాష తెలియకపోవుచున్న దను దోషము భాషదా ? పండితులదా? లేక చదువుకొనువారిదా ? భాష దేయయ్యెనేని పండితుల కెట్లు తెలియుచున్నది. పండితులదే యయ్యెనేని వారు చదువరుల కెట్లు తెలుపఁగలరు ? కావున నెందైన నెపుడైన భాష రాని దోషము చదువువారి ప్రయత్నమును బట్టి యున్నది గాని వేఱు గాదు. ఎంత తెలియరాకున్న దని మనము తలంచినను మాతృభాష ఖండాంతరములనుండి వచ్చినభాషలకంటెఁ జదువుట కెక్కువకష్టము గలిగించునా ? కావున దీనిం బట్టి కూడ గ్రంథములలో నున్న దానికిని లోకములో వ్యవహరింపఁబడుదానికిని భేద మెప్పుడును విధిగానుండు నని వారివాదంబుననే తెలియుచుండఁగా నిఁక గ్రామ్యవాదులకు వ్యాకరణము చేసినహాని యేమో తెలియకున్నది. లోకహితమును గోరు నుభయభాషాధురంధరు లగుపూర్వపండితులు లోకమును భాషను జక్కగా నెఱింగి భాషాభివృద్ధి కనుకూలంబుగ శబ్దములను శాసించి వ్యాకరణ మను పేర నుత్తమప్రమాణగ్రంథములను నిర్మించిరి. కావుననే భాష యన నేమో దాని నిజమైనసాంప్రదాయ మేమో మనకుఁ దెలియుచున్నది గాని లేకున్న మన భాషయు మనవాదములు నేమైయుండునో యూహింపరాదు.

పైచర్చనుబట్టి గ్రామ్యమే వ్యావహారిక మనియు గ్రామ్య గ్రాంథికముల నిజస్థితియు గొంతవఱకుఁ దెలిసియున్నది గావున నిఁక గ్రంథవిస్తరము గాకుండఁగఁ బ్రతివాదులు సెప్పువ్యావహారికము గ్రాంథికముగాఁ దగ దనుటను గూర్చి కొంచెము ముచ్చటించి యీవ్యాసము ముగింతము.

వ్యావహారిక మనఁగా లోకులవ్యవహారమున నున్నది యని యర్థము. వ్యవహార మనఁగా మాటలాడుకొనుట ; జాబులు, కవులుకదపాలు, క్రయదాన ప్రతిభూపత్రములు అభియోగపత్రములు మొదలగునవి వ్రాసికొనుట. వీనియందు నిరంకుశముగా గ్రామ్యమునకు వినియోగము కలుగుచునేయున్నది. కావుననే యిది వ్యావహారిక మగుచున్నది. మంచిదే. కాని, పురాతనమహాత్ముల చరిత్రలను దేశచరిత్రలను దెల్పునవి యు, సరసములై హృద్యములై చక్కని కల్పనవర్ణనలతో నిండునవియు భక్తి నీతి వైరాగ్యములను బోధించు నవియుఁ బ్రకృతిజ్ఞానంబున కాకరములు భాషాభివృద్ధికి నిదానంబులునై శాశ్వతంబుగ లోకంబున జీవింపఁదగినవియు నగు నుత్తమ కావ్యములను, అవ్యవస్థము, అపభ్రంశము, అనభిమతము, అనేకవిధము, అస్థిరము నగు నీవ్యావహారికములో వ్రాయుట యెట్లుసమంజస మగును ? ఎట్లు భాషాభిజ్ఞులచే నాదరింపఁ బడును ? గ్రామ్య మనఁబడెడి యీవ్యావహారికము జనసామాన్యముయొక్క నిత్య వ్యవహారమునకే యుపయోగింపఁదగిన దనియుఁ బవిత్రమై హృద్యమై శాశ్వత మైన యాగ్రాంథికము గ్రంథనిర్మాణమునకే యుపయోగింపఁ దగిన దనియు వాని నామములే చాటుచున్నవి. కావున నాంధ్రలోక మంతయు నాబాలగోపాల మేకగ్రీవముగా దేనిని గోరుచుండెనో పూర్వ మహాకవులు దేనిని మహాదరముతోఁ బెంచుచువచ్చిరో, మనపూర్వు లతిశ్రమ కోర్చి యు వ్రాసికొనుచు మొన్నటివఱకును దేనిని సంరక్షించుకొనుచు వచ్చిరో యేది లోకంబునందు స్థిరవసతి నేర్పఱచుకొనెనో యేది సర్వజనహృదయము రంజింపఁ జేయఁజాలునో యట్టిగ్రాంథిక భాషయే సర్వథా ప్రశంసనీయము. అదియే గ్రాహ్యము. అదియే గ్రంథరచనయోగ్యము. అదియే పఠనీయము. అదియే వందనీయము. భగవంతుఁడును దొరతనమువారును సత్సాంప్రదాయసిద్ధ మైన మనగ్రాంథికభాషను సంరక్షించుదురుగాక !

మల్లాది సూర్యనారాయణశాస్త్రి.

కృతివిమర్శనము.

ఇందుమతీపరిణయము— ఇది యాఱాశ్వాసముల యాంధ్రప్రబంధము. దీని రచించినకవి కుమారధూర్జటి ఇతఁడు కృష్ణరాయవిజయం బనునిం కొక కావ్యముఁ గూడ రచించినవాఁడు. కాళహస్తిమాహాత్మ్యమును రచించిన ధూర్జటి కవికిఁ దమ్మునిమనుమఁడు. ఈకావ్యము నూజవీడు పురాధీశ్వరుండగు నరసింహాప్పరాయభూపాలున కంకిత మొనర్పఁబడినది. ఈకృతిపతివంశస్థులును శ్రీరామచంద్రాప్పరాయవిభునకుఁ బుత్రులు నగు శ్రీరాజా నారయప్పారాయసింహాద్ర్యప్పారాయవిభు లీగ్రంథమును బ్రకటించి భాషాభివృద్ధికి సాహాయ్యమును లోకంబున కానందమును గలిగించిరనుట నిక్కము.

రచన:— ఈకవి కాళిదాసురఘువంశకావ్యము నుండి యజమహారాజు జన్మించుట యాదిగా నిందుమతీస్వయంవరము తుదివఱకును గలకథాభాగ మంతయుఁ దీసికొని కొన్నిచోట్ల సంగ్రహించి మఱికొన్నిచోట్లఁ బెంచి యీ ప్రబంధమును నిర్మించినట్లు కనుపడుచున్నది.

అజునిబాల్యయౌవనాదులు రఘువంశమున నొకటి రెండు శ్లోకములలోఁ జెప్పఁబడినవి. ఇందు విశేషంబుగ విస్తరింపఁబడినవి. రఘువంశంబున నిందుమతీ జననబాల్య యౌవనాది వర్ణనమును, ఇందుమతి ముందుగా నజమహారాజుసౌందర్యాది గుణంబుల విని యాతని యెడ ననురాగము గలిగియుండుటయు నను కథాభాగములు లేవు. ఇందవి ప్రబంధానుకూలంబుగఁ జక్కని కల్పనలతో వివరింపఁబడినవి. రఘువంశంబున విస్తరింపఁబడిన స్వయంవరవర్ణన మిందు సంగ్రహింపఁబడినది. ఇట్లే కొన్ని మార్పులు గలవు.

ఇది సంస్కృతాంధ్రములయందుఁ గవికిఁగల యసమానపాండిత్యమును వెల్లడించుచు మృదుశైలిచే మనోహరముగా నున్నది. అక్కడక్కడ నతిదీర్ఘసమాసము లుపయోగింపఁబడినవికాని యవియైనను మృదుపదలలితంబులగుటచే విశేషించి యర్థకఠినములు గావని చదువరులు తెలిసికొనఁగలరు. మఱియుఁ గొంచెమో గొప్పో ప్రాచీనకవిపరంపరలో నొకని జూచి యొకఁడు తనకావ్యంబునఁ గల్పనావర్ణనాదికంబు నొనర్చుట యాచారముగా నితఁడు

గూడఁ బుర (స్త్రీ) విప్రలంభ శృంగారాది వర్ణనంబుల విశేషముగా వసుచరిత్రకారు ననుకరించినట్లు కనుపడుచున్నది. ఇంకను, చెంచువాండ్ర సంభాషణంబును సాహిణి గుఱ్ఱమును దెచ్చుటయు వేటయు సరిగా మనుచరిత్రమును స్మరింపఁ జేయుచున్నవి. మను వసుచరిత్రలతోఁ బాటు దీనిం గూడఁ జదువువారికిఁ బై యంశములెల్లఁ దేటపడఁగలవు గావున గ్రంథవిస్తరభీతిచేఁ బోలికపద్యముల నిందుదాహరింపలేదు. అయినను గవిజాతిసామాన్యమైన యీ యనుకరణ మొక దోషముగా నిం దెన్నఁదగినది గాదు.

కవిత్వము:— ఈతని కవిత్వము సంస్కృతాంధ్రపదగుంఫనంబున సమానముగా ధారాళమై తఱచుగా యమకానుప్రాసాలంకారప్రియంబై యొప్పును. ఇందులకు—

శా. అంతం గాంతపకుంతసంతతినితాంతాక్రాంతభూమీజశా
ఖాంతర్భ్రాంతశకుంతసంతతవిరావాత్యంతసంతాపభృ
త్త్రాంతస్త్రైణదురంత మంతకదిశాతంతన్యమానానిలా
త్యంతంబై తనరెన్ దనంతన వసంతం బెంతయున్ వింతగన్. ఆ. 2. 33

మ. తళుకుందంతపుమెట్లసంతనల వింతల్ గుల్కు చెంగల్వరా
యలరాచల్వలు చల్లుతిన్నియల యొయ్యారంపుఁ దోరంపుఁ బ
చ్చలకంబంపుఁ గడానిదూలముల మెచ్చన్వచ్చు క్రొమ్మ్యాలరా
బెళుకుంగోడల నిండుచిత్తరువగల్ పెంపొందు పెన్మేడలన్. ఆ. 5-3

మఱియు సత్కావ్యలక్షణంబు లగుసరసశబ్దార్థసంఘటనము, మాధుర్యము, ధ్వని, యలంకారములు మొదలగు వాని కీకవిత్వమాకరముగానున్న దనుట కిందుమతీగుణవర్ణనసందర్భంబుననున్న యీక్రిందిపద్యమే సూచకమగుచున్నది.

చ. రుచిరతరార్థగుంఫనము రూఢిఁదగన్ మకరందమాధురీ
విచికలసౌరభప్రతిభవిస్తరిలన్ ధ్వనియానలంక్రియా
ప్రచయమెలర్ప నిందుమతి బంధురధారఁ జెలంగ సాహితీ
రచనయొనర్చు నాశుకవిరాజమణుల్ తనవాక్కు లెన్నఁగన్.

కల్పనలు, వర్ణనలు:— ఈయంశంబులం దీకావ్యము ప్రాచీనప్రబంధములందు సాంప్రదాయసిద్ధముగాఁ గనుపడుచున్నమార్గమునే యనుసరించినను గొన్ని మెఱుఁగులు చూపకపోలేదు—ఒకటిరెండు—

గీ. ఔర ! వృశ్చికరాశియం దడుగుఁ బెట్టి
యలరుదీవును విషమూర్తి వగుదువేమొ?
కాకయుండిన శివుఁ డఱకాలఁ దన్నఁ
జెలఁగి వేవేగఁ దలకెక్కి నిలువఁ గలవె?

క. సమయేంద్రజాలికుఁడు పూ
ర్వమహీభృన్నికటమున నవంబుగ నెగురం
గమరుద్వీథిక్వైచిన
సుమనఃకందుకమనంగ సోముఁడుదనరెన్.

__వ్యాకరణాదులు:__—లోఁతుకు, నెమలీఁకలు మొదలగు కొన్ని వ్యాకరణవిరుద్ధప్రయోగంబులును, బంట్రోతుతనము మొదలగు నొకటి రెండనర్థప్రయోగంబులును, అందందు రేఫశకటరేఫయతిప్రాసంబులును, జంబుఖానా మొదలగు నన్యదేశ్యంబులును గనుపడుచున్నవి. కాని యింతటిపెద్దగ్రంథంబునం దిట్టి యత్యల్పదోషంబులు గణనీయంబులు గావు.

__ప్రశస్తి__—పవిత్రమైన కథయు, సరసమై మనోహరమైన శైలియు, నిర్దుష్టమైన రచనయుఁ గలిగి యుత్తమకావ్యంబునాఁ బరఁగు నీయిందుమతీపరిణయ మెల్లవిధంబులఁ జదువరుల కానందదాయకమగు నని మాయభిప్రాయము.—

మ. సూ.



చిన్నా దేవి. శ్రీకృష్ణదేవరాయలు. తిరుమల దేవి.

శ్రీకృష్ణదేవరాయల ప్రతిమ.

ఆంధ్రభాషాపోషకుండును, గవిరాజకంఠీరవుండును గర్ణాటరాజ్యధురంధరుండునగు కృష్ణరాయనియొక్కయు నాతని ధర్మపత్నులయొక్కయుఁ బ్రతిమా ప్రతిబింబముల నీసంచికలోఁ బ్రకటించుచున్నారము. ఈప్రతిబింబములకు మాతృకలగు లోహమయప్రతిమలు తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామియాలయములో బహిర్ద్వారము దాఁటఁగానే కుడిప్రక్కనుండు మండపమునందు స్వామి కభిముఖముగా స్థాపింపఁబడియున్నవి. కృష్ణరాయని విగ్రహమునకుఁ గుడిపైపునఁ జిన్నాదేవిప్రతిమయు నెడమప్రక్కఁ దిరుమలదేవిప్రతిబింబము నున్నవి. ఈవిగ్రహములకుఁ గుడిబుజములమీఁద "చిన్నాదేవియరు, కృష్ణరాయమహారాయరు, తిరుమలదేవియరు" అనునామములు కన్నడమునఁ జెక్కఁబడియున్నవి. ఈప్రతిమలు శిల్పసమయానురూపములుగాని యథారూపములు గావని కొందఱియాశయము. ఇవి యథారూపములని నొక్కి వక్కాణించుట కాధారములు లేవుగాని కృష్ణరాయఁడు జీవించియుండఁగనే నిర్మింపఁబడియుండునని యూహించుట కభ్యంతరమేమియు నుండదు. కృష్ణదేవరాయఁడు శ్రీవేంకటేశ్వరస్వామికిఁ బరమభక్తుఁడని యాముక్తమాల్యద చదివినవారలకు సువ్యక్తము. రాయలయొక్కయుఁ దద్దేవులయొక్కయుఁ బ్రతిమలని పేరుపడినవి యివి తక్క మఱియేవియుఁ గనుపడవు. కృష్ణరాయని బ్రతిబింబమని యిటీవలఁ గొన్నిచరిత్రపుస్తకములలోఁ బ్రకటింపఁబడిన రూపము కల్పితమని యూహింపఁదగియున్నది. తిరుమలలోని ప్రతిమలు సర్వవిధముల యథారూపములు గాకున్నను మూలవ్యక్తుల జీవితకాలమునందే పుట్టియుండుటను వారిపేళ్లు ధరించియుండుటను మన కెంతయు విశ్వసనీయములే. మఱియు నీప్రతిమలవలన నాకాలమందలి విగ్రహనిర్మాణకౌశలమును రాజవేషనైఖరియును దెలిసికొనవచ్చును.

ప్రతిమాస్థానములంబట్టి చిన్నాదేవి శ్రీకృష్ణరాయని యగ్రమహిషియనియుఁ దిరుమలదేవి రెండవభార్యయనియు నూహింపఁదగియున్నది. ఈయూహకు సాధనాంతరముగూడఁ గలదు. శ్రీవేంకటేశ్వరస్వామి యాలయములోపలి ప్రాకారముపై 1434 వ శతాబ్దమునకు సరియయిన యాంగిరససంవత్సర ఫాల్గుణ

శుద్ధపంచమినాఁడు కృష్ణరాయలదేవి "చిన్నాజిమ్మవారు తిరువేంగళనాథుని ఆనవాలనైవేద్యమునకు ౩౭౮ తూకాలపైడిగిన్నె సమర్పించె" ననియు, ఆదినముననే తిరుమలదేవమ్మవారుకూడ నంతియే తూనికగల వేఱొకగిన్నియ సమర్పించెననియు నిట్లు రెండుశాసనములున్నవి. వీనిలోఁ జిన్నాదేవి శాసనము మీఁదుగాను, తిరుమలదేవి శాసనము క్రిందుగాను నున్నవి. దీనిచేఁగూడఁ జిన్నాదేవియే యాగ్రమహిషియని యూహింపవలసియున్నది.

ఈ యిద్దఱుభార్యలను మాత్రమేకాక గజపతికూఁతు నొక్కతెనుగూడఁ గృష్ణరాయఁడు వరించినట్లు *రాయవాచకమునందును, కృష్ణరాయవిజయము నందును జెప్పఁబడియున్నది. ఈరెండుగ్రంథములును గృష్ణరాయని యనంతరము పుట్టినవగుటచే బలవత్ప్రమాణములుగా గ్రహింపఁదగినవి గాకపోయినను, ఆతని ప్రధానమంత్రియగు సాళువతిమ్మరసు మేనల్లుఁడు నాదెళ్ల గోపమంత్రిచే రచింపఁబడిన ప్రబోధచంద్రోదయవ్యాఖ్య పీఠికలోని—

శ్లో. ప్రతాపరుద్రస్య గజేశ్వరస్య పుత్రీం పవిత్రీకృతభూతధాత్రీం
ప్రత్యగ్రహీద్యః ప్రకటప్రతాపో భద్రాం సుభద్రామివ పాండవేయః

అను శ్లోక మీపైయంశమును దృఢపఱచుచుఁ గృష్ణరాయని తృతీయపత్ని పేరు భద్రయనికూడఁ దెలుపుచుండుటచే రాయలకు మూఁడవభార్యకూడఁ గలదని విశ్వసింపవచ్చును.

భద్రాదేవి ప్రతిమ లేకుండుటకుఁ గారణము ధర్మపత్నులలో నామె పరిగణింపఁబడకుండుటయో యామెను వరించుటకుఁ బూర్వమే యీప్రతిమలు నిర్మింపఁబడియుండుటయో కాక యన్యమో విచారణీయము.

జ. రామయ్య.

---

* ఇందు గజపతి యిచ్చినకన్యపేరు జగన్మోహినియని కనుపట్టుచున్నది. భద్రకే యిది నామాంతరమని తోఁచుచున్నది.

కుంభకోణం మార్గముగా శేతువుకు పొయ్యేటప్పుడు వెంట్టవచ్చిన రాతులు రాణువవారు రాయలవారి శీమలోగల శివస్థలాదులున్ను విష్ణుస్థలాదులున్ను తటాకాలున్ను అగ్రహారాలున్ను పల్లెలున్ను వనములున్ను హానిశేశివచ్చివుందురు అదిగాక వారిశీమలోకొన్ని స్థలాదులున్ను ఆక్రమించి మన్ననమర్యాదలు తప్పించ్చి వుంన్దురుగనక అవి మనస్సునన్నుంచ్చి కృష్ణరాయలవారు కారణీక జన్మలైనవారుకాబట్టి సూడువిప్పేకొరకు మ్లేఛ్ఛులైనతురకలను నీగిళ్ళోలి మనశీమలోనికి వచ్చి గిరిదుర్గ్గ స్థలదుర్గ్గ జలదుర్గ్గ వనదుర్గ్గములను యెండ్లపరువళ్లు పోరాడినసాధ్యంకాదు అట్టిమార్గ్గాలను కోటకొత్తళాలు దినమొక్కటిగాసారి మార్గముచేత ఆక్రమించ్చి తక్కినకోటలు ధూళికోటలుగా సాధించ్చినవారైరి గనక మనిషిమాత్రంవారుగారు విష్ణు అంశ అన్నందులకు గజపతివారు ఆరీతి అవును తమపెద్దలు కన్నాటకానకు అపరాధం తలంచ్చి నంద్దువల్ల వారుబలవంత్తులై మనరాజ్యంమీద దండెత్తివచ్చినారు వారినిజయించేటందులకు జయాపజయంకనవలెనని షోడశపాత్రులను పిలువనంప్పగా బలభద్రపాత్రుడు, దుర్గ్గాపాత్రుడు, భీమాపాత్రుడు, ముకుందపాత్రుడు, భీకరపాత్రుడు, భైరవపాత్రుడు, రణరంగ్గపాత్రుడు, అఖండపాత్రుడు, మురారిపాత్రుడు, వజ్రముష్టిపాత్రుడు, తురగరేఖంపాత్రుడు, అశనీపాత్రుడు, అసహాయపాత్రుడు, గజాంకుశపాత్రుడు, మృగేంద్రపాత్రుడు మొదలైనవారు పదారుపాత్రులువచ్చి గజపతివారిని పొడగనగా వారలను కూచ్చుండనియమించ్చి వారలతో ఇదివరకున్ను నడచిన కార్యాలన్నింన్ని విన్నారేకా కన్నాటకంవారు కనములదాంటి అహముదానగరానకువచ్చి నిపాతంశేశి పోట్నూరి సింహ్వాద్రివద్ద శిబిరందిగినారు యిక్కడికి నాలుగుక్రోశములమేరవచ్చివున్నారు రేపుమర్నాట దాటిమార్గ్గంగా గుర్రం రాణువవచ్చును అప్పుడైనా కనుపించుకోవలెగాని మొదటిస్థళంవిడువరాదు ఆలోచనగా అడిగినంద్దులకు షోడశపాత్రులు యీ ఆలోచన మునుపు మూడుతెగలదునేదాన్లున్ను కర్నాటకంవారికి వెముఖాసరించ్చి నిలువలేక తమతమ స్థలాదులకు పోయినంద్దువల్ల యెవ్వరినిన్ని యెంచ్చక తురకాణ్యం శీమలుదాంటి మన గడికనమలుంన్ను జొచ్చి పట్టంసమీపానకు వచ్చినారు యీసమయాన మానం ఆమూడుతెగలవారికింన్ని చెప్పి అంప్పించ్చి వారు సరుదులుంన్ను బలవంతముగా వుండ్డమని మనమున్ను యిక్కడను కనుపించ్చుకొంటేను యెంద్దుబోనుంన్నారు కాళహస్తి ఆరభ్యం జగంన్నాథంపర్యంత్తం మనశీమ అట్టిపట్ల యెదురు యెం

చ్చుక లోతుయెరుగరుగనక లోజొచ్చి వచ్చినారు మంత్రాలోచనమీద వచ్చినకా
ర్యంకాదు హామికమీదికార్యాం గనక వారికేముప్పు మనకార్యం జంజమాను
వారు యాయులు మనం స్థాయులు. మనశీమప్రజలకు వారలవీరగతోలి స్థలా
లున్ను నిలుపవలెనని ఉత్సాహపుష్టి గనక ఇట్టిపట్లు మనం కనుపించుకొంట్టేను
కన్నాఁటకంవారు నిలువలేక తమశీమకుపొయ్యేమనిబోదురు రేపుఉదయాంన్నె
స్వామివారు కాతురాణువకు వక్కలాకులిప్పించ్చి అంద్దరినిన్ని ఆయత్తపడి
రమ్మనడా మీరువక్షప్రదేశాన రాజచిహ్నాలు పట్టించ్చుక ఉన్నతస్థలానవుండ్డి
వేడుకచూస్తేచాలును. తాముపదారురముంన్ను జగడమిచ్చినకర్నాటకంవారిని
పారదోలి వారిబొక్కసభండారములున్ను యేనుగుగుఱ్ఱాలున్ను మొదటిదొరల
నున్ను హస్తగతం చేసుకవచ్చి సముఖానవుంచ్చేమని వారువారులు తమతమకు
తోచినట్లుసాహసపరాక్రమములున్ను యుద్ధరంగ్గమంద్దు వేటారుతునకలుగా నరి
కేమనింన్ని మదహత్తుల తొండ్డములతోకూడా కొంమ్ములుఖండ్డించ్చేమనింన్ని
చెరుకుల నరికినట్లు కాళ్బలములనున్ను వాళ్లచేఖండ్డములనుంన్ను ఖండ్డిం
చేమనింన్ని విండ్గి శీమపట్టితే అంద్దరినింన్ని చెరలుతోలుకవచ్చేమనింన్ని శపథ
పూర్వకముగా చెప్పినారు గనక గజపతివారు చాలాసంతోషబడి మీరువొక్క
క్కరేవొక్కక్కశానను భీభత్సు శాయగలరు మీరుపదార్గురున్ను పదిదిక్కులు
కనిపించ్చుక కార్యంశేస్తే ఘూలివానాను వురుములున్ను పిడుగులున్ను బడినట్లు
భీభత్సుగా పోరుదురు. యిదిగాక పూర్వమంద్దు అర్జనుండ్డు ఉత్తరగోగ్రహణ
మందు దుర్యోధనాదులమీదనడచి యుద్ధం శేశి ఆవుల త్రిప్పుకవచ్చేటప్పుడు
అంద్దరిపోగులున్ను శిరోవేష్టనలున్ను వొడశివచ్చినట్టుగా గలరు మీరు రణభీక
రానకు కర్నాటకంవారు రణభీతిసి వణకెత్తి యెవ్వరికింన్ని శరీరాలు తెలియక
విస్మృతిబొంద్ది కాళ్లుచేతులాడక యెక్కడివారక్కడనె నిలిచివుంద్దురు మీరు
అంత్తకార్యం శేయవలెను తాము పయడు బియ్యుమువారు మిగిలిన బొక్కస
భండారానవుండ్డె రొఖ్ఖరొజనాలు శీమభూములు మొదలుగాగల భాగ్యం
మీదింన్ని రఘుతులురాణువ వారిదింన్ని. అటుగనక కీర్తిఅపకీర్తులు విచారించుక
అనిమొనను యేరీతున నడిపించ్చుకోవలనో ఆరీతిశేయుడా అసిషోడశపాత్రులకు
ఉచితవస్త్రాంగ్గంబ్బులున్ను శిరోవేష్టి తాలి చౌకట్లు కబాయి దట్టి కస్తూరి వక్క
లాకులు యిచ్చిప్రియపూర్వకముగా యీవరకు తమవల్ల నేర్పునేరములున్ను
ఆగ్రహానిగ్రహములున్ను వాగ్దోషములున్ను యేమికలిగినా అవియెల్ల మనసున

వుంచ్చక యీరీతున జయానికి ఉపాయంకనవలెనో ఆరీతున కర్నాటకం వారిని విముఖులజేశి గజపతి అనేపేరున్ను రాజ్యమున్ను నిలువవలెను అని అన్నందు లకు షోడశపాత్రులు అంన్నిటికిన్ని జగన్నాయకులువున్నారు రేపుఉదయాంన్నె అన్నిన్ని జూచేరు అని సంబుద్ధిగా చెప్పి ఉదయాన్నె మేమున్ను ఆయుత్తబడి వస్తున్నారము మీరున్ను ఆయత్తబడి రావలెను అని అన్నంద్దులకు అంద్దరున్ను యేకవాక్యముగా పలుకరించ్చిరి గనక ఆవివరం ఆద్యాంత్తం కన్నాటకంవారి స్థానాపతి కమలనాభయ్య కృష్ణరాయలవారి సముఖమానకు సత్కృచ్ఛ్రమముగా కాకితములు వ్రాయించి ముద్రబడజేశి అతిగోప్యముగా రాయలవారు అంత్తః పురాన వుంన్నప్పటికిన్ని ఆయనచేతనే కాకితములు యిమ్మనిచెప్పి అంప్పగా పొద్దుచేర నాలుగుఘడియలప్పుడువేగుర్లువచ్చి కాకితములు యిచ్చినారు రాయులు వారు తామె కాకితములుచదివి జూచుకొని కార్యం బిసతప్పి తబ్బిబ్బాయను అని చాలా చింత్తనొంద్దినవారై అప్పుడు అప్పాజిమాటలు వినకవచ్చినంద్దులకు ఇంత్తకార్యం వచ్చెను అని తమలోతామే చింత్తచేసుక అంద్దరికింన్ని ప్రాణ హానులువచ్చెను షోడశపాత్రులు చెప్పేదొఖటింన్ని శేశేదొఖటింన్నికాదు యెంత్తవెళ్లనాడినా అంత్తానడిపించ్చగలవారు వారలపరాక్రమానకు యెవరుం నిలువలేరు అనినిలిచినదిక్కున నిలువక వున్నదిక్కున వుండ్డక అరిజాలపడి అంద్దరి కింన్ని యింత్తకార్యం వచ్చనని ప్రజలుచింత్త పడుతావుండ్డంగ్గ పాళ్యములో ఆడాడ గలిబిలి అయ్యేదింన్ని మూకలు గమిగూడి గుసగుసలుగా మాటలాడె దింన్ని అంద్దువల్ల కొందరికిభయోత్పాతముగా తోచేదింన్ని యీరీతిని వుండ్డగా రాయలవారు దీవటికొలువై విచ్చేశినట్టుగా నడిపించ్చి నగరశోధనగా పాళ్యాలు చూస్త్రారాగా వారువార్లు ఆడుకొనెవార్తలు ఉదయమైతె గజపతివారి పాళ్యం మనపాళ్యంమీద పడుతావుంన్నారనింన్ని ఆరీతే అఇతె కన్నాటకంవారి బలం నిలువదనింన్ని రాయలవారు అప్పాజిమాటలువినక లోజొచ్చి వచ్చినందు వల్ల అపాయం వచ్చెననింన్ని యింద్దుకు యిప్పుడైనా అప్పాజి చెప్పినట్టు వింట్టె ఆయన అపాయానకు తగ్గ ఉపాయంచింత్తించ్చగలడనింన్ని అక్కడక్కడ పిన్న పెద్దలు రౌతులు రాణువవారు ఆసకలమున్ను ఉత్సాహమగ్నులై ఆడుకొనే మాటలున్ను వార్లుభీతిజెంద్దిన వార్లునున్ను చూచినవారై రాయలవారు అప్పాజి గుడారము నకు పోయినారు గనక అప్పాజి రాయలవారు వచ్చేది జూచి తనవద్ద నున్నవార్లు యెరుగకుండ్డ అంద్దరినింన్ని పటకుటీరములకు పొంమ్మని అంప్పించ్చి

తాము నగర్లోనికి పోయినట్లు పోయెగనక అంతస్తుగుడారములో రాయలవారిని విచ్చేశి కూర్చుండ్డమని రాయలవారితోను ఏకదేశానవిచ్చేశేటంత్తకార్యం యెండ్డి అనింన్ని పిలువనంపిస్తే నేనువచ్చి విన్నపంశేయనా అని అన్నంద్దులకు రాయలవారు తాము ఏకదేశాన రాతగ్గ కార్యంగనక వస్తిమి అదియేమంట్టె గజపతి దగ్గరనున్న కమలనాభయ్య అంప్పించ్చిన కాకితం చదువుకొంమ్మని చేతికి యియ్యాగా అప్పాజి కాకితం చదువుక రాయలవారితోను అదియెండ్డి స్వామివారి పాదపద్మములకు కానంబడ విన్నపంచేస్తిని నావిన్నపము చిత్తానకు తేక కదలివస్తిరి గజపతిశీమలో జొచ్చిరాగానే కనమల్లో వచ్చిన అపకీర్తి చాలదా అవింన్ని విచారించుకోక ముప్పై యామడదూరం గజపతిశీమలో చొచ్చి మొదటిస్థలం వద్ద దిగినంద్దువల్ల వారికిన్ని ఆలోచనబుట్టి యింత్తకార్యాలకు తెగవేశినారు యీరాత్రి అంద్దుకైన కార్యం కంట్టె కంన్నట్టు కాననప్పటికి అంద్దరికిన్ని యుగంత్యంగ్గినట్టు అవును అనివిన్నపంశేశినంద్దులకు రాయలవారు పలుకరింఛ్చిననీతిపద్యం—

క. ముట్టెడుకార్యముఁజక్కం, బెట్టెడుమంత్రియును బోర బెదరనిబంటుం
బుట్టరుగా దేవతలకుఁ, బుట్టరె నానావిధైక భోగసహాయుల్.

అనినీతిచదివి మీరుండగా కొదవ బడనేరేగదా. గతానమీమాటవినకవచ్చినందువల్ల ఇంత్త ఆలోచనకు ఆస్పదమాయెను. మాగుణదోషములు యెంచ్చేటంద్దువల్ల అయ్యేకార్యం యేమివున్నది యీయపాయానకు తగిన ఉపాయంయేరీతు అని అడిగినంద్దులకు అప్పాజి స్వామివారి హృదయమున్ను ఆలోచనాను యేతీరో అని అడిగినంద్దులకు రాయలవారు షోడశప్పాత్రులుంన్ను గజపతివారు శేశిన ఆలోచనవల్ల తమకు ప్రాణహానింన్ని మానభంగ్గమున్ను అయిన అవని ప్రజలకు అవధింన్ని వచ్చును అనింన్ని అష్టైశ్వర్యములుంన్ను ఆక్రమింత్తురు అనింన్ని మనస్సు నిశ్చయముగా తోంచివుంన్నవా అని ఆనతిచ్చి మరింన్ని అప్పాజితోను యీసమయమంద్దు యేమి వెచ్చబెట్టినా ఉత్తరవు మాకు యీతీరు బుద్ధిమార్గముగా జెప్పిన ఆతీరునె విని నడిచేము యింత్తకువచ్చినకార్యం ప్రయప్రయాసములకు నిలుచునా అని అంన్నంద్దులకు అప్పాజి రాయలవారితో మంత్రనీతులుగా పలుకరింపు శేశినపద్యం.—

గీ. దండసాధనకృతుల సాధ్యుండుగాక, మ్రింగఁబఱతెంచు శత్రువుమిత్రుఁ జేయు
దాసమున నాత్మవశగులు గానివార, లితరులెవ్వార లీజగత్రితయమునను.

క. శత్రులమిత్రులఁజేయును, మిత్రులభృత్యులనుజేయు భృత్యులనిజస
త్పుత్రులుగఁజేయు నందఱ, ధాత్రీపతి కన్నియెడలదానమువలదే.

క. ఆయాసమర్లభమ్మౌ న, నాయాసమునన్ ఘటించ్చు నరయ నభీష్టో
పాయంబు పతికి భేదో, పాయము కడునిష్టమగునుపాయము గాదే.

అని నీతులువిన్నవించ్చి యీసమయాన భేదోపాయము సంఘటించ్చి జయించ్చేయ త్నంగనవలెనని గనక అనర్ఘ్యమైన భూషణములు బహువుగావెచ్చ బెట్టిహాని కార్య మురాకుండ్డా నడిపించ్చవలెను అన్నండ్డులకు రాయలవారు సప్తోపాయమ్ములచేతనున్ను యీసారి గడిపిస్తే చాలును అని అప్పాజితో ఆనతిచ్చి తామున్ను బొక్కసభండ్డారములుంన్ను యేనుగగుఱ్ఱాలున్ను రాణువరాష్ట్రములున్ను కోటకొత్తళాలున్ను గ్రామభూములున్ను సకలమున్ను మీయొక్క ఆధీనం గనక మీకునరిపాయినట్టు నడిపించ్చుకొండ్డా అని త్రికరణత్రివాచకముగా పలకరించ్చి నగరికివచ్చిరిగనక అప్పాజివారు తోడుతోనె నగరిగుడారమునకు వచ్చి తమకు ఆప్తులైన అయ్యమరసు కొండమరసు రాయసం వీరమరసు అవసరం లక్ష్మీపతి మొదలైన నియోగులున్ను రాయకరణీకం తొంమ్మిదిసంప్రతులవారున్ను బొక్కసంగొల్ల కొమారస్వామినింన్ని రప్పించ్చుక యేకాంత్తమని వదంత్తి పుట్టించ్చుక వాకిటిగొల్లులతోను గజపతివారి తెగ సుబుద్ధి మొదలైన నియోగులు యెవరువచ్చినా యేకాంత్తమనిచెప్పి లోనికి రానియ్యక తిరుగా వెలి వెళ్లిపోనియ్యక నిలుపకవుండ్డమని తాకీతుగా పలకరించ్చిరాయసంవారితోను షోడశ పాత్రులకున్ను పేరువరుసలకున్ను వరుసలాను మేముపలుకరించ్చిన క్రమం రాయలదేవునివారి సమీపములుగా వ్రాయమని పలుకరించ్చి నిరూపవక్కణ చెప్పిన క్రమం—మీరు అంప్పించ్చిన కాకితములు చూచుకొంట్టిమి గనక అంద్దలి వయనం గజపతివారు ఆదియంద్దు మమ్మునాడిన మాటలున్ను నడపించ్చుమర్యాదలున్ను రాష్ట్రదుర్గబహుమానముల కొరకు వారివారితో ఆడుకొన్నవార్తలున్ను జన్మజన్మాకిన్ని మరవతగ్గది లేదనింన్ని అంద్దుకు ఉపమానముగా నీతికార్యమునకు పద్యం—

క. తనువుననాటినయలుగుల, ననువునఁబుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్
మనమునసనాటినమాటలు,వినుమెన్నియుపాయములను వెడలునె యధిపా.

అని నీతిసహితముగావ్రాసి యీరాత్రి గజపతివారితో వార్తలాడివస్తిమి రేపు ఉదయానకు పాళ్యంమీదికి సార్మార్గముగా వచ్చేటట్టు తోడకవచ్చి చేపట్టు

గాపట్టి ఇచ్చేము తాము రాయలవారు ధరియించు వెంన్న ముద్దకంఠమాల నవరత్నపుచిలుకతాళి వైడూర్యతాళి వజ్రాలసరిపెణ మరకతకంక్కణం హురుమంజ్జి ముత్యాలపచ్చసరం ఇంద్రనీలమకటం వజ్రపుబిళ్లలమొలతాడు కెంప్పులజముదాడి ముత్యాలకావిపెంద్వ్యం వజ్రాలబాహుపురీ దొడ్డముత్యాల అడ్డకత్తి నవరత్నఖేడం నవరత్నపుసింహ్మాలలాటం ముత్యాలముంగ్గరంబ్బు యివి మొదలైన పదారునగలుంన్ను అరువైనాలుగులక్షుల ఘట్లక్రయం తాము అంప్పిస్తేను తమ మనస్సుపద్ధతికి అనుకూలతగానే నడిపించ్చేము అని మాకువ్రాసి అంప్పించిన క్రమం యీపదారునగలుంన్ను అరువైనాలుగులక్షుల క్రయంగనక కనుగోంన్న నగలు అంప్పితిమిగనక తమతమకుకావలశిన నగలు తీసుకొని మాకు కావలశిన ప్రయోజనం వెనగూర్చి అంప్పించ్చేది అని వివరముగా షోడశపాత్రులకున్ను ప్రత్యేకప్రత్యేకముగా నిరుపములు వ్రాఇంచ్చి మరిన్ని భూషణములున్ను ఉడుగరలున్ను పదారుపెటెలు గట్టించి పదార్గురు నియోగ్యాగులకున్ను పయనం శేశి పదారుగురు మనుష్యుల వశాల పెట్టెల యిచ్చి షోడశపాత్రులున్నగడకు పోయి యిచ్చి రమ్మనేటట్టుగా అంప్పించ్చి నియోగ్యాగులకు వుడుగర వక్కలాకులు ఇచ్చి పొయ్యేటప్పుడు మార్గాన యెవరైన అడ్డగించ్చి రమ్మంట్టె అవుగాములనంగ మొదటిదొర వద్దికైనా పోయి వారితోను కలర్థంకానుపడ తెలుపమనంగా గజపతివారు యేమని ఆనతిచ్చినా విని రమ్మనేటట్టుగా బుద్ధిమార్గములుగా చెప్పి అంప్పినపర్యాయములువిని గజపతివారికి సుబుద్ధిఅనేనియోగ్యాగి వ్రాశి అంప్పినది మీరు కన్నాటకంవారిమీద కార్యంశేశేవారై షోడశపాత్రులను బిలువనంప్పించ్చి వారితో యీసంస్థానం ఆదినుండ్డిన్ని మీవల్లగజా నిర్వాహకానకు వచ్చినది. మేము పయిడుబియ్యముువారము. కడమభాగ్యమంత్తామీాదిన్ని రవుతు రాణువమీాదిన్ని అని ఉపచారోక్తులుగానున్ను గతము మేము నేర్చి నేరక ఆడిన మాటలు యేమైనా గలిగితే మరచి నిర్వాహమునకు తెవలెను అని మంద్దలించ్చగా వారు రేపు ఉదయాంన్నె అంన్ని కార్యములుంన్ను చూచేరు అనివిన్నపం శాయగా మీరు వారిమాటమీద కార్యముఖానకు వస్తావున్నారు గనక కన్నాటకం పాళ్యానుండ్డి మనపాళ్యానకు వచ్చేమార్గాన ఆప్తులయిన వాళ్లనుంచ్చి నియోగ్యాగులున్ను పెట్టియున్ను సముఖానకు తెప్పించ్చుక జూడగా నిదర్శనమైతేను అంద్దుకుతగిన ఆలోచనకు నేదని వ్రాసి అంప్పగా ఆకాకితం గజపతివారు చదువుకొని ఆతీరుననే యిక్కడివారికి వోళవియ్యగా షోడశపాత్రులకు అనర్ఘ్య

మైన భూషణములు పెట్యల కట్టించ్చి నియ్యోగులనున్ను పదారు పెట్ట్యెలున్ను
చేపట్టుగా పట్టుకపోయి గజపతివారి ముంద్దర విడిచినారు గనక గజపతివారు
పెట్టలవిడిపించ్చి వారివారిపేరట వ్రాసిన నిరూపములున్ను చదివించ్చుకొని వక్క-
ణలువిని ఆదియంద్దు తాము ఆగ్రహబడిన కార్యములుంన్ను వుటంగ్గించి అంద్దుకు
ప్రత్యుత్తరమున్ను అనర్ఘ్యమైన భూషణములున్ను నిదర్శనంగ్గాచూచి షోడశ
పాత్రులను నమ్మి జగడాలకు పోతావుంట్టిమి వాళ్లు ఇంత్తద్రోహానకు లోనైరి
మనపాలింట్టి జగన్నాథులకృపవల్ల మునుకలుగా హెచ్చరిక పడితి. ఇఖను యెవ్వ
రిని నమ్మరాదు అని వచ్చిన పదారునియ్యోగులనుంన్ను పట్ణంవిడిచి యొకదేశాన
అవ్వలవీడతోలి గజపతివారు యేడెనిమిది ఆమడపొడువు ఉత్తరంగ్గా పారిపో
యిరి గనక మరుచునాడు ఉదయాన షోడశపాత్రులు ఆఇత్తపడివచ్చి నగరివాకిట
నిలిచి గజపతివారిని బయలువెరశిరమ్మని ఫణిహారులతో చెప్పి అంప్పగా గజపతి
వారు నగరివాకిట పిన్నపెద్దలతో చెప్పిపోయినారు గనక వారు వాకిలి వెళ్లి
వచ్చి గజపతివారు నడిపించ్చిన కార్యమున్ను ప్రఛన్నవేషముగా పోయిన మా
ర్గాలున్ను తెలుపంగా షోడశపాత్రులువిని ఉత్సాహమగ్నులై ఆలోచనకులోనై
గజపతివారు వున్నతావుకు పోయినాను అపవాదం కార్యముఖానకు పోయి
నప్పటికిన్ని వారు నడపించ్చినకార్యం మంత్రభిన్నం ఆయెగనక తెంపుగా నడి
పించ్చి రింత్తెగా నగరికి హితవాచరించ్చిన వారుకారు అని అంద్దుకు తాము తెలు
సుకోనేరు అనివారువాల్లున్న తమతమమున్ద్గాలకు సాగిపోయినారు కాబట్టి కృష్ణ
రాయలవారు యీవర్తమానములువిని జయభేరిశాయంగా మొదటిస్థలానకు
వచ్చి నిలిచి యెవ్వరున్ననగరు చెరకుండ సుబుద్ధిగారి మనుష్యుల కోటవాకిళ్ల
నుంన్ను పట్టణములోనున్ను నగరిమహాలులోనున్ను జతనంగా మనుష్యుల
వుండ్డమని నియమించ్చి పోట్లూరిసింహాద్రివద్ద జయస్త్తంభము శేయించ్చి సుబుద్ధిని
బిలువనంప్పి ఆయనతోను మేము ప్రతాపముకొరకు వచ్చినవారమింత్తెకాని
రాజ్యాపేక్షకొరకు వచ్చినవారముగాము గజపతివారి రాజ్యం గజపతికే నడిపిం
చ్చేము మేమున్ను మాశీమకుసాగిపొయ్యేము అని ఆనతియ్యగా సుబుద్ధి ఆవివర
ములకు గజపతివారికి ఆనుపూర్వకముగా కాకితంవ్రాసి పంప్పినారు గనక బుద్ధి
శాలియైనటువంట్టి గజపతివారు ఆకాకితము చదువుక చాలాసంతోషపరులై
తిరుగాపట్నానకువచ్చి షోడశపాత్రులవల్ల తప్పితంలేదని విచారించ్చుక చారుల
చాత పిలువనంప్పించ్చగా వారులున్ను వచ్చి కని కొలిచిరి గనక మీవల్ల కపట

మున్ను లేదు ద్రోహచింతనాను లేదు అనిపలుకరించ్చి వారలకుబహుమాన ములు శేశి వారలకూర్చ్యుక రాయలవారిని సంద్దేహించ్చక మాటపలుకులాడే టప్పుడు గజపతివారు రాయలదేవునితోను సమయోచితములుగా పలుకరించ్చి సంద్దులకు—

శ్లో. నష్టంకులం భిన్నతటాకకూపాన్ విభ్రష్టరాజ్యం శరణాగతంచ
గోబ్రాహ్మణాన్ దేవగణాలయాంశ్చ యముద్ధరేత్పూర్వచతుర్గుణంతత్.

అని శ్లోకం చదివి మరింన్ని ఉచితమైనట్టు మాటపలుకులాడంగ్గా రాయలవారు గజపతివారితోను మీారనిన్ని మేమనింన్ని భేదము ఉన్నదా అని ఉపచారములుగా మాటలాడి గజపతివారికి చాలాబహుమానసన్మానములు శేశి నాలుగు నగల కోకతాకలున్ను యిచ్చినారు గనక గజపతివారు తమకొమార్తె అయిన జగన్మోహినీ అనేకన్యకను దారపోశి యిచ్చేసమయాన చెప్పినపద్యం

క. హాటకపేటీ శాటీ, ఘోటీశకటీ మదేభకోటీపీటీ
పేటీభృచ్చేటీ...మయూరికలు...వేడ్కన్.

అని నీతిచదివి ఆవలమరింన్ని అల్లునికింన్ని ఆడుబిడ్డకున్ను యియ్యతగిన బహుమానోచిత క్రమభూషణాలనింన్ని అంప్పించ్చి మరిన్ని తమకొమార్తెకు పట్టుపరిమెళ పసుపులకని కృష్ణవేణికిదక్షిణపుదిక్కు నడిచేరాజ్యాలున్ను కోటకొత్తళములున్ను దుర్గాలున్ను ఇచ్చి యేనుగగుర్రములు బంటుపరివారం దాసానుదాసులు ఆంద్దోలిక హయలుబండ్డి పసలంప్రాయలు పాత్రసామ్మగ్రిలు పగడపుకాళ్లమంచము హంసతూలికా యివిమొదలైనవిగా ఆడబిడ్డకు యియ్యతగ్గ వరుసలన్నియిచ్చి అల్లునికింన్ని శాయతగ్గ వరిశెలు అన్నిన్ని తప్పకుండ్డా వఖసారిగానె సకలపదార్థములున్నుయిప్పించ్చి తమ నగరగల భూషణములలో అపూర్వమైన హెచ్చుబడిన నవరత్నభూషణాదులు అపరిమితముగాయిచ్చి అప్పాజి షోడశపాత్రులకు అంప్పించ్చిన పదారునగల నవరత్నపొడి సొమ్ములుయిచ్చి చీని చీనాంబరమైన పట్టుపతావళ్లు పీతాంబరాదిగాగల సకలమైన కోకతాకలున్ను యిచ్చి యేనుగగుర్రం కత్తికెడం మొదలుగాగల రాజోపచారమైన బహుమానములున్ను యిచ్చి విండ్డుపీడుకళ్లు ప్రసాబడశేయించ్చి సుబుద్ధినింన్ని వెంబ్బడి కూర్చి అంప్పగా రాయలవారు అత్యంతసంతోషయుక్తులై నగారాశేయమని గజారోహులై అప్పాజిసుబుద్ధిని కూడా చోడోలున వుంచ్చుకొని బయలుదేరిరాగా యీపర్యాయములన్నింన్ని గోలకొండ్డ విజయాపురం అహముదానగరం యేలే

(సశేషము.)

ప్రకటన

ఆంధ్రసాహిత్య పరిషత్తు, చెన్నపురి.

ప్రతిష్ఠాపకులు:—

శ్రీపిఠాపురము రాజాగారగు శ్రీరాజా రావు కుమార వేంకటమహీపతి సూర్యారావు బహద్దరుగారు.

శ్రీవేంకటగిరిరాజాగారగు మహారాజా సర్ - వెలుగోటి శ్రీరాజగోపాల కృష్ణయాచేంద్రబహద్దరుగారు, కె. సి. ఐ. ఇ., పంచహజారీమన్సబ్దార్.

అగ్రాసనాధిపతి:—

శ్రీవేంకటగిరి మహారాజాగారు.

కార్యనిర్వాహక సభాధ్యక్షుఁడు.

మ-రా-రా-శ్రీ జయంతి రామయ్యపంతులుగారు. బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

మ-రా-రా-శ్రీ పురాణం నాగభూషణంపంతులుగారు, ఎం ఏ., బి. ఎల్.
,, ఆచంట లక్ష్మీపతిగారు, బి. ఏ., ఎం. బి., సి. ఎమ్.,
,, నెమలి పట్టాభిరామారావు పంతులుగారు బి. ఏ.,

కోశాధ్యక్షులు (ట్రస్టీలు)

దివాన్ బహదూర్ కంచి కృష్ణస్వామిరావుగారు. సి. ఐ. ఇ.,
,, రావుబహదూర్ పిట్టిత్యాగరాయసెట్టిగారు, బి. ఏ.

కార్యస్థానము.

2/7 హారిస్ రోడ్డు, పుదుపేట.

చందానిర్ణయము.

__పరిషదుద్దేశము:__—ఆంధ్రశబ్దములకు సలక్ష్యవ్యుత్పత్తికముగ విపులనిఘంటువు రచించుట, తెలుఁగుభాష కితరభాషలతోఁగల సంబంధమును దెలుపుచు భాషాతత్త్వమును నిరూపించుట, శాస్త్రమును రచించుట, ఆంధ్రదేశపూర్వవృత్తాంతమును బ్రమాణపూర్వకముగా నిరూపించులక్షణ శాస్త్రపారిభాషికపదముల నిర్ణయించుట, నూతనగ్రంథరచనకు సాహాయ్య మొనర్చుట, భాషావిషయములఁజర్చించుటకుఁ బత్త్రికనొకదానిని బ్రకటించుట, సమగ్రమగు పుస్తకభాండాగారము నేర్పఱచుట, ఇత్యాదివిధముల నాంధ్రభాషావాఙ్మయాభివృద్ధికై యత్నించుట, పరిషత్తుయొక్క యుద్దేశము.

1.	ఉద్ధారకులకు	రు.	5000.
2.	పోషకులకు	,,	1000.
3.	యావజ్జీవసభ్యులకు	,,	100.
4.	సాధారణసభ్యులకు సంవత్సరమునకు	,,	6.

పరిషత్సభ్యులు పత్త్రికకు వేఱుగాఁ జందా నియ్యనక్కఱలేదు.

సభ్యులు కాఁగోరువారు __కార్యదర్శుల పేర__ వ్రాసి పరిషన్నిబంధనలఁ దెప్పించుకొనవచ్చును.

విజ్ఞానచంద్రికాగ్రంథమాల.

ఆంధ్రులపౌరుషము! ఆంధ్రులయౌన్నత్యము!! ఆంధ్రులబుద్ధివైభవము!!

ఆంధ్రులచరిత్రము.

రెండవభాగము.

ఇందు క్రీ.శ. 1100 నుండి 1350 వఱకుఁగల ఆంధ్రదేశచరిత్ర వర్ణింపఁబడినది.

పురాణములు, కావ్యములు, శాసనములు, విదేశీయులవ్రాఁతలు, మొదలగువాని నన్నింటిని శోధించి తెలుఁగుచోడులు, నాగవంశోద్భవులైన మహారాజులు, కాకతీయచక్రవర్తులు, పల్నాటివీరులు, కమ్మవారు, రెడ్లు, వెలమలు మొదలగువారి చరిత్రలు, ఈ యుద్గ్రంథమునందు క్రోడీకరింపఁబడినవి.

రామానుజుఁడు, బసవేశ్వరుఁడు, నన్నెచోడకవిశిఖామణి, ఖడ్గతిక్కన, కవితిక్కన, గణపతిదేవచక్రవర్తి, ప్రతాపరుద్రమహారాజు, మహారాణి రుద్రమదేవి, మొదలగువారల పవిత్రజీవితములు శ్రద్ధతో వ్రాయఁబడినవి.

ఆయాకాలమందలి సాంఘిక, రాజకీయస్థితులు చక్కఁగ వివరింపఁబడినవి. ప్రదేశములయొక్కయు, కట్టడములయొక్కయు, పటములు కలవు.

పౌరుషమునందును, పాండిత్యాతిశయంబునందును రాష్ట్రపాలనయందును ఆంధ్రులు హిందూదేశములోని యితరదేశములవారికి తీసిపోవువారు కారని యీగ్రంథము సప్రమాణముగా సిద్ధాంతీకరించుచున్నది.

ఇట్టిగ్రంథము తెలుఁగులోగాని మఱియే యన్యభాషలోఁగాని యెవ్వరును రచించియుండలేదు.

విఖ్యాత లేఖకులగు శ్రీయుత చిలుకూరి వీరభద్రరావు పంతులుగారిచే నిది రచింపఁబడినది. 400 పేజీలు గలిగి మంచికాగితములమీఁదచిన్నయక్షరములతో ముద్రింపఁబడి చక్కనిక్యాలికోబైండుచేయఁబడినయీయమూల్యగ్రంథము మాచందాదారులకు పోస్టేజితో రు. 1—0—0 కును, చందాదారులు కానివారలకు పోస్టేజిగాక రు 1—8—0 లకును ఇయ్యఁబడును.

☞ విజ్ఞానచంద్రికా బుక్కుడిపో యందు సంస్కృతాంధ్రగ్రంథము లనేకములు దొరకును. వలయువారికి క్యాటలాగులు పంపఁబడును.

చిరునామా:—

ఆ. లక్ష్మీపతి, బి ఏ., ఎం. బి. సి. ఎం.

మేనేజరు.—విజ్ఞానచంద్రిక,

చింతాద్రిపేట.—మద్రాసు.

చందా సం ॥ కు రూ. ౩—౦—౦. విడిసంచిక రూ. ౦—౫—౦.

సంపుటము ౩. | ఆనందనామసంవత్సరము కార్తికమార్గశీర్ష మాసములు. | సంచికలు ౮-౯.

ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రిక.

ప్రతిమాసమున్ను గడపటివారములోఁ బ్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

ప్రధానవ్యాసములు.

1. అంగారక గ్రహము. — పూదిరాజు వేంకటేశ్వరరావు.
2. విప్రనారాయణచరిత్రము. — చెదలవాడ మల్లయకవి.
3. శాస్త్రపరిభాష. — కపిస్థలం కృష్ణమాచార్యులు.
4. సృష్టిచిత్రము. — శొంఠి భద్రాద్రిరామశాస్త్రి.
5. సంకీర్తనలక్షణము. — కొల్లసాక తిరుమలయ్య.
6. పరిషత్పుస్తక భాండాగారము. — మల్లాది సూర్యనారాయణశాస్త్రి.
7. ఆంధ్రభాషాసంస్కరణ విమర్శనము. — పురాణపండ మల్లయ్యశాస్త్రి.
8. కృతివిమర్శనము.

చెన్నపురి.

విషయసూచిక.

1. అంగారక గ్రహము. 315-322

మాదిరాజు వేంకటేశ్వరరావుగారు.

2. విప్రనారాయణచరిత్రము. 323-338

చెదల్వాడ మల్లయకవి.

3. శాస్త్రపరిభాష. ... 339-341

కపిస్థలం కృష్ణమాచార్యులుగారు.

4. సృష్టిచిత్రము. 342-347

కొంతిభద్రాద్రిరామశాస్త్రిగారు

5. సంకీర్తన లక్షణము. 348-354

తాళ్లపాక తిరుమలార్యుఁడు.

6. పరిషత్పుస్తకభాండాగారము. 355-370

మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు.

7. ఆంధ్రభాషాసంస్కరణ విమర్శనము. 371-398

పురాణపండ మల్లయశాస్త్రిగారు.

8. కృతివిమర్శనము. 399-400

అంగారకగ్రహము.

గ్రహరాజ మనఁదగు సూర్యుని జుట్టివచ్చుచున్న సప్తగ్రహముల నిదివఱకెంతకాలమునుండియో మన మెఱిఁగియున్నాము. అంగారకగ్రహ మాసప్తగ్రహములలో నొకటి. సూర్యమండలము చుట్టును సంచరించుగ్రహములలో నిదియే ముఖ్య మైనది. ఆర్యభటాచార్యులవారు సిద్ధాంతీకరించిన మన యాదిమభూభ్రమణసిద్ధాంతమును గమనింపకయే పూర్వజ్యోతిశ్శాస్త్రవేత్తలు భూగోళ మితరగ్రహమండలి కంతకును, మధ్యఁగేంద్రమువలె నిలిచి యుండు ననియు, సూర్యచంద్రాదిగ్రహము లన్నియు, దమతమకక్ష్యల ననుసరించి భూమిని జుట్టి వచ్చుచుండు ననియుఁ గూడ సిద్ధాంతపఱుపఁజొచ్చిరి ; కాని యీసిద్ధాంతము నిలువఁజాలక క్రమముగ నబద్ధము కాఁ దొడంగెను. తుదకు నూతనపరిశోధనలచే సూర్యబింబము పరిమాణమునందును, తేజస్సునందును గూడ భూమికంటె వేల లక్షల మడుంగు లెక్కువగ నుండు ననియు, సూర్యుఁడు జ్యోతిర్మండలమందు నట్టనడుమ సుస్థిరముగ నిలిచి యుండి తనసహజతేజస్సుచే వెలుంగుచు నాత్మమహత్త్వముచే భూమ్యాదిసప్తగ్రహములచేతఁ దనచుట్టును ప్రదక్షిణములు చేయించుకొను చుండు ననియు స్థిరపఱుపఁబడెను. జ్యోతిర్మండలమందలి గ్రహము లిప్పటి కేడింటికంటె నెక్కువగఁ గనుఁగొనఁబడినవి. సూర్యమండలమును జుట్టివచ్చునట్టి గ్రహములలో మొదటివాఁడు బుధుఁడు; రెండవవాఁడు శుక్రుఁడు; మూఁడవది మనము వసియించుచుండిన భూమి; నాలవది యంగారకగ్రహము. సూర్యుని జుట్టివచ్చుగ్రహములలో నీ యంగారకగ్రహము నాల్గవది యైనను, భూకక్ష్యకు వెలుపలఁ దిరుగుగ్రహములలో మాత్ర మీయంగారకుఁడే మొదటివాఁడు. ఈగ్రహ మొకటియే గాక భూకక్ష్యకు వెలుపలఁ గడుదవ్వుననుండి సూర్యునిచుట్టును సంచరించునట్టి బృహస్పతి శని మొదలగు నితరగ్రహములుగూడ మఱికొన్ని గలవు ; కాని యవి భూమినుండి మనము యంత్రములసహాయమున సయితము చూడఁజాల నంతటిదూరమున నున్నవి. కావుననే మనమింతవఱకును వానినిగూర్చి విపులముగఁ దెలిసికొనఁజాల కున్నాము.

జ్యోతిశ్శాస్త్రసాంకేతికపదములలో భూకక్ష్యకు లోపలిభాగమున సంచరించుగ్రహములకు గురుగ్రహము లనియు, వెలుపల సంచరించువానికి లఘుగ్రహ

ము లనియును జేస్లు. గురుగ్రహములలో శుక్రగ్రహమును, లఘుగ్రహములలో నంగారకగ్రహమును భూమికి సమీపమున నున్నందున భూమికిని, వానికిని సమీప సంబంధము గలదు. శుక్రాంగారకగ్రహము లాకృతియందు సాధారణముగ భూమిని బోలి యుండును. మఱియు నీగ్రహములయందు సర్వశక్తిమంతుం డైన యీశ్వరుఁడు స్వభావసిద్ధముగ నొక విధ మైనస్వతంత్రజీవశక్తిఁ గలుగఁజేసి యున్నాఁడని మనయవలోకనములు మనకు గాఢవిశ్వాసము గలుగఁజేయుచున్నవి. భూమిమీఁదవలెనే యచ్చటఁగూడ జంతుజాలమును, వృక్షకోటియుఁ గానవచ్చు చున్నది.

అంగారకగ్రహము భూమి కితరగ్రహములకంటె సమీపమున నున్నది; కాని యీరెండుగ్రహములును, దమతమకక్ష్యలలో సంచరించుచు నభిముఖముగా వచ్చునప్పుడు మాత్ర మంగారకగ్రహము భూమండలమును మిగుల సమీపించుచుండును. ఈలాగు పరస్పరాభిముఖ మగుచుండునప్పుడు రెండురూపము లేర్పడుచుండును. అందు సూర్యుఁ డీ రెంటికిని మధ్య నుండుటయు, నవి రెండును సూర్యున కిరుప్రక్కల నొకదాని కొకటి యభిముఖముగ నుండుటయు నొకటి. అప్పు డంగారకగ్రహము భూమినుండి దూర మవును. ఈ సమయమున భూమికి నంగారకగ్రహమునకును గల దూరము 61800000 మైళ్లని లెక్కవేయఁబడెను. కాని రెండుగ్రహములును సూర్యబింబమున కొకప్రక్కనే యుండి యొకదాని కొకటి యెదురుగా నుండునప్పుడు మాత్రము భూమినుండి యంగారకగ్రహము మిగుల సమీపమునకు వచ్చును; ఇదియే రెండవరూపము. అప్పుడు వానికిఁ గల పరస్పరదూరము 33800000 మైళ్లు గా నుండును. ఇట్లంగారకగ్రహము భూమిని సమీపించునపు డెల్ల మనము దానిని జక్కగఁ జూడఁ గలుగుదుము. యంత్రములమూలమున గ్రహవేధఁ జేసిచేసి యీరెండుగ్రహముల గతిప్రమాణమునుబట్టి ప్రతి డెబ్బది తొమ్మిదిసంవత్సరముల కొకసారి యవి యి ట్లభిముఖ మగుచుండు నని కనుఁగొనఁ బడెను. 1719, 1798 మఱియు 1877 సంవత్సరములయం దిట్లభిముఖ మైనట్లు చరిత్రలవలన మనకుఁ దెలియవచ్చుచున్నది. అంగారకగ్రహము భూమికి సమీపమునకు వచ్చునప్పుడు దూరమునుండి దగ్గఱకు వచ్చుటచే దానిప్రకాశము మిగుల హెచ్చి యప్పు డది బొత్తిగ నొకనక్షత్రసదృశముగఁ గాన్పించుచుండును. జ్యోతిశ్శాస్త్రజ్ఞులు దూరదర్శకయంత్రములసహాయమున నాగ్రహమందలి వాయుమండలమును, దద్వైశాల్యమును, బరిమాణమును బరిశీలించి చూచిరి. కాని కడపటి

పర్యాయము మాత్రము అనఁగా 1877 వ సంవత్సరమువఱకు వివిధనూతనయంత్రములు కనుఁగొనఁబడి తన్మూలమున నాగ్రహమును సంపూర్ణముగ నవలోకించి, పూర్వోక్తవిషయములను జక్కఁగఁ దెలిసికొనుటయే గాక యంగారక గ్రహమందలి వాతావరణమున నీటియావిరిగూడఁ గలిసియున్న దని కనుఁగొనిరి. వీలాగున మన యొద్ద నాషాఢశ్రావణమాసములయందుఁ గాఱుమబ్బులు గ్రమ్ముచుండునో, యాలాగుననే యొకప్రత్యేకఋతువునందలి వాతావరణమునందు మేఘపరంపర తిరుగులాడుచుండును. మఱియుఁ గాలానుసరణముగ నచ్చట వర్షించును; మంచు గురియును. తన్మూలముననే యచ్చటి పశు పక్ష్యాదిజంతుసంతానమును, బుష్పలతాది వృక్షజాతులును జీవింపఁజాలి యుండును. గణితశాస్త్రప్రకారము నేఁటినుండి నలువదిరెండుసంవత్సరముల తరువాత (1956 వ సంవత్సరమున) అంగారకగ్రహము మరల భూమిని సమీపించును. ఈసారి మనయంత్రశాలలయం దత్యుత్తమములైనయంత్రములు సిద్ధముగ నున్నవి. ఆకాశావలోకనమునకై వివిధనూతనవస్తునిర్మాణము గావింపఁబడినవి. కావున నీ గ్రహాభిముఖసమయమున నంగారకగ్రహవిశేషములను గుఱించి యేయేవిషయముల భిన్నాభిప్రాయములు గలవో చక్కఁగఁ బరిశీలించి తీర్మానింపవచ్చును.

అంగారకగ్రహవ్యాస (Diameter) పరిమితి 4400 మైళ్లు. వైశాల్యమును, బరిమితిని బట్టి చూచినచో నది భూగోళమునందు $\frac{1}{6}$ వ భాగమునకు సమానముగ నుండును. ఇఁక భౌతికశక్తిని బరిశీలించిన నది భూమియందుఁ గల శక్తియొక్క $\frac{1}{9}$ వ భాగమునకు సమాన మని తెలియును. కావుననే యంగారకగ్రహమందలి యాకర్షణశక్తి భూమ్యాకర్షణమునకంటె మిగులఁ దక్కువదై యున్నది. ఇక్కడఁ దొమ్మిదిమణుఁగుల భారము గలిగిన యొకవస్తు వంగారకగ్రహమునం దొకమణుఁగు బరువు మాత్రమే గలిగి యుండును. భూమి 365 దినములలో నొకమాఱు సూర్యుని జుట్టివచ్చును. భూకక్ష్యకు వెలుపల సంచరించు నంగారకగ్రహము సూర్యునినుండి సగటున 139000000 మైళ్లదూరమున సంచరించుచుండును. కావున 779 దినములలో నొకపర్యాయము సూర్యుని జుట్టివచ్చును. భూమి సూర్యునిచుట్టు రెండుపర్యాయములు తిరుగుకాలములో నుచ్చస్థానమందుండినయంగారకుఁడు విశేషదూరమును జుట్టి రావలసినవాఁ డగుటచే నొకపర్యాయము మాత్రమే వచ్చును. అంగారకగ్రహములోని యొకసంవత్సరకాలము మన యొద్ద 2 సంవత్సరముల 49 దినములకు సమానము. మఱియు నాగ్రహ మొక

మాఱు తనయక్షముమీఁద నాత్మప్రదక్షిణముఁ జేయుటకుఁ గావలసినకాలము దాదాఁపు భూమియొక్క దైనందినగతికి సమానముగా నుండును. భూమి తనచుట్టుఁ దానొకమాఱు తిరుగుటకు 24 గంటలకాలము పట్టును. దానివలన మన కొక పగలును, రాత్రియుఁ గలుగుచున్నవి. అంగారకగ్రహ మాత్మప్రదక్షిణము చేయుట కింతకంటెఁ గొన్నినిమిషముల కాల మెక్కుడుగఁ గావలసివచ్చును. అనఁగా నది తనచుట్టును దానొకమాఱు తిరుగుటకు 24 గంటల 39 నిమిషముల 21 సెకండ్ల కాలము పట్టును. మొత్తముమీఁద మనభూమియందువలెనే యచ్చటను గూడ 12 గంటలపగలును, 12 గంటలరాత్రియుఁ గలుగుచున్నవి. కావుననే యంగారకగ్రహము భేదమేమియు లేక సాధారణముగ భూమిని బోలియుండు నని చెప్పఁబడుచున్నది. మనభూమి యందువలెనే యచ్చటను రాత్రులును, బవళ్లును గలుగుచుండును; ఇచ్చటవలెనే పంటలు మాఱుచుండును; శీతకాలము మున్నగు కాలములును, హిమవదాదిఋతువులును, వచ్చుచుఁ బోవుచునే యుండును. కాని యచ్చట మంచు చాల దట్టముగఁ గురియుచుండును. అందును విశేషముగ నుత్తర దక్షిణధ్రువములు మాత్ర మెల్లప్పుడును మంచుచేఁ గప్పఁబడియే యుండును. ఇచ్చటఁ గాలములు మాఱుచుండుటకు ముఖ్యకారణము భూమ్యంతిరాళమందలి కేంద్రస్థానము (Centre) క్రాంతిమండల మనంబరఁగు నాకాశమండలము నుండి 23½ యంశము (Degree) క్రిందికి వంగి యుండుటయే యని యెల్లరకుఁ దెలిసినవిషయమే. అంగారకగ్రహ మింతకంటె గొన్నియంశము లెక్కువ యనఁగా 28 యంశముల (Degrees) 21 లిప్తలు (Minutes) తగ్గియున్నది. ఇంచుక భేదమేగాని విశేషభేద మేమియు లేదు. (అనఁగా) ఆకాశమందలి క్రాంతిమండలి యను సాంకేతికనామము గల యొక సంకల్పితస్థల మీరెండుగ్రహములయుఁ గేంద్రముల నంటి దాదాఁపు సమకోణములపై వ్యాపించి యుండు నని యర్థము. ఇట్లు తిరుగుచుండుటయే కాలములు మాఱుచుండుటకు ముఖ్యకారణము.

అంగారకగ్రహమునందుఁ గొన్ని నల్లనల్లని పొడలు గాన్పించుచుండును. అందు విశేషభాగ మెఱుపువర్ణమును గలిగి యున్నవి. రక్త మెట్ట్రగ నుండును; కావున సనాతను లాగ్రహమును మానవుని పాలిటి మృత్యుదేవత యని భావించుచు నాపేరు తలఁపునఁ బాఱి నంతనే భీతిని జెందుచుండిరి. నూతనపరిశోధన లిప్పుడు మనమనములనుండి యాభయమును బాఱఁద్రోలినవి. ఈ గ్రహగతికిని మన జననమరణ సుఖదుఃఖములకు నెట్టిసంబంధ ముండఁజాల దని మన మిప్పుడు తె

లిసికొంటిమి. మన సుఖ దుఃఖములకు మనకార్యాకార్యకరణమే కారణముగాని వేఱు గాదు. గ్రహగతివలన మనకు వేఱులాభము లనేకములు గలుగవచ్చును; ఆవిషయము వేఱు. సూర్యునివేఁడిమి, తేజస్సును, భూమియందలి జంతుజాలమున కును, వృక్షకోటికి నెట్లు జీవనాధారముగ నున్నవో యట్లే యితరగ్రహముల కిరణ ప్రసారముచే భూమియందు నివసించువారి కేదేని ఫలము గలుగుచున్న దని చెప్పిన నమ్మఁ దగియుండును. అట్లు గాక నక్షత్రాది గ్రహగతులే మన దురదృష్టాదృష్ట ములఁ దీర్మానించు ననియుఁ, దన్మూలముననే మనకు శుభాశుభములు సంప్రా ప్తించు చుండు ననియుఁ, దలంచుట జ్యోతిషమందలి ఫలితభాగమును గల్పించిన వారి జ్ఞాపకచిహ్నముగ వెనుకటినుండియు సంధపరంపరగా వచ్చుచుండిన యొక దుర్భ్రమ కాని వేఱుగాదు.

అంగారకగ్రహము రక్తవర్ణమును గలిగి యుండినంతనె మనము దాని నొక భయంకరగ్రహ మనియుఁ, బాపగ్రహ మనియుఁ దలఁపరాదు. మనకు సూర్య కిరణములనుండి కలుగుచుండిన కాంతివలె నీ గ్రహము నెఱుపుధాతువు గలకాంతి కూడ నాగ్రహవర్ణమును సూచించుచుండును. అంగారకగ్రహవాతావరణము నందు మేఘశకలము లుత్పన్నము లగునప్పుడు నీలవర్ణసమాగమ మై యుండినట్టు చూడఁబడినది. బలమైన దూరదర్శకయంత్ర సహాయమున నంగారకగ్రహదక్షిణ ధ్రువము ధావళ్యముగఁ గాన్పించుచుండును. దానిని జూచునపు డెల్లను మంచు చేఁ గప్పఁబడియుండు హిమవత్పర్వతోన్నతశిఖరములు జ్ఞప్తికి వచ్చుచుండును. ఉత్తరధ్రువముఖము భూమివైపు తిరిగియుండకపోవుటచే నెల్లప్పుడును మనకు నగపడక యంగారకగ్రహము తనకక్ష్యయం దాత్మప్రదక్షిణము సేయుచు సూర్య మండలమునుండి దూర మైనప్పుడే మనకుఁ గనఁబడుచుండును. హర్షల్ దొరగారు తమ బలమైనదూరదర్శక యంత్రసహాయమున నంగారకగ్రహమునందలి యుత్తర దక్షిణధ్రువముల రెంటినిగూడఁ జక్కఁగఁ జూచియుండిరి. ఇందువలన మంచుచేఁ గప్పఁబడిన యీ రెండుధ్రువములయందును సాధారణము లై నమార్పులు గలుగు చుండును; కాని నీలవర్ణము గలిగిన మధ్యప్రదేశమునందు మాత్రము వివిధము లై నమార్పులు గలుగుచుండు నని తెలియవచ్చెను. వేసవికాలమునం దుత్తర దక్షిణధ్రువములయందలి మంచుకరుళ్లు కరఁగ నారంభించి యాయాభాగముల యందలి కాంతి సన్నమై పోవుచుండును.

గణితశాస్త్రజ్ఞు లంగారకగ్రహమందలి వ్యాసరేఖ పరిమితిని గనుఁగొనిరి.

కాని యం దనేకులు భిన్నాభిప్రాయు లై యున్నారు. అంగారక గ్రహావరణము, లోహగోళమువలె గుండ్రముగ నుండును. కావుననే దానిపొడవును, వెడల్పును, సమానముగ నుండు నని కొందఱును, భూమి నారింజపండును బోలి యుండు లాగుననే యంగారకగ్రహము కూడ నుత్తర దక్షిణధ్రువముల కడ లోనికి వంగి నాడీమండలము (Equator) నొద్దమాత్రము వెలికుబికి యుండు నని మఱి కొందఱును దమతమయభిప్రాయములను బ్రకటించిరి. కాని యీకడపటియభిప్రాయముఁ బలువు రై కకంఠ్యముగ నొప్పుకొని యున్నారు. భూపటమును జూడఁ దలఁచిన విజ్ఞానచంద్రికామండలివారిచేఁ బ్రకటింపఁబడిన యాఱవగ్రంథ మగుపదార్థ విజ్ఞానశాస్త్రము (6౩) పటమును జూడనగును. మృదు వైనమట్టితోఁ జేయఁబడిన యొక మృద్గోళమును బొంగరములాగున గిఱగిఱఁ ద్రిప్పినచో నది యాపై పటమునందలి రూపమునె దాల్చు ననుట సుప్రసిద్ధము. కావున నంగారకగ్రహ మొకప్పుడు పలుచని ద్రవపదార్థమువలె నుండి కాలక్రమమునఁ దనగతి ననుసరించి ఘనీభవించి ప్రస్తుతావస్థం జెందినది. కావున దాని వ్యాసరేఖలు సమానముగ నుండఁజాలవు. 1877 వ సంవత్సరమున నంగారకుఁడు భూమి సమీపమునకు వచ్చియుండె నని చదువరు లీవఱి కెఱింగినవిషయమే కదా! గణితశాస్త్రజ్ఞు లప్పటి తమ యవలోకనావిషయముల నెల్లను జక్కఁగ వ్రాసియుంచిరి. అట్టివానియం దెల్ల నంగారకగ్రహమున వేలకొలఁది నదులు ప్రవహించుచున్న వని వ్రాయుట మిగుల నచ్చెరువు. ఒకశాస్త్రజ్ఞుఁ డిట్లు వ్రాయుట యవలోకనాలోప మని వ్రాసియున్నాఁడు కాని యంగారకగ్రహపటము లెచ్చటఁ గాంచినను నదీచిహ్నములు లేనిపటము గానరాదు. ఆనదులను జూచుటచే నందు బుద్ధివైశాల్యము గలిగిన జాతి యొకటి గలదనియు, వారే యందలి నదీనదములను దమతమ భూములను ఫలవంతములుగఁ జేసికొనునిమిత్తము త్రవ్వుకొని యుందు రనియుఁ దోఁచుచున్నది. అచ్చట ధారాధరములు వర్షించు ననుటయే నదీ తటాకాదుల యాస్తిక్యమును స్థిరపఱుచుటకొకతార్కాణము. కావున నచ్చట జీవజంతువులుఁ గూడఁ దప్పక యుండితీఱవలయు నను నమ్మకము గలుగుచున్నది.

1877 వ సంవత్సరమున భూమ్యంగారకగ్రహము లభిముఖము లైనప్పుడు మఱియొక నూతనవిషయముగూడఁ గనిపెట్టఁబడెను. అంగారకగ్రహమును నలువైపులఁ జుట్టివచ్చునట్టి మఱిరెండు చంద్రగ్రహములును గలవు. అవి యెనిమిది లేక పది మైళ్లపరిధిని మాత్రమే కలిగియున్నవి. ఆయుపగ్రహములు త్వరితగతిని

దాము తిరుగవలసినప్రదేశము నంతను జుట్టి వచ్చుచుండును. అంగారకగ్రహ మొకమాఱు తనచుట్టుఁదాను దిరుగుటకుఁ దొమ్మిదిగంటలపూర్వ మవి తమధర్మము నెఱవేర్చును. కావున నవి పడమట నుదయించి, తూర్పున నస్తమించుచున్న వని స్పష్టమగుచున్నది. ఈనూతనవిషయమును మన మీభూవలయమున నెచ్చటను గానము. అంగారకగ్రహమునంగల నల్లనిప్రదేశములును, నీలవర్ణస్థలములును జూచి పూర్వశాస్త్రజ్ఞులు వానిని సముద్రము లని భ్రమించి యుండిరి. కాని ఈ సంవత్సరపు నూతనపరిశోధనలచే నవి యచ్చటి నిర్జలపర్వతప్రదేశము లని తెలియవచ్చెను. పూర్వ మచ్చట మహాతరంగములచే విలసిల్లుచుండిన సముద్రము లన్నియు నిప్పు డింకి నిర్జలప్రదేశము లై యున్న వని నిశ్చయముగఁ దేటపడుచున్నది.

భూప్రజ లంగారకగ్రహవాసులతో సంజ్ఞారూపకసంభాషణ మొనర్పవలయు ననువిచారమున మునింగి యున్నారు. అయిరోపాదేశమం దీప్రయత్నమునకుఁ దగినయుపకరణములు గూడఁ జేర్చి యుంచఁబడినవి. ఒకానొక ప్రసిద్ధివడసిన ప్రకృతిశాస్త్రజ్ఞుఁ డంగారకగ్రహవాస్తవ్యులతో సంజ్ఞారూపమున మాట్లాడుటకు విద్యుచ్ఛక్తి నుపయోగించినచోఁ బ్రస్తుతము పనిచేయుచుండిన యంత్రములకంటె నెన్నియో లక్షలమడుంగు లెక్కువశక్తి గలిగిన విద్యుద్యంత్రములు గావలసియుండు నని లెక్కవేసి యున్నాఁడు. అట్లుగాక మన మొకవెలుతురుమూలమున వారికి సంజ్ఞ చేయవలయు ననిన వారు తమనేత్రములచే నాప్రకాశమును జూచి యొకానొకజాతివారు తమతో భాషించుటకుఁ దమశ్రద్ధ నాకర్షించుచున్నా రని తెలిసికొనునట్లు చేయుటకు నలువదికోట్ల వత్తుల ప్రకాశమును గలిగిన యొక బలమైన శక్తిగల జ్యోతి కావలయు ననియు, నాజ్యోతిని వెలిగించుటకు గంటకుఁ తొమ్మిదివందలపౌనులు వ్యయ మగు ననియుఁ గూడ మదింపు వేసియున్నాఁడు. ఈవిషయము లన్నియు వ్యక్తీకరించిన పిదప నొకవేళ నాగ్రహమందు ధీవిశాల మైనజాతి యేదైన వాసము చేయుచుండిన నాజాతి మనసంజ్ఞల నవశ్యము గ్రహించి ప్రత్యుత్తర మొసంగును; కావున మనము మనసంజ్ఞలను భావసూచకము లగునట్లు చేయుటకుఁ బ్రయత్నింపవలయును. మఱియు నీరీతినే యొకగ్రహవాసులు మఱియొకగ్రహవాస్తవ్యులతో సంభాషించి యొండొరులు తమతమ యభిప్రాయములఁ దెలిసికొని భేదము లున్న మార్చుకొన నగు నని మన మేధావు లైనప్రకృతిశాస్త్రజ్ఞు లభిప్రాయపడుచున్నారు.

ప్రొఫెసర్ లావెల్ దొరగారు తమనూతనానుభవములవలన నంగారకగ్ర

హముననందు రూపు రేఖలయందు భూమండల మానవకోటికి భిన్నమును, ధీబల సంపన్నము నైన యొకజాతి తప్పక యుండితీఱు నని నిరూపించియున్నారు. మఱియు నీ ప్రకృతిశాస్త్రప్రముఖుఁడు తనయభిప్రాయమును వక్ష్యమాణరీతిం జెప్పియున్నాఁడు. భూగోళమునకంటె చిన్న దైన యంగారకగ్రహమున కిప్పుడు జీవితపరిమాణము ముగిసి విలయకాలము సమీపించుచున్నది. మహాతరంగములచే నలరారు చుండిన సముద్రములును, మహానదులు నింకిపోయినవి. అంగారకగ్రహవాసు లామరుప్రదేశములందుఁ దమజీవితమును గాపాడుకొనుటకును, జలాన్వేషణమునకును ప్రాణములనుగూడ లక్ష్యము సేయక విశ్వప్రయత్నముం జేయుచున్నారు. జలశూన్యతచే నంగారకగ్రహమందు లయకాల మాసన్న మైనట్టు కానవచ్చుచున్నది. జలము లేక జీవించుట యసాధ్యము గదా ! సూక్ష్మగ్రాహు లైన యంగారకగ్రహవాసులు జలసమృద్ధికొఱకు వివిధప్రయత్నములును, విచారములును జేయుచున్నారు. అంగారకగ్రహమందు నదులు గల వనుటకుఁ గారణ మారసిన నాగ్రహావరణమునందుఁ గొంతకాలమునకుఁ బూర్వ మీభూమిమీఁదవలెనే సారవంతములు, ఫలప్రదము లైన భూము లుండె నని తెలియవచ్చుచున్నది. భూమిని ద్రవ్వకుండ జలము చేచిక్కదు; కాఁబట్టి మనము నదు లని తలంచుచుండిన గుర్తులాయాఋతువులయందుఁ బచ్చగ నవనవలాడుచుండి కాలము మాఱినతోడనే శుష్కించి యెండి పోవుచుండిన యంగారకగ్రహవాసుల పైరుపచ్చ లై యుండు నని యాధునికప్రకృతిశాస్త్రజ్ఞుల యభిప్రాయము. మఱియు నీపైరులు నీటికాలువల కిరుప్రక్కల సాగుచేసి పెట్టఁబడును. అవియే వృద్ధి యైనప్పు డానీటికాలువలను గూడఁ గప్పివేయును. నైలుమహానదీతీరమునఁ బెట్టఁబడిన పైరు లంగారకగ్రహవాస్తవ్యుల కొకనదివలెఁ గానఁబడుచుండు నఁట! వేయేల యంగారకగ్రహమందలి యంతరుష్ణము నశించిన హేతువునఁ బ్రళయకాల మాసన్న మైనట్టు తోఁచుచున్నది. ఆగ్రహము తనజీవితమును ముగింపఁజేయుచున్నది. దానిలోని వృక్షములు జంతుజాలమును నశించును. అప్పు డది చంద్రగ్రహమువలె నొక మృతగ్రహ మగును.

మాదిరాజు వేంకటేశ్వరరావు.

విడబించు చోడచప్పరంబులునుం గలిగి రాజమందిరంబునుం బోలె నైష్ఠి
కాధిష్ఠితంబును, గగనమండలంబునుం బోలె వాజివిహారయోగ్యంబును,
కృష్ణాగమనంబునుంబోలె హరిభక్తవిరాజితంబును, స్వారోచిషమనుసంభ
వంబునుం బోలె వరూథినీప్రధానంబును, మధ్య(మ)పురుష హృదయంబునుం
బోలె రాజసమానంబును నై హిరణ్యకశిపుచరిత్రంబు చందంబున నసహ్య
తనయాభంగ ప్రవర్తమానాభిరామంబుగాక సహ్యతనయాభంగప్రవర్తమా
నంబై, నహుషాహంకారంబు విధంబున నహితాపాదనకారణంబు గాక
హితాపాదనకారణంబై, పురుషధనుఃకోదండంబుకైవడి నమార్గణ విహా
రానుకూలం(బు గాక మార్గణవిహారానుకూలంబై), యోగిజనవర్తనంబుపగిది
నభవనవ్యాపార విభవాస్పదంబుగాక భవనవ్యాపార విభవాస్పదం బై
యొప్పు నప్పురంబుఁ బ్రవేశించి. 14

— * విప్రనారాయణుఁడు పుష్పవనము నిర్మించుట. * —

శా. ఆరాజీవభవాన్వయాభరణుఁ డాత్మారాముఁ డై యందుఁ గా
వేరీవార్యవగాహనంబులు మహావిద్వజ్జనాసక్తిచే
శ్రీరంగేశ్వరపాదపద్మయుగళీ సేవాక్రియాసంతత
ప్రారంభంబున నిత్యమాధుకరచర్యన్ ధన్యుఁ డై యుండుచున్. 15

చ. పొలుపుగ రంగధామునకుఁ బువ్వులతోఁట యొనర్చి తొంటి నా
కలిగినపాతకంబులు కకావికగా విడనాడి బ్రహ్మవే
త్తలఁ గని ముక్తిఁ గాంతు నని తత్పురిపశ్చిమసీమఁ గాంచె ని
ర్దళితసమస్తసాధుపరితాపను శ్రీమకుటాంతరీపమున్. 16

క. కని యాదీవికిఁ జేరం, జని యమ్మునివరసుతుండు సహ్యమహీభృ
త్తనయాతటము తలంపున, కనుకూలము సమతలంబు నతులం బనుచున్.

గీ. గ్రామనికటంబు గాక దూరంబుగాక, చౌటిపొర గాక చిట్టాటచోటుగాక
వెల్లితలగాక క్రిఁజెడ ల్వేరుఘురువు, రాతిపోటును లేని బారాటి నేల. 18

క. పూనిక గడచన విష్వ, క్సేనప్రార్థనము సేసి చేకొని యచ్చోఁ
గానఁబడు చెట్టుసేమలు, గానం బడ నఱికి కంపగట్టిన పిదపన్. 19

ఉ. ఆయనఘుండు దారుజలయంత్రముచేతఁ గవేరకన్యకా
తోయము లెత్తియెత్తి యొకతోయముగాఁ గనుజాడయెత్తి యా

పోయి ధరిత్రి దాఁ దనివిపొందినదాఁకను నీళ్లు గట్టి ప
ర్యాయముతోడఁ బాటిపడనై యదనైన ముదంబు తోడుతన్. 20

సీ. లుబ్ధకాద్భుతసిత స్తబ్ధరోమాకృతిఁ దలపోయుచును నేల ద్రవ్వి ద్రవ్వి
సింధుగర్వాహవం క్తికంధరారిధ్యానకలితుండై కట్టలు గట్టికట్టి
యందమొందఁ గళిందనందినీభేదికిఁ దెలుచుచుఁ గాలువల్ దీర్చితీర్చి
చక్రి త్రివిక్రమవిక్రమక్రీడలు గొసియాడుచును మళ్లు గొలిచి కొలిచి

గీ. మిట్టుపల్లంబు లెల్లను మెలఁపుతోడ, సరసి నాలుగుమూలలుఁ జదునుగాఁగ
నేర్పుతో నాలవాలంబు లేర్పఱిచి, తమిని నానాఁటికిని వానితతి మెఱింగి,

క. కొన్నిటికి నారునాటుచుఁ, గొన్నింటికి నంట్లు పాదుకొలుపుచు మఱియుం
గొన్నిటికి విత్తనములు త, గన్నాటుచుఁ దోఁట సేయఁగడఁగిన యంతన్.

ఉ. నీటను చేమమొక్కఁ నసి నిల్చి యొకించుక వాడు దేఱి య
ప్పాటున వేరువాఱి ధృతిపాటన మొప్ప నతం డొనర్చి న
ప్పాటునఁ జెన్నుమీఱి పరిపాటిగఁ గెంజిగు రక్కడక్కడన్
మోటిక లెత్తి క్రొవ్విరులు మొగ్గలు వెగ్గల మయ్యె నయ్యెడన్. 23

క. అమరఁగ లతికలు దరువులు, దమరసమై పసిమి మిసిమి దగ్గక మిగులం
గొమరై ప్రొద్దోకచాయల, గుములై యెలదోఁట యనలుగొనలుం బాఱెన్.

వ. వెండియుం జకచక ప్రభాభరిత జాలకంబు లగువకుళజాలకంబులును, బరితః పరీత పరిమళమిళిత పరాగంబు లగుపున్నాగంబులును, దరవికచప్రసవమంజరీ మంజుళంబు లగువంజుళంబులును, గిసలయశ్యామాయమానంబులై వెలసి యొండొంటిం గలసి మెలసి విలసిల్లు తులసియును, నిజవాసనాకందళిత సకలజనానందంబులగు కుందంబులును, విరిదేనియలసోనలం దోరంబు లగు కరవీరంబులును, నిరంతర భ్రమరీగానంబు లగుపాటలీవితానంబులును, విరికెలంకులం బొదలు గొజ్జంగిపొదలును, సాయంతన సమయవికసనంబు లగువికచవిచికల నిచయంబులును, మీఱు కురువేరును, అంకురితగంధ కదంబంబు లగులామజ్జకస్తోమంబులును, మితిగడచి లతికలకెల్ల నేలిక లగు నవమాలికలును, వికస్వర ప్రసవగేయంబు లగుచాంపేయంబులును, నరవిరి విరులఁ గొఱలి యితరసౌరభలోలుభ ద్విరేఫంబులకు వల్లియ లగు బొండు మల్లియలును, నరుణవృంతాంత భారంబు లగు మందారంబులును, బరువం బగుమరువంబును, గర్భదళసౌరభ్యనిలయ మలయానిలాపదాత

వ్రాతంబగు కేతకీజాతంబును, రాలచ్చికి రచ్చ యగుపచ్చయును, విరహిణీ
జనకంటకంబు లగుకంటకంబులును, నయనానంద సంపాదు లగుజాదు
లును, నాదిగా సల్లలిత పల్లవిత కోరకిత ప్రసవిత లతికాతరుషండంబులు తం
డతండంబులై ప్రపీలిత చ్ఛాయాజాలంబులు నిగుడం బొగడం దగి ఖరకర
కిరణప్రకాశంబులకు నిరవకాశంబులై చలువలం జెలువమరి పథికజన పరి
శ్రమం బపనయించుచు సకలసౌరభాభిరామం బగునారామంబుఁ గనుంగొని
పరమానంద కందళితహృదయారవిందుండై యవ్విప్రనందనుండు 25

క. అరవిరు లగు *నాపెట్టిన, తరువాటికవిరుల రంగధాము రమేశున్
హరిఁ బూజింపఁగఁ గంటిని, జరితార్థుఁడ నైతిఁ దపము సఫలం బయ్యెన్. 26

మ. అని గొజ్జంగులచెంగట న్సురభిళం బై దట్టమై చెట్లఁ బ్రాఁ
కినయాచల్లనిమాధవీలతలచక్కిం జొక్కమై యుండ నే
ర్పునఁ గావించిన పర్ణశాలకడ నేప్రొద్దుం బ్రవర్తించుచున్
ఘననిష్ఠామహిమం దనర్చి మురజిత్కైంకర్య ధౌరేయుఁ డై. 27

చ. పొలుపుగ నీరుకావిపటముం గటిఁ బింజె మడంచి కట్టి విం
తలు దళుకొత్తుచుండఁ దిరునామముఁ జాఁది తదంతవీథిక్రే
వలను దశావతారములు వ్రాసిన బిల్వకరండమందు రం
జిలు తిరుచూర్ణ మార్ద్రముగఁ జేసి శలాకను రేఖ దీర్చుచున్. 28

చ. అనఘుఁ డతండు నిత్యము నహర్ముఖకృత్యము లాచరించి పా
వనమతి జిడ్డు లేక కఱువ్రాలక వాడక తావిపోక ప
చ్చనిపసి మొగ్గ గాక (కడ)సారిని మేలిమి నేర్పరించి గ్ర
క్కునఁ బరువంపుఁ గ్రొవ్విరులఁ గోయుచు వంశపుటీతలంబునన్. 29

క. సురభిళతులసీపరిమళ, పరిమిళితములుగ నొనర్చి పరిపరిగతులం
గర మరుదుగ నతిచతురతఁ, గరకుశలత మెఱయ మాలికలు గట్టి తగన్.

క. తిరువాముడి పఠియించుచు, హరిభక్తులఁ గన్న భక్తి నడియఁడ ననుచున్
శిరమటు వంచుచుఁ బ్రాకృత, పురుషుల నెడగిల్లి దూరమునకుం జనుచున్.

శా. శ్రీరంగేశ్వరదివ్య గేహమునకుం జేరంగ నేతెంచి త
త్సారంగాంకదినాధినాథనయనున్ దర్శించి యందంద వం

* నేఁ బెట్టిన, మూలము.

దారుం డై తనచేత నున్నసుమనోదామంబు లర్పించి ధ్యా
నారూఢస్థితిఁ గొంతసే పచట నాత్మారాముఁడై యుండుచున్. 32

చ. మరలి వసుంధరామరకుమారుఁడు వైష్ణవరాజమందిరాం
తరముల కేగి యందు నియతం బగుమాధుకరంబుఁ దెచ్చి శ్రీ
హరికి సమర్పణం బని తదన్నము సాపడి రేవగల్లు దా
వరముగ నుండె నయ్యుటజవాటికఁ దోఁటకుఁ బ్రోదిసేయుచున్. 33

— * శ్రీహరి లీలావినోదము. * —

క. ఈలీల నిజపదార్చన, కేలీతత్పరత నతఁడు గిటికొని యుండన్
నాళీకగేహినీకుచ, పాళీలోలుండు రంగపతి మదిలోనన్. 34

ఉ. ఆజలజాసనప్రముఖు లైన సుపర్వులు భక్తియుక్తి నైఁ
బూజలు చేయరో మఱి తపోమహిమం జరియింపలేదొ యే
పూజలు నేతపంబులును బోధనిధాన మితం డొనర్చు నీ
పూజకు నీతపంబునకుఁ బోల్పఁగ నెందును సాటి వచ్చునే. 35

చ. అనుచును సంతసించి తన దైవవినోదముఁ జూపఁ గోరి చ
క్కని దగు నిండుజవ్వని నొకానొక యచ్చరపూవుఁబోఁడిఁ జ
య్యన హృదయంబునం దలఁచి నంతనె సమ్ముఖమందు నిల్చి వం
దన మొనరింపఁ జూచి మొలనవ్వు కనుంగవ నంకురింపఁగన్. 36

సీ. కమలనేత్ర ! కవేరకన్యాతరంగిణీ వరతటంబునకు నుత్తరమునందు
బహుభోగరాగసంపన్నమై యున్నతప్రాకారగోపురభరిత మగుచుఁ
గను పట్టు సర్వజ్ఞమనుపేర దేవతా స్థానమందిర (1) ....
... ...

*   *   *   *   *   *

ఉ. లాలి మనోహరాంగి శుభలక్షణలక్షిత లాలి లాలి యో
లాలితనీలనీలకచ లాలి యటంచు సువర్ణడోలికాం
దోళనఖేలనంబులను నున్నని నిద్దుర సోలగింప నా
బాలికఁ బాడుచుండుదురు పాటలగంధులు జోలపాటలన్. 38

(1) ఇచ్చటినుండి యైదాఱుపద్యములు పోయినవి.

— * దేవదేవీ సౌందర్యవర్ణనము. * —

క. (1) తరుణివిలాసం బెన్నం, దరమే పరమేష్ఠి కైనఁ దలఁపఁగ నోహో
హరిమధ్యం బఁట బంధుర, కరిగమనం బఁట విచిత్రకర మిది గాదే! 39

చ. మొలకమెఱుంగు లింపడర ము న్బదరీఫల మౌట వెనుక నా
మలకఫల స్వరూపము క్రమంబున నౌట ననంతరంబు శ్రీ
ఫలఫలరూప మౌట బహుభంగుల నెన్నఁగ నిక్కమే చుమీ
జలరుహనేత్రచన్గవ భుజంగతపఃఫలరూప మౌటయున్. 40

ఉ. తిన్నని లేఁతసోయగపుఁ దీఁగెలు కన్నియచేతు, లిట్లు గా
కున్న సరాగపల్లవవయోరుచిరూపము లౌనె, కంకణా
భ్యున్నతిఁ జెందునే, చెలువుఁ జెందునె, వ్రేళ్లను గత్తురోచిరు
త్పన్నవిలాసరేఖ గనుపట్టునె, గొమ్మకు వన్నె దెచ్చునే! 41

క. అందంబున నలవలమురి, చిందంబు ముకుందుఁ డర్థిఁ జేఁ(2) బట్టినదా
నిం దగ నెఱుఁగముగా కీ, యిందీవరనేత్రగళము నెనయంగలదే. 42

గీ. కలికికనుఁగవ యబ్జవిఖ్యాతిఁ దనరు, బింబమును మీఱి తావిడంబించిమించు
దాన నంబుజవైరిచందంబు గెల్చు, దా నసఁగఁ బొల్చు నాప్రమదాననంబు.

క. జలచరములు తలచూపక, కలవరపాటునఁ జెలంగుఁ గన్నులసమతన్
జలరుహదళములు చిలుకల, కొలికిం గనుఁగొన్న నొక్క కొలికికి వచ్చున్.

ఉ. ఎంచఁగ మేచకద్యుతి వహించుట సోఁగ లనంగఁ దాము రా
ణించుట నెమ్మిమైఁ గడు గణింపఁగఁ బొల్చుట దా విభూతిచే
మించుట నాలతాంగినునుమించుకురు ల్బగులై తనర్చియుం
బించెము లై చరించె ననిపించె ఘనాఘనజిద్విలాసతన్. 45

క. పలుకోలమున మేలగు చెలి, పలుకులకును గప్పురంపుఁబ్రతిగాఁ దమ్ముం
బలుకు లనవలసి కాదే, పలుకుల నమ్మృగపదాది పదములు గలవే! 46

ఉ. ఆనలినాక్షి చూడఁ దమియై కనుపట్ట విభావరీకరుం
డాననబింబ మయ్యెఁ, గురు లయ్యెను గందు, సుధాధరా(ధర)
శ్రీనిగిడించె మున్ను తనుఁజెందిన కెంపు, కృశత్వ మెల్ల నా
హో నడు మయ్యె, దానిదరహాసము వెన్నెల గాక యుండునే! 47

(1) దీనికిఁ బైనిగూడఁ గొన్ని పద్యములు పోయియుండును.

(2) జెప్పందినద, న్నందన కెరగదు—అని యున్నది.

వ. ఇట్లభినవరూపరేఖావిలాసంబులకు నావాసంబై, సాహిత్యనృత్యగీత ప్రసం
గావధానంబులం దనకు నెదురు లేకయుండం జెరసి రసికతావిశేషంబులం
గురు కుకురు కరూశ మగధ మాళవ చోళ ప్రముఖ దేశాధినాయకులచేత
వాదంబునం బవాడంబులం గొనుచు సోదరీ ప్రముఖ నిఖిలసఖీజనపరివృ
తయై మగిడి శ్రీరంగసమీపంబునం జనుచున్న సమయంబున. 48

— * వేసవివర్ణనము. * —

సీ. అధ్వన్యభిజ్ఞశ్రమాధ్వన్యసంఘంబు ప్రతిపద్ధతిప్రపాపరికరంబు
పల్వలోదస్వయంపచ్యమానఝుషంబు బహుభిదేళిమశిరఃపటలరురుక
మస్తముస్తావిహస్తస్తబ్ధరోమంబు కీచకనికషణోద్గీర్ణదవము
పరితోవిభిన్నభూపదదృష్టపాతాళమానాభిగళనీరసాచ్ఛభల్ల
గీ. ముదరభాగ (ప్రపూర)ణోద్యోగవిముఖ,వమథువిరహోన్నమత్కరవ్యక్తవిటప
కించిదాతపహృద్వనీసంచరిష్ణు, మదగజేంద్రంబు వేసవి యెదురుకొనియె.

ఉ. ఏచినఘర్మవాసరము లెవ్వఁడు నేర్చుఁ దరింపఁ దత్సుధా
సేచన మొందియుం జలువఁ జెందియు రాజును నుండ దర్శవే
ళాచకితంబులై మునుపు లావుగ నెండలు గల్గు వేంద్రమం
జూచిన వోటఁ గాదె తలచూపవు వెన్నెలలుం దివంబునన్. 50

మ. సెకలూర్పన్ బుసకొట్టు పాన్పుగల రాజీవాక్షుఁడుం జేఁదు కు
త్తుకనుం గల్గిన వేల్పు మున్కలుగఁ బాథోరాశిలో నుండఁ గై
శికమందు న్నది దాల్చు బా మిపుడు గాచెం గాక కామున్న నిం
తకు నేమౌదురొ నేఁడు వేసవిని మార్తాండాతపజ్వాలలన్. 51

సీ. కర్పూరశకలసంగతవీటికాచర్వణములఁ జకోరరసపానకములవలన
మిసిమితావులఁ గదంబించు గందంబులఁ దేటకట్టాణిముత్తెంపుసరుల
శైత్యబంధురగంధసలిలగండూషల నభినవతాలవృంతానిలముల
జిలుఁగుఁజెంగావిమవ్వలువల నానీతశీతలనీహారసేచనముల
గీ. మఱియుఁగలిగినవస్తుసంపదలఁబాదల,నయినఖేదంబులకుఁబ్రతిక్రియలుగొన్ని
కొన్నివిధములఁదగియెడుకొలఁదినపుడు,కువలయేక్షణలొనరించుకొనుచుఁజనుచు

ఉ. కగ్గిన (చెక్కులుం,) జెమటగాఱెడు మోములు, వాడి వత్తులై
తగ్గిన మేనులు న్వణఁకు దార్కొను కౌనులు సారెసారెకున్

ప్రమొగ్గడు పాదము ల్మడుల ముంచినఖేదము లెండసోఁకుడు
న్వొగ్గల మైన యూర్పులును విన్ననిమోములు గానిపింపఁగన్. 53

క. జలదాకృతి ధృతతులసీ, దళదాముఁడు రంగశాయి, తద్దయు మనపైఁ
గలదాయ నేని యుండ, న్వలదా యీయెండ నొక్కవన మీయఁడన్. 54

చ. అనుచును దేవదేవి మొదలైన మృగేక్షణ లాయ్యనోయ్యనం
జన ననుపాత్తపూర్వ మనిజస్థితిదూర మధఃకృతాతపం
బనవసరాగతం బవిదితాత్మజనుస్థ్సల మప్రచోదితం
బనితరలభ్య మప్రతిహతార్జవ మత్వరితాగమంబునై. 55

సీ. కోలనిషట్పదయామికుల నెల్లఁ గనుఁ బ్రామి ననగురివెందకన్నానఁ దూఱి
పొగడలకమ్మపుప్పొడి చొక్కు పైఁ జల్లి గృహమేధిపికములఁ గికురువెట్టి
విరిదమ్మి నెత్తావి సరగున గిలుబాడి పఱపైన చిగురుజొంపములు నెమకి
పొన్నలమకరందములు చల్లుపోరాడి తెలిమించు మల్లెమొగ్గలఁ దెరల్చి

గీ. యలబలము సేయుశుకశారికలనదల్చి, శౌర్యహృతవస్తుధృతపరిశ్రమము మీఱ
విప్రనారాయణారామవీథి వెడలి, యలసగతి వచ్చె మందమందానిలంబు.

క. వడదేఱఁ గొంతయలసత, లుడిగెన్ మొగములను దెలుపు లొందెను డిందె
న్వడిఁ జెమటయు జిహ్వాలకుం, దడి వచ్చెం బవనురాకఁ దరుణుల కెల్లన్.

క. మరుదకురదరవిచల, ద్గరుదంచలచంచరీకకాంతనితాంతాం
తరుదంచితపరికుంచిత, తరుదంతురదళలతాంతతాంతప్రౌఢిన్. 58

ఉ. తోరపువేడ్క సేయు నెలదోటఁ గనుంగొని దానియున్న శృం
గారము పుష్పమంజరుల కమ్మనితావులు భృంగరాజముల్
గేరెడు సొంపు నింపు గలిగింపఁగ హాయని చొక్కి యాదరం
బారఁగ దేవదేవి తనయగ్రజ కిట్లనియెం బ్రియంబునన్. 59

శా. అక్కా యీగురివెందపందిరులచాయం గంటివే మంజరుల్
దిక్కూలంకషకాంతితో మనల నుద్దేశించి సౌరభ్యముల్
బుక్కాటముల్గ నొసంగుచు న్మనకుచంబు ల్దాల్పు ఘర్మాంబువుల్
దక్కం గైకొనె మైత్రిచే ననఁగ జూడం దేనియల్ గ్రమ్మెడున్. 60

క. గొనబు లగుచిగురుమామిడి, ననమొగ్గలు మొగ్గ లనుచు నమ్మందగదో
వనజేక్షణ యివి గావా, పనివడి తా మతనుఁ బోటుబంటుం జేసెన్. 61

మ. హరిణీలోచన కంటివే యెదుట నొయ్యారంబుగా సౌరభో
త్కరగుంజాతరుసీమఁ దెమ్మెరల రాక న్వేఁక నల్లాడు క్రొ
వ్విరితీఁగం గని యొక్కరాచిలుక శ్రీవిన్ బోటు లీక్షింప నం
దిరవై యుయ్యెల లూఁగుచున్నయది తాయిం దుమ్మెదల్ పాడఁగన్. 62

క. గామి డిదె గండుఁ దుమ్మెద, మామిడి విరితేనె లాను మత్తిమొకతె చనుం
గామిడి వాడిచెను నావలి, నోమిడి తాఁ గ్రోలె నిందుముఖి కనుఁగొంటే.

వ. అనుచు నమ్మెలజవ్వను లవ్వనవిలాసంబులకుఁ జొక్కుచుఁ బెక్కు చందం
బులఁ గొనియాడుచు వెడవెడ సోఁకులఁ గడలుకొను నొడలిబడలిక లెడలిం
చుచు నెడనెడ శీతలతరుచ్ఛాయామండపంబులం దలిరులశయనంబుల శయ
నించుచుం బురస్కృత తిరస్కరిణీ పరిసరంబుల భాసిల్లు లాస్యకేళిజనంబుల
చందంబునఁ బుష్పితలతాకుంజంబుల సందుల నందంద తెల్పుచుఁ జెలికత్తి
యలం బిల్చుచు సాయంతన జలధరంబుల మఱుఁగుననుండి యొండొండ
వెడలు క్రొమ్మెఱుఁగుల తెఱుంగునఁ జివురుజొంపంబులం బొదలుపొదలు
వెలువడి తళుకుకునఁ బ్రకాశించుచుం గుఱంగట మధ్యప్రదేశంబులు ప్రవే
శించుచుఁ గెందమ్మికొలంకుల కెలంకులఁ జరియించు రాయంచలచందం
బున మకరంద ఝురసనీడంబుల నడయాడుచుఁ బాడుచు మొత్తంబు లగు
జేగుఱు నెత్తంబుల కరిగెడు మయూరవనితలచొప్పునఁ బుష్పాడితిప్పలఁ
బరిభ్రమించు మదభ్రమరంబులఁ జూచుచు రాచిలుకలవలెం గిలకిలం బలు
కుచుం జనిచని. 64

సీ. అలవిధుంతుదుని చే నగుతాప మాఱదే హరిణాంకుఁ డిది చూడఁ డయ్యెఁగాక
కాలకూటానలగ్రసనార్తి మానదే పురహరుఁ డిటు రాకపోయెఁ గాక
బడబాగ్నిశిఖలఁ జొప్పడుపాటు దీఱదే జడధి కియ్యనికి చేపడదుగాక
తపనుఁడు మార్గఖేదము వీడనాడఁడే లీల నిందు వసింపలేఁడు గాక

గీ. యనఁగఁ జలువల నెలవు వాసనల కిరవు, నిబిడమును నైనద్రాక్షపందిరులచక్కి
నున్న యొకకన్నెసురపొన్నగున్ననీడ, జలరుహేక్షణ లుబుసుపోకల వసించి.

చ. ఇల నితరంపువాసనల నెల్ల నుచు క్కనిపించు చున్నదీ
లలితలతాంతగంధము, కొలంకులఁ దేఁటులపాట వల్లకీ
కలకలరావముల్ చెలువు గా వనిపించె లతాంగులార! యీ
చలమరిగాడ్పులం గలుగుచల్లఁదనం బిఁకఁ జెప్పనేటికిన్. 66

క. అనుచుం జిలుకలపలుకులు, వినుచుం బూఁబొదలఁ బొదలు విభవంబుఁ గనుం
గొనుచున్ రెండడుగులు నట, చనుచుం బన్నీటి కాల్వ జాడం జూడన్. 67

—— * వేశ్యలు విప్రనారాయణుం గనుఁగొనుట. * ——

సీ. తొగఱేనిలోకందు దిగజాఱె ననఁగ మొగమ్మున బవిరిగడ్డమ్ము మెఱయ
నుదయాద్రిశిఖరంబుతుద భానుబింబంబుసాటి నొసలఁ గావిశాటి మెఱయ
బొమల నెన్నడిమి పద్మముదళంబులరేఖ రహిఁజూపు నూర్ధ్వపుండ్రంబు నిగుడ
లో నిడిహరిభక్తి పైని ముద్రించెనా శంఖచక్రములు భుజములఁ జెలఁగఁ
త్రిపథగాభావ మొకచోటఁ దెలుపుచున్న, త్రిదశనదివోలె నఱుతజన్నిదము దనరఁ
బూర్ణతరగుమూలజలకుంభములగణించు, సరణితోడుత మాధవస్మరణ మమర.

మ. అలమాకందము కుండ్లఁ దింపఁ దగు, నియ్యం ట్లొక్కచో వేయఁగా
వలె, సంపంగికిఁ ద్రవ్వటం బిడవలె, న్వాసంతికల్ నేఁడు గూఁ
షులు గట్టం దగుఁ, గన్నెగన్నెరులు వాడుం దేఱె నంచు న్వనిం
గలయం గన్గొనువానిఁ జూచి రెలనాఁగల్ విప్రనారాయణున్. 69

క. కనుఁగొని తమ్మతండు కడకంటను జూడక యొక్కచీరికిం
గొనక వచోవిలాసములకుం జెవి దేలఁగిలంగ నీక యా
నన మరవాంచి తోఁటపయి నాటినకోర్కుల నిర్వికారుఁడై
యునికికి విస్మయం బొదవ నుగ్మలి సోదరివంకఁ జూచుచున్. 70

ఉ. అంగన నీవు వీనిహృదయంగమమోహనరూపరేఖ లె
ల్లం గనుఁగొంటివే కిలకిల న్నగు క్రొన్ననవిల్తు నైన, నీ
యంగము(శేవ)కుం దగినయందముగా దితఁ డున్నవేష మై
నం గలఁకం దలంకదు మనం బిటు వచ్చుట కెంతవింతయో! 71

సీ. జటియు నై ననవిల్తుకుటము గ్రాఁచినస్వామి దారువన క్రీడఁ దగిలె ననఁగ
శుచి యైనయవ్వేల్పుచూపు తాపసకులస్త్రీలపై వలపులఁ జిక్కె ననఁగ
వానిశిరోరత్న మైనయాద్విజరాజు గురువధూటికి మరుల్కొనియె ననఁగ
నమరులకును బెద్ద యతనిసారథి వాలఖిల్యాదిమునులఁ గల్గించె ననఁగ

గీ. వీనికథ యెంత యెన్నంగ వీరిలోన, నెవ్వరిని బోలు మహిమల కెంతదవ్వ
విప్రసామాన్యుఁ డూరకే విఱ్ఱవీఁగు, చున్నయంతనె యధికుఁ డౌనొక్కొ తాను.

క. నామములు దీర్చి తులసీ, దామంబులు వైచి బేలతనమునఁ దగు నీ
సాములె కారా మగువల, బాములఁ బడువారు వేషభాషలు గుఱుతే! 73

సీ. అందెలరవలి విన్నంతనే పోయెనే చిరకాలనియతిఁ జేసినతపంబు
మనలను నిటు గనుంగొనినంతమాత్రనే తఱఁగెనే హరిపదధ్యాననియతి
యే మని మాటాడ నెన్నంగఁ దోడనే పోయెనే తనవ్రతంబులు కొఱంతఁ
గటకట యిటు గుఱంగట నిల్చినంతనే పోరయునే షట్కర్మములను హాని
గీ. ఘనతపోరూఢి నధికులు గలరు గాని, యిట్లు చరియించు నియతుల నెందుఁ జూడ
మిదియ వర్తన మైనవో నిగురుఁబోఁడి!, కౌశికాదుల కూర్ధ్వలోకములు లేవె!
ఉ. పాటలగంధి! సౌఖ్యపరిపాటి యెఱుంగనిమూఢుఁ డౌట నే
పాటియు వీఁడు తాఁ దనకె పైకొనఁ డాయెనుగాక కాక నా
పాటల నాటల న్మధురభాషలఁ జొక్కి లతాంతబాణుచే
వాటులఁ జిక్కి కెంజిగురుఁబోనుపుఁ జెందకయుండ శక్యమే. 75
వ. అనుటయుఁ గటకటంబడి యక్కుటిలకుంతల చెలియలిం జూచి యిట్లనియె.
చ. హరిహరి ! యెంతమాట ! యెటు లాడితివే తరళాయతాక్షి ! కా
పురుషులఁ బల్కిన, ట్లఖిలభోగములు న్విడనాడి సత్క్రియా
నిరతిని బ్రహ్మచర్యసరణిం మహనీయతపో మహత్త్వముం
బొరసినయట్టి యిట్టిమునిపుంగవుభావ మెఱుంగ వేమియుఁ. 77
క. ఏమరుఁడే యితఁ డెక్కడి, పామరుఁడే నిలువు నూరు పండినరీతిం
దామరవిం దన నున్నాఁ, డోమరువపుమొలక! యెట్టియోగివరుండో. 78
సీ. తెలిమించుమసఁగు రంగులువారఁ గట్టక కాషాయములు దాల్పఁగాఁ బనేమి
నెలవంకతిరుమణి నీటుగాఁ దీర్పక పెనుపట్టెనామముల్ వెట్ట నేమి
గొనబుమీఱఁగఁ గోరకొప్పు దద్దక నెరుల్ జడ గట్టఁగా నీళ్లఁ దడుప నేమి
గోవాళ్లతోడుతఁ గూడియాడక తోఁట గావింతు నని యిట్లు గడఁగనేమి
గీ. వికచనానాప్రసూనమాలికలు చాలఁ, గలిగి యుండఁగఁ దులసిపూసలసరంబు
నైవనేమి మహాయోగివరుఁడు గాక, మగువ యీయన యితరసామాన్యుఁ డైన.
క. రాగంబు నొడిచి ముక్తిం, శ్రీగౌరవముల కపేక్ష చేయుమునులకుః
నాగేంద్రయాన! యైహిక, భోగం బిది మేడికాయబోసము సుమ్మీ. 80

— వేశ్యలు పంతములు వేసికొనుట. —

క. వలువనిమాటలు సారెం, బలుకం బనియేమి హావభావవిలాసా
దుల నీ వితనిఁ గరంచిన, నలికైశిక యేను దాసి నయ్యెద నీకుః. 81

మ. అనుమం గెంపుమెఱుంగు కన్నుఁగవచాయన్ జేవుఱింపం గనుం
గొని యెక్కించుక జాఱుపయ్యెద చెఱంగున్ రంగుగాఁ జేర్చి కొ
ప్పును జక్కన్సవరించి యౌవనమదంబు న్సత్కళాప్రౌఢియుం
దనరం దొయ్యలి రెండుమూఁడడుగు లంతన్ డాయఁగా నేగుచున్. 82

చ. పని మఱి లేనికోడిగపుబాఁపని నీ వొకప్రోదిసేసి పే
ర్కొని మును నావిలాసగుణరూఢి నెఱుంగనియట్లు పన్నిదం
బని కడు మించ నాడితివి యాడినమాటకుఁ దారసిల్లినన్
వెనుకకుఁ బోకు మంచుఁ జెలి వెండియు జంకెన లుల్లసిల్లఁగన్. 83

సీ. మాధవస్మరణంబు మాన్పి కొక్కోకాది పఠనంబునకుఁ బాలుపఱుపనేని
కనుసన్నసేసి యాకడవనె నాయింటి కెల్లను నీళ్లు మోయింపనేని
తిరుచూర్ణరేఖ మచ్చరణలాక్షాలక్త దృష్టితో వియ్య మొందింపనేని
మునిపండ్లఁ గొఱికివైచిన నాగవల్లికాదళములకై యాసగొలుపనేని
గీ. కలఁపనేనియు వలపంతఁ గఱపనేని, కేళికెలయింపనేని చొక్కింపనేని
విటుల కెకిమీని వీనిఁ గావింపనేని, యుగ్మలీ! నీకు దాసి నై యుండుదాన. 84

వ. అని యమ్మంజులాలాప కెంజిగు రంటినచందంబునఁ గేలుఁగెందమ్మి నగ్రజహ
స్తంబునం బన్నిదం బని చఱచి యనుచరనిచయంబుతోడం గూడ నిజనగరం
బున కనిచి ననిచినకుతుకంబునం గపటనటపరిచయంబునం గాని వీనిం జొ
క్కింప రా దని వితర్కించి కుఱంగటం గురవకలతావలయంబునం గిసలయప్ర
సవమంజరీరంజితం బగు నొక్కతరుకోటరక్రోడంబునందు. 85

క. అరవిందనయన శోభా, కరము ల్మణికింకిణీనికరము ల్మణినూ
పురముల్ చీనాంబరము, ల్సరము ల్కర ముల్లసిల్ల శౌటిం బెట్టెన్. 86

గీ. చాతురీరీతి వేర్వేఱ సంగ్రహించి, వనిత యొక జీనిపావడ వానిమీఁద
ముసుఁగువడఁజుట్టి పైలకుముద్రఁ బెట్టి, యొరులు గనకుండ నలుదిక్కు లరసిచూచి.

శా. నాభాగప్రతిమాన దానజితకర్ణస్వర్ణగోత్తంస ధా
టీభీధావితజాతవేపథువధూటీచిత్తవైకల్యదీ
క్షాభీలానునయానులాపకబరీవ్యాపారసౌభాగ్య ధా
త్రీభూభృత్కులవైరి మోహనమురారీ రాజకంఠీరవా! 88

క. తుక్ఖారఘట్టఘనజవ, యుక్ఖురజరజఃపలాయితోదితరక్షా
రక్షవ-చోరిపుయాచిత, మక్ఖాకటకాదిరాజ్య మహిగృహమేధీ! 89

పంచచామరము. అహంక్రియాసమగ్రవిగ్రహస్థలీభటానటీ
మహోహళాహళీవిహారమంత్రయంత్రకల్పిత
స్పృహోస్వయంగతానురాగహృజ్జయాంగనాముహు
ర్ముహుర్భుజోపగూహనానుమోదమానమానసా! 90

గద్యము. ఇది శ్రీశంకరస్వామిసంయమీశ్వరచరణసరోరుహధ్యానానందసౌందర్య ధుర్య ప్రబంధపరమేశ్వరవంశపవిత్ర లింగనమనీషిపుత్ర శ్రీకాళహస్తీశ్వర దయాసహాయ చెదల్వాడ మల్లయనామధేయప్రణీతం బైన విప్రనారాయణచరిత్రం బనుమహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు.

విప్రనారాయణచరిత్రము.

తృతీయాశ్వాసము.

క. శ్రీబంధురమందిర బిసి, నీబాంధవ తేజ త్రిభువనీగండరగూ
లీబిరుద సత్కృపాంబుని, ధీ బుధనుత మాకరాజుతిమ్మనృపాలా !

గీ. అవధరింపుము పయి, భూషణాంబరాదు, లీవిధంబున దాఁచి తా దేవదేవి
తాను వైష్ణవురాలిచందంబుఁ బూని, చాలఁ దగినట్టి సంజోక సవదరించి.

— దేవదేవి విప్రనారాయణుం జేరుట. —

సీ. మెఱుఁగులు పైకిఁ గ్రేగ్లుటి కెంపు గబ్బిగుబ్బలమీఁదఁ గావికుప్పసము దొడిగి
యడఁచి క్రొమ్ముడి బయల్పడకుండఁగా ఖండశాటి యాదలను మించఁగ బిగించి
బెళుకుఁజూపులఁ గెలంకులు దాఁటఁగా నీక నిజపదనఖరేఖ నెలవు కొలిపి
హరినీలములయొప్పు నడికించు కెందమ్మిజమిలిపూసలకంటసరి యమర్చి

గీ. యల్లనల్లనహరిహరిహరియటంచు,గోలయునుబోలెనొదుఁగుచుఁగొదిగికొనుచు
విష్ణుపదభక్తి మూర్తిభవించె ననఁగఁ, జకితహరిణాక్షి దాసరిసాని యయ్యె. 3

క. ఇటువలెఁ గుహనానటనా, ఘటనాపర్యటననటనకౌశలమై య
న్నటదిందీవరకుంతల, యట చని కర్పూరకదళికాంతరవీథిన్. 4

చ. ననిచినగుజ్జుమావి కెలసం దగుగందపుఁమానికొమ్మలం
బెనఁగొని యున్నమల్లికలపెక్కువ గన్గొని నీళ్లు గట్టి సం
జనితకుతూహలాంకురము శాఖలువాఱఁగ వచ్చుచున్న య
మ్మునికులసార్వభౌముని ముముక్షువరేణ్యు మహానుభావునిన్. 5

చ. తనమది భక్తి గల్గినవిధం బటు దోఁపఁగ దవ్వుదవ్వులం
గనుఁగొని తత్పదాంబుజనఖప్రభ లొక్కట ఫాలవీథి సోఁ
కను బ్రణమిల్లి యోమునిశిఖామణి! యోకరుణాపయోధి ! యో
యినవిభతేజ ! కావఁదగదే నను నార్త ననాథ నెంతయున్. 6

చ. అని కడు నాఁపఁగా భరము లై లవలీదళగండమండలిం
గనుఁగవబాష్పముల్ దొరఁగఁగా నపు డేడ్చెఁ జకోరనేత్రపె

ల్చన నిజసోదరీశపథసమ్యగహంకృతివాక్యవంచనా
ఘనకుహనావిహారపరికల్పితగద్గదకంఠవై ఖరిన్. 7

గీ. అప్పు డాజంత పలుకువాక్యంబు లెల్ల, మనసులోపల నిక్కంబు లనుచు వగచి
యబల! లే లెమ్ము లెమ్మని యాదరించి, యిట్లు వలికెను వాచంయమీశ్వరుండు.

ఉ. ఎయ్యెడనుండి వచ్చితివె యియ్యెడకున్ ? హరిభక్తురాల ! పే
రెయ్యది ? యార్తిబొందఁ గత మెయ్యది ? నీకును మే మొనర్పఁగా
నయ్యెడుకార్య మెయ్యది ? భయంపడ కిం కెఱిఁగింపు నావుడుం
దొయ్యలి చిక్కె దమ్మఁ డని దుర్భరహర్షనిమగ్నచిత్తయై. 9

క. దేవా ! విన్నప మే మని, కావించెద నీదుసమ్ముఖమ్మున యావ
జ్జీవజుగుప్సాజీవన, జీవాతుఘనాఘహేతుశీలకులంబుల్. 10

వ. అయినను నార్తజనవరేణ్యుండ వగు నీనిమిత్తంబునఁ గడతేఱఁగలదాన నగుట
నాకలతెఱం గెఱింగించెద దత్తావధానుండ వై యవధరింపు మని యిట్లనియె.

క. నేరముల కునికి యాఁబడి, కారయ విడిమట్టు వట్టియపకీర్తులకుం
జేరుగడ దోసములకు నా, జారము వెతలకిర వాఁడుజన్మము దేవా ! 12

ఉ. అట్టి మహావిహీనభవ మయ్యును నీలువు మాటవాసియుం
జుట్టతికంబుఁ బుణ్యమును సున్నగ మిన్నలఁ గూడఁబెట్టు చో
గుట్టు దొలంగుచుం బహుపుఁగూటికి నోఁచినవారిజాతిసం
బుట్టి క్రమక్రమంబునఁ దపోధన ! యావన మావహిల్లఁగన్. 13

మ. కళలం దక్కఁ బెనంగి గానములఁ జక్కంజేసి లాస్యక్రియా
కలన న్మెచ్చుఘటించి నేర్పునను గాఁకల్ పుట్టఁగావించి మా
యల వంచించి నరేంద్రనందనుల నుడ్డాడించి సప్తాంగముల్
బలుసొమ్ముల్గొని సంయమీ ! యిసుపులుం బంగారుగాఁ జేసినన్. 14

సీ. పెల్చ నల్లిండ్లు నిల్పెద నన్న సదలించుఁ జెఱువు గావింప నెంచినను గసరు
వనము వెట్టింప నెంచిన నెంతలే దను గుడికి యత్నముసేయ గొణఁగసాగు
బుధుల కీ వేఁడినఁ బ్రొద్దు వో దను నీకు నతిథిపూజలకు మల్లాడఁ దిట్టు
బోసాన కలిగిన నోసి ! పో లె మ్మను బేదసాదలఁ బ్రోవ గీదుపోరు

గీ. దేవ! యిటుగాక మఱియును లావుముట్టి, బలియు బికిరంబు జోగు గోపాళ మనుచు
వీథి కెవ్వారు నుడిసిన వెక్కిరించు, నయ్య ! ననుఁగన్న కొయ్య గయ్యాళి తల్లి.

క. సామీ! పలుమఱు దేవర, కేమని వినిపింతు నింక నీఁగను నిసురుం
బామునకు బలియుఁ బెట్టక, యాముసలిగరాసు పిసిడిన్నై వర్తించున్. 16

సీ. వదనపద్మము పల్లవప్రకరోచ్ఛిష్టలాలితవీటికలాచిఁ జేసి
గాత్రంబు జ్యాకిణీకర్కశభుజులై నమగలకు గరిడికంబములు సేసి
కూర్మి యొక్కెడఁ బాదుకొననీని యాచ్ఞింపు దొరలకు నిర్వంకతుంగ సేసి
మొలకమెఱుంగుఁజన్నులు భుజంగనఖాంకుశములకుఁ గలభకుంభములు సేసి
గీ. గుట్టు నానయు విడనాడి కొంగుపఱచి, యగడువడి పడిచి పడసిన యట్టి పసిఁడి
కటకటా! యేమిటికి నెక్క గడనవంక, నేమి గంటిని దొడుసు నాకేల యనుచు.

ఉ. ఏను విరక్తురాల నయి యిట్లు భవత్పదసేవ గోరి యో
మానికులావతంస! గరిమంబున వచ్చితి నాదరంబు లో
నూనఁగఁ జూచి నీ దయినయూడిగముల్ దయచేసి ప్రోవు నీ
యానతిపద్ధతిం దగ నహర్నిశముం బరిచర్య సేసెదన్. 18

సీ. నెఱినొప్పులకుచముల్ నీచేతఁ గాయలు గాచెఁ బొమ్మనిపింపఁగలఁ గడంగి
చిన్నికొమ్మల మించు కన్నెమామిడి చెట్టుఁజేర్చి నీకును మెచ్చుసేయఁగలను
నెలమిఁబల్లవరసల నీమోవిఫల మంద సొరిది నీకును జవిసూపఁగలను
బొగడను దగు విధంబులను బెక్కులు గల్గ నలరించి నిను మరుల్గొలుపఁ గలను
గీ. జతురబహుబంధములఁ బరిచయము కలిమి, రాజయోగవిలాసాభిరామ నగుట
ఘనకళానుభవంబుచేఁ గలుగు నేర్పు, మించ నిన్నును గడకుఁ దేలించఁగలను.

వ. అనిపలుకుటయు జటివరుండు నమ్మాటుమాయలాడిపలుకులు నిక్కవంబులుగా వగచి విష్ణుకైంకర్యంబునకుఁ దనకు సాహచర్యంబు గలిగె ననుచు నంగీకరించి దానిం దగువిధంబునం బనిగొనుచు నేమంబునఁ బుష్పదామంబులు రంగశాయికి సమర్పించుచు మాధుకరచర్యాసంపన్నంబు లగునన్నంబులు భుజియించి యిష్టశిష్టాదనం బయ్యింతికిఁ బ్రసాదించుచుఁ దనయుటజంబున కనతిదూరం బగునొకలతాకుటీరంబున నుండ నియమించె నివ్విధంబున నొక్క సంవత్సరంబు గడపినయనంతరంబ. 20

— * సూర్యాస్తమయాదివర్ణనము. * —

(1) క. గగనమణియను చ...కి, దగదిన మిది నిదెగాదు తరుణీ యనుచున్
వగదేఱు దనకయొడ్గై, దగవని పైఁబెట్టె నన నబ్ధిఁ దపనుఁడు గ్రుంకెన్.

(1) ప్రత్యంతరములేమి నున్నట్లే ముద్రింపఁబడినది.

ఉ. నాదగుతారకారుచిధనంబు హరించిన కన్నగాఁడు వీఁ
డే దివసాహ్వయుం డగుకడిందిమలిన్లుచుఁ డంచుఁ బశ్చిమా
శాదయితుండు చూడఁ గడసారి నవారణఁ జేలము న్వియ
ద్వాది కడంకతో ముడియ నైచె నన న్రవి గ్రుంకె నెంతయున్. 22

చ. తిమిరపుదాడిగాఁడు చనుదేఁ దొడంగెను నా కెదుర్పఁగా
సమయము గాదు గూఢతరచర్యను వత్తిలి వేగ వచ్చెదన్
రమణఁ దమోనుదాశ్రయమున న్నిలు మంచును నైజతేజమున్
గమలహితుండు నిల్పె ననఁగాఁ బొడకట్టెను సాంధ్యరాగముల్. 23

క. జలజహితభీతి నెల్లెడ, నిలిపిన నయ్యిరులదొరలనిసువులు తళిమై
వెలువడె ననఁ దొగమొగ్గల, నెలదుమ్మెదదిమ్ము లటు ధురీ(1)యన వెడలెన్.

క. మురహరున కేకచక్రము, సరసిజబంధునకు నేకచక్రము, కవయై
తిరుగుట కా దనుకరణిన్, సరసులఁజక్రంబు లేకచక్రము లయ్యెన్. 25

మ. అహరంతావసరంబునందు నొకకల్హారంబుచక్కి న్మహు
ర్మహురిచ్ఛారతిఁ దేలి తేఁటిమిథునంబు ల్గూర్కఁ దత్తద్గరు
త్పిహితంబై తగుతేనె వేఱొకటి యర్థింగ్రోలెఁ దా నయ్యెడన్
సహజక్రీడలు గావె యెల్లప్రజకున్ జౌర్యక్రియావైఖరుల్. 26

చ. బుగబుగతావులం బొదలుపుప్పొడిచే మకగంధధారచే
నొగిఁ దముఁ బ్రోచినంలవడియు న్గమన స్మిలిఁ జేరి కొల్చి మా
పగుటయుఁ దుమ్మెద ల్జలరుహంబులతొల్లిటిరూపు దప్పినం
దగఁ దొగల న్వసించెను కృతఘ్నుల నెందును నమ్మవచ్చునే! 27

సీ. దైవతైర్థికులు మందాకినీతోయము ల్గొప్పరించిన గాజుఁగుప్పెలనఁగ
ఘనపదద్యుతి నవగ్రహరత్నములు దాఁప నిర వైనదంతంపుబరణు లనఁగ
నలవిధూదయ హేతు వగుతూర్పుఁజూలాలు హువ్వన నుమియుచిట్టుమ్ము లనఁగ
వెలయురాసులఁ బొల్పువినువీథికల్లానఁ జెన్నొందు సెలగదోసిళ్లనంగ

గీ. రేయిసురతాణి జగమావరింపఁ దలఁచి, పొలుచు నిరులను బలురికీబులను బనిచి
కొఱలనెత్తినసున్నంపుఁగుండ లనఁగఁ, జాలఁ గనుపట్టెఁ దారకాసముదయంబు.

మ. ఘనధారాధరభూమిక ల్గగనసాటూన్మార్తు లామ్రేడితాం
జనశైలంబు లనేకథావిహృతిమత్స్వర్భానులీలల్ విక

---

(1) యతిచింత్యము.

శాస్త్రపరిభాష.

[సుప్రసిద్ధము లగుపదములుగూడ నాయాచోటుల నావశ్యక మగుటచే నుపయోగింపఁబడినవి.]

జ్యోతిశ్శాస్త్రము ... Astronomy.
జ్యౌతిషశాస్త్రము ... Astrology.
గ్రహము ... The planet.
ఉపగ్రహము ... The satellite
ఆభ్యంతరగ్రహము ... The inferior planet.
బాహ్యగ్రహము ... The superior planet.
సూర్యుఁడు ... The Sun.
చంద్రుఁడు ... The Moon.
బుధుఁడు ... The Mercury.
శుక్రుఁడు ... The Venus.
భూమి ... The Earth.
అంగారకుఁడు ... The Mars.
గ్రహపోతములు ... The Asteroids.
బృహస్పతి ... The Jupiter.
శని ... The Saturn.
వరుణుఁడు ... The Uranus.

(శబ్దసామ్యముచే నీపదము సృజింపఁబడినది.)

నభస్తూనుఁడు ... The Neptune.

[‘నభః’ అనుపదమును Neptune అనుపదములోఁ ప్రథమభాగమగు ‘*neb*’ అనునదియు నేకధాతుకము లగుటచేతను, ‘తూణపూరణే’ అను ధాత్వర్థ బలముచేతను, ఈగ్రహము నభస్థ్సలమున సూర్యకుటుంబమును బూరించుటచేతను దీని కీనామ మీయఁబడెను.]

కక్ష్య ... The orbit.
అక్షము ... The axis.

ఉత్తరధ్రువము	... The North pole.
దక్షిణధ్రువము	... The South pole.
అపమండలము అపక్రమమండలము క్రాంతిమండలము	... The ecliptic.
విషువద్వృత్తము నిరక్షరేఖ	... The equator.
ఆయతవృత్తము ఉచ్చనీచవృత్తము	... An ellipse.
సామ్యగతి	... The direct motion.
వక్రగతి	... The retrograde motion.
సంయోగము	... The conjunction.
అభ్యంతరసంయోగము	... The inferior conjunction.
బాహ్యసంయోగము	... The superior conjunction.
ఆభిముఖ్యము	... The opposition.
భగణము	... The revolution.
భ్రమణము	... The rotation.
ఉచ్చము	... The Aphelion.
నీచము	... The Perihelion.
అపజ్యము	... The Apogee.
పరిజ్యము	... The Perigee.

[శబ్దసామ్యముచేతను, అర్థసామ్యముచేతను, ఈపదములు సృజింపం బడినవి; అపజ్య=జ్యాం (భూమిం) అపక్రమ్య ; పరిజ్య=జ్యాంపరితః.]

ఆద్యపాతము	... The ascending node.
ద్వితీయపాతము	... The descending node.
గ్రహణము	... An eclipse.
సూర్యగ్రహణము	... The solar eclipse.
చంద్రగ్రహణము	... The lunar eclipse.

ఛాయ	...	The Umbra.
ఛాయాకల్పము	...	The Penumbra.
పూర్ణగ్రహణము	...	The total eclipse.
అల్పగ్రహణము	...	The partial eclipse.
కంకణగ్రహణము	...	The annular eclipse.
ధూమకేతువు	...	A comet.
ఉల్క	...	A meteor.
ఉల్కావృష్టి	...	The meteoric shower.
ఉచ్చలగ్నము	...	The signat the zenith.
దూరదర్శిని	...	The Telescope.
సూక్ష్మదర్శిని	...	The Microscope.
రశ్మివిభాజిని	...	The spectroscope.
ప్రతిమాదాయిని	...	The Photography.
తారాగుచ్ఛము	...	The star cluster.
ద్వంద్వనక్షత్రములు	...	The double stars.
నక్షత్రవీథి	...	The Milky Way.
నభోలము	...	The Nebula.

[' నభః ' అనునదియు 'Neb' అనునదియు నేకధాతుకములగుటచేతను, ఇది నభస్థ్సలమునలీనమై యుండుటచేతను, శబ్దసామ్యముచేతను, దీని కీనామ మీయఁబడెను.]

శంఖరేఖ	...	The spiral.
సమానాంతరము	...	Parallel.
శక్తి	...	The Force.
ఆకర్షణశక్తి	...	The gravitation.
ద్రవ్యము	...	Matter.
హోరాము	...	An hour.

కపిస్థళం కృష్ణమాచార్యులు.

సృష్టిచిత్రము.

ఉ. అబ్బుర మౌను సృష్టిగతి నారయ నారయ దీనిఁ గాంచి త
బ్బిబ్బు వహించుచుందు రఁట పెల్లుగ దేవతలంతవారలున్
నిబ్బర మొప్ప నెంచుటకు నే నన నెంతటివాఁడ నామదిం
బ్రబ్బినతొట్రుపాటు వినఁ బల్కెద మిత్రము లాలకింపుఁడీ. 1

మ. అతిచిత్రం బతివిస్తృతాకృతి యనాద్యంతంబు నౌసృష్టిసం
గతి మున్నెవ్వరుఁ జర్చసేయక విడంగా నేను జర్చింపఁబూ
నితి నం చెంచ న దే మొకో కలుగుచుండెన్ దీనిపై నిచ్చ య
ద్భుతశీలం బగుసృష్టి నద్భుతము లే పుట్టుంగదా! క్రొత్తలై. 2

ఉ. ఈనిఖిలంబునున్ జగదతీతుఁ డొకండు రచించియుండ నొఁ
గానియెడన్ జనించునొకో కారణహీనము లైనకార్యముల్
వానియుదారశక్తి యనవద్య మమేయ మటంచుఁ జెప్పనొఁ
బూనిక గల్గి యొక్కపరిఁ బొల్పుగ సృష్టివిచిత్ర మెంచినన్. 3

క. దివివలనం దెమ్మెర వా,యువువలనన్ వహ్ని దాన నుదకము దానన్
భువి జననమొందె నఁట య,య్యవి యైదున్ విత్తనంబు లఁట జగమునకున్. 4

మ. తొలుతం బల్గతి సృష్టి యెట్టులు మదిం దోఁచెన్ జగత్స్రష్టకున్
గలిపెన్ భూతము లైదు నెన్ని తెఱఁగుల్ గాఁ బంచి యాపాళ్లచే
నలువం దొట్టి రచించె నేగతిఁ దృణాంతం బౌజగం బాతఁడే
తెలియుంగాక యెఱుంగ నౌనె మన బాధీశక్తి నూహించినన్. 5

శా. రేతోరక్తము లేకతం బెనసి నారీకుక్షిలో బుద్బుదం
బై తోడ్తోడనె హెచ్చి పిండ మగు సర్వాంగంబు లం దేర్పడున్
జైతన్యం బొనఁగూడు నింద్రియములున్ స్వాంతాదులుం గల్గెడున్
వాతం బొక్కటి ద్రోయఁగా శిశువు గర్భం బంతటన్ వెల్వడున్. 6

చ. జననపుము న్నగోచరము చానయె కల్గునొ పూరుషుండొ త
త్తనురుచి యంగసంస్థితియు దైర్ఘ్యము హ్రస్వత యెన్నరాదు చ
య్యన నుదయించు నాశిశువునం దొకయబ్రపుఁబ్రేమ లోకమె
ల్ల నిలిచె వానితో నని తలంతురు చిత్రము తల్లిదండ్రియున్. 7

ఉ. ఇంతకు మించువింత గల దెయ్యది మానవు లెంద ఱందఱో
యంతము లేదు వారినిఖిలాంగములున్ వివరించి చూడ నా
వంతయు లేదు భేద మటులైనను లక్షజనంబులో జనుం
గాంతుము తాఱుమా ఱొకటి గల్గదు చెప్పఁగలేము భేదమున్. 8

చ. అగు నగు వర్ణమో నడయొ యంగవిశేషమొ చూపొ దైర్ఘ్యమో
సొగసో మనుష్యునిం దెలియ సూచక మందురు గాని చెప్పఁగాఁ
దగ దది యుండుఁగాక నరుఁ దప్పక పల్కుఁబడిన్ గ్రహింతు మె
ట్లగు నిది యిట్టి దంచు నడియాలముఁ జూప వశంబె యేరికిన్. 9

శా. సౌందర్యం బొకఁ డయ్యుఁ బత్తెఱఁగులన్ జానొప్పుఁ దద్భేద మొ
క్కండుం జెప్ప వశంబె వేర్పఱిచి యట్లాయాఫలవ్రాత మిం
పొందు న్మాధురి యొక్కఁ డయ్యు రుచిభేదోపేత మై భిన్నతం
జెందుం బాకవిశేష మొంద రసముల్ క్షీరేక్షుఖండాదులన్. 10

క. పరిపరితెఱఁగులవిరులం, బరిమళముల్ వేఱు వేఱ పరఁగుచునుండుం
బరికించి భేదకంబున్, సరసిజభవుఁ డైనఁ జెప్ప శక్తుం డగునే. 11

శా. ఎమ్ముల్ ప్రేవులు రక్తమాంసములు గావే గోమహిష్యాదిదే
హమ్ముల్ చెప్పట కేవపుట్టును దదాహారంబు ఘాసంబు దు
గ్ధమ్ముల్ వెల్వడు నందు జల్లున సుధాధారానుకారంబు లై
క్రమ్మున్ వానిని గ్రోలువారి కురుసౌఖ్యశ్రీబలారోగ్యముల్. 12

ఉ. క్షీరము కాఁగి తక్రమును జేరి యగున్ దధి దానిలోపలం
దేరును మండ మద్ది నవనీత మగున్ మథియింప నద్ది యే
తీరుగఁ గాఁచ నెయ్యి యగుఁ దెల్లముగా నవియెల్ల వేఱువే
ఱై రుచిభేదముం బడసి యన్ని తెఱంగులఁ దృప్తి నిచ్చెడున్. 13

ఉ. కొంచెపువిత్తునన్ మొలచి కొమ్మలు పచ్చనియాకులన్ విజృం
భించిన వృక్షమందు సురభీకృతదక్తట మౌచుఁ జిత్రవ
ర్ణాంచిత మైన క్రొవ్విరి బయల్పడు నవ్విరియందుఁ బూప జ
న్మించి క్రమంబునన్ రససమృద్ధఫలం బయి ముగ్గి సగ్గెడున్. 14

క. ఇవి యెల్లఁ బాటిఁ జెందిన, వవుటం బరికించువారి కబ్బురముగఁ దోఁ
పవు గాక చిత్తమందుం, దవులం దలపోయ నద్భుతం బగుఁ గాదే. 15

ఉ. ఎచ్చట నుండువాఁడొ మును పెచ్చటి కేఁగునొ యింక నెన్నినా
ళ్లిచ్చట నుండునో యెఱుఁగఁ డెవ్వఁడు నించుకయున్ ధ్రువంబుగాఁ
జచ్చుట దా నెఱింగియును జా వొకనాఁటికి లేనిచాడ్పునం
జెచ్చెర శాశ్వతంపుఁబని సేయును వృద్ధత నెత్తి కెక్కినన్. 16

ఉ. పుట్టిననాఁటఁగోలెఁ దనపుత్త్రులఁ బౌత్త్రులఁ గాంచి యుబ్బుచుం
జిట్టికుమార తండ్రి యని చేరఁగఁదీయుచు ముద్దులాడుచుం
బట్టఁగరానిపాదములఁ బట్టి మఱిం బెఱవారి నోళులం
గొట్టి యధర్మవిత్తములు గూర్చి యిడుం దొడవుల్ సుభోజ్యముల్. 17

ఉ. పోయినవానికై వగలఁ బొక్కుచు నుందురు వాఁడు వీండ్రదా
కూయి యొకింతయున్ వినునొకో ప్రతిరోదనమే నొనర్చునో
పోయెను వచ్చి యీనడిమిపా త్త్రొకనాఁటికి వీండ్రుఁ గూలరే
పాయనిపోలికం బ్రణయపాశములన్ దృఢబద్ధు లౌదు రే. 18

గీ. అల్పకారణమున నన్యుని తలఁద్రుంచు, సకట వానిబ్రతుకు వ్యర్థ మొక్కొ—
ప్రజల నెల్ల సౌఖ్యపఱుచునొ తానుండి, యుట్టిగట్టి తా నె యూఁగఁగలఁడొ. 19

ఉ. చక్కనివాఁడ జవ్వనపుసొ రొనఁగూడుచు నుండె నాకుఁ బెం
పెక్కును బల్సిరుల్ వలఁతి నెల్లవిధంబుల నేనటంచు బ
ల్విక్కుచు నుండ మూషకము వేచినపిల్లియుఁ బోలె నంతలో
గ్రక్కున వచ్చి పైనుఱికి కాలుఁడు మ్రింగిన సున్న లిన్నియున్. 20

చ. పరులధనంబుఁ గొంట పరభామలఁ గోరుట కల్లలాడుటల్
పరుసపుఁబల్కులున్ విషముపై విషముల్ చనరా దొకండు నా
సరస కటం చెఱింగియును స్వాదుఫలాదులకంటె స్వాదుతం
బరఁగు నటంచు వానికయి పాటువహింతురు దుష్టమానవుల్. 21

శా. ఇల్లా లెల్లవిధంబులన్ రుచిరమై యిష్టోపభోగంబు సం
ధిల్లం జేయఁగఁ గ్రూరుఁ డొల్లక కడుం దీవ్రప్రయత్నంబుచే
నిల్లు న్మేనును గుల్లగాఁగ వినువా రిస్సీయనన్ గుండియల్
జల్లుంజల్లునఁ గూల వారలలనాసంగంబుఁ గాంక్షించెడున్. 22

చ. సరిపడ దర్థసంఘటన చాలకయుండును వాక్యపూర్తి య
క్షరములు వ్యక్తరీతిఁ బలుకంబడ కుండెడు నట్టులయ్యు బా

లుర తొలిముద్దు పల్కు లతిలోలుపతం గలిగించు వాని మా
ధురి మితిలేని ధార విడఁదోపదు వీనులఁ బెక్కు గ్రోలినన్. 23

ఉ. బాలుఁడు బుద్ధి యించుకయుఁ బ్రౌఢివహింపకమున్న సర్వవా
గ్జాలముఁ దత్తదర్థముల సంగతి వాని సమన్వయంబులన్
మేలుగ నభ్యసించు నసమీక్ష్యములౌ క్రియలన్ గుణంబులం
గాలముఁ దెల్పు వాక్కులును గ్రక్కున నెంచి గ్రహించుఁ జిత్రమౌన్. 24

చ. గడియకుమున్న పోలికకుఁగానఁగరాక యు నంతలోన నె
క్కడివొకొ కాననంబువలెఁ గార్కొని క్రమ్ముచు మింట మేఘముల్
బడిబడి నుర్మ్ము మె ర్మ్మశనిపాతములు న్వడగళ్లు నంతుగా
జడిగొని శుష్కభూతలము సంద్రముఁ జేయును జూచుచుండఁగన్. 25

ఆ. జ్వలన మంటినంత సర్వంబును దహించు, బావకంబు నగ్నిపక్షి మ్రింగు
వహ్ని నణఁచు జఠరవహ్ని దానికిఁ గల్గెఁ, బ్రకృతి కబ్బురంబుఁ బడఁగవలయు.

క. బంభరము నై జబుద్ధివి,జృంభణమునఁ గీటకంబుఁ జేరిచి గూఁటన్
గంభీరధ్వనిచేఁ దన,డింభకముం జేయు నిది కడిందియరు దగున్. 27

క. ఉదయించి జాతితొలిలోఁ, గదలుటకునుదావులేనికప్ప తినుటకె
య్యది యొదవునొ యేగతి నది, బ్రదుకునొ మరుదంకురమును బాఱని-దోటన్.

ఉ. లక్షలు గల్గువాఁ డలరు లక్షధనంబు లభించెనేనియున్
భిక్షుకుఁ డౌ జనుం డలరు భిక్షయొకింత లభించెనేనియున్
విక్షతి గల్గునాఁడు పరివేదన యిర్వురికిన్ సమానమౌ
మక్షికయున్ గజంబును సమంబు లగున్ సుఖదుఃఖవేళలన్. 29

ఉ. సౌధనివాస మబ్బి జనసంఘము వశ్యగతిం జరింపఁగా
భూధవుఁడై యఖండతరభోగములన్ సుఖియించు భోగియున్
వ్యాధిదరిద్రతాదశయు నక్షివిహీనత మున్నుగా మహా
బాధలఁ గాంచువాఁడును నపారముగా మృతికై భయంపడున్. 30

చ. జననము నొందు జంతువు లసంఖ్యముగా ధరలోఁ బ్రతిత్రుటిం
జను జముప్రోలి కాక్రియనసంఖ్యముగా ధరలోఁ బ్రతిత్రుటిన్
మనుగడ నిత్యమే జనుఁడు మానఁడు సంతస మొక్కరుం డిలన్
జననము నొందు నాఁ డొకఁడు చచ్చిన నాఁడు విడండు శోకమున్. 31

మ. చిరభోగంబులు గాంచి దేహము కృశున్ జీర్ణించి శీర్షంబు పె
స్నరల న్వెల్లఁదనంబుఁ బూనఁ బటుదంతశ్రేణులన్ జాఱఁగా
నరుఁ డర్థార్జనసక్తుఁడై తిరుగు నెన్నం డెన్నఁడున్ జెంపకున్
సరగ న్వచ్చుచు నుండెఁ గాలుఁడు నిమేషచ్ఛద్మచే నం చహా. 32

ఉ. తాను దలంచుకార్యమున దైవబలం బొనఁగూడె నేనియుం
దానె సమస్తమందును స్వతంత్రుఁడ నంచుఁ దలంచు నట్టులా
నేని రచించినట్టిపను లెల్ల ననాహతి సిద్ధిఁ బొంద నా
మానవుఁ డొక్కరుండు నొకమాట వచించుట కైన శక్తుఁడే. 33

క. ధనువును మార్వియు నేకతఁ, బొనరుచు సాయకము నడపుపోలికిఁ బురుషుం
డును దైవము సమబలమున, నెనసినఁ గార్యంబు సిద్ధినెసఁగుం బుడమిన్. 34

మ. ఒకకాలంబున భూరిసంపదలచే నొప్పారుచుండున్ జనుం
డొకకాలంబునఁ గూడు గుడ్డయును లేకుండంగ నెవ్వన్ సహిం
పక మల్లాడుచునుండు నొక్కపుడు ధీమంతుండు నొక్కప్డు ధీ
వికలుం డౌనె తలంప వాఁడొకరుఁడే వీఁ డన్యుఁడౌనే యహా. 35

ఉ. జంతువు లోషధుల్ పుడమి జాతుల నెన్నియొ జాతిజాతికెం
తెంతయొ సంఖ్య యీశ్వరుఁడు నెన్నఁగలేఁ డది యుండ వానిపల్
వింతదనర్చురూపులు ను వింతగుణంబులు వింతచేష్ట లా
వంతయు గోచరింపవుగదా మది నేఁడులు పూఁడు లెంచినన్. 36

ఉ. కావు హరుల్ వరాహములు గా వురగంబులు గావు బెబ్బులుల్
గా వరయంగ హింస్రము లకారణమే యవి హింసఁజేయఁగా
రా వడిదంబు విల్లును శరంబులు గైకొని పోయి వాని వా
తావులు పల్మఱున్ వెదకి తద్వధసేయు నరుల్ శరారువుల్. 37

క. తునుము దయావిరహితుఁడై, మనుజుఁడు తనభోగమునకు మహిఁ గలవెల్లన్
మనుజుని వలనన్ వానికిఁ, గనరా దుపయోగ మించుకయుఁ దలపోయన్. 38

మ. తొలినాఁ డెట్టిపదార్థముల్ గుడిచి తృప్తుం డయ్యెనో యవ్వియే
మలునాఁ డవ్వలినాఁడు నాపయిని సామాన్యస్థితిన్ నూత్నముల్
వలె నర్పించును గ్రొత్తక్రొత్తరుచి సర్వం బిట్లు భోగించుచున్
సలుపు న్మానిసి పిష్టపేషణము నాజన్మంబుగా నద్దిరా. 39

శా. సారాపేతము గష్టసాధ్య మణువుల్ సౌదామనీచంచలం
బౌరా నైహికసౌఖ్య మందులకు నై యత్నంబురాత్రింబవల్
ధీరాత్ముండు నొనర్చుచుండు నుపమాతీతం బమేయం బసం
హారాకారము పారలౌకికసుఖం బాశింపఁ డొక్కింతయున్. 40

మ. అహాహా నూటి కొకండు సంసృతిని హేయం బంచుఁ జింతించి ని
స్పృహుఁడై పుణ్యవశంబుచేత భగవత్సేవాసమాసక్తుఁడై
యిహభోగంబుల వీడనేని యతనిన్ హీహీమతిం బాసె దు
స్సహవాసంబు లొనర్చి వీఁడని నగన్ సాగింత్రు మూఢాత్మకుల్. 41

క. సత్యపుబ్రహ్మ మసత్య మ, సత్యంబగు నీజగంబు సత్యము గాఁగాఁ
బ్రత్యయ మొసఁగెడు మాయకు, నత్యద్భుత మైనరచనయన సందియమే. 42

శా. జ్ఞానాసి న్మనుజుండు సంసరణబంధంబు న్విడంగోసి పూ
ర్ణానందంబున నుండు దేవుకడ నంచం ద్రెంచఁగాఁ గొంద ఱా
శ్రీనాథప్రతిమానుఁ డౌచు నతనిన్ సేవించు నం ద్రొక్కరుం
దానేదైవ మటం చెఱుంగు నిదియాఁ దథ్యం బటం ద్రన్యులున్. 43

క. పెక్కురు పెక్కుతెఱంగుల, వక్కాణించెదరు గాక వారికిఁ బ్రణతుల్
నిక్కం బెంచఁగ నెల్లర, కొక్కటియే సత్య మగుచు నుండుం గడకున్. 44

క. స్థాలీపులాకరీతిం, బోలం దెల్పితిని సర్వముం దెల్పుటకుం
జాలునె నాయట్టిఁడు ధీ,శాలి చిరంబునకుఁ దెల్పఁజాలెడు నేమో. 45

శొంఠి భద్రాద్రిరామశాస్త్రి.

సంకీర్తనలక్షణము.

తాళ్లపాక యన్నమాచార్యు లనునామాంతరము గల యన్నమయ్యంగారు, ఆయనకుమారుఁడు పెద తిరుమలయ్యంగారు మనుమఁడు తిరుమలయ్యంగారు నను నీ ముగ్గురు శ్రీవేంకటేశ్వరునిపై ననేక సహస్రములు సంకీర్తనములు రచియించినారు. ఇవి యన్నియు రాగిరేకుల మీఁదఁ జెక్కఁబడి యారేకులన్నియుఁ దిరుమలలో వేంకటేశ్వరుని యాలయములో భద్రపఱుపఁబడియున్నవి. వారిలో మూఁడవవాఁడగు తిరుమలయ్య రచించిన యీసంకీర్తన లక్షణముకూడ నారేకులలోఁ గొన్నిటిమీఁదఁ జెక్కఁబడి యున్నది. మూలమునకు సరియైనప్రతి యిందుఁ బ్రకటించుచున్నారము. తాళ్లపాక కవులను గుఱించియు వారి కవిత్వమును గుఱించియు ముందు పత్రికలో వ్రాసెదము.

ప. ప. సం.

శ్రీమతేరామానుజాయనమః.

క. శ్రీవేంకటేశ్వరప్రియ, పావనచారిత్ర పూర్వపదకవిమణితే
జోవరహారంబునకుఁ బ్ర,భావహకవినాయకత్వ మలవడుచుండన్. 1

క. వరకవితాగుణచతురత, లరుదారఁగ దాళ్లపాకయన్నయ ధరలోఁ
దిరువేంకటాద్రిపతిపైఁ, దొరకొని చెప్పంగఁ బదము తుదిపద మయ్యెన్. 2

వ. మఱియుం దత్సంకీర్తనంబు లెట్టి వనిన—

క. పావనములు హరిభక్తివి, భావనములు సర్వమంత్రపరమరహస్యో
ద్భావనములు గాయకనిక, రావనములు తాళ్లపాకయన్నయపదముల్. 3

క. రంజనములు దుర్గుణగణ, భంజనములు విమలకమలభవజనకగుణా
సంజనములు సుజ్ఞానధ, నాంజనములు తాళ్లపాకయన్నయపదముల్. 4

క. సారంబులు హరికరుణా, సారంబులు విబుధనికరసంపూర్ణసుధా
హారంబులు బహుదేశవి, హారంబులు తాళ్లపాకయన్నయపదముల్. 5

క. వేదంబులు పౌరాణిక, వాదంబులు వరకవిత్వవాణీవీణా
నాదంబులు కృతసుజనా, హ్లాదంబులు తాళ్లపాకయన్నయపదముల్. 6

క. లక్షణములు పదకవితా, రక్షణములు వివిధకుకవిరాజీమదసం
మోక్షణములు వేంకటపతి, వీక్షణములు తాళ్లపాకవిభుసత్కవితల్. 7

క. విన్నంతఁ బాపసంఘము, లన్నియు నడఁపంగఁ బూఁట యగు తాళులపా
కన్నయపదములు వాడిన, యన్నయకోవిదుల వేంకటాధిపుఁ డేలున్. 8

క. సంకీర్ణవివిధపాతవి, శంకటచిత్తులకు నైన సర్వేశ్వరుపై
సంకీర్తనములు వాడిన, శంకాతంకములు వలదు శమనునివలనన్. 9

క. మదిఁ దాళ్లపాకయన్నయ, పదములపై భక్తి గలిగి పాడిన విభవా
స్పదము లగు వివిధసంప, త్పదములు శ్రీవేంకటేశుపదములు దెలియున్. 10

క. నక్తంచరారి తనకును, భక్తుం డై నట్టి తాళ్ళపాకన్నయ చా
టూక్తిపదబంధకవితా, రక్తుం డై యితరవాగ్విరక్తుం డయ్యెన్. 11

మ. శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞానసారంబులై
యతిలోకాగమవీథులై వివిధమంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైలవల్లభరతిక్రీడారహస్యంబులై
నుతులై తాళ్ళపాకయన్నయవచోనూత్నక్రియల్ చెన్నగున్. 12

క. భరతాదిగ్రంథంబుల, విరచించినలక్షణములు వేంకటభూమీ
ధరవరకీర్తనలక్ష్యము, లురుపదకవితాపితామహుం డేర్పఱిచెన్. 13

ఆ. అట్టియన్నయార్యుఁ డానతిచ్చినపద, లక్ష్యలక్షణముల లాగు దెలిసి
పలుకనేర్చెనేని బాలుండుఁ బ్రౌఢయౌ, తత్ప్రబంధ మమృతధారఁ బోలు. 14

మ. ధరలోఁ దాళ్ళపాకయన్నయ గురూత్తంసుండు సంకీర్తనా
పరిశుద్ధిన్ మును సేయఁబూని తగ నుత్పాదించెఁ దల్లక్షణం
బరుదై మించిన సంస్కృతమ్మునఁ గవీంద్రానందసంధాయియై
పరిపూర్ణాఖిలశాస్త్రసమ్మతముగా భావజ్ఞు లౌ నౌ ననన్. 15

ఆ. అలరుఁ దాళ్ళపాకయన్నయార్యసుతుండు, తిరుమలార్యుఁ డఖిలదేశికుండు
తత్సుతాగ్రజుండ ధరలోనఁ జినతిమ్మ, యాహ్వయుండఁ దండ్రియనుమతమున.

మ. పరమామ్నాయసమానమై వెలయు మత్పైతామహగ్రంథమున్
వరచాటూక్తిమదీయపుణ్యజనకవ్యాఖ్యాతమున్ వేడ్కఁ ద
చ్చరణాంభోరుహముల్ మదిం దలఁచి సచ్ఛాస్త్రజ్ఞు లింపొందఁ గా
వరుసం జెప్పెదఁ బద్యరూపమునఁ దద్వాక్యానుసారంబుగన్. 17

వ. మహనీయం బగు సంకీర్తననామకపదసంప్రదాయం బెట్టి దనినన్—

సీ. రమణీయసంగీతరత్నాకరప్రబంధాధ్యాయమున నుక్తమయ్యెఁ బదము
సముచితసంగీతచంద్రికాదేశైళయందు మిక్కిలి తేటయయ్యెఁ బదము
అతులతత్సంవాద మైనట్టి సంగీతచూడామణికిఁ బల్కుచోటు పదము
ధన్యసంగీతసుధాకరగ్రంథంబునందు మిక్కిలి చెలు వొందుఁ బదము

గీ. తానె యిన్నిటికిని మూల మైనభరత, మందుఁ బంచదశాధ్యాయమందు విమల
వృత్తచూర్ణనిబంధకవివిధనామ, భవ్యలక్షణములకు నాస్పదము పదము. 18

క. అందఱిలోఁ బదమార్గ, చ్ఛందోమూర్ధాత్మ కవిత ఛందంబుల గో
విందపదభక్తివిరహిత, మందుని ధర్మక్రియాక్రమంబున నడఁగున్. 19

క. కృతిచెప్పిన యాతఁ డలం,కృతియుఁ జమత్కృతియుఁ గల్గఁ గీర్తించినచోఁ
గృతి యగు నటుగాక యహం,కృతిఁగృతిసేయంగ మిగులఁ గేలిం బడఁడే. 20

గీ. పెటలు నేరక చూఁడినఁ బెనురవంబు, లొదవ లక్ష్యంబు నైనఁ బ్రయోక్తనైన
సాధనము నైనఁ జెలుచు నీసరవిఁ గాదె, సంప్రదాయంబు నెఱుఁగని జడుని కవిత.

క. వరదానంబున నైనను, గురుముఖమున నైనఁ దెలిసికొను కవిపలుకుల్
పరమామృతమా లేదా, దురహంకృతకవితనోరఁదొం డండ్రుబుధుల్. 22

గీ. సంప్రదాయాగమజ్ఞానసహితుఁ డైన, మనుజుసత్కవితయు వేదమంత్రసమము
అదియుఁ జాలదె శ్రీవేంకటాచలేశు, చరణములు గను మనుపురశ్చరణమేల? 23

క. పద మగు సుప్తిఙ్జంతము, పదమవయవ మవయువియును బదమనఁ బరఁగున్
దుది నీతెఱంగు లన్నియుఁ, బదకవితామార్గసార్వభౌముఁడు దెలిపెన్. 24

వ. అందు, అవయవపదం బెట్టి దంటేని.

క. విదితచతుష్పాదం బగు, నది వృత్తం బదియ ధాతు వవయవసంజ్ఞం
బదియ యనొ యన్నయార్యుఁడు, పదిలముగా భరతశాస్త్రపద్ధతిఁ బలికెన్. 25

వ. ఈవృత్తంబులకు ధాతుసంజ్ఞ లెట్లయ్యె నంటేని—

ఉ. వాతముఁ బిత్తముం గఫము వర్ణితసర్వశరీరధారణా
హేతువు లయ్యెఁ గావున మహిం జెలు వొందెను ధాతుసంజ్ఞ నీ
రీతిని వృత్తముల్ పదశరీరసముద్భవకారణంబు లై
ధాతుసమాఖ్య లందె భరతప్రముఖాఖిలమానిసమ్మతిన్. 26

వ. ఇందులకు భాషానియమం బెట్లనిన—

ఆ. పదము సంస్కృతమునఁ బ్రాకృతమున దేశ, భాష నైనఁ బొసఁగఁ బలుకవలయుఁ
బ్రాసములు ను యతులు పద్యభంగినె చెల్లు, ననిరి భరతదత్తిళాదిమునులు. 27

శా. కర్ణాటద్రవిళాంధ్ర లాటవిలసద్గౌడాదిభాషాస్థితిన్
గర్ణాపూర్ణసుధాసమానరుచులం గల్గించు దేశైళ దా
స్వర్ణం బాభరణత్వ మొందుకరణిన్ సంగీతశాస్త్రంబులన్
వర్ణింపందగు నానుజాతియుతమై వర్తించుఁ బ్రత్యేకమై. 28

వ. అట్టిపదం బెన్నివిధంబులం జెలువొందు ననిన—

క. బంధురవృత్తపదంబు ని, బంధపదము చూర్ణపదము భరతాగమసం
బంధంబునఁ బదవిజ్ఞా, నాంధులకును దాళ్లపాకయన్నయ తెలిపెన్. 29

వ. అందు వృత్తపదం బెట్టిదనిన—

క. అందములై షడ్వింశ, చ్ఛందోగణయుక్తవృత్తజాతుల పదముల్
కుందనమునకును బరిమళ, మందినక్రియ వృత్తపదము లలరుచు నుండున్. 30

ఆ. వృత్తజాతియెల్ల విషమంబు సమమును, నర్ధసమము నాఁగ నతిశయిల్లు
నందులోన విషమ మనునది నాలుగు, పాదములును వేఱ భంగిఁ జెల్లు. 31

క. నాలుగుపాదంబులు నొక, చాలున వర్తించునదియ సమవృత్తం బా
లీలన్ సమపదమును దా, ళాలంకృతసామ్యపాద నై చెన్నొందున్. 32

గీ. విషమపాదంబు లొకరీతి వెలయుచుండ, సమచరణములు వే ఱొక్కచంద మైన
నర్ధసమవృత్త మనఁ జెల్లు నట్టి పదమె, యర్ధసమపద మనియన్నయార్యుఁడనియె.

వ. మఱి నిబంధనామపదం బెట్టి దనిన—

మ. యతులుం బ్రాసములుం బదంబులును మాత్రానీకముల్ తాళసం
గతులుం గల్గి నిబంధనామపద మాఖ్యాతార్థసంయుక్తసం
స్కృతియై తాళులపాకయన్నయ గురూక్తిన్ లోకవిఖ్యాత మై
జితమాధ్వీకసితాసుధారసరుచిస్ఫీతంబు నై చెన్నగున్. 34

వ. అట్టి నిబంధనామపదంబునకుఁ దదంగంబు లైన యతిప్రాసాదులవిధం బెట్టి దనిన—

క. పాదములు నాలుగింటికి, నాదుల నడుముల సవర్ణ మగునవి యతు లా
పాదద్వితీయవర్ణము, పాదుగ నొక్కటియ చెల్లుఁ బ్రాస మనంగన్. 35

క. మాత్రయొకటిలఘువనఁదగు, మాత్రాద్వయమైనగురుసమాహ్వయమయ్యెన్
మాత్రాత్రయముప్లుతం బగు, మాత్రార్థముద్రుతము భరతమతమునఁజెలఁగున్.

గీ. పూని తాళక్రియాలసన్మానమునకుఁ, దాళశబ్దంబు వర్తించు ధరణి నదియు
దేశియును మార్గమును నాఁగఁ దేజరిల్లు, ధన్య భరతాదిబహుసంప్రదాయలీల.

వ. మున్ను చెప్పిన నిబంధనామపదంబునకు నవయవంబు లైన యవాంతరపదంబులకు నామంబు లెయ్యవి యనిన—

క. మొద లుద్గ్రాహము రెండవ, యది మేళాపము తృతీయ మగుధ్రువ మటపైఁ
గదిరినయది యంతర మా, తుది నాభోగంబు ముద్రతోఁ జెలువొందున్. 38

వ. ఈయవయవపదంబులకు ననుకూలం బైనపల్లవి యెట్టి దనిన—

క. పదములయర్థముఁ బల్లవి, వదలక యన్నిటికి నేకవాక్యతఁ జేయన్
గుదిగ్రుచ్చినట్లు తగులై, పదముతుదిన్ మఱియు మఱియుఁ బల్లవి యలరున్.

ఆ. పదసమానమానపాదయుగ్మముతుది, నలరి పల్లవాఖ్య నతిశయిల్లు
నందులోన నర్ధ మైనశిఖాపద, మనిరి లక్షణజ్ఞు లైనమునులు. 40

వ. ఈపల్లవశిఖాపదంబులకుఁ బ్రయోగసంప్రదాయం బెట్టి దనిన—

గీ. పల్లవంబున్నచో శిఖాపదము గల్గ, దదియ కల్గినఁ బల్లవ మందు నుండ
దనుచుఁ జూడామణిగ్రంథమందుఁ జెప్పె, ననుచు సంగీతచంద్రికయతఁడు వలికె.

వ. అందుఁ జతుర్ధాతుకనిబంధపదం బెట్లుండె నంటేని—

గీ. కల్పితోద్గ్రాహమేళాపకధ్రువంబు, వర్జితాంతర మై కడు వన్నె గలిగి
యుచితపల్లవికాభోగయుక్త మైన, యది చతుర్ధాతుపద మని యంద్రు బుధులు.

వ. మఱి త్రిధాతుకనిబంధనామపదం బెట్లుండె నని యంటేని—

గీ. పొసఁగనుద్గ్రాహకధ్రువాభోగములను, బల్లవియుఁ గల్గి యంతరం బరిహరించి
పరివివర్జితమేళాపభాసమాన, మైనయది య త్రిధాతుక మనిరి బుధులు. 43.

వ. మఱి ద్విధాతుకనిబంధనామపదం బెట్లంటేని—

క. యుగమును ధ్రువమును బల్లవి, తగఁ జెప్పిన పద మది య ద్విధాతుక మయ్యెన్
దగ నేత్రకీర్తిలతికలు, చిగిరింపఁగ ముద్ర ధ్రువముఁ జెప్పఁగ నమరున్. 44

వ. మఱి యేకధాతుకపదం బెట్లం టేని—

క. తగ నేకధాతుపద మీ, జగముననే లేదు నాట్యశాలల దేశిన్
మొగవరి యని పాడుదు రది, యుగముం బల్లవియుఁ గూడి యుండుం జవిమై.

వ. మఱియునుం బదవిశేషంబు లెట్టి వనిన—

గీ. ఘనత మీఱంగ జయదేవకవివరేణ్యుఁ, డంద మైనట్టిగీతగోవిందమందు
నంచితాష్టపదులు వల్కె నట్లు పదము, పరఁగు నెనిమిదిపదములు పల్లవియును.

క. రహిఁగల పల్లవిఁ బెనఁగొని, సహజోజ్జ్వలలీల నర్థచాతురి గూడన్
బహువిధములఁ బదమాలిక, మహిలోఁ జెన్నొందు సీసమాలికరీతిన్. 47

క. ధర నెనిమిదిపాదంబులఁ, బరఁగినపద మదియ శరభపాదపదంబా
వరమీమాంసకసముచిత, పరిభాషలయందు నట్లు పరఁగుటవలనన్. 48

ఆ. ముక్తకంబుఁ గుళకమును నాఁగఁ దగిపద్య, జాతి పరఁగు నట్లు జగతి నొకటి
దరు వనంగఁ జెల్లుఁ దగు గుళకం బెల్ల, పదము నాఁగ నతులభంగి నలరు. 49

మ. పరఁగున్ వృత్తము జాతి యంతయుఁ జతుష్పాదద్విపాదాకృతిన్
వరసంకీర్తనముల్ తదాకృతులనే వర్తించు మానంబులో

దరువుల్ జక్కులరేకు లేలలును నిద్దంబైన గొబ్బిళ్లు భా
సురవాక్యంబులుఁ జందమామపదముల్ శోభిల్లు నందంబులై. 50

గీ. దరువు వాక్యంబు నర్ధచంద్రకపదంబు, నేలపాటయు గొబ్బిళ్లు నింపులైన
చందమామపదంబులు జగతిఁబాద, యుగళమున బహుజననంప్రయుక్తిఁబరఁగు.

క. హీనాల్పలోహకాంచన, మానసమానతలు వర్ణమహిమ నగుగతిఁ
హీనాధికపదములకు స,మానత లొదవించు వర్ణమహిమ ధరిత్రిన్. 52

వ. అందు నర్ధచంద్రకపదం బెట్లంటేని—

క. యుగమును ధ్రువమును భోగము, నగమె పలికి పల్లవంబు సంధించినఁ జె
న్నగు నర్ధచంద్రపద మన, నగణితతానప్రతానకాంచిత మగుచున్. 53

వ. మఱియుఁ జూర్ణాఖ్యపదం బెట్టి దంటేని—

క. ధరఁ గృష్ణాచార్యాదిక, పరికల్పిత పదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం, బరఁగు ననిరి యుక్తనామభాసిత మగుచున్. 54

వ. మఱియుం దచ్చూర్ణవిధం బెట్టి దనిన—

క. ఛందోగణముల నియతిం, బొందక తాళప్రమాణమునఁ గడుఁజెలువై
కొందఱచే దచ్చూర్ణం, బందముగాఁ దాళగంధి యనఁ బొగడొందున్. 55

క. పదముల శృంగారవధూ, మృదుమధురమనోజ్ఞవాక్యమిశ్రము లైనన్
విదితార్థగ్రామ్యోక్తులు, పదిలముగాఁ బొంక మెఱఁగి పలుకం జెల్లున్. 56

వ. అది యెట్లంటేని—

క. పురుషోక్తి సంస్కృతంబును, దరుణీవాక్యమునఁ బ్రాకృతము నీచవధూ
పరిభాష నితరభాషలు, పరఁగిన క్రియ నుచితభాష పదములఁ జెల్లున్. 57

క. పల్లవనారీమ్లేచ్ఛా, దుల్లాసమనోజ్ఞబంధురోక్తులు చవియై
చెల్లును గ్రామ్యము లైనను, హల్లీసకముఖ్యనాటకాదికఫణితిన్. 58

క. జగతిఁ గలచెల్లుబళ్ళై, నగి నగి భాషించునట్టి నానుడి పలుకుల్
తగ దన రహిఁజెడుఁ బువ్వుల, సొగ సుడుగం బిసికి కంపు చూపినభంగిన్. 59

క. వైరాగ్యవృద్ధికరగం,భీరపదశ్రేణి పొసఁగఁ బెనుపుచు నగ్రా
మ్యారమ్యవిష్ణుచరితో, దారములై యున్నఁ జాలు ధరణి న్వేలయున్. 60

క. దేహాత్మైకవివేకో, త్సాహంబును లోకవేదధర్మాధర్మా
ద్యూహాదోహంబులఁ గల, యాహతి సంకీర్తనంబు లధ్యాత్మంబుల్. 61

గీ. మహితతానాంచితవిలంబమానమునను, దాలవిరహితమై పదార్థంబు చెంది
కేవలద్విచతుష్పదాకృతిఁజెలంగు, నదియ ధరవాక్యమనియన్నయార్యుఁడనియె.

గీ. మహిమమిఱంగ ద్రుతమధ్యమానములును, జిత్రవర్ణంబు తాళంబుఁజెన్నుమీఱి
మునుపఁబాడినపదవాక్యములఁబొసంగి, ధరణిద్విచతుష్పదాకృతిదరువుచెలఁగు.

వ. మఱియుఁ జందమామపదం బెట్టు లనిన—

ఉ. దుస్తరవిప్రలంభమున దూతికతోడ మొఱంగి చంద్రవి
న్యస్తభరస్వభావమున నాయకుఁ డేనియుఁ గాంత యేనియున్
విస్తరపాదివాదముల వేడుకఁ జందురుఁ బేరుకొన్న-చోఁ
బ్రస్తుతి కెక్కెఁ దత్పదము భాసురమై ద్విచతుష్పదాకృతిన్. 64

వ. మఱి యేలపదవిధం బెట్లనిన—

గీ. నాయకాహ్వానపూర్వమై నయము గలిగి, మ్లేచ్ఛపరిభాషఁ దగి రాగమిళితమైన
యేలపాట పదంబునా నిలఁ జెలంగు, మహితనాయకసంబుద్ధిమధ్య మగుచు.

గీ. యక్షగానపదంబులు నవ్విధమున, సముచితానేకవిధతాళసంగతులను
నవరసాలంక్రియాసవర్ణంబు లగుచు, నలరు నని హరికీర్తనాచార్యుఁ డనియె. 66

వ. మఱియుం బదసంధు లెట్టి వనిన—

క. భావితలౌకికవైదిక, పావనగతిసంధ్రభాషఁ బల్కెడుసంధుల్
త్రైవిక్రమాదిభాషా, భావజ్ఞులు వల్కినట్టి పద్ధతిఁ జెల్లున్. 67

క. నానావిధదేశంబుల, నానాకవి బుద్ధివర్ణనారచనలచే
మానితతానకరాగము,తో నలరున్ దేశిపదము దొరలకు మెచ్చై. 68

క. భావరసాలంకృతి శ,య్యావిధములఁ దప్పలేక యందము లగుచున్
దైవికమానుషరచనా, పావనబంధంబు లైనపదములు వెలయున్. 69

క. బూరుగుకాయం గొఱికిన, నీరసతూలంబు దిశలు నిండినగతి ని
స్సారపదబంధకవితా, పారీణులపదము హాస్యపద మై యుండున్. 70

వ. మఱి యన్యగీత చౌర్యం బెట్టి దనిన—

ఆ. కూటసాక్షి సాక్షిఁగోరినఁ బలుకుట, యన్యవిత్తములకు నాశపడుట
సభల నితరగీతచౌర్యంబు సేయుట, భరతమాని యొక్కపాటి యనియె. 71

(ఈ గ్రంథ మింతవఱకే యున్నది.)

(17) కార్తికమాహాత్మ్యము.

ఇది యాఱాశ్వాసముల పద్యప్రబంధము. దీని రచించినయతఁడు కుందుర్తి వేంకటాచలకవి. ఇతఁ డొనరించిన దొకటి—మిత్రవిందాపరిణయము మాత్రమే కవులచరిత్రలోఁ జేర్పఁబడినది.

కవివిషయము—ఇతఁడు గ్రంథావతారికలోఁ దన్నుఁ గూర్చి యిట్లు వ్రాసికొనియుండెను.

సీ. ఏరాజధానికి నిరుచకిటి గోపాలవేంకటాచలపతుల్ వెలయుచుండు
నేపురిమధ్య సందీపితుం డగుచు నందీశ్వరుండు వసించుఁ గృపను మనుప
నేపట్టణం బయోధ్యాపురంబునకు జోడై పరాభేద్యమై యలరుచుండు
నేపుటభేదనం బాపూర్ణరుచిరాష్టలక్ష్మీనివాసమై లలిఁ జెలంగు

గీ. నట్టితీర్థపురీపాలనాతివేల, ధర్మసథవర్తి చంద్రికాధవళకీర్తి
తార్క్ష్యవాతాత్మజధ్వజాద్యఖిలబిరుద, విజితచక్రాయుధార్జునవిభవుఁ డతఁడు.

......పాండ్యగజకేసరి బిరుదాంకుండు....రాయవేశ్యాభుజంగుఁడు....పంటకుల కలశపాథోనిధానరాకాహిమాన బలగోలులింగనృపపుంగవ కులపాలికాపేర్యంబికా నిర్భరగర్భశుక్తిముక్తాయమానుండు నగు......వేంకటాచలమహీమహేంద్రుండు......నన్నుఁ బిలిపించి యిట్లనుచుఁ బలికె.

సీ. ఘనుఁడు మీముత్తాతకవ్యహోబలమంత్రి గజపతిసభనుతుల్ గాంచి మించె
మీతాతగోవిందమేదినీసురుఁడు రాయలచేతఁ గాంచె స్వర్ణాభిషేక
మనఘుఁడు మీతండ్రి యును బాండ్యచొక్కనాథావనీశ్వరునకత్యాప్తుఁడయ్యె
నీపూర్వవంశజుల్ నెలకొని రాయసంస్థానంబున నెకీర్తి నవఁ

గీ. రసుచు లోకప్రసిద్ధులై తనరిరి గద, నీవువారలవలెనే యు   వ్య
నాటకసమగ్రరచనలమేటి వైతి,..

సీ. ఆంధ్రభాషనె ప్రోడ యనుమాత్రమే కాదు సంస్కృతంబున [illegible] సరసమతివి
లక్షణగ్రంథసారము లెఱుంగుదు వైన లక్ష్యముల్ నీకు లాలాబలములు
తతచతుర్విధకవిత్వప్రౌఢి నీసొమ్ము నవరసప్రతులు నీనవ్యకృతులు
నీదీవనలు సమున్నిద్రసంపద లిచ్చుఁ బూజ లందితివి భూభుజులచేతఁ

గీ. జాటుకృతులును బహువిధనాటకములు, బంధురతరార్థపూర్ణప్రబంధములును
రచనగావించి దేవతార్పణము చేసి, పాండ్యవిభుచేఁ బ్రభుత్వసంపదలు గనితి.

గీ. అనఘకార్తికమాహాత్మ్యమాంధ్రభాషఁ, గబ్బమొనరించిమదభీష్టకలనఁజెలఁగ
బంధురకృపాలహరికిగోపాలహరికి, నంకితమొనర్పుమినియమాయభిమతంబు.

మఱియు నితఁడు రచించిన—

(18) మిత్రవిందాపరిణయము.

అనుప్రబంధము నవతారికలో నిట్లు వ్రాసికొనెను.

గీ... అతఁడు సామాన్యుఁడే షట్సహస్రకులస, రిత్ప్రసందు త్రిథవశాంతరీపదీప్తుఁ
డాగమాంచలపద్మావిహారకారి, విశ్వపరితోషకారి గోవిందశౌరి.

చ. పటుతరగోస్తనీమధురపాకసమంచితముక్తి రసోర్మిప
ర్యటమగుభారతీపరిణయం బనుకావ్య మొసంగి వీరవేం
కటపతిరాయలం దనిపి కాంచె మణీకనకాభిషేకము
త్కటగతి నమ్మహామతి సుఖస్థితిశోభియశోఽభిరాముఁడై.

సీ. చదివినావేమేమి చదువ యోగ్యంబులో యవి యెల్ల నిస్సంశయంబు గాఁగ
వచనకావ్యములుగా రచియించినావు భారతభాగవతములు రామకథయు
ఘటియించినావు ద్రాక్షాపాకముగ బహునాటకంబులు సమున్నతి సెలంగఁ
జాటించినావు దిక్కోటరంబుల బుధకోటి మెచ్చ నపారచాటుకృతులు

గీ. అర్థగుంఫసముజ్జృంభితాశుమధుర, చిత్రవిస్తరకవితాప్రసిద్ధినీకు
సహజమే కద పాండ్యభూజానిసభఁగ, ధాశుకవియనఁ గీర్తిఁ జెన్నలరినావు.

చ. కవిజనకల్పకం బఖిలకావ్యరసజ్ఞుఁ డఖండపాండ్యభూ
ధవుఁడు మహానుభావుఁ డతిధార్మికుఁ డర్యగవజ్రధారియై
నవిజయరంగచొక్కనరనాథుఁడు నీకవితాసమగ్రవై
భవముల మెచ్చి నీ కొసఁగె భర్మమణీశిబికాదిసంపదల్.

క. అటుగానఁ దలఁప నీకే, మిట నింత కొఅంత లేదు మేల్మేలు భవ
త్పటుకావ్యహారమునకును, ఘటియింపుము నాయకమణి గా రంగపతిన్.

పైపద్యములం బట్టి యిక్కవి తీర్థపురపాలకుఁడు బలగోలు లింగారెడ్డికుమారుఁడు నగు వేంకటాచలనృపునియానతిచేఁ గార్తికమాహాత్మ్యము గోపాలస్వామి కంకితముగా నొనర్చె నని తెలియుచున్నది. ఈతఁడు శ్రీపాండ్యమండలాధీశ్వరుని సామంతరాజులలో నొకఁడు.

ఈతీర్థపురము తిరుచనాపల్లి కుత్తరముగా 27 మైళ్లదూరములో నున్నది. ఇది యిపుడు 'తుఱైయూరు' అని వాడఁబడుచున్నది. మఱియు నీతనిము

త్తాత యహోబలకవి శ్రీకృష్ణరాయలమామయుఁ గనిగిరిరాజు నగు వీరరుద్ర గజపతికాలములోనివాఁ డనియు నీతనితాత గోవిందార్యుఁడు విజయనగర సంస్థానరాజగువీర వేంకటపతిరాయల యాదరమున భారతీపరిణయకావ్యము రచించినవాఁ డనియు నీతనితండ్రి రామయమనీషి విజయరంగ చొక్కభూపాలుని యాస్థానమునఁ గవిగా నుండె ననియు నితఁడును శ్రీపాండ్యమండలాధీశ్వరునిచే సత్కరింపఁబడినవాఁ డనియు భారత భాగవత రామాయణ వచన కావ్యములను బెక్కునాటకములను రచించినవాఁ డనియుఁ దెలియుచున్నది. కావున దీనింబట్టి యితఁడు క్రీ. 1731 వఱకు రాజ్యముచేసిన విజయరంగచొక్కనాథునకుఁ బిదపనే యీకార్తికమాహాత్మ్య మిత్రవిందాపరిణయములు రచియించిన ట్లూహింపఁదగి యుండుటచే నితఁడు 18 వ శతాబ్దము మధ్యభాగము వఱకును జీవించి యుండె నని విశ్వసింపవచ్చును.

ఇతఁడు మధురాపురవాసి - ఆఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఆపస్తంబ సూత్రుఁడు. శాండిల్యగోత్రుఁడు. ఇతఁడు రచించిన గ్రంథసంతతిలోఁ బై రెండు గ్రంథములు దక్కఁ దక్కిన వేవియు నింతవఱకును గానరావు.

గ్రంథములవిషయము—పరిషత్తునకుఁ జేరియున్న కార్తికమాహాత్మ్యము సంపూర్ణముగా మంచిస్థితిలోనే యున్నది. ఇందు మిక్కిలి నీతిదాయకములు భక్తిప్రదములు నగు నుపాఖ్యానములు వర్ణింపఁబడినవి. ఇచ్చటకు సంభవించిన మిత్రవిందాపరిణయమున మూఁడాశ్వాసములు మాత్రమే కలవు. అవియైనను నడుమనడుమఁ గొన్నిపద్యములు లేకయున్నవి. ఇది వ్రాఁతకాగితములప్రతి. ఇందు శ్రీకృష్ణునకును మిత్రవిందకును జరగినవివాహము శృంగారప్రధానముగా వర్ణింపఁబడినది.

కవిత్వవిషయము—ఈతనికవిత్వము తాను వర్ణించికొనినంత ప్రౌఢమును నిర్దుష్టమును ధారాళమును గాదు గాని దక్షిణదేశమందలి యాంధ్రకవిత్వములోఁ గొంత మెఱుఁగు చూపకపోదు. శైలి తెలుపుటకు రెంటినుండియు రెండుపద్యము లుదాహరించెదను.

ఉ. ఎందుకుఁ గోప మోసరసిజేక్షణ యెక్కడ డాఁగినా వయో
యుందుముఖీవతంసమ యొకించుక ముంగర వచ్చి నిల్వవే
బృందసుధారసం బొసఁగవే పికవాణి చలించుచున్ననా
డెందము చల్లఁజేయవె కడిందితనంబులు మాని మానినీ.—కార్తి.

చ. చిందినతేనియల్ చినిఁగిచీలిక లౌచిగురాకు లెంతయుఁ
గందినపూవుగుత్తులు వకావకలౌ ఫలమంజరుల్ పెనల్
చెందినలేఁతతీవెలు చలించినపుల్గులు వ్రేలు కొమ్మలై
డిందియుఁ బొల్చె నవ్వని కడిందిమిటారులకేళివై ఖరిన్——మిత్ర.

(19) గాధేయోపాఖ్యానము.

ఇది నైదాశ్వాసముల పద్యప్రబంధము. దీనికవి రేవూరి అనంతార్యుఁడు. కవుల చరిత్ర మీకవికాలమును దెల్పకపోవుటయే కాక యీతని యింటిపేరు తాళపత్ర రని మార్చి యీగ్రంథ మేకాశ్వాసశృంగారప్రబంధ మని చెప్పుచున్నది. ఇందులకుఁ గారణమేమో యూహ్యము. ఈకావ్యము కృతినందిన బదిర కృష్ణభూపాలుఁడు తన్నుఁగూర్చి చెప్పినట్లుగాఁ గవి గ్రంథావతారికలో నిట్లు వ్రాసికొనెను.

సీ. ఘనవహానికులమాన్య కౌండిన్యగోత్రపవిత్రుఁ డాపస్తంబసూత్రమహిత
గతిహరి రేవూరికాళహస్తికవీంద్రు పౌత్రులింగకవీంద్రుపుత్రుఁ గాళ
హస్తిమహాకవియనుజన్ము నేకాంబ్రుకవిశిఖామణి గుర్వకవితిలకశి
వానందసుకవుల కగ్రజన్ముని ఘటికాశతగ్రంథసంఘటకు లేఖ

గీ. నీశితకరేణ్యకవితాప్రకాశకునిది, నప్రబంధనిబంధను నను ననంతుఁ
దనరుచిరబోధయుతమనోవనరుహమునఁ,దనరు నెనరునఁగనుఁగొనియనియెనిట్లు

దీనింబట్టి "యీకవి యింటిపేరు రేవూరివారు. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు. కౌండిన్యగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. కాళహస్తికవికిఁ బౌత్రుఁడు. లింగకవికిఁ బుత్రుఁడు. కాళహస్తిమహాకవికిఁ దమ్ముఁడు, ఏకాంబ్రకవి గుర్వకవి శివానందకవులకు నన్న. ఘటికాశతగ్రంథకర్త, దినైకప్రబంధకర్త" యని తెలియుచున్నది. మఱియు నీతనిపౌత్రుఁ డగు ననంతయజ్వ తనశ్రీముష్ణమాహాత్మ్యమున నీతని నిట్లు వర్ణించెను.

సీ. ఆదేండ్లనాఁడె వేదాదివిద్యలు నేర్చి విభులమెప్పించె గర్వితుల నణఁచి
యట్టిప్రాయమునాఁడె యష్టభాషలఁ జతుర్విధ కృతుల్ ధర వినిర్మించి నిలిపె
ఘటికాశతకదినైకప్రబంధముల మైసూరిచెంజిండ్ల మెచ్చులు ఘటించె
నూఱుఘంటములకై నోరారఁగ ఘనాఘనంబనఁ గవిత మిన్నందఁ బలికె

గీ. నేకసంధావధృత ధృతానేకవిబుధ, దుర్గ్రహగ్రంథసాహస్రతూర్ణతుష్ట
మండలాధీశదత్తసన్మానభాల, కవియనంతేంద్రు నెన త్రిలోకములఁ గలరె.

పితామహులయందలి గౌరవముచే నతఁడిందుఁ గొంత యతిశయోక్తి చెప్పె నని యూహించినను నీతని వైదుష్యకవిత్వసామర్థ్యము గొప్పది యని మాత్రము తలంపవచ్చును.

కృతిపతివిషయము—ఈకావ్యముఁ గృతినందిన యాతఁడు బదిర కృష్ణ భూపాలుఁడు, శూద్రజాతియందలి 'కంపళ' మనునది యీతని కుల మైన ట్లీ క్రిందిపద్యము చెప్పుచున్నది.

గీ. చిత్రచారిత్రమైనలక్ష్మీకళత్ర, చరణశతపత్రమునఁ దుర్యజాతి కుశల ధుర్యరీతి జనించె నందు నుతిగాంచెఁ, గంపళం బనుకులము సత్కర్మఫలము.

ఈతనితల్లి కామాంబిక, తండ్రి చిన్నభూపాలుఁడు. అవతారికలో నున్న "నర లోకగండ బిరుదసముజ్జ్వలుండు....వంకినారాయణాంకుండు...చేరచోరపాండ్య బల్లాళరాయమనోభయంకరుండు; ప్రతాపాతిశయాపాదిత తాపాహతద్వీపాం తర భూపాలకుండు.. యాదవరాయ రాజ్యస్థాపనాచార్యుండు...గంగువాడ పదినెట్టు మన్నియరగండాంకుండు" అను విశేషణములఁబట్టి యు నీతనిపూ ర్వుల వర్ణనలఁబట్టియు నితనివంశమువారు నితఁడును సుప్రసిద్ధముగా దక్షిణదేశ మందు రాజ్యముచేసిన వా రని తెలియుచున్నది. కాని యీయాదవరాజ్య మిప్పు డేపేర నున్నదో తెలియరాకున్నది. ఈతని వంశమువారు పెక్కండ్రు శత్రురాజులను జయించిన ట్లిం దున్నది. వారిలో నొక్కరిపేరు నిందుఁ జే ర్కొనఁబడలేదు. మఱియు నితనిపూర్వులలో నొకఁ డగుతిరుమలరాజు దక్షి ణాయోధ్యయనుపేర నొకపట్టణంబు గట్టించి యందుఁ బట్టాభిరామునిఁ బ్రతి ష్ఠించిన ట్లిందే వర్ణింపఁబడినది. కాని యీదక్షిణాయోధ్య కిప్పటిపే రేమో తెలియదు. కావునఁ గృతిపతినిబట్టి కవికాల మూహింప నవకాశము గలుగ కున్నది గాని యీతనిమనుమఁడు చెప్పిన పూర్వపద్యములోని 'మండలాధీశ దత్తసన్మాన' యను విశేషణమందలి 'మండలాధీశుఁడు' పాండ్యమండలాధీ శ్వరుఁ డగు విజయరంగచొక్కభూపాలుఁడే యని యూహించుట సరి యయ్యె నేని యీతఁడు 18 వ శతాబ్దము పూర్వభాగములోనివాఁ డని యనుకొనవచ్చు ను. విజయరంగచొక్కనాథునకుఁ బాండ్యమండలాధీశ, మండలాధీశాది విశే షణము లుపయోగించుట దాక్షిణాత్యకవులు కాచార మై యున్నది. మఱియు నీ యభిప్రాయంబున కీ కవియే రచించిన వృద్ధాచలమాహాత్మ్యమునవతారిక కూడఁ గొంత సాయపడుచున్నది. చూడుఁడు.

(20) వృద్ధాచలమాహాత్మ్యము.

ఇది కవులచరిత్రలోఁ జేర్పఁబడలేదు. ఇది లింగాజిరెడ్డి కంకిత మీయఁబడినది. ఈతనియింటిపేరు పంటవారు. వీరు శూద్రులు. ఈతనితండ్రి యెఱ్ఱారెడ్డి. ఈతనిరాజధాని వెంగనూరు. ఇతనిభార్య యెఱ్ఱాంబికకు వృద్ధాచలేశ్వరుఁడు ప్రత్యక్షమై తనకు వెంగనూరిలో నాలయము కట్టింపు మని కోరిన ట్లామె వలన విని యాతని యాలయము కట్టించిన ట్లిందు వర్ణింపఁబడినది.

ఈవెంగనూరు వెంగుళమునకు సమీపమున 'పెరంబలూరు' తాలూకాలో నున్నదని తెలియుచున్నది. ఈవెంగుళము తిరుచనాపల్లి మండలములోనిది. కవి, యీకృతినాయకుని "బల్లహోల్ శాసనుఁడు, జగదగోవాళ, రాయవేశ్యాభుజంగుఁడు, పాండ్యగజకేసరి, విశుద్ధపంటవంశపావనుఁడు" మొదలు గాఁగల విశేషణములతో వర్ణించియుండుటచే నితఁడు గూడ బాండ్యభూపాలుని సామంతులలోనివాఁ డేమో యనియుఁ దోఁచుచున్నది.

గ్రంథములవిషయము.—గాధేయోపాఖ్యానము నైదాశ్వాసముల ప్రతియు సంపూర్ణముగా నిం దున్నది. ఇందు విశ్వామిత్రుఁడు రాజ్యముచేయుట వసిష్ఠుని యావు నడుగుట, మొదలుగా ఘోరతపస్సు చేసి యాతనిచే బ్రహ్మర్షి యనిపించుకొనుట యనునంతవఱకును గలకథాభాగ మతిప్రౌఢముగా సరసశైలిని వర్ణింపఁబడినది. వృద్ధాచలమాహాత్మ్యము క్షేత్రమహత్త్వమును దెల్పు నైదాశ్వాసముల పద్యప్రబంధము. ఇదియు సర్వవిధములఁ బై కావ్యమునే పోలియున్నది. శైలి దెలుపుటకు రెండుకావ్యములనుండిఁ రెండుమూఁడు పద్యము లుదాహరించెదను.

శా. ఏకాలంబున దీనిఁ గట్ట విడ నీ కెవ్వార లున్నారమో
మాకీలారమునందు దీని నిడినన్ మాకింపు సంధిల్లదో
నీకున్ వేఁడినవేళ నిచ్చి మగుడం దెప్పించుకోమో వృథా
మాకుం గోపము రేచి తింకఁ దరమే మమ్ము న్నివారింపఁగన్.

ఉ. ఏ మనవచ్చు నీమహిమ యీమహిమాదృగిలాతలాధిప
గ్రామణి కిట్టిగోమణి యొకండును గల్గద మేల్గదా ఘనుం
డీముని దీనినిం బడసె నిమ్మెయి నిమ్మెయి నింతకంటె మే
లే మొదవుల్ మహాత్మునకు నేమొదవుల్ సాటి దీనిఁ బోలునే?—గాధే.

శా. ఆరూపంబుఁ గనుంగొన న్వెఱచి నేత్రాంభోజముల్ మూసి యా
శ్వారిన్ బ్రహ్మముఖామరుల్ ప్రణతులై స్వామీ కటాక్షింపవే
యీరూపంబుఁ గనుంగొనంగఁ గలమే యేమెల్ల మాహృద్దృగ
బ్జారాధ్యం బగురూపుఁ జూపఁగదవే యర్ధేందుచూడామణీ.—వృద్ధా.

(21) శ్రీముష్ణమాహాత్మ్యము.

ఇది యైదాశ్వాసముల పద్యప్రబంధము. దీనిరచించినయాతఁడు, రేపూరి అనంతయజ్వ. ఇతఁ డాపస్తంబసూత్రుఁడు. కౌండిన్యగోత్రుఁడు. వైదిక బ్రాహ్మణుఁడు. బాలకవిబిరుదాంకితుఁడు. బాలకవి బిరుదాంకితుఁడు మహాపండితుఁ డగు ననంతాఖ్యనకుఁ బౌత్రుఁడు. కాళహస్తికవికిఁ బుత్రుఁడు. ఇతఁ డీ గ్రంథమును వెంగుళము కృష్ణమహీంద్రునియానతిచేఁ దెలిఁగించి యాతనికే యంకిత మొనర్చెను. ఈవిషయ మాతని గ్రంథావతారికలోని యీక్రింది పద్యములవలనఁ దేటపడఁ గలదు.

మ. అనఘున్ ధీనిధి బాలకవ్యభిధపూర్వానంతపౌత్రున్ జగ
జ్జనగేయోదయ కాళహస్తికవిభాస్వత్సూనుఁ గౌండిన్యపా
వనగోత్రాంకు ననంతనాము నను నాపస్తంబసూత్రున్ బ్రియం
బున రావించి సుధారసోపమముల పొంపుల్ గులుకఁ బల్కెన్ దయన్.

సీ. ఏవీట నిరవొందు నేప్రొద్దు ఘారాపురీశ్వరనాముఁడై విశ్వవిభుఁడు
ఏపురంబున నుండుఁ గోపురంబుగ గౌరి సౌందరనాయికాసముచితాఖ్య
నేప్రోలు పాలించు నెలమిఁ బెట్టనికోట యగుచుఁ గూత్తాండారు జగమెఱుంగ
నేనగరంబున నింపు నింపు ననంతవిద్వత్కవిస్తోమవిశదఘణితి

గీ. నట్టి వెంగుళ మాత్మీయ మైనరాజ, ధానిగా మీఱు నాచంద్రతారకముగ
భరితజగనొబ్బగండాదిబిరుదశాలి, వరదరాజేంద్రు కృష్ణభూపాలమౌళి.

క. శ్రీముష్ణమహాత్త్వం బభి, రామం బని తెనుఁగుసేసి రహిఁ గకలజగత్
క్షేమంకర కృతి మచ్చుభ, నామాంకితముగ నొనర్చె నైపుణిఁ గనుమా.

ఈవెంగుళము పాండ్యదేశములోనిది. ఈ కృతినాయకునితండ్రి వరదరాజరెడ్డి. వీరిది పంటకులము. ఈతనివంశమువారు పాండ్యమండలాధీశ్వరుఁ డగు విజయరంగచొక్కభూపాలుని సామంతులలోనివా రని తెలియుచున్నది. మఱియుఁ గవి తన పితామహునివైదుష్యమును వర్ణించుచు "మర్గ్రిహగ్రంథసాహస్రతూ

ర్ణతుష్ట, మండలాధీశదత్త సన్మానబాల, కవియనంతేంద్రు డైన త్రిలోకమునఁ గలరె" అని యిందే తెలిపియున్నాఁడు. దీనింబట్టి మున్ను వ్రాసినట్లుగా నిందలి మండలాధీశుఁడు విజయరంగచొక్కనాథుఁడే యని యూహించినచో నిక్కవి 18 వ శతాబ్దము కడపటిభాగములోనివాఁ డని తేలుచున్నది.

గ్రంథకవిత్వవిషయములు—పరిషత్తునకు దీని దొక్కప్రతి సంభవించి, నది. అది మిక్కిలి చక్కనివ్రాతలో సంపూర్ణముగా నున్నది. ఆంధ్రదేశములో దీనినామ మింతవఱకు వ్యాపించలేదు గాని యాంధ్రభాషలో వన్నెకెక్కిన ప్రబంధములలో మాత్ర మిది చేరఁదగియున్నది. కవిత్వశైలి యెంతయుఁ బ్రౌఢమై మనోహరముగా నున్నది. స్వయంవ్యక్తంబు లై ప్రసిద్ధిఁ గాంచిన వేంకటాచల శ్రీరంగ శ్రీకాకుళ కుంభకోణ బ్రహ్మపురాది క్షేత్రంబులలో నొకటి యగు శ్రీముష్ణం బనుపుణ్యక్షేత్రముయొక్క మహత్త్వ మిందు వర్ణింపఁబడినది. మఱియు నిమ్మహాకవి రచియించినదే—

(22) శివరహస్యఖండము.

అనునాంధ్రపురాణ మొకటి యీపరిషత్తునఁ గలదు. ఇందుఁ దొమ్మిదవయాశ్వాసమునఁ దుదిపత్రములు గొన్ని లేవు గాని యిది తొమ్మిదియాశ్వాసములగ్రంథ మని తోఁచుచున్నది. మిగిలియున్నభాగము మంచిస్థితిలోనే యున్నది. ఇది కోడూరి వేంకటాచలకవి రచియించిన శివరహస్యఖండముకంటె వేఱయి యాతనికిఁ బిదప రచియింపఁబడినది. శ్రీముష్ణమాహాత్మ్యమువలెనే కవులచరిత్రను, ఆంధ్రదేశమునుగూడ నెఱుంగము. ఇతఁడు స్కాందపురాణాంతర్గతమగు నీభాగమును దెలిఁగించి తీర్థపుర (తుఱైయూరు) నందీశ్వరున కంకిత మొనర్చెను. దీనింబట్టి యితఁడు తిరుచనాపల్లికి సమీపమున నున్న "తుఱైయూరు" అను గ్రామమున నున్నవాఁ డని యూహింపఁదగి యున్నది.

ఇందు, సంభవము ఆసురము వీరమాహేంద్రము యుద్ధము నని నాలుగు కాండములు గలవు. సంభవకాండమున నాలుగాశ్వాసములు, ఆసురవీరమాహేశ్వరకాండముల నొక్కొక్కయాశ్వాసమును యుద్ధకాండమున మూఁడాశ్వాసములును గనఁబడుచున్నవి. ఈరెండును క్షేత్రశివమహత్త్వములు దెల్పునవియే యైనను వీనియందుఁ బెక్కులు చక్కని యుపాఖ్యానములును బ్రబంధోచితవర్ణనములును బ్రౌఢముగా వర్ణింపఁబడినవి. శైలి దెలుపుటకు రెండుమూఁడుపద్యము లుదాహరించెదను.

శా. నా నానారదమాని కిట్టులనియెన్ నానాననారాజు నా
నానానారతభోగయోగములఁ గానం బూన మూఢాత్ముఁడన్
గానన్ లౌకికవైదికోచితగతుల్ గానన్ ననున్ నీవ దే
వా! నీవానిఁగ నెంచి మంచిగతి యెట్లౌ నట్లు శిక్షింపవే.

సీ. అతివేలరతిశీల గతియేల నఁజాల ఖలకాండములదండ నిలువకుండ
వరమానహర మైనసురయానకయమాన నలతాపసులతాపకలనఁ బాప
ధనదానమున దీనజనమానసముఁ బూన బలుకల్ల పలుకల్లపలుక నొల్ల
వెరవారఁ బరదార హరణారభటిఁ జేరఁగులవృత్తముల నుత్తములను హత్త

గీ. మంగమానస మజ్ఞానబృందమాన, మానదీమాన దీర్ఘైధమానమదము
శరమయో లేఁడు నీపాటిపరమయోగి, కావునను గావు నను ముక్తిగలుగఁ జేసి.

శ్రీ ముష్ణమా—

ఉ. అమ్మకచెల్ల! యంచ లివి యడ్డము నిల్చెఁ జనంగ నీక యీ
నెమ్మియుఁ బింఛముల్ నిబిడనిర్వృతి విప్పుచు నోలమాసమై
సొమ్మసిలంగఁ జేసె నిది సొంపునఁ బెంచిన నాక్క విఘ్నుతన్
గ్రమ్మఱఁగాఁ దొడంగె నని కొమ్మ యొకర్తు చనన్ విభుం గనన్.

ఉ. బొమ్మలపెండ్లిసేయు చొకబోటి గిరీంద్రసుతాకళత్రుఁ డా
యిమ్ముల రాజవీథిఁ జను టేర్పడఁ గాంచి వినిద్రరోమమై
సొమ్ములు పెట్టుచొప్ప సఖిఁ జూచి విపర్యసనంబు గల్గఁ బో
పొమ్మని పంచి తాను మది పొందక వచ్చె గవాక్షశేఖరున్.

శివరహస్యఖండము.

(23) సేతుమాహాత్మ్యము.

ఇది నాలుగాశ్వాసముల పద్యప్రబంధము దీని రచించినయతఁడు భాస్కర వేంకటాచల కవి. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు వసిష్ఠగోత్రుఁడు, ఆశ్వలాయనసూత్రుఁడు. ఈతని పితామహుఁడు వెంగనార్యుఁడు. ఇతఁడు నందవరమునకుఁ బ్రభువై యొప్పినట్లుగాఁ గవి యవతారికలో వర్ణించెను. దీనింబట్టి యే యితఁడు నందవరీకుఁ డని యూహింపఁబడినది. ఇకకవి తండ్రి సూరయామాత్యుఁడు. తల్లి వెంగాంబ. సోదరుఁడు శేషాచలకవి. ఇతఁడు నాంచారుపరిణయ మనుయక్షగాన కావ్యమును రచియించిన ట్లవతారిక తెల్పుచున్నది. గ్రంథావతారికాదులంబట్టి పైని దెల్పినవిషయము మాత్రమే

తెలియుచున్నది గాని కవికాలమును గూర్చి యేమియుఁ దెలియుట లేదు. కవుల చరిత్ర మీకావ్యమును బ్రశంసించియుండలేదు.

గ్రంథవిషయము:—ఇందు శ్రీరామకథయు సేతువృత్తాంతము రామేశ్వర క్షేత్రమహాత్త్వమును సమగ్రముగా వర్ణింపఁబడినవి. ఈ గ్రంథముయొక్క సమగ్ర మైనప్రతి యిందుఁగలదు.

కవిత్వము—ఇది యంతప్రౌఢ మైనదియు నిర్దుష్టమైనదియుఁ గాదు గాని సులభశైలి నొప్పుచున్నది. ఇందచ్చటచ్చటఁ గొన్నివృత్తములు వ్రాయఁబడినవి గాని మొత్తముమీఁద గీతకందపద్యములే యమితముగా నున్నవి. శైలి దెలియుట కిందుండి రెండుపద్యము లుదాహరించెదను.

చ. అన విని గౌతముం డతిపరాక్రమధుర్యులఁ బాండవేయులన్
మనము వధింపఁగాఁ గలమె మానితశౌర్యధురీణు చీఁకురా
జున కెఱిఁగించి వానిమన సొప్పినయట్టుల చేత మన్న నా
ఘనభుజుఁ డైనద్రౌణి విన కప్పుడె తా వెడలెన్ ద్రుమంబుగన్.

గీ. (తివిరి) సన్నుతిసేసి తత్తీరమున సమగ్రరామషడక్షరమంత్రజపము
చేయుచుండినఁ దన్మంత్రసిద్ధిమహిమ, నిశ్చలం బగుభక్తిచే నెగడె జగతి.

(24) చారుచంద్రోదయము.

ఈపేరఁ గొంచెము శిథిలమై యున్న యొకగ్రంథ మిందున్నది. ఇది యైదాశ్వాసముల పద్యప్రబంధము. దీనికవి, చెన్నమరాజు చెన్నమరాజు. ఈతఁడు 16 వ శతాబ్దము తుదనున్న వాఁ డని కవులచరిత్రము దెల్పుచున్నది. గావున నితనిఁగూర్చి యిందు విస్తరింపలేదు. ఈ గ్రంథము తాడిపర్తిలోని గోపాలస్వామి కంకిత మొనర్పఁబడినది. ఇందు శ్రీకృష్ణుని కుమారుఁ డైన చారుచంద్రుఁ డనువాఁడు రాక్షసుల గర్వమణఁచుట యను కథ వర్ణింపఁబడినది. శైలి దెలుపుట కొకపద్య ముదాహరించెదను.

చ. హరిహయుఁ డప్పు డానృపకులాగ్రణి ఘోరతపఃప్రభావ మ
చ్చరలముఖంబునం దెలిసి సాధ్వస మొంది వియచ్చరాళితో
నరిగి సుధాబ్ధి వాసి యగునంబుజనాభునిఁ గాంచి సన్నుతుల్
వరమతి నాచరించి తనవచ్చినకార్యము విన్నవించినన్.

(25) షణ్ముఖసహస్రము.

ఇది యొకయపూర్వ మైన తెలుఁగుపద్యకావ్యము దీని రచియించిన కవి వర్యుఁడు సీనయ్య, కృత్యాది పద్యములలోని వగు—

మ. సరసశ్రీనిధి తిర్మలార్యసుతుఁడన్ సాహిత్యవిద్యాఘన
స్థిరమోదావహ చాతురీలలిత సంధిగ్రామధారాధురం
ధరుఁడన్ సీనయనామధేయుఁడ జగత్ప్రాకల్పమై ధీశుభా
కరమౌ నీతిసహస్రపద్యకృతి నీ కర్పింతు నోషణ్ముఖా.

శా. నానాదేశికచిత్తభూషణములై నాళీకజాతాంగనా
పీనోత్తుంగపయోధరాగ్ర పదవీప్రేంఖన్మిలద్భూషలై
నానానీతివిచిత్రవాక్యరుచులై నాకెంబు దీపింపఁగా
నే నీపేర రచింతుఁ బద్యములు వేయి న్నెన్మి దోషణ్ముఖా.

అనుపద్యములంబట్టి యితఁడు తిరుమలార్యునిసుతుఁ డనియు సందిగ్రామనివాసి యనియుఁ జక్కనిసాహిత్యము గలవాఁ డని యు, వేయునెనిమిది పద్యములు శ్రీపార్వతీపరమేశ్వరులపుత్రుఁ డగుకుమారస్వామి కంకితము గా రచించినవాఁ డనియుఁ దెలియుచున్నది. సంది=సెంది+గ్రామము, ఇదియిపుడు తిరుసెందూ రనుపేరఁ దిరునల్వేలిమండలములో నున్నది. ఇంతకంటె నీతనిం గూర్చి తెలుపఁదగిన గద్యపద్యము లేవియు నిందు లేవు.

గ్రంథవిషయము—పరిషత్తునకు సంభవించిన ప్రతి పరిశుద్ధముగా సంపూర్ణముగా నున్నది. ఇందు నూటేసిపద్యములు లొక్కొకటి-భాగముగా విభజింపఁబడినవి. ఇది లక్ష్మీసహస్రాదులవలెఁ గేవలము కృతినాయక వర్ణనా పరము గాదు. ఇందు వివిధము లయినలోకనీతులు పురాణగాథలు శాస్త్ర చర్చలు గూడ వివరింపఁబడినవి. మఱియు నిందులోకమున వ్యవహరింపఁబడు చుండెడి పెక్కుసంస్కృతశ్లోకములు సరిగా నాంధ్రీకరింపఁబడియున్నవి. కవిత్వ మంత నిర్దుష్టమును బ్రౌఢమును గాకపోయినను గొంచెమించుమించుగా నిది నూటేండ్లనాఁటిది యగుటచేతను నీతికావ్య మగుటచేతను నాంధ్రలోకము నాదరము నొందఁగల దని నమ్మెదను. శైలి తెలుపుట కింకొకపద్య ముదాహరించెదను.

మ. కరవాలాగ్రమున న్మెలంగుట భుజంగస్ఫీతరంగత్ఫణో
దరసచ్ఛాయ వసించుభాతి గజమేదశ్చర్వణోన్మత్తకే

సరికొంతం బవలంబనంబుగాను నోజ౯ రాజసేవామహా
త్త్వరమల్ సేవకకోటి కల్పసుఖముల్ ధాత్రీస్థలి౯ షణ్ముఖా.

(26) కృష్ణవిలాసము.

ఇది యైదాశ్వాసముల శృంగారప్రబంధము. దీనికవి, విశ్వేశ్వరవిభుధాగ్రణి. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు. అకిలయజ్వకుఁ బౌత్రుఁడు, గీర్వాణసాహితీశాలి పద్మనాభాధ్వరికిఁ బుత్రుఁడు, కవితార్కికశిరోమణి బిరుదాంచితుఁడు. మఱియు, నవతారికలోనున్న.—

సీ. కర్కశం బగునట్టి తర్కశాస్త్రంబున మిగుల శిరోమణి మించినట్లు
రాణఁ దనర్పుపురాణంబులం దెల్ల భాగవతంబు చొప్పడినపగిది
భవ్యసంస్కృతనవ్యకావ్యంబులం దెల్ల గడు నైషధం బొప్పు గాంచినట్లు
బాగైనయాంధ్రప్రబంధంబులం దెల్ల నాముక్తమాల్యద యలరుకరణి

గీ. నేను రచియించినట్టిసంస్కృతకృతులును,
దెలుఁగుకృతులును గూఢార్థకలన గలుగ
సంస్కృతాంధ్రాది లక్ష్యలక్షణములందుఁ,
దెలియఁ జాలనివారికిఁ దెలియ వశమె?

అనుపద్యమునుబట్టి యితఁడు సంస్కృతాంధ్రకావ్యములు పెక్కు రచియించినట్లు తెలియుచున్నది గాని యీగ్రంథ మొక్కటియే కాక యాతనియిం కొకకావ్యము పరిషత్తునకుఁ జేరి యుండ లేదు. దీనివలెనే యవియు నామమాత్రముచే నైన నే చరిత్రకు నెక్కి యుండ లేదు.

కృతిపతివిషయము:—ఈకవి యీగ్రంథమును, తలమల, రామచంద్రప్రభుని ప్రేరణచే రచియించి యాతనికే కృతియిచ్చి నట్లవతారిక చెప్పుచున్నది.

గీ... అలరుహరిపాదజలజంబునందుఁ బొడమి, జగతి నుతికెక్కు నాలవజాతియొకటి
యందుఁ గంపళ మనువంశ మతిశయిల్లు, నచట నరమంచికులము విఖ్యాతి గాంచు.

అనుదానివలనఁ గృతినాయకుఁడు శూద్రుఁ డైనట్లును, కంపళ మనెడి యొకతెగ యందలి యరమంచి యనెడి కూటమునఁ బుట్టినవాఁ డయినట్లును దెలియుచున్నది గాని యీతనివృద్ధప్రపితామహునితాత యగు పాపరాజు తలమలలో వెంకటేశ్వరునిఁ బ్రతిష్ఠించుటచే వీరికిఁ బిదప, 'తలమల' యను నుపనామము గలిగి నట్లిందలి యవతారికయే వాకొనుచున్నది. ఆపాపరాజే 'గో

నూరు' అనెడి పురము గెలిచిన ట్లుండే యుండుటచే వీరిది గోనూరు నివాస గ్రామ మనియుఁ దెలియును.

ఈవ్యాసములోని 19 సంఖ్యగలగాథేయోపాఖ్యానమును కృతినందిన బదిర, కృష్ణభూపాలునికి వలెనే యితనికి నీతనివంశమువారికిని వేంకటనారాయణాంకుఁడు, గంగువాఁడ హరిసెట్టు, మన్నియరగండఁడు, పాండ్యచేర చోళ బల్లాలరాయమనోభయంకరుఁడు, యాదవ రాజ్యస్థాపనాచార్యుఁడు, మొదలగు విశేషణము లుండుటంబట్టి యితఁడు దక్షిణదేశమందలి రాజనియు గోనూరనుపుర మీతనిరాజధాని యనియుఁ దెలియుచున్నది. కాని యీపుర మెక్కడిదో యితఁ డేకాలమందలివాఁడో సరిగాఁ దెలియదు కాని 18 వ, శతాబ్దమునకుఁ బూర్వుఁడు మాత్రము కాఁడని చెప్పవచ్చును. ఇతనికి, ఇమ్మడి రామచంద్ర రాజని మఱియొకనామము గలదు. ఇంతకంటెఁ గృతిపతి కృతికర్తల కాలనివాసాదులను గూర్చి విశేషించి తెలియరాకున్నది.

గ్రంథవిషయము:—పరిషత్తునకు వచ్చినప్రతి సంపూర్ణముగా మంచి స్థితియందున్నది. శ్రీమద్భాగవతము నందలి కృష్ణకథ ననుసరించి యీగ్రంథమున రుక్మిణీ సత్యభామాది కాంతలను శ్రీకృష్ణుఁడు పెండ్లియాడుట, వారియందు సంతానము వడయుట యనునంశములు శృంగారప్రధానముగా వర్ణింపఁబడినవి.

కవిత్వము:—ఈతని కవితాశైలి తరళజ్ఞానంబునఁ గఠినము కాక సాధ్యమయినంతవఱకు నిర్దుష్టముగా నాంధ్రపద బహుళముగాఁ దఱచుగా యమకప్రధానముగా మృదువుగా నలరుచున్నది.

చ. తలఁపున నన్ను నిల్పు నెలతా! నెలతాపము హెచ్చి వచ్చెనే
యలరుల తేనె చిలుకు నవలా! నవలాలితసూక్తి వల్కవే
వలపులు సందడింపఁ జెలువా! చెలు వానఁగఁ గౌఁగిలింపవే
తలిరులతావి గుల్కు వనితా! వనితావుల నన్నుఁ గూడవే.

చ. సుదతిరదాళి పేర నునుఁజుక్కలఁ బల్కులపేర నాసుధల్
జదురుగ నవ్వుపేర నవచంద్రికలన్ నిటలంబుపేర డా
ల్వాదలఁగ నుంచుమండలములో నగ మత్తులపేరఁ గల్వలన్
గుదువుగ నుంచె మోమునకు గోము సుధాకరుఁ డప్పు దీయఁగన్.

(27) గీతరఘునందనము.

అను యక్షగానకావ్యము—దీని కవియే తనవృత్తాంతమును గ్రంథాంతమున నిట్లు వ్రాసికొని యుండెను.

" అనుచు వాల్మీకి మహామునీశ్వరుండు...రచియించినట్టి శ్రీరామాయణమును.
జూచిపఠింపుచుఁ సులభార్థములను, తోఁచినంత గ్రహించితొలుత నే నవల
నాపాలి శ్రీదక్షిణామూర్తి పదము, పాపహరంబుగా భక్తి భావించి......
శ్రీరామసాహాయ్యసిద్ధిచే నేను, ధారగా నీప్రబంధము సెప్పినాఁడ......
గానబు ముమ్మడిదేవకులము వారలము, సలలితవేంకటాచల దక్షిణమునఁ
జెలఁగుచిత్తూరు మాచిరనివాసంబు. నాతండ్రి తిరుమలనామధేయుండు
శ్రౌతి సీతారామ చరణసేవకుఁడు, నాతల్లి లక్ష్మమ్మ నారీలలామ
సీతాభిరామునిఁ జింతించు నెపుడు, మాయమ్మ తాను నిర్మలమానసమునఁ
బాయనిహరిభక్తి పట్టుగాఁ బట్టి......నానాఁటికిని జగన్నాథునికృపను......
సత్యస్వరూపంబు సాధింపుచుండు, నాతండ్రి దేహబంధము వీడి చనఁగ
నాతల్లి హరిచరణమ్ములే నమ్మి, యానాఁడు బహుకష్ట మనుభవింపుచును
దా నన్నుఁ బెంచి విద్యలను జెప్పించి, దినదినంబును బ్రేమ దీవింపుచుండ
ఘనమైన మాతల్లికరుణచే స్వామి, తాను బ్రసన్నుఁడై తనచరిత్రమును
నానోటఁ బలికించె నారాయణుండు, జనులార మీరెల్ల జయరామవిభుని...
రమణీయమగుగీతరఘునందనమును, బ్రమదంబుతో వినిబ్రహ్మముంగనుఁడి.
అని యిట్లు దక్షిణాస్యప్రసాదమున, ఘనసాహితీకళాకౌశలం బలర
వరపరాశరగోత్ర వార్ధిచంద్రుండు, హరిహరాద్వైత సిద్ధాంతప్రియుండు
చారుమానసరామ చంద్రయతీంద్ర, కారుణ్యఫలమంత్ర గణనాపరుండు
తిరుమలకవి, హరిస్థిరమానసుండు, రచియించెఁ గృతి గీతరఘునందనంబు.

వీనింబట్టి దీనిరచించిన యతఁడు ముమ్మడిదేవుల తిరుమలకవి యని తెలియుచున్నది. మఱియు నితఁడు స్మార్తుఁడు వైదికుఁడు పరాశరగోత్రుఁడు తిరుమలశ్రౌతికిని లక్ష్మాంబకును జన్మించినవాఁడు, చిత్తూరుగ్రామ నివాసుఁడు దక్షిణామూర్త్యుపాసకుఁడు రామచంద్రయతీంద్రుని శిష్యుఁడు సాహితీకలావంతుఁడు

ననియుఁ దల్లిప్రోత్సాహమున శ్రీరాముని కటాక్షముచే నీగ్రంథము రచియించినవాఁ డనియుఁ దెలియుచున్నది. మఱియు నిచ్చటకు సంభవించిన యీ గ్రంథము మొట్టమొదటను గట్టకడను గూడ వ్రాయఁబడియున్న—

"గురువారేఽక్షయబాహుళబహుళాష్టమ్యాం సచ్చిదానందః।
గీతరఘునందనం నిజపితృతిర్మలరచిత మాలిఖదిదం"॥

అను శ్లోకమునుబట్టి మాసమేమో సరిగాఁ దెలియుటలేదు గాని, యక్షయ సంవత్సర......మాసబహుళాష్టమీ గురువారమునఁ దనతండ్రియగు తిరుమల కవి రచియించిన యీ గీతరఘునందనమును సచ్చిదానందుఁడు వ్రాసె నని యుండుటచేతను, ఈ సచ్చిదానందుఁడు వ్రాసినయిందలి ప్రతిలోఁ గొన్ని పత్రములు చెదలుఁగొట్టివేసినను బత్రములు మాత్రము మాసిపోయిన ట్లుండకపోవుట చేతను గడచిన యక్షయసంవత్సరమునందే యీగ్రంథము వ్రాయఁబడియుండు నని తోఁచుచున్నది. కావున నెట్లయినను గవి యిప్పటి కఱువది డెబ్బదిసంవత్సరముల నాఁటివాఁ డని నిర్ణయింపఁదగి యున్నది.

గ్రంథవిషయము:—ఇందు శ్రీవాల్మీకిరామాయణకథ యంతయుఁ బద్యములు పదములు దరువులు ద్విపదలు మొదలుగాఁగల వివిధచ్ఛందములచేఁ బఠనానుకూలముగ సులభశైలిని వర్ణింపఁబడినది. శ్రీతాళపత్రములపైఁ జిన్న యక్షరములతో నాఱుకాండముల కథయుఁ దెలుపుచున్న యీగ్రంథము కొంచె మెచ్చుతక్కువగా వాల్మీకిరామాయణ మంతయు నున్నది. కవిత్వమును సరసముగా నున్నది. శైలికై యిఁక రెండుపదము లుదాహరించెదను.

జనకునివచనము విని ముని రాముని ధనువును గొనుమనెను
మనుకులతనయుఁడు విలుగని మ్రొక్కెను మందహాసమునను
వరమునిభావము గని హరకార్ముక మరసి యెత్తి పట్టెన్
గురుకరలీలను వింటికొపునను గుణము నెక్కుపెట్టెన్
ఘనుఁడు గుణాకర్షణము సేయ హరధనువు భగ్నమయ్యెన్
దనుజులహృదయము లదరెను జనకునిమన సిటు కుదరయ్యెన్

(28) చంద్రాననాదండకము.

దీనిని వెనుకటిసంచికలో నుదాహరించిన మల్లపురాణాదికర్త యగు నుద్దండకవి నుదురుపాటి వెంకనార్యునకుఁ బౌత్రుండును బిల్హణీయాదికృతికర్త

యగు సాంబశివకవికి నన్నకుమారుఁడును మాతృభూత పండితునిపుత్త్రుఁడు నగు విద్వత్కవి సాంబన్న రచియించి యందే వివరించిన కోటివంశరాజుల వంశవృత్తములోఁ గడపటివాఁ డగు రామచంద్రనృపాలున కంకిత మొనర్చెను. దీని కిందు రెండుప్రతు లున్నవి. ఒకటి తాటాకులప్రతి, రెండవది కాగితములప్రతి. తాటాకులప్రతిలోఁ జివర 'సాంబనాభిఖ్య విద్వత్కవీంద్రుం' డనియుఁ గాగితముల ప్రతిచివర 'శ్రీమచ్చిదాకార విద్వత్కవీంద్రుం' డనియు నుండుటచే నీతనికిఁ జిదాకారుఁ డని నామాంతర మున్నట్లు తోఁచుచున్నది.

కవి దండకాదియందు వ్రాసిన 'రాజాబహదర్ మహీనాథపౌత్త్రుండు...శ్రీమద్రఘుస్వామి ధాత్రీంద్రుపుత్త్రుండు......హయాణాధిరాజన్య సంస్తూయమానోల్ల సద్యెక్కలెన్నీ సమాఖ్యాభిరామ్ముండు. శ్రీమద్బృహన్నాయికా పాదసేవా ప్తకాముండు శ్రీరామచంద్రక్షితీంద్రుండు' అను దానింబట్టియు దండకాంతమందలి 'సతతలాభోజుఁడై నూత్నసాలాభిధావత్పురీ రాజ్య సంరక్షణోద్యుక్తుఁడై" యను దానింబట్టియు వెనుక సాంబశివ కవి జీవితమందుఁ దెలిపినట్లుగా నీ కృతినాయకుని తండ్రి యగు రాయరఘునాధునికివలెనే యీతనికిని 'ఎక్కలెన్ని' యనుబిరుదమున్నట్లును దండ్రితాతలవలెనే యీతఁడును బుదుకోటకురాజై యుండినట్లును ధ్రువపడుచున్నది. వెనుకటికాలముతో సరిచూడఁగా నీ కవియుఁ గృతిపతియుఁ గూడ 19 శతాబ్దము మొదటి భాగములోనివా రయినట్లు విశదమగుచున్నది.

గ్రంథవిషయము:—ఇందుఁ గృతినాయకునిఁ జంద్రాననయను వారకాంత గోరుట యనువిషయము వర్ణింపఁబడినది. కవిత్వము శుద్ధమైనదిగాదు. ఇతఁడు రచియించిన యితరగ్రంథములేవియు దొరకనందున నీతని పాండిత్యముంగూర్చి చెప్ప వలను పడకున్నది. శైలికై యిందలివి రెండుమాటలు.

ఈమేటి సాటెవ్వరుర్ లేమిచేఁ గోటిభూపాలవర్యుం డితండంచు లోకుల్ నుతింపంగఁ గోటీశ్వరాభిఖ్యనుం జెందు భూనాధవర్యుం డితండే సుమీ రామచంద్రక్షమా పాలకంఠీరవుం డీతఁడే నే యనర్ జేఁపడాల్ తీవసింగాణి పూవుల్ లకోరీపాదల్ పూని లోనంజలంబూని.

ఆంధ్రభాషాసంస్కరణ విమర్శనము.

శ్రీ గురుభ్యో నమః.

ప్రమాదిసంవత్సరపుటాశ్వయుజమాసమునఁ బ్రకటింపఁబడినయాంధ్ర సాహిత్య పరిషత్పత్రికయందు మహామహోపాధ్యాయ బిరుదాంచితు లగు బ్రహ్మశ్రీ తాతా సుబ్బరాయశాస్త్రులుగా రాంధ్రభాషాసంస్కరణ మనుశీర్షికతో నొక విపులోపన్యాసమును బ్రకటించిరి. అది మిగుల గంభీరముగ నున్నది. నాబోఁటి వానికి సుబోధము గాదు. కాని యది తెలుఁగుభాష నుద్దేశించి వ్రాయంబడినది గావునను నేను చిరకాలమునుండి యాంధ్రోపాధ్యాయుఁడను గావునను సవిమర్శముగా దానిపై నాయభిప్రాయముం బ్రకటింపవలె నని యాభాషయందలియభిమానమునఁ గుతూహలి నైతిని. దానికిం దోడు నామిత్రులుం గొందఱు ప్రేరించిరి. కాఁబట్టి నాబుద్ధికిం దగుప ట్లందలియంశము లుదాహరించి వ్రాయం దలంచితిని. నాయజ్ఞానమున నేని ప్రమాదమున నేని యిందు దోషము లున్నను విద్వాంసులు మన్నింతు రని వినయముతోఁ బ్రార్థించెదను.

ప్రకృతమందు రాజభాషాభివృద్ధిం జూడ నూతనసంస్కారములచే వృద్ధి నొందింపక యెల్లపూర్వనిబంధనలచే నిర్బంధించిన దేశభాష యభివృద్ధి నొందఁజాల దని కొందఱును, మునుపటివారి నిబంధనల నతిక్రమించిన నపభ్రంశ (నపశబ్ద) సాంకర్యముచే భాషాగౌరవము నశియించు నని కొందఱును దలంచుచున్నా రనునది శాస్త్రులవారియుపన్యాసములోనిమొదటివాక్యసముదాయమున కర్థము. పూర్వనిబంధనము లగువ్యాకరణాదుల నతిక్రమించి యపశబ్దములకు సయితము సాధుత్వము కలుగునట్లు సంస్కరింపవచ్చు నని కొందఱు తలఁచినట్లు దీనం దోఁచును. వాగనుశాసనాదులు పెక్కండ్రు ము న్నీభాషను బురాతననిబంధనానుసారముగా సంస్కరించిరి. వారినిబంధనలకు లోఁగియే యిదివఱ కెన్నియో గ్రంథములు జన్మించెను. ప్రకృతమునందును వేనవేలు మిగుల సుబోధము లగు నానావిధము లైనపొత్తములు పుట్టుచున్నవి. నిబంధనలకు లోఁబడి బహుగ్రంథములు వ్రాయుటకుఁ దగినంత మహాభాష యుండఁగా నపశబ్దములకు సాధుత్వ మెట్లో కలుగఁ జేయవలయు ననియు, వానిసాంకర్యమున భాషకు వికృతి గల్పింపవలయు

ననియు నేల తలఁపవలయునో తెలియంజాలము. సంస్కరణము నా బాగుపఱుచుట యని యర్థము గాని మున్ను మనోహరముగా నున్న భాషను గురూపను జేయుట గా దని వారిచిత్తమునకు విశదము గానియంశముగాదు. చిరకాలమునుండి యేక విధముగాను సుందరముగాను నున్న యీభాష కిప్పుడు సంస్కార మనావశ్యక మని తోఁచును. ఆవశ్యక మయ్యెనేని ప్రాచీన నిబంధనల నతిక్రమింపక యే సంస్కరింపవచ్చును. వ్యవహారములో నున్న భాష లన్నియు నానాఁడు మాఱుచుండు స్వభావము కలవని యందు వ్రాసిరి.

"సిద్ధిశ్లోకా ద్వ్యాశ్యా లోకోఽనన్యాదృశశ్చ నిత్యశ్చ" యని వాగనుశాసనులు సూత్రించిరి. ఆంధ్రభాష వ్యవహారమూల మనియు నది యేకరూప మనియు (మాఱనిది యనియు) భాషాకావ్యములు గల వనుకారణమునఁ బ్రళయ మువఱకు నుండునది యనియు నహోబలపతి కవిశిరోభూషణమున దీని యర్థ మును వివరించెను. మఱియును వ్యవహారమువలననే భాషాసిద్ధి యగునపుడు వ్యాకరణమునకుం బ్రయోజనము లే దని శంకించి "సంస్కారార్థో నియమో ఽనియమా ద్గ్రామ్యం హి య త్త్వపభ్రంశ" యని శాసించిరి. నియమము (లక్షణము=వ్యాకరణము) శబ్దశుద్ధియే ప్రయోజనముగాఁ గలది యనియు, నది లేదేని యపభ్రంశ (అపశబ్ద)ములప్రయోగము గలుగు ననియు, దాని వారింప వ్యాకరణ మావశ్యక మనియు దీనిభావమును వ్యాఖ్యాత వివరించెను. దీనివలన భాష ప్రతిదినము నిచ్చ వచ్చినట్లు మాఱునట్టి స్వభావము కలది గా దని యీ గ్రంథకర్తలు తలఁచినట్లు పండితులకు సుబోధమే. మఱియుఁ గొందఱు వైయాకరణులును మీమాంసకులును శబ్దములు నిత్యము లని చెప్పిరి. శాస్త్రులుగారు సెలవిచ్చినట్లు భాష మాఱుస్వభావము కలది యని యంగీకరించినను స్వభావమువలననే మాఱు నది యని తలంచినపుడు దాని మార్ప యత్నాధిక్య మనావశ్యక మని సహృదయులకుఁ దోఁచు నని తలంచెదను.

మఱియు నందు సంస్కృతభాష కొంతకాలము వ్యవహారములో నున్నట్లు నిశ్చయింపఁ గొన్ని హేతువులు గల వని నిరూపించి యనేకవ్యాకరణములయందు వేఱువేఱు విధముగా సాధింపఁబడిన రూపభేదములు భాష మాఱుటవలనఁ గలిగినట్లు సూచనలు గల వనియు నొకవ్యాకరణమునే యవలంబించినపాణినిపతంజలులకాలములోనే "త్వత్కపితృకః" "త్వకత్పితృక" యని రెండు రూపము లున్న వనియు వ్రాసిరి. సంస్కృతభాష మున్ను కొంతకాలము వ్యవహారములో

నున్న దనునంశము నెల్లవారు నిర్వివాదముగ నంగీకరింపకున్నను గొంద ఱైన నంగీకరింతు రని తలంచెదను గాని యందలి వేఱువేఱురూపముల నాయాయి గ్రంథకర్తలు వారివారిబుద్ధివిశేషమున సూత్రముల కర్థభేదము గల్పించియు నొక వ్యాకరణకర్త యేకారణమునకైనను జూడంజాలని గ్రంథముల మఱియొకరు చూచియు సాధించిరి కాని యొకరు నిబంధన మేర్పఱచిన తరువాత మఱికొందఱు దానికి విరుద్ధము లగు నపభ్రంశములం దమ గ్రంథములయం దుపయోగింపఁగా వానిని సంస్కరింపం దలఁచి వేఱువ్యాకరణముల రచియించినట్లు ప్రమాణ మెద్దియుం గాన్పింపదు. భాష్యకారుఁ డగు పతంజలియును 'త్వత్కపిత్రృక' యని పాణిన్యాచార్యుఁడు చెప్పినతరువాత నొక సూత్రమును లాఘవార్థమై నిరాకరింపం దలఁచి "త్వకత్పిత్రృక" యను రూపమును సాధించెను గాని పాణినితరువాతఁ గొందఱు కవులు "త్వకత్పిత్రృక" యను నపశబ్దముం బ్రయోగింపఁగా దానిని సాధించినట్లు ప్రమాణమువలనం దెలియదు. అట్లు కా దేని పాణినితరువాత నేయేకవు లేయే గ్రంథముల నీపదము నుపయోగించిరో మఱి యేయేశబ్దముల నిట్టివాని నుపయోగించిరో వారు తెలుపవలసి యుండెను. పాణినితరువాతఁ గొంత శబ్దప్రపంచము మార్పు నొందుటచే వార్త్తికకారుఁడు దానిని సంస్కరింపఁ బ్రయత్నించినట్లు కానవచ్చు నని శాస్త్రులుగారు చెప్పిరి. పాణిన్యాచార్యుఁడు సూత్రమునందుఁ జెప్పనివానిం బూరింపను, ప్రమాదమునఁ జెప్పినవాని నివారింపను దలఁచి కాత్యాయనుఁడు వార్త్తికము రచించినట్లు విందుము గాని పాణినితరువాత నతనివ్యాకరణమునకు విరుద్ధము లగు కొన్నిశబ్దములను గొందఱు కవులు వారికావ్యములం బ్రయోగింపఁగా వానికి సౌష్ఠవముం గల్పించుటకై యాగ్రంథమును రచించిన ట్లెక్కడను గానరాదు. "సూత్రానుక్త దురుక్తానాం చింతనం యత్ర జాయతే, తం గ్రంథం వార్త్తికం ప్రాహు ర్వార్త్తికజ్ఞా మనీషిణ" యను శ్లోకమును నేఁ జదువుకొనుతఱి వింటిని. మఱికొందఱు సూత్రకారులు సూచించినవానినే వార్త్తికకారుఁడు విపులముగ వ్రాసెను గాని క్రొత్తగా నేమియు వ్రాయలే దందురు. మఱియుఁ గొందఱు పాణిని కాత్యాయనులు లొక్కకాలముననే యున్నవారు గాని భాష మాఱునంతటి వ్యవధానము కలవారు కారందురు. తరువాత శాస్త్రిలుగారు వేదమునందును గొన్నిచోట్ల దేశభేదమునంగాని, కాలభేదమునంగాని వేర్వేఱుగా నుచ్చారణమున్న దని వ్రాసి, ప్రాతిశాఖ్యలోని కొన్నిసూత్రములను వానిని వివరించినవారి నామములను జెప్పి కొన్నిరూపభేదముల నయిత ముదాహరించి కడపటఁ బ్రాతి

శాఖ్యాలం జూచిన వేదభాషయందు ననేకము లగు మార్పు లున్నట్లు తెలియవచ్చుచున్న దని వ్రాసిరి. వారు సెలవిచ్చిన దేశకాలభేదము చేత నైనను, జదువువారి కంఠభేదముచేత నైనను, వేదభేదముచేత నైనను నుచ్చారణభేద మున్న నుండవచ్చును. సంస్కృతభాషయందును, దెలుఁగుభాషయందును గొన్నిశబ్దముల కొక విభక్తియందే వేఱువేఱురూపము లున్నట్లు వారు సెలవిచ్చిన రూపభేదములు నుండవచ్చును గావునను దానికి నేను మున్ను చెప్పిన హేతువే చాలుఁ గావునను, వారు వ్రాసినయంశము లెల్ల వేదవిషయములు గావునను వేదమున మార్పులు గల వను నది యాంధ్రభాషాసంస్కారమునకుఁ దగిన కారణము గాదు గావునను నిట నుదాహరింపవలసినంత యావశ్యకత్వము లే దని యెంచెదను.

ఇదియుంగాక శ్రుతి స్మృతులచే దేవాదిజగమున కెల్ల నుత్పత్తిహేతువు ననాదినిధనము సని నిరూపింపఁబడిన వేదమిాశ్వరోచ్చరితము గావున నేకరూపమున సంప్రదాయానుసారముగ నేర్వందగినది యయ్యును బ్రమాదము లనివార్యములు గావున నక్కడక్కడ పాఠభేదములు గలుగఁగా వ్యాఖ్యాతలు వానిలో నెద్ది సంప్రదాయసిద్ధమో తెలియం దగినసాధనము లేక యాయాయిభిన్నపాఠములకు సాధుత్వమును బ్రతిపాదించి యుందురుగాని లోకవ్యవహారము ననుసరించి యందు మార్పులు గలిగిన వనిగాని యాభిన్నపాఠములను బుద్ధిపూర్వకముగఁ గల్పించిరని కాని తెలియ నవకాశము గాన్పింపదు.

మఱియుం దరువాత శాస్త్రులవారు పై యంశములంబట్టి భాషాసంబంధము లగు మార్పుల ననుసరించి యాయాకాలములందు సంస్కారణము జరుగుచు వచ్చిన ట్లూహింపవచ్చు ననియు, విపుల మగు పాణినివ్యాకరణము సయితము భాషను బూర్ణముగను నసందిగ్ధముగను సంస్కరింపం జాల దయ్యె ననియుఁ గొన్ని యంశములు వ్రాసిరి. భాష మున్ను చక్కగ సంస్కరింపఁబడి స్థిరపఱుపఁబడినది గావున మఱల నిప్పుడు సంస్కరింపంబడవలసిన యవశ్యభావము లే దని మున్ను వ్రాసితిని. వారు సెలవిచ్చినట్లు భాషను బూర్ణముగ సంస్కరించుట దుష్కర మనియు, నీ భాషయందు వ్యాకరణములు గొన్ని యున్నను గావలసిన యంశముల నన్నిటి నవి యసందిగ్ధముగాఁ జెప్పంజాల వనియు నంగీకరింప వచ్చును. మఱియు నవకాశము గల పండితులు వానిలోఁ గొన్నియంశముల నైన బూరింప యత్నించిన మిగుల సంతసింపంగలవా రనేకులు గలరు. పాణినివ్యాకరణము సయితము భాషను బూర్ణముగ సంస్కరింపంజాల దనునంశమును గూర్చి శాస్త్రులుగారు పృ

షోదరాది సూత్రమును, దానిభాష్యమును మఱియుం గొన్నియంశములను నిట నుదాహరించిరి. అందుఁ జెప్పంబడినట్టి శిష్టులవ్యవహారముం బట్టి సంస్కృతాంధ్రశ ములలో సందేహము వారించుకొనవలయు ననునది సుస్పష్టమే. కాఁబట్టి నన్న యభట్టారకాదులవ్యవహారము ననుసరించి గ్రామ్యభాషలోని శబ్దములం గొన్ని టిని గవు లెల్లరు నిపుడును స్వతంత్రముగ వాడుచున్నారు.

పండితులకంటెఁ బామరు లెక్కువగా నుండుట గావున నపభ్రంశములు ప్రబలిన వనియు, నీయంశమును గోశబ్దమునకు గోణీ-గావీ-గోతా-గోపోతలికా మొదలగు ననేకాపశబ్దములు పర్యాయములుగా నున్న వను భాష్యోక్తిచేఁ దెలియు ననియు, నివి ప్రాకృతభాషలో సాధువులుగ వాడఁబడుచున్న వనియు, నపశబ్దము లొక్కొక్కదేశమున నొక్కొక్కవిధముగా వ్యాపించిన వనియు, సాధుశబ్దము లన్ని దేశములందును విదితము లనియును సంస్కర్తలగువారు గ్రంథములలో వాడిన శబ్దములను, సర్వదేశములందు శిష్టులగువారు వాడుకచేయు శబ్దములను వేఱుగాఁ దీసి వానికి లక్షణములు వ్రాసినట్లు దోఁచుచున్న దనియు శాస్త్రిలుగారు లిఖియించి యీయంశము “సప్తద్వీపా వసుమతీ” త్యాది భాష్యగ్రంథమువలనను “యద్యపి గావ్యాదయోఽపి లోకే విదితా” యిత్యాది హరదత్త గ్రంథమువలనను విదిత మగు నని యుపన్యసించిరి. పండిత సంఘముకంటెఁ బామరసముదాయ మెప్పుడు నధికముగా నుండు ననియు, నపభ్రంశము లెప్పుడును గల వనియు నొప్పి కొనవచ్చును. అపభ్రంశము లెట్లున్నను వానిని వ్యవహారమున నే యుపయోగించి నట్లు కాన్పించును గాని గ్రంథములయందుఁ జొప్పినట్లు కాన్పించదు. అట్లుప యోగింపఁగూడ దని “శాస్త్రపూర్వకం యశ్శబ్దాన్ ప్రయుఙ్క్తే సోఽభ్యుదయేన యుజ్యతే” యను భాష్యోక్తివలనం దేటపడును. (ప్రకృతి ప్రత్యయవిచార పూర్వకముగా నెవ్వఁడు వ్యాకరణవిరోధము లేకుండ శబ్దములం బ్రయోగించునో వాఁడు మేలుపొందు నని దీనియర్థము.) మహాభాష్యమునఁ బతంజలిముని ‘మహాఞ్ఛబ్దస్య ప్రయోగవిషయ’ యని యారంభించి సప్తద్వీపా వసుమతీ, త్రయోలోకాః, చత్వారో వేదాః, సాంగా స్సరహస్యాః, బహుధాభిన్నా, ఏకశతమధ్వర్యు శాఖాః, సహస్రవర్త్మా సామవేదః, ఏకవింశతిధా బాహ్వృచ్యం, నవధాథర్వణో వేదః, వాకోవాక్య మితిహాసః, పురాణం, వైద్యక మిత్యేతావాఞ్ఛబ్దస్య ప్రయోగవిషయః ఏతావంతం శబ్దస్య ప్రయోగవిషయ మననునిశమ్య సం త్యప్రయుక్తా ఇతి వచనం కేవలం సాహసమాత్రమేవ, యని చెప్పెను. (శబ్దమునకుం బ్రయోగ

విషయము మిక్కిలి కలదు. ఏడు దీవులు గల భూమియు, స్వర్గాదు లగుమూఁడు లోకములును, శిక్షావ్యాకరణాదులగు నంగములతోఁ గూడినవియు, రహస్యముల తోఁ గూడినవియు, బహుప్రకారముల భిన్నములు నగు నాలుగు వేదములును గలవు. అందు యజుర్వేదమునందు నూఱు నొక్కశాఖలును, సామవేదమున వేయి శాఖలును, ఋగ్వేదమున నిరువదియొక్కశాఖలు నాథర్వణమునం దొమ్మిదిశాఖలు గలవు. మఱియును బ్రశ్నోత్తరరూప మైన గ్రంథమును, ఇతిహాసములును, బురాణములును, వైద్యశాస్త్రమును గలవు. ఇ వన్నియు శబ్దమునకుఁ బ్రయోగస్థానములు. వీని నన్నిటినిం జక్కఁగఁ బరిశీలింపక యప్రయుక్తములు గల వనుట కేవలము సాహస మని దీనిముఖ్యార్థము.) ఈగ్రంథము విపుల మగు సంస్కృతభాష యందుఁ గొన్నిశబ్దములం జూచి యెక్కడను బ్రయోగింపంబడినవి కా వని పరిశీలింపక యనఁగూడ దని ధ్రువపఱుచును. కాని తక్కినయంశములలో నొకదానిని దెలుపం జాల దని స్పష్ట మగుచుండఁగా దీనివలన నీయంశము స్పష్ట మగు నని శాస్త్రిలుగా రెట్లు వ్రాసిరో తెలియంజాలము. మఱియును "యద్యపి గావ్యాద యోఽపి లోకే విదితాస్తథాపి తేన సర్వలోకవిదితాః ప్రతిదేశం భిన్నత్వాదపశబ్దానాం లోకశబ్దశ్చాయం సర్వస్మిఁల్లోకే వర్తతే. సంకోచకాభావా" త్తనునది మొదలగువా రుదాహరించిన హరదత్త గ్రంథము (పరిశీలింపఁగా గావీ - గోణీ - గోపోతలికా మొదలగు నశబ్దములును లోకమునం బ్రసిద్ధములే. కాని యపశబ్దములు వేఱువేఱు దేశములందు వేఱువేఱువిధముగ నున్నవి గావున నెల్లలోకమునం బ్రసిద్ధములు గా వని దీని ముఖ్యమైన యర్థము.) నయిత మపశబ్దము లెల్ల లోకమున విదితములు, కా వనియు వేఱువేఱుదేశముల వేఱువేఱువిధముగ నున్న వనియుఁ దెలుపును గాని మీఁదటి తక్కిన యంశములలో నొకదానిం దెలుపఁజాలదు. సంస్కర్తలు గ్రంథములలో వాడుక చేసిన శబ్దములను, నెల్లదేశముల శిష్టులచే వాడంబడినశబ్దము లు సుశబ్దములో యపశబ్దములో నిర్ణయింపఁబడలేదు. అవి సుశబ్దము లైన లక్షణముచేయు నాతంకము లేదు. అపభ్రంశము లైన-చో హరదత్త గ్రంథముతో విరోధించును.

పిమ్మటఁ గాలక్రమమున సంస్కృత భాషావ్యవహారము నష్ట మైన దనియు, నపభ్రంశ భాషలు దేశభేదముచేత భిన్నము లైన వనియును, శిష్టులును యజ్ఞాది కాలములం దప్ప నితరకాలములలో నాయపభ్రంశమునే వాడుకచేయు చుండి రనియు, నప్పటి ప్రాజ్ఞులు ప్రచురముగా వ్యాపించిన యాదేశభాషలను సంస్కరించి

యందే కావ్యములను వ్రాయఁ దొడంగి రనియు నవుడు ప్రాకృతకావ్యములు పెక్కు లుద్భవించె ననియు శాస్త్రిగారి వ్యాఖ్యానమునం గలదు. నాఁగ చెప్పి నట్లు కాక సంస్కృతభాష వ్యవహారములో నుండఁగనే దేశభాషలు కొన్ని కలట్లును, నవి యపభ్రంశములు గా వనియును గొన్ని నిదర్శనములు గాన్పించును. ప్రపంచమున నాది కావ్యమగు రామాయణమును రచియించిన మహాకవి యగు వాల్మీకి ప్రాకృతాదిభాషలకు వ్యాకరణము రచియించెను. దానికిఁ త్రివిక్రమాచార్యులు వృత్తి వ్రాసిరి. దానికి సోమచంద్రసూరిప్రణీత మైన భాష్యముం గలదు.

తే. గీ. ఇలఁ ద్రివిక్రమరచితవృత్తులను సోమ,చంద్రసూరిప్రణీతభాష్యంబుచేతఁ
దనరు వాల్మీకిమూలసూత్రములవలనఁ, బ్రాకృతాదిషడ్భాషలుద్భవముఁ జెందె.

సీ. స్వర్గలోకప్రశస్తము సంస్కృతము మహారాష్ట్రదేశీయంబు ప్రాకృతంబు
శూరసేనాఖ్యఁ బ్రస్తుతికెక్కు నాఁటను జను లాడునదియె పో శౌరసేని
మగధదేశోక్తులు మాగధీభాష పిశాచసంజ్ఞికములై జగతిఁబొదలుఁ
బాండ్యకేకయసాల్వబాహ్లీకానూపగాంధారనేపాళకుంతలసుదేష్ణ

గీ. భోజకన్నోజకంబులఁబొసఁగుమాట,లరయఁ బైశాచికా చూళికాహ్వయములు
వెస నపభ్రంశ మాభీరవిషయజాత, మాంధ్రభూమిభవం బాంధ్ర మయ్యె శౌరి.

అప్పకవీయము. ఆ. 1.

మఱియు నహోబలపతి "యత్త్వపభ్రంశ" యను సూత్రవ్యాఖ్యానావసరమునఁ గవిశిరోభూషణమునందుఁ "ఆంధ్రభాషాకావ్యనిర్మాణే కవయః ప్రతియుగం ప్రవర్తంత ఇత్యుక్తం. తథాచ తద్గతశబ్దానాం గ్రామ్యతాపరిహారాయ గ్రామ్యాగ్రామ్యవిభాగపరం వ్యాకరణ మేత దావశ్యకమేవ" యని చెప్పెను. కవులు ప్రతియుగమందును నాంధ్రభాషాకావ్య నిర్మాణమునం బ్రవర్తించుచున్నా రని చెప్పంబడినది. కనుక దానియందలి శబ్దములకు గ్రామ్యతాదోషము వారించుటకై గ్రామ్యాగ్రామ్యములం దెలుపు నీవ్యాకరణ మావశ్యకమే యని దీని ముఖ్యార్థము. మఱియు నందే "సమ్మూలకత్వా ద్రూఢత్వాత్ గృహీతత్వాచ్చ సాధుభిః, నాపభ్రంశత్వ మేతస్యా నియమాభావతస్తు తత్ । నివారణాయ తస్యైవ ప్రవృత్తి ర్విదుషామభూత్, తదర్థమేవ హి వయం భూయసా ప్రయతామహే॥ కవిశ్రోపశ్రుతం దోషం నైవ కించి త్సహామహే" యను పురాతనగ్రంథము నుదాహరించెను. ఆంధ్రభాష మంచిమొదలు కలది గావు

నను, దేశమునం బ్రసిద్ధ మగుటవలనను, విద్వాంసులచే నంగీకరింపఁబడినది గావునను దీని కపభ్రంశదోషము లేదు. కాని వ్యాకరణాభావమువలన నా దోషము ప్రసక్తించును. విద్వాంసులు దానిం బరిహరింపఁ బ్రవర్తిల్లిరి. మేము దానికై మిగుల యత్నించుచున్నారము. కవితయం దేకొలఁది దోషమున్నను సహింప మని దీనియర్థము. మఱియు నాగ్రంథముననే యీ ప్రస్తావముననే "ననుసంస్కృతప్రాకృతవ్యాకరణయో రార్షత్వేన భవతి ప్రామాణ్యమ్. నన్నయాథర్వణయో రిదానీంతనకవిమాత్రత్వేన కథం తత్ప్రణీతయోర్వ్యాకరణయోః ప్రామాణ్యం. కథన్ను తదనుసారేణ కావ్యనిబంధనం స్యాత్. కించానుశాసనస్యేదానీంతనత్వేన కుతస్తరాం ప్రాచీనాః కవయః కావ్యనిర్మాణే ప్రావర్తంతేతిచేన్నైవం మంస్థాః. నానృషేః కావ్యకరణచాతుర్యధుర్యత్వం సంభవత్యేవ ఖలు, నానృషిః కురుతే కావ్య మిత్యభియుక్తోక్తేః. అనితరకవిసాధారణ వ్యాకరణనిర్మాణపటుతయా పండిత కవీంద్ర ప్రథమగణ్యత్వేన చ పరిప్రాప్తం సార్వజ్ఞ్యం తయోరధునాతనత్వేన కథం నివార్యతే" యని ప్రౌఢవాదమునం జెప్పి తరువాతను "నచవ్యాకరణస్యేదానీంతనత్వ మేవ యేన ప్రాచీన ప్రబంధౄణాం కావ్యనిర్మాణే ప్రవృత్తి ర్నస్యాత్. కింతు ప్రాగప్యనుశాసనస్య సత్త్వాత్ అతఏవ శబ్దానుశాసనేన "క్రియాణా" మిత్యాదిసూత్రైః బహవః ప్రాచీనాచార్యాః ప్రకాశితాః ఆథర్వణగ్రంథేఽపి పురాతనాంధ్రశిక్షకాః కవిశిఖామణ్యాదయః బహవః కథితాః యథాపాణినీయే "లోపశ్శాకల్యస్య, ఋతోభారద్వాజస్య, గురోరనృతోఽనంత్యస్యాప్యేకైకస్య ప్రాచా" మిత్యాదౌ. తత్ప్రథమ ప్రవక్తృత్వ వ్యపదేశస్తు ఖిలకవితానుశాసనయోజనాపేక్ష ఇతిజ్ఞేయ" మ్మని యహోబలపతియే వ్రాసెను. (అయ్యా! సంస్కృత ప్రాకృత వ్యాకరణములు మునిప్రణీతములు గావున వానికిఁ బ్రామాణ్యము గలదు. నన్నయాథర్వణు లిప్పటి కవులు గావున వారి వ్యాకరణమునకెట్లు ప్రామాణ్యము గల్గును? కావ్యనిర్మాణము దాని ననుసరించి యెట్లు చేయనగును? మఱియు వారియనుశాసన మిప్పటిది గావునఁ బ్రాచీను లగుకవులు కావ్యనిర్మాణమున నెట్లు ప్రవర్తిల్లి రని తలంపందగదు. ఋషికానివాఁడు కావ్యమును రచింపంజాలఁ డను పండితోక్తివలన నార్షజ్ఞానము లేనివానికిఁ గావ్యనిర్మాణము నందలి నైపుణ్యము సంభవింపదు. సాధారణు లగు కవులకు సాధ్యము గాని వ్యాకరణ నిర్మాణమునందలి నైపుణ్యముచేతను, బండితకవీంద్రుల

లో మొదట గణియింపంబడుటచేతను వారికిఁ బ్రాప్త మైనసర్వజ్ఞత్వ మిప్పటివా రగుటచే వారింపఁబడదు. మఱియును వ్యాకరణ మిప్పటిదె యయ్యెనేని మునుపటి కావ్యకర్తలకు వానినిర్మాణమునం బ్రవృత్తి లేకపోవును గాని మునుపును వ్యాకరణము గలదు. కనుకనే వాగనుశాసనులు తనసూత్రములందుఁ, బాణిని తనసూత్రములందు భారద్వాజుని శాకల్యుని నింకను గొందఱను బేర్కొన్నట్లే పెకటంద్రుఁడు ప్రాచీనాచార్యులను బేర్కొనెను. అథర్వణుఁడును దనవ్యాకరణమునందుఁ గవి శిఖామణి మొద లగుబెకటంద్ర నాంధ్రశిక్షకుల నుదాహరించెను. వారే మొదట వ్యాకరణమును రచించినవా రనునది ఖిలమైనవ్యాకరణమును మరలం గూర్చుట నపేక్షించి చెప్పంబడినది యని దీని యర్థము.

మఱియు నాగ్రంథముననే "నను దేశభాషాకావ్య స్యాగ్రామ్యస్యాపి ప్రత్యవాయజనకతా సంభావి తేతి చేన్నైవం. తథాత్వే నన్నయాథర్వణాపేక్షయా ప్రాచీనానాం తదనుశాసనే ప్రవృత్తానాం కవిభల్లటాదీనాం శిష్టానాం ప్రయాసస్య వైఫల్యాపత్తే ర్ద్రావిడభాషానుశాసనే ప్రవృత్తస్య సర్వజ్ఞాగ్రచరస్యాగస్త్యమహామునేః ప్రాకృతవ్యాకరణే ప్రవృత్తస్య భగవతో వల్మీకసంభవస్య మహర్షిశిఖామణేశ్చ సర్వజ్ఞత్వ స్యాప్రయోజకత్వాపత్తే శ్చేత్యల"మ్మని వ్రాసెను.

(అయ్యా! దేశభాషాకావ్యము గ్రామ్యము గాకున్నను బ్రత్యవాయముం బుట్టించు నని తోఁచునంటేని యట్లేని నన్నయాదులకంటెఁ బూర్వులును దెలుఁగుబాసకు వ్యాకరణమును రచించినవారు నగుకవిభల్లటాదులయాయాసము వ్యర్థ మగును గావునను, ద్రావిడభాషకు వ్యాకరణము రచించినవాఁడును సర్వజ్ఞులలో మొదటివాఁడును నగు నగస్త్యముని విజ్ఞానమునకును, బ్రాకృతాదిభాషలకు వ్యాకరణమును రచించినవాల్మీకిసర్వజ్ఞత్వమునకును బ్రయోజనము లేక పోవును గావున నట్లన రాదని దీనిముఖ్యార్థము.) మఱియు నహోబలపతియె యీసందర్భముననే "పాకృతాంధ్రయో ర్నాస్త్యేవ మ్లేచ్ఛత్వ మన్యదేశభాషా వదిత్యుక్తం. తథా చాస్యాపి మూలశ్రుతిసద్భావ స్సూపపాదపవ. కావ్యవిషయ ధర్మాధర్మఫలకసుశబ్దాపశబ్దప్రయోగావలంబస్తుతి నిందయో రభియుక్తపరంపరయా ప్రతిపాదితత్వా"త్తని వ్రాసెను. (ప్రాకృతాంధ్రభాషలకు నన్యదేశభాషలకు వలెనే యపభ్రంశదోషము లేదని చెప్పం

బడెను. అట్లగుచునుండఁగాఁ గావ్యమందలి ధర్మాధర్మములు ఫలముగాఁగల సుశబ్దాపశబ్దములప్రయోగములను గూర్చినస్తుతినిందలు విద్వాంసుల పరంపరచేఁ జెప్పంబడిన వగుటవలన దీనికిని మూలశ్రుతికలిమి శ్రమ లేకుండం జెప్పం దగినదియే యని దీనియర్థము.) మఱియు నీ విషయమున నీ గ్రంథమున నెన్నియో వ్రాయంబడెను; కాని గ్రంథవిస్తరభయమున వ్రాయం జాలనైతిని. మీఁద వ్రాసిన గ్రంథసందర్భముచే సంస్కృతవ్యవహర్త లగునగస్త్యులు, వాల్మీకులు మొద లగువారికాలముననే ప్రాకృతకావ్యములు కల వనియు నవి యపభ్రంశములు కా వనియు విద్వాంసులకు సుగ్రహమే.

తరువాత శాస్త్రిలుగారు ప్రస్తుతము బంగాళాభాషను సంస్కరించి యందు నూతనగ్రంథముల వ్రాయుట యెల్లరకుం దెల్ల మనియు నిట్లే ప్రాచీనకర్ణాటకము నవీనకర్ణాటకము ననువిభాగము గలిగె ననియు వ్రాసిరి. మీఁదటి రెండుభాషలు నేనెఱింగినవి కావు. కాని యాభాషలను బాగుగ నెఱింగిన మహాకవులు విద్వన్మనోరంజనముగాఁ జక్కంబఱిచి సుబోధములుగా వాని యందు గ్రంథములు వ్రాసి రని తదభిజ్ఞులవలన విన్నవాఁడను. మఱియుఁ గన్నడభాషలోఁ బురాతనము లగుకొన్నిశబ్దములు ప్రకృతమందు వ్యవహారములో లేమిచే వాని నుద్ధరింపం దలంచి వానిం జేర్చుకయే క్రొత్తగా గ్రంథములను వ్రాసి రని విన్నవాఁడను. పిమ్మట వారు ప్రకృత మగునాంధ్రభాషలోను దేశ్యము గ్రామ్యము నని విభాగించి రని వ్రాసి (ఇందుఁగర్మము శబ్దసముదాయ మని యధ్యాహార్యముగా బోలును.) వానిస్వరూపముం జెప్పి ప్రస్తుతకాలముం దాంగ్లభాష ప్రచురముగా వ్యాపించుటచే నుద్దేశము లేకీభవించుచున్నవి; దేశములోఁ బరస్పరసంబంధము ప్రబలుచున్నది. అందువలన గ్రంథస్థ మైనదేశ్యములకన్న నంతటను విదిత మైనవ్యవహార భాషాప్రపంచము పెరిఁగినది. ఇంతకుమున్ను గ్రామ్యము లని నిరాకరింపఁబడిన శబ్దములలో ననేకములు సర్వదేశవిదితములై దేశ్యము లని వ్యవహరింపఁ దగియున్న వని చెప్పిరి. ప్రస్తుత మందింగ్లీషుభాష ప్రచురముగా వ్యాపించిన దనుమాట వాస్తవమే. కాని దానివలన నెవ్వరెవ్వరియుద్దేశము లేయేయంశములలోఁ బ్రబలుచున్నవియో వివరింపరైరి. కాఁబట్టి యావిషయమై యేమియు వ్రాయ నవకాశము గలుగ దయ్యెను. గ్రంథస్థము లగుదేశ్యములకన్న వ్యవహారభాషాప్రపంచము పెరిఁగినను లేకున్నను గ్రంథస్థము కాదు గావున భేదము లేదు. వ్యవహారభాష గ్రాంథికభాషకం

టె నెప్పుడు నించుక వేఱుగ నున్నది గాని దానితోఁ గలిసి లేదు. పూర్వులు గ్రంథరచన చేసినప్పుడును వ్యవహారభాష యట్లే యున్నది గాని గ్రంథరచన యున్నట్లు వ్యవహారభాష యెన్నఁడును లేదని తోఁచును. కాఁదేని గ్రామ్యమును బ్రాచీను లేల నిషేధింతురు. గ్రామ్యములను గావ్యములం బ్రయోగింపఁ గూడ దని లక్షణ కావ్యకర్త లందఱుం జెప్పుచున్నారు. మున్ను గ్రామ్యములని నిరాకరింపఁబడినవానిలో నెవ్వి సకల దేశవిదితములై యిప్పుడు దేశ్యములుగ వాడం దగియున్నవో వానిలోఁ గొన్నిటినేని వా రుదాహరింప కునికికిఁ గారణము తెలియదు. ఆంధ్రదేశమునందంతటను వాడుకలో నుండుపదములు దేశ్యము లనియుఁ గొన్ని గ్రామములలో మాత్రమే వాడుకలో నుండుపదములు గ్రామ్యము లనియు వారు వెనుక వ్రాయించిరి. గ్రామ్యము లెపుడును సకలలోకవిదితములు కావని దీనియభిప్రాయము. సత్యముగా నిప్పుడును గ్రామ్యము లొక్కొక్కదేశభాగమం దొక్కొక్కరీతిని వాడఁబడుచున్నవి కాని యెల్లదేశములందు నొక్కరీతిని వాడంబడునవి కావని దేశానుభవము కల వారికి విదితము. "ఇట్టియవస్థలోఁ బూర్వులయుద్దేశము లాలోచింపక వారు చెప్పినమాటలు యథాశ్రుతముగ గ్రహించి యిపుడు దేశ్యములుగా నున్నను బూర్వు లట్లు వ్యవహరింప లేదను కారణమున నిరాకరించినచోఁ గాలస్వభావమున మాఱుచుండెడిభాషలోఁ గొంతకాలమునకీ భాషాప్రపంచమంతయు గ్రంథములోఁ జేరకుండుటచేనిరుపయోగ మగును. ఇట్టి భాషాప్రపంచమును నిరుపయుక్తముగాఁ జేయుట యుచితమా యనునంశమును బ్రాజ్ఞు లాలోచింతురుగాక" యని వారి యుపన్యాసమున నున్నది. పూర్వులయుద్దేశము గ్రంథములలో గ్రామ్యము నుపయోగింపఁ గూడ దని కాన్పించుచున్నది. "తజ్జా సమాచ దేశ్యా గ్రామ్యా చేయం చతుర్విధా భాషా" యను నన్నయభట్టారకుని సూత్రవ్యాఖ్యానమున నహోబలుఁడు "చతుర్విధా భాషేతి గ్రామ్యయా సాకం వికృత్యా శ్చాతుర్విధ్యం వదత ఆచార్యస్య క్వచిద్వినియోగ ఇష్టఏవ అన్యథా తత్పరిగణనం వృథా స్యాత్ వినియోగోపి నాన్యత్ర్యయుక్త ఇతి తత్తత్స్వభావవర్ణనే కార్యః అత ఏవాథర్వణే నోక్తం గ్రామ్యం తత్తద్విధా సాధు" అని వక్కాణించెను. (గ్రామ్యముతోఁ గూడ నాంధ్రభాష నాల్గు తెఱంగులు గలదని చెప్పిన నన్నయాచార్యునకు గ్రామ్యభాషాప్రయోగ మొకానొకచో నిష్టమే. కాని యెడల దాని లెక్కించుట వ్యర్థ మగును. అయినను దానిప్రయోగ మాయాస్వభావమును వర్ణించుటకుఁ గా

వచ్చును. వేఱొకచోఁ దగదు. గనుకనే యాథర్వణుఁడు గ్రామ్యము లాయాయి స్వభావవర్ణనములందు సాధువు లని చెప్పెనని దీనియర్థము. మఱియును గ్రామ్యప్రయోగ మొకదోష మని యాలంకారికు లెల్ల నిర్వివాదాంశముగ నంగీకరించిరి. ఇప్పటివారు గ్రంథములలో వాడుక చేయకున్న నీభాషాప్రపంచము నిరుపయోగ మెట్లగును? పూర్వులు నిరాకరించిన గ్రామ్యము లిప్పుడు దేశ్యము లైన వని శాస్త్రులుగారు సెలవిచ్చిరి. ఇట్లింకను గొంతకాలము నిరాకరించిన నవి దేశ్యముల కంటె నుత్తమశబ్దములుగా మాఱునేమో! ఈ భాషాప్రపంచము వ్యవహారములో నిదిగావున వ్యవహార మున్నంతవఱకు దీనిని నిరుపయుక్తముగ నేవారుంజేయం జాల రని నాయభిప్రాయము.

తరువాత భారతాదుల నాంధ్రీకరించినయాదికవులయుద్దేశము నాలోచింపుఁడు. సంస్కృతభాష యందఱకుఁ దెలియదు గావున నాంధ్రీకరించిన నాంధ్రదేశమున కంతకును సుబోధ మగు ననియే కదా వారియుద్దేశము? ప్రకృతకాలమునఁ బ్రసిద్ధము లగుపదముల విడిచి పూర్వకాలప్రసిద్ధము లగుశబ్దములను మాత్రము వాడుక చేసిన నవి కొంతకాలమునకు సంస్కృతగ్రంథములు వలెనే దుర్బోధములై సామాన్యముగా నుపయోగింపమిచేఁ బూర్వులయుద్దేశము నిర్మూల మగును. భాష యభివృద్ధి నొంద నవకాశ లే దను నర్థముగల గ్రంథము వారిచే నందు వ్రాయం బడియె.

పూర్వకవుల యుద్దేశమును నిప్పటివారి యుద్దేశమును వారు చెప్పినదియే యని యంగీకరింపవచ్చును. గాని పూర్వప్రసిద్ధములు నీ కాలమునఁ బ్రసిద్ధములు నగుశబ్దములు వేఱువేఱుగా లేవు. మును పే శబ్దములు గ్రంథములం బ్రసిద్ధములో నిప్పుడుం దఱుచుగ నవియే. సర్వసామాన్యముగా నెప్పుడు నేభాషలోను గ్రంథములుపయోగించినట్లు తోఁపదు. ఎట్టిపదముల నుపయోగించినను సర్వజనులకు సుబోధము లగుకావ్యముల నిర్మింప నేవారికిని సుసాధము గాదని తలంచెదను. మున్నును సకలకావ్యములు గాని కొన్ని గాని వ్యవహారభాషలో వ్రాసిన ట్లయిన నెల్లవారికిం దెలిసినట్లయినను బ్రమాణ మెద్దియుం గానరాదు. అట్లయ్యె నేని చెప్పువారును వినువారు నను భేదములేక యెల్లవారును బండితులె యయ్యెదరు. "పండితసంఘముకంటెఁ బామరసంఘ మెక్కువ" యని శాస్త్రిలుగారు వెనుక వ్రాసినవాక్యము నిరర్థక మగును. ఆసక్తితో నేర్చినవారికిం దెలియునట్లు గ్రంథములు వ్రాయవలయు నని పూర్వులయుద్దేశముకాని యెల్లవారికిం దెలియుశబ్దములు

గొన్ని యున్నవని కాని వానితోఁ గావ్యము రచింపవలెనని కాని యే గ్రంథమైనఁ జదువని వారికిం దెలియవలయు నని కాని యున్న లెక్కడను నెవ్వరుఁ జెప్పలేదు. మఱియు నహోబలుఁడు రసవ్యంజక తత్సమాదిశబ్దచిత్రిత మైన తెలుఁగు కావ్యమునకును బండితులే యధికారులని స్పష్టముగా వ్రాసెను.

కాఁబట్టి వారియుద్దేశమునకు భంగము రాదు. భాష యభివృద్ధినొందుట యనఁగా సుబోధములు సగుణములు నదోషములు రసవంతములు నగుశబ్దములతోఁ గూడిన మంచివిషయములు గలపాత్రములతో భాషం బెంచుట యని కాని వ్యవహారభాషతో గ్రంథములం గల్పించుట కాదని నాయభిప్రాయము. మఱియు నట్టిభాషాభివృద్ధి వ్యాధిచేఁ గలిగిన శరీరాభివృద్ధిం బోలునది యని తోఁచును. వ్యవహారభాష యనఁగా గ్రామ్య భాషయే'యని వారు తలఁచిన ట్లీ సందర్భమునఁ దోఁచి మీఁదటి యంశమును వ్రాసితిని. తరువాత శాస్త్రులు గారసంస్కృతముగా నీ వ్యవహారభాషలో గ్రంథము రచించిన నియమము లేక భాషాగౌరవము చెడు నని శంకింపవచ్చును. కాని వ్యవహారభాష నారీతిగనే యుపయోగించినపుడే యట్టిదోషము. వ్యావహారికభాషలో సకలదేశవిదితములును గర్ణసుఖములు నగుశబ్దముల నుపయోగించి క్రమముగ సంస్కరించిన-చో నట్టి దోషము లేదని వ్రాసిరి. వ్యహారభాషలో నట్టిపదములు కలవేని వానిని స్వరూపమున నంస్కరించి యుపయోగింపవచ్చును. నియమమును వదలి వ్యవహారభాషతో గ్రంథములు రచించిన భాషాగౌరవము పోవు ననుట సత్యమే. వాని సంస్కరించుటయు దుష్కరము. వ్యవహారభాషను సంస్కరింప సాధన మెద్దియో తెలియదు. కొన్ని సూత్రములను గల్పింపఁగానే వ్యవహారభాష (గ్రామ్యము) గ్రంథప్రవేశమునకుం దగదు. "ఏకదేశవికృత మనన్య" మను నుక్తిచేఁ గొలఁది మార్పులు చేసినను గ్రామ్య భాష గ్రామ్యభాషయే కాని ప్రయోగార్హము కాదని తోఁచును. గ్రామ్యభాషలో సర్వదేశవిదితములును గర్ణసుఖములు నగుశబ్దము లేవి కలవో వారు నిరూపింపవలెను. గ్రామ్యమన నపశబ్దమని "గ్రామ్యంహియత్త్వపభ్రంశ" యను సూత్రమున వాగనుశాసనులు చెప్పిరి. అపశబ్దములు కర్ణసుఖము లెట్లగునో తెలియదు. అపశబ్దములు వేఱుదేశములయందు వేఱువిధముగా నున్న వని వారే వ్రాసిరి. అవి యిప్పుడు సకలదేశవిదితము లని యెట్లు వ్రాయవచ్చును? మఱియు "సంస్కృతభాషయందును నిట్టి సంస్కరణములు గానవచ్చు చున్న"వని వ్రాసి "తనుగాత్ర" శబ్దము స్త్రీలింగ మగునపు డాకారాంతముగ నుండవలయు నని పాణిన్యా

దుల యభిప్రాయ మనియును వారివెనుకం గాళిదాసాది మహాకవులు గొందఱు దాని నీకారాంతముగఁ బ్రయోగింపఁగా దాని ననుసరించి వామనాచార్యుఁడు "అంగగాత్రకంఠేభ్యో వక్తవ్య" మ్మని దానికి సాధుత్వమును గల్పించువార్త్తికమును రచియించె ననియు 'సుభ్రువనుభట్టి ప్రయోగాదుల ననుసరించి ముగ్ధబోధాది వ్యాకరణములను దత్సంస్కార మొనరించి రనియు లిఖయించి యిట్లనేకప్రయోగములు నిటీవలిమహాకవులు వ్యవహరింప వాని ననుసరించి సంస్కరణములు జరిగినట్లు తత్తద్గ్రంథపరిశీలనశాలులకు స్పష్టమగుననియు వ్రాసి యొకకవి ప్రయోగించిన యొకశబ్దమునే యుదాహరించిరి. వార్త్తికమందింకను గొన్నిశబ్దములు కలవు గాని యిదియేకాదు. కాన సంస్కృతభాషయందలి యీవార్త్తికమును వామనాచార్యుఁడు పాణిన్యాదు లే కారణముచేత నైనం జూడం జాలని పూర్వవ్యాకరణములం గాని, మఱి యేయితర గ్రంథములం గాని చూచి రచియించె నని తోఁచును. కాని పాణిన్యాదులకు విరుద్ధము లగుకాళిదాసాదుల ప్రయోగములనే చూచి రచియించె ననిచెప్పుట కాధారమెద్దియుం గాన్పింపదు. వారిప్రయోగములనే యుద్ధరింపం దలఁచి యీవార్త్తికమును వామనుఁడు రచియించె నని దృఢముగాఁ జెప్పునెడల నామహాకవికాళిదాసుఁడే ప్రయోగించిన "శార్వరస్య తమసో నిషిద్ధయే" యనుదానియందలి శార్వరశబ్దమును, నతఁడే ప్రయోగించిన "త్రియంబకం సంయమినం దదర్శ" యను చోటిత్రియంబకశబ్దమును నట్టి మహాకవియె యగు భారవి "అనుదితౌషసరాగ" యను దానియందుఁ బ్రయోగించిన "యౌషస" శబ్దమును, "సమకాలీన" మిత్యాదినైయాయిక ప్రయోగమును "కార్త్తికేయో నభస్వాన్" అను చోటికార్త్తికేయశబ్దమును మఱియు నిట్టివానిం గొన్నిటిని సాధువులం జేయం దలంచి కొనివార్త్తికముల నేల రచింపలేదో, రచింపక పోవుటయే కాక యిందుఁ గొన్నిటిని స్పష్టముగా నసాధువు లని సూత్రవృత్తియందేల చెప్పెనో చెప్పవలసినభారము శాస్త్రులువారిదే యై యున్నది. "సుభ్రు" వనుప్రయోగమును ముగ్ధబోధకర్త్త యెట్లు సాధు వని చెప్పెనో నేనెఱుఁగను గాని యెట్లు సంస్కరించినను కౌముదియందు దీనినుదాహరించి "ప్రమాద ఏవేతి ప్రామాణికా" యని భట్టోజీదీక్షితులు గారు నిరాకరించిరి గాని యంగీకరింపలేదు. నాగేశభట్టులు శేఖరమునం దీయంశమును దలపెట్టి యిది కవిప్రమాదము కాదనియు, రాముఁడు భార్యావియోగ దుఃఖమునం బరవశుఁడై యనవధానమున నిట్లు విలపించె ననియు, భట్టి కవి దాని ననుకరించె ననియు వ్రాసిరి. కాళిదాసాదులు

ను బాణిన్యాదు లొప్పికొననిశబ్దములను వా రనేకవ్యాకరణములు నేర్చినవారు గావున వానిచే సాధువు లగువానినే ప్రయోగించిరి కాని వ్యావహారికభాషలోని యపశబ్దములం బ్రయోగింప లేదని తలంచెదను. ఆంధ్రభాషయందు నాయాయి కాలములందు నూతనప్రయోగముల ననుసరించి సంస్కరణము జరిగినట్లు నిదర్శనములు కల వని వ్రాసిరి. కాని యేయేనూతనప్రయోగముల ననుసరించి యేయే సంస్కరణము లెట్లెట్లు జరిగెనో యవి జరిగిన ట్లేనిదర్శనములు కలవో చూపిన వారు కారు. వ్యాకరణనిబంధనమునకు మీఱినప్రయోగములు కొన్ని కలవనియు గ్రామ్యంబు లైనను నార్యులు ప్రయోగించినవి గ్రాహ్యము లని పల్కుచిన్నయసూరి వానిసాధుత్వ మంగీకరించె ననియు వ్రాయించిరి. వ్యాకరణ నిబంధమునకు మించినప్రయోగము లున్న నుండవచ్చును గాని వాని కన్నిటికిని సాధుత్వమును జిన్నయసూరి గారంగీకరింప లేదు. శాస్త్రిలుగారు వెనుక వ్రాసిన నిర్వచనము గల శిష్టులుపయోగించినవానినే గ్రహింపవలయు నని యాయన యభిప్రాయము. కాని సామాన్యముగా గ్రామ్యభాషలోఁ గావ్యనిర్మాణము చేయవచ్చు నని కాదని క్రిందఁ గావించిన గ్రామ్య భాషానిరాకరణమువలన స్పష్ట మగును.

పిమ్మట శాస్త్రులుగారు "ప్రస్తుతకాలమందుఁ గవులు రసానుగుణముగాఁ గొన్నిశబ్దముల వాడినచో నవి యార్యప్రయుక్తములై సాధువులు కాకపోవునా" యని వ్రాసిరి. ఆయాయిప్రస్తావములందు రసానుగుణముగా మహాకవులు గొన్ని గ్రామ్యములం బ్రయోగింప వచ్చునని ప్రాచార్యు లంగీకరించిరి. కాని కావ్యము లం దెల్లెడలను గ్రామ్యములం బ్రయోగింప రాదని నేను వెనుక వ్రాసితిని. "అట్టి స్వాతంత్ర్యము ప్రాచీనులకుఁ గలుగుటకు నిప్పటివారికి లేకుండుటకుఁ గారణముం డునా యనియు గ్రంథకర్తలు కాకున్నను బ్రాజ్ఞు లార్యులు గాకుందురా" యనియు, "వారివ్యవహార మేల గ్రాహ్యముకాదని"యు "నాంధ్రభాషయం దుత్సాహము కలవా రావశ్యకము లైన నిబంధనల నతిక్రమింపక గ్రంథములలో నిదివఱకుఁ బ్రయోగింపఁబడని వానినైనను గర్ణసుఖకరములు నాంధ్రదేశమున నంతటను నాగరకవ్యవహృతంబులు రసానుగుణములు నగువానిం బ్రయోగించి రసవత్తరకావ్యముల నిర్మింపవచ్చు న"నియు "నవియుఁ గాలక్రమమున మహాకవి ప్రయోగములయి సంస్కరణార్హ లగుననియు నట్లైన భాష యభివృద్ధినొందునని"యు వ్రాసిరి.

ప్రాచీనుల వ్యవహారములో నున్నగ్రామ్యములు గ్రాహ్యము లని చిన్నయసూరిగారు వ్రాసిన గ్రంథమును జూచి శాస్త్రులుగారు ప్రాచీనుల కట్టి స్వాతంత్ర్య

ము కలదు గావున నిప్పటివారును గ్రామ్యముల నిచ్చ వచ్చినట్లు ప్రయోగింప వచ్చునని కాఁబోలు నిట్లువ్రాసిరి. కాని ప్రాచీనులకు నన్నిచోట్ల గ్రామ్యము లుపయోగింప స్వాతంత్ర్యము లేదు. ఉన్నను వారికిఁ గల దనుకారణముచే నాధునికులకుఁ గల్గు ననుట న్యాయ్యముగాదు. "భద్రంకర్ణేభి శ్శృణుయామ దేవా" యని వేదమునం గలదు. నలోపసూత్రమునొద్ద నఇతి లుప్తషష్ఠీకం పద మని వ్యాకరణమున నున్నది. గృహ్యాయనియు, కృష్ణస్యసఖి రర్జున యనియు సర్వపంథాన మనియును, ఎతద్ద్రుశ్యతియనియును. ఋషికావ్యములందుఁ గలవు. మఱియు నిట్టివెన్నియో కల వని యనేకులకుం దెలియనియంశము కాదు. వీని నిట్లిప్పటివారు ప్రయోగింప నగునేమో వారే నిర్ణయింతురు గాక! ఉపయోగింప వచ్చుననిన వ్యాకరణమునకు వైయర్థ్యమే. గ్రంథకర్తలు కాకున్నఁ బ్రాజ్ఞు లార్యులు కా రని యెవ్వరుం జెప్పఁ జాలరు. కాని వా రితరులతోవ్యవహరించునపుడు వారికి శ్రమ లేకుండం దెలియుటకై గ్రామ్యము లనివార్యముగా నుపయోగింతురు గావునను వా రుపయోగించినను గ్రామ్యము గ్రామ్యమే కావునను వ్యవహారభాష గ్రంథప్రవేశార్హము కాదని ప్రాచీనులుం జెప్పిరి. మఱియు నిబంధన లన్నియు నావశ్యకములే కాని యందుఁ గొన్ని యనావశ్యకములు లేవు. కాఁబట్టి వానిలో నొకదానిని మీఱ రాదని నాతలంపు. అనావశ్యకములు కొన్ని కలవేని యేవి యావశ్యకములో యేవి యనావశ్యకములో వారే నిర్ణయింతురుగాక! వ్యవహారభాష యాంధ్రదేశమందుఁ బెక్కుచోట్లఁ బెక్కువిధములుగా నున్నది గాని యేకవిధముగా నున్నట్లు కాన్పింపదు. కావున నెల్లదేశముల విదితము లగుశబ్దములు మిక్కిలి యుండవు. స్వల్పసంఖ్య గల పదము లేవియైన నట్లున్నను నవి సుశబ్దములైననే కాని ప్రయోగార్హములు కావు. ఎట్టయిన వాని బ్రయోగించినను స్వల్పసంఖ్య గల వానితో గ్రంథరచన యనువుపడదు. వ్యవహారభాష యంతయుం బ్రయోగార్హమయ్యె నేని ప్రాచీననిబంధనము లన్నియు నిష్ప్రయోజనము లగును. గ్రామ్యము లెప్పుడును శ్రవణసుఖకరములు గావు, గ్రామ్యములు పండితుల చెవులకింపుగా నుండు నవి కావని మున్ను వ్రాసితిని. కొందఱి చెవుల కవి యింపుగా నుండు నని వారు చెప్పినను బెక్కండ్ర యనుభవమునకు విరోధము. వానితో రసవత్తర కావ్యనిర్మాణ మసాధ్యము. రసాపకర్షమునకుం గారణము దోష మని యాలంకారికులు దోషలక్షణముం జెప్పి యప్రయుక్తమును గ్రామ్యమును దోషము లని పరిగణించిరి. "రసాపకర్షకా దోషా" యని విశ్వనాథ కవిరాజును,

“హేతుంరసాపకర్షస్య బుధాదోషం బభాషిరే” యని సాహిత్యరత్నాకరుఁడును, “దోషః కావ్యాపకర్షస్య హేతు శ్శబ్దార్థగోచర” యని విద్యానాథుఁడుం జెప్పిరి. “రసాపకర్షద్వారా కావ్యాపకర్షహేతుర్దోష” యని కుమారస్వామి సోమయాజులు విద్యానాథుని శ్లోకమునకు రత్నాపణమున నర్థము వ్రాసిరి. మఱియును “అప్రయుక్త మపుష్టార్థం”........“క్లిష్టంగూఢార్థకం గ్రామ్య”మ్మని విద్యానాథుఁడును, “అసమర్థమపుష్టార్థం గ్రామ్యంచైవా ప్రయోజకం”...... ......“వ్యర్థ మశ్లీలనేయార్థక్లిష్టాసాధ్వప్రయుక్తిమ”త్తని సాహిత్య రత్నాకరుఁడును, దుశ్శ్రవం త్రివిధా శ్లీలానుచితార్థా ప్రయుక్తతాః గ్రామ్యోఽప్రతీత” యని విశ్వనాథకవిరాజును వీనిని బదదోషములలో లెక్కించిరి. “పామరవ్యవహారైకప్రసిద్ధం గ్రామ్య ముచ్యతే” యని గ్రామ్యమునకును, యదప్రయుక్తం కవిభి రప్రయుక్తం తదుచ్యతే” యని యప్రయుక్తమునకును సాహిత్య రత్నాకరమునందును గొంచె మెక్కువతక్కువగా నిట్లే తక్కినయలంకార గ్రంథములందును లక్షణములు చెప్పంబడెను. మఱియును గొన్నిదోషములనే చెప్పినవామనుఁడు సూత్రవృత్తియందు గ్రామ్యపదప్రయోగము దోష మని చెప్పి” లోకమాత్రప్రయుక్తం గ్రామ్య” మని దానిలక్షణము చెప్పెను.

ఇట్లిందఱు ప్రాచీనలాక్షణికు లగుమహాకవు లేకాభిప్రాయముతో రసాపకర్షహేతువు లనిచెప్పిన గ్రామ్యాప్రయుక్తపదములతో రసవత్తరకావ్య నిర్మాణ మెట్లు సాధ్య మగునని శాస్త్రులుగారు వ్రాసిరో చెప్పంజాలను. ఇట వారుదాహరించిన మాళవికాగ్నిమిత్రములోని శ్లోకమునకు “పురాణమిత్యేవన సాధుసర్వం నచాపి కావ్యం నవ మిత్యవద్య”మ్మని నాపాఠము. కాని “నవీన మిత్యేవనచాప్యవద్య”మ్మనికాదు. పాఠ మెట్లున్నను గవి దీని నేప్రసంగమున నుదాహరించెనో గ్రామ్యపదప్రయోగమునకుఁ గాని యప్రయుక్తప్రయోగమునకుఁ గాని యిది యెంత తోడ్పడునో విద్వాంసులు పరిశీలింప నర్హులు. తరువాత శాస్త్రులవా రొకవాక్యమును వ్రాసి పిమ్మట నూతన శబ్దములం ప్రయోగించిన నప్రయుక్తదోషము వచ్చునని శంకింపఁ గూడ దనియు నట్టిపదములు శీఘ్రముగ నర్థముం దెలుపం జాలవు గావున రసస్ఫూర్తికిఁ బ్రతిబంధక మనియె యది దోష మనువారి యభిప్రాయము గాని ప్రత్యవాయహేతు వని కాదనియు శీఘ్రముగ నర్థమును నూతనప్రయుక్తశబ్దములు తెలిపినచో నాదోషము లేదనియు వ్రాసిరి. ఏకవియు నెచ్చటం బ్రయోగింపనిపదములు శీఘ్రముగ నెట్ల

ర్థమును బోధించును? గ్రామ్యాప్రయుక్తదోషభూయిష్ఠ మగుకావ్యమున రసస్ఫూర్తియెట్టిది? లాక్షణికు లెల్లరు నిషేధించినవానిఁ బ్రయోగించిన నెట్లప్రయుక్తదోషము లేదన వచ్చును? మఱియుంగొన్నిశబ్దములె శుద్ధములై యయ్యు ననభిధానమ్ము (కవులుప్రయోగింపమి) వలనఁ ద్యాజ్యము లని వ్యాకరణము వలనం దెలియుచున్నది. శుద్ధశబ్దములును గవిప్రయుక్తములు కా వనుకారణమునఁ ద్యాజ్యము లగుచుండఁగా వైయాకరణులచే నిషిద్ధములును, గవిప్రయుక్తములు కానివియు నగుశబ్దములను బ్రయోగింపవచ్చునను వచన మెంత న్యాయ్యమో పండితులు పరిశీలింతురుగాక! అప్రయుక్తాదిదోషములు ప్రత్యవాయహేతువులు గాకున్నను బ్రయోగార్హములు గావని ప్రాచీనమహాకవులెల్లరు నిర్దేశించి రని విద్వల్లోకమునకుం దెలియని యంశముగాదు. "విరళాః పేచోషాదికశబ్దాః ప్రవ్యాహరంతు శబ్దజ్ఞాః, ఇహతు ప్రత్యాహార్యం సంకేతితసుప్రసిద్ధ మేవ పద"మని వాగనుశాసనులు సూత్రించిరి. (శబ్దశాస్త్రమందభిమానము గలవారు లోకమునం బ్రసిద్ధములు గాని పేచోషాదిశబ్దములను సంస్కృతములో నొకానొకచోఁ బ్రయోగించినం బ్రయోగింతురు గాక! ఈ తెలుఁగుభాషయందు నీశబ్దమున కీయర్థ మని సంకేతింపఁబడినదియు మిగులం 'బసిద్ధ మగునదియుఁ బ్రామాణికులు ప్రయోగించినదియు నగుశబ్దమే ప్రయోగార్హముగాని యప్రసిద్ధ మట్టిది కాదని దీనియర్థము. "కావ్యంయశస" ఇత్యాది శ్లోకమును గావ్యప్రకాశమున మమ్మటపాదులుచెప్పిరి. "పరివర్ధతే విజ్ఞాన" మిత్యాది పద్యమును బ్రతాపరుద్రీయమున విద్యానాథుఁ డుదాహరించెను. "విశ్వోల్లంఘనజాంఘికీం వితనుతే కీర్తిం విధత్తే శ్రియ" మిత్యాది ప్రాచీన శ్లోకమును సాహిత్యరత్నాకరమున ధర్మభట్టు లుదాహరించి "మీమాంమాంస్యం పునరత్ర కావ్య మమునా సిద్ధ్యంతి కీర్త్యాదయ" యను పద్యమును రచించి "న కేవలం కావ్యం దృష్టార్థమేవ కింతు కీర్తిద్వారా స్వర్గాదిఫలక మపి కీర్తిం స్వర్గఫలా మాహు రాసంసారం విపశ్చిత ఇత్యుక్తత్వా"త్తని వ్రాసిరి. విశ్వనాథ కవిరాజు "ధర్మార్థకామమోక్షేషు వైచక్షణ్యం కలాసుచ కరోతి కీర్తిం ప్రీతించ సాధు కావ్యనిషేవణ" మని సాహిత్యదర్పణమున నుదాహరించెను. వీని కన్నిటికిని సాధుకావ్య నిర్మాణాదు లీలోకమందలి సుఖమునకుసాధన మగుధనము మొద లగువానిని స్వర్గసాధన మగుకీర్తిని గలిగించునని ముఖ్యతాత్పర్యము. మఱియు "వామనుఁడుకావ్యం సద్దృష్టాదృష్టార్థం ప్రీతికీర్తి హేతు

త్వా” త్తని సూత్రించి దాని క్రిందను” ప్రతిష్ఠాంకావ్య బంధస్య యశస స్సరణిం విదుః అకీర్తివర్తనీం చైవ కుకవిత్వవిడంబనాం కీర్తింస్వర్గఫలా మాహురా సంసారంవిపశ్చితః అకీర్తించ నిరాలోక నరకోద్దేశదూతికా” యనుపురాతనశ్లోకము నుదాహరించెను. నిర్దోషమైన కావ్యము ప్రీతికిం గీర్తికిం గారణము కావున దృష్టఫలము నదృష్టఫలముం గావించునది యని సూత్రార్థము. సత్కావ్యనిర్మాణము కీర్తికిని దోషభూయిష్ఠ మగు కావ్యనిర్మాణ మపకీర్తికిం గారణమనియుఁ గీర్తి తా నున్నంతకాలము, స్వర్గఫలముం గావించుననియు నపకీర్తి నరకముం బొందించునదియనియు, శ్లోకార్థసంగ్రహము. ఏక శ్శబ్ద స్సమ్యఙ్జ్ఞాత స్సుప్రయుక్త స్స్వర్గే లోకే కామధుగ్భవతి” యను శ్రుతి వాక్యము లోకప్రసిద్ధము. ఒకశబ్దమైనను బ్రకృతి ప్రత్యయవిచారపూర్వకముగఁ దెలియంబడినదియై ప్రాచీనానుశాసనమునకు విరోధములేకుండఁ బ్రయోగింపంబడినది యగుచు స్వర్గమునం గోరిన కోర్కులను బ్రయోగించువాని కిచ్చునని దీనియర్థము. శాస్త్రపూర్వకే శబ్దప్రయోగేఽభ్యుదయ స్తత్తుల్యం వేదశబ్దేన” యని మహాభాష్యోక్తియుం గలదు. శాస్త్రపూర్వకముగా నెవ్వఁడు శబ్దములం బ్రయోగించునో యతఁడు మేలు పొందును. వేదశబ్దములు నిట్టే చెప్పుచున్నవని దీనిముఖ్యార్థము. వీనినన్నిటిని బరిశీలించి యప్రయుక్తాదిదోషములతోఁ గూడిన గావ్యనిర్మాణము ప్రత్యవాయ హేతు వగునో కాదో విద్వాంసులు నిర్ణయింప నర్హులు. దరువాత శాస్త్రులుగారు “కాన గ్రామ్యములని యిదివఱకు నిరాకరింపఁబడె ననుభయమును విడచి సర్వజనవిదితములును నాగరకవ్యవహృతంబును రసానుగుణములు నగు నూతనశబ్దములఁ జేర్చి మహాకవులు గ్రంథములువ్రాయుట ప్రకృతకాలోచితమును భాషాభివృద్ధికరము నగును. ఆగ్రంథములు రసికులకు నాహ్లాదకము లగు నపుడు గ్రామ్యములుకాక పోవనియుఁ బ్రాచీననిబంధనల కన్నిటికి లోఁబడినను రసికాహ్లాదములు కానిచో గ్రామ్యము లని యుద్ఘోషించినను గ్రామ్యములు కావనియు గ్రామ్యతా గ్రామ్యత్వములకు రసతదభావములే కారణములనియు “సదోషాసగుణా” విత్యాది ప్రాచీనకావ్య లక్షణములనిరసించి “వాక్యంరసాత్మకంకావ్య” మని పరిష్కరించిన విశ్వనాథకవిరాజునకిదియే యభిప్రాయ”మనియు వ్రాసిరి. అట్టిశబ్దము లుండెనేని సంస్కరించి ప్రయోగింపవచ్చునని మున్ను వ్రాసితిని.

ఇందు నిర్భయముగా గ్రామ్యములు గ్రంథములలోఁ బ్రయోగింపవచ్చు

నని శాస్త్రులుగారు వ్రాసిరి. కాని గ్రామ్యప్రయోగము దుష్టమని ప్రాచీను లగు లాక్షణికు లెల్ల నిషేధించిరి. గ్రామ్యము నా నపశబ్ద మని వాగనుశాసనులు చెప్పినట్లు మున్ను వ్రాసితిని. ఆచార్యదండి కావ్యాదర్శమునందు "తదల్పమపి నోపేక్ష్యం కావ్యే దుష్టంకథం చన, స్యాద్వపు స్సుందరమపి శ్విత్రే ణైకేన దుర్భగ"మ్మని వ్రాసెను. కావ్యమం దేకొలఁది దోషము నుపేక్షింపఁగూడదు. సుందర శరీరమైనను బొల్లియున్న దర్శనీయము గాదుగదా యని దీనిభావము. "అయాచకత్వ మగ్రామ్యపదాలాపః కథాస్వపి" యని కవికంఠాభరణమున క్షేమేంద్రుఁడు చెప్పెను. యాచింపమియుఁ గథలయందును గ్రామ్యపదముల నుచ్చరింపమియుఁ గవి కుండవలసిన గుణములలోని వని దీనియర్థము.

క. లక్షణవిరహితకావ్యము, పక్షిగమన గ్రామ్యమనఁగఁ బడునది పెద్దల్
వీక్షింపరు లక్షణయుత మీ, క్షితి నగ్రామ్య మని గ్రహింతురు ప్రీతిన్.

గీ. క్షితినపభ్రంశపదములు గృతులయందు, గమలలోచన చెప్ప నర్హములుగావు
గాన నాంధ్రకవీంద్రులువానిఁ దెలియ, వలయునీశాస్త్రమునఁ దమతలఁపు నిలిపి.

గీ. చులుకగా గ్రామ్యజనములు పలుకునట్టి, తెనుఁగుమాటలు గ్రామ్యంబులనఁ గఁ బడియె
వర్ణలోపంబు నొందికావ్యములఁజొరవు, పరులఁదెగడెడుచోనొప్పుఁబాలదొంగ.

అప్పకవీయము. ఆ. 1.

వెనుకను గ్రామ్యప్రయోగము దుష్ట మని చెప్పినవా రనేకులు గల రని వ్రాసితిని. అపశబ్దప్రయోగ మట్లుండ దాని వినికిలి సైతము ప్రాచీనులు నిషేధించిరి. "శ్రుతేఽపశబ్దే స్వోక్తేషు ప్రమాదాత్ పాణినిం స్మరేత్, అథవా ఫణినామీశం చింతయే ద్బహుశో బుధః, ప్రాకృతే షడ్విధే చాపి వాల్మీకిం వామహేశ్వరం ధ్యాయే దత్రతు మామేవ స్మరేత్పండితసత్తమ" యని యాథర్వణుఁడు నికృతివివేకమునం జెప్పెను. పండితుఁడు ప్రమాదమున సంస్కృతభాషయం దపశబ్దములు వినెనేని పాణినిని గాని పతంజలినిగాని స్మరింపవలెను. ప్రాకృతాదిషడ్భాషలయం దట్లయ్యెనేని వాల్మీకిని గాని శివునిగాని స్మరింపవలెను. తెలుఁగుబాస యందపశబ్దములు వినెనేని నన్నుఁదలంపవలె నని దీని యర్థము. అపశబ్దములు విన్నను మహాపురుషస్మరణము నిట్లు విధింపఁగాఁ దత్ప్రయోగము నిర్భయముగాఁజేయ వచ్చునని యెట్లు శాస్త్రులుగారు వ్రాసిరో యెవ్వరు చెప్పఁగలరు? "అదోషా" విత్యాదిలక్షణమును విశ్వనాథ కవిరాజు

తనబుద్ధి చాతుర్యముం బ్రకటింపందలంచి వేఱులక్షణముఁ జేయఁ బూని కొన్ని యుక్తులం జెప్పి నిరసించెను గాని దుష్టము లగు గ్రామ్యప్రయుక్తులు మొ॥ బ్రయోగింపవచ్చునని తలఁచి కాదని శపథపూర్వకముగాఁ జెప్పవచ్చును. ప్రయోగింప వచ్చు నను నభిప్రాయముచేతనే రసాత్మక మగువాక్యము కావ్యమని చెప్పెనేని యాయన లక్షణగ్రంథమునందుఁ గావ్యస్వరూపనిరూపణముఁ జేయుచో "దోషా స్తస్యాపకర్షకాః" యని దోషస్వరూపముం జెప్పి దోషప్రకరణములో గ్రామ్యాదు లగు పెక్కుదోషములం జెప్పి వాని కుదాహరణములం జూపి చివర "గ్రామ్యత్వ మధమోక్తి"ష్వని (నీచులు మాటలాడు నపుడు గ్రామ్యప్రయోగము దోషము కాదని యేల విభజించి చెప్పవలయునో శాస్త్రులువారు తెల్పవలయును. మీఁద నే నుదాహరించిన ప్రాచీనవాక్యములం బరిశీలింపఁగా గ్రామ్యప్రయుక్తాదులకు గ్రంథప్రయోగార్హత యేకొలఁదియు లేదని స్పష్టము. మఱియు శాస్త్రులుగారు గ్రామ్యములం బ్రయోగింపవచ్చునని యుపదేశించిరిగాని యేలొకో వారీయుపన్యాసమున నట్లుపయోగింప రైరి. పిమ్మట శాస్త్రులు గారీవిషయమును ముగించి యసభ్యవర్ణనము లనునొకయంశమును గూర్చి యుపన్యసించుచు శృంగారప్రబంధములు గల వనియు నవి వ్యంగ్యమర్యాద ననుసరించునంతవఱకు సరసములనియు, వ్యంగ్యమర్యాద నుల్లంఘించిన వైరస్యముం బుట్టించు ననియు నొక్కొకయంశ మొక్కొకకాలమున నాహ్లాదకర మైనను గాలాంతరమున జుగుప్సాకరమనియుఁ గొన్నికాలములలోఁ గొందఱు ప్రధానపురుషు లతికాముకు లై యుండఁ దదనుయాయులు వారి ప్రీతికై యౌచిత్యమును వదలి వారియుద్దేశానుసారముగ మార్దవమును మించిన శృంగారవర్ణనలం జేయుచు వచ్చిరనియుఁ జెప్పి తరువాత నేమేమియో వ్రాసి కాలక్రమమున నది కవితాధర్మ మని యెంచి జుగుప్సాకరము లైన యంశముల వర్ణించి రనియు, నీకాలమున స్త్రీవిద్య యభివృద్ధినొందు చున్నదనియు, నిట్టి కాలమున నాగరకతగలవారి కేవి యేవం బుట్టింపదో యట్టివర్ణనలు గావింపవలయు ననియు నభిప్రాయము గల వాక్యములను వ్రాసిరి. ఇందుఁగొంత వాస్తవమే యైనను మహాగ్రంథములయందు వీరు సెలవిచ్చినంత శృంగారాధిక్యము లేదు. ప్రబంధములందును బెక్కండ్రుకవులు పెక్కుచోట్ల శృంగారమును మృదువుగ నే వర్ణించిరి. కొన్నిచోట్ల నెక్కువగా శృంగారవర్ణనము లుండినను వానియందుఁ బ్రేమ లేనివారు వానిని విడిచి తక్కినయంశములనే చదువుకొన

వచ్చును. శృంగారమునం దేమియు నిష్టములేని వారట్టి కావ్యములం జూడం బోక భగవద్గీతాది గ్రంథములనే చదువవచ్చును. రసనిరూపణమున నాలంకారికు లది బ్రహ్మానందసహోదర మని చెప్పిరి. మఱియుం గొన్ని గ్రంథములందు శృంగారమే ప్రధానముగా నుండవలయు నను నియమము ప్రతాపరుద్రీయాదులందుం గానంబడుచున్నది. పూర్వమునందుం గొందఱు ప్రధానపురుషులు శృంగారగ్రంథాసక్తులైనం గావచ్చును గాని వారతికాముకు లన న్యాయ్యము గాదని తోంచును. శృంగారమును వర్ణించిన కవులుగాని యట్టిప్రబంధాసక్తులైన ప్రభువులుగాని యతికాముకు లనునియమము లేదు. కాముకులు గానివారును రసాసక్తులును వర్ణనలుగావించు కవులును గావచ్చును. ప్రధానపురుషుల ప్రీతికై కొందఱు కావ్యములు వ్రాసినను నదియొక యపరాధము గాదు. అప్పుడును బ్రధానపురుషుల ప్రీతికై తమకిష్టములేని విషయములను గ్రంథములు వ్రాయు వా రుండవచ్చును. ప్రధానపురుషుల ప్రీతికై శృంగారగ్రంథములు చేసినవా రటుండ నేవారినాశ్రయింపనివాఁడును నెల్లకవులకు నాశ్రయమును వదాన్యాగ్రేసరుఁడును బాతంజలయోగసూత్రములకు వ్యాఖ్యాతయుం బండితకవిశ్రేష్ఠుఁడు నగు శ్రీభోజమహారాజు "రస్యతే స్వాద్యతే" యనువ్యుత్పత్తిచేత సుఖమే యనుభవింపం దగినది గావున సుఖాస్వాదరూప మగు శృంగారమే రసశబ్దార్థమనం దగును; దుఃఖానుభవముతోం గూడిన కరుణాదులకు రసశబ్దార్థత్వమే సంభవింప దనునభిప్రాయముతో "వీరాద్భుతాదిషు రసేషు రసప్రసిద్ధి స్సిద్ధా కుతోఽపి వటయక్షవ దాపిభాతి, లోకే గతానుగతికత్వవశా దుపేతా మేతాం నివర్తయితు మేష పరిశ్రమో నః. "శృంగారవీరకరుణాద్భుత... రస మామనామ" యని రసప్రకాశమునం జెప్పి శృంగార రసాసక్తిం జూపెను. రసము లనిలోకమునం బ్రసిద్ధము లైన వీరాద్భుతాదులయందు మఱ్ఱిచెట్టుపైం బిశాచ మున్నదనునట్లేదోయొక కారణమున రసప్రసిద్ధి కలిగినది. గతానుగతికన్యాయమున నంగీకరింపంబడిన యీయంశమును నివారించుటకే యీపరిశ్రమము మాకయ్యెను. శృంగారాదు లగుపదిరసములు కల వని కొందఱు చెప్పిరి. ఆని యనుభవము వలన శృంగార మొకటియే రస మని తలంచెదమని దీని యర్థము.

కవిశిరోభూషణమున నహోబలపతి "సాధ్యోహి రసో యథాయథ" మిత్యాది సూత్రవ్యాఖ్యానము "తత్తద్రసోచిత ప్రదేశేషు తత్తదుచితవిభావాది

సామగ్రీధురీణవచనరచనయా సంస్కృతకావ్యే దేశభాషాకావ్యేవా తత్తద్రసస్య సాధన మేవ కవీంద్రాణాం స్వభావో లోకప్రసిద్ధ" యని చెప్పెను. మహాఋషియు లోకోపకారమునకై పురుషార్థసాధనమైన కావ్యమును మొదట నిర్మించినవాఁడు నగువాల్మీకియు, నతఁడువలెనే పెక్కుపురాణములు రచించిన వ్యాసమహర్షియు శృంగారవర్ణనలు గావించిరి. ఇందలి కొన్ని పద్దెము లొకరొకరికిం జదివి చెప్ప సంశయింపం దగినవియుఁ గలవు. మఱియుం గాళిదాసాదులు రచియించిన గ్రంథములందు నట్టి వర్ణనలు గలవు. భాణములందును, బ్రహసనములందుఁ గల వర్ణనములు పెక్కండ్రకు సువిదితములు. వీరిలో నెవ్వరుం బ్రధానపురుషుల ప్రీతి నపేక్షించినవారు కారని యెఱుంగనివారు లేరు. ఇట్లుండఁగాఁ దెనుఁగు నందుఁ గొందఱు ప్రధానపురుషుల నతికాముకుల సంతసింపఁజేయఁ దలంచి తదనుయాయులు శృంగారము మిక్కిలి వర్ణించి రనునది యెంత సమంజసమో నిష్పక్షపాతులు తెలియుదురుగాక !

మఱియు నెవ్వరిప్రీతి నపేక్షింపనివారు నెల్లవారికి సేవింపందగినవారు బ్రహ్మచర్యమునుండియే తురీయాశ్రమమును గ్రహించినవారు నగు శ్రీ శంకరభగవత్పాదులును గొన్నిశృంగార రసస్ఫోరక మైనవర్ణనలు గలపద్యములను రచియించిరి. వత్సలము స్నేహము భక్తియు ననునవి వేఱు రసములని కొందఱును విషయభేదమున వానికి రతిభావముననే యంతర్భావ మని కొందఱు చెప్పుదురు. "శృంగం ప్రాధాన్య మియర్తి ప్రాప్నోతి" యను వ్యుత్పత్తిచే నిది రసములలోఁ బ్రధాన మనియుం జెప్పఁబడియె. కావ్యమునకు రసము జీవిత మని పెక్కం డ్రాలంకారికులు నిర్వివాదముగాఁ జెప్పిరి. కాఁబట్టి యెల్లకావ్యములను రసవర్ణన మావశ్యకము. అందు శృంగారము రసికజనప్రీతికర మని కొందఱు తలంచి యట్టికావ్యముల రచించిరి కాని వేఱభిప్రాయమునఁగాదు. స్త్రీవిద్య యీదేశమునం జరకాలమునుండి యున్నది కాని నేఁడు క్రొత్తగా వచ్చినది కాదు. బృహదారణ్యకమునందలి మైత్రేయీబ్రాహ్మణమును గార్గీయాజ్ఞవల్క్యసంవాదము నీయంశమును స్థిరపఱుచును. సీతామహాదేవి మొద లగువారు చదువుకొన్నట్లు రామాయణమువలనం దేటపడును. భారతమును నీయంశమును బలపఱుచుచున్నది. భోజచరిత్రమున గ్రంథరచనము గావింపఁగల సీతాదు లగుస్త్రీలు పెక్కండ్రున్నట్లు తెలియును. బృహత్కథాసరిత్సాగరమునందు సాతవాహనుభార్య మహావిద్వాంసురా లని చెప్పంబడెను. మఱియు మోహనాంగి యను పేరుగల కృష్ణదేవరాయనికూతుఁరు మా

రీచపరిణయమును, గుమ్మర మొల్ల రామాయణమును, దరిగొండ వెంగమ్మరాజ యోగసాగరమును వెంకటాచల మహాత్మ్యమును రచించిరి. మొల్లరామాయణాదులయందుఁ గొన్నిశృంగారవర్ణనలును గాన్పించుచున్నవి. అయిన నసభ్యవర్ణనములని పెద్దలు నిర్ణయించినవాని నైనను గ్రంథమునుండి తొలఁగించిన వికృతి కలుగును గావున నట్లుచేయక ముందు గ్రంథముల రచియించెడువారు వానిని విడిచినను విడువవచ్చునని తలఁచెదను.

పిమ్మట శాస్త్రులుగా రర్ధానుస్వారము నుద్దేశించి భాషాస్వరూపముం జెప్పి మహాభాష్యమునుండి శబ్దస్వరూపముం జెప్పు కొన్నివాక్యముల నుదాహరించి కొన్నివాక్యములువ్రాసి ప్రకృతకాలమున నుచ్చారణభేదజ్ఞాపకము గాదు కావున నర్ధానుస్వారరేఖ యనావశ్యక మని సెలవిచ్చిరి. మీఁద వారు వ్రాసిన వాక్యముల కన్నిటికి నిదియే ముఖ్యాభిప్రాయ మని నాకుఁ దోఁచినది. అర్ధానుస్వార ముచ్చారణకు సాధ్యమైనను గాకున్నను నుచ్చారణభేదజ్ఞాపకము కాక పోదని తలంచెదను. వేఱు గా నుచ్చరింపఁదగిన శబ్దము కాదుగాని యిది యొకయక్కరమని "షట్త్రింశ దత్ర తేన్యేచాను ప్రవిశంతి శబ్దయోగవశాత్, ద్వివిధాదిదు దేతో-చోవక్ర తమాచాప్యనుస్వారాచ" యను నన్నయభట్టారకుని సూత్రములవలనం దెలియును. (ఈ భాషయందు ముప్పదియాఱువర్ణంబులు గలవు. మఱికొన్ని తత్సమాదులం గలసి యిందుఁ జేరుచున్నవి. అందు అఆ ఇఈ ఉఊ ఎఏఐ ఒఓఔ ఁ ం అను పదునాలు గచ్చులని సూత్రముల యర్థము.) వర్ణమాతృకలోని వర్ణములనేభాషలోను విడిచినట్లుగాని విడువవలసిన యావశ్యక భావమున్నట్లుగాని కాన్పింపదు. ఇది శబ్దము కానప్పుడు శబ్దస్వరూపమును బోధించు భాష్యగ్రంథ మిట నుదాహరింపఁబని యున్నట్లును దోఁపదు. ఉచ్చరింప నసాధ్యములైనను సంస్కృతాది శబ్దములకుఁ గలరూపభేదములు కౌముదియందు నిరూపింపఁబడినవి గాని విడువంబడలేదు. ఉచ్చారణమునందు భేదములేకున్నను "సుధ్ధ్య్యుపాస్య" యను చోట నొక ధకారము నొక యకారము గలదియును రెండు ధకారములు రెండు యకారములు గలదియు, నొక ధకారము రెండు యకారములు గలదియు, నొక యకారము రెండు ధకారములు గలదియు నగురూపములును గౌముదియందుఁ జెప్పంబడినవి కాని విడువం బడలేదు. "విచారింప నీ యర్ధానుస్వారము కొన్నిచోట్ల నర్ధవిశేష ప్రతీతికి సహకారి యగుచున్నదనియుఁ బుస్తకములను జూచువారి కది యుపయోగకరమైన నొక రుచ్చరించు దానిని వినువారి కీరేఖ యేమియు నుపయోగింప లేద"ని

యు శాస్త్రులుగారువ్రాసి "ఉచ్చారిత ఏవశబ్దః ప్రత్యాయకోనానుచ్చారిత" యను భాష్యపఙ్క్తుల నుదాహరించి "పుస్తకమును జూచువారికిని నుచ్చారణ లేనపుఁ డర్థప్రతీతి యుండదు గావున నుచ్చారణ భేదగ్రాహకము గాని యీయ ర్థానుస్వారానుమాపకరేఖ యందఱకు నుపయోగ శూన్యమే యని చెప్పవచ్చు" నని వ్రాసిరి. వినువారికి నుపయోగము లేకున్నను జూచువారికి స్థూలోచ్చారణ ము లేనపుడును నర్థప్రతీతి కలదు. గావున వాని కుపయోగము లేదన రాదు. ఇది తక్కిన యక్షరములువలె వేఱుగా నుచ్చరింపందగినది గాక మఱియొక యచ్చునకుఁ దరువాత నుచ్చరింపం దగినది యనునియమముచే నొకశబ్దములోనుండునది గాని ప్రత్యేకముగా శబ్దముగాదు గావున నుచ్చరింప సాధ్యము గాకున్నను భేదగ్రాహక ము కాక పోదని తలంచెదను. తరువాత "నర్థానుస్వారరేఖ పూర్వాచ్చు ననునా సికముగా నుచ్చరించుటలో సాయపడుననియు దానిని బట్టి యాయచ్చు విశేషార్థ ప్రతీతిలో సహకారియనియు దానివలన దీనియుపయోగము స్పష్టమగునని శంకింప వచ్చు"ననియు వ్రాసి యట్లు స్పష్టోచ్చారణముండిన కాలములో నది సార్థకమైనను నట్టి యుచ్చారణములేని యీకాలమున నది నిరర్థక మని చెప్ప సందేహము లేదను గ్రంథమును వ్రాసిరి. అర్థానుస్వారరేఖ కర్థవిశేషముం దెలియఁజేయుశక్తి కలప్పు డది కొంచ ముచ్చరింపమాని రనుకారణమున నట్టిది కాక పోదని తోఁచును. అర్థాను స్వారతత్త్వమునందు "సానుస్వారము లగు మహారాష్ట్రభాషలోని కొన్ని య క్షరముల నుదాహరించి యిట్లే తెలుఁగునం దర్థానుస్వార ముచ్చరింపవలె"నని యు న్నది. మఱియు దానియందే యీయుచ్చారణము (అర్థానుస్వారోచ్చారణము) "బ్రాహ్మణులలోను జదువుకొన్నవారిలోను లేకున్నను నితరులలోఁ బలుమాఱు వినంబడునని" వ్రాయంబడియున్నది. మఱియును దానియందే "యీకాలము నందు మనలనేలెడి యాంగ్లేయుల భాషను ధ్వన్యాత్మకభాషయందు లేనియక్షర ములను వ్రాయునపు డుపయోగింతురు. ఈ యశాస్త్రమైన సాంప్రదాయముచే భాషమిక్కిలి చెడిపోయినదానిచేత (చెడిపోయిన దగుటచేత నని యర్థము.) దాని నేర్చువారి కతిప్రయాసమగుచున్నది. అట్లయినప్పటికిని జక్కగాఁ జదివిన గుణ గ్రాహులైన పండితులును బైఁజెప్పిన మూఢసాంప్రదాయమును విడువక యున్నా ర"ని యుచ్చరింపని యక్షరములు వ్రాయవలసిన యింగ్లీషుపదములఁ గొన్నిటి నుదాహరించి "సకలవిషయములను జక్కగాఁ దెలిసి విమర్శించి గుణగ్రహణము చేయునట్టి యాంగ్లేయవిద్వాంసులును నంధపరంపరాప్రాప్త మైనసంప్రదాయ

మును విడువక యుండగాఁ దెనుఁగువారలు మాత్రము ప్రాచీనకాలమునుండి తమ భాషలోనుండు నర్ధానుస్వారము నెందుకు విడువవలయు"ననియు "నదియునుం గాక యీయర్ధానుస్వారము శబ్దములయుత్పత్తిని భిన్నస్వరూపములైన శబ్దముల పరస్పరసంబంధమును దెలియ ననుకూలమై యున్నదనియు నిట్లర్ధానుస్వార ముచ్చరింపఁబడకపోయినను బలుదెఱంగుల నుపయుక్తమగుటచే దానిని విడుచుట యుక్తము కాదనియు నిది కచేరీమొదలగువానియందుపయోగించు టనావశ్యకమైనను బండితులకు విద్యార్థులకు నత్యావశ్యకమైనద"నియు వ్రాయంబడియున్నది. మీఁదవ్రాసిన గ్రంథమువలన నర్ధానుస్వారము విడువరాదని యెల్లరకుం దెల్లమగుచున్నది. తరువాతను శాస్త్రులుగా రనునాసిక పాఠపరిభ్రంశమాంధ్ర భాషలోనే కాక సంస్కృతభాషలోను నున్నట్లు కానవచ్చుచున్నదని వ్రాసి "హారాం స్త్రారాఁ చక్రిం స్త్రాయస్వ సంస్కృతం" మొదలగు లక్ష్యములలోఁ బ్రథమవిహితమైన యనునాసికమును విడిచి తదభావపక్షమున విధింపఁబడిన యనుస్వారఘటితరూపములే కవులచే వ్యవహరింపఁబడుచున్న వని వ్రాసిరి. అట్టిచోట్ల ననుస్వారానునాసికములలో నేదియైన నుండవచ్చును గావునఁ గవులు చదువువారికి శ్రమలేకుండుటకై యనుస్వారపాఠము నుపయోగించుచున్నారుగాని యనునాసికముగల రూపములు వ్యాకరణమున వ్రాయంబడి యున్నవి. విడువంబడలేదు. మఱియుఁ దరువాత ననునాసికపాఠము భ్రష్టమైనట్లు శేఖరములో "ప్రతిజ్ఞానునాసిక్యాః పాణినీయాః" యనుదానివ్యాఖ్యానావసరమున నాగేశోపాధ్యాయులు చెప్పిరనియు నర్థవిశేషముం దెలుపునది యయ్యుఁద్విస్వర్యపాఠము లౌకిక సంస్కృతభాషలయందు భ్రష్టమైనట్లనుభవములో నున్నదనియు ననునాసికపాఠపరిభ్రంశము లోకమునందేకాక వేదమునందుఁ గానవచ్చునట్లు తైత్తిరీయ ప్రాతిశాఖ్యలో 15 వ యధ్యాయములోని యొకటి రెండు సూత్రములను తదిరస్థలములందును బెక్కుచోట్ల గానవచ్చుచున్న దనియు వ్రాసిరి. మీఁదవారు వ్రాసిన యంశముల నన్నిటిని నంగీకరించినను దెనుఁగుబాసయం దర్ధానుస్వారమును విడువవలసినట్లు తోఁపదు. మఱియు నెవరెట్లు నిషేధించినను వేదమునందును భాషయందును గూడ ననునాసికపాఠమున్నట్లు తెలియుచున్నది. "స్వరేణార్థనిశ్చయోవేద ఏవ నకావ్యే" యని యాలంకారికులు చెప్పుటచేఁ ద్విస్వర్యపాఠము భాషయందు నిష్ప్రయోజనము కావున విడచినను విడువవచ్చును. తరువాత శాస్త్రులుగా రిట్లుచ్చారణ భ్రంశమగుటచే నుచ్చారణములో భేదము లేనపుడర్ధానుస్వారాను మాపక రేఖ శ్రమ

మాత్రఫలకమని పండితులకు 'దోఁపక పోదని వ్రాసిరి. కొందఱు దీని నుచ్చరింప కున్నను బెక్కండ్రు కొన్నియాంధ్రదేశ భాగములయం దుచ్చరించుచుండగా విను చున్నాము కాఁబట్టి యుచ్చారణభేదము లేదనరాదు. వెనుక వ్రాసిన కొన్నిప్ర యోజనములు కనఁబడుచున్నవి కావున దానికి శ్రమమే ఫలము కాదని తెలియు చున్నది. మఱియు నర్ధానుస్వారము వాక్యములోఁ గర్మకర్తృ విభాగముచేయు టకుఁ గొన్నిచోట్ల నుపయోగించును; గాన దీనికి శ్రమమే ఫలమని తలఁచుట యుక్తము కాదని తోఁచును. తరువాత నింక నీయర్ధానుస్వారము శాస్త్రబోధిత మగుటచేతఁ బరిత్యజించుట యుచితముకాదని కొందఱు శంకింప వచ్చునుగాని యార్యులచే మూర్ధన్యభాషగా నంగీకరింపఁబడిన సంస్కృతభాషలో వర్ణద్విత్వ మును బోధించు పాణిన్యాదిమ నికృతశాస్త్రమునకు "నహి వ్యంజనాత్పరస్యైకస్యా నేకస్యవా ఉచ్చారణేవిశేష" యను భాష్యకార ప్రత్యాఖ్యానమువలన నుచ్చారణ విశేషములేనప్పు డట్టివర్ణలేఖనముగాని దానిని బోధించుశాస్త్రము గాని పరిత్యా జ్య మని సూచింపఁబడియున్నందున నట్టిపరిత్యాగము దోషముకాదని చెప్పవచ్చు ననునర్థము గల గ్రంథమును శాస్త్రులుగారు వ్రాసిరి. శాస్త్రవిహితమైన యర్ధాను స్వారము సూచనసేయుగ్రంథసహాయమునఁ బరిత్యాజ్య మని చెప్పనవకాశములేదు సంస్కృతమునందు ద్విత్వవిధాయక శాస్త్రమును భాష్యకారులు ప్రత్యాఖ్యానము చేసిన నాశాస్త్రవిదుల కందఱకదియే సమ్మతమైనట్లు కాన్పింపదు. అట్లంగీకరింపఁ బడినేని భాష్యకారుల తరువాతి వారా శాస్త్రమును విడువవలసి యుండును. తరు వాతి వారాశాస్త్రమును వారిగ్రంథంబులం జెప్పియున్నారుగాని విడువలేదు. భా ష్యకారులు ప్రత్యాఖ్యానము చేయుటచే నాభాషయందు ద్విత్వవిధాయక శాస్త్ర మును బరిత్యజించినఁ బరిత్యజింపవచ్చును, గాని యాభాషయందు ద్విత్వవిధా యక శాస్త్రప్రత్యాఖ్యాన మీభాషలో నచ్చతెలుఁగుననే వాడంబడునదియు నే లాక్షణికులచే నిషేధింపంబడనదియు సప్రయోజనము నగు నర్ధానుస్వారమును నిరా కరింపం జాల దని సుదృఢముగాఁ జెప్పవచ్చును. అర్ధానుస్వారము లోపించిన య క్షరములకు నాదేశమని యభియుక్తులు చెప్పుదురు. మఱియు నీ వాక్యమర్ధాను స్వారతత్త్వము నందునుం గలదు. ఆదేశమును విడిచిన స్థానిజ్ఞానము దుర్శకము. అర్ధానుస్వార మున్నప్పు డొకయర్థమును లేనియప్పు డింకొకయర్థమును దెలుపు శబ్ద ములుకొన్ని యీభాషయందుఁ గలవు. వానియర్థభేదజ్ఞానము రెండర్థములు గల శబ్దముల యందు వలెనే ప్రకరణాదులవలనం గల్గునని శాస్త్రులవారు వ్రాసిరి.

కాని ప్రకరణాదులకంటె శీఘ్రముగా బోధించునదియుఁ బూర్వసిద్ధము నగునర్థానుస్వారమును విడిచి వాని నవలంబించుటకుం దగినకారణ మేమియుఁ గాన్పింపదు. శాస్త్రులవారు తరువాత నిట్లే శకటరేఫ మనావశ్యక మని యూహింపఁదగునని వ్రాసి యాలోచింపఁగా నీశకటరేఫార్థానుస్వారములు భాషాచరిత్రమును దెలిసికొనుటకుఁ గొంతసహకారు లగుచున్నవి కాని యీయుపయోగము ప్రస్తుతమునందు నాంధ్రవ్యాకరణమువలన సిద్ధించు ననియు నట్లు సిద్ధింపనివిషయములలోఁ బ్రకృతకాలమున నెవరైన విద్వాంసులు వానివలనఁ దెలియందగిన చరిత్రగ్రంథమొకదానివ్రాసి మిగిలినవారినిరర్థకశ్రమమును దగ్గించినచో వారియుపకారము సర్వజనశ్లాఘనీయ మనివ్రాసి యీయంశమును ముగించిరి. అర్థానుస్వారశకటరేఫములవలన నొక్కింతయుపకార మున్న ట్లొప్పికొన్నవారై శాస్త్రులవారు వ్యాకరణమువలనఁ గొంతసిద్ధించు ననుచున్నారు. కాని యది యిట్టి దని నిరూపింపలేదు. మఱియు వానివలనం దెలియం దగిన చరిత్రము నెవరైనను వ్రాసినతరువాత నాగ్రంథమువలన నెంతయశ్రమముగా నాచరిత్రబోధపడునో తెలిసికొని యైన వాని నిరాకరింపవచ్చునని చెప్పవలెను గాని ముందెప్పుడో యెవరో వానివలనం దెలియు చరిత్రమును వ్రాయుదు రను నభిప్రాయమున నిప్పుడే వాని వదలవలయు నని యెట్లు చెప్పిరో దుర్గ్రహము మీఁదటియంశములను విద్వాంసులు పరికించి తెలుఁగుభాషపుట్టినప్పటినుండి యున్నవియు, సప్రయోజనములు తెలుఁగుగ్రంథములలో నెక్కడ నిషేధింపఁబడనివియు నగునర్థానుస్వారశకటరేఫములను విడువవలయు ననునంశము తగినదో కాదో నిర్ణయింతురు గావుత. పిమ్మట శాస్త్రులువారు సంధివిషయమై కొన్నివాక్యములను వ్రాసియుపన్యాసమును ముగించిరి. సంధివిషయములో మొదట వా రేమివ్రాసినను గడపట నిప్పుడున్న ట్లుండవలయు నని యొప్పికొన్నవారు గావున వ్రాయవలయు విశేష మేదియు లేదని తలంచెదను.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

పురాణపండ, మల్లయ్యశాస్త్రి.

కృతివిమర్శనము.

చెన్నపురాయుర్వేద కలాశాలాధ్యక్షులు వైద్యరత్నబిరుదాంకితులునగు పండిత గోపాలాచార్యులుగారు మాపరిషత్పుస్తకాలయమున కొసంగిన యాయుర్వేదాశ్రమ గ్రంథమాలలోని పుస్తకములను సానందముగాఁ జూచితిమి. ఇందు—

(1) మాధవనిదానము :—సంస్కృతంబున వన్నె కెక్కియున్న యీ యుత్తమపుస్తకమున కాచార్యులవారు సుబోధకమగు తెలుఁగు టీకవ్రాసి యచ్చొత్తించి యాంధ్రదేశమందలి వైద్యులకు మహోపకార మొనరించిరని మానమ్మకము. ఇందు సర్వరోగములను వాని లక్షణములనుబట్టి చక్కఁగాఁ గనిపెట్టుట సులభమై లిని వివరింపఁబడినది. 486 పుటలు గలిగి చక్కనిబైండు చేయఁబడిన యీపుస్తకము వెల రు. 3—0—0 మాత్రమే.

(2) అర్కప్రకాశము:—సంస్కృతంబున రావణుఁడు రచించినట్లుగానున్న యీ గ్రంథమున కాచార్యులుగారు విపుల మగు తెలుఁగువ్యాఖ్యానము వ్రాసిరి. ఇందు నెల్లయోషధులనుండియు ద్రవము తీయుపద్ధతి సులభముగా బోధింపఁబడినది. మఱియు నిందుద్రవము తీయునట్టి యర్కయంత్రముయొక్క పటముగూడ ముద్రింపఁబడి యర్కము తీయుమార్గమంతయు సంగ్రహముగా నక్కడ వివరింపఁబడినది. వేయేల? ద్రవము తీయుపద్ధతి యెఱుంగని తెలుఁగువైద్యుల కిది యత్యంతము సహాయకారిగాఁ గలదు. దీనివెల రు. 2—0—0.

(3) భేషజకల్పము :—ఇది నాలుగాశ్వాసముల యాంధ్రపద్యకావ్యము. సంస్కృతమున, సంకలన వైద్యగ్రంథమగు దీనిని వెంకటాచార్యుఁడను నాంధ్రకవి యాంధ్రీకరించెను. కాని యిది యాంధ్రదేశమున నింతవఱకు వన్నెగాంచకపోవుటయేకాక మూలమాత్రమున లోకమునకుపకరించునట్లుగాఁ గూడలేదు. అట్టి యీవైద్యకోశమునకు నాచార్యులుగా రధిక్రశ్రమచేసి పూర్వోత్తర విరోధములను సవరించి మంచి తెలుఁగు టీకవ్రాసిరి. ఇందు నోషధులు, వానిదేశములు, వాని కాలములు, ఔషధశాలలు మానములు, వాని వినియోగములు, స్నేహాదుల పాకములు మొదలగునవి వివరింపఁబడినవి, మూలవ్యాఖ్యానములు రెండునాంధ్రమం

జేయుండుటచేతను వివిధములయిన మునిమతము లిందుదాహరింపఁబడియుండుట చేతను నిది తెలుఁగువైద్యులకుఁ గల్పకల్పమనఁదగును. దీనివెల రు. 1—0—0.

(4) పథ్యాపథ్యము:—ఇందురోగములను దెలిసికొనుట, వానికిఁ దగిన చికిత్సచేయుట రోగులుచేయఁదగిన పథ్యములు మొదలగు సంశములు తెలుపఁ బడినవి. దీనివెల. రు 1—0—0.

(5) ఆయుర్వేదపరిభాష:—ఇందు వైద్యశాస్త్రమందలి యెల్లపరిభాషల నొక్కచోఁజేర్చి వైద్యముచేయు నెల్లరకు నేవిషయంబునను సంశయములేకుండఁ గా నుండునట్లాచార్యులుగారు చేసిన శ్రమకొని యాడఁదగియున్నది. దీనివెల రు. 1—8—0.

(6) ఆయుర్వేదము. (7) అగస్త్యవైద్యము. (8) ఆయుర్వేదాంగశల్య తంత్రము. (9) వస్తికర్మము.

ఈనాలుగును వైద్యరహస్యములను దెలుపుచు వైద్యులకు సహాయమొన రింపఁదగి యున్నవి. ఒక్కొక్కదానివెల రు. 0—4—0 మాత్రము.

బాలనీతి:—ఇది, సికిందరాబాదులో మహబూబు కాలేజిలో నాంధ్ర పండితులుగానున్న చివుకుల, అప్పయ్యశాస్త్రిగారు రచించినది. ఇందు భగవ ద్భక్తి, మైత్రి, పరోపకారము మొదలగు వానిఁదెలుపు వ్యాసములు సులభశైలిని వ్రాయఁబడినవి. కావున నిది బాలులకుపయోగించునని మాయాశయము.

దీనివెల. రు 0—8—0.

ప్రకటన.

ఆంధ్రసాహిత్య పరిషత్తు, చెన్నపురి.

ప్రతిష్ఠాపకులు:—

శ్రీపిఠాపురము రాజాగారగు శ్రీరాజారావు వేంకటకుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు.

శ్రీవేంకటగిరిరాజాగారగు మహారాజా సర్-వెలుగోటి శ్రీరాజగోపాల కృష్ణయాచేంద్రబహద్దరుగారు, కె. సి. ఐ. ఇ., పంచహజారీమన్సబ్దార్.

అగ్రాసనాధిపతి:—

శ్రీపిఠాపురమురాజాగారు.

కార్యనిర్వాహక సభాధ్యక్షుఁడు.

మ-రా-రా-శ్రీ జయంతి రామయ్యపంతులుగారు, బి.ఏ., బి.ఎల్.

కార్యదర్శులు.

మ-రా-రా-శ్రీ పురాణం నాగభూషణంపంతులుగారు, ఎం.ఏ., బి.ఎల్.
,, ఆచంట లక్ష్మీపతిగారు, బి.ఏ., ఎం.బి., సి.ఎమ్.
,, నెమలి పట్టాభిరామారావు పంతులుగారు, బి.ఎ.

కోశాధ్యక్షులు (ట్రస్టీలు)

దివాన్ బహదూర్ కంచి కృష్ణస్వామిరావుగారు, సి.ఐ.ఇ.
రావుబహదూర్ పిట్టి త్యాగరాయ సెట్టిగారు, బి.ఏ.

కార్యస్థానము.

2/7 హారిస్ రోడ్డు, పుదుపేట.

చందానిర్ణయము.

పరిషదుద్దేశము:—ఆంధ్రశబ్దములకు సలక్ష్యవ్యుత్పత్తికముగ విపులనిఘంటువు రచించుట, తెలుఁగుభాష కితరభాషలతోఁగల సంబంధమును దెలుపుచు భాషాతత్త్వమును నిరూపించుట, శాస్త్రమును రచించుట, ఆంధ్రదేశపూర్వవృత్తాంతమును బ్రమాణపూర్వకముగా నిరూపించులక్షణశాస్త్రపారిభాషికపదముల నిర్ణయించుట, నూతనగ్రంథరచనకు సాహాయ్య మొనర్చుట, భాషావిషయములఁ జర్చించుటకుఁ బత్త్రిక నొకదానిని బ్రకటించుట, సమగ్రమగు పుస్తకభాండాగారము నేర్పఱచుట, ఇత్యాది విధముల నాంధ్రభాషావాఙ్మయాభివృద్ధికై యత్నించుట, పరిషత్తుయొక్క యుద్దేశము.

1.	ఉద్ధారకులకు	రు. 5000.
2.	పోషకులకు	,, 1000.
3.	యావజ్జీవసభ్యులకు	,, 100.
4.	సాధారణసభ్యులకు సంవత్సరమునకు	,, 6.

పరిషత్సభ్యులు పత్త్రికకు వేఱుగాఁ జరిదా నియ్యనక్కఱలేదు.

సభ్యులు కాఁగోరువారు కార్యదర్శుల పేర వ్రాసి పరిషన్నిబంధనలఁ దెప్పించుకొనవచ్చును.

విజ్ఞానచంద్రికాగ్రంథమాల.

ఆంధ్రులపౌరుషము! ఆంధ్రులయౌన్నత్యము!! ఆంధ్రులబుద్ధివైభవము!!

ఆంధ్రులచరిత్రము.

రెండవభాగము.

ఇందు క్రీ. శ. 1100 నుండి 1350 వఱకుఁగల ఆంధ్రదేశచరిత్ర వర్ణింపఁబడినది.

పురాణములు, కావ్యములు, శాసనములు, విదేశీయులవ్రాఁతలు, మొదలగువాని నన్నింటిని శోధించి తెలుఁగుచోడులు, నాగవంశోద్భవులైన మహారాజులు, కాకతీయచక్రవర్తులు, పల్నాటివీరులు, కమ్మవారు, రెడ్లు, వెలమలు మొదలగువారి చరిత్రలు, ఈ యుద్గ్రంథమునందు క్రోడీకరింపఁబడినవి.

రామానుజుఁడు, బసవేశ్వరుఁడు. నన్నెచోడ కవిశిఖామణి, ఖడ్గతిక్కన, కవితిక్కన, గణపతిదేవచక్రవర్తి, ప్రతాపరుద్రమహారాజు, మహారాణి రుద్రమదేవి మొదలగువారల పవిత్రజీవితములు శ్రద్ధతో వ్రాయఁబడినవి.

ఆయాకాలమందలి సాంఘిక, రాజకీయస్థితులు చక్కఁగ వివరింపఁబడినవి. ప్రదేశములయొక్కయు, కట్టడములయొక్కయు, పటములు కలవు.

పౌరుషమునందును, పాండిత్యాతిశయంబునందును రాష్ట్రపాలనయందును ఆంధ్రులు హిందూదేశములోని యితరదేశములవారికి తీసిపోవువారు కారని యీగ్రంథము సప్రమాణముగా సిద్ధాంతీకరించుచున్నది.

ఇట్టిగ్రంథము తెలుఁగులోఁగాని మఱియే యన్యభాషలోఁగాని యెవ్వరును రచించియుండలేదు.

విఖ్యాత లేఖకులగు శ్రీయుత చిలుకూరి వీరభద్రరావు పంతులుగారిచే నిది రచింపఁబడినది. 400 పేజీలు గలిగి మంచికాగితములమీఁద చిన్నయక్షరములతో ముద్రింపఁబడి చక్కని క్యాలికోబైండు చేయఁబడిన యీయమూల్యగ్రంథము మాచందాదారులకు పోస్టేజితో రు. 1—0—0 కును, చందాదారులు కానివారలకు పోస్టేజిగాక రు. 1—8—0 లకును ఇయ్యఁబడును.

☞ విజ్ఞానచంద్రికా బుక్కుడిపో యందు సంస్కృతాంధ్రగ్రంథములనేకములు దొరకును. వలయువారికి క్యాటలాగులు పంపఁబడును.

చిరునామా:—

ఆ. లక్ష్మీపతి, బి.ఏ., ఎం.బి. సి.ఎం.

మేనేజరు.—విజ్ఞానచంద్రిక,

చింతాద్రిపేట.—మద్రాసు.

చందా సం॥ కు రూ. 3—0—0.   విడిసంచిక రూ. 0—5—0.

సంపుటము 3. | ఆనందనామసంవత్సరము పుష్య, మాఘ, ఫాల్గునములు. | సంచికలు 10-11-12

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

ప్రతిమాసమునఁ గడపటివారములోఁ బ్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

ప్రధానవ్యాసములు.

1.	కాశ్మీరదేశచరిత్రము.	మేడేపల్లి వేంకటరమణాచార్యులు.
2	ప్రబోధచంద్రోదయ విమర్శనము.	మేడేపల్లి వేంకటరమణాచార్యులు.
3.	ఉపన్యాస విమర్శనము.	చివుకుల వేంకటాచలశాస్త్రి.
4.	రేఫఱకారనిర్ణయము.	తాళ్లపాక తిరుమలయ్య.
5.	చక్రవాళమంజరి.	తాళ్లపాక తిరుమలయ్య.
6.	పరిషత్పుస్తకభాండాగారము.	మల్లాది సూర్యనారాయణశాస్త్రి.
7.	విప్రనారాయణచరిత్రము.	చెదలవాడ మల్లయకవి.

చెన్నపురి.

విషయసూచిక.

1. కాశ్మీరదేశచరిత్రము. 401-408

మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు.

2. ప్రబోధచంద్రోదయవిమర్శనము. 409-424

మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు.

3. ఉపన్యాసవిమర్శనము. 425-429

చిలుకుల వేంకటాచలశాస్త్రిగారు

4. రేఫఱకారనిర్ణయము. 430-437

తాళ్లపాక తిరుమలయ్య.

5. చక్రవాళమంజరి. 438-440

తాళ్లపాక తిరుమలయ్య.

6. పరిషత్పుస్తకభాండాగారము. 441-448

మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు.

7. విప్రనారాయణచరిత్రము. 449-482

వెదల్వాడ మల్లయకవి.

నామములతో వ్యవహరింపఁబడుచున్న జాలంధరు లోహరదేశముల నేలురాజులు లలితాదిత్యునికిఁ బన్ను చెల్లించుచుండిరి. లలితాదిత్యునిక్రింద నుద్యోగులైనసాహి రాజు లనునొకతెగవా రుండిరి. నవమశతకాంతమువఱకు కాబూలు గాంధార దేశముల నేలిన తురుష్కకుటుంబమునకు సాహి యనుబిరుద ముండెనని కల్హణుఁడు చెప్పుచున్నాఁడు. ఈకుటుంబమువారిశాఖలు సింధునదీప్రాంతమందుఁ జిన్న జమీందారీల నేలినట్లు గ్రంథనిదర్శనము గానవచ్చుచున్నది. వీరుఁగూడ కాశ్మీర దేశరాజు శాసనమునకు లోబడి యుండిరనిచెప్పుట యనుచితముగా నుండునట్లు కానరాదు. అష్టమశతకారంభమందుఁ గొండఱు యవనులు ప్రబలి కాబూలుదేశముపై దండెత్తెద మని భయపెట్టుచుండిరి. ఆసమయమునందే సింధుదేశములో నుండు మహమ్మదీయరాజు లుత్తరముగా వెళ్లుటకుఁ బ్రయత్నించుచుండిరి. కాబూలు గాంధారదేశములయం దుండుసాహిరాజు లిట్లు నలుఁగడల శత్రువ్యాప్తియోగముచే క్షీతి నొందుచున్నపుడు లలితాదిత్యుఁడు తనరాజ్యమును విస్తరింపఁజేయుట కిదియే మంచిసమయ మని దిగ్విజయమునకు బయలుదేఱెను. ఈదిగ్విజయయాత్రాప్రసంగమునందే కాన్యకుబ్జేశ్వరునితోఁగూడ వైరము తటస్థించియుండును. లలితాదిత్యుఁ డిట్లు యశోవర్మ నోడించి జైత్రయాత్రాపరుఁడై భరతఖండము నంతయుఁ దిరిగెను. తూర్పుసముద్రతీరమందున్న కొన్ని దేశములను, దూర్పున, కటే వారు మొదలుకొని ఆఫగనీస్థానమువఱకును జయించెను. ఇదియును గావ్యముల యందుఁ గవులచే వర్ణింపఁబడిన పూర్వకాలపురాజుల దిగ్విజయములవంటిదే కాని దేశనామముల నాయాయిసమయములను జరిత్రకారుఁడు సరిగాఁ జెప్పకపోవుటచే దీనివలన వాస్తవచరిత్ర మేమియుఁ దేలదు. రాజు దండయాత్రనుండి స్వదేశాభిముఖుఁడై వచ్చునపు డుత్తరదిక్కున జరిగిన కొన్నిసంగతులు నిజ మయిన చరిత్రముతో సంబంధించి యున్నవి. లలితాదిత్యునిచే జయింపఁబడిన వారిలో తుఃఖారు లనుజాతివా రొకరు. ఈతుఃఖారుల దేశము బాడక్షాను అగ్జస్నదికి పైగా నుండు దేశమును గలిసియున్నట్టి ప్రాచీనమహమ్మదీయగ్రంథకర్తలకు నివాసస్థాన మయినట్టి తోకరిస్టా ననుట కేమియు సందియము లేదు. ఇదియే శంకుణుఁడనులలితాదిత్యుని మంత్రికి జన్మదేశము. అష్టమశతకమం దీదేశము తురుష్కజాతివారికి నివాసస్థాన మయియున్నట్లు మనకుఁ దెలియవచ్చుచున్నది. లలితాదిత్యునిమంత్రి తురుష్కజాత్యుత్పన్నుఁ డనుట కనేకోపపత్తులు గలవు. తుఃఖారజాతివాఁ డగుశంకుణుఁడు వాస్తవచరిత్రతో సంబంధించినవాఁ డని ఋజువు

చేయుట కతఁడు నిర్మించిన స్తూపమే గాక 759—763 సం॥ లలో గాశ్మీరదేశమును జూచి వచ్చిన ‘ఓకాం’ గను చీనాయాత్రికుఁ డితఁడు కట్టించిన వని చెప్పిన రెండుబౌద్ధవిహారములును జాలును. సేనాధిపతి యనునర్థమిచ్చు శుంగఙుఁ డనుశబ్దమొకబిరుదుగా నితనికి, చీనదేశస్థులచే నివ్వఁబడెను. ఇదియే తరువాత నితనిపేరుగా వాడఁబడెను. తురుష్కులచేఁ గాశ్మీరమం దనేకబౌద్ధవిహారములు కట్టింపఁబడిన వని చీనయాత్రికుఁ డగు ఓకాంగు తనయాత్రాచరిత్రమందు వ్రాసియున్నాఁడు. తురుష్కరాజకుటుంబమువారిచేఁ గాశ్మీరమందు స్థాపింపఁబడిన యనేకబౌద్ధపుణ్యస్థలములఁ గూర్చి ప్రశంసించినపు డెల్ల నాకాలపు కాశ్మీరపువారికిఁ దురుష్కజాతివారికిఁ గలిగియుండెడు నితరసన్నిహితసంబంధములను ఓకాంగు తనయాత్రాచరిత్రమందుఁ బలుచోట్ల వాక్రుచ్చియున్నాఁడు. ఈ తురుష్కరాజవంశపువా రెచట రాజ్యము చేసిరో నిశ్చయించి చెప్పుట దుర్లభము. ప్రకృతమందు మనకుఁ గలచరిత్రజ్ఞానముఁబట్టి యీతురుష్కనృపులు రాజ్యముచేసిన టోకరిస్థా ననుదేశము కాబూలునకు సింధునదికి నున్న పైభాగమునకు సమీపమం దున్నప్రదేశ మని మన మూహింపఁ గలము. ఈ తురుష్కజాతివారు నిర్మించిన నిర్మాణములు వీరి నామములు వీరిబిరుదములుగుఱించి చీనదేశపుయాత్రికుఁడు చెప్పినదానినిబట్టి యాలోచింపఁగా నాకాలమునాఁటికి వీరు నవీను లనియుఁ బ్రాయికముగా లలితాదిత్యుని రాజ్యపరిపాలనకాలమం దుండెడివా రనియు ఆర్కాక్ శాసనములవలనఁ దెలియఁబడుచున్నది.

పూర్వోక్తు లయినతురుష్కులను లలితాదిత్యుఁ డేదినమందు జయించెనో యాదిన మెల్లపుడు స్మృతిపథమున నుంచుకొనుటకుఁ గాశ్మీరదేశస్థులు ప్రతిసంవత్సరమందు దేశములో నుండుప్రతిగ్రామమున మహావైభవముతో నాదివసమున నొక గొప్పయుత్సవము జరిగించుచుండెడివా రని యాల్బ్యారూని వ్రాసియున్నాఁడు. ఈలలితాదిత్యుఁడు జగమంతయు జయించి యేలినట్లు కాశ్మీరదేశస్థులు వ్యవహరించిరి గాని యది సత్యము గా దని యాల్బ్యారూని ఖండించి యున్నాఁడు. తుఃఖారులు లలితాదిత్యునిచే నోడింపఁబడిన పిదప ముమ్ముని యనువానిని వారు శాసకునిగా నేర్పఱచుకొనిరి. తరువాత లలితాదిత్యుఁడు టిబెటు దేశస్థులను జయించెను. వీనిచే జీనదేశపు చక్రవర్తికడకు దూతగాఁ బంపఁబడిన యులిటో యనువాఁడు తనప్రభువు లలితాదిత్యుఁడు పలుమాఱు టిబెటును జయించియున్నట్లు చెప్పెనని చీనదేశస్తులు స్వదేశచరిత్రయందు వ్రాసిరి. మధ్యహిందూస్థానపురాజు యశో

వర్మను సహాయునిగాఁ గైకొని చీనాచక్రవర్తి యితనితోడ్పాటుకై పంపిన రెండు లక్షలపదాతిబలమును వెంటఁ బెట్టుకొని పోయి యాఁడబెరుదేశపు మార్గముల నుపరోధించి యాదేశస్థుల జయించి వచ్చెను. పిదప నీతఁడు దరదుల నోడించెను. దరదజాతివారు కాశ్మీరమునకుఁ బశ్చిమోత్తరముగా నుండుపార్వతీకప్రదేశములయందు నివసించి యుండువారు. దరదులను జయించిన వెనుక లలితాదిత్యుఁడు చేసినదండయాత్రలు పౌరాణికకథాకల్పములు. వానిలో విశ్వసనీయ చరిత్రాంశము లెవ్వియుఁ గానరాకుండుటచే నంతగణనీయములు గావు. ఉత్తరకురుభూములను, ప్రాగ్జ్యోతిషము, జాలంధరదేశము, త్రిగర్తదేశము, స్త్రీరాజ్యము (Land of Amazons) మొదలగుదేశములకు దండయాత్రలొనర్చినట్లు కల్హణుఁడు వ్రాసియున్నాఁడు. (శూన్యేప్రాగ్జ్యోతిషపురే విజ్ఞాహనం దదృశే సః । తద్యోధాన్వీగళద్ధైర్యాన్ స్త్రీరాజ్యే స్త్రీజనోఽకరోత్ । తుంగౌ స్తనౌ పురస్కృత్య సతు కుంభౌ కవాటినాం (గజానాం) । ఉత్తరాః కురవోఽవిశం స్త్వద్భయా జ్జన్మపాదపాన్) లలితాదిత్యుఁడు కట్టించిన భవనములు, దేవాలయములు, బౌద్ధవిహారములు ననేకము లయియుండెను. శిథిలావస్థనొందిన నిప్పటికిఁ గన్పట్టు కొన్నికట్టడములీరాజుకీర్తి నుద్ఘోషించుచున్నవి. మార్తాండతీర్థమం దితఁడు కట్టించిన మార్తాండాలయ మీకాలమందు పాడయిన ట్లున్నను దీనియందగపడు ప్రాచీనహిందూ శిల్పనైపుణి చూపఱమనస్సులను విస్మయాబ్ధిలో ముంచును. అన్నిటికంటె నెక్కుడాశ్చర్యము గలిగించునది జీర్ణమైన పరిహాసపురసన్నివేశము. ఈరాజు పరిపాలన కాలమందు నిర్మింపఁబడిన దేవాలయములు, వానిలోఁ బ్రతిష్ఠాపితము లయినదైవ ప్రతిమలు లోనగువానిని జూడఁగా నాకాలమందుఁ గాశ్మీరదేశములో మతాభిమానము దైవభక్తి యెంతమట్టుకు వ్యాపించియుండెనో యాసంగతి మన మూహించుకొనవచ్చును.

లలితాదిత్యుఁడు స్వర్గపదప్రాప్తుఁ డయినపిదప నల్పకాలములో ననఁగా క్రీస్తు వెనుక 759—763 సంవత్సరములలోఁ గాశ్మీరదేశముఁ జూడవచ్చిన ఓకాంగు (Chineese pilgrim) బౌద్ధమత మీదేశమం దానాఁటికి మిక్కిలి ప్రబలముగా నున్నట్లును, స్థూపవిహారసంఖ్య యగణేయ మయి యున్నట్లును జెప్పుచున్నాఁడు. లలితాదిత్యుఁ డొనర్చిన యనేకధర్మకార్యములలో లెక్కలేని స్తూపములును, విహారములను నిర్మించుటయే కాక గణనకు మీఱిన విష్ణ్వాలయములఁ

గూడ నిర్మించియున్నాఁడని కల్హణుఁడు వ్రాసినవ్రాఁత చీనయాత్రికుఁ డిచ్చినసాక్ష్యముతో సంవదింపుచున్నది. ఈరాజు బౌద్ధమతమతవిషయమయి చేసినమంచి పనులలోఁ బరిహాసపురమందుఁ గట్టించినవిహార మొకటి మిక్కిలి గొప్పది. దీనిలో బుద్ధుని ప్రతిమ యుంచఁబడినది. హుష్కపురమందుఁ గట్టించఁబడినవిహారము మఱియొకటి. ఇదియే చీనయాత్రికుఁ డిదేశమున కేతెంచినపుడు మొదట దిగిన బస. ఈ రెండువిహారములును గల్హణునికాలమున కున్నట్లీతఁడు రాజతరంగిణిలో వ్రాసినశ్లోకములే మనకు సాక్ష్యము. (చక్రే బృహచ్చతుశ్శాలం బృహచ్చైత్యం బృహజ్జినైః । రాజా రాజవిహారం స విరజా స్తతతోర్జితం (4—200) తేన హుష్కపురే శ్రీమాన్ ముక్తాస్వామీ వ్యధీయత । బృహద్విహారో భూపేన సస్తూపశ్చ మహాత్మనా (4—188) ఇట్టి లోకోత్తరచరిత్రుఁ డైన లలితాదిత్యుని గూర్చి కాశ్మీరదేశమం దనేకశ్లాఘాపర కల్పితకథలు బయలుదేఱిన వన్న దో నేమి వింత!

ఈతని లోకాతిశాయి ప్రతాపమును దెల్పెడు నిట్టికథలలోఁ గొన్నింటిని కల్హణుఁడు తనగ్రంథమందు సంగ్రహించి యున్నాఁడు. శంకుణుఁ డను తురుష్కమంత్రి రాజువిషయమయి చేసినకపటకర్మను గూర్చి చెప్పెడుకథ మిక్కిలి విచిత్ర మయినది. ఒకసమయమం దీలలితాదిత్యుఁడు దిగ్విజయమున కరుగుచుండఁ గ్రొత్తగాఁ గోయఁబడిన ముక్కునుండియుఁ జెవులనుండియు రక్తము కాఱుచున్న పురుషుఁ డొకఁ డడ్డముగాఁ జనుదెంచి యేడ్చుచు రక్షింపు మని యీతనిపాదములపైఁ బడెను. ఈరాజు వానిని జూచి కరుణార్ద్రమనస్కుఁ డై నీ కీయాపద యెట్లు సంభవించె నని యడిగెను. అందుకు వాఁ డి ట్లనియె. "నే నీసికతాసింధువునకు సమీపమం దున్న దేశము నేలెడు రాజుమంత్రిని. వైరిజనదుష్ప్రసహప్రతాపుఁ డగు లలితాదిత్యుని మ్రోల నమ్రతి వహింపు మని నే నుపదేశింప నామాట సరకుగొనక మిక్కిలి క్రుద్ధుఁ డయి న న్నిట్లు శిక్షించెను. ఆదురాత్ముని విషయ మయి పగదీర్చుకొనుటకుఁ గోరుచున్న నాకుఁ దోట్పాటు గావింపవలయును. ఆచెనటి వసించుపట్టణ మిచటికి మూఁడుమాసములు నడువఁదగిన దూరమం దున్నది. మన మొకవేళ శ్రమపడి యింతదూరమార్గము నడిచి వెళ్లిన నాసమయమున కాదుష్టుఁడు స్వస్థలమం దుండు నని యేమి నిశ్చయము! కావునఁ బదునై దుదినములలోఁ బోయి చేరఁదగిన దగ్గఱదారి యొకటున్నది. ఆమార్గముగుండ మనము పోవచ్చును. కాని యాత్రోవ నిర్జలమగుటచే సైనికు లందఱు కావలసినంత నీటిని సంగ్రహించుకొని బయలుదేఱుదురు గాక." దానికి లలితాదిత్యుఁ

డీయ్యకొని యాదిక్కునకు నడచుటకు నేపల కాజ్ఞ నొసంగెను. అందుపై సైన్యములు సికతాద్రైవ్రత మగునాఘోరమరుభూమియందు నడచి నడచి యొకపక్షమున కైన దరిఁ జేరలేకపోయెను. సైనికులచేఁ దేఁబడినజలము నరిపోయెను. మఱి యెచటను నీరు కాన రాలేదు. సైనికు లందఱు పిపాసాపీడితు లయి యిటు సైని మాప్రాణములు నిలువ వని మొఱ లిడసాగిరి. అప్పుడు లలితాదిత్యుఁ డామంత్రిని జూచి గమ్యస్థాన మిక నెంతదూర మని యడిగెను. దానికి వాఁడు మోమునందుఁ జిఱునగవు దోఁప రాజున కిట్లనియె. "ఓయి రాజా! నీకు నీ సైనికులకు నీవు నేది గమ్యస్థాన మనుకొంటివి? యమునిపట్టణమా? మారాజుపట్టణమా? స్వజీవిత నిరపేక్షి నై మారాజు హితము గోరి నిన్ను మృత్యుముఖమందుఁ బ్రవేశపెట్టుటకుఁ గపటోపాయము వన్ని యిట్లు తెచ్చితిని. ని న్నెవ్వ రిఁక రక్షింపఁగలరు?" అది విని రాజు మిక్కిలి కినిసి "ఓరి దురాత్ముఁడా, నీదు సంకల్పము నీతోడనే నశించునుగాత! ఇదిగోఁ జూడు నామహిమ" యని చెప్పి తనచేతిలో నుండు కుంతముచే భూమియందుఁ బొడిచెను. తోడనే యొకమహాజల ప్రవాహము పై కుబికి సైనికుల ప్రాణములను నిలువరించెను. అనంతర మీలలితాదిత్యుఁ డారాజుపురము సేరి వానిని వానిమంత్రితోఁ దుల్యావస్థునిగాఁ జేసి విడిచెను. ఇట్లుత్పాదిత మైన నదికిఁ గుంతవాహిని యని పేరు. (అద్యాపి కుంతవాహిన్యాః ప్రవహం త్యుత్తరాపథే) అని రాజతరంగిణీకారుఁ డానదిని దాఁ జూచినట్లు స్వగ్రంథమందు వ్రాసియున్నాఁడు.

ఈలలితాదిత్యుని మరణము విషయమయి యనేకు లనేకవిధములఁ జెప్పుదురు. వీనిలో వాస్తవ మెద్దియో తెలియఁజాలము. దండయాత్రాప్రసంగములో దూరముగా నుత్తరపుదిక్కునకుఁ బోయి యచట నారణ్యక మనుప్రదేశమం దత్యుత్కటహిమబాధచే మృతినొందె నని కొందఱు, ఉత్తరదిక్కును జయించుటకుఁ బోయి సైన్యమును విడిచి యొంటరిగా నొకపార్వతికమార్గమం దరుగుచుండ శత్రులచే నుపరుద్ధుఁ డై పరాభవభీతివలన నాత్మహత్య సల్పె నని మఱికొందఱును జెప్పుదురు. ఈకథల కవాంతరభేద మున్న నితఁ డుత్తర దిక్కునకు దాడివెడలి యచట మృతినొందె ననునంశములో నన్నియు నేకీభవించుచున్నవి.

ఇతనితరువాత సింహాసన మెక్కినరాజులు స్వల్పకాలము రాజ్యముచేసిన కొందు దుర్బలులు. వారిలో లలితాదిత్యుని జ్యేష్ఠపుత్త్రుఁ డగుకువలయాపీడుఁ డను

వాఁ డొకవత్సర మాత్రకాలము రాజ్యమునేలి పిదప విరక్తిచేఁ దీవ్రతపం బాచరించి సిద్ధినొందె నని చెప్పఁబడియున్నది. లలితాదిత్యుని మరియొకభార్యయందు జనించిన కనిష్ఠపుత్త్రుఁ డైన వజ్రాదిత్యుఁ డతిక్రూరుఁడు. భోగచాపల్యము గలవాఁడగుటచే నేడువత్సరములమట్టుకు రాజ్యముఁ జేసి రోగపీడచే మృతినొందెను. ఇతనియనంతర మీతనిపుత్త్రులు పృథ్వావ్యపీడుఁడు కనిష్ఠుఁ డగుప్రథమసంగ్రామపీడుఁడు నొకనితరువాత మఱియొకఁడు సింహాసనమునకు వచ్చిరి. కాని వీరిలో మొదటివాఁడు నాల్గుసంవత్సరములును రెండవవాఁ డేడుదినములును రాజ్యముఁ జేసిరి.

నాణెములఁబట్టి కాని తదితరలేఖన ప్రమాణములఁబట్టి కాని చరిత్రతో సంబంధించిన యేవిధ మయినప్రసిద్ధి లేనియీయల్పాయువు లయిన రాజులతరువాత వజ్రాదిత్యుని కనిష్ఠపుత్త్రుఁడు, కీర్తిప్రతిష్ఠలు గలవాఁడు చిరకాలము రాజ్యమేలినవాఁడు నైనజయాపీడుని వృత్తాంతము చరిత్రలోఁ దరుగఁ గనఁబడుచున్నది.

ఈజయాపీడుఁడు వీనితాత యగులలితాదిత్యునివలె గొప్పకీర్తిని సంపాదించినవాఁ డనియు, లోకస్తుతిపాత్త్రుఁ డయ్యె ననియుఁ గల్హణుఁడు చరిత్రములో విపులముగా వర్ణించి యున్నాఁడు. ఏతన్నామాంకితము లయిననాణెములు వాస్తవచరిత్రతో సంబంధించిన యిట్టిరాజొకఁ డున్నాఁ డని దృఢముగా ఋజువుచేయుటచే నీతఁ డుండె నని మనము నమ్మవలసివచ్చెను గాని లేనియెడల నితనినిగూడ రణాదిత్యుఁడు మేఘవాహనుఁడు మొదలగువారి తరగతిలోఁ జేర్పవలసి యుండును. ఇతనికి వినయాదిత్యుఁ డని నామాంతరము కలదు. కాశ్మీరమందును దత్ప్రాంతదేశములందు నిప్పటికి నచ్చటచ్చటఁ గనఁబడునవియుఁ గార్కోటకవంశజుల నాణెములఁ బోలినవియు మిశ్రలోహముచేఁ జేయఁబడినవియు నగునాణెముల పయి నీ రాజుపేరు గానవచ్చుచున్నది. ఈ జయాపీడుఁడు రాజ్యధురము దనభుజదండమందు వహించినతోడనే తాత యగులలితాదిత్యునికీర్తియందు స్పర్ధగలవాఁడువలె దిగ్విజయయాత్త్రకు బయలువెడలెను. కాశ్మీరద్వారమునుండి యితనిసైన్యములు వెలువడుచుండఁగా నెనుబదివేల కర్ణీరథములు లెక్కింపఁబడినవి. ఇట్లు జయాపీడుఁడు దూరదేశమునకుఁబోవఁజూచి యాతని భార్యాసోదరుఁడయిన జజ్జుఁడనువాఁడు సింహాసనము నాక్రమించెను. అంతట రాజుసైన్యములు కాలవిలమ్బ మగుటచే స్వదేశమునకుఁ బోవలె నని యిచ్చ పొడమి మఱియొక యడుగు నైనను ముందుకు వేయ మని రాజుతోఁ జెప్పి మరలసాగిరి. అనుయాత్త్రిక లయినరాజులను గూడ

వారివారిదేశములకుఁ బోవ నంపి సేనావియుక్తుఁ డయినను స్వానుభావమాత్రసహాయుఁడై తనప్రతాపమును దిక్కులయందుఁ బిక్కటిల్లఁజేయఁ దొడఁగెను. మితపరివారముతోఁ బ్రయాగకుఁ జని యచట లక్షగుఱ్ఱములను బ్రాహ్మణులకు దానమొసఁగెను. అక్కడఁ దనవెంట వచ్చినభటులను గూడ విడనాడి నానావేషములతో నిశీథసమయమం దేకాకిగా బయలుదేఱెను. వెళ్లి వెళ్లి జయంతుఁ డను గౌడరాజుచేఁ బరిపాలింపఁబడుచున్న పౌండ్రవర్ధన మనుపట్టణమును బ్రవేశించెను. అచటఁ గొన్నినాళ్లుండి పురజనుల కతిహింసక మయిన యొకసింహమును బరిమార్చుటచే నతిప్రీతుఁ డయిన యారాజుకూఁతుఁ గళ్యాణదేవి యనుదాని బెండ్లాడెను. జయాపీడుఁడు తనమామగారి శత్రువు లయిన గౌడదేశపురాజులను జయించి స్వదేశాభిముఖుఁడై పోవుచు మధ్యమార్గమందు సైన్యసమేతుఁ డయిన తనమంత్రి యగు దేవశర్మతోఁ గలసి కాన్యకుబ్జేశ్వరుని జయించి కాశ్మీరముఁ జేరెను. మూఁడు సంవత్సరములు నిష్కంటకముగా రాజ్యభోగముల నాస్వాదించిన జజ్జుఁడు శుష్కక్షేత్ర మనుప్రదేశమందు జయాపీడునితో బహుదినములు ఘోరముగాఁ బోరాడి నిహతుఁ డయ్యెను. జయాపీడుఁ డేస్థానమందు రాజద్రోహి యగుజజ్జునివధించి కళ్యాణముఁ బడసెనో యాస్థానమందుఁ గళ్యాణపుర మనుపట్టణము నొకదానిని గట్టించెను. ఇతనియాస్థానమందు వీరస్వామి యను మహాపండితు నుంచి విచ్ఛిన్నమయిన మహాభాష్యప్రవచనమును స్వదేశమందుఁ బ్రవర్తింపఁజేసెను. (ప్రావర్తయత విచ్ఛిన్నం మహాభాష్యం స్వమండలే క్షీరాభిధాచ్ఛబ్ద విద్యోపాధ్యాయాత్సంభృత(శ్రుతః) భట్టుఁడు ఉద్భటుఁడు లోనగుపండితులనుగూడఁ బోషించెను. (విద్వాన్ దీనారలక్షేణ ప్రత్యహం కృతవేతనః భట్టోఽభూ దుద్భట స్తస్య భూమిభర్తుస్సభాపతిః ఈ జయాపీడుఁడు క్రీస్తువెనుక. 751–782 సంవత్సరములలో రాజ్యముఁ జేసినట్లు కల్హణునిగ్రంథమువలనఁ గానవచ్చుచున్నది. లలితాదిత్యునివలె నితఁడు ననేకపరాక్రమచేష్టల నొనర్చె నని యనేకకథలు కల్పింపఁబడియున్నవి. ఈ రాజు సుమారు ముప్పదేండ్లు పరిపాలనముం జేసి కొన కుదయించిన దుష్టబుద్ధిచేఁ బ్రజలఁ బీడించి మృతినొందెను. పరమదుష్టు లయినకాయస్థుల కుట్రమాటలు విని ధనాశాపిశాచికాగ్రస్తుఁడై ధన మిమ్మని స్వదేశప్రజలను విశేషించి బ్రాహ్మణులను హింసింపఁ దొడఁగెను. ఇట్లు కొంతకాలము జరిగినపిదప బ్రాహ్మణు లతనివలనఁ గలుగుబాధ సహింపనోపక స్వదేశము విడిచి పరదేశమునకుఁ బోయిరి. మఱికొందఱు ప్రాయోపవిష్టు లయి మడిసిరి. తులమూల్య మనుబ్రాహ్మణాగ్రహారము

నితఁడు హరింపఁగా నావిప్రు లితనివద్దకు వచ్చి నీకిట్టిపని తగ దని పరుషముగా దూఱిరి. వారిలో నొకతపశ్శాలి యగు బ్రాహ్మణుఁడు “బ్రాహ్మణుల కిట్లు కోపము దెప్పించుట నీకు క్షేమకరము గా దని గద్దించి చెప్పెను. అందుపై నాదురాత్ముఁ డీకాలపు బ్రాహ్మణుల కోపమువలన నేమియనర్థము మాకు వాటి ల్లు ననెను. దాని కాబ్రాహ్మణుఁడు ‘ఇదిగో నాప్రభావమును జూపెదఁ జూడు” మని చెప్పి కాలితో భూమిని గొట్టి పూర్వపు ఋషులవంటివాఁడను నే నయినయెడల నీ ఖలుని యందు బ్రహ్మదండము పడును గావుత మని శపింపఁగాఁ దత్క్షణమే యాసభాగృహముయొక్క దూలము విఱిగి వానిపైఁ బడి గాయములు తగిలి కదలలేక మఱి కొన్నిదినములకుఁ జచ్చె నని కల్హణుఁడు వ్రాసియున్నాఁడు. జయాపీడుని మృతివిషయమై వాస్తవహేతు వేమైయుండినను గల్హణుఁడు చెప్పినదానిలోఁ గొంతసత్యమున్నట్లు మన మూహింపవచ్చును.

(సశేషము)

మేడేపల్లి వేంకటరమణాచార్యులు.

ప్రబోధచంద్రోదయవిమర్శము.

ఉపనిషత్తులు, పురాణములు, బ్రహ్మసూత్రభాష్యము లోనగు వానిచేఁ బ్రతిపాదింపఁబడునదియు న్యాయమీమాంసాదితరశాస్త్రజ్ఞానసహాయమువలనఁ గాని స్పష్టముగాఁ దెలియ శక్యము కానిదియు నగునద్వైతవేదాన్తశాస్త్రమును మన్దబుద్ధు లగువారు రుచిగలవా రయి సులభముగాఁ దెలిసికొని సంతోషించుటకు కృష్ణమిశ్రుఁ డనునామధేయముతోఁ బ్రసిద్ధి గాంచినయద్వైతాచార్యుఁ డొకం డయ్యద్వైతవేదాన్తసిద్ధాన్తము నంతయును గుణచమత్కృతితో నాటకరూపముగా రచించి జగమున కుపకార మొనరించెను. ఇట్టినాటకమునకుఁ బ్రబోధచన్ద్రోదయ మని పేరు. (ప్రబోధము = జ్ఞాన మనెడి) చంద్రునియొక్క యుదయము).

భాష్యాద్యనేకగ్రంథము లుండ నీ ప్రబోధచంద్రోదయమువలన నేమిప్రయోజనము? వేదాంతార్థబుభుత్సువు లగువారు మూలగ్రంథములనే చదివి జ్ఞానమును సంపాదించుకోనఁ జాలరా? యని కొందఱు ప్రశ్నింపవచ్చును. కాని వారిప్రశ్న మిటుల సమాధేయ మగును.

నాటకమందుఁ బ్రతిపాదింపఁబడునర్థ మంతయు నభినయప్రధాన మయినది గదా! ప్రబోధచంద్రోదయమందుఁ బ్రతిపాదింపఁబడు వేదాంతార్థమునకుఁ గల్గెడు ప్రాకట్యాతిశయము పరోక్షోపదేశపర్యవసాయు లగుభాష్యాది గ్రంథములయందుఁ గలుగ నేరదు. ఇంతియ కాక బ్రహ్మజ్ఞానసాధనము లగుశ్రవణమనననిదిధ్యాసనవస్తు విచారాదులు వేఱువేఱుగా నొక్కొక్కటియే చిరకాలాభ్యాసవశ్యములుగాఁ గానవచ్చుచున్నవి. అట్టిసాధనములకుఁ బ్రత్యక్షప్రయోగ ప్రదర్శనాత్మకమగునభినయమువలనఁ గాని విశదతమజ్ఞానము సంభవింపనేరదు. ఎట్లన; యాజ్ఞికుఁడు కల్పసూత్రాదులను బాగుగఁ జదివినవాఁడైనను యాగశాలలయం దాచరింపఁబడుచుండెడు శ్రౌతకర్మలప్రయోగముఁ దాఁ బ్రత్యక్షముగ నీక్షించినఁ గాని ప్రయోగకౌశలము నొందఁ జాలఁడు. మఱియును యోగి గురుముఖముగా యోగశాస్త్రముఁ జదివినను గురువుచేఁ బ్రత్యక్షముగఁ గనపఱచఁబడు స్వస్తికాద్యాసనబంధములఁ గన్నులారఁ జూచినఁ గాని యోగప్రావీణ్యముఁ బడయఁ జాలఁడు. అట్లనే ముముక్షువు గూడ వేదాంతశాస్త్రమును గూలంకషముగఁ జదివినవాఁ డైన

ను బ్రహ్మనిష్ఠులచే నభినీయమానం బగువస్తు విచారాదికముఁ బలుమాఱు ప్రత్యక్షీకరించినఁ గాని బ్రహ్మజ్ఞానసంపాదనసాధన పటిష్ఠుఁడు కానోపఁడు.

ఇది కాక దీనియందు మఱియొకవిశేషము గలదు. తైత్తిరీయోపనిషత్తు, (ఆనందవల్లి)

"తే యే శతం మానుషా ఆనందాః, సఏకో మనుష్యగన్ధర్వాణా మానందః। తే యే శతం మనుష్యగంధర్వాణా మానందాః। సఏకో దేవగంధర్వాణా మానందః।" అనుశ్రుత్యుక్తరీతిగ నుత్తరోత్తరశతగుణిత నిరతిశయానందరూపుఁ డగుపరబ్రహ్మయొక్క నిదిధ్యాసనమం దెట్టియానందభూయస్త్వము గలదో యట్టియానంద మంతయును మునుము న్నుపాసకునిబుద్ధి నారోహింపదు. కావునఁ దొలుతొలుత నేదో సజాతీయ మగునొకయానందము నవలంబించి క్రమక్రమము గా దాని నుత్తరోత్తరాతిశయసమ్పన్న మగుదానిగా ననుసంధించినయెడలఁ గొన కభ్యాసపాటవము కుదిరి పూర్ణబ్రహ్మానందము బుద్ధ్యారూఢం బగును. నాటకమం దభివ్యజ్యమాన మగుసజాతీయానంద మెద్దియన "లోకే ప్రమదాదిభిః కారణాదిభి స్థాయ్యనుమానేఽభ్యాసపాటవవతాం కావ్యే నాట్యే చ తై రేవ కారణత్వాదిపరిహారేణ విభావనాదివ్యాపారవత్త్వా దలౌకికవిభావాది శబ్దవ్యవహార్యైర్మమై వేతే। శత్రో రేవైతే। తటస్థ స్యైవేతే। న మ మై వై తే। న శత్రో రేవై తే। న తటస్థ స్యైవ వైత ఇతి సంబంధి విశేష స్వీకారపరిహార నియమానవసాయా త్సాధారణ్యేన ప్రతీతై రభివ్యక్తస్సామాజికానాం వాసనాత్మతయా స్థిత స్థాయీ రత్యాదికో నియతప్రమాతృగతత్వేన స్థితో ఽపి సాధారణోపాయబలా త్తత్కాలవిగళితప్రతినియతప్రమాతృతా వశో న్మిషిత వేద్యాంతరసంపర్కశూన్యాపరిమితభావేన ప్రమాత్రా సకలహృదయసంవాదభాజా సాధారణ్యేన స్వాకార ఇ వాభిన్నో ఽపి గోచరీకృత శ్చర్వ్యమాణతైకప్రాణో విభావాది జీవితావధిః పానకరసన్యాయేన చర్వ్యమాణః పుర ఇవ పరిస్ఫురన్ హృదయ మివ ప్రవిశన్ సర్వాఙ్గీణ మి వాలిఙ్గ న్నన్య త్సర్వ మివ తిరోదధ ద్బ్రహ్మానందాస్వాద మి వానుభావయ న్నలౌకికచమత్కారకారీ శృఙ్గారాదికో రసః" కావ్యప్రకాశిక. 4. ఉ. అని మమ్మటాద్యాలంకారికులచే నిర్వచింపఁబడిన రసమే. "రసో వై సః, రసగ్ హ్యేవా యం లబ్ధ్వా నందీ భవతి" అను శ్రుతివలన బ్రహ్మరసస్వరూపుఁ డని నిరూపింపఁబడుటచే ధ్యానావలంబనీభూతరసాభివ్యంజకము గావున నీ నాటక మావశ్యకము.

ఈ గ్రంథకర్త యొకపరమహంస. స్వాశ్రమధర్మప్రవర్తకుఁ డగుచు ననేక శిష్యులకు వేదాంతము నుపదేశించుచు దేశమం దంతట నద్వైతవేదాంతసిద్ధాంతమును వ్యాపింపఁజేసెను. ఈతనియొద్ద గ్రంథములఁ జదువుచుండెడి శిష్యులలో నొకని కద్వైతవేదాంతము బోధింపఁబడినను రుచింపక కావ్యనాటకాదులయం దధిక ప్రీతిఁ గలిగి యుండుట జూచి విచారించి వాని కెట్లైన నద్వైతమందుఁ బ్రవేశము గలిగించుటకు సంకల్పించి యద్వైతసిద్ధాంతము నంతయు శ్రీమద్భాగవతచతుర్థస్కంధములో 25, 26, 27, 28 అధ్యాయములలో నారదునిచేఁ బ్రాచీనబర్హి కుపదేశింపఁబడిన "పురంజనోపాఖ్యాన" మనుతత్త్వగ్రంథము ననుసరించి నాటకరూపముగా వ్రాసి యిచ్చె నని యొకయైతిహ్యము గలదు.

గ్రంథకర్త యీనాటకప్రస్తావనలో మణిమరీచిమంజరీ నీరాజితచరణకమలేన * * నరపతికుల ప్రళయ మహార్ణవ మగ్నమేదినీసముద్ధరణ మహావరాహేణ * * * * శ్రీమతా గోపాలేన" "యథా ఖ ల్వస్య సహజసుహృదో రాజ్ఞ శ్శ్రీకీర్తివర్మదేవస్య దిగ్విజయ వ్యాపారాన్తరిత * * "శ్లో" అస్తి ప్రత్యర్థి * * గోపాలో భూమి పాలాన్ ప్రసభ మసిలతామిత్రమాత్రేణ జిత్వా సామ్రాజ్యే కీర్తివర్మా నరపతితిలకో యేనభూయో ఒభ్యషేచి" "భ్రమద్భుజదండమందరాభిఘాత ఘూర్ణాత్సకలపత్తి సలిలసంఘాతం కర్ణసైన్యసాగరం నిర్మథ్య మధుమథనేనేవ క్షీరసముద్ర మాసాదితా సమరవిజయలక్ష్మీః" "యత స్సకలభూపాలకులప్రళయకాలాగ్నిరుద్రేణ చేదిపతినా సమున్మూలితం చంద్రాన్వయపార్థివానాం పృథివ్యా మాధిపత్యం స్థిరీకర్తు మయ మస్య సంరమ్భః" అని వ్రాసి యున్నాఁడు. ఇందువలనఁ గీర్తివర్మ యనునొకరాజుండె ననియు నాతని రాజ్యమును జేదిదేశపురాజగుకర్ణుఁ డనువాఁ డపహరింపఁగా నాకీర్తివర్మకు మిత్రుఁడు మహాపరాక్రమసంపన్నుఁడు మంత్రియు నగు గోపాలుఁ డనుబ్రాహ్మణుఁడు స్వనృపతిరాజ్యాపహర్త యగునాకర్ణునిఁ బరిమార్చి తనరాజయినకీర్తివర్మను దిరుగ రాజ్యాసనమందు స్థాపించె ననియుఁ జెప్పఁ దగు చరిత్రాంశము స్పష్ట మగుచున్నది. కాని యీకర్ణకీర్తివర్మ లేకాలమునాఁటివారో వీరితో సంబంధించిన చరిత్రాంశము లెవ్వియో వీ రేదేశములఁ బాలించిరో యాయంశములఁ దెలిసికొనుటకుఁ దగినసాధనము లీనాటకమందుఁ గాన రావు. కావున నిచట వారివృత్తాంతము నాంగ్లేయచరిత్రకారులు వ్రాసిన ప్రాచీనభరతవర్ష

చరిత్రమునుండి యథాప్రయోజనముగా సంగ్రహించి వ్రాయుట ప్రాప్తావసర మని యెంచి కొంచెము వ్రాయుచున్నాను.

రాజవంశోత్పత్తి కీర్తివర్మవృత్తాంతము రాజపుత్రు లని వ్యవహరింపఁబడు వారిలో గొందఱు పూర్వకాలమందు విదేశములనుండి యీభరతఖండమున కేతెంచి రాజపుత్రస్థానమందును (Rajaputana) గంగానది కుత్తరముగా నుండు దేశమందును జేరిరి. ఇట్లు చేరినవీ రీ హిందూదేశపు ప్రభువులతోఁ బోరిపోరి కొందఱు నిహతు లైరి. యుద్ధములలో హతశేషు లైనమఱికొంద ఱచ్చటచ్చటఁ జేరి బ్రతికి హిందూదేశపు జనసంఘములో క్షీరనీరన్యాయముగాఁ గలిసిపోయిరి. వీరి సంతతివా రిప్పటికి నసంఖ్యాతు లై దేశమం దంతటఁ గానవచ్చుచున్నారు. ఇట్లు విదేశములనుండి వచ్చి చేరినవీరును, వీరికంటె ముందు వచ్చి చేరినశకజాతివారు యూచిజాతివారు నాకాలమందుఁ బాలించుచుండెడి స్వదేశప్రభువులకుఁ లోఁబడి క్రమముగా వేషభాషలచేత నాచారములచేతను హిందువులుగా మాఱిపోయిరి. వీరు క్షత్రియు లని కాని రాజపుత్రు లని కాని వ్యవహరింపఁబడుచున్నవా రై హిందూదేశపాలకుల రాజ్యతంత్రమందు సైన్యాధిపత్యము మొద లగునున్న తోద్యోగములందు నియోగింపఁబడిరి. ఉత్తరహిందూస్థానమం దుండుపరిహారులు (ప్రతిహారులు) లో నగుననేకరాజవంశములవారు క్రీస్తు వెనుక నయిదవశతాబ్దమందు నాఱవశతాబ్దమందును భరతఖండమునకు గుంపులుగా విదేశమునుండి వచ్చి చేరిన పార్వతికజాతివారే యని చెప్పుటకు లేశము సందియము లేదు. అట్లనే దక్షిణమందుఁ గూడ గాండు (Gonds) భారు (Bhars) ఖార్వారు (Kharwars) మొదలగు పుళిందజాతులు హిందూజనసంఘమునందుఁ గలసి భ్రమరకీటన్యాయముగా వేషభాషలయందు నాచారములయందు హిందూజన సాదృశ్యాపన్నులయి కొంతకాలమునకు చాండేలు లనియు (Chandels) రాష్ట్రికోటు లనియు (Rathors) గహార్వారు లనియు (Gaharwars) వ్యవహరింపఁబడువా రై సూర్యవంశజుల మనియుఁ జంద్రవంశజుల మనియుఁ దమ్ముఁ దాము చెప్పుకొను క్షత్రియులుగాఁ బరిణమించిరి. వీరు నానాఁటికిఁ బలవంతు లై చిన్నచిన్నరాజ్యములను సంపాదించి యేలసాగిరి. అట్లు ప్రబలిన రాజపుత్రవంశములలో చాండేలు లనువా రొకవంశమువారు.

యమునానర్మదానదులకు మధ్య నుండుదేశమునకుఁ బూర్వకాలమందు జెజాకభుక్తి యని పేరు. అది ప్రకృతమందు బుందేల్ఖండు (Bundelkhand) అను

పేరు మోసియున్నది దీనికి దక్షిణముగా నుండువిశాల మయిన దేశమునకు బూర్వ కాలమందుఁ జేదిదేశ మని వాడుక. అది యిప్పుడు మధ్యపరగణా లకధికారి యగు కమిషనరు (Commissioner) పరిపాలనములలో నున్నది. పూర్వోక్తము లయిన జజాకభుక్తియను దేశమును చేదిదేశమును యథాసంఖ్యముగా చాండెలీవంశస్థులు కలచురీవంశస్థులను గొంతకాల మేలినట్లు మధ్యకాలపు చరిత్రమువలనఁ గాన వచ్చుచున్నది. ఈ యుభయవంశములవారును దమలోఁ దమకుఁ గలయానసంబంధముచేఁ గొంతకాలము పరస్పరమైత్రి గలవా రయి మఱికొంతకాలము కారణాంతరములచే నన్యోన్యవైరముగలవా రై యుండుట జగత్ప్రసిద్ధ మైనయంశ మని చరిత్రమునఁ దెలియ నగు. ఏకాదశాబ్ద శతకారంభమందుఁ జేదిదేశము రెండురాజ్యములుగా విభజింపఁబడినది. వానిలో మొదటిదానికిఁ బౌరస్త్య చేదిరాజ్య మనియు మహాకోసలదేశ మనియుఁ బేరు. దీనికి రత్నపురము రాజధాని. రెండవదానికిఁ బాశ్చాత్యచేదిరాజ్య మనియు దాహాలదేశ మనియుఁ బేరు. దీనికి త్రిపుర మనునగరము రాజధాని.

ఇతరక్షత్రియవంశములపేరువలెనే చాండెల్వంశపు క్షత్రియులపేరుఁ గూడఁ దొమ్మిదవశతాబ్దములోఁ బైకి వచ్చెను. ఈ చాండెలీవంశజులలోఁ బ్రథానుఁ డగు నన్నుచాండెలీ అనువాఁడు క్రీస్తు వెనుక 831 వ సంవత్సరములో నీ జజాకభుక్తి నేలుచున్న పరిహారప్రభువును రాజ్యమునుండి తొలగించి దానిదక్షిణభాగమునకుఁ దా రా జయ్యెను. నౌగానుకు ఛతర్పూరునకు మధ్య నున్న మాసహానీ యనునది పరిహారులనాఁడు. రాజధానిగా నుండెను. ఈపరిహారులకంటె ముందు రాజ్య మేలినవారు గహర్వారీరాజులు. తరువాత పీరివంశస్థులు రాష్ట్రకూటు లనుప్రసిద్ధ నామముతోఁ గాన్యకుబ్జము నేలిరి. మహోబా, కాలంజరు మొద లగుసుందర మైనపట్టణముల నిర్మించినవా రీ చాండెలీరాజులే.

హిందువులుగా మాఱినకాండుజాతివా రగు నీ చాండెలీరాజులు మొట్ట మొదట చతరీపూర్వద్ద నొకచిన్నరాజ్యమును సంపాదించి కాలక్రమమునఁ గాన్యకుబ్జమువఱకుఁ దమరాజ్యమును విస్తరింపఁజేసిరి. వీరిలో మొదటిరాజులు పాంచాలదేశాధిపతులయిన భోజమహేంద్రపాలులయొక్క యధికారమునకు లోఁబడి యుండిరి. కాని పదియవశతాబ్దముయొక్క పూర్వార్ధమం దీచాండెలీరాజులు స్వతంత్రరాజ్యమును స్థాపించిరి. 'హర్షచాండెలీ' అనువాఁడు మఱికొందఱ రాజులసహాయమును గూర్చుకొని క్రీస్తు వెనుక 916 వ సంవత్సరమందు రాష్ట్రకూ

టరా జగుమూఁడవ యింద్రునిచే దేశమునుండి పాఱఁదోలఁబడిన మహేంద్రపాలునికిఁ గాన్యకుబ్జరాజ్యమును దిరుగ సంపాదించుటకుఁ దోడ్పాటు గావించెను.

సంవత్సరశతముకంటె నెక్కుడు జీవించినవాఁ డని ప్రసిద్ధి గాంచిన యశోవర్మపుత్త్రుఁ డగుధంగరాజాహ్వయుఁ డీచాండెలీవంశములో మిగులఁ బ్రసిద్ధుఁడు. ఇతఁడు రాజ్యతంత్రప్రవీణుఁడు. ఖజురాహానగరమం దున్నగొప్పదేవాలయములలోఁ గొన్నింటిని నిర్మించినవాఁ డీతఁడే. ఇతఁడు 950—99 సంవత్సరములలో రాజ్యముఁ జేసెను. ఇతఁడు సుభక్తజీను నెదిరించుటకుఁ బాంచాలదేశపురా జగు జయపాలుఁడు గూర్చిన రాజసంఘములలోఁ జేరి ఘోరముగాఁ బోరాడెను. గజినీ మహమ్మదు హిందూదేశముపైకి దండెత్తి వచ్చినపుడు ధంగరాజుపుత్త్రుఁడగు గండరాజు (999—1025) జయపాలునికుమారుఁ డైన యానందపాలునిచేఁ బోగుచేయఁబడిన హిందూరాజసంఘమును జేరి గజినీమహమ్మదుతో యుద్ధముఁ జేసెను. దీనికిఁ బదిసంవత్సరముల తరువాత గండరాజుకొడుకు కాన్యకుబ్జముపైకి దండెత్తి వెళ్లి యాదేశపురా జైన రాజ్యపాలుని సంహరించెను. కాని 1023 వ సంవత్సరములో మహమ్మదుతోఁ జేసిన యుద్ధములోఁ బరాజితుఁ డై కాలంజరు దుర్గమును గోల్పోయెను.

ఈకాలమం దీగండరాజునకు సమకాలికుఁడు చేదిదేశమునకు రాజు నగు గంగయదేవకలచురి (1015—40) గొప్పబలవంతుఁ డై యుత్తరహిందూస్థానమందు రాజాధిరాజత్వమును సంపాదించుటకుఁ దగిన పుష్కలప్రయత్నముల నొనరించెను. 1019 వ సంవత్సరమందు వానియధికారము దూరదేశస్థు లయినరాజులచేఁ గూడ నొప్పుకొనఁబడెను. ఆతనితరువాత నాతనికుమారుఁ డగుకర్ణదేవుఁ డనువాఁడు తండ్రివలెనే సర్వదేశాధిపత్య సంపాదనమందుఁ బట్టుదల గలవాఁడై ఘూర్జరదేశపురా జైన భీమునితోఁ గలసి 1060 సంవత్సరములో మాళవదేశాధీశ్వరుఁడు మహావిద్వాంసుఁడు కవికల్పభూజము నని ప్రసిద్ధి నొందిన భోజనరేంద్రు నోడించెను. కాని కొన్నిసంవత్సరములు గడచిన పిమ్మట నీకర్ణదేవుఁడు భాగ్యదేవతాకటాక్షవైముఖ్యము వలన 1049—1100 సంవత్సరములలో రాజ్యముఁ జేసినకీర్తివర్మ చాండెలీచే నోడింపఁబడి రాజ్యపదభ్రష్టుఁ డాయెను. ఈకీర్తివర్మనామాంకితము లైననాణెము లిప్పటికి లభ్య మగుచున్నవి. ఈతనిచే సన్మానింపఁబడెడు కృష్ణమిశ్రుఁ డనునొక యద్వైతాచార్యుఁడు శాంతరసప్రధాన మగుప్రబోధచంద్రోదయ మనువేదాంతనాటకమును వ్రాసి దానిప్రస్తావనలో "నీతఁడు చేదిదేశపు

రా జగు కర్ణదేవుని జయించె. ననునంశమును సూచించెను. కాఁబట్టి యీనాటక కవి పదునొకండవ శతాబ్దమువాఁ డని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. "స్వకర్మాను గుణముగా ననేకశరీరముల ధరించువాఁడు గావున పురంజనుఁ డనఁగా జీవుఁడు. పురము శరీరము. ఇతని సఖుఁడగు నవిజ్ఞాతుఁ డనువాఁడీశ్వరుఁడు. అస్త్రీ తామస బుద్ధి. దానివెంట వచ్చుపదునొకండు భృత్యులు. ఏకాదశేంద్రియములు. ఐదు తలలుగలసర్పము, పంచప్రాణవృత్తి. పురమునకు నవద్వారములనఁగా శరీరముయొ క్క నవరంధ్రములు. మృగయావిహారమే విషయోపభోగము. కాలకన్యవార్ధక ము. దానిసైనికులు ఆధివ్యాధులు.

ఈశరీరమం దున్నజీవుఁడు తామసబుద్ధికి లోనయి సంసారమందుఁ దగిలి దారపుత్రాది సంగసుఖము స్థిర మని యెంచి కుటుంబపోషణమున కై నానావిధ తాపముల నొందుచు సుఖప్రదము లనుభ్రాంతిచే దుర్విషయముల సేవించుచు నరిషడ్వర్గమునకు జిక్కి లేశ మైనను సుకృతము జేయ నొల్లక పాపరతియై స్త్రీలచే గ్రీడామృగమువలె నాడింపఁబడుచుఁ బ్రమత్తుఁడై కాలముఁ బుచ్చుచుండఁ దుద కనేకవ్యాధులు శరీర మంతట నిండి పీడింపఁగా నాబాధ సహింపఁజాలక మృతి నొందును. నిర్యాణకాలమందుఁ దా నెద్ది స్మరించుచుఁ గళేబరము విడుచునో యది యైపుట్టును. ఆజన్మ మం దీశ్వరకటాక్షమునకుఁ బాత్రుఁడై సదాచార్యసమాశ్ర యణమువలన సంసారము హేయ మనియు భగవచ్చరణారవింద ముపాస్య మని యుఁ దెలిసికొని సంసృతిబంధవినిర్ముక్తుఁడగును." అని యీగ్రంథమునకు మూల మగు పురంజనోపాఖ్యానము తాత్పర్యసంగ్రహము.

ప్రబోధచంద్రోదయమందుంగు వేదాంతము.

నిస్సంగుఁడైన యీశ్వరుని కనాది యగుమాయతో సంగము గలుగఁగా మన స్సనెడితనయుఁ డుద్భవించెను. అతనికిఁ బ్రవృత్తి నివృత్తు లనెడువా రిద్దఱు భా ర్యలు. ప్రవృత్తియందు మహామోహాదు లుత్పన్ను లయిరి. నివృత్తియందు వివే కాదివర్గము జనించె. మహామోహునిభార్య మిథ్యాదృష్టి, దీనికి విభ్రమావతి యనునదిసఖి. చార్వాకుఁడు మహామోహుని మిత్రుఁడు. కామక్రోధలోభదం భాహంకారములు మహామోహుని మంత్రులు. రతి, కామపత్ని. హింసక్రోధ పత్ని. తృష్ణలోభపత్ని. దిగంబరుఁడు, భిక్షువు, క్షపణకుఁడు, కాపాలికుఁడు, బుద్ధ జినాదిమత ప్రవర్తకులు.

వివేకుఁడు ప్రధాననాయకుఁడు. ఇతనిభార్య మతి. వస్తువిచారుఁడు వివేకుని కింకరుఁడు. సంతోషము వివేకుని సహచరుఁడు. శాంతి వివేకభగిని. కరుణశాంతికి సఖి. మైత్రి సాత్త్వికశ్రద్ధకు సఖి. విష్ణుభక్తి యుపనిషత్సఖి. సరస్వతి విష్ణుభక్తి సఖి. క్షమ వివేకునిదాసి. సంకల్పవైరాగ్యనిదిధ్యాసములు మనస్సునకుఁ బుట్టినవారు. పురుషుఁ డుపనిషత్పతి. ప్రబోధచంద్రుఁడు పురుషపుత్త్రుఁడు.

పైనివ్రాయఁబడిన యిరుపక్కలవారును బరస్పరము ఘోరవైరముగలవారయి చిరకాల మొకరి నొకరు జయింపవలయు నని ప్రబలప్రయత్నముల గావించి కొనకు విష్ణుభక్తి సహాయమువలన వివేకుని పక్షము బలిష్ఠమయిన దగుటచే కామక్రోధలోభదంభాహంకార సహకృతుఁడగు మహామోహుని పక్షమునంతయు రూపు మాపి విజయము నొందెను. పురుషుఁ డుపనిషదధ్యయనమువలనఁ బొడమిన జ్ఞానముచే ముక్తుఁ డాయెను.

దీనియందుఁ బ్రతిపాదింపఁబడిన మతములు.

చార్వాక మతము.

దీనికి లోకాయతమనియు బృహస్పతిమత మనియుఁ బేర్లు. "అథలోకాయతం, పృథివ్యాపస్తేజో వాయురితితత్త్వాని, తేభ్య శ్చైతన్యం కిణ్వాదిభ్యో మదశక్తివత్" అని బృహస్పతిసూత్రము. ఈ మతమందు పృథివి, సలిలము, అగ్ని వాయువు" అని తత్త్వములు నాలుగు. కిణ్వాదులనుండి (సురాప్రకృతి ద్రవ్యము) మదశక్తివలెను గ్రముకఫలతాంబూలదళసుధాదులలోఁ బ్రత్యేకముగఁ బరీక్షించి చూచినఁ గానరానియరుణిమ తత్తదవయవిసంయోగ విశేషమువలని నుదయించునట్లు దేహారంభకపరమాణు సంశ్లేష విశేషమువలననే చైతన్య మావిర్భవించు ననియు, శరీరముతోడనే యాచైతన్యము నశించు ననియుఁ జెప్పుదురు. "యావజ్జీవం సుఖం జీవే న్నాస్తి మృత్యో రగోచరః । భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః । (మృత్యువశము నొందనివాఁ డెవ్వఁడును లేఁడు గావున మనుజుఁడు బ్రతికి యుండునంత కాలము సుఖముగ జీవింపవలెను. దహింపఁబడినశరీర మెట్లు తిరుగ రానోపు? అందుచేఁ గోరఁబడు నర్థకామములే పురుషార్థములు. అదృష్టము నలౌకికపురుషార్థము నగు మోక్షము నీమతస్థు లొప్పుకొనరు గావున నిట్లు సర్వలోకాభి మతార్థము నుపదేశించుటచే లోకులయం దాయతమయినది. (విస్తరించినది) గావున దీనికి లోకాయత మని పేరు. సురగురు వైన

బృహస్పతిచే నిది కల్పింపఁబడుటచే బృహస్పతిమత మనియు వ్యవహరింపఁబడు చున్నది. ధర్మాధర్మంబులు సుఖదుఃఖములచే ననుమేయములు కావు. మయూర ములకుఁ జిత్రవర్ణము వలె స్వభావమువలననే సుఖదుఃఖములు పొడమును. ఇహ లోకముకంటెఁ బర మగుస్వర్గనరకాదులు లేవు. శివలోకాదులు మూఢు లగు వారిచేఁ గల్పింపఁబడియె. ఇష్టభోగావాప్తియే స్వర్గము. వైరిశస్త్రాద్యుపఘా తమే నరకము.

ఆ ర్హ త మ త ము.

దీనికే జైనమత మని పేరు. ఈమతమందు జగత్తు కార్యరూపముగా నసత్యము, భిన్నము, ననిత్యము, కారణరూపముగా సత్యము, అభిన్నము, నిత్య ము. ఆత్మ దేహానురూప పరిమాణము గలది. ఈ మతస్థులు ప్రాణిహింసను మాని దిగంబరు లై, విషయవైరాగ్యము నవలంబించి దేహమునందు మలము బూసికొని పాణిపాత్రభోజను లై కేశోల్లుంఛనముఁ జేసికొని వాఙ్నియమము గలవా రై యుండవలయును. మలధారణాదికము వలనను, ఆత్మజ్ఞానము వల నను, ప్రకృతివినిర్ముక్తు లై యూర్ధ్వగతి ప్రాపించుటయే మోక్షము.

బౌ ద్ధ మ త ము.

దీనికి సౌగతమత మని మఱియొకపేరు. ఈ మతస్థులు నాలుగు తెగల వారు. 1. యోగాచారులు. 2. సౌత్రాన్తికులు. 3. వైభాషికులు. 4. మాధ్య మికులు. వీరిలో మొదటివా రగు యోగాచారులు జ్ఞాతృజ్ఞేయంబులవలన జ్ఞాన మొక్కటి జ్ఞాతృజ్ఞేయ జ్ఞానభ్రాంతిం గలిగింపుచున్నది. అదియును క్షణిక మని చెప్పుదురు. రెండవతెగవారు మూఁడవతెగవారు పరమాణు సంఘాతమే జగ మనియు, క్షణిక విజ్ఞానమే యాత్మ యనియుఁ బలుకుదురు. కాని వైభాషికులు జగము ప్రత్యక్షసిద్ధం బనియు, సౌత్రాంతికు లనుమానసిద్ధం బనియుఁ జెప్పు దురు. ప్రమాతృ ప్రమాణ ప్రమేయంబు లన్నియు శూన్యంబు లనియు శూన్య ముచేత శూన్యము నెఱుంగుటకంటెఁ బరమార్థంబు లేదనియు మాధ్యమి కుల మతము.

పా శు ప త మ త ము.

పాశుపతు లీశ్వరుం డనుమానానుగృహీత శైవాగమసిద్ధుం డనియు నతఁడ జగంబునకు నిమిత్తకారణుఁ డనియుఁ బరమాణువులె యుపాదానకారణం

బనియు, శైవాగమంబునఁ జెప్పఁబడిన కంఠిక, రుచకము, కుండలము, శిఖామణి, భస్మము, యజ్ఞోపవీతము నను నాఱుముద్రలను ధరించుటయు, సురాకుంభస్థాపనంబును, సురాకుంభస్థదేవతార్చనంబును, గూఢాచారంబును, శ్మశానభస్మస్నానంబును, ప్రణవపూర్వకధ్యానంబును, మొదలగు కర్మలచే నణుస్వరూపుం డగుజీవునకు గలమలమయకర్మ తిరోధానము నివర్తించఁగా శివసారూప్యంబు నొందుటయె మోక్షం బని చెప్పుదురు.

నైయాయికవైశేషికమతము.

ఈశ్వరుఁడు నిమిత్తకారణము. అట్టియీశ్వరుఁ డున్నాఁ డనుటకు జగము సావయవము గావున ఘటాదులవలెనే పుట్టినది. జనిమత్తయిన దంతయు దానియుపాదానోపకరణసంప్రదాన ప్రయోజనాదు లెఱింగినవానిచేతనే చేయఁబడుట కానవచ్చుచున్నది. కాఁబట్టి జగము నిర్మించు నేర్పుగలవాఁడును కర్మపరవశులై పరిమితజ్ఞానముగల జీవులకంటె విలక్షణుం డగునొకఁడు సర్వజ్ఞుఁ డుండవలయు నను ననుమానంబు సాధకము. అనాదికర్మప్రవాహంబున సుఖదుఃఖానుభవం బనుసంసారముం జెందియున్న జీవులలో నొక్కొక్కం డెవ్వఁడేని యీశ్వరప్రీత్యర్థంబుగా వేదోక్తకర్మంబుల నాచరించుచుం దత్ప్రసాదులబ్ధం బైన యష్టాంగయోగంబున నాత్యంతిక దుఃఖనివృత్తి యనుమోక్షంబుఁ బడయును. ఆత్యంతికదుఃఖనివృత్తి యనఁగా మఱియెన్నఁడుఁ బుట్టకుండ దుఃఖము మళ్లిపోవుట యని నైయాయికవైశేషికమతము. జ్ఞానసుఖదుఃఖాదు లెవ్వియు నుండవు గావున నిది పాషాణముక్తి యని వీ రందురు.

పూర్వమీమాంస.

వీరుభాట్టు లనియుఁ బ్రాభాకరు లనియు రెండువిధములు. ఆత్మముల కనాదికాలమునుండియుఁ జేయంబడు పుణ్యపాపరూపకర్మప్రవాహంబున సంసార మనాదిగా నున్నది. ఒక్కకాలంబున సృష్ట్యాదులు నొకకాలంబునఁ బ్రళయంబునుం గలుగదు. కర్మములలో నిషిద్ధకర్మంబులఁ జేయువారు వానిప్రాబల్యతారతమ్యంబునం గ్రిమికీటాదిజన్మంబులును, నరకంబును జెందుదురు. కామ్యకర్మంబులఁ జేయువారు వెండియుం బుట్టుచుందురు. వేదవిహితంబు లగు యజ్ఞాదికర్మంబుల ఫలాభిసంధిరహితంబుగా నాచరించినయెడల దత్కార్యాచరణంబున నుద్భవిల్లు నపూర్వంబె కర్మసమ్బన్ధ నివృత్తిపూర్వకం బగు కేవలాత్మప్రాప్తి

యనెడుమోక్షంబు గలిగించును. అప్పుడు నిత్యసుఖాభివ్యక్తి యగును. చతుర్థ్యంత వినియోగంబె దేవత యని వ్యవహరింపఁబడును గాని ఫలము నిచ్చు దేవత యనుచేతనుం డని యుభయులును జెప్పుదురు.

అ ద్వై త ము.

నిర్విశేషచిన్మాత్రం బగుబ్రహ్మం బొక్కటియే పరమార్థము. తదతిరిక్తంబు లగుజ్ఞాతృజ్ఞేయజ్ఞానభేదంబులు లేవు. నిర్విశేష మనఁగా సకలవిశేషరహితము. విశేష మనఁగా భేదము. అది సజాతీయవిజాతీయస్వగతభేదము లని మూఁడువిధములు. వీనిలో సజాతీయభేద మనఁగా నొకజాతి వయిన ఘటాది వస్తువులలో నొకదానితో మఱియొకవస్తువునకుఁ గలభేదము. చిద్బ్రహ్మలభేదము సజాతీయభేద మనంబడు, చిత్తు లనంబడుజీవు లెల్ల బ్రహ్మంబుకంటె వేఱు గాదు. కాన నిట్టిచిద్బ్రహ్మభేదంబు లేదు. అచిత్తనంబడునవిద్య యను నొక విజాతీయవస్తువు గలదు. అది హేయవస్తువు. దానిసమ్బంధమువలన బ్రహ్మమునకు జీవిత్వంబు గలిగె. ఈ యవిద్యకు మాయ యనియు, ప్రకృతి యనియు నచిత్తనియు నామాంతరములు. ఇది యనాది. దీని కావరణశక్తి యనియు విక్షేపశక్తి యనియు రెండుశక్తులు గలవు. ఇది యీశక్తిద్వయముచే జీవులకు స్వస్వరూపంబు గానరా కుండఁ జేసి నానావిధ భేదభ్రాంతులను గలిగించుచున్నది. అట్లుండియు నది మిథ్యాభూతంబు గాన నచిద్బ్రహ్మభేదం బనువిజాతీయభేదంబుం గలుగదు. సచ్చిదానందఘనస్వరూపం బగుబ్రహ్మమునకు స్వరూపముకంటె వేఱుగా సత్తాజ్ఞానానన్దాదిగుణములు లేవు గాన స్వగతధర్మభేదంబును లేదు. అట్టియవిద్యచేత భ్రమనొందుచుండుటయే జీవునకు సంసారము. తత్త్వమస్యాది వాక్యజన్యజ్ఞానంబున నవిద్య నివర్తిల్లుటయే మోక్షము.

మ ధ్వ మ త ము.

ఈశ్వరుండు జగంబునకు నిమిత్తకారణుఁడు. అతండె విష్ణువు. అతఁడనంతకల్యాణగుణపరిపూర్ణుండు, జ్ఞానానందాద్యాత్మక కల్యాణ విగ్రహవిశిష్టుండు. జీవు లణుస్వరూపులు. వారలు తమోయోగ్యులు. నిత్యసంసారులు ముక్తియోగ్యులు నని మూఁడుదెగలవారు. అందు ముక్తియోగ్యు లగువారి కిహాముత్ర ఫలభోగవిరాగాది విష్ణూపాసనాంత సాధనసంపత్తివలన యోగ్యాపరోక్షజ్ఞానంబు గలిగిన నందు వలనం దత్తత్స్వరూపయోగ్యం బగునానందం బావిర్భవించు నని చెప్పుదురు.

ఈ నాటకమునకుఁ గృష్ణదేవరాయలమంత్రి యగుసాళ్వతిమ్మరాజు (తిమ్మరసు) నకు భాగినేయుఁ డగునాదెళ్ల గోపనమంత్రిచే రచింపఁబడిన చంద్రిక యనువ్యాఖ్యాన మొక్కటియు భట్టవినాయకాత్మజ దీక్షిత రామదాసవిరచితం బగుప్రకాశ యనువ్యాఖ్యాన మొకటియు నచ్చుపడి యున్నవి.

ఆంధ్రీకరణము.

ఈ ప్రబోధచంద్రోదయముఁ దెలిఁగించిన కవులు నందిమల్లయ్య ఘంట సింగయ్య యని లోఁగడ బేర్కొని యున్నాను. ఈయిరువురు కవులు కలిసియే గ్రంథములను వ్రాయుచు వచ్చిరి. వీరు రచించిన మఱి యొకగ్రంథము వరాహ పురాణము. దీనిని వీరు కృష్ణదేవరాయల తండ్రి యైననృసింహరాజున కంకిత ముఁ జేసిరి. ఈ ప్రబోధచంద్రోదయము ననంతామాత్యునిపుత్త్రుఁ డయినగంగ య్యామంత్రికిఁ గృతి యిచ్చిరి. ఈయుభయులలో మొదటివాఁ డైననందిమల్ల య్యకు రెండవకవి యైనఘంట సింగయ్య భాగినేయుఁడు. ఘంటసింగయ్యకు మలయమారుతకవి యని బిరుదు గలదు. వీ రిరువురకును గలబంధుత్వము ప్రబోధచంద్రోదయములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

సీ. కలఁడు కౌశికగోత్రకలశాంబురాశిమన్దారంబు సంగీతనందినంది
సింగమన్త్రికిఁబుణ్యశీలపోతమ్మకు నాత్మసమ్భవుఁడు మల్లయమనీషి
యతనిమేనల్లుఁ డంచితభరద్వాజగోత్రారామచైత్రోదయంబు ఘంట
నాగధీమణికిఁబుణ్యచరిత్రయమ్మలాంబకు గూర్మితనయుండు మలయమారు
గీ. తాహ్వయుఁడు సింగనార్యుండు నమృతవాక్కు లీశ్వరారాధకులు శాంతు లిలఁబ్రసిద్ధు
లుభయభాషలనేర్పరులు పమరులున,మర్థు లీకృతిరాజ నిర్మాణమునకు.

వీరు స్వప్రణీతప్రబన్ధముల యాశ్వాసాంత గద్యములలో గూడ నుభయ నామములను జేర్చి

"ఇది శ్రీమదుమామహేశ్వర ప్రసాదలబ్ధ సారస్వతాభినందినంది సింగ యామాత్యపుత్త్ర మల్లయ మనీషితల్లజ మలయమారుతాభిధాన ఘంటనాగయ ప్రధానతనూభవ సింగయ కవిపుంగవ ప్రణీతంబయిన"

అని వ్రాసికొని యున్నారు. వీ రిద్దఱును నియోగిబ్రాహ్మణులు. వీరిలో మొదటివాఁడయిన నందిమల్లయ్య కౌశికగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు. దక్షిణామూర్తిశిష్యుఁడు. రెండవవాఁడైన ఘంటసింగయ్య భరద్వాజగోత్రుఁడు. ఆప

_స్తంబసూత్రుఁడు. అఘోరశివశిష్యుఁడు. వీరు రచించిన వరాహపురాణమందీ యంశములనే యిట్లు వ్రాసియున్నారు.

"సీ. అపుడు సభావేది కాగ్రస్థితుల మైన మమ్ము వాగీశ్వరీమంత్రరాజ
సిద్ధిపారగుల కౌశికభరద్వాజ గోత్రుల మహాదేవాంఘ్రిజలజభక్తి
పరతంత్రమతుల నాపస్తంబసూత్రుల గురుదక్షిణామూర్త్యఘోరశివుల
శిష్యులనతికాన్త చిత్తులఁ దనకునాశ్రితుల భాషాద్వయకృతి నిరూఢ

గీ. శేముషీభూషణుల నందిసింగనార్య, తనయుమల్లయకవికులోత్తమునిఘంట
నాగధీమణికూర్మినందనుని మలయ, మారుతాంకితు సింగయ్యమంత్రిఁ జూచి.

వ రా హ పు రా ణ ము.

ఈ కవులు వరాహపురాణమునందుఁ గృతిపతియైన సాళువనృసింహరాజు యొక్కవంశమును వర్ణించుచుఁ జంద్రవంశపురాజయినగుండరాజునకు సాళువ మంగరాజును, ఆతనికి గౌతరాజు నమ్మహీపతికి గుండరాజు నానరపాలునికిఁ దిమ్మ రాజును జైమినిభారతము గృతి నందిన నరసింహరాజును జనియించినట్లును, వరాహపురాణమును గృతినందిన సాళువ నరసింగరాజు తండ్రి యైన యీశ్వరరాజు పైని వ్రాయఁబడిన నరసింహరాజువద్ద సేనాధిపతి యై యుండినట్లును వీరిది తుళువవంశమయినట్లుఁ జెప్పియున్నారు.

ఈ తిమ్మయ యీశ్వరరాజు సాళువ గుండనరసింహరాజునకు సేనానాయకుఁడై యుండుటయే కాక దాయాదుఁడు కూడనై యుండుటచే నాతనియనంతరము రాజ్యభారమును వహించినట్లు గ్రంథనిదర్శనమువలన గానవచ్చుచున్నది. వరాహపురాణమును గృతి నందిన నరసింహరాయనికాలము మనకుఁ దెలియును గనుక, యించు మించుగా నీకవులకాలమును మనకుఁ దెలియును. కృష్ణదేవరాయల తండ్రి యైన యీనరసింహదేవరాయలు క్రీస్తు శకము. 1487 వ సంవత్సరము మొదలుకొని 1502 వ సంవత్సరమువఱకు రాజ్య మేలినట్లు శాసనాదులవలనఁ దెలియవచ్చుచున్నది. కాఁబట్టి నరసరాయలకాలములో నున్న యీకవులు హూణశకము. 1487 వ సంవత్సరమునకును 1502 వ సంవత్సరమునకును మధ్యకాలమునందీ ప్రబంధములను రచియించి రని యూహింపవచ్చును. ఈ యిరువురు కవులును గలిసి గ్రంథరచనఁ జేసినట్లు చెప్పఁబడియున్నను. వీరిలో మలయమారుతకవి యనఁబడెడు ఘంటసింగన్నయే ప్రసిద్ధతరుఁడై నకవి యైనట్లు గ్రంథాంతరనిదర్శనమువలనఁ దెలియవచ్చుచున్నది. ఈ సింగయ్య తండ్రి నాగయ్య; తల్లి, అమ్మలాంబ. పారి

జాతాపహరణమును రచియించిన ముక్కు తిమ్మకవి యీమలయమారుత కవికి మేనల్లుఁడైనట్లు పారిజాతాపహరణ ప్రబంధముఖమందు ముక్కు తిమ్మకవియే వ్రాసి యున్నాఁడు.

"సీ. కౌశికగోత్రవిఖ్యాతుఁ డాపస్తంబసూత్రుఁ డార్వేలపవిత్రకులుఁడు
నందిసింగామాత్యునకును దిమ్మాంబకునుదనయుండు సకలవిద్యావివేక
చతురుండు మలయమారుతకవీంద్రునకు మేనల్లుండు కృష్ణరాయక్షితీశ
కరుణాసమాలబ్ధఘనచతురంతయాన మహాగ్రహారసన్మానయుతుఁడు
గీ. తిమ్మయార్యుండు శివపరాధీనమతియ, ఘోరశివగురుశిష్యుండుఁ బారిజాత
హరణ మనుకావ్య మొనరించె నంధ్రభాష,నాదివాకరతారాసుధాకరముగ.

పారిజాతాపహరణము.

ఇట్టి వీరు దృశ్యకావ్య మైన ప్రబోధచంద్రోదయమును శ్రవ్యకావ్యముగా నాంధ్రీకరించియున్నారు. నాటకమును మార్చి ప్రబంధముగా వ్రాయుట కావశ్యక మైన మార్పులఁ జేసియున్నారు. కాని యచ్చటచ్చట మాతృకలో సంగ్రహముగా నున్నయభిప్రాయములఁ గొంతమట్టుకు విస్తరింపఁజేసి యు మఱికొన్ని స్థలములయందు విస్తృతముగా నున్న యభిప్రాయములను సంగ్రహింపఁజేసి యు నాంధ్రీకరించి యున్నారు.

ఎట్లన ; నఖలు ప్రయోజనం కారణం వా విలోక్యమాయా ప్రవర్తతే । స్వభావః ఖల్వయం స్త్రీపిశాచీనాం । పశ్య॥ శ్లో॥ సమ్మోహయన్తి రమయన్తి విషాదయన్తి నిర్భర్త్సయన్తి మదయన్తి విడంబయన్తి । ఏతాః ప్రవిశ్య సదయం హృదయం నరాణాం కిం నామ వామనయనా న సమాచరన్తి॥

గీ. అరయ నాతఁడునిర్లేపుఁడగుటహానిఁ, బొరయఁడిమాయ కావించుబూటకములు
పాయ కెప్పుడు పురుషుల భ్రమల నిడుట, సహజ మింతియ నారీపిశాచములకు.

సీ. వన్నెలు పచరించి కన్నుసన్నలు చేసి వెడమాటలను బ్రేమ గడలు కొలిపి
తరటీపునటనలఁ దమకంబు పుట్టించి వట్టిప్రియంబుల గుట్టు తెలిసి
కలికితనంబునఁ గాఁకలు గావించి తోడిసీడలు వోలెఁ గూడిమాడి
యలుకుల నలయించి కలయిక వలపించి బాసల నడియాన పాడుకొల్పి
తే. మనసుకరఁగించిభ్రమయించిమస్తరించి,మిగులజొక్కించియెంతయుఁదగులుపఱిచి
పాసి యెడఁబాసి తమబంటుఁ జేసికొనరె, వామలోచన లెంతటివారి నైన.

ఈపద్యములో మూలములో లేని మఱికొన్నింటిఁ గూర్చియున్నారు.

నాటకాదియందలి రెండుశ్లోకముల యర్థమును "ఎఱుఁగని వానికి దేవుఁడు" అను సీసపద్యమున సంగ్రహించిరి.

2. (శ్లో) నిహతస్య పశో ర్యజ్ఞే స్వర్గప్రాప్తి ర్యదీష్యతే।
స్వపితా యజమానేన కిం న తస్మా న్నిహన్యతే॥

ఈ శ్లోకమున కాంధ్రీకరణము కాన రాదు.

3. చార్వాకమతమం దీకవులు "పృథివ్యప్తేజోవాయ్వాకాశంబు లే తత్త్వంబులు" అని వ్రాసియున్నారు. చార్వాకమతమం దాకాశమను భూతము లేదు, ఆమతస్థులు నాల్గు భూతముల నే యొప్పుకొన్నారు.

4. మహామోహః. భో అసత్సంగ ఆదిశ్యంతాం కామక్రోధలోభమదమానమాత్సర్యాదయః యథా యోగినీ విష్ణుభక్తి ర్భవద్భి రే వావహితై ర్వహంతవ్యేతి.

యోగిని యగువిష్ణుభక్తిని సంహరించుటకుఁ బ్రయత్నము సల్పు మని మహామోహుఁడు కామక్రోధాదుల కసత్సంగునిద్వారా వర్తమాన మంపినట్లు మూలములోనున్నది. తెలుఁగులో "కామక్రోధాదు లెదుట నున్నట్లును, వారితోనే మహామోహుఁడీవార్త చెప్పినట్లున్నది.

5. " మ. పడఁతీ తల్లిని దండ్రిఁ జంపుట తృణప్రాయంబు తోఁబుట్టులన్
మడియం జూచుట లెక్కగా దనిన జన్మజ్ఞాతికీటంబులన్
గెడపం బూనుట నాకు దొడ్డ గుడ్రిమింగేవానికిం దల్పుల
ప్పడము ల్లాపునఁ బిల్లపిల్లతరము న్భక్షింతు దాయాదులన్

మూలములో లేని లోకోక్తి నొకదాని నిందులోఁజేర్చిరి.

9. మూఁడవయాశ్వాసములోఁ గాపాలికుఁడు చెప్పుచున్నాఁడు.

సీ. పుట్టింప రక్షింపఁ బొలియింపఁ గర్తయౌ భైరవేశ్వరుఁడు మాపాలివేల్పు
ప్రమద నటద్భూతభయదశ్మశాన శృంగాటకంబులు మాకు నాటపట్లు
నక్షత్రపటలీవిశేషంబు లైననరాస్థిఖండములు మాహారతతులు
నీహారకరబింబనిభమానవశిరః కపాలము ల్మాభుక్తిభాజనములు

గీ. గాఁ జరింతుముతమలో జగంబు లెల్ల, వేఱు వేఱైనశివునితో వేఱుగావ
టంచుఁ జూతుము సిద్ధయోగాంజన ప్రదీపితం బైనసుజ్ఞాన దివ్యదృష్టి.

పైని వ్రాయఁబడిన పద్యమున కీ క్రింద నున్న శ్లోకము.

మూలము. శ్లో. నరాస్థిమాలాకృతభూరి భూషణ శ్శ్మశానవాసీ నృకపాలభోజనః
పశ్యామియోగాంజనశుద్ధదర్శనో జగన్మిథోభిన్నమభిన్నమీశ్వరాత్‌।

ఇట్లు పలుచోటుల వీరిభాషాంతరీకరణమందు వైషమ్యము కాన వచ్చుచు న్నది. కాని గ్రంథవిస్తరభయమువలన వాని నన్నింటి నిచటఁ జూపుట మానితిని.

శైలి.

శైలికదళీపాకము. కవిత్వము రసవంతముగా నున్నది. 1 అచ్చటచ్చటఁ గొన్నిమామూలపదములు ప్రయోగింపఁబడినను జదువువారికి సులభము గా నర్థ మగును. 2 కొన్నిచోట్లసంధులు పదప్రయోగములు విలక్షణముగాఁ గానవచ్చు చున్నవి. 3 ఈకవులు తమపద్యములలో విరళముగా లోకోక్తులను వాడియున్నారు.

1 ఇందులోని యపూర్వపదములు.

1 సురతాణి. 2 మోస (మోసము) 3 అడవోడ. 4 ఎడమపెని. 5 నల్ల మేకతప్పు. 6 సంబెళ. 7 సాహెూ. 8 కటికవారు. 9 విరాకులవిత్తు. 10 గాణు. 11 కరవేదన. 12 ఇవతాళించు. 13 వరాళి. 14 కోయిలతోత్తులమిూరి. మొ దలగునవి.

వీనిలో విరాకులవిత్తు, వరాళి యనుపదము లేనిఘంటువునందును గాన రావు.

2. ప్రయోగములు = అణగుగడె. 2 బంపైనకవి నీకుఁ బదివేల దండాలు. 3 గుడి ప్రమింగేవానికి. 4 చాలదినాలనుండి. 5 గూడితంటరాకు. 6 ఒడిసివడిన్నె గయు గృధ్రియుంబలెనన్నున్‌. 6 ఊరక వేదాలు నోరికొలఁది.

3. వీరు రెండుమూఁడుపద్యములలో లోకోక్తుల నిమిడ్చిరి.

1. సీ. ఏమిరా తాఁ జెడ్డకోమటి వెనకయ్య చేతికి వెసల యిచ్చిన విధమున.

2. రెండిటికిని జెడినరేవఁడవై వృథాఁబోడవైతి వెందుగూడవైతి.

3. గుండిప్రమింగేవానికిం దల్పులప్పడముల్గావున.

మేడేపల్లి వేంకటరమణాచార్యులు.

ఉపన్యాసవిమర్శనము.

[ఆంధ్రసాహిత్యపరిషత్తృతీయవార్షికోత్సవమున నగ్రాసనాధిపతు లగు రావుబహాదరు కిళాంబిరామానుజాచార్యులుగారు ప్రారంభమున నిచ్చిన యుపన్యాసముమీఁది విమర్శనాభిప్రాయము.]

లక్షణవిరహిత మగుభాష గ్రామ్యమనఁబడును ఇయ్యది గ్రాంథికభాషగా వాడుటకుఁ దగినది కాదు. అందువలననే మనపూర్వులగుకవివరు లందఱు గ్రామ్యము నాదరింపక తమకావ్యముల నెల్ల గ్రాంథికభాషయందే వెలయించిరి గ్రామ్యశబ్దము. శాస్త్రముచే సాధురూపము గల దయ్యును నసభ్యార్థము నిచ్చు శబ్దమనియు, సభ్యార్థము కల దయ్యును శాస్త్రముచే నసాధురూపము గలశబ్ద మనియు, నర్థద్వయము లభించుచున్నది. ఈయపశబ్దమును "నమ్లేచ్ఛితవై నాపభాషితవై" యనుభాష్యకారులవారి యనుశాసనముసైతము ప్రయోగింపఁ గూడదనియే బోధించుచున్నది. మఱియు "ఏకశ్శబ్దస్సుష్ఠుప్రయుక్త స్సమ్యజ్ఞాతస్స్వర్గే లోకే చ కామధుగ్భవతి" అనియు శ్లో॥ గౌర్గాఃకామదుఘాసమ్యక్ప్రియుక్తాస్మర్యతే బుధైః। దుష్ప్రియుక్తా పున ర్గోత్వంప్రయోక్తు స్సైనవ శంసతి॥ అనియుఁ గలదు. ఇట్లున్నను దీనిని లంఘించి. అవైహి - త్రియంబకం - హేసుభ్రు - మొదలగునవి సంస్కృతకవివరులును. జీవగఱ్ఱ - ప్రాణగొడ్డము - కవిలగడ్డము - కపిలజడలు - కఱకంఠుఁడు - పసుపుకిచ్చిరి - వాయింపుచు - పట్టుక - నెట్టుక - మొదలగు శబ్దముల నాంధ్రకవివరులును బ్రయోగించినట్లు మనమును నిచ్చటను వచ్చినపగిది గ్రామ్యము నెందుల కుపయోగింపరాదు? అందు రేని, అసాధు రేవ - ప్రమాదపవాయం - ఇత్యాదివచనములచే లాక్షణికులు వానిని నిరాకరించియే యున్నారు. కొందఱ అమ్మహాకవులయందలి గౌరవముచే వారు వాడినగ్రామ్యములను మాత్రమే తమగ్రంథములలోఁ గాఁదాచిత్కముగ బుజ్జగించుచు వచ్చిరి కాని వానికాయపశబ్దబిరుదము మాత్రము తొలఁగింప నేరరైరి. పూర్వకవులైనను "ప్రమాదో ధీమతామపి" అనియుండుటం బట్టి ప్రమాదముగ వాని నుపయోగించియుందురు కాని యర్వాచీనుల కీ మనగ్రామ్యశబ్దములు సుఖముగా గ్రామ్యభాషను గ్రాంథికభాషగా వాడికొనుటకుఁ బ్రమాణమగుఁ గాకయని మనలఁ గనికరించి బుద్ధిపూర్వక

ముగ వాడినవారుకారు. ఈకారణములవలన పూర్వులగ్రంథములలో గ్రామ్య మును గ్రాంథికముగ నుపయోగించుకొనుటకుఁ దగినయాధారము లేవియు మన కున్న ట్లగపడదు. పోనిండు సత్కార్యాచరణమున కొకరిమార్గదర్శిత్వ మేల? లో కోపకార మగునట్లు, పఠితలసౌలభ్యసంపత్తికిని భాషాభివృద్ధికిని హేతువుగా సార్వ జనీన మగువ్యావహారికభాషను మనయంత మనమే స్వతంత్రించి గ్రాంథికముగఁ జేసికొనఁ గూడదా? అనిన మంత్రద్రష్టల కెనవచ్చెడి యసామాన్యబుద్ధివైశద్యము గల బహుభాషాశోధకు లగునన్నయాదులు మనభాషావిషయ మంతయుఁ గరత లామలకముగ వీక్షించి యధునాతనుల కవకాశము లేకుండఁగ నేతగురీతి సంస్క రించి పూర్ణస్థితికిఁ దెచ్చి భాషకుగ్రంథార్హత సంపాదించి పెక్కుగ్రంథములు సైత ము రచించి సౌలభ్యమును గూర్చుటయే గాక పదపడి గ్రామ్యాదుల సంపర్క ముచే భాష చెడి తన్మూలమున జను లనాగరకప్రాయులు కాకుండ ననుల్లంఘ్యము లగువ్యాకరణాది నియమములఁగూడఁ గావించి లోకమున కనితరసాధ్య మగు మహోపకారము నొనరించియే యుండిరి. అట్టినియమముల నెల్లనిఁ దొలగించి కొని మనము భాష కింక నేదేని నూతనవిలక్షణము సంపాదింపవలయు నని సదు ద్దేశముతోఁ బ్రయత్నించినను నది వేఱుతీరుగఁ బరిణమింపక మానదు. ఇఁకను గ్రంథములయందే కాక వ్యవహారములోఁ గూడ నుండినప్రతిదేశభాషయుఁ గాల క్రమమున మార్పుఁ జెందుచుండుట స్వభావసిద్ధ మగుటవలన మనభాషయు న ప్పుడప్పుడు దానియంత నదియే యించించుక మాఱుటకన్న నాస్వాభావిక మగు మార్పును మన మంగీకరించి యందున కూఁతముగ నొక్కమాఱుగనే "ఏసమ యమున నున్నపండితుల వాడుకభాష యాసమయమునఁగలవారిచే సాధుత్వనిర్ణ యమునఁ బ్రమాణముగ నంగీకరింపఁబడుచు వ్యావహారికభాషయందే యిఁక నుండి గ్రంథముల వ్రాయవలసిన" దని నిశ్చయించుకొనుటయే సమంజస మని తలంచినచో నాస్వభావసిద్ధ మగుమార్పు మన కిదివఱ కేమియు నుపచరించిన ట్లగ పడదు కాన దానిని శాశ్వతముగఁ గావలయు నని వెనుకటికంటె నధికముగఁ దెచ్చి నిలుపుకొనుట కన్న నీప్రయత్నము లన్నియు నెల్లవారిచేఁ గొనియాడఁ బడుచు నెందును గొఱంతవడక చిరకాలానుష్ఠితమై వచ్చుచున్న మనగ్రాంథికభాషకే యొ నర్చి దానినిఁ బరిశుద్ధముగఁ గాపాడికొనుచుఁ బూర్వులు చూపినమార్గముననే మనభాషావ్యాకరణమునకు వశపడునట్లు నూతనశబ్దములఁ గైకొనుచు నపూర్వ వ్యాపారములు వృద్ధి యైనకొలంది నూతనశబ్దములఁ గల్పించుకొనుచుండుటయే

లగ్గగును. ఇంకను వాడుకభాషకుఁ బండితుల వ్యావహారికభాష నాదర్శముగ నుంచికొనుటకు నిప్పటివారును నిఁకముందు రాఁబోవువారును రాజభాషనేర్వని ది పండితులేకారు. గాన నాయితరభాషాధ్యేత లగుపండితులు వాడుకొనుభాష చాల వఱకు నితరభాషాపదములు గలదిగనే యుండును తక్కినది మనకెంత సాధుత్వ సంపాదకముగ నుండునో తెలియదు. ఇది గాక వారివ్యవహారములో భాషలోని యెల్లశబ్దము లుండుట కవకాశ మెక్కడిది? ఇఁక రాజభాష నేర్వనిసంస్కృతభాష నభ్యసించిన దేశభాషావేత్త లన్ననో సుశబ్దముగనో యపశబ్దముగనో యితర భాషాపదప్రయోగ కుతూహలముననో విది లేక యో యెట్లో కొద్దియో గొప్పయో వాడుకలో నన్యభాషాపదప్రయోగము చేయుచునే యుందురు. వీరివ్యవహారమందును భాషలోని సకలశబ్దములకును బ్రయోగముగ విషయమున పరిపూర్ణతకలిగియే యున్నది. కానఁ బండితులవాడుకభాష వాడుకభాషకు సాధుత్వ నిర్ణాయకము కానేరదు పృషోదరాదులవలె శిష్టోచ్చారితములు గ్రహింపఁబడుట భాషవ్యాకరణాదినియమములు లేక పరిపూర్ణపరిణామస్థితికి రాకమునుపు గాని తరువాతఁ గాదు. వ్యావహారికభాషలో గ్రంథములు వ్రాయుటవలన భాషాభివృద్ధియైనను గాకపోయినను నొకమండలములోని వారిచే వ్రాయఁబడిన గ్రామ్యభాషా గ్రంథములు వేఱొకమండలములోనివారి కెంత పండితులకేనిఁ దలనొప్పి ఘటింపక పోవు. అందునను నాంధ్రదేశపు నడిగడ్డలో నున్నమండలములోని గ్రామ్యభాషలకుఁ గలపరస్పరభేదమున కన్న నైజాముమండలములలోని శిష్టులచే వాడఁబడు భాషలోఁ గూడ సగమునకుఁ బైగా మ్లేచ్ఛభాషాపదము లుండును. వానిని తీసి వేయఁగా మిగిలినవానిలోఁ జాలభాగము చాణుమూలములేక మీ కందఱకు నవ్వు పుట్టించు వింతపదములు గలది గనుండును. మొత్తముమీఁద నైజాముమండలములలోని యాంధ్రభాష యది యొకయభినవాంధ్రభాష యనుటలో నతిశయోక్తి లేదు.

ఈయభినవాంధ్రభాషలో నైజామురాష్ట్రవాసులును గ్రంథములు వ్రాసినచో నవియెట్లుండునో యది యనుభవైదికవేద్యముఁ. పోనీ వారు వ్రాయ కుండురుగాక యనికొందమేని యితరమండలములవారి కందఱకును గ్రామ్యగ్రంథములు వ్రాసికొన నధికారము గలిగినప్పుడు వారు మాత్ర మెట్లు వ్రాయకుందురు! ఇంకొకటి యాంధ్రదేశమధ్యమమున నున్నమండలములలోని భిన్నభిన్న మగుగ్రామ్యభాష వారిలోవారికే వియో యల్పసంఖ్య గలకొన్నిశబ్దములు దక్కఁ దక్కిన

దంతయు సుగమముగనే యుండును. ఈ నైజామమండలములలోని గ్రామ్యభాష మాత్ర మట్లుకాక నైజాము రాష్ట్రవాసులకంటె నితరు లగుసకలమండలవాసుల కును భాషయంతయు దుర్గ్రాహ్యముగనే యుండును. మచ్చుఁజూపుటకు నైజాము మండలములలోని గ్రామ్యశబ్దములను మాత్రమిచటఁ గొన్నిటి నుదాహరించు చున్నాఁడను.

కంకపెనాలు - వెదురుగుములు.
గుల్ల - బుట్ట.
రాతు - శిల.
బొక్కలు - ఎముకలు.
చేరెల్లు - ద్వారబంధములు.
దుత్త - పశువులమెడపట్టెడ.
పిక్కలు - మామిడిపండ్లు మొదలగువాని గింజలు.
పడగొట్టు - పంపించు.
పుల్లగండోఁడు - పోకిరివాఁడు.
పాలబిందె - నలికండ్లపాము.
పోరి - బాలిక.
పోరడు - బాలుఁడు.
పెంకాసు - పెంకు.
పానాదులు - బజారులు.
పెయ్యి - శరీరము.
గీరలు, గిఱ్ఱలు } బండిచక్రములు.
పుంటికూర - గోంగూర.
తొంగులుబొడుచుట - మొట్టుట.
కచ్చడం - సవారిబండి.
కణతలుతీయుట - ఊరేగింపుచేయుట.
కంచుడు - మూఁకుడు.
పంజకొక్కులు - బావిగిలకతిరిగెడిచెవులు.
కుడితినీలు - చొక్కాలు.
అయ్యేపట్టికెనే - కనుకనే.

బేవులు - త్రేఁపులు.
దుబ్బ - దుమ్ము.
దొడ్డు - లావు.
తాయపెంకు - ఇనుపసిబ్బి.
ఆరిశలుజోడు - సులోచనములు.
అలుకుట - విత్తనములు చల్లుట.
ఇక్కెర - హారతి కర్పూరము.
ఇలపీట - కత్తిపీట.
కలప, అశ్వ } మంగలివానిపొది.
కొత్తలు - పైసాలు - హాలీడబ్బులు.
కొరకాసు - కొఱవి.
చక్కిలంముక్కిలం - పద్మాసనము.
లండోడు - పనికిమాలినవాఁడు.
లొల్లి - అల్లరి.
లెంకులాడుట - వెదకుట.
జోకుట - తూఁచుట.
యాష్ట - విసువు.
కూసం - చిన్నఅయికగుడ్డ.
పాపచ్చులు - ముచ్చెలు.
శాయి - సిరా.
బరిబాతల - దిగంబరిగా.
చిక్కడుకాయలుపెట్టుట - గిలిగింతపెట్టుట.
యాఁరాలు - తోడికోడలు.
తోలుకొనిపోవుట - పిలిచికొనిపోవుట.

ఇత్యాది నైజామురాష్ట్ర గ్రామ్యశబ్దము లాంధ్రదేశమధ్యమండలముల వారికిఁ గొంచెమేని యెట్లు తెలియవో యట్లే పైఁ జెప్పినశబ్దములవంటి గ్రామ్యశబ్దముల నింక నెన్నియేని నిత్యకృత్యములతో వ్యవహరించుకొను నైజామరాష్ట్రవాసులకును నాంధ్రదేశమధ్యమండలవాసులభాష యేమియుఁ దెలియఁ దని వేరుగఁ జెప్పబనిలేదు. కావున గ్రామ్యభాష పలుకారణములవలన మహాకఠినమై సకలజనవేద్యము కాదు. ఉత్తములవ్యావహారికభాష గ్రహింత మన్నను వారివాడుకలోఁ గూడ సార్వజనీనములు కానిపైఁ జెప్పినభేదము లనేకములు కన్పట్టుచున్నవి. అందు వలన మనగ్రాంధికభాషలో వ్రాయఁబడిన గ్రంథములును వాడుకభాషలో వ్రాయఁబడిన గ్రంథములును గురూపదేశములేక తెలిసికోఁదగినవి గాక గ్రామ్యవాదుల యభిప్రాయప్రకారముగ సౌలభ్యవిషయముగ రెండును నొక్కటియే యైనవి. ఆకారణమున జనసామాన్యమునకుఁ దెలియుటకై యాయా మండలములవా రాయామండలముల వారికొఱకు వారివారిసామాన్య గ్రామ్యముననే పుస్తకములు వ్రాయవలసివచ్చుచున్నది. అట్లు వ్రాయుటవలన నొక్కటిగ నున్నయాంధ్రభాషను బహుభేదములు గలదిగఁ జేసికొనుటయు దానివలన లాభ మేమియు లేకపోవుటయుఁ బై పెచ్చు మనయభివృద్ధికిఁ గూడ హాని కలుగుటయుఁ దటస్థించుచున్నది. ఏలయిన, మనయగ్రామ్యభాషకును మనమతమునకును నవినాభావసంబధము కలదు. మననాగరకతకు హేతువు లగునెల్లవిషయములును సంస్కృతభాషనుండి గ్రాంధికబాషలోనే యనువదింపఁబడి యున్నవి. అవి యన్నియు మన కిఁక దుర్లభము లగును. పునఃపాకప్రయత్నముగ వాని నన్నిటి మరల గ్రామ్యమునకుఁ దెచ్చి కొనుటయు దుర్ఘటము. కావున గ్రాంధికభాషను జేతులారఁ జెడఁగొట్టికొని తరువాతఁ బశ్చాత్తాపము నొందుట మాత్రము సరి కా దని విన్నవించుచున్నాఁడను.

చివుకుల వేంకటాచలశాస్త్రి.

శుభమస్తు

శ్రీమతేరామానుజాయనమః.

రేఫ ఱకార నిర్ణయము.

[తాళ్లపాక అన్నమాచార్యులకుమారుండు తిరుమలయ్యంగారు కవిత్రయము మొదలైన పూర్వకవీశ్వరుల ప్రబంధాలలోని రేఫఱకారా లేర్పఱచి లక్షణ గ్రంథముగా నానతిచ్చిన రేఫఱకారారపద్యాలు.]

క. శ్రీవేంకటేశ నీకుం, గావించెద నంకితంబుగా ఱారేఫల్
వావిరి నేర్పఱచినకృతి, శ్రీవనితానాథ రామ చేకొనుకృష్ణా! 1

క. అచ్చులు హల్లులు వరుసన, వచ్చిన రేఫలును ఱాలు వర్ణించెద మున్
మెచ్చుగ నాదికవీశ్వరు, లచ్చుపడం గృతులఁ జెప్పినటువలెఁ గృష్ణా. 2

క. ఇచ్చిరి తెచ్చిరి యనియెడి, యచ్చతెలుంగులఁ గ్రియాపదాంతంబులపై
వచ్చినవి యెల్ల రేఫలు, అచ్చల ... ... రచనలు కృష్ణా. 3

క. ఇల ఘోషాక్షరములపైఁ, గలుగవు తెలుఁగునను ఱాలు కడఁగును రేఫల్
తలఁపఁగ సంస్కృతపదముల, గలిగినవియు రేఫ లగును గనుఁగొనఁ గృష్ణా. 4

క. ఎఱుక యిర వనుట మొదలగు, మొఱసెడి యెత్వములు నిత్వములు తెలుఁగున నే
ర్పఱచినవి యెల్ల నచ్చులు, పెఱిఁగి యకారములు గావు పెంపుగఁ గృష్ణా. 5

క. అరి యనఁగ నప్పనం బగు, ఱ న్ననఁగా
నరిది యరవాయిగొనక, ట్లరిగవి యన వెలితి రేఫ లనఁదగుఁ గృష్ణా. 6

క. ఆరసి చల్లారఁగఁ గన్నారఁగ నా రెండు ననఁగ నారఁగ ధర్మం
బారంగాఁగినపా లన, నారంగూరె నన రేఫ లయ్యెను గృష్ణా. 7

క. ఆరెకులనఁగాఁ దలవరు, లారాటము నారటంబు నారయ నట పొం
గారెడు నారని యనలం, బారంగా ననఁగ రేఫ లయ్యెను గృష్ణా. 8

క. ఇర యనఁగ నెలవు చెప్పట, యిరువురు నిరువది యని రవు నిరవారంగా
నిరుఁగెలఁకుల నొల్లం బోయిరి యనఁగా రేఫ లయ్యె నెయ్యెడఁ గృష్ణా. 9

క. ఈరికెలొత్తె మనంబున, నీరస మీరెలుఁగు దాన మీరి యనంగా
నీరనఁగ మిమ్ముఁ జెప్పట, యీరేడన రేఫ లయ్యె నెన్నఁగఁ గృష్ణా. 10

క. ఉరులొడ్డి యురులఁద్రోయుట, యురవడితో నురవణించు టొత్తుట డెందం
బురియఁగ నురియాడుట యన, నురులింప ననంగ రేఫ లొనరెను గృష్ణా. 11

క. ఊరకయుండుట యనఁగా, నూరార్చుట యనఁగ దుఃఖ ముడుపుట భువిలో
నూ రనఁగ గ్రామనామం, బూరటవుచ్చుకొన రేఫ లొక్కటఁ గృష్ణా. 12

క. ఎరుగలిచిచ్చున నెరి యఁగ, నెరగా నాహార మనఁగ నేరికిఁ జిత్తం
బెరియఁగ నన నెర వి మ్మన, నెరవనఁగా లాఁతిరేఫ లెన్నఁగఁ గృష్ణా. 13

క. ఒరు లోరసేసి రన మి,న్నొరయంగా నోరలేక యోరీ యారా
యొరసిన దైత్యుఁడు వడె నొం,డొరు లనఁగా రేఫల య్యె నున్నతిఁ గృష్ణా. 14

క. కర మిష్టము కరణియనం, గరువునఁ బోసిరి యనంగఁ గరఁగి రనంగాఁ
గరిసెన మనఁ గృషియగు నొ,క్కరుఁడన నివి రేఫ లగుచుఁ గనఁబడెఁ గృష్ణా. 15

క. కో రప్పన మనఁగాఁ జే, కూరుటయనఁ దక్కి రనఁగఁ గోరుట యనఁగాఁ
గూరిమి యనఁగా నతనికి, గూరుతు నన రేఫ లయ్యె గుణనిధి కృష్ణా. 16

క. కో రనఁగ గిన్నె యమ్ములు, కూరంగా నాటె ననఁగఁ గురిసెను వానల్
కారింప ననుట నొంచుట, కారాకులు రేఫ లగుచుఁ గనఁబడుఁ గృష్ణా. 17

క. కారుకొనె మొగులు శత్రులు, గా రనఁగాఁ దాఁకి రనఁగఁ గరువలి యనఁగాఁ
గారులు కల్లలు కర్జము, కారియ మన రేఫ లయ్యెఁ గలయఁగఁ గృష్ణా. 18

క. కరికరిఁ గరమొప్పఁగఁ దొ,ల్కరివాన లనంగఁ గెరలి కరకరఁ గాలన్
గరవాఁడియమ్ము లేసిన, గొరప్రాణము లనఁగ రేఫ గుణములు కృష్ణా. 19

క. కూరలు గాయ లనంగాఁ, గారాటము తోడ నొకరిఁ గరిఁ గోరి రనన్
కూరుకుట నిద్రవోవుట, కూరుట పొగులుటలు రేఫ కులములు కృష్ణా. 20

క. గారవము గలిగె గరువము, గారా మన గ్రమ్మి రనఁగ గరుసడి యన బం
గారము గురుగులు గరితలు, గోరది యన రేఫ లయ్యె గుణనిధి కృష్ణా. 21

క. గురువు లన గతివిశేషము, గరుత్రాల్చెను మే ననంగఁ గడఁగి రనంగా
గరువన గర్భము ఘనతయు, గరువతనము రేఫ లగుచుఁ గడఁగెను గృష్ణా. 22

క. గురుసులఁ గూడంగా నే,గిరపడి జేగురున గోర గిరగిర వ్రాయన్
గరుసులు దాఁటఁగఁ దాఁకిన గరు సింగార మన రేఫగతు లివి కృష్ణా. 23

క. చేరువఁ దెచ్చిరి చెచ్చెరఁ, జేరిరి యచ్చెరువు చొరఁగఁ జెరుపుట చీరల్
చీరికిఁగొన కచ్చెరియము, చూరే యన రేఫ[illegible] సొంపుగఁ గృష్ణా. 24

క. చిరుఁగని చీరలతో వ,చ్చిరి యచ్చర లనఁగ జరగి జీరలఁ దగని
చ్చిరి చేరుపు టనఁ జేర్చుట, చొరువసఁగా రేఫ లయ్యె సొంపుగఁ గృష్ణా: 25

క. తరిచాడె తరువ తరమిడి, తిరుగుట తిరియుటయుఁ దిరము తెరలుట తెరువున్
దరలఁగఁ దరతరమును మా,ర్తురు నెత్తురు రేఫ లయ్యె రూఢిగఁ గృష్ణా. 26

క. తోరంబు తెరయుఁ దొరుగుట, తేరా భూషణము లనఁగఁ దెక తేరయు నే
తేరఁగ నేర్తురు తారును, చేరెక్కు మనంగ రేఫ తెలియఁగఁ గృష్ణా. 27

క. తర మెంచక చనుదెంతురు, తొరలినఁ బలు తెరఁగు లందుఁ దూరుపుదెస వ
త్తురు తీరని కోపముతోఁ, దరఁగ లనఁగ రేఫ లయ్యె! తప్పవు కృష్ణా. 28

క. తెరలంగాఁగిననెయి క,స్తురివంటిది మరచి దనఁగఁ దొలితొలి కడుఁ జి
త్తరు వ్రాయఁగ నుద్యోగిం,తురు వేడ్క నవంగ రేఫ దూకొనెఁ గృష్ణా. 29

క. దరికొని కుదురుగఁ జూదరి, దొర దొరకో ల్దురము నెదురు దురపిల్లుట యున్
దొరయఁడు సరిగాఁ డనునది, దరిఁద్రొక్కుట రేఫ లయ్యె తలఁపఁగఁ గృష్ణా. 30

క. దొరకొన్నయపుడె చెంతకు, దొరకొల్పుట మే లనంగ దూరులు వల్కన్
దురదుర నేల కడంగెదు, దొరసినచో రేఫ లయ్యెఁ దొడిఁబడఁ గృష్ణా. 31

క. నేరిమి నరములు నరలును, నారలు నోరెత్తి నీరు నారసమును గ
న్నారము నెరయఁగఁ జల్లుఁడు, నేరక నుసువు లన రేఫ నిక్కము కృష్ణా. 32

క. నేరేడు పండ్లు నెరసులు, నేరుపుతో వింటినారి నిగిడింపుచు ను
న్నా రహితులు కదనంబున, సీరై రని పల్క రేఫ నెలవులు కృష్ణా. 33

క. పరఁగఁ బరికింపఁ బరువడి, పురుడీడగు సూతకంబు పురుడగుఁ బరిమా
ర్చిరి డెప్పర మిప్పరుసనఁ, బొరయక యన రేఫలయ్యెఁ బొలుపుగఁ గృష్ణా. 34

క. పొరిఁబొరిఁ బరుసనఁ బొరిగొని, పురఁబురఁ బొక్కంగఁ బెరుగు పొంపిరివోవన్
బెరుగుట వర్ధిల్లుట యగుఁ, బొరు గన నివి రేఫ లయ్యెఁ బొందుగఁ గృష్ణా. 35

క. పరిగొని పరిచనుదెంచుట, పరువము పెనుపరియు నేరుపరి పురిగొలుపన్
బొరిపొచ్చెముఁ జప్పరమును, బొరలితి మన రేఫ లయ్యె పొందుగఁ గృష్ణా. 36

క. పోరితము పోరు పిరిగొనఁ, బే రన నామంబు తేనెపెర పేరురమున్
బేరడి పరపుట నించుట, పోరచి యన రేఫ లయ్యెఁ బొలుపుగఁ గృష్ణా. 37

క. పరువుగలచోటఁ బరువులు, పరుసములును బెరసు బద్దపరి పరిగోలల్
పరఁగించిరి పొరిఁగలుగఁగ బడిపడవర్గు లన రేఫ పొల్పడెఁ గృష్ణా. 38

క. పేరిననేతికిఁనై కదుఁ, బోరాటము లేల వలదు పోరా యనినన్
పోరం బెనఁగకు మింకను, బోరామి యొనర్పు రేఫ పొలు పగుఁ గృష్ణా. 39

క. బూరటిల బారిసమరేన్, బోరగిలం బరవసంబు బోరని మ్రోసెన్
బారెఁబడ బెరసి బరిమెయి, బీరము నిబ్బరము రేఫఁ బేర్పడెఁ గృష్ణా. 40

క. బురజ లనంగా గజ్జెలు, బిరుదులు పాదములఁ గట్టిపెట్టఁగవలె నా
బురబురఁ బొంగినచల్లలు, బరు లుబ్బఁగఁ ద్రాగు రేఫ పనుపడెఁ గృష్ణా. 41

క. మురిసెం దొండము దంతికి, మరలుట మరిగించి కొనుట మది మెరతొర సు
మ్మురె మెరపరాల్లు తేంటులు, మొరసె ననన్ రేఫ లయ్యె మురహర కృష్ణా. 42

క. మేరలు దప్పిన శత్రుల, మారిమసంగుటలు మొరడు మరియాద యగున్
మీరలు దెండా యీమరి, మారేశ్లన రేఫ లయ్యె మాధవ కృష్ణా. 43

క. మురియ లనంగాఁ దునియలు, మిఱియము లని పల్కుచోట మెలఁతల మనముల్
మరుపఁగవలె ననఁగాఁ దా,సర లనఁగా రేఫ లయ్యె మహిలోఁ గృష్ణా. 44

క. మురిపెముతో నిలిచెను గ్ర,మ్మర మారట విగ్రహంబు మది వేమారున్
మురమురె యసియెడి కోపపు, మరు లుడుపుట రేఫ లయ్యె మానుగఁ గృష్ణా.

క. రూపించి రేయు రచ్చయు, రూపును రమ్మనుట రిచ్చ రోయక రెంటన్
రూపును రాలుట రంకెలు, నీపగిదిన్ రేఫ లయ్యె నెన్నఁగఁ గృష్ణా. 46

క. రాయంచ రిత్త రక్కసి, రాయుచు రాయుటయు రాడు రాచూలి యనన్
రేయెండ రేకు రూడియు, రాయిడి రుచి యనఁగ రేఫరచనలు కృష్ణా, 47

క. రారు రమణ నటు రోఁజుచు, రారా రాగిల్లి రమ్ము రాసి యొకటనే
నేరా మాటలు వినరా, యీరీతుల రేఫ లయ్యె నెన్నఁగఁ గృష్ణా. 48

క. వారించుట యెవ్వరికిన్, వారికి వారకము విరులు వారక యొసఁగన్
వారువములు పల్వురకును, వీరనఁగా రేఫ లయ్యె వెలయఁగఁ గృష్ణా. 49

క. వరటము వరువు ల్లైవురు, విరియుట యున్ వరుస వెరవు విరవిర మనఁగా
లువ్వురు నవ్వురె యప్పురి గొన, వెరవిడి యన రేఫ లయ్యె వెలయఁగఁ గృష్ణా.

క. వారకుల నెక్కి యార్వురు, వేరము తలవరులు వెరసు విరియం జల్లెన్
వారని వోవరి దేవర, వారాశి యనంగ రేఫ వరుసలు కృష్ణా. 51

క. శరబడి నేసిరి సైరణ, సురిగితి రన సరియ నంగ సూరె లనంగన్
సిరియనఁగ లక్ష్మి చేసిరి, సరకు లనన్ రేఫ లయ్యె సతతము కృష్ణా. 52

క. సురియలు సోరణగండ్లును, సొరిదిన్ వేసరుల నెక్కి సొరటా సారెల్
సరకేమియుఁ జేయకు మన, సరు లనఁగా రేఫ లయ్యె సతతముఁ గృష్ణా. 53

క. మోహారము చొచ్చి యెడనెడ, నోహారి గా మలసి మలసి యొక్కొక్క దెసఁ
సాహారిగొన నుప్పొంగెడి, బేహారు లనంగ రేఫ పెంపగుఁ గృష్ణా. 54
క. పుట్టిరి తిట్టిరి కూలిరి, నెట్టన భూపాలు రనఁగ నెయ్యురు లేరే
గట్టిగ గండరు లెప్పము, నెట్టనఁ బోటరియు రేఫ నెలవులు కృష్ణా. 55

పెద్ద ఱాలు.

క. ఆఱవఱలై యఱకట నుక్కఱ యఱిముఱి యఱచు ననఁగ నఱువుడు జోళ్లే
పఱియఱు మెడలక పొల్పడి, యఱువది గోట్లనఁగ ఱాల నమరెను గృష్ణా. 1
క. అఱపోఱఁడు గుజ్జు రూపఱి, నఱవులు బిట్టఱి యనంగ నఱచితి కింగా
దఱుగుడుఁ గుబుసము సిగ్గఱి, యఱుముట యన ఱాల యోజ లనిశముకృష్ణా.2
క. అఱ లేనివాని కఱుగును, అఱకాలం దన్నుఁ దన్ని యఱుకమ్ముట నా
నఱ గొఱ లేక యనఁగఁ బెం,బఱ యనఁగాఁ బెద్దఱాలయనువులు కృష్ణా. 3
క. ఆఱిడి యన నడలాఱఁగ, నాఱంపులు నాఱుచవులు నాఱని తేజం
బాఱమ్ములఁ బాపములోఁ, టాఱె ననఁగ ఱాలు కృతుల నమరెను గృష్ణా. 4
క. ఇఱికికొని యిఱులు కొనఁగా, నిఱికిట మిఱు చన్నుఁగవయు నిఱిమి యనం గ్రి
క్కిఱియఁగ నిఱిసిన కడియుట, యిఱికిప ఱాగళులె ఱాలయిరవులు కృష్ణా. 5
క. ఉఱవుగ సేనలమీఁదట, నుఱుకుడుఁ బడ మూఁఱి మెట్టి యుఱుముచు నేన
ట్లుఱక పగవారి నఱుచి, చ్చుఱికింతు ననంగ ఱాలయునుకులు కృష్ణా. 6
క. ఉఱఁడనఁ గైకొనఁ డను నది, యుఱువ ట్టేవంబె యీఁగి యూఱడిలంగా
నుఱిడెన నిలుకడ యూఱిన, నుఱుగడ యనఱాలుకృతుల కొదగెను గృష్ణా! 7
క. ఎఱచి యన మాంస మేఱులు, నెఱగుట వందనము దిగుట మెఱ మం టనఁగా
నెఱుకు తల మెఱువ నెఱకలు, నెఱఁగినమెఱుక లన ఱాలయిక్కువ కృష్ణా. 8
క. ఒఱవ శరీరము మన్మథు, నొఱపుల నొఱిగాల నుండి యొఱగె ననంగా
నొఱపు గలకత్తి యొఱలోఁ, నొఱలుచు ననఁ బెద్దఱాలయోజలు కృష్ణా. 9
వ. కవర్గువు.
క. కఱపె ననఁగ నేర్చుట యు, క్కఱపడి క్రిక్కిఱిసి వేడ్క కాఱులు వెస ను
క్కఱపడి కుఱుకుల్ గట్టుక, కఱతల కలికి యన ఱాలు కనుఁగొనఁ గృష్ణా. 10
క. కఱపించుఁ గఱచుఁ బండ్లను, గఱపెడి ననఁ గఱచు ననఁగఁ గల పవి నేర్పుల్
కఱదులు బుద్ధులు కుఱుకొని, కుఱుగలి కొను ననఁగ ఱాలు గొనకొనెఁ గృష్ణా.

క. కొఱమాలి కొఱత వడినను, గఱవుం గొఱ గాదు కొఱవి కాఱియఁ బెట్టన్
కఱదిం దెలుపఁగఁ గాదనఁ, గఱకంఠా యనిన ఱాలగని యగుఁ గృష్ణా. 12

క. కుఱుగలి యనఁ జేర్పనఁ బడుఁ, గొఱలుట యనఁ బూర్ణ మగుట కోఱలు వచ్చెన్
గఱకు లనఁ బ్రల్లదములు, క్కెఱ యనఁగాఁ బెద్దఱాలు గీల్కొనెఁ గృష్ణా. 13

క. కుఱుచనఁ గాఱెపు ననఁగాఁ, గొఱపము కాఱడవి కొఱడు కుఱుమా పనఁగాఁ
గొఱ గలవాఁ డితఁ డనఁగా, గుఱుకుఱ యనఁ బెద్దఱాల గుణములు కృష్ణా. 14

క. కఱలేని కందుచే కుఱుఁ, గఱు కెక్కినపింజ వింజ గఱచి కొఱుకుటల్
కఱ కనఁగాఁ గఠినంబగుఁ, గఱకఱి యనఁ బెద్దఱాలగతు లివి కృష్ణా. 15

క. గిఱుపుట గుఱుకొని గొఱియల, గిఱిగొనఁ గన్ని ఱిపి పగఱ గీఱినగుఱుతున్
గుఱియు గగుఱుమలు గింజఱు, గఱిగుఱుకలు పెద్దఱాలకై వడి కృష్ణా. 16

క. గిఱుఁ జెప్పలతో డగ్గఱి, గుఱిచి యనఁగఁ గూర్చి యనుట గుఱుగుఱ్ఱనుచున్
గుఱుపెట్టుచు నిద్రింపఁగ, గఱు లనఁగాఁ బెద్దఱాలకై వడి కృష్ణా. 17

క. చెఱుచు నది యనఁగఁ గ్రచ్చఱ, చఱు కనఁ బెడ చేతఁ జఱచు చఱిఁ జిఱుమటచి
చ్చఱపిడుగై చుఱచుఱఁ జిచ్చఱకంట ననంగ ఱాలు సమకొనెఁ గృష్ణా. 18

క. చెఱ నునుచుట చెఱు వమయుట, చుఱుపుచ్చుట చెఱకు విల్లుచూఱవిసుచుటల్
చిఱునగవు చిఱుత తనమును, జెఱుతట యన ఱాలు భువిని జెల్లును గృష్ణా. 19

క. చఱిగొనె ననఁ జలమగు ము,చ్చిఱుట య ముచ్చటయుఁ జెఱఁగు చీఱుట యనవా
చఱచి యిలఁ జఱచి పాఱుట, చెఱిసగమనఁ బెద్దఱాలు చేకొనెఁ గృష్ణా. 20

క. జఱిగొని యొకచో జాజఱ, జఱజఱ నొకజెఱ్ఱిపోతు జాఱె ననంగా
జఱుపుచ్చ జఱచి జొఱజొఱ, జిఱజిఱ యనఁ బెద్దఱాలు చెలువుగఁ గృష్ణా. 21

క. తఱిగొని నడవఁగ దఱుముచు, దొఱఁగువడుట తొఱఁగె ననుట తూఱు చుఁ బనులన్
దొఱఁగులుపోయెడిఁదఱుముఁడు,తొఱఁగుటపడుఁడనుటఱాలుదూకొనెఁగృష్ణా.

క. తఱియగుఁ దఱి చగున త్తఱి, తెఱవలు వా తెఱలు దెఱచి తెఱపి గనుట యే
త్తెఱ దోఁపఁ దెఱఁగుగలుగుచుఁ, దెఱఁగేది యనంగ ఱాలు దెల్లమి కృష్ణా. 23

క. తెఱగినతావియు నిడుమల, తొఱగమిఁ గడుఁ దుఱగలింపఁ దుదఁగలుపంబున్
దఱుగుట తీఱమి తాఱుట, తఱులన విలసిల్లె ఱాలు తప్పవు కృష్ణా. 24

క. తుఱుము తుఱిగొనియె ననఁగాఁ, తఱిగె ననఁగఁ దక్కువనుట తలపోయంగాఁ
దఱి కొలిపి ఱిఱికనుంగొనఁ, దఱుమఱ యనఁ బెద్దఱాలు తలకొనెఁ గృష్ణా. 25

క. తఱిమి యని సేసె ననఁగాఁ, దఱియం జొఱు మనఁగఁ దలలు దఱిగెద రనఁగాఁ
దొఱయుట తీఱఁగఁ దఱఁకినఁ, దఱలక యనఁ బెద్దఱాలు తథ్యము కృష్ణా. 26

క. తెఱఁగొప్పఁ గన్నుదెఱవఁగఁ, దెఱ గన్నన దూఱె ననఁగఁ దీఱుదు రనఁగాఁ
దొఱులిడెఁ దీఱుగఁ జేయుము, తఱగని కింకనఁగ ఱాలుతలకొనఁ గృష్ణా. 27

క. దఱికె నన వెలితి యగుముం,దఱ యన నొకకాల వాచి తన యెదుఱను ముం
దఱ యనఁబడు నొకచో నం,దొఱు ననఁగాఁ బెద్దఱాలు తూకొనెఁ గృష్ణా. 28

క. ఇందఱు మిద్దఱు చెదఱుట, యెందఱు కొందఱు ననంగ నే దిఱి యనఁగా
నందఱు పెద్దఱికం బన, నిందఱు ననఱాలు పుడమి నేర్పడెఁ గృష్ణా. 29

క. నెఱి నెఱ య నెఱసి నఱకిన, నెఱి దప్పం బడియె ననఁగ నెఱమంటలు నా
నిఱి గొనియె ననఁగ నిండుట, నెఱివెంద్రుక లనఁగ ఱాలు నెలకొనెఁ గృష్ణా. 30

క. నెఱకులె యమ్ములు నఱుమ్మై, నుఱుముగ నఱుమాడె నంత నుఱుమాడె ననన్
నెఱుపనలము నెఱపాఱిన, నెఱుపఱి సింగ మన ఱాలు నెలకొనెఁ గృష్ణా. 31

క. నూఱుపదు లనఁగ నెఱుసన, నీఱు పయిం గవిసి యున్న నిప్పు లనంగా
నూఱుచు నున్నాఁడనఁగా, నాఱు విడిచి యనఁగ ఱాలు నయముగఁ గృష్ణా. 32

క. నెఱి లేనిసఖుం డె మ్మెలు, నెఱపఁగ నెఱనారసంబు నీఱుగఁ జేయన్
నెఱివ్రుగ నెఱ నాఁటించిన, నిఱు పేద యనంగ ఱాలు నెలకొనెఁ గృష్ణా. 33

క. నెఱి చెడక నెఱిక గట్టుట, నెఱవాదులు నఱువు దుడిచి నెఱి మొగ మనఁ గా
నెఱ ద్రోవ యనఁగ నఱుఁజన, నెఱ బిరు దనఁ బెద్దఱాల నెలవులు కృష్ణా. 34

క. పఱచె నన వేగఁ బోవుట, పఱపెదఁ బఱపితి ననంగ బడిఁదోలు టగున్
పిఱుసనుట వెనుకదీయుట, పఱచినపా ట్లనఁగ ఱాలు పనుపడెఁ గృష్ణా. 35

క. పిఱికి తనంబను...నం,పఱ కోపక పఱియ లగుచుఁ బఱిమార్చె నన్
వఱికొనుట ముంచి కొనుటగుఁ, బిఱుదన చొచ్చె నన ఱాలు పెంపగుఁ గృష్ణా. 36

క. పెఱమూకలు పెఱచేతను, బఱిపఱియలు సేయు టనఁగఁ బఱివోయె ననం
బఱవఁగనోపక తొడిఁబడఁ, బిఱివోయె ననంగ ఱాలు పెనఁగొనెఁ గృష్ణా. 37

క. పెఱిగినచందము చూపఱ, బిఱిదికిఁ బాఱెడుననంగఁ బిఱుదు లనంగన్
పెఱుకలు చిక్కులు వఱుపఁగఁ, బఱపకు పఱచు టన ఱాలు పాల్పడెఁ గృష్ణా. 38

క. పాఱించు నాజి నెడతెగఁ, బాఱుట జలమెల్ల నింకఁ బాఱుట యనఁగాఁ
బాఱుఁ డనంగను విప్రుఁడు, పేఱిన వలు వనఁగ ఱాలు పేర్పడెఁ గృష్ణా. 39

క. పెఱికితిఁ గొండలు పెంపఱుఁ, బొఱ యన గఱుపాఱె ననఁగఁ బొఱతెగె ననఁ దె
ప్పిఱి యేదువెఱిగిన ట్లనఁ, బిఱివెం డననంగ ఱాలు పెంపగుఁ గృష్ణా. 40

క. పఱవఁగ ననఁ బ్రవహించుట, పఱపు పయిం బొల్లఁ బఱచి పఱిపఱియలు గాఁ
బఱతెంచి తొల్లి తొప్పఱు, పుఱియలు పొఱకలును ఱాలపోఁడిమి కృష్ణా. 41

క. బిఱువోవుచుఁ గదనంబున, బిఱబిఱ గద ద్రిప్పి శైవఁ బోర్కొని యదిద
బ్బఱ యనుచుఁ బట్టి యీడ్చెను, బఱబఱఁగా ననఁగ ఱాల పగుదులు కృష్ణా.

క. మఱచిన మఱవక మఱియును, మెఱయు నెడన్ మెఱపి మఱపు మిఱుమిట్లుగొనన్
మెఱుములు మీఱఁగ నీఱియు, మెఱుఁగులెకాంతులన ఱాలు మించెను కృష్ణా.

క. ముఱిముఱి చీకటి గ్రమ్మఱి, మఱుఁగున విహరించి మఱఁది మాఱు మొగము ప
ల్మఱు మాఱిమసఁగి యేమఱి, మఱవరె మఱి యనఁగ ఱాలు మహిలోఁ గృష్ణా.

క. మెఱుఁగును మేఘము మఱతురు, మఱచునొక్కొ మొఱకి యింక మాఱటనొల్లన్
మెఱుఁగెక్కి మెఱుచు దిక్కులు, మఱతును నే ననఁగ ఱాలు మానుగఁ గృష్ణా. 45

క. మా ఱేఁడగు నాతఁడు వే, మాఱును గునియంగ నేల మచ్చిక తోడన్
మాఱులుగక చేకొను ము, మ్మాఱును బలికినను ఱాలు మానుగఁ గృష్ణా. 46

క. మెఱములు నైచుచు మెఱసియు, మొఱఁగుచు ముఱుమొండె మనఁగ మొఱలిడి రనఁగా
మఱువు లనమాటు పెడ మఱి, మొఱపఁదనంబనఁగ ఱాలు మునుకొనెఁ గృష్ణా.

క. మఱ లేక పెక్కు మాఱులు, మఱునాఁ డన మాఱుపడుట మైమఱువు లనన్
మిఱుఁజూపులు మా ఱేయఁగ, నాఱఁద లనం బెద్దఱాలు మహిలోఁ గృష్ణా. 48

క. వఱలఁగ ననుటయు వేడుక, వెఱవఱ వెఱచఱవ విల్లు విఱుగఁగ ననిఁ దా
వెఱగువడి విఱిచి విఱుగుట, వెఱమ్రగము లనంగ ఱాలు వెలసెను కృష్ణా. 49

క. వఱదలు గూసెను వేఱొక, వఱతం ద్రోవంగ వెఱచి వఱలి వెఱఁగుతో
విఱిగాలి యుహీఁఱిడిని, వ్రేఱపాట దె యనఁగ ఱాలు వినఁదగుఁ గృష్ణా. 50

క. సుఱ సుఱ యని యెడి వోటను, సొఱసొచ్చుట యనుట ఱాలు చొప్పడె నిటపై
మఱి కలిగనేని తెలియుఁడు, తఱచెందును లేవు కృతులఁ దలఁపఁగఁ గృష్ణా. 51

ఆ. ఱట్టు అవి కె అంకు ఱాయి ఱెక్కించుట, ఱేవు ఱేవు ఱేను ఱేసి ఱెక్క
ఱేఁడు ఱెప్ప మూసి ఱివ్వన నది దాఁటె, ఱాచుఁ డనఁగఁ బెద్దఱాలు కృష్ణా. 52

గీ. క్షీరనీర విభేదంబు చేసినట్లు, ధరణి రేఫఱకారముల్ తాళ్లపాక
తిరుమలార్యుఁడు వేంకటార్యుఁ డేటపఱిచె, నుచిత మిది గాదె పరమహంసోత్తమునకు.

శ్రీకృష్ణార్పణమస్తు.

[యథామూలముగా ముద్రింపఁబడినది. ఈనిర్ణయమునకు నిప్పటివ్యవహారమునకును బలుచోట్ల భేదము గలదు.]

శ్రీమతే రామానుజాయ నమః.

తాళ్లపాక అన్నమాచార్యులకుమారుఁడు తిరుమలయ్యంగారు చెప్పిన

చక్రవాళమంజరి.

శ్రీలలనాధారుఁ జిన్మయాకారుఁ, గారుణ్యవర్తి వేంకటగిరిమూర్తి
మూర్తిత్రయశరీరు మునిజనోద్ధారు, ధారుణీసంగు నుత్తమశోభితాంగు
నంగుష్ఠభవసింధు యదాలోకబంధు, బంధురబలశూరు భక్తవిచారుఁ
జారుచక్రాబ్జాంకు సమరనిశ్శంకు, శంకకర్ణాధ్యక్షు జలజపత్రాక్షు
నక్షుద్రగుణసారు నఖిలసంసారు, సారూప్యకృతిసంధు శయనితసింధు
సింధురీశాధీను శీతలభాను, భానులోచను విష్ణుఁ బాలితకృష్ణుఁ
గృష్ణుఁ గౌస్తుభహారుఁ గేశవు ధీరు, ధీరూపగుణములు దెసలఁ బేరుకొని
కొనియాడ విని యొక్కకొండిక కొమ్మ, కొమ్మలలో నెలకొన్నపూమొగ్గ
మొగ్గనిమసుదంతి మోహనవాణి, వాణీశసంస్తుత వరహావభావ
భావజయంత్రంబుపగిది బూఁబోఁడి, పోఁడిమిగలమంచిపుత్తడిబొమ్మ
బొమ్మజంకెనలయభృతచంద్రవదన, వదనంబువాంచి నెవ్వగఁ జింతనొంది
యొందిలి నేకాంత మొకతెతోనాడి, యాడికకోడి యొయ్యనగుట్టుతోడఁ
దోడఁబుట్టుమొఱంగి తుంటవిల్తాని, కానిపించనియంపగములచేఁబొరలి
పొరలిచ్చి చిత్తంబుపొలుపెల్లఁదక్కి, తక్కినవన్నియుఁ దడవక మాని
మానినీమణి యున్నమతకంబులెల్ల, నెల్లగాసఖులెల్ల నెఱిఁగియాచెలువ
చెలువంబు వింతయై చెలువొందెనమ్మ, యమ్మదనావేశ మడరెనో కాక
కాకైనది వనాంతకౌతుకలీల, లీలావతిని జెంగలింపింత మంచు
నంచుముట్టంగనయ్యబలతో నిగిడి, గుడిగొని వనము గ్రక్కునఁ జొచ్చునపుడ
పుడమివసంతంబు పొడమె నందంద, యందమై కారాకు లవనిజతతులు
తతులు దప్పక రాల్చెఁ దగఁ జిగురొత్త, నొత్తినమొగ్గల నొనరికార్కమ్మ
కమ్మనివిరులతోఁ గాయలతోడఁ, దొడనె ఫలియించి తొరఁగుతేనియల
యలమావిమొత్తంబు లడరెంబున్నాగ, నాగరంగాశోకనాగకేసరక
కేసరకరవీరకింశుకాంకోల, కోలజంబీరలికుచపిచుమంద
మందారఖర్జూరమాధవీసమితి, మితి మీఱి శాఖలమింటితోరాసి

రాశికెక్కినయట్టిరావిల్కు లేచి, యేచింతయును లేక యింపుగాఁ బలుకఁ
బలుకందువలనుండి భ్రమరకుల్మ్రోఁగయు, రయమునశ్శారికారావంబులెనయ
నయముగాఁ జలిగాలినవ్యవాసనలు, నలువంకలఁ జరింప నలినాక్షు లంత
నంతకంతకు మీఱి యటుగుంపు గట్టి, గట్టిగఁ జీరలు గడుఁ బిగిచుట్టి
చుట్టుచు జంటలై పొరిదినొండొకరుఁ, గరులయానముల నొకట గుఱివాఱి
పాఱి నీపంబుపైఁ బరఁగెడు కేకి, కేకిస ల్గొట్టి మూఁగినమర్లసంది
సందీక మెలఁగెడు శాఖామృగముల, గములఁ జూచి హసించి కందరాళముల
ములముల మూఁగుచు మొనయుకోకిలలఁ గెరలుగఁ జేయుచుఁ గ్రీడంగ
రంగు
రంగుమీఱినపావురంబులు వలుకఁ, బలుకరించుచుఁ దమపైముద్దుచిలుకఁ
జిలుకలం బాంచి మచ్చికఁ జీరిపట్టి, పట్టికఁ దమతమపయ్యెద ల్బాసి
మూసినముత్యాలమురువుదొలంకి, లంకించి మాధవీలతలడోలికలఁ
గలసియూఁగుచును వేడుకలు గడుఁ బాదలఁ, బాదలతేనియలు సొంపులఁ
గోరి యాన
నానవాంబుజముల హర్షము ల్వొలయ, వెల యడుగని విరు ల్వెసఁ గోసి
బెరసి
రసికతతో నొక్కరమణిగోరంట, గోరంటఁ గౌఁగిటఁ గూరిచెఁ బొగడఁ
బొగడపై నుమిసెను పుక్కిటి మదిర, మదిరాక్షియొక్కరామాతిలకంబు
తిలకంబుఁ జూచె నొద్దిక నొకకాంత, కాంతాళమున నశోకముఁ దన్నె
నొకతె
నొకతెఱంగునఁ గరంబొనరరసాల, సాలంబుపైఁజూచె సకియ లీరీతి
రీతి దప్పక సంచరించి వసంత, సంతతోత్సాహంబు సలుపంగఁ బూని
పూనిటం గోరకంబులను నొండొంటి, నొంటిమై వ్రేయుచు నొగిఁగ్రమునను
ననుఁ జూడు మని కాంచనంపుఁబుట్టికలఁ, గలకల నగి గుప్పి కన్నులఁ జిమ్మఁ
జిమ్మనగ్రోవుల జీరి పన్నీట, నీటగ్గలముగాఁగ నించి యొద్దికను
గనుఁగొనమెరసి బంగరుకొమ్ములంది, యందియల్ మొఱయ నీరటు ముంచి
పోసి
పోసిగ్గువడిఁ దట్టుపునుఁగులువిసరి, సరికి బేసికి వేడుక నలిపి చేరువన
వనమధ్యమున సరోవరమటు గాంచి, కాంచీరవాంచితగతి డిగ్గిపొదివి
పొదివిచ్చకటు జలంబుల నీఁదులాడ, నాడం జలించు రాయంచల నలమి

యలమీనములఁ బట్టి యటఁబారవలను, వలనుగాఁగొంచక వంచి పైనెక్కి-
యెక్కి నమదములఁ నెసఁగి జక్కవల, కవలఁజన్నుల నిండుగా మోపిసోలి
సోలి తేటులఁబాఱఁ జొచ్చికొఁ ఝషలు, ఝషలు వాడి గోళ్లఁ దున్నుచు బద్మనాళ
నాళంబులజలంబునలిఁ బీల్చి యుమిసి, మిసిమిఁగొందఱు తమమీఁదఁ గల్హార
హారముల్ ధరియించి యంబువు ల్చల్లఁ, జల్లఁగా జలకేళి సలుపుచుఁ జెదరి
దరికి నేతెంచి నూతనసమీచీన, చీనాంబరములు దాల్చి ముదంబు గదుర
దురపురసొమ్ములు దొడిగి పేరుకలఁ, గలపిరుల్ కొప్పులఁ గైసేసి చెక్కి-
చెక్కిళ్లజవ్వాది చిప్పిల నదిమి, యది మీఱఁ గస్తూరి యలఁది రమించి
మించినఁ జూచి యర్మిలిఁబరితవన, వనరక్షకులు వచ్చి వరుసనీకతలు
తలు కొత్త వినిపింపఁ దగు వినుకలిని, గలి నర్మధనుఁడు వేంకటగిరీంద్రుండు
ఇంద్రుండుబ్రహ్మాయు నిరువంకనడవ, నడవడిగలపక్షినాథుపై నమరి
మరిగియూడిగములు మగువలింపొందఁ, బొం దైనభూషణంబులు దాల్చి
ప్రబలి

బలిమిఁ బీతాంబరప్రభలతోఁ దివిరి, విరివిఁ గేలీవన వీథి కేతెంచి
తెంచి వేయనితఱితిఁపుఁ గోరికలఁ, గలఁగొన విహరించెఁ గాంతకై తగిలి
గిలిగింతవలపులఁ గీలొకన్నరమణి, మణిమయ కేళిహర్మ్యమునఁ బంతానఁ
దానకం బైనగందంపువేదికను, దనుపట్ట మరునిచొకటిపురూపు వ్రాసి
వాసితోఁ బూజించి వరములు వేఁడి, వేఁడి దీఱఁగ మ్రొక్కి వెసఁ బుష్ప
రసము

సముకాన నర్పించి సరిఁబెంచె నాస, నాసమీపమున శేషాద్రీశుపసలు
సలుపుచూపులఁజూచె శౌరియుఁగృపను, బనుపడనచట నప్పుడఁతిరూపమును
మునుకొనిచూచి యామోదంబుదెమల, మలగొన్నసంపంగి మ్రాఁకుల
క్రిందఁ

క్రిందటితమి నెడగిరి యుండె నిచ్చ, నిచ్చట మది గుందు నిండి కేపార
నాఱని మైకొకలగ్గలంబయ్యె, నయ్యెడఁ గడు విరహాతిరేకమును
మునుముట్టెఁ గోయి లల్లుఁకలుచూపెఁ, జూపెట్టుకొనియలుల్ జుమ్మని
మొఱసె

మొఱసేసి వెఱపించె మొనసి శారికలు, కలుగుమ్రోఁతల నీలకంఠముల్పొదల
దళ మైనమన్మథతాపంబుకతనఁ, దనమేనిచెమట లంతటను బైవాఱె

(సశేషము.)

(29) ధనుర్విద్యావిలాసము.

కవులచరిత్ర కెక్కని యీగ్రంథముప్రతి యొకటి యిచ్చటకు వచ్చినది. దీని రచియించినయతఁడు కృష్ణమాచార్యుఁడు. గ్రంథావతారికలోనున్న—

క. భాసురసూరిగ్రామణి, భూసురముఖపంకరుహనభోమణి వినమ
ద్దాసనిచయచింతామణి, నే సింగరగురుశిఖామణిం గణుతింతున్.

...గీ. ఆయురారోగ్య పుత్త్రపౌత్త్రాభివృద్ధి, గలిగి రేపల్లెనగరశృంగారసౌధ
రత్నసింహాసనస్థితి రాజ్య మేలు భవ్యగుణశాలి జంగభూపాలమౌళి.

శా. ఆజంగక్షితిపాలుతమ్ముఁ డలరున్ హస్తాగ్రభాస్వద్ధనూ
రాజద్వజ్రముఖాదిఘోరశరధారాదారితారాతిసే
నాజంఘాలగజాంగభూషణభరానమ్రావనీధారణో
హోజాగ్రన్నిజబాహుఁడై తిరుపతిక్ష్మాధీశ్వరుం డిమ్ములన్.

... (అతఁడు) మహోత్సవసమయ సముజ్జృంభితకుతుంబశాహప్రముఖ పురాతన పాదుశానుగ్రహ పితృపితామహ ప్రపితామహలబ్ధపటుతరపటహా... డిండిమప్రముఖ హృద్యానవద్యవాద్య ఘుమఘుమధ్వానపూరిత దిగంతరాళుండై......ప్రాజ్యం బగు రాజ్యంబు పాలింపుచు రాజరాజాభిరక్షితం బగునల కాపురంబుకైవడి ధనధాన్యకరటి రథతురగభటసముదటం బగు రాచూరి పట్టణంబున యథేష్టభోగంబులం బ్రవర్తిల్లుచు నొక్కనాఁడు......

మ. నను రామానుజపాదపద్మయుగళీనవ్యావ్యయధ్యానపా
వనహృద్భావగతావతంసపదసేవాసక్తచిత్తున్ మరు
త్తనయారాధనలబ్ధచారుకవితాధారున్ సదారూఢభావను
నాస్థానకవిన్ నిజాశ్రితునిఁ బిల్వం బంచి పల్కెన్ గృపన్.

క. శ్రీరామభద్రుపనుపున, ధారాళంబై తనర్చుధనురాగమ మి
ద్ధారుణిఁ గావ్య మొనర్పఁగ, నారంభించితి భవత్సహాయముకలిమిన్.

వ. వెండియుఁ గోదండదీక్షాగురుం డగురఘుపతికటాక్షంబునం జేసి సద్గురులాభంబున నిద్ధనుశ్శాస్త్రంబు మాకు నధీతం బయ్యె. తత్తల్లక్షణంబులు శాస్త్రసమ్మతంబులుగా నుపన్యసించెద నీవును దత్ప్రకారంబు లధికరించి గద్యపద్యాత్మకంబుగాఁ గావ్యంగా నొనర్పుము......

క. పాత్రుఁడవై మైత్రేయస, గోత్రుఁడవై నారసింహగురువర్యునకుం
 బుత్త్రుఁడవై వెలయుదు వి, ద్ధాత్రిన్ మాపనువు సేయఁదగుఁ గృష్ణకవీ.

అను పద్యములంబట్టి యీకవి సింగరగురుని శిష్యుఁడు, నృసింహగురుని తనయుఁడు, మైత్రేయస గోత్రుఁడు ననియు గుంటూరుమండలములోని రేపల్లెను రాజైన పున్నెపల్లి లేక కృష్ణాని యనునుపనామము గలిగిన జంగన మాణిక్యరాయలకుఁ దమ్ముఁడై రాచూరిలోఁ బ్రభుత్వము చేయుచున్నతిరుపతిరాయలయానతిచే నీధనుశ్శాస్త్రలక్షణ గ్రంథము రచియించె ననియుఁ దెలియుచున్నది. ఆ శ్వాసాంతగద్యములయందలి యాచార్యపదము మాధ్వ వైష్ణవనామసామాన్యవాచకముగా నున్నను ‘లక్ష్మణపాదభక్తుఁడను, ఆంజనేయోపాసకుఁడ’ నని చెప్పికొనుటచే నితఁడు మాధ్వబ్రాహ్మణుఁ డని తోఁచుచున్నది. ఈతనియింటిపే రేమో తెలియదు.

కవికాలనిర్ణయము:—పైసోదరరాజులకుఁ బితృపితామహక్రమములో నెనిమిదవపురుషుఁ డగు రాజామానికరాయలు 184 గ్రామములతో విలసిల్లు ముక్తుజాన్నగరసామ్రాజ్య మేలిన ట్లిందలియవతారికయే చెప్పుచున్నది. ఈ ముర్తుజాన్నగరమునకు రెండవపేరు కొండవీ డని యు దీనివలననే తెలియుచున్నది. ఈసామ్రాజ్య మీతనికిఁ గ్రీ. 1630-1660 ప్రాంతములలోనివాఁడును గోలకొండనవాబు నగు కుతుబశాహ యిచ్చిన ట్లుండుటచేతను, ఈతని మునిమనుమఁ డగు నప్పారాయమాణిక్యరాయలను గ్రీ. శ. 1658-1707 నడుమ ఢిల్లీరాజ్య మేలిన యౌరంగజేబు గౌరవించిన ట్లుండుటచేతను ఈతనితరువాత రాజ్యము చేసినవారు సంఖ్య కేడుగురు గనఁబడుచున్నను బుత్రపౌత్రక్రమమును బట్టి నలుగురు మాత్రమే యేలిక లయినట్లు చెప్పఁదగి యుండుటచేతను గవిప్రేరకుఁ డయినతిరుపతిరాయలు నాతనిభ్రాత యగుజంగన మాణిక్యరాయలు ను గవియునుగూడ గ్రీ. శ. 19 శతాబ్దము ప్రారంభమున నుండిన ట్లూహింప వచ్చును. ఇందులకు గ్రంథాంతమందలి యీక్రిందివచనము గూడ సహాయపడఁగలదు.

“కీలకనామసంవత్సర మాఘ బ ౧౧ శుక్రవారంవరకు మహారాజశ్రీ, రాజామాణిక్యరావు తిరుపతిరాయనింగారికి గడ్డ...ముత్తంరాజు ధనుర్విద్యావిలాసం సంపూర్ణముగా వ్రాసెను” ఈ పుస్తకము వ్రాయించికొనిన తిరుపతిరాయ లెవరో నిశ్చయముగాఁ దెలియరాదు గాని నామసామ్యమునఁ బై సోదరరాజుల

సంతతిలోనివాఁ డని మాత్రము చెప్పవచ్చును. ఇది యిప్పటికి 67 సంవత్సరముల క్రిందట ననఁగాఁ క్రీ. 1847 సంవత్సరమున వ్రాయఁబడియుండుటను, బూర్వరాజుల పరిపాలనకాలమును బట్టి చూడఁగా మనకృతికర్తయు నతనిప్రేరకుఁడును బూర్వోక్తకాలమునకు గొంచె మీవలావల నుండి యుందు రనుటలో నాక్షేపణ ముండ దని నాయభిప్రాయము.

గ్రంథవిషయము:—ఇదిమూఁడాశ్వాసముల లక్షణగ్రంథము. ఇచ్చటిప్రతి మిక్కిలి పరిశుద్ధముగా సంపూర్ణముగా నున్నది. తిరుపతిరాయనిప్రేరణచేఁ గవి యీగ్రంథమును గుంటూరిమండలములోని యీమనిగ్రామ మందలి కోదండరాఘవస్వామి కంకిత మొనర్చెను. ఇందు మొదటి యాశ్వాసమున ధనుర్నిర్మాణపరిమాణము, మార్గణపరిగణన, శరవిధానమానప్రశంస, పుంఖోపసంఖ్యానము మొదలయినవియు, రెండవయాశ్వాసమున ధనుర్బాణగోపనార్హ్మని-చోళనిషంగరచనాప్రవచనము, మౌర్వీవిధానకథనము, అంగుళిత్రాణప్రకీర్తనము, జ్యారోపణప్రకరణము,......శరగ్రహణోపాయ ప్రతిపాదనము మొద లగునవియు, మూఁడవయాశ్వాసమున లక్ష్యశుద్ధిలాభము,...నారాచమోచనప్రకారము, చిత్రలక్ష్యభేదనోపాయము, శాబ్దలక్ష్యశరాభ్యాసవిలాసము, మొద లయినవియు నతిసరసముగా సుగమముగా వివరింపఁబడినవి. కవిత్వమును రసవంతమై యుత్తమశైలిచే నొప్పుచున్నది. ఇందుండి యొకటిరెం డుదాహరించెను.

శా. ఆకర్ణాంతము కాండముం దివియుచో నర్ధాంగుళం బాశుగం
బేకస్ఫూర్తినిలోనికిం దిగిచి లావెక్కించి యిట్టట్టునుం
బైకిం గ్రిందికిఁ దీక పుంఖముబిగింపన్ నిశ్చలంబై రయో
ద్రేకం బొప్పఁ గదంబకంబు నడచున్ ధీరుల్ ప్రశంసింపఁగన్

మ. శరసంధానవిధానతానకములన్ సంధిల్లునిర్దోషముల్
పరిభావించి ధనుష్కళానుకలనాభాస్వన్మనోవృత్తియై
శరసంధానవిమోచనమ్ముల విశేషమ్ముల్ పిసాళింపుచున్
నరుఁ డానందము పొందుచుండు ధరణీనాథుల్ ప్రశంసింపఁగన్

[ఇందు "కందాళ వెంకటాచార్యులుగారి పద్యాలు" అని కొన్నికలవు. ఈ యనను గూర్చి తెలియరాదు]

30. రుక్మిణీపరిణయము.

పూర్వము గోదావరీమండలమునందే యవతరించిన దయ్యు నాంధ్రకవుల చరిత్రము నెఱుంగనిమదనగోపాలచరిత్ర మనునామాంతరము గల యీ ప్రబంధముయొక్క సంపూర్ణమైనప్రతి యొకటి యిచ్చటకు లభించినది. దీనిని రచియించిన యతఁడు కొప్పర్తి నరసింహకవి. ఈతనినివాసగ్రామము, ఇపుడు కృష్ణామండలములోఁ జేరిన మొగలతుఱ్ఱుకోటకుఁ గోసులో నున్నసీతారామపురము. ఈతని తండ్రి గోపనమంత్రి, తల్లి, అచ్చమాంబ; ఇతఁడు భారద్వాజగోత్రుఁడు, కాత్యాయనసూత్రుఁడు, యాజ్ఞవల్క్యని యోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు గ్రంథావతారికలో స్వవంశమూలపురుషుఁ డగు రామశౌరినిగూర్చి యిట్లు వర్ణించెను.

సీ. గురుతరాంతర్వేది నరసింహమూర్తికిఁ గోవెల ల్గట్టించెఁ గోమరుమిగుల
భావనారాయణస్వామికిఁ గల్పించె వరగేహములు సర్వవరమునందు
రహి మీఱ విశ్వాసరాయపురం బనునగ్రహారము చేసె నధికలీల
నాయగ్రహారంబునందును దిగువయాతిరుపతి గావించె నరహరికిని

గీ. గడిమి నరసాపురస్థలధరణితోడఁ, గాల్వసీమకుఁ దా స్థలకరణ మగుచు
భూతిఁదన రెసీతారామపురమునందు, రమ్యగుణహారి కొప్పర్తిరామశౌరి.

క. సీతారామపురంబును, ఖ్యాతిగఁ గొప్పర్తి యనెడి గ్రామములకు వి
స్ఫీతస్థావరికత్వవి, భూతిని రామాఖ్యమంత్రి భువిపైఁ దనరెన్.

వీనింబట్టి కవి మూలపురుషుని వృత్తాంతము దెలియుచున్నది. మఱియుఁ గవి యవతారికలో—

"...గీ. కనకకౌశేయవసనంబు కటినిబొదల, నిడుదవాల మల్లార్చుచు నిలిచె నాదు
కలను దా నాంజనేయుఁడు కరుణ మీఱ నొక్కరేయిని బ్రాహ్మముహూర్తవేళ,

ఇట్లు మదీయస్వప్నంబున సాక్షాత్కరించి నీవు ప్రయోజనంబున సంచారంబు సల్పు. కొండపల్లి మండలంబునఁ గృష్ణవేణీనద్యుత్తరభాగసార్ధయోజనస్థలంబునఁ గోడూ రనియెడు గ్రామంబుదక్షిణజాంగలస్థలంబున నొక్క నీలప్రస్తరాంతరంబున వెలయుప్రతిమారూపంబు గల యాంజనేయుఁడను. మదీయానుజ్ఞను నాస్థలంబున మదనగోపాలపురం బనునగరంబు గట్టించి యందు మదనగోపాలమూర్తిని బ్రతిష్ఠ గావింపుము. అద్దేవునకు నంకితంబుగా నొక్క దివ్యప్రబంధంబు మదనగోపాలచరిత్రం బనునామంబున రుక్మిణీపరిణయ కథానుబంధురముగా నొక్క

సుకవిసింధురసాహాయ్యానుగ్రహంబున రచియింపు మని పలికిన.....ప్రణామం బుసలిపి...నిలువ నద్దేవుండు సుఖంబుండు మని పలికి తిరోహితుండైన, మేల్కని తదీయప్రబంధ నిబంధనంబునకు సమకట్టి తదాంజనేయోక్తమార్గంబునం దత్పుర (కోడూరు) దక్షిణజాంగలంబున నీలోపలంబులోన నాంజనేయబింబంబు గని సంతుష్టాంతరంగుండనై నిశ్చితస్థాపకలాపుండనై తదీయస్థలంబునం దటాకంబు నూతనంబుగా సంఘటించి పురంబు నిర్మించి తదుక్తకావ్యంబు రచింప సమకట్టి తత్సహాయంబునకు నొక్కమహాకవిసందర్శనం బపేక్షించి యున్నసమయంబున నొక్కనాఁడు—

సీ. శ్రీకృష్ణపదయుగాశ్రితుఁడు సాంఖ్యాయనగోత్రుఁడు రఘుపతిపౌత్రుఁడు గురు
వకవీంద్రపెద్దమాంబాపుత్రుఁడురఘునాధునకుఁబూర్వజుఁడుమృత్యుంజయున క
నుజుఁడు రావూరివంశజుఁడు ననుమకొండసంజ్ఞను గలయాదిశాఖను వెల
సినవాఁడు జాతకసిద్ధాంతముఖకథాచతురుఁడు నుభయభాషావిశేష

గీ. రసగుణాలంకృతికవిత్వరాజితుఁడు వి,రచితబహుకావ్య వీరనారాయణాది
శతకదండకసంస్కృత సరసపద్య, గేయపదుఁడైనసంజీవరాయసుకవి.

అమ్మహానుభావుండు మదీయభాగ్యంబునఁ జనుదెంచి దర్శన మిచ్చిన నత నికి జాంబూనదాంబరాభరణంబు లొసంగి బహూకరించి నిలిపి తత్సహాయాను గ్రహంబుపైఁ బ్రబంధారంభంబు గైకొన్నవాఁడ" అని వ్రాసికొనెను, ఇందలి స్వ ప్నము నిజమైనది యైనను లేకున్న నాంజనేయునియందలి భక్తిచేఁ గల్పించుకొని నది యైనను గావచ్చును గాని యీస్వప్నవృత్తాంత మంతయు మాత్రము కో డూరియొద్ద మదనగోపాలపురము కట్టించుట మొదలుగా సంజీవరాయ కవి సహా యముచే రుక్మిణీపరిణయము వ్రాయుట యనునంతవఱకును సత్యమై ప్రత్యక్ష మగు చున్నది. ఈ నరసింహాకవికి సహాయపడిన పైరావూరి సంజీవరాయకవి రచియిం చిన కావ్యములలో—

31. వీరనారాయణశతకము.

మాత్రము పరిషత్తునకు లభించినది. ఇదియు "వీరనారాయణ ముకుంద విశ్వతుంద" అనుమకుటము గలిగిన నూటతొమ్మిది సీసపద్యములతో విలసిల్లుచు న్నది. ఈ ప్రతియుఁ బరిశుద్ధముగా నున్నది. ఇందలిపద్యములు "లక్ష్మీసనాథ

రక్షణపరాయణుండ నారాయణుండ" యను దశావతారపద్యములవంటి గునుకు సీసములు. ఇందులకు నరసింహకవి యవతారికలోని దని పైనుదాహరించిన సీస పద్యమే ప్రమాణము. ఆపద్యము సంజీవరాయకవి రచియించిన యీవీరనారాయణ శతకములోఁ జివర—

సీ. "శ్రీకృష్ణపదయుగాశ్రితుఁడ సాంఖ్యాయనగోత్రుఁడ రఘుపతిపౌత్రుఁడ గురు
వక వీంద్రపెద్దమాంబాపుత్రుఁడ" అని యుత్తమపురుష విశేషణములతో

నున్నది. ఇందలి పద్యమే రుక్మిణీపరిణయమునఁ బ్రథమపురుష విశేషణములతో మార్పఁబడి యున్నది.

కవులకాలము:—రుక్మిణీపరిణయాంతమున—

సీ. శకమజఖర్షీందుసంఖ్యను దగుపరాభవరాధపూర్ణిమాభానుతిథికిఁ
బరిపూర్ణరుక్మిణీపరిణయ మనెడిప్రబంధంబు మదనగోపాలచరిత
భారతరణమందుఁ బార్థున కాప్తుఁడై కృష్ణదేవుఁడు నిర్వహించినట్లు
రావూరిసంజీవరాయకోభయభాషఘనకవి నిర్వాహకంబు సేయఁ

గీ. జెప్పి యీకృతి నీకు నర్పింపఁ గంటి, నుభయకవులకుఁ గైవల్య మొదవఁ గోరి
సరసకొప్పర్తి గోపన్నసచివసుతుఁడ, భువిని నరసింహనామక కవిని నేను.

అనుపద్యముంబట్టి యీగ్రంథము శాలివాహన శకవర్షములు 1709 అనఁగాఁ గ్రీస్తుశకము 1787 వ సంవత్సరమున సమాప్తి నొందినట్లు స్పష్టమగుచున్నది. అనఁగా నిప్పటికి 127 సంవత్సరముల క్రిందట నీకవు లిద్దఱు నున్నట్లు నిశ్చయము. పరిషత్తునకు వచ్చిన యీగ్రంథమును నరసింహకవిపౌత్రుఁ డగు వెంకనార్యుఁడు వ్రాసినట్లుగా "వికారినామ సం॥ అధిక జ్యేష్ఠ బ 3 శుక్రవారంవరకు సీతారామ పురం కొప్పర్తి చినరామేశం కొమారుఁడున్ను యీకృతీశ్వరుఁ డైన నరసయ్యకు మనుమఁడున్ను నయిన వెంకన్నస్వంతముకు స్వహస్తంగా రుక్మిణీపరిణయము సర్వమున్ను పంచమాశ్వాసం సంపూర్ణంగా వ్రాసుకొనెను" అని యున్నది. దీనింబట్టి యీగ్రంథ మిప్పటికి 76 సంవత్సరములక్రిందట వ్రాయఁబడినట్లు తెలియుచున్నది నరసింహకవిని నాతనికాలమును గూర్చి తెలియఁజేయుచు విశేషములు తెలుపుఁడని యీప్రతివ్రాసిన వెంకన్నగారికిఁ బౌత్రులును బరిషత్తునకు గ్రంథ మొసంగిన వారు నగు రామచంద్రరావుగారికి నేను వ్రాయఁగా వారు సీతారామపురమునుండి యొకజాబువ్రాసిరి. అందలి విశేషాంశముల నిందుఁ బొందుపఱుచుచుంటిని.

" అయ్యా, నరసింగకవిగారికి రుక్మిణీపరిణయము లిఖించిన వెంకన్నగారు పౌత్రులు. ఆ వెంకన్నగారు మత్పితామహులు. వెంకన్నగారికి రుక్మిణీపరిణయము వ్రాయునప్పటికి సుమారు 30 సంవత్సరములుండు నని యిప్పుడు జీవించి యుండిన యాయనకొమార్తె చెప్పుచున్నది. ఎట్లయినను వెంకన్నగారి జననకాల మిప్పటికి నూతేండ్లు కావచ్చును. గ్రంథకర్తకును దత్పౌత్రుఁడగు వెంకన్నగారికిని 70 సంవత్సరముల భేదముండవచ్చునని యూహింపవచ్చును.

చిత్తగించవలెను.

సీతారామపురం,
నరసాపురంపోస్టు.

ఇట్లు విధేయుఁడు,
కొప్పర్తి రామచంద్రరావు.

గ్రంథవిషయము:—ఇది మైదాశ్వాసముల ప్రబంధము.

ఇందలివిషయము గ్రంథ నామమే తెల్పుచున్నది. గ్రంథ మందందుఁ జెదలు కొట్టినను దెలియఁ దగినస్థితిలో నున్నది. అముద్రిత మయిన యీగ్రంథమును దద్వంశజులు గాని యాంధ్రభాషాభిమానులు గాని శీఘ్రముగా నచ్చొత్తించిన చో భాష కుపకారము గావించిన వారగుదురు.

ఈగ్రంథము వ్రాయుటలోఁ గొన్ని శకటరేఫములు గూడఁ బరిపాటిసేయఁ బడినవి గాని యింతకంటె నామూలాగ్రముగా నరసున్నలు తెలుగుఁలో ౧ ఒకటి యంకె వలెఁ గనుపట్టుచున్నవి. ఇది విశేషాంశము.

కవిత్వవిషయము:—ఇది సరసవర్ణనములతో శృంగారప్రధానముగా మనోహరముగా నేకవిధ మగుశైలిచే నొప్పుచున్నది. కాని యందందు వ్యతిరేకక్త్వార్థకములను ద్రుతాంతముగాఁ బ్రయోగించుట మొదలు గా వ్యాకరణదోషములు లేక పోలేదు. మఱియు 'నుభయభాషాకవి యగుసంజీవరాయకవి తోడ్ప డె'నని చెప్పికొనుటకుఁ దగినట్లుగా యత్నసాధ్యము లగు 'దైత్యభిత్కథాధ్యాయుఁడు, సాధుసంగధనదాయుఁడు," మొద లగు ప్రయోగములు గూడ నందం దుఁ గన్పట్టుచున్నవి. మొత్తము మీఁదఁ గవిత్వము క్లిష్టము గాక మృదువుగా రసవంతముగా నున్నదనుటలో నాక్షేపణము లేదు. శైలి తెలుపుటకు రుక్మిణీపరిణయమునుండి రెండుపద్యములును, వీరనారాయణశతకము నుండి యొకపద్యము ను దాహరించెదను.

చ. హితమతి యుం బురోహితుఁడు నింగితవేది దయాపరుండు స
ద్వ్రతుఁ డతికార్యవాది యగువాఁ డొకభూసురుఁ డీరహస్య మా
తతగతిఁ దాల్చి శీఘ్రగతి ద్వారక కేగి మురారిఁ గాంచి యీ
మతము నుపన్యసించి గరిమం గొని రాఁగలవాఁడు గల్గునే?

శా. నిన్నున్ వేల్పులవే ల్పటం చెఱుఁగకన్ నేడీతఁ డాయోధనా
సన్నుం డౌచు మహాపరాధము ఘటింపం బల్కి దద్గర్వవి
చ్ఛిన్నుం డయ్యె మదగ్రజుం డితఁడు రక్షింపంగఁ బాత్రుం డగున్
నన్నున్ మన్నన చేసి కావుము జగన్నాథా యనాథావనా.

ఇందలి పద్యములు చాలవఱకు భాగవతమునందలి రుక్మిణీకల్యాణములోని పద్యముల ననుకరించుచున్నవి.

సీ. ఆర్తులఁ గాచుటకై దీక్ష చేసి కంకణము గట్టిన జగత్కారణపర
మేశు రమేశు నమేయగుణస్వరూపు ననంతు నిన్ను నన్ బ్రోవు మనుచు
మాటి మాటికి బతిమాలు కుశీలు న నూరదర్శనుఁ గృతదురితబుద్ధి
హీను నజ్ఞాననిదాను న న్నే నేన తలపోసి కొని నవ్వ దరలనుండుఁ

గీ. గాదె బ్రహ్మాండకాండసర్గస్థితిలయ, కల్పనానల్ప సంకల్ప కరుణజనిత
గురువిలాసధూతభ్రూక కొలనుపాక, వీరనారాయణ ముకుంద విశ్వతుంద

ఉభయభాషాకవియగు నీతని యీశతకమందును వ్యాకరణదోషములు తఱచుగా నున్నవి.

---

32. వాస్తుసారసంగ్రహలక్షణము.

ఇదియు నేచరిత్రలోను బేర్కొనఁబడని గ్రంథమే. దీనికవి పేరుసోమల గణపయామాత్యుఁడు. ఇతఁడు తన్నుఁ గూర్చి యవతారికలో నిట్లు వ్రాసికొనెను.

"సీ. శ్రీకృష్ణపదభక్తిసేవాధురంధరుఁడ వసిష్ఠగోత్రసంభవుఁడ ఘనుఁడ
ననుపమానాశ్వలాయనమానిసూత్రుండ విద్వత్కవీశ్వరవినయపరుఁడ
శ్రీమంతుఁ డగుపేరుసోమలశివరామవంశవార్నిధికి జైవాతృకుండు
కమనీయగుణకీర్తి గరాపన్మంత్రికిఁ, బౌత్రుఁడఁ బరమపవిత్రచరిత

గీ. మల్లమకు వెంగనామాత్యమణికి సుతుఁడ, సకలసిద్ధాంత గణితశాస్త్రజ్ఞు లెంచ
వాస్తుశాస్త్రంబు మదియించి వార్త గాంచి, మహిని జెలు వొందు గణపయా
మాత్యకవిని.

ర్తనభాకృత్యవధాదిమార్గములు నక్తంపార్థివశైవాలము
లునరుక్తార్కసుతాచ్ఛటల్దగెఁ దమంబు ల్తండతండంబులై. 29

క. దిక్కుల నిండి ధరిత్రిం, గ్రిక్కిఱిసి మహాతమంబు గిఱికొనె నిఁకఁ దా
నొక్కింత దలఁకి కాంతు, ల్దక్కక విలసిల్లు చుక్కలం గప్పతఱిన్. 30

గీ. పొడిచె ధవళిమ జాబిల్లి పొడుపునందు, రమణసమ్మయపు వజ్రపురాజురాక
తగ నెఱింగింపఁ జీఁకటు ల్దామె దారి, కడకు వ్రాయంగఁ దెచ్చుకాకల మనంగ. 31

వ. అంత. 32

చ. కుముదములందు సామముఁ జకోరములందును దానము న్రథాం
గములయెడ న్విభేదనము గాటపుఁజీఁకటియందు దండన
క్రమమును గానిపింపఁగఁ దగం బగ ల్లెల్లను నీఁగి విక్రమ
క్రమ మమరంగ రాజు దగఁ గైకొనె నయ్యుద * యాద్రిపీఠమున్. 33

ఉ. ఎల్లజను ల్పయోరుహభవేశ్వరవిష్ణుమయాత్ముఁ డైనవాఁ
డల్లవికర్తనుం డనుచు నాఁడుదు రాతఁడు గాఁడు నేన సూ
తెల్ల మటంచు లోకులకుఁ దెల్పినరీతిని జంద్రునందు రా
గిల్లెను మేనిపైఁ బొడుపుఁగెంపును బాండిమముం గళంకమున్. 34

సీ. ఖరకరుం డతిశీతకరలీలఁ దనయందు వహియించె నీతనివంకఁ గాదె
మును దిస్సమొలసామియును రాజశేఖరత్వము దాల్చె నీతనివంకఁ గాదె
యమరులై వేర్వేఱ యదితినందను లున్నవారు దా రీతనివంకఁ గాదె
నరులు సేవను జిదానందానుభవయోగివరు లౌదు రీతనివంకఁ గాదె

గీ. జలజభవువంక హరివంక శౌరివంకఁ, గొదవ లెన్నుచు మ్లేచ్ఛులు మొదలుగాను
వరుస నీక్షింతు రీతనివంకఁ గాదె, యనఁగ జాబిల్లిఁ బ్రాఁకె నయ్యభ్రవీథి.

ఉ. పెంపునఁ జందమామ ప్రతిబింబముఖంబునఁ జుంబనంబు గా
వింపను రాయఁ దత్కరనవీనరుచు ల్పలితభ్రమంబు పు
ట్టింపఁగ రోసి పద్మిని ముడించెను మోమునఁ దమ్మి మోడ్చెనా
యిం పటు సూచి నవ్వె నన నెంతయును న్వికసించెఁ గల్వయున్. 36

గీ. భూనభోవీథిఁ బాలారఁబోసినట్లు, కడలిదొరపట్టి వెన్నెల గాయసాగెఁ
బులికిఁ బుట్టినకూనకుఁ బొసఁగ నొక్క, చాఱయును లేదె దీని కాశ్చర్య మేల?

* యాచలసింహపీఠమున్. అని మాతృక.

వ. (1)ఇవ్విధంబునఁ జంద్రికాపూరంబులు తోరంబులై బిసప్రసవకోరకవిసరంబులం
బొదల దళంబుల సందుసందులం దెఱపి గని చొరంబాఱి మధురసమిళితపరా
గయోగంబు పొంగార గాఱ యిచ్చినచందంబున నందంద తార్కొను కోక
నదగేహినీగేహంబులకు నోముబిల్లలఁ గప్పినయొప్పును గల్పించుచు నటమున్న
హిమకరతరుణకిరణఘనఘనికవికరక్రియానటీరంగంబు లగు సురంగంబులును
దరవికచోత్పలనిర్ముక్తప్రభామండల యంత్రోపలంబులను దళంబు లను కొత్త
ళంబులు విరియించి మకరందవాహినీనిర్ఝరంబులకుఁ దగుతత్తటంబు లను
వంకదారులఁ జొచ్చియు నగ్గలికలం గలకుమంగడినంగడిం జడిసి యెడనెడఁ
దొరంగు లగు మధుకరఝుంకారంబు * * * * * *
రావంబు తననందనునికువలయప్రతిపాలనఖేలనావిశేషంబు గనుంగొని హ
ర్షోత్కర్షంబునం బొంగి నింగి ముట్టంబోలుఁ గాకున్న మకరకర్కటమీనంబుల
క్రిందనుం బడి యేమి యని వెఱఁగున సురగరుడసిద్ధవిద్యాధరముగ్ధధవళేక్షణా
సముదయంబు వీక్షింప జారసారసముఖజాలంబులకుఁ బ్రతికూలంబును మలి
మ్లుచప్రచారంబులకు దూరంబును విరహిణీజననివహంబునకు దుర్వహంబును
జంద్రకాంతశిలావిటంకంబులకుఁ బొంకంబును నై జగదండఖండంబున నిండి
మెండుకొనియె, నయ్యవసరంబున. 38

గీ. అంతకటమున్న సమయకృత్యములుదీర్చి, యవనిసురుఁడుండెఁబర్ణశాలాంతరమున
దేవదేవియుఁ దాఁ దదాదేశమునను, గడక మునుమాపె తనపాదకడకు వచ్చి.

సీ. మెదిచి మెత్తినమృగీమదపంక మాయెను మడవలు గట్టఁ బైఁబడినరొంపి
తావి గుబాళింపఁ దగుగందవొడి యయ్యెఁ బాఁదులుద్రవ్వఁ బైఁబడినదుమ్ము
నిండారు కుల్కుపన్నీటితుంపురు లయ్యె బడలికచేఁ గానఁబడినచెమట
కంతుకేళిని గచాకచిఁబెనంగుట యయ్యె వడిఁ బొదల్ చొరఁ జిక్కువడినకురులు

గీ. అనుచుఁ దనయింట సకలభాగ్యములు గలిగి
తొలుతఁ దానున్నయునికియుఁ దలఁచి యప్పు
డచటఁ దానున్న యునికియు నరసి యరసి
దిగులు మదిఁ దోఁప మఱియుఁ జింతింపఁ దొడఁగె. 40

---

(1) ఈ వచన మసంపూర్తిగా నుండుటచే నున్నంతవఱ కున్నట్లే యుంచితిమి.

— * దేవదేవి విప్రనారాయణుని ఐంచింపలేక వగచుట. * —

ఉ. అక్కట! నాఁడు మాయపువనానిల మేటికి వచ్చె వచ్చెఁబో
యిక్కడికంచు వెంబడిన యే నరుదేఁ బసి యేమి గల్గెఁబో
యిక్కఱినాత్మఁ డయ్యెడల నేల వసించె వసించెఁబో యితం
డెక్కడఁ బోయె నే మనక యీగతిఁ బన్నిద మేల వైచితిన్! 41

క. నటనల విలాసరేఖా, ఘటనల నీజటిఁ గరంపఁగల నని మున్నే
నటు సూచితి నటుగా దని, యిటు సూచితిఁ దెమలఁ డింక నే మనుదానన్.

క. నేరము చేసితి నెంతయు, నీరేరుహనాభ! కృష్ణ! నీతిరువెళ్లం
జేరితి నానతీవే శ్రీరంగా! రంగరంగ! సేవకఫలదా! 43

— * దేవదేవికి రంగనాథుఁడు స్వప్నంబునఁ గనఁబడుట. * —

వ. అనుచుఁ జింతాపారవశ్యంబునఁ గొంత నిద్రించుసమయంబున నార్తజనశర
ణ్యుండును నిఖిలదేవతావరేణ్యుండును భక్తజనఫలప్రదాయకుండును నగురంగ
నాయకుం డయ్యింతి భావంబున నావిర్భావంబు నొంది, యిందువదనా! భవ
దీయమనోరథంబు సఫలం బయ్యెడు మల్లి యీప్రొద్దు దనుకం దాళుకొ మ్మని
యనుగ్రహించి యప్పంచశరగురుండు తిరోహితుం డైనం గనుంగొని మే
ల్కాంచి చంచత్కుతూహలాద్భుతభయసంభ్రమంబులు మనంబునం బెనం
గొన నాత్మగతంబున. 44

క. ఈకల నిజమో కాక ప,రాకో చోద్యమగు ... ...లు గలవే
నాకల యెన్నఁడు నిక్కల, గాకుండఁగ నిటు పరాకు గాఁ బనిగలదే. 45

క. అని యెపుడు తెల్లవాఱునను, దినకరుఁ డేక నెప్పు డపరదిక్కున కరుగున్
వనరుహనాభునివాక్యం, బనుకూలం బెప్పు డగునొ యని యున్నంతన్. 46

— * సూర్యోదయాదివర్ణనము. * —

క. రక్కసులగురువు గురునకు, వెక్కస మగుమతికినిరవు వెరవుల కెల్లన్
దిక్కు నుతికెక్కువేగురుఁ, జుక్క (దివి) న్విటులు గను నుచుక్కనఁ బొడిచెన్.

చ. ఇననిభుఁ డైనగౌతమ మునీంద్రువివేకము పీటఁబుచ్చి యా
యనఘునిధర్మపత్నికి నహల్యకు నాఱడి దేఁ దలంచి వం
చనగతిఁ గూయు కోడిగపుజాతి జగద్విపరీతచర్య మిం
చను జరణాయుధంబు లగుసాములు దా నెఱిఁగించె నెంతయున్. 48

మ. పలుకంబాఱె నగారచారుతరదీపజ్వాలిక ల్దిక్తటం
బులఁ గన్పట్టె విటీభుజంగనయనంబుల్ నిద్రఁ జెందెన్ విధూ
పలజాలంబులజా లడంగె శశిబింబస్ఫూర్తి తగ్గె న్నవో
త్పలకాంతు ల్గ్రహిఁ దీసె దాఁగె నిరు లంతన్ గహ్వరాంతంబులన్. 49

శా. స్మర్తల్ తత్త్వ మటంచు నెంచఁగ మహాశైవు ల్మనోజద్విష
న్మూర్తింగా నుతియింప వైష్ణవులు విష్ణుం డంచు నెంచం దగం
గర్తారుం డనుచుం దురుష్కులు మొదల్గాఁ గొల్వఁ బ్రత్యక్షమై
మార్తాండుం డుదయించె నబ్ధితటసీమప్రాశితౌర్వాకృతిన్. 50

క. అప్పుడు మేల్కని చెలి ముద, మొప్ప న్ముఖమజ్జనాదు లొగిఁ దీర్చుచుఁ దా
నెప్పటివలె మును సెప్పిన, చొప్పున నెలదోఁట సేయ సూర్యుఁడు గ్రుంకెన్.

మ. కలికాలంకృతనీప ముర్ఝితసరః కాదంబ ముత్కోచకం
దల ముద్విగ్నశికుంత ముల్లుఠదుదన్వల్లోల (కల్లోల) ము
త్కలికాయుక్తమయూర మున్ముఖసముద్యచ్చాతకంబు న్నము
జ్జ్వలజంతువ్రజ మంబుదాగమము విశ్వస్తుత్య మయ్యెం దగన్. 52

చ. మొనసె ఘనాఘనంబులు తమోనికరంబులు మచ్చరించి పే
ర్చిన మఱి యొక్కవేళ నొకచెల్వున నొక్కవిలాసరేఖఁ జ
య్యన నుదితంబులై ... ... ఘనంబులై
మునుకొని కారుక్రమ్ముకొని ముంచెనజాండకరండమండలిన్. 53

క. పలపలపలయని చిలికెం, బెళపెళపెళ యనుచు నుఱిమె బెళుకు మెఱుంగుల్
తళతళతళ యని మెఱసెన్, బళిబళిబళి యనుచు హాలికపటలి నటించెన్. 54

క. చిటిపొటిచినుకులు మిగులన్, బొటబొటబొట యనుచుఁబడఁగఁ బొదరిల్లుగడుం
జొటజొట నురియఁగ గురుకుచ, కటకటకట యనుచు వగపు గడలుకొనంగన్.

సీ. పనిలేనిపనివట్టి పాలార్చి పన్నిదం బనినతొల్లిటినేరమునకుఁ దోడు
కుడిచి కూర్చుండి యేఁ గ్రొవ్వి యివ్వేషంబుఁ బూనినయవివేకమునకుఁ దోడు
గుఱు తెంచ నొగాము లెఱుఁగక చెన్నారుగొనినట్టి మూఢత్వమునకుఁ దోడు
తలఁచిన తలఁపు బాములు దెచ్చినట్టి యీతనువు వయోగర్వమునకుఁ దోడు
గీ. గొంటుబాఁపఁడుతారాతికొడుకుఁబోలె, నటనలకులోనుగాకయుండుటకుఁదోడు
నన్నునదవద వణఁకించినలఁపవలసి, వర్ష మిదె యీాదయును దాను వచ్చె ననుచు,

క. తడయక మిక్కిలి వానం, దడియక వసియింపఁ దగును దాపసిపంచం
*గడుకుంజమంత నుటజము, కడకుం జనవలయు ననుచుఁ గదిరి కడంకన్. 57

సీ. అఱు గిఱు నఱుగు గొంకిఱుగొంకి తడవును దడవి యొయ్యనదాఁటు దాఁటి నిలుచు
నిలిచియొంటిఁదలంకుఁదలఁకి దైవముదూఱు దూఱిపొదల్దూఱుఁదూఱియలయు
నలసి నివ్వెఱఁ గందు నంది యుస్సురు మను నని కెలంకుల చప్పుడరయు నరసి
చనఁగొంచుఁగొంచియమ్మునిపొలంకున విను వినికొంతధృతివహించును వహించి

గీ. కటికిచీఁకటిగములకుఁ గలఁగుఁ గలఁగి, మెఱుఁగుమొత్తమ్ము లడరిన మెచ్చు మెచ్చి
చినుకుపడిన గగుర్పాటు సెందుఁ జెంది, యలసగతితోడ మెలపున నరుగు నరిగి.

క. ఆవనజేక్షణ గాంచెం, బావన మగు పర్ణశాలపజ్జను ఘనసా
రావి న్నిజదళచలనవి, రావిన్ శాఖాపరంపరావిన్ రావిన్. 59

వ. ఇత్తెఱంగునం గురంగనయనారత్నం బతియత్నంబునం గనుంగొని యంతంతఁ
దనయునికికిఁ గొంతయనుకూలం బగు తదీయమూలంబున నిలిచి విసీలిమధా
మం బగుధూమంబునడుమం గడు మెఱయు పావకజ్వాలచందంబునఁ జంచరీక
మాలికాభిరామం బగుకుఱంగటి ధామంబున మషీమలినపటఖండంబునం
బొదిగిన మాణిక్యశలాకవిలాసంబున వఱఁ గరువలి విసవిస విసరం గసర ముసర
(సర)సంగల కటికిచీఁకటి మొత్తంబుమధ్యంబున నిగనిగని నెమ్మేనుదీఁగె రాగిల్ల
నల్లన వసియించె నయ్యవసరంబున. 60

క. మూఁగినఘనములు తొరం, గ్రాఁగినధరణీతలంబుకడసెక లెల్లన్
లోఁగినఁ గుంభద్రోణము, గాఁ గురిసెం బాము ద్రేలఁగట్టినరేవన్. 61

చ. పడువడగండ్లపెల్లు గనుపట్టు మిణుంగుఱుఁబుర్వు లంచు సం
దడిగొను నింద్రగోపములు దర్దురఘోరరవంబు తోడుతం
దడఁబడు నార్తజాంతవనినాదము మోదము మీఱ నెల్లెడం
గడుఁ జరియించు రాజిలనికాయములుం దఱి చయ్యె నయ్యెడన్. 62

క. దిగువం బాఱెడు వెల్లువ, కగపడి పై జాఱు ద్రోనియాకులనీటం
బొగులుచును జల్లువాన, న్నొగులుచు నయ్యింతి యిట్లను న్మదిలోనన్. 63

శా. చెప్పం జిత్రముగాఁ జలంబు గొని వచ్చె న్నాలిపెన్వాన యే
నెప్పాటం దరియింతు దీని మఱి యిం కెవ్వారు దిక్కేగతిం

---

* ఇది సాధుపాఠముగా లేదు.

దప్పం ద్రొబ్బఁగ వచ్చు నీ వకట నిన్న న్నాకలం గన్న రం
గప్పా ! యెక్కడ నున్నవాఁడవు పరాకా న న్నుపేక్షింతువా ! 64

చ. అనుచును బల్కరించు వసుధామరవల్లభుఁ బిల్వఁ జూచు ని
మ్మునిను లతికోపను ల్పరమమూర్ఖులు తాళుకొనంగనేర రే
మని శపియింతురో యని భయంపడుఁ బోయిన ప్రొద్దువోయినం
జినుకున గూర్చి యిందునె వసించుట మేలనుఁ బెక్కుభంగులన్. 65

క. ఇవ్విధమున నవు డయ్యెల, జవ్వని తలపోయుచున్నసమయంబునఁ దా
నవ్వలని పర్ణశాలం, బువ్విలుతునితండ్రిఁ బోలుమునినాథుండున్. 66

సీ. కావేరిపూర మెక్కటువెల్లిపిరిసెనో యొద్దిగాలువ యెద్ది యుర్లఁబడెనో
అసదైనప్రాఁకు లెయ్యవి పెల్లగిల్లెనో యాకు లేవంకఁ జీకాకుపడెనో
కలిగొట్టుచిన్నరెమ్మలఁ... బెట్టెనో మడిసి యేకొమ్మలు బడలుపడెనో
గాడ్పుచే నూటాడి కారె మేమయ్యెనో లతికలచెలువ మేగతిని జనెనో

గీ. తెలియ నింతయు వర్షంబు వెలుప దాయె, మొగులు మొత్తంబు లెప్పటిపగిదితోడఁ
గారుక్రమ్ముచునున్నవో కాక కొంత, పలుకఁబాటెనో కనుఁగొనవలయు ననుచు.

క. లేచి మెలపునఁ దాను గీలించియున్న, మెట్టు సడలించి వాకిటఁ బెట్టినట్టి
తడికఁ గేడించిపాదరునఁ దార్చిభూమి, సురశిఖామణియటుతొంగిచూచునపుడు.

క. చలనం బందక చెంగటి,వలనం గనుపట్టు నిందువదనం జూచెం
(1)గలవాణీనిందితకోకిల, నంచితకలన రావి కెలనం గెలనన్. 69

— * విప్రనారాయణుఁడు దేవదేవింగాంచి పర్ణశాలకు రమ్మనుట. * —

చ. కని దూరీకృతకంటకస్మితగతోగ్రగ్రావరాజి న్నిర
స్తనికుంజావళిఁ బొల్చు నిచ్చలదళచ్ఛాయ స్సదాచారపా
వన వేదిం బవడంపుఁదీఁగె నడురే వర్తింపుచుండం బనే
మని శంకింపఁ దళుక్కున న్మెఱసె నుద్యచ్చంచలాజాలముల్. 70

క. క్రొమ్మెఱుఁగుల దగదగరుచి, చిమ్మనిచీఁకటుల విరియఁజేసిన నపుడా
కొమ్మం దెలియఁగఁ గనుఁగొని, క్రమ్ముదయం దేవదేవిగా నెఱిఁగి తగన్. 71

క. వానం దడియఁదొడంగిన, దాన న్నేననుచు నాకుఁ దగనెఱిఁగింపం
బూనదు మది నానదు ధృతి, మానదు వర్షంబు గోల మగువ యటంచున్.

---

(1) గలనిందితవాణినిగో,—అని మాతృక.

పంచచామరము. అదే మదేమి దేవదేవి! యాతరుచ్ఛదావళీ
భిదాపదాన మైన యట్టి పెంజడిం గడు న్వడం
కెదే మదీయదీప్యమానగేహ మూహసేయను
న్నదేకదే మదేభయాన యండ నుండరా దటే. 73

చ. అని మునినాథచంద్రుఁడు దయారస ముప్పతిలంగఁ బల్కిన
న్విని యలివేణి తా నిదియె వేళ యిఁక న్మఱి వీనిఁ దక్కఁగాఁ
బెనఁగకయున్న నన్ను వెడపేరునఁ బిల్తురు లోకు లంచు దం
డను దరుకోటరంబుకడ డాఁచిన సొమ్ములు నంబరాదులున్. 74

క. నెమ్మిని గైకొని యయ్యుట, జమ్మునకుం గీరవాణి చని తత్ప్రతిహా
రమ్ము కడ నిలువ, రా రా, రమ్మని యమ్మునివరుండు రమణిం బల్కెన్. 75

ఉ. అక్కడనుండ నేల ధవళాయతలోచన వానగొట్టునం
జిక్కితిగా యిఁకం దడవు సేయక నాచిగురాకు శయ్యయా
దిక్కున నున్న దీవిటు మదీయపదంబులదండ నుండు పెం
పెక్క ధరింపఁగావలయుఁ గొమ్మిదె నాదగుకావిశాటియున్. 76

సీ. తడికాళ్లతోఁద్రొక్కెదవు చుమీ యిదెకుశాస్తరణమాత్మధ్యానసమయమయ్యె
నెడలేదు వేష్టువ లిట రమ్ము ముట్టెదుగనుక ప్రాతస్స్నానమునకు వలయుఁ
బీఠంబుపైఁ దీర్థపెరుమాళ్లు వేంచేసియున్నవా రపచార మొసరిల్లు
పెట్టినారము పట్టిబుట్టిలోఁ *దులసిని జతనంబు భానువాసరము తెపు

గీ. పల్ల మామూల వలిపిరి చల్లు నిచట, నురెయు నీచాయ నిద్రమైనుందు నచట
మహితరామానుజోదీర్యమాణభాష్య, ముఖబహుగ్రంథసామీప్యమునకుఁ
జనకు. 77

క. కన్నియ! కమండలూదక, మున్నది నీ వటు దొలంగ కుండఁగ దండన్
దిన్నెఁదనంబున నుండు మ,టన్నను మన్ననకు నలరి యబలామణియున్. 78

ఉ. అప్పుడు జిల్గు దువ్వలు వొయారముగా సవరించి క్రొవ్విరుల్
గొప్పున నొప్పఁగాఁ దుఱిమి కుంకుమ గందము మై నలంది తా
నుప్ప తిలన్ విభూషణసముత్కరమున్ ధరియించి హారముల్
గొప్పచనుంగవందు నెఱికొల్పి తనర్చి విలాసవైఖరిన్. 79

* దిరుతులసీజదళంబు—అని మాతృక.

ఉ. నూతనరత్నభూషణమనోహరకాంతులు దీపదీప్తవి
ఖ్యాతి వహింపఁ గ్రొమ్మెఱుఁగు కైవడి మై నిగుడంగ దేవదే
వీతరళాక్షి యప్పుడమివేలుపుచెంతకుఁ దారసిల్లి హే
లాతిశయంబునం బలికె సంకురితప్రమదానురాగయై. 80

ఉ. గోపవధూసనాథ(పదకో)కనదద్వయభక్తియుక్త! యో
తాపసవర్య! యీచలికతంబున నిద్దుర రాదు విష్ణుగా
థాపదలీలలం గడపెదం దగుఁబ్రొద్దని విన్నవించి యా
లాపము సేసి కోకిలకలధ్వని యెంతయు వింతసేయఁగన్. 81

మ. తలిరుంబోఁడి దొడంగి మాధవుఁడు రాధం గూడి క్రీడించుగా
థలు కుబ్జం గయిగొన్నవార్తలును సత్యావాంఛ లీడేర్చుస
ద్దులు నాభీరవధూటులందుఁ గల పొందున్ రుక్మిణీదేవిపై
చెలిమిన్ గ్రొన్ననవిచ్చులాగు వినిపించెన్ మాధురీవైఖరిన్. 82

వ. ఇవ్విధంబున శృంగారరసప్రధానంబు లగుకథాప్రసంగంబులం గొంత యభి
ముఖుం జేసి కలఁక యగుధైర్యంబున నున్నయతనిఁ జేరంజని. 83

చ. పడఁతుక తేనె లుట్టిపడఁ బల్కెను మానికులావతంస! యిం
పడరఁగ మార్దవంబునెల వయ్యెడునీచరణంబు లొత్తెదన్
బడలినవార లిందనుకఁ బాదులు ద్రవ్వియుఁ గారె మెత్తియున్
మడవలు దీర్చియుం బిదప మార్చియుఁ గాలువ లేర్పఱించియున్. 84

గీ. అనుచుఁ గెంగేలుఁజిగురుల నతనిచరణ, కమలయుగళినిజాంకపీఠమున నునిచి
యంగుళీయకఖచితంబు లైనమణుల, డాలు నఖరుచితోఁ బల్లటీలుగొనఁగఁ.

క. ఒత్తెం జరణము లటు దళు, కొత్తం దమి మునికి లాక లొత్తెం బులకల్
చిత్తజుఁడు వింటఁ దూపున్, జత్తాయతపఱిచి చిత్త జల్లుగ నేసెన్. 86

సీ. అప్పుడు చిట్టుముట్టాడుకోరికలనుదమకంబుచే నైన తత్తఱములఁ
జేపెత్తి నిలుకడఁ బెడఁబాయుసిగ్గుల నొక్కింత నుజ్జీఁత లూఁగఁదారి
యుదుటుఁ జన్నులకునై యుఱుకు నగ్గలికల మన సొగ్గనీయని మౌగ్ధ్యములను
అధరమాధురికి నట్టాడు ముచ్చటలను గొదలేక ముప్పిరి గొన్నమమతఁ

గీ. దపసి డెందంబు వెన్నచందమునఁ గరఁగెఁ, గలయి కలమీఁదితీమురునఁ దోలఁ
గుచుండఁ
జిత్తజునిసేన తెలగోలు సేసినట్లు, కులుకుఁబలుకులఁ జిలుకులకొలికి పలికె. 87

క. లాలనసేయవు నన్నుం, గేళీసంగతుల బుజ్జగింపవు నీపై
హాళిం జిక్కితిఁ గన్నడ, యేల దయం జూడ లాఁతినే మునినాథా! 88

మ. అనుచుం గంకణనిస్వనంబులు బెడం గై మ్రోయఁ గాంచీకల
స్వనముల్ వీనులవిందు సేయ నుదుటుంజన్నుల్ గయాళింప లో
చనదీప్తుల్ చెలఁగంగఁ బైకొనుసరోజాతాస్యతోడం గడం
కను గ్రీడింపఁదొడంగె న త్తపసి రంగస్వామి ప్రేరేపఁగన్. 89

సీ. చక్కెరకెమ్మోవి చవిచూచి చవిచూడ నొయ్యనఁ గొనగోర నొత్తి యొత్తి
కివకివఁ బారువ క్రియఁ బల్కు పల్కంగ నలకళాదేశంబు లంటి యంటి
చుంబనక్రియలను జొక్కించి చొక్కింపఁ గడునొయారముగాఁగఁ గవిసి కవిసి
బిగియారుకౌఁగిట సొగియించి సొగియింపఁ (జిట్టంటు)చేతలఁ జెనకి చెనకి
గీ. యుచితబంధానుబంధత నుండి యుండ, ననఁగి పుంభావరీతుల ననఁగి పెనఁగఁ
దపసికిని నేర్పియతనిమౌగ్ధ్యంబు నెల్ల, రమణి * విడనాడె † నతనుప్రౌఢిమ చెలంగ.

చ. అవితథయోగధుర్యుఁ డగునమ్మునికిన్ మఱపించె నంతయున్
ధవళవిలోచనాధరసుధారసధార నిజోపరిస్థలైం
దవకరమాధురీధరసుధారసధారఁ దలోదరీమణీ
నవమణితప్రసంగకలనాద మనాహతనాదముం దగన్. 91

చ. మెలఁతయుఁ దాను సంయమి తమిన్ విహరింపఁ గవేరకన్యకా
పులినతలంబునందు సురపొన్నలనీడల మాధవీలతా
వలయములన్ మరందరసవాహినులన్ మదకీరశారికా
కులకలనాదసంకులనికుంజములం గమలాకరంబులన్. 92

వ. ఇవ్విధంబునఁ గతిపయదినంబు లిచ్ఛావిహారంబులం గ్రీడించి యయ్యంగనాలలామంబు నిజమనోరథానుసరణపరాయణుం డగువిప్రనారాయణుం దోడ్కొని యగ్రజసమీపంబునకుం బోవం దలంచి యయ్యారామంబు నిర్గమించె నయ్యవసరంబున— 93

ఉ. రంజితశింజితాభరణరమ్యనటీనట … … …
రంజయపుంజనావనిధరప్రభుతత్పరతాశుకీమణీ

---

* విడనాడెన్. ఇం దిది ప్రేరణమునం దుపయోగింపఁబడె. † అతనిప్రౌఢిమ - మాతృక.

పంజరకుంజరాశ్వభటబంధురదర్పితశత్రుభూమిభృ
ద్భంజనకంజనాయకసుతస్ఫుటనీతికళావిశారదా ! 94

క. ... ... సం,చారిత యింపాన్నృపాలచంక్రమఖురళీ
ధారితకరేచితప్లుత, ధారాధౌరేయజవనతరగంధర్వా ! 95

కవిరాజవిరాజితము. పురహరసూనుసమానసమిజ్జయ ! పుష్పసుగంధసుగంధిలధీ
కరటిఘటాశ్రవణాంచలబంధురగంధమహోపచితార్చిరతి
స్ఫురదనలప్రతిమాద్భుతతేజ ! యశోరుచిజాలసచోళబహిః
పరిపిహితాబ్జభవాండకరండకృపాశరధీ ... ధీశరధీ. 96

గద్య. ఇది శ్రీశంకరస్వామిసంయమీశ్వర చరణసరోరుహధ్యానానందకందళితసౌం
దర్యధుర్య ప్రబంధపరమేశ్వరవంశపవిత్ర లింగనమనీషిపుత్ర శ్రీకాళహస్తీశ్వర
దయాసహాయ చెదల్వాడ మల్లయనామధేయప్రణీతం బైన విప్రనారాయణ
చరిత్రం బనుమహాప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

విప్రనారాయణచరిత్రము.

చతుర్థాశ్వాసము.

క. శ్రీవిలసితగోవిందమ, దేవీహృదయేశ వంశదీపక పదరా
జీవ*సమద్వైరిధరి,త్రీవల్లభ మాకరాజుతిమ్మనృపాలా! 1

గీ. అవధరింపుము నిజపురీయాత్ర సేయు
నావధూటిని విప్రనారాయణుండు
తమకమునఁ జూచి మమత చిత్తమునఁ బెనఁగ
నపుడు తానును వెనువెంట నరుగఁదలఁచి. 2

సీ. శ్రీవిభుఁ డవధరించిన †గండవడములు తిరుమణిపెట్టియ ‡విరులగరిడి
కౌపీనముల నొలిగట్టినదండంబు గావివేష్టువ యుట్రికళవసంబు
సురచిర(ంబగు) నూర్ధ్వచూర్ణకరండంబు జలకమండలువును దులసిపేరు
నధ్వఖేదాపహం బైనదవిత్రంబు పుస్తకంబులు కుశప్రోత బ్రుసియు
గీ. మఱియు దొరకినగొడ్డలి మచ్చుకత్తి, సలగపాఱయు మొదలుగాఁ గలిగినట్టి
సాధనంబు లి వెక్కడిసడి యటంచుఁ, బలుతెఱంగుల నల్లటు పాఱవైచి. 3

మ. నలినాక్షీమణివెంబడిన్ సురటియున్ బంగారుభృంగారువున్
జిలుగుంబావడయున్ విభూషణములుం జీనాంబరంబుల్ సరం
బులు కర్పూరకరండముల్ పరిమళంబుల్ గందపుంగప్పపా
వలునుం గావట నించుకొంచుఁ జనియెన్ వాచంయమస్వామియున్. 4

క. ఈపగిది నతఁడు గునగున, గోపన వెనువెంట నరిగెఁ గొంకక కామాం
ధోఽపి నపశ్యతి యనిమెడి, యాపలుకులు పలుక నిశ్చితార్థము గాదే? 5

గీ. వారిరుహనేత్ర తనయింటివారిలోనఁ, బంత మీఁడేఱె ననుచును సంతసించి
త్రోవ నమ్మాని నటువలెఁ దోడి తెచ్చె, నటువలెనె తెచ్చి యక్కచెంగటనునిచె.

క. ఇట్టాఁగద నీచూచిన, యట్టిమహాయోగి యీతఁ డౌఁగద మును నేఁ
బట్టినప్రతిజ్ఞ యిటుతుది, ముట్టెంగద చూడుమీ ముముక్షువరేణ్యున్. 7

---

* సమత్సరిపంథిధరిత్రీ - అని మాతృక. † గండవిడియలు - మాతృక. ‡ పూలగరడి - మాతృక.

ఉ. అప్పుడు దేవదేవిని దదగ్రజ గన్గొని మానివంకయుం
దప్పకచూచి నివ్వెఱఁగు నానయు సంభ్రమమున్ మనంబులో
నుప్పతిలంగ నోచెలియ! యోవికచోత్పలపత్త్రనేత్ర! నీ
కెప్పొలఁతుల్ దలంపఁ బ్రతి యెవ్వరు! నిన్ను నుతింపశక్యమే! 8

క. చక్కఁదనంబులులేవో? చొక్కపుసరసతలులేవో? సుదతుల్ లేరో?
నిక్క మిటువంటి చిత్రము, లెక్కడనుం జూచి యెఱుఁగ నేఁ దరలాక్షీ. 9

క. ఓకన్నె! యింతజాణవు, గాకున్నను రాజులెల్ల గారవమొప్పన్
నీకుం గైవస మగుదురొ, యీకడ నీరానియీవు లిత్తురొ? చెపుమా. 10

సీ. నెఱవాది నని వచ్చి నీకుఱంగట నిల్చి యేచెలి వీణవాయింప నేర్చు?
భరతశాస్త్రక్రియాప్రౌఢిచే నేకాంత నీకడఁ జక్కఁగా నిలువనేర్చు?
నంగనాగమరహస్యము లెఱుంగుదు నని యెవ్వతె యెదుట వాక్రువ్వనేర్చు?
లావణ్యరేఖావిలాససంపద మేటి నని యేవధూటి నిన్నెనయనేర్చు?
గీ. అఖిలగుణగణసంపన్ననైననీదు, తెఱఁగు సకలంబు నెఱిఁగియు నెఱుఁగలేక
ముదిత! నీతోడ నేను బన్నిదము చఱచి, యోడితిని నీకు నిఁక మాటలున్నవేల?

గీ. అనుచుఁ గౌఁగిటఁ గదియించి యగ్రజాత
చెలియలిని నిట్లు మూఁడుమెచ్చులును మెచ్చె
దేవదేవియు వివిధసంభావనముల
వారభామిను లెంతయు గారవింప. 12

క. నయగారవుఁదమిఁ గపట, ప్రియముల మెఱమెచ్చుఁబల్కరింతను మిథ్యా
చయములను బైపచారవు, నయమున మునిఁగూడి కొన్నినాళ్లు రమింపన్. 13

క. భూదేవుఁడు దా నేమిట, బూదారియు నొక్కకాసుఁ బొరయించుటయున్
లే దఁట సకలము నడపిన, యాదొరగతి సంచరించునఁట యిది తగవే? 14

గీ. అనివిచారంబు తనకు నింతైనలేక, సుగుడితన మనుమా ఱెల్ల సున్నసేసి
యన్నిటికిఁ దానె చనవరి యగుచుఁ దిరుగ, నావిధము నెల్లఁ గడు దేవదేవి రోసి.

సీ. కన్నులల్లార్చి రొక్కారొక్కములు మాళ్లవరుసగా గడియించువారిఁ జూచి
కట్టడ కిసుమంత కడమైన వేఱొక్కవైపులఁ జనఁ జూచువారిఁ జూచి
తఱితీపు పుట్టించి తక్కిచేకాసెల్ల వడివెట్టి రాఁ దీయువారిఁ జూచి
మొగమోట యడిగి సొమ్ములమీఁదఁ గళవారి వదలక యార్జించువారిఁ జూచి

గీ. విటుల మఱియును వంచించు విధముఁ జూచి
యమ్మునీంద్రుండు కడుఁ బేద యగుటఁ జూచి
తల్లి వేసారికొనెడుచందంబుఁ జూచి
సఖులు ముడుగుల్లఁబోయెడుసరణిఁ జూచి. 16

క. ఈయునికి వారకాంతకు, నాయమె యిది యేఁడుతోడుసు నాఁటికి నాయం
బాయె నిఁకం గలకాలము, పాయక యత్తపసిగోడవఁ బడఁగాఁగలదే. 17

క. అపకీర్తి గాక యుండఁగ, నెపుడును నే మెలఁగుకరణినే మెలఁగుచు నీ
తపసిని నిలువెడలింపఁగ, నుప మూహింపంగ లే దొకో! యనునంతన్. 18

— * వేశ్యమాత విప్రనారాయణుని వెడలఁగొట్టుట. * —

సీ. గమకించుకీలుగుఱ్ఱముపదంబులరీతి నున్నదంతంబు లుఱ్ఱూఁత లూఁగ
వక్షోజములు జాఱి వ్రాలిపో మీఁగాళ్లకడదాఁక దూఱుదుంకంబు లాడఁ
బలుకరించినను జెంతల జేర రాకుండ వాతుంపురులు చిత్తవాన గురియ
గుఱ్ఱుగు ఱని కొళ్లుకొళ్లున దగ్గుచోఁ దవిలిన చెవులు చిందర్లువోవ

గీ. బుజముపై నొక్కరోఁకలి పూనిపట్టి, గదరుకొనుచును గసరుచుఁ బెదవు లదరఁ
గొదవ లెన్నుచుఁ దాఁగన్నకూఁతు రున్న, తావునకు వచ్చె నల దేవదేవితల్లి. 19

క. ఇటువలెఁ జేరంజని య, వ్విటకంటకి కూఁతు నదరవేయుచుఁ బట్టీ!
యిటువంటివెఱ్ఱిదానవు, కటకట! తగవగునె వీనికడ వసియింపన్? 20

మ. కొలఁదుల్ మీఱినసంపదల్ గలభుజంగుల్ వీట లేరో! వదా
న్యులుగారో! వలవంతలం గలఁగి నిన్నుం గోరి రారో! నవో
త్పలపత్రేక్షణ! వీనిమాయలకు బందా గాక నీయీడుభా
మలలో వన్నెయు వాసియుం గలిగి యమ్మా! సొమ్ముపార్జింపవే. 21

చ. ప్రతి మఱి లేని లేఁగోమిరెప్రాయపునాఁడె విలాసవైఖరిన్
మితిగడవం బదార్థము దమిం గడియించుట నీతిగాక యీ
తతి చని పిమ్మటన్ ముదిమి దారసమైన మ ఱేటిసుద్దులే
గతజలసేతుబంధములు గావె ధనార్జనపుంబ్రసంగముల్? 22

చ. నెటికలు దీసి యిచ్చకము నేర్చి ప్రసంగము దీసి యప్పట
ప్పటికి నుతించి మాటలను బందిరివెట్టి సటల్ ఘటించి ము
చ్చట లెఱింగించి బాస సహజంబుగ నందఱ కన్నిరూపులై
విటులఁ గలంచి తీయఁదగు విత్తము లుత్తమవారకాంతకున్. 23

వ. అని యవ్విటకంటకి యివ్విధంబునం గూరిమిపట్టిఁ గిట్టి దిసంతులు గొట్టి కట్టె
దుటం గంబంబుమఱుంగునం గదలమెదల వెఱచియున్న యమ్మహానుభావుం
జేవెలుంగునం గనుంగొని నెన్నడుమం జీర జాఱఁ జుట్టుకొని కొంకిబింకిమొకం
బునఁ జికిబికివెండ్రుకలు జుంజుఱుఁగొప్పునం జెదరి యుప్పరం బెగయ రోఁ
జుచు నడుగులు దడఁబడం బడఁబోవుచుఁ గదలి యదలించి విదలించి వైచుచుఁ
జేరం జని—— 24

ఉ. ఓరి యుటంకి! యీవికసితోత్పలగంధిని మారునింటిసిం
గారపుఁబూజవారువముఁ గారుమెఱుంగులలోని తేట నా
కూరిమిపట్టి నిట్టిననగూఁటితనంబున బేలువెట్టి తౌ
రౌర! గణింప నన్ను వినవా? మఱి యిప్పరిలోనితక్కరిన్. 25

క. ఇలుసొచ్చి వెడలనేరవు, మలయుచు నేనాఁటిచుట్టమవురా మోరీ
ములుచ! యిటునాగృహంబునఁ, గలిగినసొమ్మెల్ల గుల్లగట్టి తినంగన్? 26

ఉ. ఎన్నఁడుఁ గాసు వీసమొక టిచ్చినవాఁడవుగావు వీట నీ
వన్నియకోడెకాండ్రు తగవారవధూటులకై యొసంగునా
చిన్నెలు నీవు చూచియు నిసీ! తలవంపఁగ నేర వన్నిటం
బిన్నతనంబు దాల్చితివి పెద్దగ నిన్నిఁక నాడనేటికిన్? 27

సీ. కడుబట్టతలల మోకాళ్లను ముడివెట్ట నేనేర్తు మఱియును నేనెనేర్తుఁ
గోటికిఁ బడగెత్తి టాటాలుగుణియింప నేనేర్తు మఱియును నేనెనేర్తుఁ
గొలిచి మింటికి నేలకును సూత్రపట్టంగ నేనేర్తు మఱియును నేనెనేర్తుఁ
బుడమిలో పట్టియా బూమెలుసేయంగ నేనేర్తు మఱియును నేనెనేర్తుఁ
గీ. దవిలి యిలువిద్య తక్కడితనము నాది
కపట మేనిచ్చువారికిఁగాని దొరక
దహహా! ననుఁ గన్నుఁ బ్రామినయట్టి గడుస!
యుండుదువుగాని యింక నోరోరి! యనుచు. 29

క. మెడఁబట్టి వెడలద్రొబ్బినఁ, గడు నతఁ డీడిగిలఁబడఁగఁ గ్రమ్మఱఁ దపసిం
బుడిసిటిపట్టుగఁబట్టుచు, వడి నొకజరఠయును దాను వాకిట వైచెన్. 30

గీ. వైచి సరగునఁ గ్రమ్మఱవచ్చి తలుపు, మూసి గడెపెట్టి యికఁ మునిముచ్చు కాన!
యిటుమొగంబైననాకొద్దియెఱఁగెదనుచు, నింటికినివచ్చె నవ్విటకంటకియును.

క. జనని గయాళితనంబును, మునిపతికిం గలుగుతనుకమును గులధర్మం
బునఁ గినుక దనకు సమ్మతి,యునుగా నలదేవిదేవి యూరక యుండెన్. 31

చ. అలధరణీసురేశ్వరుఁడు నవ్విటకంటకిచేతఁ బెక్కుభం
గుల నిటమాటలం బడి దిగుల్ దుదిఁ దోఁపఁగ దేవదేవిపై
గలవలవంత యేమఱి కొకానొకచోటికిఁ బోనెఱుంగక
స్మైలఁతగృహంబుపంచఁ దినెమీఁదను రంగపతిం దలఁచుచున్. 32

క. ఒకచోట నోదిఁగె నమ్ముని, మకరాంకశరానువిద్ధమానసుఁ డగుచున్
ల...యపుడు తపనుఁడు, చకచకరుచితోడ నపరజలధిం గ్రుంకెన్. 33

ఉ. అంతటరంగశాయి వివిధావసరాన్నము లారగింపుచు
న్నంత నవీనగానకలనానటనశ్రవణావలోకనా
నంతరవేళ సేవకుల నందఱఁ బంచి మణీమనోజ్ఞశు
ద్ధాంతనికేతనంబున రహస్యవినోదవిహారహారియై. 34

సీ. భుజగేంద్రుఁడుపధానముగనునొయ్యననొక్కహస్తంబుతలక్రిందనుండ మొందఁ
జక్కఁగాఁ గటిమీఁదఁ జాఁచినడాకేలు పద్మానుబంధసంపదలు దెలుప
జలదంబుపైఁ గ్రొత్తతళుకిచ్చుసాంధ్యరాగముశేవఁ బీతాంబరము చెలంగఁ
జాయకుంకుమదట్టిఁ జక్కఁజెక్కినవంకి చెలువువిలాసంబు జిగి దొలంక
గీ. నిండువేడుకఁ బాలమున్నీటిసుతయుఁ, బంటవలఁతియు నీళయుఁ భక్తితోడ
నడుగుఁదమ్ముల నొత్తఁగ నతులసౌఖ్య,లీల నారంగపతి పవ్వళించియుండె 35

క పవిలేనిపని ముఖాంబుజ,మునకుం జెన్నగ్గలింప ముసిముసి నగినన్
వనరుహగేహిని విభునిం, గనుఁగొని యిట్లనియె నర్మగర్భముగాఁగన్. 36

చ. మమతఁ బితామహుల్ భువనమాన్యునిఁ గన్నపురాణపూరుషో
త్తమ ! నునుమించుఁజెక్కుల సుధారుచి పర్వఁగ నిర్నిమిత్త మీ
క్రమమున లేఁతనవ్వుఁజలుకం బని యెయ్యది ? యేవధూటిపైఁ
దమిఁగను వేసితితో ... ... నీకిపు డాప్రసంగముల్. 37

క. రంగద్విలాసకుబ్జా, లింగనతోషితమదీయలీలాసేవా
సాంగత్యవచనరచనల, భంగుల నేమైనఁ గొదవపడెనో ? యుపేంద్రా ! 38

వ అని సచాతుర్యంబుగాఁ బలికిన రంగనాయకుం డయ్యంగనాలలామంబు వదనం
బాలోకించి. 39

క. ఓలలనామణి! నాపై, నీలాగున సంశయింప నేటికి నన్య
స్త్రీలాదరహాసాగమ, మూలం బామూలచూడముగ నెఱిఁగింతున్. 40

ఉ. తోయరుహప్రభూతకులదుగ్ధపయోధివిధుండు విప్రనా
రాయణనామధేయుఁడు మహాత్మవిధేయుఁడు యోగమార్గధౌ
రేయుఁడు పొల్చు సద్గుణగరిష్ఠుఁడు మచ్చరణారవిందసే
వాయతబుద్ధియై యహరహంబును బువ్వులతోఁట సేయుచున్. 41

ఉ. ఆమహితాత్ముఁ డొక్కవెలయాలికి మిక్కిలి తాను గూర్చువాఁ
డై మమతన్ మెలంగుచు నొకప్పుడు నేమియు నీయకున్నచో
గామిడి దానితల్లి విటకంటకి యిల్వెడలింప వంతచే
భామినియింటిపంచ బహుభంగులఁ జింతిలుచుండ నవ్విటిన్. 42

క. నావుడు నిందిర దేవా! దేవరపదభక్తుఁ డిట్లు దీనతఁ బొందం
గావెస నతనిం గావం, గావలదే యింత(దనుక) గడచినపనియున్. 43

సీ. పాఱుఁడ నని పట్టపగలు నట్టేటిలోఁ బలువచేఁతలకుఁ బాల్పడినవాని
విదితంబుగ విచిత్రవీర్యుని రాణివాసములకు నడి దెచ్చి చనినవానిఁ
బుణ్యతీర్థము లాడఁబోయి యులూచి యన్కన్యకాపత్యంబు గన్నవాని
మోహినిపై మోహమునఁ బెక్కుదివసముల్ దన్నుఁ దానెఱుఁగక యున్నవాని
గీ. దయను రక్షించి భక్తవాత్సల్యమహిమ, దనర మీరిట దివ్యచిత్తంబునందు
నవధరింపఁగఁ ద(గదె)? మహానుభావ! జీవితేశ్వర! యిట్లుపేక్షింపఁదగునె? 44

క. కేవలమూఢులఁ బోరసిన, కైవడిఁ జింతాభయాదికంబులు వోరయం
గావచ్చునె జగదీశ్వర! తావకదాసానుదాసదాసుల కైనన్. 45

ఉ. ఏతఱినైన నిన్ను భజియించిననిత్యుల లోఁదలచినం
బాతకముల్ దరింపని ప్రపన్నులు నెవ్వగ లుజ్జగించి వి
ఖ్యాతులు గానిభక్తులు నిజాధిపతిత్వము దాము పూని నీ
చేతఁ దగం బనిం గొనని సేవకులుం గలరే జనార్దనా! 46

ఉ. కావున నమ్మహీసురశిఖామణి దుర్దశమాన్పి యింతటం
గావఁగదయ్య నామనవిగైకొని నీవు దయాపరుండవై
నా విని రంగశాయి వదనంబున లేనగ వంకురింప న
ద్దేవిని జూచి యంబునిధిధీరగభీరతరస్వరంబునన్. 47

క. శతపత్రపత్రలోచన! యతఁడు మహాయోగి మామకాద్భుతమాయా
గతి నట్లున్నా డెంతయు, నితరులవలె నతనిఁ బొరయునే మోహాదుల్? 48

సీ. నిక్కి చూడఁగఁ గల్గెనే యంబరీషుని దూర్వాసుఁ డొనరించు దుర్నయములు?
పై చేయఁ గలిగెనే ప్రహ్లాదుని హిరణ్యకశిపుచే నగునవగడపుఁ బనులు?
పొరయఁ గల్గెనె పాండుపుత్రులసతి దుస్ససేనుండు సభను జేసినకొఱంత?
కారింపఁగల్గెనే గజరాజు నిర్వక్రనక్రభీకరవిక్రమక్రమంబు?
గీ. వీరు వారన నేటికి? వినవె నాదు, భక్తకోటిని హరిహయబ్రహ్మలైన
ధిక్కరింపఁగ శక్తులో? చక్క నెదుట, నిలువనైనను శక్తులో? తలిరుఁబోఁడి! 49

ఉ. ఆపద లొందవచ్చునొ? భయంబులు చేరఁగ వచ్చునో? మన
స్తాపము డాయ వచ్చునొ? విచారము చెంతల నుండ వచ్చునో?
పాపము లాచరింప మతి పైకొన వచ్చునొ? మామకీనసే
వాపరతంత్రచిత్తు లగువారిని నీలవినీలకుంతలా! 50

క. కలవే యిహపరసుఖముల్? దలఁపఁగ మద్భక్తివిరహితము లగుయజ్ఞా
దులయందు నెందునైనను, జలజానన! నేల విడిచి సాదన గలదే? 51

క. మన్న్యస్తాత్మకులై తగు, నన్యస్తుతిరహితు లున్నతాఖిలలోకా
ధ్వన్యుల్ శతశతమన్యుల్, ధన్యుల్ గతమన్యు లమరతాపసమాన్యుల్. 52

మ. హరిణీలోచన! యట్లుగావున మదీయంబైన లీలార్థమై
ధరణీదేవకులావతంస మనురక్తస్వాంతుఁడుంబోలె నీ
కరణిన్ వర్తిలు నే తదాచరితమత్కైంకర్యపూజానమ
స్కరణధ్యానఫలంబు లెన్నఁ దరమే చర్చింపఁగా నేరికిన్? 53

వ. అయినను దగువిధంబుల నీవునుం జెప్పెదవుం గనుక కరుణాతరంగితావలోక
నంబులం గటాక్షించి రక్షింపఁ దగు నని యరవిందమందిరకుఁ దెలిపి పురో
భాగనిక్షిప్తంబును విభీషణదత్తంబును నానారత్నఖచితంబును నుచితోప
చారయోగ్యంబునుం బర్యంతవ్యాప్తనైగనిగ్యంబును నగుకనకపాత్రంబు గై
కొని— 54

క. డం బలరఁగ నొకవటువై, శంబరరిపుజనకుఁ డైనసఫలత నర్థి
త్వం బని బలి నడుగుట హృదయంబునఁ గడు రోసి దాత యయ్యె ననంగన్.

— * రంగపతి దేవదేవికి బంగరుగిన్నె యిచ్చుట. * —

ఉ. ఈయపరంజిగిన్నె యిపుడే విటకంటికి కిచ్చి విప్రనా
రాయణు దేవదేవిని రయంబునఁ గూర్చి సుఖానుభూతులం

జేయఁ దలంచి యెంచి సరసీరుహనాభుఁడు నేకయామికా
త్యాయతభీకరార్భటి నిజావసథం బటు నిర్గమించుచున్. 56

క. చిటు కనక మాఁటుమడఁగిన, పుటభేదనవీథి నరసి పొలఁతుకతలవా
కిటికడ నోవిటకంటకి!, విటకంటకి! తలుపు తీయవే యని పలుకన్. 57

క. ఆపలుకు తా వెడల్చిన, తాపసిపలు కనుచు లంజతల్లియుఁ గోపో
ద్దీపిత యై యిఁక నాచే, నీపరి పెట్లఁ బడ కరుగునే వీఁ డనుచున్. 58

పంచచామరము. ఇసీ యిసీ! మొగంబు సూడ కిల్లు వెల్వరించినన్
వెస న్విసింగి పోవు సిగ్గు వీసమంత లేదు నీ
దెసం బసల్ ఘటించె దేర! త్రిమ్మరీ! మ ఱిట్లు వ
చ్చి సారెసారె నన్నుఁ గెర్లఁజేయరాక పొ మ్మిఁకన్. 59

క. కాదేని చేతిరోఁకటి, వాదులు వారించి లెస్స వడ్డించిన-చో
నీదిక్కున నీకెవ్వరు, రా దిక్కని పల్క నవ్వి యతఁ డి ట్లనియెన్. 60

క. †ఓ ముదియ! నీవు గొట్టిన, నే మగు నెవ్వారికైన నీరోఁకటిచేఁ
దామును వడికెద ననఁదగు, సాములు మాయంతకులము చాలరె చెపుమా.

సీ. వింతవాఁడను గాను విటకంటకీ! విప్రనారాయణుం డంపినాఁడు నన్నుఁ
దాళుకొ మ్మొకకొంతతడవు నానామధేయము *రంగరా జని యంధ్రు జనులు
తత్ప్రియశిష్యుండ ధగధగద్యుతులచేఁ గడుమెఱుంగారు బంగారుగిన్నె
తెచ్చినాఁడను నీకు నిచ్చి ర మ్మనఁగను గైకొను మిది యనర్ఘంబు సుమ్ము

గీ. పలుకు తెలియంగ వినుము సొమ్ములకు నేమి, వలసినవి యెల్ల నగు సువర్ణపాత్ర
మాత్రమనియుండవలదునీమనసులోన,గడియసడలించుతల్పుమొక్కరముదిగిచి

క. అనుమాట లోను వెలిగా, మొనసిన పేరాస వారముఖ్య యు మఱి త
జ్జననియు నొండొరుఁ గడవం, జని దిగ్గనఁ దల్పు దీసి సంభ్రమ మొదవన్.

చ. వినయము సేయు తేవను రవి(ప్రతి)బింబము వోలె నప్పు డ
య్యనఘుని కేలుఁగెంజిరుటాకునఁ బొల్చుపసిండిగిన్నె గ్ర
క్కున ముదిచెంచడంబు గయికొన్నది యై కుహనావటూత్తముం
దనయవరోధమందిరమునం దగునైందవర్ణతవేదికన్. 64

గీ. ఉనిచి కనుగారవంబున ననఘచరిత
నట్టనడురేయి చెప్పుచున్నాను మమ్ము

† అర్థమూహ్యము. * శ్రీరంగరాజనుల్ కాంతోపయంధ్రుడు—మాతృక.

* నరమరలు లేక మీయుపాధ్యాయువలెను
నడపుకొనువార లెవ్వ రున్నారు గనుక. 65

క. నన్నెప్పుడు పొడగన్నం, గన్నులఁ గప్పుకొనుఁ బ్రియము గయికొను నామా
టన్న జవదాఁటఁ డతఁడీ, కన్నియఁ దనప్రాణపదముగా భావించున్. 66

సీ. అదలించి యే మించనాడిన నెంత లే దను గాని మాఱుమా టాడరాఁడు
నెమ్మిమై మెలఁగంగ నేర్చుఁ గన్నుల మ్రొక్కు మనసున దీవించు మతముదోఁప
నొకనాఁటికంటె వే ఱొకనాఁడు లాలించు నొకటఁ గా దన్నిట నుచితగతుల
నలవారు వీరలవలె జూటుతనము లే దోడకెఱింగినవాఁడు గాఁడు

గీ. తాను మాదేవదేవియుఁ దమకములను, గరగరికలందు నొక్కరొక్కరికిఁ దొరసి
జోడువాయక మెలఁగంగఁ జూచునప్పు, డనఘ! సంతోష మాత్మ నింతంత గాదు.

క. ఈనటనల మేమును మీ, మానియు నిన్నాళ్లు గూడిమాడి మెలంగన్
నానోటను † బుట్టునె సని, యేనెఱుఁగక బేలనే మహీసురముఖ్యా! 68

వ. గృహకృత్యప్రసంగంబులఁ గొంత యీపడుచుపై నడిచిపడుచుం గసరుకొ
న్నం జూచి (తన్నా)డిన చందంబు దోఁచినం గాఁబోలు న య్యభిమాన
శీలుండు నిజస్వరూపస్వభావంబు లెఱుఁగనివారికిం బంపిన తెఱంగునం గనక
పాత్రం బిమ్మహానిశీథినీసమయంబున మిమ్ముఁ గనుబడ(లింప)మీచేతఁ బెట్టి
పంపిన వాఁ డయ్యె. ఈయనుచితప్రయోజనంబు లెల్లఁ బరులయెడం గాక
మాయెడాటంబునం దగవు లగునే యని వెండియు. 69

క. నావలని నేర్పు నేరమి, దేవరవలె నున్న మీకుఁ దేఁటపడంగా
నే వినిపింపక మఱి యిం, కే వారికి విన్నవింతు నిద్ధచరిత్రా! 70

మ. తనకుం గూర్చువధూమణుల్ చనవుచేతన్ మందిమేలంబువం
కను వేసారియు నవ్వులాటలకుఁ బల్కుం బల్కువాక్యంబు లె
ల్లను నిక్కంబులుగాఁ దలంచి తగ దల్గ న్నిర్నిమిత్తంబు ము
క్కునఁనే యుండుఁ గదా మునీశ్వరులకుం గోపంబు సాటోపమై. 71

ఉ. ఏనటు చిట్టు ముట్టనుచు నించుక కోపము తాళలేమి నా
పై నొకలాగునం గిటుకు పట్టిన దోసము గాదు దానునుం
దానును నేఁటిదాఁక మమతం దగ నర్మిలిఁ గూడి యున్నవా
రానెన రైనను దలఁపఁ డయ్యెను దీని గణించి యేనియున్. 72

---

*నరవరలు లేక యీయుపాధ్యాయువలెను—మాతృక. † బుట్టెనసని—మాతృక.

క. గుఱిచేసి గిన్నెఁ బంపిన, తఱువాతను మల్లి పంపఁ దగ దంపినచో
మఱి నిన్నుఁ గొదవసేసిన, తెఱఁగగుఁ గెలఫులును మీమదిం గనునెడయున్. 73

క. తనసొమ్ము గాదె మాకల, ధన మెల్లను నేఁట నేమి తా మది నిఁక ము
న్వెనుకలకు మమ్ము నెట్లున్, మనువుం దాఁ గాక మాకు మఱియుం గలదే. 74

క. విను మే నటువలె దూఱితి, నని మీమునితోడ మఱవ కనుమీ యని యా
చెనఁటి తనముద్దుఁగూఁతుం, గను గిఁటిన నదియు వగవు గదిరినశేవన్.

మ. తనసింగారపుఁ జెక్కుటద్దములమీఁదం జాఱుకన్నీరు కే
లినఖాగ్రంబులఁ బాఱమీటుచును దల్లి న్నార్లనుగ్గించి మో
మునకుం దైన్యము గొంత తెచ్చికొని డంబుల్ సూపి యవ్విప్రు నో
య్యన డాయం జని యిట్లు వల్కెను రహస్యాలాపరూపంబునన్ 76

గీ. తా నెఱింగియు నీజాతి గానిదాని, మాట లెల్లను గొండగా మదిఁ దలంచి
యల్లనడురేయి గిన్నె యి ట్లంపనేల, కుడిచి కూర్చుండి నను బాళిగొలుపనేల.

ఉ. ఆమెలదోఁటలోన సాబ గయ్యేడుపుప్పొడితిన్నెమీఁదఁ గెం
జాయలఁ బొల్చు లేఁజిగురుశయ్యఁ గెలంకులయందుఁ దుమ్మెదల్
మ్రోయఁగ గోరువంకలను ముంగురు లల్లన దువ్వి దువ్వి న
న్నాయన గారవించిన ప్రియంబులు నామదిఁ బాయ నేర్చునే. 78

క. ఈపాటి తనకు నెప్పుడు, నాపై దయ గలిగినందు(నకునిఁక) నన్నుం
జేపట్టు మనుము కంతుని, తూపుల నగునాదుమనసు*తుందుడు కడఁగున్.

క. ఓయనఘచరిత యిటువలె, నాయనచిత్తంబు వచ్చు నటు వలె వివిధో
పాయములఁ దెలిపి సరగున, నీయెడకుం బంప మీరలే కలవారల్. 80

సీ. అని గారవించి నెయ్యము మీఱఁ బలికినఁ బనివిని యామహాబ్రహ్మచారి
తనలోనఁ దా నవ్వుకొనుచు వెల్వడి వచ్చి తలవాకిటను నిల్చి దండఁ బంచ
తిన్నెపైఁ బవళించి యున్న వాచంయమముఖ్యునిఁ గనుఁగొని ముసుఁగు దిగిచి
వివరించి చూచి యోవిప్రనారాయణా! యొంటిమై నిచ్చోట నుండనేల

గీ. ప్రియము మీఱంగ విటకంటకియును దేవ
దేవియును మిమ్ముఁ దోడ్కొని తె మ్మటంచు

---

* మనసుతుందును కలుగును—మాతృక.

నన్నుఁ బంపిరి తాము నిం దాఁక వెఱచి
వచ్చినా రింక సరగఁ బోవలయు మీరు. 81

క. అన విని కల గనఁ బోలుదు, నని దిగ్గన లేచి చూచె నప్పుడు కృష్ణా
జినదండకమండలుశో,భనములు గల మధురవచనపటువున్ వటువున్. 82

వ. చూచి విస్మయంబునుం బులకితశరీరుం డై యి ట్లనియె. 83

క. ఈలీల మదనవిశిఖ, జ్వాలలఁ బడకుండఁ గావ వచ్చినకరుణా
శాలివి నీ వెవ్వరు నా, పా లింటను గల్గు రంగపతివో తండ్రీ! 84

క. కనికరముతోడ నిటువలెఁ, బనివడి నెవ్వారు నఱచి పఱపరఁ గానీ
కనరానికటికిచీఁకటి, యనక ననుం గానవచ్చునా యొరుఁ డైనన్! 85

మ. అని సంతోషితచిత్తుఁ డై బహువిధవ్యాపారమాధుర్యలీ
ల నుతింపం దనపాణిపల్లవము కైలా గిచ్చి యమ్మానిఁ ద
ద్ఘనగేహప్రతిహారిగేహాళిఁ జొరంగాఁ బంపి తా నాత్మర
మ్యనిశాంతంబున నుండె రంగపతి పద్మాదిప్రియాసక్తుఁ డై. 86

— * విప్రనారాయణుఁడు మరల వేశ్యయిల్లు సొచ్చుట. * —

గీ. అంత నిక్కడ మానికులాగ్రగణ్యుఁ, డావటూత్తముఁ డటు సాగ నంపి చనినఁ
దొలుతమాటలుపడిపుల్లసిలినవాఁడు, గనుకకొంకుచుఁదనయాత్మగతమునందు.

ఉ. కల్లరి బేరజంబు విటకంటకి మిక్కిలి తత్తనూజయుం
దల్లి నతిక్రమించినను దాను వహించికొనంగఁ జాల ది
ట్లల్లనఁ జేరఁదీసి యిపు డాచెడు గెక్కడ మొక్కపాటు దే
నుల్లమునం దలంచిన దో కో యని పో నటు దేవదేవియున్. 88

ఉ. వెన్నెలబైట నొక్కమణివేదికమీఁద మిటారి తేటవా
ల్గన్నులకన్నియ ల్కెలఁకులన్ భజియింపఁగఁ దానమానసం
పన్ననవీనగానరసమాధురి వీనులవిందు సేయఁగాఁ
గిన్నెర మీటుచుండి పరికించుచు మానికులావతంసమున్. 89

చ. గరువము మీఱఁ జూచి గజగామిని దిగ్గన లేచి చేతికి
న్నెర చెలిచేతి కిచ్చి రశనామణి కింకిణికానినాదనూ
పురకరఝుళంఝుళక్వణనము ల్మకరాంకచమూహళాహళి
స్ఫురణ వహింపఁ గ్రక్కునను బోయి యెదుర్కొని సంభ్రమంబునన్. 90

క. వేదండయాన తా నపు, డాదండను బొలుచుమణిగృహాంతరమునకుం
గైదండ యిచ్చి సుమనః, కోదండసమానుఁ దోడుకొని చని కడఁకన్. 91

క. అక్కడఁ దగఁ గుందనపుం, జెక్కడములఁ జాల నుల్లసిల్లుచు మిగులం
జొక్క మగుచున్న (రత్నపు), మొక్కలిపై మానిచంద్రముని నుంచి తగన్. 92

క. అంబుజముఖి బంగారపుఁ, దంబుగ పన్నీట నడుగుఁదమ్ములు గడిగెం
బంబిన నిగ్గులవెన్నెల, డంబు వి(డంబించుపావడం) దడియొత్తెన్. 93

గీ. మేనఁగలపంబుఁ గడువింతగానలంది, గొనబుమీఱంగఁ దావిక్రొన్ననలుదుఱిమి
సన్నవలిపెంపువలెవాటు సవదరించి, కప్పురము నించి పచ్చిబాగా లొసంగి. 94

సీ. సకినెలపట్టెమంచము మించుపఱుపును గెంబట్టు బటువులు గిండి జీని
పావడ బంగారుపావలు కాళంజి కురువేరు పన్నీరు గోఱజంబు
గోవజవ్వాది కుంకుమ గంధసారంబు పునుఁగు కస్తూరి కప్పురము చాఁదు
జాలవల్లిక పుష్పతాళవృంతము నపరంజిగద్దియ హురుమంజిసురటి

గీ. యాదియగునట్టి వస్తువు లగురుధూప, ధూపితంబు వితానబంధురము సాల
భంజికాకీరదీపికాపరివృతంబు, భరితపారావతము నైన భవనమందు. 95

క. తరుణి రమించెను నత్తఱిఁ, బరిపరివిధములను వింతబాగుల హేలా
పరివర్ధితమోహరసా, చరితపునఃపునరనంగసంగరకేళిన్. 96

క. ఈలాగున రతికేళిన్, దేలి పరిశ్రాంతిఁ బొంది నిద్రించిరి యా
లీలావతియుఁ దపోధన, శాలియు నంతం బ్రభాతసమయం బయ్యెన్. 97

ఉ. సమ్మదలీలఁ బంకరుహసద్మహజారములం గొలంకులం
గ్రమ్ముమిళిందమాగధులగానము మించెను రంగశాయిగే
హమ్మున బోరున న్మ్రోసె నప్పు డహర్ముఖసూచకంబులై
యిమ్ముల శంఖదుందుభిసమీహితమంజులవాద్యఘోషముల్. 98

సీ. శ్రీరంగరంగసంస్కృతపూర్వజల్పాకసద్యోవినిద్రపంజరశుకంబు
నగ్రతక్షోణీసమానీతపునరుక్తి ... ... నఖముఖ విహద్ధేనుకంబు
వివిధహేమకవాటవిఘటనావసరాయనాన్వేషబహిరుద్యదరుణభంబు
మలయభూధరమరుచ్చలితనానాగోపురార్ద్రిస్థలీవైజయంతికంబు

గీ. మాగధానూనజేగీయమానగాన, రససమాకర్ణనోత్ఫణప్రమదసమద
భావపర్యంకభుజగాధిపంబు నగుచు, వెలసె నప్పుడు తద్రమావిభునినగరు. 99

శా. ప్రౌఢస్సై వైరభుజప్రతాపరుచిదీప్తవ్యాప్తపర్యంతయు
గ్గాఢారణ్యమహీమతంగజఘటాగమ్యస్థలస్థాయి ఘుం
టాఢాంకారవిమోహితాహితచమూనానామృగాఖేటధీ
రూఢోత్సాహ! కదాచిదప్రతిహతక్రోధప్రసాదోదయా! 100

క. బబ్బరబాహాంక రమా, బిబ్బోకవతీనిశాంక బృందారకధు
న్యబ్బంధుకీర్తిరచితక, కుబ్బాలాకుచపటీర! గుణగంభీరా! 101

మాలిని. సరసిజదళచక్షుశ్చక్రవాకస్తనద్వ
య్యురుపులిననితంబప్రోల్లసజ్జహ్నుకన్యా
ఖరకిరణతనూజాగాఢసాపత్న్యదోష
త్వరితశరధిగచ్ఛద్దానధారాధునీకా! * 102

గద్య. ఇది శ్రీశంకరస్వామిసంయమీశ్వరచరణసరోరుహధ్యానానందసౌందర్యధుర్య ప్రబంధపరమేశ్వరవంశపవిత్ర లింగనమనీషిపుత్త్ర శ్రీకాళహస్తీశ్వర దయాసహాయ చెదలువాడ మల్లయనామధేయప్రణీతం బైనవిప్రనారాయణచరిత్రం బనుమహాప్రబంధంబునం జతుర్థాశ్వాసము.

శ్రీ ర స్తు.

విప్రనారాయణచరిత్రము.

పంచమాశ్వాసము.

క. శ్రీమహితమహాకాళీ, నామకగృహదేవతాభినవకరుణాల
బ్ధామితవైభవ మానవ, తీమన్మథ మాకరాజుతిమ్మనృపాలా! 1

గీ. అవధరింపు ప్రభాత మిట్లరుగుదేర, నంత కట మున్న మేల్కని యహిశయాను
నర్చనము సేయుటకు వేళ యయ్యె ననుచు, నతిరయంబున సహ్యకన్యకకు నరిగి.

వ. సముచితకరణీయంబులు దీర్చి వైష్ణవలక్ష్యమాణుండును గుండమండపవిధాన రథోత్సవ ధ్వజోత్సవ మాసోత్సవ ప్రతిష్ఠాప్రమదవ దిందిరాయమాన మురదమనుండును గరకుంచితావలంబి యగునంబి చనుదెంచి రంగేశ్వరదర్శనాభిలాషంబుల బహిర్ద్వారప్రదేశంబుల నందంద క్రందుకొని యున్న తైర్థికుల ప్రసాదావలోకనంబులఁ గటాక్షించి యొండొండ తలుపుల గడియలు సడలించి యభ్యంతరమందిరంబునకుం జని— 3

క. నాగేంద్రశాయిఁ జేర్కొని, యాగర్భగృహప్రదేశ మారసి చూడన్
రాగిల్లుచును దదగ్రిమ, భాగంబున నున్నకనకపాత్రము లేమిన్. 4

క. నివ్వెఱఁగు భయము మనమున, నివ్వటిలం గడుఁ దలంకి నిన్నటినమరే
యివ్వేళ నున్నగిన్నియ, యెవ్విధమునఁ జనెనో ? తెలియ దే మనువాఁడన్. 5

సీ. అని గర్భగృహ మెల్ల నల్లనఁ బరికించి లెస్సగా నంతరా*ళింద మరసి
తిరుమజ్జనంబుబిందెలలోన శోధించి పుష్పకరండకంబులను నెమకి
నిపుణత రంగమండపములో నారసి మెలమి నుగ్రాణపుటింట్లఁ జూచి
పటపల్లిచక్కిఁ దా నటు పరామరిసించి యందులందుల సందు గొందు లరసి

గీ. అడుగఁదగువారి నెల్లను నడిగిమఱియు, వెదకఁ దగుతావు లెల్లనువెదకి యతఁడు
గిన్నె గానక యత్యంత ఖిన్నుఁ డగుచు, సరభసంబుగఁ దోడియర్చకులఁ దాను.

క. ఇదియెల్లను నధికారికి, విదితంబుగఁ దెలుపఁదగు నె వెసఁ దెలుపనిచోఁ
దుద నేరమి మనదెస నగు, నది గాకీస్వామ్ము నరుపు మందు రటంచున్. 7

---

* నంతరాళిమమువెదకి—మాతృక.

క. ఆరంగవిభుని తిరువం, దేరంబులు తేరుబుట్లు తిన్నియ లలరుం
బేరులు తీర్థపుఁజెంబుల్, ఘోరము లగుగండవడియలున్ గని వారల్. 8

వ. అయ్యెడ.

సీ. జియ్యు లర్ధాసనాసీనుఁ డై వసియింపఁ బొంతల నాచార్యపురుషుఁ డుండఁ
గెలన సాత్తనివైష్ణవులు ద్రోపు ద్రోపాడ వలన సంకీర్తనపరులు చనఁగఁ
గలగూటుఁబొక్కవంకను దొలంగుచునుండఁ గొండికాండ్రునుగెలంకుల నటింప
నూరెల వేత్రహస్తులు బరాబరిసేయఁ బరిజనంబులు చాల బలసి కొలువ
గీ. గరిమఁగొలువున్న నయ్యధికారవరునిఁ, దాము దెచ్చిన స్వామిగంధప్రసాద
పరికరం బిచ్చి పొడఁ గని భయముమీఱఁ, జేరి వా రిట్లు విన్నవించిరి కడంగి. 10

గీ. అధిప ! యిదియేమిదైవమాయాబలంబొ? గర్భగృహమున నైదుబంగరుపుగిన్నె
లుండ నాగిన్నియలలోన నొక్కగొప్ప, గిన్నెఁ గానము తగఁ జిత్తగింపవలయు.

చ. వినుము రమావిభుండు తిరువీసము నిన్నటిరేయి యారగిం
చినతటిఁ గోవెలం గలయశేషపదార్థచయంబు నుండఁగాఁ
గని నలుదిక్కు సూచి తిరుసాపుల వైచితి మిందు సందియం
బనఁగ నొకింత లేదు తెలియం దగు దీనికి హేతు వెద్దియో ? 12

వ. అని పలికినఁ బ్రత్యుత్తరం బేమేనియు వచియింపం బూని యున్నయధి
కారి నధిక్షేపించి ప్రకటభ్రుకుటీఘటనాదుర్నిరీక్ష్యుం డగుచు నయ్యెడ జియ్య
*భయభ్రాంతులగు నంబులం జూచి యి ట్లనియె. 13

క. పాతకులార ! యనర్ఘం, బైతగు నపరంజిగిన్నె హరియించి కడుం
జాతురి మీ రెఱుఁగనిగతి, నీతెఱఁగునఁ బోయె నందురే యవ్వారిన్ ? 14

మ. కనియుం గానమిఁ జేసికొన్నను నెఱుంగన్ లేక మారంగనా
ధునిసొమ్మెల్లను బొల్లుగాఁ దిని దినద్రోహంబు వాటించి కై
కొనుటల్ చాలక గిన్నె యెత్తికొని బొంకుల్ పల్కుచున్ మేము గా
మనినం బోవునె ? వేళ్లతోఁ జెఱకు దీ పంచున్ దినం బాడియే. 15

శా. ప్రాకారంబు లలంఘనీయములు తోరంబుల్ కవాటంబు లా
యాకక్ష్యాంతరభూమి యామికు లసంఖ్యాకుల్ గమున్ బీగముల్
వాకిళ్లుం బదిలంబు లిట్టి నగ రెవ్వారల్ చొరం జొత్తు రి
ట్లీకాంతావసథంబునం దిరుగుమీరే కాక చర్చింపఁగన్. 16

---

* భయభ్రాంతంబు లగుమనంబులం జూచి—మాతృక.

గీ. అనిన గజగజ వణఁకుచు నయ్య రంగ, ధాముకోవెల మున్ను తాతలతరంబు
నాఁటనుండియు మాకుఁ గాణాచి గాదె, యెన్ని గుండెలు గలవయ్య యింతపనికి!

క. రంగప్పసామ్మి మేము తి, నంగను సుతుల మయి పుట్టినారము నిజ మై
నం గలదే మావలనను, దొంగతికంబులును వింతద్రోహము లెందున్. 18

సీ. విను మేము ప్రాలుమాలిన దీవెసుడి గాక కినిసిన రెంపు గుగ్గిళ్లు గాక
తక్కిన నింత గంధప్రసాదము గాక మన(సైననొ)కవడతునుక గాక
యటమటించినఁ గుంచెఁడంత సాదము గాక కాదేని యొకగుల్లకాసు గాక
దాఁచికొన్నను బలితంపుఁ జింపుడు గాక పిక్కిన నొకపోఁకవక్క గాక

గీ. యగణితానర్ఘమణిధగద్ధగితమహిమ, భాతిరోధాన మృగితాహిపతిశయాన
సన్నిధానప్రతీప మీఁగిన్నె మమ్ము, వంటివారలు గొన నెంతవారలయ్య ! 19

క. అనిన యతి ముద్రకర్తం, గనుఁగొని యీ(దొడ్డ)కాంస్రు కడుమంచితనం
బున మనము సొమ్ము దె మ్మని, యనిచినఁ దేనేర్చువారలా ? యే మైనన్. 20

మ. మొగమోటంబున నుండఁగాఁ జనదు నంబుల్ దుండగీ లింత కే
పగిది న్వచ్చు సువర్ణపాత్రము గణింప న్వీంద్రచే నాగతిం
దగఁ దెప్పింపక నీవు కన్నడవుచేతం బట్టి ప్రార్థించిన
న్మిగులం గెర్లుదుఁ గాక తాళుకొనఁ జుమ్మీ యన్న భీతాత్ముఁ డై. 21

క. యతివల్లభ ! దేవరయా, నతికి న్మాజాడువాఁడనా ? గిన్నియ యే
గతి వేగమె తెప్పించెద, మతి మీ రలుగుదు రె? యింతమాత్ర కటంచున్. 22

మ. అటు వీక్షించిన నీలికాసెలు వినీలాకారముల్ మేటిదు
ప్పటముల్ కోరసిగల్ పిడెంబులు ధనుర్బాణంబులుం బాణిసం
ఘటితోద్యల్లగుడంబులుం గలిగి యుగ్రస్ఫూర్తి నారక్షులు
ద్భటవృత్తిం దనచెంగట న్నిలువ నాతం డత్యహంకారుఁ డై. 23

చ. తలవరులార ! రంగపతిధామమునందునఁ బైఁడిగిన్నెము
చ్చిలినదురాత్ము లీదురితచిత్తులు నంబులు వీరి నందఱన్
సిలుగులఁబెట్టి వే హరువుసేయుఁడు పొం డని పంప వేగ వా
రలఁ గొనిపోయి తద్భటపరంపర యాఁకనుబెట్టి యుండఁగన్. 24

ఉ. ఆరజ మెల్ల నొక్కపొడ వయ్యె ననంగను బ్రాఁతిగానిసిం
(గార)ము తీరుమాలినవికారము నల్లనిబూచివంటి యా

కారము జుంజుఱ్ఱై తిరులు గట్టి నెఱు ల్దువ బీఁట వాఱి వి
ప్పారెడుకీలుగంటుఁ బెఱయ న్విటకంటకదాసి యయ్యెడన్. 25

సీ. జూదంబు లాడెడుచోటికై యరుగుచు గంజాప్రదేశంబుకడకుఁ జనుచుఁ
దనసీడఁ ద్రోవవెంటను జూచికొనుచును బనిలేనిపని పకపకని నగుచు
నెవ్వారిఁ బొడగన్న నెకసక్కె మాడుచు సంగన ల్గాసి తిట్లాడ వినుచు
మాటిమాటికిని సుమాళించి పాడుచుఁ బులియుచుఁ దనుఁదానె పొగడికొనుచుఁ

గీ. బని యొకటి గల్గి రంగనాథుని గృహంబు, వలని కేతెంచి చంచలవాణి యనెడు
పేరు నిజముగ నట నడ్డపెట్టియున్న, నంబులను జూచి యానిమిత్తంబుఁ దెలియ.

చ. ఒకటఁ గొఱంత లేక హరియాడిగముం దగఁ జేయుచున్నయ
ర్చకులకు నింతదుర్దశలు రాఁ బని యే మని వారి వారల
న్సకలము లెస్సగా నడిగి చంచలవాణి యెఱింగి యింతమా
త్రకు నిటు బాములం బఱతురా గుడికిం దగు లైననంబులన్. 27

క. ఆపసిఁడిగిన్నె యెవ్వరి, చేపడియెనొ వీరి నేల సిలుగులఁ బెట్టం
జూపోపరుగా మీయది, యేపాటిది గలదు తెలుపుఁ డింతయు నన్నన్. 28

ఉ. అక్కడ నున్నవార లహహా యని నవ్వి పిసాళితొత్త! నీ
వెక్కడ నింతలేసిపను లెక్కడ పోవుగదంచు నందఱుం
బక్కునఁ దిట్టినం గసరి పల్కెను మీ రిటు సల్పినంతనే
తక్కువ యయ్యెనే కలితనంబును నా దొకమాటవాసియున్. 29

క. ఈలాగున నన్నేటికిఁ, గేలిగొనం బోయి యున్నగిన్నియ తగ మా
యేలికసాని గడించిన, మేలిమిగిన్నియకుఁ దుల్యమే యేమైనన్. 30

వ. అని పలికినం దదీయవచనంబులు విని వెండియుం బదిలపడ నడిగి వారు దానిం దోడ్కొని వారియధికారి సన్నిధానంబునం బెట్టిన నతండు సామవచనంబులం బుజ్జగించియు నదలించియుం గల్గినవిధం బెఱింగింపు మనవుఁడు నదియును వడ వడ వడంకుచు ని ట్లనియె; నయ్యా! నిన్న నగరంబు మాఁటుమడంగిన సమయంబున ము న్నెన్నఁడుం గన్న తెఱుంగువాఁడు గాఁడు వటువేషధారుం డగు నొక్కరుం డింటికి నొంటి మైఁ జనుదెంచి చూడ్కులు మిఱుమిట్లు గొను నొకయపరంజిగిన్నియఁ దెచ్చి మాయేలికసానిచేతి కిచ్చి క్రమ్మఱం జనియె నిది నాయెఱింగిన చందంబు. ఇట మీఁద నేమియుం దెలిసినదానఁ గా నని విన్న

వించిన నాగొంటరివెంటఁ దలవరులఁ గూర్చి మీ రిది చూపినజాడ (వేశ్య)
మందిరంబున కరిగి కనకపాత్రం బిచ్చినవాసిం బుచ్చికొన్నదానిం బట్టి తెం
డని పనిచిన—— 31

క. గుడినంబులకును దయతో, నుడుగర లిప్పించి ద్రోహ మొక్కఁతయు మీ
మెడ ... ... , యుడిగం బేమఱకుఁ డనుచు నొగిఁ దలవరులున్.

క. అందఱుఁ జని విటకంటకి, మందిరమున కరిగి పట్టెమంచమునందున్
గందళితానందంబున, ... సందడించుచునుండన్. 33

క. వసియించి యున్నతపసిం, బొసఁగం దత్పదము లొత్తుపొలఁతిన్ దగడన్
మిసమిసల మెఱుఁగుగిన్నియ, వెసఁ గన్గొని వారు రోషవివశాత్మకులై. 34

శా. ఇన్నాళ్ళున్ గణికాశిరోమణులలో నెల్లం గడున్ మేటివై
మన్నీ లెల్లరు గారవింపఁగను హేమగ్రామనానార్థసం
పన్నత్వంబున నున్నదాన వని చెప్పన్ విందు మిస్సిస్సిరో!
... ... దొంగసొమ్ములకు నై యెట్లేల ప్రాల్మాలితే? 35

— తలవరులు బంగరుగిన్నె కనిపెట్టుట. —

క. నీతి విచారించినచో, జాతులయం దెల్ల విప్రజాతికిఁ బ్రతి లే
దేతఱి బాఁపఁడ వయ్యును, నీ తెఱఁగున దొంగిలింప నెట్లెఱఁగితిరా! 36

గీ. అనుచు నల దేవదేవిని నమ్మునీంద్రుఁ, దగువిధంబున రాజపథంబుఁ దరిసి
తోడికొని వచ్చునప్పుడు వాడవాడ, బలసి మూఁకలు మూఁకలై పౌరులెల్ల. 37

ఉ. ఈసరసీరుహాక్షి జన మెల్ల నెఱుంగఁగ నిప్పురంబులో
మూసినముత్తియంబుగతి ముగ్ధ యనంగఁ బ్రసిద్ధిఁ గన్న దా
భూసురవర్యుఁ డెంతటితపోమహిమాఢ్యుఁడో కాక చూచినం
జేసినపాపముల్ పొలియఁ జేయఁ దొడంగెఁ దదీయతేజముల్. 38

గీ. ఇతఁడు చోరుఁడు గాఁ డని యెంతకైన, నిలువ నాడంగవచ్చు నీనీలవేణి
గోల యగుటయు నిక్కంబ యేల యిట్లు, వచ్చె వీరికి నీయపవాద మిపుడు.

సీ. నగరికి నాదాయ మగువేళ యిది యను తగవు మాలిన పనుల్ తడవిరేని
యొంటనివారిపై నోర్వఁ జాలనివారు లేనినేరంబు గల్పించిరేని
తోడఁబడి సొమ్ము పోఁబడి యెఱుంగక నోరఁ గొలఁదు లొక్కనిఁ జూచి పలికిరేని
యొరుదలగా వచ్చి యొగి మఱుంగు పడంగఁ జెవి నిల్లు గట్టుక చెప్పిరేని

గీ. పదర కధిపతి తెలియఁగఁ బాడియగును, గాక యెట్లైన నసఁ గొంది గట్టువానికి
నేమనఁగ వచ్చుఁ బ్రజలకు నెల్లయెడలఁ, దల్లి దండ్రియు నేలినాతండు గాఁడె ?

ఉ. యోగివిలాసరేఖ నలువొందెడు నీయనయందు నంగనా
భోగవశాత్ముఁడై నిజతపోమహిమంబులు వీటిఁబుచ్చి ల
జ్జాగరిమల్ దొఱంగుటలు చాలక యీతఁడు దొంగకూటికే
లాగునఁ జొచ్చెఁ దాఁ దలపొలంబుల నిల్చునె సామి కేఁగిరన్? 41

క. అని పౌరులు పలుదెఱఁగులఁ, గొనకొని పలుకంగ వారిఁ గొని రభసమునన్
జని ముద్రకర్త సమ్ముఖ, మునఁ దలవరు లుంచి కేలు మోడ్చిన నతఁడున్. 42

ఉ. ఇంతప్రయోజనంబు తను నేలినయేలిక చోళధారుణీ
కాంతునకున్ సవిస్తరముగా వినిపింపక నే స్వహంక్రియా
వంతుఁడనై గణించి తగువైపునఁ దీర్ప నతండు విన్న నా
కింతయు మాటవచ్చు నని యెన్నిక నయ్యధికారి గ్రక్కునన్. 43

శా. ఆలీలావతి నత్తపోధనునితో నాగిన్నె చోళక్షమా
పాలాగ్రేసరుసన్నిధి న్నిలుపఁ దత్పర్యాయవార్తల్ గభీ
రాలాపంబుల విన్నవించిన నతం డాశ్చర్యముం బొంది యౌ
రా ! లెస్సాయెను స్వామిసొమ్ము గొనినారా! ద్రోహులంచుం గడున్. 44

వ. పొడముకినుక యెడ నిడికొని చౌర్య ప్రసంగంబులు సాంగంబుగాఁ దెలియ
వలసి దేవదేవి నాలోకించి—— 45

సీ. వనజాక్షుసమ్ముఖంబున నుండుగిన్నియ యువిద ! నీ కెక్కడనుండి వచ్చె ?
నెవ్వారైనను దెచ్చి యిచ్చిరో మఱి నీవె కైకొన్న దానవో ? కనుమొఱంగి
యీ విప్రుఁ డుండెడితావు దా నెక్కడ ? నెన్నాళ్లు కలఁ డితఁ డిటకు వచ్చి
యింతనేరము సేయ నేరీతి మనసొగ్గె ? మేటివస్తువుల నేమిటఁ గొఱంత ?

గీ. వివరపుట్టంగ నానుపూర్వియనుగాను, దగ నెఱింగింపు మన మహీంధవకులేశుఁ
డానతిచ్చిన విని పంక*జాయతాక్షి, వినయ మెనయంగ నటు వెనువెనుక కరిగి.

ఉ. (తా నె)లదోఁట కేగిన విధంబు మునిం గనుఁగొన్న చందమున్
వానికిఁ గాఁగఁ బన్నిదము వైచినమాటయు బేలువెట్టి య
మ్మౌనిని దోడితెచ్చిన క్రమంబుఁ దమిన్ మొగమోట మొక్కయిం
తైనను లేక తల్లి విడనాడినచందముఁ జెప్పి వెండియున్. 47

---

*జాతనేత్రి——మాతృక

శా. ఓరాజన్యభవాన్వయాభరణ ! యీయుర్వీసురేంద్రుండు మే
మారీతిన్ వెడలంగ ద్రొబ్బినను లజ్జాక్రాంతుఁడై పైఁడిగి
న్నెరూపంబునఁ దెచ్చెనో యెఱుఁగ నా కిప్పించెఁ దా శిష్యుచే
శ్రీరంగప్పఁడె సాక్షి యింతకు వితర్కింపన్ వివేకోన్నతా ! 48

గీ. అనుడు ధరణీశుఁడాతపోధనునిఁ జూచి, వింటివా యోయి! యీమచ్చెకంటియాడి
నట్టిమాటలు తెలియ నేమైన నిందుఁ, గలది లేనిది గలిగినఁ దెలుపవలయు. 49

మ. అనినన్ సంయమి (చిత్తగిం)పఁ దగు న్యాయాన్యాయముల్ కల్లతో
డ నిజం బొప్ప......బ్బ లోకు లను మాటల్ నిక్కముల్ రూఢి కె
క్కునె? నామాటల తీరు దీని వగుబొంకుల్ విన్నచో నైన నే
నును నా నేర్చినరీతిఁ దథ్య మెఱిఁగింతున్ ధారుణీవల్లభా ! 50

క. ఇది చెప్పినట్ల యేనది, మొదలన్ దీనింటఁ దమకమున మెలఁగుటయుం
దుద నను వెడలించుటయును, విదితము కడమాట విన్నవించెద నీకున్. 51

ఉ. నన్నటు వీడనాడిన మనంబున ముప్పిరి గొన్నజాలి నే
విన్నఁదనంబుఁ దాల్చి నడువీథికడం దగుపంచతిన్నెపై
నున్నను దాను బంప వటు వొక్కఁడు చామనచాయ మేనివాఁ
డన్నడు రేయి వీరల గృహంబునకుం గొనిపోయె నర్మిలిన్. 52

ఉ. ఈమటుమాయలాడియును నెప్పటికంటెను నన్నుఁ గైతవ
ప్రేమను గారవించి యలరింపఁగ నుండితిఁ గాని గిన్నెమా
టేమియు నే నెఱుంగ ధరణీశ్వర ! కాదని పల్కితేని యా
స్వామియె సాక్షి యింతయు నిజం బిఁక నావుడు దేవదేవియుఁ. 53

క. పొరిఁబొరిన యోరి దొంగల, గురువ ! మహారాజు వినఁగఁ గొంకక మిథ్యా
పరిభాషలు పచరింతురె, సరివారలు నవ్వ నీహజారమునందున్. 54

గీ. నాలిమాటలు నీపట్టెనామములును, శపథములుఁ జూచి నిక్కంబు సాధువనుచు
నమ్మితినిగాక యిట్లనాఁడె నీదు, గుణ మెఱింగిన వెడలంగఁ గొట్టి విడుతు. 55

ఉ. వాదుల కేమి (కార్మోగుల) వన్నియశిష్యునిచేతఁ బంపఁగా
లేదె సువర్ణపాత్రము మలిమ్లుచశేఖర ! యెల్లవారిచేఁ
గా దనిపించుకో ఫలము గల్గునె యూరక రిత్తమాటలం
బోదుసుమీ యవజ్ఞ (యనఁ బోటిఁ) గనుంగొని సంస్మితాస్యుఁడై. 56

గీ. ఏల పదరెదు నీకును హెచ్చు కుందు, మాటలకు నెంత యిన్నాళ్లు మాకు లేని
వటువు నడురేయి యెం దుండి వచ్చెఁ జెపుము, యిట్టిమాట . . . . . . నది విధి.

వ. అని పలుకువారలకలహంబు వారించి వయోరాజ్యదుర్వారగర్వారంభ శీలుం డగునమ్మహీపాలుండు *సభ్యులం జూచి మీ రీయిరువురకలహంబు లాకర్ణించితిరి. నామనంబునం దెలివిపడిన తెఱం గెఱింగించెద. 58

క. వెలయాలి కెవ్వ రిచ్చిన, వలసినగతిఁ గైకొనంగవచ్చుఁ గా సొమ్ముల్
తలఁప నటు గాక . . . , ... క్తి గలుగఁ నే యేమైనన్. 59

క. అటు గాక తన్నుఁ బిలువఁగ, వటు వొక్కఁడు వచ్చె ననియె వసుధామరుఁడుం
గుటిలాలకకును వటువే, యట గిన్నియఁ దెచ్చి యిచ్చె 60

ఉ. కానఁ దపస్విఁ బిల్వఁగ నొకానొకచేడియ లేదె బంటువాఁ
డైనను లేఁడె యవ్వటువు నంపఁగ నేటికి? బ్రహ్మచారియుం
దా నడురేయి దీని సదనంబునకుం జనుదేర నేమి యీ
(మానినియొద్ద) లేవు వెడమాయలునుం బొరలింపుమాటలున్. 61

శా. తానే దొంగిలి గిన్నె శిష్యవరుచేతం బంపి చౌర్యంబు పై
నైనం దూఁటిచనంగ నేరమిని యీ . . . . నం
గా నేర్పుల్ పచరించి బొంకిన నెఱుంగ న్నాదె యీనుల్పు వీఁ
డే నిక్కం బగుకన్నగాఁ డని ధరిత్రీశాగ్రగణ్యుం డనన్. 62

క. ఆనృపతి పలుకు లుచితం, బై (నవి యని) యెల్లవారు నని రప్పుడు "రా
జానుమతో ధర్మ", యనం, గా నుత మగుపల్కు †నమ్మఁగా నగుఁ గాదే. 63

వ. ఇవ్విధంబున నమ్మహీపాలపుంగవుండు తనయందుఁ గలుగనిదొంగతికం బాపాదించుటకుం గనలి యపవాదంబు పరిహరించుకొనునుపాయంబును గానక యమ్మునివరుండు నిజహృదయకర్ణికాధాముం డగురంగధాముం దలంచిన— 64

సీ. శ్రీవిమైఁ గటిని గట్టినపచ్చపట్టును బొక్కిలి నెత్తమ్మిఁ బొలుచు నిసువు
నిగనిగప్రభల నీనెడుకౌస్తుభంబును బేరురంబున విడంబించుసతియు
మిసమిసల్ నిగిడించు మొసలివాతమ్మంట్లు నొకకేలఁ బద్మంబు నొకట గదయు
నగణితరుచి ధగధగిత కిరీటంబుఁ గరుణాసుధాధార గ్రమ్ముచూపు

---

* సభికులం జూచి—మాతృక. † నిశ్చయంబగు—మాతృక.

గీ. గలిగి సురసిద్ధగంధర్వఖచరసాధ్య, మఘవముఖదేవసంస్తూయమానుఁ డగుచు
విహగపతి నెక్కి శ్రీరంగవిభుఁడు తపసి, యగ్రభాగంబునందుఁ బ్రత్యక్ష మయ్యె.

గీ. విప్రవర్యుఁడు భయమును విస్మయంబుఁ, బ్రమదరసమును మనమునఁ బల్లవింప
ఫాలవీథిక నంజలి పరిఢవిల్ల, బహువిధంబుల నిట్లని ప్రస్తుతించె. 66

లయగ్రాహి.

ఇందురవినేత్ర యరవిందభవముఖ్యసురవందితపదాబ్జ ధృతమందరధరా సం
క్రందనమణీఘనమిళిందసమదేహరుచి వందితప్రసన్నహరిచందన కటాక్షా
మందకరుణారస ముకుంద మురఘస్మర సనందనముఖాదిమునిబృందనుతవిద్యా
నందమయరూప హరి నందకులధారివరనందన ఫణీగ్రసనతుందిలతురంగా. 67

చ. హరిహయపద్మసంభవముఖామరదుర్లభలీలఁ బొల్చునీ
చరణసరోరుహంబులు ప్రసన్నత నాకొసఁగూర్చె మత్పురా
చరితము లైనయట్టికలుషంబులు వీడెఁ గృతార్థభావముం
బొరసితిఁ గోర్కెలుగా ఫలముఁ బొందెను భక్తజనావనప్రియా ! 68

గీ. ఎందు మాదృశు లగువారి యందుఁ గలుగు
కొదవ లెన్నవు భక్తిముక్తులు నొసంగఁ
జాలుచున్నాఁడ వేమని సన్నుతింతుఁ
జక్రధర నీదుభక్తవాత్సల్యమహిమ. 69

అనుచుం బెక్కుతెఱంగుల, వినిపించిన రంగశాయి వెలిదమ్మికనుం
గొనలఁ గనికరపుఁదుంపర, చినుకఁగ నిట్లనియె యోగిశేఖరుతోడన్. 70

ఉ. ఆర్యవరేణ్య ! నీ వహరహంబు నొనర్చిన పుష్పదామకైం
కర్యము మన్మనఃప్రమదకారణ మయ్యెను నీదుభక్తితా
త్పర్యము గారుడప్రముఖభాగవతాచరితార్చనాతప
శ్చర్యలకంటె నన్నును బ్రసన్నునిఁ జేసె విశేషసంపదన్. 71

క. కావున నోవత్స ! జగ, త్పావనచారిత్ర నీకుఁ బరమప్రీతిం
గావలసినవర మిచ్చెద, నే వేఁడు మటంచు నానతిచ్చిన నతఁడున్. 72

క. క్రమ్మఱఁ బ్రణమిల్లి మదిన్, సమ్మద ముప్పొంగ భక్తజనవత్సల ని
న్నిమ్ముల దర్శించితి వర, మిమ్మనఁగాఁ గలదె యింక నెయ్యది యైనన్. 73

వ. అని సకలశుభావహం బగుభవదనుగ్రహం బపరిహార్యంబు గావున మనంబు

నం గలతెఱంగు వినిపించెద. దేవా! భక్తాంఘ్రిరేణు వనియెడు నామధే
యంబు నాకుం బ్రసాదించి కృతకృత్యుం జేయు మని ప్రార్థించిన— 74

. ఆవలినోదరుఁ డట్టె, కానిమ్మని వరము మునిశిఖామణికి దయం
... ... , నానతుఁ డగుచోళనృపవరాగ్రణిఁ బలికెన్. 75

ఉ. ఓరినృపాల! యీయనఘు యోగికులాభరణంబు నాత్పదాం
భోరుహసేవనారతుఁ దపోధను ... ...
... ... నీతి దొఱంగి సభాంతరంబునం
జోరుఁ డటంచుఁ బల్కి పడుచుంబని సేయుట నీకు ధర్మమే. 76

చ. కనకపుగిన్నెఁ దెచ్చి విటకంటకికిచ్చినవాఁ(డ నేను) న
త్తనయుఁడు (వీఁడుసూ కొడుకు) తండ్రిధనంబున కర్హుఁ డౌట ము
న్నెనవె? వివేకి గానిధరణీధవురాజ్యమునం బ్రజానురం
జన మొనఁగూడనేర్చునె విచారము లేదె యొకించుకేనియున్? 77

క. ఇమ్మునివరు మామాటుగ, నెమ్మిన్ భజియింపు చోళనృపతీ! యని యా
బ్రొమ్మ యిచ్చుగిన్నె పడుపుం, గొమ్మకు నిప్పించి మానికుంజనుఁ బల్కెన్. 78

గీ. మునుపు నే దానికొసఁగిన కనకపాత్ర, తెచ్చితివి దేవదేవికిఁ దిరుగ నిమ్ము
ఎందు వెల్లాటకత్తియ కిచ్చినట్టి, సొమ్ము మగుడంగఁ గొనుట యేసుగుడితనము?

సీ. నా దగుగోపకాంతాపహారము విన్నవారల కెట్టి శాశ్వతవిభూతి
దొరకు నట్టిది గల్గుఁ బరమహా (నీవిప్ర)చరితంబు వినినట్టి జనులకెల్ల
నని యానతిచ్చిన నతఁడు శ్రీమాలిక యనఁగఁ బ్రాబోధిక యనఁగఁ బరఁగు
కృతులను వర్ణింపఁ గృతకృత్యుఁ గావించి రంగశాయి తదంతరంగమందుఁ

గీ. దాఁ బ్రవేశించె దివ్యవాద్యములు మొరసె
జలజలని నింగిఁ బుష్పవర్షములు గురిసె
నమరజయజయశబ్దఘోషములు బెరసె
నప్సరచ్చర (బోంట్ల) లాస్యములు మెఱసె. 80

క. ఆచోళనృపవరేణ్యుఁడు, వాచంయమవరునిఁ జేరవచ్చి మునీంద్రా!
నాచేసినయపరాధము, గాచి ననుం గావవయ్య కరుణాజలధీ! 81

క. దేవర తల్లివి తండ్రివి, దైవంబవు గురుఁడ వఖిలదాతవు నిన్నుం
గేవలమర్త్యుఁడ వనుచున్, భావించితి దీని కేమనంగలవాఁడన్. 82

వ. అని ప్రార్థించి గంధవహబాంధవంబు లగుసైంధవంబులును ... ... తరంబు లగు ద్విరదంబులును పరభయదమహోర్భటు లగువీరభటులును, నీతి కళాధాను లగుప్రధానులును, బలాక్రమవంతు లగుసామంతులును ... ... గాణిక్యమాణిక్యంబులును మొదలుగాఁ గొల్వ సకలసన్నాహసమేతుం డై మహావైభవంబునం జోళేశ్వరుం డమ్మునికులేశ్వరు ... ... భేరీ శంఖ మృదంగాది వాద్యఘోషంబులు బోరుకలంగఁ బురంధ్రీకరకనత్కనకపాత్ర నీరాజనంబులు, భూసురాశీర్వాదంబులు ... ... మణివితానంబులం గను పట్టుతిరువీథుల నెల్లం గొలిచి సేవించి, తత్ప్రసాదంబునం గృతార్థత్వంబునుం బొంది ప్రజాపాలనంబు గావించుచు శాశ్వత(సుఖం)బు లనుభవించుండె.

ఉ. అంచితపుణ్యుఁ డమ్మునికులాగ్రణియు న్నమదామము ల్సమ
ర్పించుచుఁ బెక్కువైఖరులఁ బేర్కొనుచున్ హృదయాబ్జమందు భా
వించుచు రంగశాయిఁ గడు వేడుక నిచ్చలు నెప్పు టట్లు సే
వించుచునుండె సర్వజనవిస్మయహేతుమహానుభావతన్. 84

క. ఆదేవదేవియును ముని, యాదరమున ధన్యనైతి నని రంగేశ
శ్రీదయితునకును ధనకన, కాదు లొసంగె న్విరక్తురాలై యుండెన్. 85

మ. ఎనయ న్మానవు లెట్టివా రయినఁ దా రీవిప్రనారాయణా
ఖ్యుని* ... ...
... ...
... ... 86

† గద్య. ఇది శ్రీ శంకరస్వామిసంయమీశ్వరచరణసరోరుహధ్యానానందసౌందర్య ధుర్య ప్రబంధపరమేశ్వరవంశపవిత్ర లింగనమనీషిపుత్త్ర శ్రీకాళహస్తీశ్వర దయాసహాయ చెదలువాడ మల్లయనామధేయప్రణీతం బైన విప్రనారాయణచరిత్రం బనుమహాప్రబంధంబునందుఁ బంచమాశ్వాసము.

సర్వము సంపూర్ణము.

---

* ఈ ఫలశ్రుతితుదిభాగమును నాశ్వాసాంతపద్యములును లేవు.

† మాతృకలో లేనియీగద్యము పూర్వగద్యములను బట్టి వ్రాయఁబడినది.

ప్ర క ట న.

ఆంధ్రసాహిత్య పరిషత్తు, చెన్నపురి.

ప్రతిష్ఠాపకులు:—

శ్రీపీఠాపురమురాజాగారగు శ్రీరాజా రావువేంకటకుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు.

శ్రీవేంకటగిరిరాజాగారగు మహారాజా సర్-వెలుగోటి శ్రీరాజగోపాల కృష్ణయాచేంద్రబహద్దరుగారు, కె. సి. ఐ. ఇ., పంచహజారీమన్సబ్దార్.

ఆగ్రాసనాధిపతి:—

శ్రీపీఠాపురమురాజాగారు.

కార్యనిర్వాహక సభాధ్యక్షుఁడు.

మ-రా-రా-శ్రీ జయంతి రామయ్యపంతులుగారు, బి.ఏ., బి.ఎల్.

కార్యదర్శులు.

మ-రా-రా-శ్రీ పురాణం నాగభూషణంపంతులుగారు, ఎం.ఏ., బి.ఎల్.
,, ఆచంట లక్ష్మీపతిగారు, బి.ఏ., ఎం.బి., సి.ఎమ్.
,, నెమలి పట్టాభిరామారావు పంతులుగారు, బి.ఏ.

కోశాధ్యక్షులు (ట్రస్టీలు)

దివాన్ బహదూర్ కంచి కృష్ణస్వామిరావుగారు, సి.ఐ.ఇ.
రావుబహదూర్ పిట్టి త్యాగరాయ సెట్టిగారు, బి.ఏ.

కార్యస్థానము.

2/7 హారిస్ రోడ్డు, పుదుపేట.

చందానిర్ణయము.

పరిషదుద్దేశము:—ఆంధ్రశబ్దములకు సలక్ష్యవ్యుత్పత్తికముగ విపులనిఘంటువు రచించుట, తెలుఁగుభాష కితరభాషలతోఁగల సంబంధమును దెలుపుచు భాషాతత్త్వమును నిరూపించుట, శాస్త్రమును రచించుట, ఆంధ్రదేశపూర్వవృత్తాంతమును బ్రమాణపూర్వకముగా నిరూపించులక్షణ శాస్త్రపారిభాషికపదముల నిర్ణయించుట, నూతనగ్రంథరచనకు సాహాయ్య మొనర్చుట, భాషావిషయములఁ జర్చించుటకుఁ బత్త్రిక నొకదానిని బ్రకటించుట, సమగ్ర మగుపుస్తకభాండాగారము నేర్పఱచుట, ఇత్యాది విధముల నాంధ్రభాషావాఙ్మయాభివృద్ధికై యత్నించుట, పరిషత్తుయొక్క యుద్దేశము.

1.	ఉద్ధారకులకు	రు. 5000.
2.	పోషకులకు	,, 1000.
3.	యావజ్జీవసభ్యులకు	,, 100.
4.	సాధారణసభ్యులకు సంవత్సరమునకు	,, 6.

పరిషత్సభ్యులు పత్త్రికకు వేఱుగాఁ జందా నియ్యనక్కఱలేదు.

సభ్యులు కాఁగోరువారు కార్యదర్శుల పేరవ్రాసి పరిషన్నిబంధనలఁ దెప్పించుకొనవచ్చును

విజ్ఞానచంద్రికాగ్రంథమాల.

ఆంధ్రులపౌరుషము! ఆంధ్రులయౌన్నత్యము!! ఆంధ్రులబుద్ధివైభవము!!

ఆంధ్రులచరిత్రము

రెండవభాగము.

ఇందు క్రీ. శ. 1100 నుండి 1350 వఱకుంగల ఆంధ్రదేశచరిత్ర వర్ణింపఁబడినది.

పురాణములు, కావ్యములు, శాసనములు, విదేశీయుల వ్రాఁతలు, మొదలగువాని నన్నింటిని శోధించి తెలుఁగుచోళులు, నాగవంశోద్భవులైన కోట రాజులు, కాకతీయచక్రవర్తులు, పల్నాటివీరులు, కమ్మనాటి, ..., ... మొదలగువారి చరిత్రలు, ఈ యుద్గ్రంథమునందు క్రోడీకరింపఁబడినవి.

రామానుజుఁడు, బసవేశ్వరుఁడు, నన్నెచోడ కవిశిఖామణి, ..., కవితిక్కన, గణపతిదేవచక్రవర్తి, ప్రతాపరుద్రమహారాజు, మహారాణి రుద్రమదేవి మొదలుగువారల జీవితచరిత్రములు ప్రత్యేకముగా వ్రాయఁబడినవి.

ఆయాకాలములందలి సాంఘిక, రాజకీయస్థితులు చక్కఁగ వివరింపఁబడినవి. ప్రదేశములయొక్కయు, కట్టడములయొక్కయు, పటములు కలవు.

పౌరుషమునందును, రాజకీయాభివృద్ధియందును, బుద్ధివైభవమునందును ఆంధ్రులు హిందూదేశమునందలి యేజాతివారికిని తీసిపోవువారు కారని యీగ్రంథము సప్రమాణముగ సిద్ధాంతీకరించుచున్నది.

ఇట్టిగ్రంథము తెలుఁగులోఁగాని యింతవఱకు మఱి యేభాషలోఁగాని యెవ్వరును ప్రకటించియుండలేదు.

విఖ్యాతలేఖకులగు శ్రీయుత చిలుకూరి వీరభద్రరావు పంతులుగారిచేత నిది రచింపఁబడినది. 400 పేజీలు గలిగి మంచికాగితముమీఁదను బొమ్మలతో ముద్రింపఁబడి చక్కని క్యాలికో బైండుచేయఁబడిన యీ యమూల్య గ్రంథము మాచందాదారులకు పోస్టేజికాక రు. 1—0—0 కును, చందాదారులు కానివారలకు పోస్టేజికాక రు. 1—8—0 లకును ఇయ్యఁబడును.

☞ విజ్ఞానచంద్రికా బుక్కుడిపో యందు సంస్కృతాంధ్రగ్రంథము లన్నియు దొరకును. వలయువారికి క్యాటలాగులు పంపఁబడును.

చిరునామా :—

ఆ. లక్ష్మీపతి, బి.ఏ., ఎం.బి. సి.ఎం.

మేనేజరు, విజ్ఞానచంద్రిక,

చింతాద్రిపేట — చెన్నపురము.